SIVA PURANA
RUDRA SAMHITHA

6



KAUSIKI



శ్రీ శివ మహా పురాణము

రుద్ర సంహితము లోని

యుద్ధ ఖండము

1 - త్రిపుర వర్ణనము

2 - శివస్తుతి

3 - త్రిపురవధోపాయము

4 - త్రిపుర వాసుల దీక్షా స్వీకారము

5 - త్రిపుర మోహనము

6 - శివస్తుతి

7 - శివుడు అనుగ్రహించుట

8 - రథ నిర్మాణము

9 - శివుని యాత్ర

10 - త్రిపుర దహనము

11 - దేవస్తుతి

12 - మయస్తుతి

13 - ఇంద్రుడు ప్రాణములతో బయటపడుట

14 - జలంధరుని జన్మ, వివాహము

15 - దేవజలంధర సంగ్రామము

16 - దేవాసుర యుద్ధము

17 - విష్ణు జలంధర యుద్ధము

18- నారద జలంధర సంవాదము

19 - దూతసంవాదము

20 - రుద్రగణములతో రాక్షసుల యుద్ధము

21 - గణాధ్యక్షుల యుద్ధము

22 - శివజలంధరుల యుద్ధము

23 - పాతివ్రత్య భంగము

24 - జలంధర సంహారము

25 - దేవతలు శివుని స్తుతించుట

26 - విష్ణువు యొక్క మోహమును తొలగించుట

27 - శంఖచూడుని జననము

28 - శంఖచూడుని వివాహము

29 - శంఖచూడుని పూర్వజన్మ వృత్తాంతము

30 - దేవదేవస్తుతి



31 - బ్రహ్మ విష్ణువులకు శివుని ఉపదేశము

32 - పుష్పదంతుడు శంఖచూడునకు నచ్చజెప్పుట

33 - శంఖచూడునిపై శివుని యుద్ధసన్నాహము

34 - శంఖచూడుని యుద్ధయాత్ర

35 - శంఖచూడుని దూత శివునితో సంభాషించుట

36 - దేవాసుర సంగ్రామము

37 - స్కందశంఖచూడుల ద్వంద్వయుద్ధము

38 - భద్రకాళీ శంఖచూడుల యుద్ధము

39 - శంఖచూడుని సైన్యమును వధించుట

40 - శంఖచూడ వధ

41 - శాలగ్రామశిల విష్ణుస్వరూపము

42 - అంధకాసురుడు

43 - హిరణ్య కశిపుని నృసింహుడు వధించుట

44 - అంధకుని దూతలతో శివుని సంభాషణము

45 - దూత సంవాద వర్ణనం

46 - అంధకుడు శివునితో యుద్ధమును చేయుట

47 - శివుడు శుక్రాచార్యుని మ్రింగివేయుట

48 - శివుడు శుక్రుని మ్రింగివేయుట

49 - అంధకునకు గణాధ్యక్ష పదవి లభించుట

50 - శుక్రుడు మృతసంజీవనీ విద్యను సంపాదించుట

51 - ఉష పార్వతీ రూపమును దాల్చుట

52 - ఉషా - అనిరుద్ధుల సమాగమము

53 - ఉషా అనిరుద్ధుల వివాహము

54 - శ్రీ కృష్ణ బాణాసురుల యుద్ధము

55 - బాణుని గర్వభంగము

56 - బాణాసురుడు గణత్వమును పొందుట

57 - గజాసుర సంహారము

58 - దుందుభి నిర్హ్రాదుని సంహారము

59 - విదలోత్పలదైత్యవధ

శ్రీ గణేశాయ నమః

శ్రీ గౌరీశంకరాభ్యాం నమః

రుద్ర సంహితా - యుద్ధ ఖండః

1 – త్రిపుర వర్ణనము

నారద ఉవాచ ।

శ్రుతమస్మాభిరానందప్రదం చరితముత్తమమ్ ।
గృహస్థస్యైవ శంభోశ్చ గణస్కందాదిసత్కథమ్ ॥
ఇదానీం బ్రూహి సుప్రీత్యా చరితం పరముత్తమమ్ ।
శంకరో హి యథా రుద్రో జఘాన విహరన్ ఖలాన్ ॥
కథ దదాహ భగవాన్నగరాణి సురద్విషామ్ ।
త్రీణ్యేకేన చ బాణేన యుగపత్కేన వీర్యవాన్ ॥
ఏతత్సర్వం సమాచక్ష్వ చతః శశిమౌలినః ।
దేవర్షి సుఖదం శశ్వన్మాయయా విహరతః ప్రభోః ॥

నారదుడిట్లు పలికెను -

గృహస్థుడగు శంభుని ఆనందదాయకమగు ఉత్తమ చరితమును, గణేశ కుమారస్వా◌ాముల పవిత్రగాథను మేము వింటిమి. శంకరుడు రుద్రరూపుడై శత్రువులను సంహరిస్తూ విహరించిన ఉత్తమ చరిత్రను ఇప్పుడు పరమ ప్రీతితో వర్ణించి చెప్పెను. పరాక్రమ వంతుడగు శివభగవానుడు దేవద్రోహులగు అసురుల మూడు నగరమును ఒకే బాణముతో ఏకకాలము నందు ఎట్లు దహించెను? చంద్రుని శిరముపై ధరించు వాడు, సర్వదా మాయారూపిణి యగు పార్వతితో కలిసి విహరించు వాడు అగు శివప్రభుని చరితమునంతను చెప్పుము. ఈ చరితము దేవతలకు, ఋషులకు సుఖమును కలిగించును.

బ్రహ్మోవాచ ।

ఏవమేతత్పురా పృష్టో వ్యాసేన ఋషిసత్తమః ।
సనత్కుమారః ప్రోవాచ తదేవ కథయామ్యహమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పూర్వము వ్యాసుడు ఋషి శ్రేష్ఠుడగు సనత్కుమారుని ఇదే విధముగా ప్రశ్నించగా, ఆయన చెప్పిన వృత్తాంతమునే నేను చెప్పెదను.

సనత్కుమార ఉవాచ -

శృణు వ్యాస మహాప్రాజ్ఞ చరితం శశిమౌలినః ।
యథా దదాహ త్రిపురం బాణేనైకేన విశ్వసృట్ ॥
శివాత్మజేన స్కందేన నిహతే తారకాసురే ।
తత్పు త్రాస్తు త్రయో దైత్యాః పర్యతప్యన్మునీశ్వర ॥
తారకాక్షస్తు తజ్జ్యేష్ఠో విద్యున్మాలీ చ మధ్యమః ।
కమలాక్షః కనీయంశ్చ సర్వే తుల్య బలాస్సదా॥
జితేంద్రియాస్సుసన్నద్ధాస్సంయతాస్సత్య వాదినః ।
దృఢచిత్తా మహావీరా దేవ ద్రోహిణ ఏవ చ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

వ్యాసా! మహాప్రాజ్ఞా! చంద్రశేఖరుని చరిత్రను వినుము. జగత్తును లయము చేయు ఆ ప్రభువు ఒకే బాణముతో త్రిపురములను దహించిన తెరంగును వినుము. ఓ మహర్షీ! శివపుత్రుడగు స్కందుడు తారకాసురుని సంహరించగా అతని పుత్రులగు ముగ్గురు రాక్షసులు మిక్కిలి దుఃఖించిరి. పెద్దవాని పేరు తారకాక్షుడు. రెండవవాడు విద్యున్మాలి. మూడవవాడు కమాలాక్షుడు. ముగ్గురు సమానమగు బలము గలవారే. దేవద్రోహులగు ఆ రాక్షసులు జితేంద్రియులు, మనస్సును నియంత్రించినవారు, సత్య వాక్య పరాయణులు, దృఢసంకల్పము గలవారు మరియు మహవీరులు.

తే తు మేరుగుహాం గత్వా తపశ్చ క్రుర్మహాద్భుతమ్ ।
త్రయస్సర్వాన్ సుభోగాంశ్చ విహాయ సుమనోహరాన్ ॥
వసంతే సర్వకామాంశ్చ గీతవాదిత్రనిస్స్వనమ్ ।
విహాయ సోత్సవం తేపుస్త్ర యస్తే తారకాత్మజః ॥
గ్రీష్మే సూర్య ప్రభాం జిత్వా దిక్షు ప్రజ్వాల్య పావకమ్ ।
తన్మధ్య సంస్థాస్సిద్ధ్యర్థం జుహువుర్హవ్య మాదరాత్ ॥
మహా ప్రతాపపతితా స్సర్వేప్యాసన్ సుమూర్ఛితాః ।
వర్షాసు గతసంత్రాసా వృష్టిం మూర్ధ న్యధారయన్ ॥

వారు ముగ్గురు మిక్కిలి మనోహరములగు, గొప్ప భోగములనన్నిటినీ పరిత్యజించి మేరు పర్వతగుహకు పోయి గొప్ప అద్భుతమగు తపస్సును చేసిరి. తారకుని పుత్రులగు ఆ ముగ్గురు రాక్షసులు వసంతకాలము నందు అన్ని కోర్కెలను, సంగీతాది భోగములను, ఉత్సవములను విడిచి పెట్టి తపస్సును చేసిరి. గ్రీష్మర్తువు నందు సూర్యకాంతిని సహిస్తూ నాల్గు దిక్కుల యందు అగ్నిని ప్రజ్వరిల్ల జేసి తపస్సిద్ధి కొరకై వాటి మధ్యలో నున్నవారై శ్రద్ధతో హవ్యమును హోమము చేసిరి. వారందరు అతిశయించిన ఆ తాపమునకు తాళజాలక మూర్ఛితులైరి. వర్షకాలము నందు అనారోగ్య భయమును ప్రక్కన బెట్టి వర్షములో నిలబడి తడుస్తూ తపస్సును జేసిరి.

శరత్కాలే ప్రసూత తు భోజనం బుభుక్షితాః ।
రమ్యం స్నిగ్ధం స్థిరం హృద్యం ఫలం మూలమనుత్తమమ్ ॥
సంయమాత్ క్షుత్తృషో జిత్వా షానాన్యుచ్చా వచాన్యపి ।
బుభుక్షితేభ్యో దత్వా తు బభూవురుపలా ఇవ ॥
సంస్థితాస్తే మహాత్మానో నిరాధారా శ్చతుర్దిశమ్ ।
హేమంతే గిరిమా శ్రిత్య ధైర్యేణ పరమేణ తు ॥
తుషార దేహసంఛన్నా జలక్లిన్నేన వాససా ।
అసాద్య దేహం క్షౌమేణ శిశిరే తోయమధ్యగాః ॥

వారు ఆకలి వేసినప్పుడు శరత్కాలములో పండే రమ్యమైన మృదుమధురమైన ఫలములలను, శ్రేష్ఠమగు మూలములను భక్షించెడి వారు. మనో నియంత్రణచే ఆకలి దప్పికలను జయించి మిక్కిలి విలువైన పానీయములను కూడా ఆకలి గొన్నవారికి సమర్పించి మహాత్ములగు వారు హేమంత ఋతువులో గొప్ప ధైర్యముతో పర్వత శిఖరముపైకి వెళ్లి నాల్గుదిక్కుల యందు ఎట్టి రక్షణయూ లేనివారై శిలలవలె నిలబడి తపస్సును చేసిరి. శిశిర ఋతువులో మంచుతో కప్పబడిన దేహము గలవారై నీటి మధ్యలో నిలబడి నీటితో తడిసిన పట్టు వస్త్రమును భుజముపై కప్పుకొని తపస్సు చేసిరి.

అనిర్విణ్ణా స్తతస్సర్వే క్రమశోఽ వర్ధయంస్తపః ।
తేపుస్త్రయస్తే తత్పుత్రా విధిముద్దిశ్య సత్తమాః ॥
తప ఉగ్రం సమాస్థాయ నియమే పరమే స్థితాః ।
తపసా కర్షయా మాసుర్దేహాన్ స్వాన్ దానవోత్తమాః ॥
వర్షాణాం శతకం చైవ షదమేకం నిధాయ చ ।
భూమౌ స్థిత్వా పరం తత్ర తేపుస్తే బలవత్తరాః ॥
తే సహస్రం తు వర్షాణాం వాత భక్షాస్సుదారుణాః ।
తపస్తేపుర్దురాత్మానః పరం తాపముపాగతాః ॥

సత్పురుషులగు ఆ తారకపుత్రులు ముగ్గురు నిరుత్సాహమును చెందకుండగా బ్రహ్మనుద్దేశించి క్రమముగా తీవ్రతలో వర్ధిల్లుచున్న తపస్సును చేసిరి. ఆ దానవశ్రేష్ఠులు గొప్ప నియమమును పాటిస్తూ ఉగ్రమగు తపస్సును అనుష్ఠిస్తూ తమ దేహములను తపస్సుచే కృశింపజేసిరి. గొప్ప బలవంతులగు వారు భూమిపై ఒంటికాలితో నిలబడి వంద సంవత్సరములు తీవ్రమగు తపస్సును చేసిరి. మిక్కిలి క్రూరులు, దురాత్ములునగు ఆ రాక్షసులు గాలిని భక్షించి వేయి సంవత్సరములు తపస్సును చేసి, గొప్ప తాపమును పొందిరి.

వర్షాణాం తు సహస్రం వై మస్తకేనాస్థితా స్తథా ।
వర్షాణాం తు శతేనైవ ఊర్ధ్వ బాహవ ఆసితాః ॥
ఏవం దుఃఖం పరం ప్రాప్తా దురా గ్రహపరా ఇమే ।
ఈదృక్షే సంస్థితా దైత్యా దివారాత్ర మతంద్రితాః ॥
ఏవం తేషాం గతః కాలో మహాన్ సుతపతాం మునే ।
బ్రహ్మాత్మనాం తారకాణాం ధర్మేణేతి మతిర్మమ ॥
ప్రాదురాసీత్తతో బ్రహ్మా సురాసురగు రుర్మహాన్ ।
సంతుష్ట స్తపసా తేషాం వరం దాతుం మహాయశాః ॥

వారు వేయి సవత్సరములు శిరస్సుపై నిలబడి, వందసంవత్సరములు చేతులు పైకి ఎత్తియు తపస్సును చేసిరి. చెడు పట్టుదల గల ఆ రాక్షసులు ఇట్లు పరమ దుఃఖముననుభవిస్తూ రాత్రింబగళ్లు నిద్రలేని వారై తపస్సును చేసిరి. ఓ మహర్షీ! ఇట్లు వారు గొప్ప తపస్సును చేయుచుండగా చాలకాలము గడచినది. బ్రహ్మపై లగ్నమైన మనస్సు గల ఆ తారకపుత్రులు ధర్మముతో జీవిస్తూ తపస్సును చేసిరని నా అభిప్రాయము. అప్పుడు దేవతకు మరియు రాక్షసులకు గురువు, గొప్ప కీర్తి గలవాడు, మహాత్ముడు అగు బ్రహ్మ వారి తపస్సుచే సంతసించి వరము నిచ్చుటకు ప్రత్యక్షమాయెను.

ముని దేవాసురైస్సార్ధం సాంత్వపూర్వమిదం వచః ।
తతస్తా నబ్రవీత్సర్వాన్ సర్వ భూతపితామహః ॥

సర్వప్రాణులకు పితామహుడు బ్రహ్మ మునులలో, దేవతలతో మరియు రాక్షసులతో గూడి అపుడు వారితో అనునయ పూర్వకముగా నిట్లనెను.

బ్రహ్మోవాచ ।

ప్రసన్నోఽస్మి మహాదైత్యా యుష్మాకం తపసామునా ।
సర్వం దాస్యామి యుష్మభ్యం పరం బ్రూత యదీప్సితమ్ ॥
కిమర్థం సుతపస్తప్తం కథయధ్వం సురద్విషా ।
సర్వేషాం తపసో ధాతా సర్వకర్తాస్మి సర్వదా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ గొప్ప రాక్షసులారా! మీ ఈ తపస్సుచే ప్రసన్నుడనైతిని. మీకు సర్వ◌ముును ఇచ్చెదను. మీకేది కావలయునో దానిని వరమడుగుడు. ఓ దేవ శత్రువులారా! మీరింత గొప్ప తపస్సును దేనికొరకు చేసితిరో చెప్పుడు. సర్వమును సృష్టించు నేనే అన్ని కాలములయందు సర్వుల తపస్సునకు ఫలము నిచ్చెదను.

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా శనైస్తే స్వాత్మనో గతమ్ ।
ఊచుః ప్రాంజలయ స్సర్వే ప్రణి పత్య పితామహమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను

ఆయన మాటలను విని వారు ముగ్గురు ఆ పితామహునకు ప్రణమిల్లి చేతులు జోడించి మెల్లగా తమ మనస్సులోని మాటను వెల్లడించిరి.

దైత్యా ఊచుః ।

యది ప్రసన్నో దేశ యది దేయో పరస్త్వయా ।
అపధ్యత్వ చ సర్వేషాం సర్వభూతేషు దేహి నః ॥
స్థిరాన్ కురు జగన్నాథ పాంతు నః పరిపంథినః ।
జరారోగా దయస్సర్వే నాస్మాన్మృత్యురగాత్ క్వచిత్ ॥
అజరాశ్చామరాస్సర్వే భవామ ఇతి నో మతమ్ ।
సమ్మృత్యువః కరిష్యామ స్సర్వానన్యాం స్త్రిలోకకే ॥
లక్ష్మ్యా కిం తద్విపులయా కిం కార్యం హి పురోత్తమైః ।
అన్యైశ్చ విపులైర్భోగై స్స్థానైశ్వర్యేణ వా పునః ॥

ఆ రాక్షసులిట్లు పలికిరి –

ఓ దేవ దేవా! నీవు ప్రసన్నుడవై వరము నియదలచినచో, మేము ఏ ప్రా◌ాణిచేతనైననూ మరణము పొందకుండునట్లు మాకు వరము నిమ్ము. ఓ జగత్ప్రభూ! మమ్ములను శాశ్వతముగా నుండునట్లు చేయుము. ముసలితనము, రోగము మొదలగు ఆటంకములు మమ్ములను దరి చేరకుండు గాక! మమ్ములను ఏ కాలము నందైననూ మృత్యువు సమీపించరాదు. మేము ముగ్గురము జరామరణములు లేని వారము కావలెను. ఇది మా కోరిక. ముల్లోకములలో ఇతరులనందరినీ మృత్యువును పొందునట్లు మేము చేసెదము. విశాలమగు సంపదతో గాని, గొప్ప నగరములతో గాని, ఇతరములగు మహాభోగములతో గాని, స్థిరమగు ఐశ్వర్యముతో గాని ప్రయోజనమేమి గలదు?

యత్రైవ మృత్యునా గ్రస్తో నియతం పంచభిర్దినైః ।
వ్యర్థం తస్యాఖిలం బ్రహ్మన్ నిశ్చితం స ఇతీవ హి ॥

ఓ బ్రహ్మా! అయిదు దినములలో నిశ్చితముగా మృత్యువుచే కబళింపబడువానికి ఈ సర్వము వ్యర్థమే గదా! మా ని శ్చయమిట్లున్నది.

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తేషాం దైత్యానాం చ తపస్వినామ్ ।
ప్రత్యువాచ శివం స్మృత్వా స్వప్రభుం గిరిశం విధిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

తపశ్శాలురగు ఆ రాక్షసుల ఈ మాటలను విని బ్రహ్మ తన ప్రభువు మరియు కైలాసవాసియగు శివుని స్మరించి ఇట్లు పలికెను.

బ్రహ్మోవాచ ।

నాస్తి సర్వామరత్వం చ నివర్తధ్వమతోఽసురాః ।
అన్యం వరం వృణీధ్వం వై యాదృశో వో హి రోచతే ॥
జాతో జనిష్యతే నూనం జంతుః కోప్యసురాః క్వచిత్ ।
అజరశ్చామరో లోకే న భవిష్యత్ భూతలే ॥
ఋతే తు ఖండపరశో కాలకాలద్ధరే స్తథా।
తౌ ధర్మా ధర్మ పరమా పవ్యక్తౌ వ్యక్తరూపిణౌ ॥
సంపీడనాయ జగతో యది స క్రియతే తపః ।
సఫలం తద్గతం వేద్యం తస్మాత్సు విహితం తపః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ రాక్షసులారా! సర్వథా మరణము లేకపోవుట సంభవము కాదు. కావున ఈ కోరిక నుండి విరమించుకొనుడు. మీకు నచ్చిన మరియొక వరమును కోరుకునుడు. ఓ రాక్షసులారా! భూలోకములో ఎక్కడనైననూ ఇంతకు ముందు పుట్టిన ప్రాణులు గాని, పుట్టబోవు ప్రాణులు గాని ఎవ్వరైనను జరామరణములు లేనివారు లేరు, ఉండబోరు. ఇది నిశ్చయము. కాలునకు కాలుడగు శివుడు, మరియు విష్ణువు తక్క ఇతరులకు మరణము తప్పదు. వారు ధర్మాధర్మములకు అతీతులు, నిర్గుణులు, సగుణ రూపమును స్వీకరించినవారు. జగత్తును పీడించుట కొరకు తపస్సును చేసినచో, దాని ఫలము చేయి జారి పోవునని ఎరింగి, తపస్సును యోగ్యమగు ఫలము కొరకు చేయదగును.

తద్విచార్య స్వయం బుద్ధ్యా శక్యం యత్సురాసురైః ।
దుర్లభం వా సుదుస్సాధ్యం మృత్యుం వంచయ తానఘాః ॥
తత్కించిన్మరణే హేతుం వృణీధ్వం సత్త్వమాశ్రితాః ।
యేన మృత్యుర్నైవ వృతో రక్షతస్తత్ పృథక్ పృథక్ ॥

ఓ పుణ్యాత్ములారా! మీరు మీ బుద్ధితో స్వయముగా విచారించుడు. దేవతలకు గాని, రాక్షసులకు గాని పొంద శక్యము గాని దుర్లభముగు వరమును గోరి మృత్యువును ప్రక్కన బెట్టుడు. కావున బుద్ధిని ఉపయోగించి ఏయే కారణముల వలన మరణము సంభవమో, వాటన్నింటి నుండి వేర్వేరుగా రక్షణ కల్గునట్లు వరమును కోరి ఆ మృత్యు హేతువుల నుండి రక్షణను పొందుడు.

సనత్కుమార ఉవాచ।

ఏతద్విధివచశ్శ్రుత్వా ముహూర్తం ధ్యానమాస్థితాః ।
ప్రోచుస్తే చింతయిత్వాథ సర్వలో కపితామహమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

వారు బ్రహ్మ గారి ఈ మాటలను విని, ముహూర్తకాలము ధ్యానమునందు నిమగ్నులై, తరువాత మరల ఆలోచించి, సర్వలోకములకు పితామహుడగు బ్రహ్మతో నిట్లనిరి.

దైత్యా ఊచుః ।

భగవన్నాస్తి నో వేశ్మ పరాక్రమవతామపి ।
అధృష్యా శ్శత్రవానాం తు యత్ర వత్స్యా మహే సుఖమ్ ॥
పురాణి త్రీణి నో దేహి నిర్మాఅత్యద్భుతాని హి ।
సర్వసంపత్సమృద్ధాన్య ప్రధృష్యాణి దివౌకసామ్ ॥
వయం పురాణి త్రీణ్యేవం సమాస్థాయ మహీమిమామ్ ।
చరిష్యామో హి లోకేశ త్వత్ప్రసాదాజ్జగద్గురో ॥
తారకాక్షస్తతః ప్రాహ యదభేద్యం సురైరపి ।
కరోతు విశ్వకర్మా తన్మమ హేమమయం పురమ్ ॥

రాక్షసులిట్లనిరి –

హే భగవాన్! మేము పరాక్రము వంతులమే అయిననూ, మాకు సుఖముగా నివసించదగిన, శత్రువులు ముట్టడించ శక్యము కాని గృహము లేదు. మిక్కిలి అద్భుతమైనవి, సర్వసంపదలతో సంపన్నమైనవి, దేవతలకు జయింపశక్యము కానివి అగు మూడు నగరములను నిర్మించి మాకు ఇమ్ము. ఓ లోకనాథా! జగద్గురూ! మేము ఆ నగరములను అధిష్ఠించి నీ అనుగ్రహముచే ఈ భూమినంతనూ పరిభ్రమించెదము. అప్పుడు తారకాక్షుడిట్లనెను: విశ్వకర్మ దేవతలకైననూ భేదింపశక్యము కాని బంగారు వికారమైన నగరమును నాకు నిర్మించి ఇచ్చుగాక!

యయాచే కమలాక్షస్తు రాజతం సుమహత్పురమ్ ।
విద్యున్మాలీ చ సంహృష్టో వజ్రాయసనయం మహత్ ॥
పురేష్వేతేషు భో బ్రహ్మన్ ఏకస్థానస్థితేషు చ ।
మధ్యాహ్నే అభిజితేకాలే శీతాంశౌ పుష్యసంస్థితే ॥
ఉపర్యుపర్యదృష్టేషు వ్యోమ్ని నీలాభ్రసంస్థితే ।
వర్షత్సు కాలమేఘేషు పుష్కరావర్తనామసు ॥
తథా వర్ష సహస్రాంతే సమేష్యామః పరస్పరమ్ ।
ఏకీభావం గమిష్యంతి పురాణ్యేతాని నాన్యథా ॥

కమలాక్షుడు వెండితో నిర్మింపబడే పెద్ద నగరమును, ఆనందముతో నిండియున్న విద్యున్మాలి వజ్రము వలె కఠినమైన ఇనుముతో చేసిన పెద్ద నగరమును కోరిరి. ఓ బ్రహ్మా! మధ్యాహ్నకాలములో చంద్రుడు పుష్యానక్షత్ర యుక్తుడై అభిజిల్లగ్నము నందు ఉన్న సమయములో ఈ మూడు నగరములు ఒకే స్థానమునందుండవలెను. ఈ నగరములు ఆకాశములో నల్లని మేఘముల నడుమ ఒక దానిపై మరియొకటి ఉండి కంటికి కానరాకుడదు. మరియు వేయి సంవత్సరముల తరువాత పుష్కరావర్తమను పేరు గల ప్రలయకాల మేఘములు వర్షించు చుండగా ఈ మూడు పురములు కలిసి ఒకటి కాగా మేము అన్యోన్యము కలిసి ఉండెదము. దీనికి భిన్నమైన వరముతో మాకు పనిలేదు.

సర్వదేవమయో దేవస్సర్వేషాం మే కుహేలయా ।
అసంభవే రథే తిష్ఠన్ సర్వోపస్కరణాన్వితే ॥
అసంభావ్యైక కాండేన భినత్తు నగరాణి నః ।
నిర్వైరః కృత్తివాసాస్తు యోఽస్మాకమితి నిత్యశః ॥
వంద్యః పూజ్యోఽభి వాద్యశ్చ సోస్మాకం నిర్దహేత్కథమ్ ।
ఇతి చేతసి సంధ్యాయ తాదృశో భువి దుర్లభః ॥

సర్వ దేవతా స్వరూపుడు, సర్వులకు దైవము అగు శివుడు విలాసముగా సర్వ◌ుసామగ్రితో కూడి యున్న ఒకానొక ఊహకు అందని రథములో నున్నవాడై అచింత్యమగు ఒకే ఒక బాణముతో మా నగరములను భేదించు గాక! చర్మాంబరధారి యగు శివునితో మాకే నాడూ వైరము లేదు. ఆయన మాకు వందనీయుడు పూజ్యుడు. మా నగరములను ఆయన ఏల దహించును? అని వారు మనస్సులో తలపోసి భూలోకమునందు దుర్లభమగు అట్టి వరమును కోరిరి.

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం బ్రహ్మా లోకపితామహః ।
ఏవమస్త్వితి తాన్ ప్రాహ సృష్టి కర్తా స్మరన్ శివమ్ ॥
ఆజ్ఞాం దదౌ మయస్యాపి కురుత్వం నగరత్రయమ్ ।
కాంచనం రాజతం చైవ ఆయసం చేతి భో మయ ॥
ఇత్యాదిశ్య మయం బ్రహ్మా ప్రత్యక్షం ప్రావిశద్దివమ్ ।
తేషాం తారకపుత్రాణాం పశ్యతాం నిజధామ హి ॥

సనత్కుమారుడిట్లనెను –

లోకములకు పితామహుండు, సృష్టికర్తయగు బ్రహ్మ వారి ఈ మాటలను విని శివుని స్మరి◌ుస్తూ వారితో 'అటులనే అగుగాక!' అని పలికెను. ఓ మయా! నీవు బంగారము, వెండి, ఇనుములతో ఎక్కడనైననూ మూడు నగరములను నిర్మించుము అని ఆయన మయునకు ఆజ్ఞనిచ్చెను. బ్రహ్మ మయుని ఇట్లు ఆజ్ఞాపించి, ఆ తారకపుత్రులు ప్రత్యక్షముగా చూచుచుండగనే తన ధామము అగు సత్యలోకమును ప్రవేశించెను.

తతో మయశ్చ తపసా చక్రే ధీరః పురాణ్యథ ।
కాంచనం తారకాక్షస్య కమలాక్షస రాజతమ్ ॥
విద్యున్మాల్యాయసం చైవ త్రి విధం దుర్గముత్తమమ్ ।
స్వర్గే వ్యోమ్ని చ భూమౌ చ క్రమాత్ జ్ఞేయాని తాని వై ॥
దత్త్వా తేభ్యోఽసురేభ్యశ్చ పురాణి త్రీణి వై మయః ।
ప్రవివేశ స్వయం తత్ర హితకామ పరాయణః ॥
ఏవం పురత్రయం ప్రాప్య ప్రవిష్టాస్తారకాత్మజాః ।
బుభుజుస్సకలాన్ భోగాన్ మహాబల పరాక్రమః ॥

అపుడు ధీరుడగు మయుడు తపః ప్రభావముచే తారకాక్షునకు బంగారముతో, కమలాక్షునకు వెండితో, విద్యున్మాలికి ఇనుముతో మూడు రకముల ఉత్తమ దుర్గములను నిర్మించెను. అవి క్రమముగా స్వర్గమునందు, ఆకాశమునందు, మధ్య భూమిపై ఉండెడివి. మయుడు వారి హితమునందు లగ్నమైన మనస్సు గలవాడై ఆ రాక్షసులకు మూడు నగరములను ఇచ్చి వాటియందు తాను స్వయముగా ప్రవేశించెను. మహా బలపరాక్రమవంతులగు తారకుని పుత్రులు ఈ మూడు నగరములను పొంది వాటి యందు ప్రవేశించి సమస్త భోగముల ననుభవించిరి.

కల్పద్రుమైశ్చ సంకీర్ణం గజవాజి సమాకులమ్ ।
నానా ప్రాసాదసంకీర్ణం మణిజాల సమావృతమ్ ॥
సూర్యమండలసంకాశైర్విమానైస్సర్వతో ముఖైః ।
పద్మరాగమయైశ్చైవ శోభితం చంద్రసన్నిభైః ॥
ప్రాసాదైర్గోపురైర్దివ్యైః కైలాస శిఖరోపమైః ।
దివ్యస్త్రీ జనసంకీర్ణై ర్గంధర్వైస్సిద్ధ చారణైః ॥
రుద్రాలయైః ప్రతి గృహ మగ్ని హోత్రైః ప్రతిష్ఠితైః ।
ద్విజోత్తమై శ్శాస్త్ర విజ్ఞై శ్శివ భక్తిరతైస్సదా ॥

ఆ నగరముల యందు కల్పవృక్షములు దట్టము నుండెను. ఏనుగులతో, గుర్రములలో అవి హడావుడిగా నుండెను. అనేక ప్రాసదములతో నిండి యుండెను. మణితోరణములతో అలంకరింపబడెను. సూర్యకాంతులను విరజిల్లే ప్రాసాదములు అన్ని వైపులా సింహద్వారములను కలిగి యుండెను. పద్మరాగమణులు పొదిగి చంద్రుని వలె తెల్లనైన కాంతులు గల ప్రాసాదములతో, కైలాసశిఖరమును బోలిన దివ్యమగు గోపురములతో ఆ నగరములు ప్రకాశించెను. వాటియందు దేవతా స్త్రీలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు కోలాహలముగా నుండిరి. ప్రతి గృహమునందు రుద్రాలయము, అగ్ని హోత్రము ప్రతిష్ఠింపబడి యుండెను. శివభక్తి నిష్ఠులు, శాస్త్రపండితులు అగు బ్రాహ్మణశ్రేష్ఠులు ఆ నగరములలో నుండిరి.

వాపీ కూపతడా గైశ్చ దీర్ఘికాభిస్సుశోభితమ్ ।
ఉద్యానవనవృక్షైశ్చ స్వర్గచ్యుత గుణోత్తమైః ॥
నదీనద సరిన్ముఖ్య పుష్కరై శ్శోభితం సదా ।
సర్వకామ ఫలాఢ్యైశ్చానే కైర్వృక్షైర్మనోహరమ్ ॥
మత్త మాతంగయూథైశ్చ తురంగైశ్చ సుశోభనైః ।
రథైశ్చ వివిధాకారై శ్శిబికాభిరలం కృతమ్ ॥
సమయాది శికైశ్చైవ క్రీడాస్థానైః పృథక్ పృథక్ ।
వేదాధ్యయనశాలాభిర్వి విధాభిః పృథక్ పృథక్ ॥

ఆ మూడు నగరములు బావులతో, దిగుడు బావులతో, చెరువులతో ప్రకాశించినవి. వాటిలోని ఉద్యానవనములు ఉత్తమ గుణములు కలిగి స్వర్గమునుండి జారినవా యన్నట్లు ఉన్న వృక్షములతో కూడియుండెను (65). ఆ నగరములు నదులతో, నదములతో మరియు విశాలమగు సరస్సులతో ప్రకాశించెను. అన్ని రకముల ఫలములతో నిండిన అనేక వృక్షములతో అవి సుందరముగా నుండెను (66). మదించిన ఏనుగుల గుంపులతో, అందమగు గుర్రములతో, వివిధ ఆకారములు గల రథములతో మరియు పల్లకీలతో ఆ నగరము భాసిల్లెను (67). ఆ మూడు నగరములు వేర్వేరు స్థలములలో నిర్మించబడిన సమయమును నిర్దేశించే యంత్రములతో, క్రీడాంగణములతో, మరియు వేదాధ్యయన పాఠశాలలతో ప్రకాశించినవి (68).

అదృష్టం మనసా వాచా పాపాన్వితనరైస్సదా ।
మహాత్మభిశ్శుభాచారైః పుణ్యవద్భిః ప్రవీక్ష్యతే ॥
పతివ్రతా భిస్సర్వత్ర పావితం స్థలముత్తమమ్ ।
పతిసేవన శీలాభిర్విముఖాభిః కుధర్మతః ॥
దైత్య శూరైర్మహాభాగైస్సదారై స్ససుతైర్ద్విజైః ।
శ్రౌత స్మార్తార్థతత్త్వ జ్ఞై స్స్వధర్మ నిరతైర్యుతమ్ ॥
వ్యూఢోరస్కై ర్వృషస్కంధైస్సామ యుద్ధ ధరైస్సదా ।
ప్రశాంతైః కుపితైశ్చైవ కుబ్జై ర్వామనకై స్తథా ॥

వాక్కులతో వర్ణింప శక్యము కానివి, మనస్సుతో ఊహింప శక్యము గానివి అగు ఆ నగరములు పాపాత్ములకెన్నడూ కానరావు. శుభమగు ప్రవర్తన కల్గి పుణ్యవంతులగు మహాత్ములు మాత్రమే వాటిని చూడగల్గుదురు (69). పతిని సేవించు స్వభావము గలవారు, అధర్మమునందు రుచిలేని వారు అగు పతివ్రతాస్త్రీలు ఆ నగర ప్రదేశములను పావనము చేయుచుండిరి (70). మహాత్ములు, వీరులు అగు రాక్షసులు, మరియు శ్రౌతస్మార్తముల తత్త్వము నెరింగి స్వధర్మనిష్ఠులగు బ్రాహ్మణులు తమ భార్యాబిడ్డలతో ఆ నగరముల యందు నివసించిరి (71). విశాలమగు వక్షస్థలము గలవారు, బలిసిన భుజములు గలవారు, సంధికి యుద్ధమునకు కూడ సదా సంసిద్ధులై యుండు వారు, ప్రసన్నమైన వారు, కోపస్వభావము గలవారు, గూనివారు, పొట్టివారు కూడ ఆ నగరములలో నుండిరి (72).

నీలోత్పలదల ప్రఖ్యై ర్నీల కుంచితమూర్ధ జైః ।
మయేన రక్షితై స్సర్వై శ్శిక్షితైర్యుద్ధలాలసైః ॥
వరసమర రతైర్యుతం సమంతాత్ అజశివపూజనయా విశుద్ధ వీర్యైః ।
రవి మరుత మహేంద్ర సన్నికాశైః సురమథనై స్సుదృఢైస్సు సేవితం యత్ ॥
శాస్త్ర వేద పురాణేషు యే యే ధర్మాః ప్రకీర్తితాః ।
శివప్రియాస్సదా దేవాస్తే ధర్మాస్తత్ర సర్వతః ॥

మయునిచే రక్షింపబడి శిక్షణ నీయబడి యుద్ధమునకు తహతహలాడు వారు, నల్లకలువలవలె నల్లగా ప్రకాశించే ఉంగరములు తిరిగిన జుట్టు గలవారు నగు రాక్షసులు ఆ నగరములలో నివసించిరి (73). గొప్ప యుద్ధముల యందభిరుచి గలవారు, అజుడగు శివుని పూజించుటచే పరిశుద్ధమైన పరాక్రమము గలవారు, సూర్యుడు, వాయువు మరియు మహేంద్రునితో సమానమైన వారు, దేవతలను మర్దించే దృఢకాయులు అగు దైత్యులు ఆ నగరములలో అంతటా నివసించి యుండిరి (74).వేదశాస్త్ర పూరాణములలో ఏయే ధర్మములు కీర్తింపబడినవో, శివునకు ప్రియమగు అట్టి ధర్మములు అచట సర్వత్రా సర్వకాలములలో విలసిల్లినవి (75).

ఏవం లబ్ధవరాస్తే తు దైతేయాస్తారకాత్మజాః ।
శైవం మయముపాశ్రిత్య నివసంతి స్మ తత్ర హ ॥
సర్వం త్రైలోక్యముత్సార్య ప్ర విశ్య నగరాణి తే ।
కుర్వంతి స్మ మహద్రాజ్యం శివమార్గరతాస్సదా ॥
తతో మహాన్ గతః కాలో వసతాం పుణ్యకర్మణామ్ ।
యథా సుఖం యథా జోషం సద్రాజ్యం కుర్వతాం మునే ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే త్రిపుర వర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥

తారకుని పుత్రులగు ఆ రాక్షసులు ఇట్టి నగరములను వరముగా పొంది శివభక్తుడగు మయుని సేవిస్తూ ఆ నగరములలో నివసించిరి (76). వారు సర్వదా శివభక్తి పరాయణులైననూ ముల్లోకములను పీడించి ఆ నగరములను ప్రవేశించి గొప్పగా రాజ్యమును పాలించిరి (77). ఓ మహర్షీ! పుణ్యాత్ములగు ఆ రాక్షసులు చక్కగా రాజ్యమును పాలిస్తూ సుఖముగా ప్రీతితో ఆ నగరములలో నివసించు చుండగా చాల కాలము గడిచెను (78).

శ్రీ శివమహాపురాణములో రుద్ర సంహితయందు యుద్ధ ఖండలో త్రిపురవర్ణనమనే మొదటి అధ్యాయము ముగిసినది (1).

2 - శివస్తుతి

వ్యాస ఉవాచ ।

బ్రహ్మన్ మహాప్రాజ్ఞ వద మే వదతాం వర ।
తతః కిమభవద్దేవాః కథం చ సుఖినోఽభవన్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మ వేత్తా! నీవు మహాప్రాజ్ఞుడవు, వక్తలలో శ్రేష్ఠుడవు. తరువాత ఏమి ఆయెను? దేవతలు ఎట్లు సుఖమును పొందగల్గిరి? నాకు చెప్పుడు (1).

బ్రహ్మోవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామిత ధీమతః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

గొప్ప ధీశాలియగు వ్యాసుని ఈ మాటను విని సనత్కుమారుడు శివుని పాదపద్మములను స్మరించి ఇట్లు పలికెను (2).

సనత్కుమార ఉవాచ ।

అథ తత్ప్రభయా దగ్ధా దేవా హీంద్రా దయస్తథా ।
సంమంత్ర్య దుఃఖితాస్సర్వే బ్రహ్మాణం శరణం యయుః ॥
నత్వా పితామహం ప్రీత్యా పరిక్షిప్యా ఖిలాస్సురాః ।
దుఃఖం విజ్ఞాపయా మాసుర్విలోక్యావసరం తతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

తరువాత వారి తేజస్సు ముందు వెలవెల బోయిన ఇంద్రాది దేవతలు అందరు ఒకరితో నొకరు చర్చించుకొని, దుఃఖముతో బ్రహ్మను శరణు పొందిరి (3). అపుడు ఆ దేవతలందరు దుఃఖమును త్రోసిపుచ్చి పితామహునకు ప్రీతితో ప్రణమిల్లి సరియగు సమయములో ఇట్లు విన్నవించు కొనిరి (4).

దేవా ఊచుః ।

ధాతస్త్రి పురనాథేన స తారకసుతేన హి ।
సర్వే ప్రతాపితా నూనం మయేన త్రిదివౌకసః ॥
అతస్తే శరణం యాతా దుఃఖితా హి విధే వయమ్ ।
కురు త్వం తద్వధోపాయం సుఖిన స్స్యామ తద్యథా ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ బ్రహ్మా! మయుడు తారకుని పుత్రులతో గూడి మూడు పురములకు నాథుడై దేవతలనందరిని నిశ్చయముగా దుఃఖపెట్టు చున్నాడు (5). ఓ బ్రహ్మా! ఈ కారణంగా దుఃఖితులమైన మేము నిన్ను శరణు జొచ్చినాము. వానిని వధించే ఉపాయమును చెప్పి మాకు సుఖమును కలిగించుము (6).

సనత్కుమార ఉవాచ ।

ఇతి విజ్ఞాపితో దేవైర్విహస్య భవకృద్విధిః ।
ప్రత్యువాచాథ తాన్ సర్వాన్ మయతో భీతమానసాన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవతలు ఇట్లు విన్నవించగా, సృష్టికర్తయగు బ్రహ్మ నవ్వి మయుని భయముతో నిండిన మనస్సు గల ఆ దేవతలనందరినీ ఉద్దేశించి ఇట్లు బదులిడెను (7).

బ్రహ్మోవాచ ।

న భేతవ్యం సురాస్తేభ్యో దానవేభ్యో విశేషతః ।
ఆచక్షే తద్వధోపాయం శివం శర్వః కరిష్యతి ॥
మత్తో వివర్ధితో దైత్యో వధం మత్తో న చార్హతి ।
తథాపి పుణ్యం వర్ధేత నగరే త్రిపురే పునః ॥
శివం చ ప్రార్థయధ్వం వై సర్వే దేవాస్సవాసవాః ।
సర్వాధీశః ప్రసన్నశ్చేత్స వః కార్యం కరిష్యతి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవతలారా! ఆ రాక్షసుల గురించి మీరు అధికముగా భయపడకుడు. వారిని వధించి సుఖమును కలిగించే ఉపాయమును చెప్పెదను. ఆ పనిని శివుడు చేయగలడు (8). నాచే వర్ధిల్లచేయబడిన రాక్షసుని నేనే చంపుట తగదు. పైగా ఆ మూడు నగరములలో పుణ్యము వర్ధిల్లుచున్నది (9). ఓ ఇంద్రాది దేవతలారా! మీరందరు శివుని ప్రార్థించుడు. సర్వాధ్యక్షుడగు ఆయన ప్రసన్నుడై మీ పనిని చేయగలడు (10).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య విధేర్వాణీం సర్వే దేవాస్సవాసవాః ।
దుఃఖితాస్తే యయుస్తత్ర యత్రాస్తే వృషభధ్వజః ॥
ప్రణమ్య భక్త్యా దేవేశం సర్వే ప్రాంజలయస్తదా ।
తుష్టువుర్వినతస్కంధాశ్శంకరం లోకశంకరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దుఃఖితులై యున్న ఆ ఇంద్రాది దేవతలందరు బ్రహ్మగారి మాటలను విని వృషభధ్వజుడగు శివుడు నివసించి యున్న స్థానమునకు వెళ్లిరి (11). అపుడు వారందరు లోకములకు మంగళములను గూర్చువాడు, దేవదేవుడు అగు శంకరునకు తలలు వంచి చేతులు జోడించి భక్తితో ప్రణమిల్లి ఇట్లు స్తుతించిరి (12).

దేవా ఊచుః ।

నమో హిరణ్య గర్భాయ సర్వసృష్టి విధాయినే ।
నమస్స్థితికృతే తుభ్యం విష్ణవే ప్రభవిష్ణవే ॥
నమో హరస్వరూపాయ భూత సంహారకారిణే ।
నిర్గుణాయ నమస్తుభ్యం శివాయామిత తేజసే ॥
అవస్థా రహితాయాథ నిర్వికారాయ వర్చసే ।
మహాభూతాత్మ భూతాయ నిర్లిప్తాయ మహాత్మనే ॥
నమస్తే భూతపతయే మహాభారసహిష్ణవే ।
తృష్ణాహరాయ నిర్వైరాకృతయే భూరితేజసే ॥

దేవతలిట్లు పలికిరి –

నీవు హిరణ్య గర్భుడవై సృష్టినంతనూ చేసితివి. సర్వసమర్థుడగు విష్ణువు యొక్క రూపమును దాల్చి జగత్తును రక్షించుచున్నావు. నీకు నమస్కారము (13). నీవు రుద్ర స్వరూపుడవై ప్రాణులను సంహరించెదవు. కాని నీవు నిర్గుణుడు, సాటిలేని తేజస్సు గలవాడు అగు శివుడవు. నీకు నమస్కారము (14). అవస్థలకు అతీతుడు, వికారరహితుడు, తేజస్స్వరూపుడు, పంచ మహాభూతముల స్వరూపములో నున్నవాడు, కర్మలేపము లేనివాడు, అఖండాత్మ స్వరూపుడు (15), భూతములకు ప్రభువు, బ్రహ్మాండ భారమును మోయువాడు, తృష్ణను పోగొట్టువాడు, దోషరహితమగు ఆకారము గలవాడు, మహాతేజశ్శాలి అగు శివునకు నమస్కారము (16).

మహాదైత్య మహారణ్య నాశినే దావవహ్నయే ।
దైత్యద్రుమకుఠారాయ నమస్తే శూలపాణయే ॥
మహాదనుజనాశాయ నమస్తే పరమేశ్వర ।
అంబికాపతయే తుభ్యం నమస్సర్వాస్త్ర ధారక ॥
నమస్తే పార్వతీనాథ పరమాత్మ న్మహేశ్వర ।
నీలకంఠాయ రుద్రాయ నమస్తే రుద్రరూపిణే ॥
నమో వేదాంత వేద్యాయ మార్గాతీతాయ తే నమః ।
నమో గుణస్వరూపాయ గుణినే గుణ వర్జితే ॥

మహారాక్షసులనే మహారణ్యమును తగులబెట్టే దావాగ్ని వంటివాడు, దైత్యులనే వృక్షములకు గొడ్డలియైనవాడు, చేతియందు శూలమును ధరించువాడు అగు నీకు నమస్కారము (17). ఓ పరమేశ్వరా! గొప్ప రాక్షసులను సంహరించే నీకు నమస్కారము. అస్త్రములనన్నిటినీ ధరించువాడా! పార్వతీ పతివగు నీకు నమస్కారము (18). ఓ పార్వతీ పతీ! పరమాత్మా! మహేశ్వరా! నల్లని కంఠము గల్గిన, రుద్రరూపుడవగు నీకు నమస్కారము (19). నీవు ఉపనిషద్వాక్యములచే

తెలియబడుదువు. కర్మ, భక్తి ఇత్యాది మార్గములకు నీవు అతీతుడవు. త్రిగుణాత్మకుడవు నీవే. త్రిగుణ రహితుడవు నీవే. నీకు అనేక నమస్కారములు (20).

మహాదేవ నమస్తుభ్యం త్రిలోకీనందనాయ చ ।
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ వాసుదేవాయ తే నమః ॥
సంకర్షణాయ దేవాయ నమస్తే కంసనాశినే ।
చాణూరమర్దినే తుభ్యం దామోదర విషాదినే ॥
హృషీకేశాచ్యుత విభో మృడ శంకర తే నమః ।
అధోక్షజ గజారాతే కామారే విషభక్షణ ॥
నారాయణాయ దేవాయ నారాయణ పరాయ చ ।
నారాయణ స్వరూపాయ నారాయణ తనూద్భవ ॥

ఓ మహాదేవా! ముల్లోకములను ఆనందింపజేయు నీకు నమస్కారము. అతిశయిం౦ంచిన మహిమ గల నీకు నమస్కారము. సర్వస్వతంత్రుడవగు నీకు నమస్కారము. సర్వప్రాణులలో చైతన్యరూపునిగా నివసించే నీకు నమస్కారము (21). నీవు భక్త జనులను ఆకర్షించు దేవుడవు. చాణూరుని మర్దించి కంసుని సంహరించిన నీకు నమస్కారము. మెడలో మాలను ధరించువాడా! విషమును భక్షించిన నీకు నమస్కారము (22). ఇంద్రియములను పాలించువాడా! చ్యుతిలేని వాడా! సర్వవ్యాపీ! రక్షకా! శంకరా! నీకు నమస్కారము. ఇంద్రియ గోచరము కానివాడా! గజాసురుని సంహరించినవాడా! కాముని దహించిన వాడా! విషమును భక్షించినవాడా! (23) నారాయణుని శరీరము నుండి పుట్టిన వాడా! నీవు నారాయణ భక్తుడవు. మరియు నారాయణ స్వరూపుడవు. అట్టి నారాయణ దేవుడవగు నీకు నమస్కారము (24).

నమస్తే సర్వరూపాయ మహానరకహారిణే ।
పాపాపహారిణే తుభ్యం నమో వృషభ వాహన ॥
క్షణాదికాలరూపాయ స్వభక్త బలదాయినే ।
నానా రూపాయారూపాయ దైత్య చక్ర విమర్దినే ॥
నమో బ్రహ్మణ్య దేవాయ గో బ్రాహ్మణహితాయ చ ।
సహస్రమూర్తయే తుభ్యం సహస్రావయవాయ చ ॥
ధర్మ రూపాయ సత్వాయ నమస్సత్యాత్మనే హర ।
వేద వేద్య స్వరూపాయ నమో వేదప్రియాయ చ ॥

ఓ వృషభవాహనా! సర్వజగత్స్వరూపుడవు, పాపములను పోగొట్టి నరకమునుండి రక్షించువాడవు అగు నీకు నమస్కారములు (25). క్షణము మొదలగు కాలములకు అధిష్ఠానమైనవాడు, తన భక్తులకు బలమునిచ్చువాడు, వివిధ రూపములలో ప్రకటమగు వాడు, రూపరహితుడు, రాక్షససమూహములను

నశింపజేయువాడు(26), వేదవేత్తలచే ఆరాధింపబడు వాడు, గోవులకు బ్రాహ్మణులకు హితమును చేయువాడు, జగత్తులోని నానారూపములలో వ్యక్తమగు వాడు, అసంఖ్యాకములగు అవయవములు గలవాడు (27), ధర్మ స్వరూపుడు, సత్త్వ గుణస్వరూపుడు అగు నీకు నమస్కారము. ఓ హరా! నీ స్వరూపము వేదముల యందు తెలియదగును. నీకు వేదములు ప్రియమైనవి. నీకు నమస్కారము (28).

నమో వేదస్వరూపాయ వేదవక్త్ర నమో నమః ।
సదాచారాధ్వగమ్యాయ సదాచారాధ్వగామినే ॥
విస్తారశ్రవసే తుభ్యం నమస్సత్యమయాయ చ ।
సత్యప్రియాయ సత్యాయ సత్య గమ్యాయ తే నమః ॥
నమస్తే మాయినే తుభ్యం మాయాధీశాయ వై నమః ।
బ్రహ్మాగాయ నమస్తుభ్యం బ్రహ్మణే బ్రహ్మజాయ చ ॥
తపసే తే నమోఽస్త్వీశ తపసా ఫలదాయినే ।
స్తుత్యాయ స్తుతయే నిత్యం స్తుతిసంప్రీతచేతసే ॥

వేదము నీ స్వరూపమే. నీ ముఖమే వేదము. సదాచారమనే మార్గమునందు పయనించు నీవు సదాచారమనే మార్గమునందు నడచువారిచే పొందబడెదవు. నీకు అనేక నమస్కారములు (29). వ్యాపకమైన కీర్తి గలవాడు, సత్యస్వరూపుడు, సత్యము ప్రియమైనవాడు, సత్యవర్తనముచే పొందగినవాడు అగు నీకు నమస్కారము (30). మాయావి, మాయను వశము చేసుకున్నవాడు అగు నీకు అనేక నమస్కారములు. బ్రహ్మ నుండి పుట్టినవాడు, పరబ్రహ్మస్వరూపుడు, బ్రహ్మజ్ఞానులు తన స్వరూపమైనవాడు అగు నీకు నమస్కారము (31). ఓ ఈశ్వరా! తపస్స్వరూపుడవగు నీవు తపస్సును చేయువారికి ఫలమునిచ్చెదవు. స్తుతిస్వరూపుడవగు నీవు నిత్యము భక్తులచే స్తుతింపబడెదవు. నీ మనస్సు భక్తుల స్తుతిచే మిక్కిలి ఆనందించును (32).

శ్రుత్యాచార ప్రసన్నాయ స్మృత్యా చార ప్రియాయ చ ।
చతుర్విధ స్వరూపాయ జలస్థలజరూపిణే ॥
సర్వే దేవాదయో నాథ శ్రేష్ఠత్వేన విభూతయః ।
దేవానామింద్రరూపోఽసి గ్రహాణాం త్వం రవిర్మతః ॥
సత్యలోకోఽసి లోకానాం సరితాం ద్యుసరిద్భవాన్ ।
శ్వేతవర్ణోఽసి వర్ణానాం సరసాం మానసం సరః ॥
శైలానాం గిరిజాతాతః కామధుక్త్వం చ గోషు హ ।
క్షీరోదధిస్త్వం సింధూనాం ధాతూనాం హాటకో భవాన్ ॥

వేదోక్తకర్మానుష్ఠానముచే ప్రసన్నుడగువాడు, స్మృతి విహిత ధర్మము(?)లనందు ప్రీతిగలవాడు, జరాయుజ, ఉద్భిజ, అండజ, స్వేదజములను ప్రాణులే స్వరూపమైన వాడు, జలములో మరియు భూమిపై నివసించే ప్రాణులే స్వరూపముగా గలవాడు అగు నీకు నమస్కారము (33), ఓ దేవా! దేవతలు

మొదలగు వారందరిలో శ్రేష్ఠులు నీ విభూతులే. దేవతలలో ఇంద్రుడు నీవే. గ్రహములలో సూర్యుడు నీవే (34). లోకములలో సత్యలోకము నీవే. నదులలో మందాకిని నీవే. వర్ణములలో శ్వేత వర్ణము నీవే. సరస్సులలో మానస సరోవరము నీవే (35). పర్వతములలో హిమవంతుడవు నీవే. గోవులలో కామధేనువు నీవే. సముద్రములలో పాలసముద్రము నీవే. లోహములలో బంగారము నీవే (36).

వర్ణానాం బ్రాహ్మణోఽసి త్వం నృణాం రాజాసి శంకర ।
ముక్తి క్షేత్రేషు కాశీ త్వం తీర్థానాం తీర్థరాడ్భవాన్ ॥
ఉపలేషు సమస్తేషు స్ఫటిక స్త్వం మహేశ్వర ।
కమలస్త్వం ప్రసూనేషు శైలేషు హిమవాంస్తథా ॥
భవాన్ వాగ్వ్యవహారేషు భార్గవస్త్వం కవిష్వపి ।
పక్షి ష్వేవాసి శరభస్సింహో హింస్రేషు సంమతః ॥
శాలగ్రామశిలా చ త్వం శిలాసు వృషభధ్వజ ।
పూజ్యరూపేషు సర్వేషు నర్మదాలింగమేవ హి ॥

వర్ణములలో బ్రాహ్మణుడవు నీవే. ఓ శంకరా! మానవులలో రాజువు నీవే. ముక్తిని ఇచ్చే పుణ్యక్షేత్రములలో కాశీ నీవే. క్షేత్రములలో ప్రయాగ క్షేత్రము నీవే (37). ఓ మహేశ్వరా! శిలలన్నింటిలో స్ఫటికము నీవే. పుష్పములలో కమలము నీవే పర్వతములలో హిమవంతుడవు నీవే (38). లో కవ్యవహారములలో వాగ్రూపమగు వ్యవహారము నీవే. కవులలో (ద్రష్టలలో) భార్గవుడవు నీవే. పక్షులలో శరభుడవు నీవే. హింసించే మృగములలో సింహము నీవే (39). ఓ వృషభధ్వజా! శిలలలో శాలగ్రామశిల నీవే. పూజింపదగిన రూపములన్నింటిలో నర్మదా లింగము నీవే (40).

నందీశ్వరోసి పశుషు వృషభః పరమేశ్వర ।
వేదేషూపనిషద్రూపీ యజ్వనాం శీతభానుమాన్ ॥
ప్రతాపినాం పావకస్త్వం శైవానామచ్యుతో భవాన్ ।
భారతం త్వం పురాణానాం మకారోఽ స్యక్షరేషు చ ॥

ఓ పరమేశ్వరా! పశువులలో నందీశ్వరుడను వృషభము నీవే. వేదములలో ఉపనిషత్తులు నీ స్వరూపమే. యజ్ఞము చేయు యజమానులకు సోమరసము నీవే (41). తపింపజేయు వారిలో అగ్నివి నీవే. శివభక్తులలో అచ్యుతుడవు నీవే. పురాణములలో భారతము నీవే. అక్షరములలో మకారము నీవే (42).

ప్రణవో బీజమంత్రాణాం దారుణానాం విషం భవాన్ ।

వ్యోమ వ్యాప్తి మతాం త్వం వై పరమాత్మాసి చాత్మనామ్ ॥

ఇంద్రియాణాం మనశ్చ త్వం దానానామభయం భవాన్ ।

పావనానాం జలం చాసి జీవనానాం తథామృతమ్ ॥

లాభానాం పుత్రలాభోఽసి వాయుర్వేగవతామసి ।

నిత్యకర్మసు సర్వేషు సంధ్యోపాస్తిర్భవాన్మతా ॥

క్రతూనామశ్వమేధోఽసి యుగానాం ప్రథమో యుగః ।

పుష్యస్త్వం సర్వధిష్ణ్యానామమావాస్యా తిథిష్వసి ॥

బీజమంత్రములలో ఓంకారము నీవే. భయంకరమగు వాటిలో విషము నీవే. వ్యాపకములలో ఆకాశము నీవే. ఆత్మలలో పరమాత్మవు నీవే (43). ఇంద్రియములలో మనస్సు నీవే. దానములలో అభయదానము నీవే. పవిత్రము చేయువాటిలో జలము నీవే. జీవనము నిచ్చు వాటిలో అమృతము నీవే (44). లాభములలో పుత్రలాభము నీవే. వేగము గలవాటిలో వాయువు నీవే. నిత్యకర్మలన్నిటి యందు సంధ్యోపాసన నీవే (45). క్రతువులలో అశ్వమేధము నీవే. యుగములలో సత్యయుగము నీవే. నక్షత్రములన్నింటిలో పుష్యానక్షత్రము నీవే. తిథులలో అమావాస్యవు నీవే (46).

సర్వర్తుషు వసంతస్త్వం సర్వపర్వసు సంక్రమః ।

కుశోఽసి తృణ జాతీనాం స్థూలవృక్షేషు వై వటః ॥

యోగేషు చ వ్యతీపాత స్సోమవల్లీ లతాసు చ ।

బుద్ధీనాం ధర్మ బుద్ధిస్త్వం కలత్రం సుహృదాం భవాన్ ॥

సాధకానాం శుచీనాం త్వం ప్రాణాయామో మహేశ్వర ।

జ్యోతిర్లింగేషు సర్వేషు భవాన్ విశ్వేశ్వరో మతః ॥

ధర్మస్త్వం సర్వ బంధూనామా శ్రమాణాం పరో భవాన్ ।

మోక్షస్త్వం సర్వవర్గేషు రుద్రాణాం నీలలోహితః ॥

ఋతువులన్నింటిలో వసంత ఋతువు నీవే. పర్వదినము లన్నింటిలో సంక్రమణము నీవే. గడ్డి జాతులన్నింటిలో దర్భ నీవే. పెద్ద వృక్షములలో మర్రి నీవే (47). యోగములలో వ్యతీపాత యోగము నీవే. లతలలో సోమలతవు నీవే. బుద్ధులలో ధర్మబుద్ధివి నీవే. మిత్రులలో భార్యవు నీవే (48). ఓ మహేశ్వరా! సత్పురుషులగు సాధకులలోని ప్రాణాయామము నీవే. జ్యోతిర్లింగములన్నింటిలో నీవు విశ్వేశ్వరుడవని ఋషులు చెప్పెదరు (49). బంధువులందరిలో ధర్మమనే బంధువు నీవే. ఆశ్రమములలో సన్న్యాసాశ్రమము నీవే. పురుషార్థములన్నింటిలో మోక్షము నీవే. రుద్రులలో నీలకంఠుడు, రక్తవర్ణుడు అగు రుద్రుడు నీవే (50).

ఆదిత్యానాం వాసుదేవో హనూమాన్ వానరేషు చ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽ సి రామశ్శస్త్ర భృతాం భవాన్ ॥
గంధర్వాణాం చిత్రరథో వసూనాం పావకో ధ్రువమ్ ।
మాసానామధి మాసస్త్వం వ్రతానాం త్వం చతుర్దశీ ॥
ఐరావతో గజేంద్రాణాం సిద్ధానాం కపిలో మతః ।
అనంతస్త్వం హి నాగానాం పితౄణా మర్యమా భవాన్ ॥
కాలః కలయతాం చ త్వం దైత్యానాం బలిరేవ చ ।
కిం బహూక్తేన దేవేశ సర్వం విష్టభ్య వై జగత్ ॥
ఏకాంశేన స్థితస్త్వం హి బహిస్స్వాన్వితఏవ చ ॥

ఆదిత్యులలో విష్ణువు నీవే. వానరులలో హనుమంతుడవు నీవే. యజ్ఞములలో జపయజ్ఞము నీవే. శస్త్ర ధారులలో శ్రీరాముడవు నీవే (5 1). గంధర్వులలో చిత్రరథుడు నీవే. వసువులలో నిశ్చయముగా అగ్నివి నీవే. మాసములలో అధికమాసము నీవే. వ్రతములలో చతుర్దశీ వ్రతము నీవే (52). గొప్ప ఏనుగులలో ఐరావతము నీవే. సిద్ధులలో కపిలుడవు నీవేనని పెద్దలు చెప్పెదరు. సర్పములలో శేషుడవు నీవే. పితృదేవతలలో అర్యముడవు నీవే (53). గణకులలో కాలము నీవే. దైత్యులలో బలి నీవే. ఇన్ని మాటలేల? ఓ దేవదేవా! నీవు ఒకే అంశముతో జగత్తునంతనూ వ్యాపించి యున్నావు. వస్తువునకు బయట నీవు ఉన్నావు. వస్తువునందు సారరూపుడవై నీవే ఉన్నావు (54, 55).

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుత్వా సురాస్సర్వే మహాదేవం వృషధ్వజమ్ ।
స్తోత్రైర్నానావిధైర్దివ్యై శ్శూలినం పరమేశ్వరమ్ ॥
ప్రత్యూచుః ప్రస్తుతం దీనాస్స్వార్థం స్వార్థ విచక్షణాః ।
వాసవాద్యా నతస్కంధాః కృతాంజలి పుటా మునే ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

వృషభధ్వజుడగు మహాదేవుని దేవతలందరు ఈ తీరున స్తుతించిరి. వారు శూలపాణియగు పరమేశ్వరుని వివిధ దివ్యస్తోత్రములతో కొనియాడిరి (56). దీనులు, స్వార్థ సంపాదనలో దక్షులు అగు ఇంద్రాది దేవతలు తలలు వంచి నమస్కరించిరి. ఓ మునీ! అపుడు వారు చేతులు జోడించి వచ్చిన పనిని గూర్చి ఇట్లు పలికిరి (57).

దేవా ఊచుః ।

పరాజితా మహాదేవ భ్రాతృభ్యాం సహితేన తు ।
భగవం స్తారకోత్పన్నై స్సర్వే దేవాస్సవాసవాః ॥
త్రైలోక్యం స్వవశం నీతం తథా చ మునిసత్తమాః ।
విధ్వస్తాస్సర్వ సంసిద్ధా స్సర్వముత్సాదితం జగత్ ॥
యజ్ఞ భాగాన్ సమగ్రాంస్తు స్వయం గృహ్ణాతి దారుణః ।
ప్రవర్తితో హ్యధర్మస్తైః ఋషీణాం చ నివారితః ॥
అవధ్యాస్సర్వభూతానాం నియతం తారకాత్మజాః ।
తదిచ్ఛయా ప్రకుర్వంతి సర్వే కర్మాణి శంకర ॥

దేవతలిట్లు పలికిరి –

మహాదేవా! తారకుని పుత్రులైన ముగ్గురు సోదరులు ఇంద్రాది దేవతలనందరినీ ఓడించినారు. ఓ భగవాన్! (58) వారు ముల్లోకములను తమ వశము చేసుకొని సర్వమునకు సంసిద్ధులై ఉండే మునిశ్రేష్ఠులను నాశనము చేసి, జగత్తు నంతనూ అల్లకల్లోలము చేసిరి (59). ఆ దుష్టుడు (తారకాక్షుడు) యజ్ఞ భాగములనన్నిటినీ తాను స్వీకరించు చున్నాడు. ఋషులు వారించిననూ సరకుగొనక వారు అధర్మమును విస్తరింపజేయు చున్నారు (60). ఓ శంకరా! ఏ ప్రాణులైననూ ఆ తారకపుత్రులను సంహరింపజాలవు. అందువలననే సర్వులు వారికి నచ్చిన రీతిలో సర్వ కర్మలను చేయుచున్నారు (61).

యావన్న క్షీయతే దైత్యైర్ఘోరైస్త్రి పురవాసిభిః ।
తావద్విధీయతాం నీతిర్యయా సంరక్ష్యతే జగత్ ॥

జగత్తు త్రిపురవాసులగు ఆ భయంకర రాక్షసులచే నశింపచేయబడుటకు ముందే, జగత్తును రక్షించు ఉపాయమును ఆచరించవలెను (62).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషా మింద్రాదీనాం దివౌకసామ్ ।
శివస్సంభాషమాణానాం ప్రతివాక్యమువాచ సః ॥
ఇతి శ్రీ శివమహా పురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే దేవకృత
శివస్తుతిర్నామ ద్వితీయోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

చక్కగా మాటలాడే ఆ ఇంద్రాది దేవతల ఈ మాటలను విని ఆ శివుడిట్లు బదులిడెను (63).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధ ఖండలో శివస్తుతి అనే రెండవ అధ్యాయము ముగిసినది (2).

3 – త్రిపురవధోపాయము

శివ ఉవాచ ।

అయం వై త్రిపురాధ్యక్షః పుణ్యవాన్ వర్తతేఽధునా ।
యత్ర పుణ్యం ప్రవర్తేత న హంతవ్యో బుధైః క్వచిత్ ॥
జానామి దేవ కష్టం చ విబుధాస్సకలం మహత్ ।
దైత్యాస్తే ప్రబలా హంతుమశక్యాస్తు సురాసురైః ॥
పుణ్యవంతస్తు తే సర్వే సమాయాస్తారకాత్మజాః ।
దుస్సాధ్యస్తు వధస్తేషాం సర్వేషాం పురవాసినామ్ ॥
మిత్ర ద్రోహం కథం జానన్ కరోమి రణకర్కశః ।
సుహృద్ద్రోహే మహత్పాపం పూర్వ ముక్తం స్వయంభువా ॥

శివుడిట్లు పలికెను –

త్రిపురములకు అధీశుడగు ఈ మయుడు ఇపుడు పుణ్యవంతుడై ఉన్నాడు. వివేకి ఎన్ననడునూ పుణ్యమును చేయు వ్యక్తిని హింసించరాదు (1). దేవతలారా! మీ కష్టమంతయూ నాకు ఎరుకయే. కాని బలశాలురగు ఆ రాక్షసులను దేవతలు గాని, అసురులు గాని చంపలేరు (2). మయుడు, మరియు తారకుని ముగ్గురు పుత్రులు పుణ్యాత్ములు. వారిని, వారి నగరములలో నివసించు వారిని సంహరించుట మిక్కిలి కష్టముతో గూడిన పని (3). నేను బుద్ధి పూర్వకముగా మిత్రులకు ద్రోహము చేసి రణమునందు క్రౌర్యమును ప్రదర్శించుట ఎట్లు సంభవమగును? మిత్ర ద్రోహము మహాపాపమని పూర్వము బ్రహ్మ చెప్పియున్నాడు (4).

బ్రహ్మఘ్నే చ సురాపే చస్తేయే భగ్నవ్రతే తథా ।
నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥
మమ భక్తాస్తు తే దైత్యా మయా వధ్యాః కథం సురాః ।
విచార్యతాం భవద్భిశ్చ ధర్మజ్ఞైరేవ ధర్మతః ॥
తావత్తే నైవ హంతవ్యా యావద్భక్తి కృతశ్చ మే ।
తథాపి విష్ణవే దేవా నివేద్యం కారణం త్విదమ్ ॥

బ్రహ్మ హత్య, సురాపానము, చౌర్యము మరియు వ్రతభంగము అను పాపములకు మహర్షులు నిష్కృతిని కల్పించిరి. కాని కృతఘ్నతకు నిష్కృతి లేదు (5). ఓ దేవతలారా! ఆ రాక్షసులు నా భక్తులు. వారిని నేను ఎట్లు వధించగలను? ధర్మము నెరింగిన మీరు కూడా ధర్మబద్ధముగా ఆలోచించుడు (6). వారు నా యందు భక్తిని చేసినంతకాలము వారిని చంపే ప్రసక్తి లేదు. అయిననూ, ఓ దేవతలారా! ఈ సంగతిని విష్ణువునకు విన్నవించుడు (7).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవం తద్వచశ్శ్రుత్వా దేవాశ్శక్రపురోగమాః ।
న్యవేదయన్ ద్రుతం సర్వే బ్రహ్మణే ప్రథమం మునే ॥
తతో విధిం పురస్కృత్య సర్వే దేవాస్సవాసవాః ।
వైకుంఠం ప్రయయుశ్శీఘ్రం సర్వే శోభాసమన్వితమ్ ॥
తత్ర గత్వా హరిం దృష్ట్వా ప్రణేమురాతసంభ్రమాః ।
తుష్టువుశ్చ మహాభక్త్యా కృతాంజలి పుటాస్సురాః ॥
స్వదుఃఖకారణం సర్వం పూర్వవత్తదనంతరమ్ ।
న్యవేదయన్ ద్రుతం తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥
దేవదుఃఖం తతశ్శ్రుత్వా దత్తం చ త్రిపురాలయే ।
జ్ఞాత్వా వ్రతం చ తేషాం తద్విష్ణుర్వచనమబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! ఇంద్రాది దేవతలు అందరు శివుని ఆ మాటను విని వెంటనే మున్ముందుగా బ్రహ్మకు విన్నవించిరి (8). అపుడు ఇంద్రాది దేవతలందరు బ్రహ్మను ముందిడు కొని వెంటనే శోభాయుక్తమగు వైకుంఠమునకు వెళ్లిరి (9). దేవతలు అచటకు వెళ్లి విష్ణువును గాంచి ఆశ్చర్య చకితులై చేతులు జోడించి నమస్కరించి గొప్ప భక్తితో స్తుతించిరి (10). వారు పూర్వమునందు వలెనే తమ దుఃఖకారణము నంతనూ సర్వసమర్థుడగు ఆ విష్ణువునకు వెనువెంటనే విన్నవించిరి (11). అపుడు విష్ణువు దేవతల దుఃఖమును విని, దానికి కారణము త్రిపురాసురులని గ్రహించి, వారు గొప్ప వ్రతము గలవారని కూడ తెలుసుకొని ఇట్లు పలికెను (12).

విష్ణురువాచ ।

ఇదం సత్యం వచశ్చైవ యత్ర ధర్మ స్సనాతనః ।
తత్ర దుఃఖం న జాయేత సూర్యే దృష్టే యథా తమః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఈ వచనము సత్యమే. ఎచట సనాతన ధర్మము ఉండునో, అచట దుఃఖము కలుగదు. సూర్యుడు ఉన్నచోట చీకటి ఉండలేదు గదా!

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేతద్వచనం శ్రుత్వా దేవా దుఃఖము పాగతాః ।
పునరూచుస్తథా విష్ణుం పరిమ్లాన ముఖాంబుజాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఈ మాటలను వినిన దేవతలు దుఃఖమును పొంది వాడిన ముఖపద్మములు గలవారై మరల విష్ణువుతో నిట్లనిరి (14).

దేవా ఊచుః ।

కథం చైవ ప్రకర్తవ్యం కథం దుఃఖం నిరస్యతే ।
కథం భవేమ సుఖినః కథం స్థాస్యామహే వయమ్ ॥
కథం ధర్మా భవిష్యంతి త్రిపురే జీవితే సతి ।
దేవదుఃఖప్రదా నూనం సర్వే త్రిపురవాసినః ॥
కిం వా తే త్రిపురస్యేహ వధశ్చైవ విధీయతామ్ ।
నో చేదకాలికీ దేవ సంహతిః క్రియతాం ధ్రువమ్ ॥

దేవతలిట్లు పలికిరి -

మా కర్తవ్యమేమి? దుఃఖమును పోగొట్టు ఉపాయమేది? మేము సుఖముగా జీవించుట యెట్లు? (15) త్రిపురాసురులు జీవించి యుండగా ధర్మము ఎట్లు నిలబడును? త్రిపురములలో నివసించు వారందరు దేవతలకు దుఃఖమునిచ్చు వారే యనుట నిశ్చయము (16). నీవు ఏదో విధముగా త్రిపురాసురుల సంహారమునకు ఉపాయమును చేయుము. ఓ దేవా! అట్లు గానిచో, అకాల ప్రళయమును చేయుడు. ఇది నిశ్చయము (17).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తే తదా దేవా దుఃఖం కృత్వా పునః పునః ।
స్థితిం నైవ గతిం తే వై చక్రుర్దేవవరాదిహ ॥
తాన్ వై తథా విధాన్ దృష్ట్వా హీనాన్ వినయసంయుతాన్ ।
సోఽపి నారాయణ శ్శ్రీమాన్ చింతయే చ్చేతసా తథా ॥
కిం కార్యం దేవకార్యేషు మయా దేవ సహాయినా ।
శివభక్తాస్తు తే దైత్యా తారకస్య సుతా ఇతి ॥
ఇతి సంచింత్య తత్కాలే విష్ణునా ప్రభవిష్ణునా ।
తత్ యజ్ఞాస్స్మృతాస్తేన దేవకార్యార్థమక్షయాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను --

అపుడా దేవతలు ఇట్లు పలికి పలుమారులు దుఃఖించిరి. దేవతలలో శ్రేష్ఠుడగు విష్ణువు యొక్క సన్నిధిలో వారు స్థిరముగా నుండలేక పోయిరి. మరియు వారచట నుండి బయటకు రాలేక పోయిరి (18). ఆ విధముగా దుఃఖితులై వినయముతో ప్రార్థించుచున్న దేవతలను చూచి లక్ష్మీసనాథుడగు ఆ నారాయణుడు మనస్సులో నిట్లు తలపోసెను (19). దేవతలకు సాహాయ్యమును చేయుట నా స్వభావము. ఈ దేవకార్యమును సిద్ధింపజేయుట యెట్లు? తారకుని పుత్రులగు ఆ రాక్షసులు శివుని భక్తులు (20). సర్వ సమర్థుడగు విష్ణువు ఆ సమయములో ఇట్లు తలపోసి తరువాత దేవకార్యము కొరకై వినాశము లేని యజ్ఞాధిష్ఠాన దేవతలను స్మరించెను (21).

తద్విష్ణు స్మృతిమాత్రేణ యజ్ఞాస్తే తత్క్షణం ద్రుతమ్ ।
ఆగతాస్తత్ర యత్రాస్తే శ్రీపతిః పురుషోత్తమః ॥
తతో విష్ణుం యజ్ఞ పతిం పురాణం పురుషం హరిమ్ ।
ప్రణమ్య తుష్టువుస్తే వై కృతాంజలిపుటాస్తదా ॥
భగవానపి తాన్ దృష్ట్వా యజ్ఞాన్ ప్రాహ సనాతనాన్ ।
సనాతనస్తదా సేంద్రాన్ దేవానాలోక్య చాచ్యుతః ॥

లక్ష్మీపతి, పురుషోత్తముడు అగు విష్ణువు స్మరించిన మరుక్షణములో ఆ యజ్ఞ దేవతలు ఆయన ఉన్నచోటికి విచ్చేసిరి (22). అపుడా యజ్ఞ దేవతలు చేతులు జోడించి యజ్ఞములకు ప్రభువు, పురాణ పురుషుడు, పాపములను హరించువాడునగు విష్ణువును ప్రణమిల్లి స్తుతించిరి (23). సనాతనుడు, అచ్యుతుడునగు విష్ణు భగవానుడు సనాతనులగు ఆ యజ్ఞ దేవతలను గాంచి, మరియు ఇంద్రాది దేవతలను చూచి, ఇట్లనెను (24).

విష్ణురువాచ ।

అనేనైవ సదా దేవా యజధ్వం పరమేశ్వరమ్ ।
పురత్రయ వినాశాయ జగత్త్రయవిభూతయే ॥

విష్ణువు ఇట్లు పలికెను -

దేవతలారా! త్రిపురములను నశింపజేసి ముల్లోకములకు అభివృద్ధిని కలిగించుట కొరకై పరమేశ్వరుని ఎల్లవేళలా ఈ యజ్ఞములతో ఆరాధించుడు (25).

సనత్కుమార ఉవాచ ।

అచ్యుతస్య వచశ్శ్రుత్వా దేవదేవస్య ధీమతః ।
ప్రేమ్ణా తే ప్రణతిం కృత్వా యజ్ఞేశం తేఽస్తువన్ సురాః ॥
ఏవం స్తుత్వా తతో దేవా అయజన్ యజ్ఞ పూరుషమ్ ।
యజ్ఞోక్తేన విధానేన సంపూర్ణ విధయో మునే ॥
తతస్తస్మాద్యజ్ఞ కుండా త్సముత్పేతుస్సహస్రశః ।
భూతసంఘా మహాకాయా శ్శూలశక్తి గదాయుధాః ॥
దదృశుస్తే సురాస్తాన్ వై భూతసంఘాన్ సహస్రశః ।
శూలశక్తి గదాహస్తాన్ దండచాపశిలాయుధాన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవదేవుడు, ధీమంతుడు, యజ్ఞేశుడు అగు అచ్యుతుని మాటను విని ఆ దేవతలు ప్రేమతో ప్రణమిల్లి స్తుతించిరి (26). ఓ మునీ! దేవతలు ఇట్లు స్తుతించి, తరువాత సంపూర్ణ విధివిధానముతో యజ్ఞమును చేసి యజ్ఞపురుషుని ఆరాధించిరి(27). అపుడు ఆ యజ్ఞకుండమునుండి పెద్ద దేహము గలవి,

శూలము, శక్తి, మరియు గద ఆయుధములుగా గలవి అగు భూతములు వేల సంఖ్యలో గుంపులు గుంపులుగా పుట్టినవి (28). శూలము, శక్తి, గద, దండము, ధనస్సు, శిల అను వాటిని ఆయుధములుగా ధరించి యున్న ఆ భూతముల యొక్క వేలాది సమూహములను ఆ దేవతలు గాంచిరి (29).

నానా ప్రహరణోపేతాన్ నానావేషధరాం స్తథా ।
కాలాగ్ని రుద్రసదృశాన్ కాల సూర్యోపమాంసదా ॥
దృష్ట్వా తానబ్రవీద్విష్ణుః ప్రణిపత్య పురస్థ్సితాన్ ।
భూతాన్ యజ్ఞపతి శ్శ్రీమాన్ రుద్రాజ్ఞా ప్రతి పాలకః ॥

అనేక ఆయుధములను ధరించినట్టియు, అనేక వేషములను ధరించినట్టియు, ప్రళయకాలమునందలి అగ్నిని, రుద్రుని, సూర్యుని పోలియున్న (30) ఆ భూతములు విష్ణువునకు ప్రణమిల్లి ఆయన యెదుట నిలబడెను. యజ్ఞేశ్వరుడు, లక్ష్మీపతి, రుద్రుని ఆజ్ఞను పాలించు వాడు అగు విష్ణువు ఆ భూతములను చూచి ఇట్లు పలికెను (31).

విష్ణురువాచ ।

భూతాశ్శృణుత మద్వాక్యం దేవకార్యార్థ ముద్యతాః ।
గచ్ఛంతు త్రిపురం సద్యస్సర్వే హి బలవత్తరాః ॥
గత్వా దగ్ధ్వా చ భిత్త్వా చ భంక్త్వా దైత్యపురత్రయమ్ ।
పునర్యథాగతా భూతా గంతుమర్హథ భూతయే ॥

ఓ భూతములారా! దేవతల కార్యము కొరకు పుట్టిన మీరు నా మాటను వినుడు. అధిక బలోపేతులగు మీరందరు వెంటనే త్రిపురములకు వెళుడు(32). రాక్షసుల ఆ త్రిపురములకు వెళ్లి వాటిని పగుల గొట్టి తగులబెట్టి మరల వచ్చిన దారిన వెళుడు. ఓ భూతములారా! మీకు అభివృద్ధి కలుగ గలదు (33).

సనత్కుమార ఉవాచ ।

తచ్ఛ్రుత్వా భగవద్వాక్యం తతో భూతగణాశ్చ తే ।
ప్రణమ్య దేవదేవం తం యయుర్దైత్య పురత్రయమ్ ॥
గత్వా తత్ప్రవిశంతశ్చ త్రిపురాధిపతేజసి ।
భస్మసాదభవన్ సద్య శ్శలభా ఇవ పావకే ॥
అవశిష్టాశ్చ యే కేచిత్పలాయన పరాయణాః ।
నిస్సృత్యారం సమాయాతా హరేర్నికటమాకులాః ॥
తాన్ దృష్ట్వా స హరిశ్రుత్వా తచ్చ వృత్త మశేషతః ।
చింతయామాస భగవాన్ మనసా పురుషోత్తమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

అపుడా భూతగణములు భగవానుని ఆ మాటను విని ఆ దేవదేవునకు నమస్కరించి రాక్షసుల త్రిపురములకు వెళ్లినవి (34). వెళ్లి ఆ నగరములలో ప్రవేశించు చుండగనే ఆ భూతములు, అగ్నిని ప్రవేశించు శలభములవలె, త్రిపురాసురుల తేజస్సులో వెనువెంటనే భస్మమైనవి (35). మిగిలిన కొద్ది భూతములు భయముతో పారిపోయి వేగముగా పరుగెత్తి విష్ణువు సమీపమును చేరినవి (36). పురుషోత్తముడగు ఆ హరి వారిని చూచి వారి వృత్తాంతము నంతనూ వినెను. అపుడా భగవానుడు మనస్సులో నిట్లు తలపోసెను (37).

కిం కృత్య మధునా కార్యమితి సంతప్త మానసః ।
సంతప్తా నమరాన్ సర్వానాజ్ఞాయ చ సవాసవాన్ ॥
కథం తేషాం చ దైత్యానాం బలాద్ధత్వా పురత్రయమ్ ।
దేవకార్యం కరిష్యామీత్యాసీచ్చింతా సమాకులః ॥
నాశోఽభి చారతో నాస్తి ధర్మిష్ఠానాం న సంశయః ।
ఇతి ప్రాహ స్వయం చేశశ్శ్రుత్యాచార ప్రమాణ కృత్ ॥
దైత్యాశ్చ తే హి ధర్మిష్ఠా స్సర్వే త్రిపుర వాసినః ।
తస్మాదవధ్యతాం ప్రాప్తా నాన్యథా సురపుంగవాః ॥

'ఇపుడు నేనేమి చేయదగును?' అని చింతిల్లిన మనస్సు గలవాడైన విష్ణువు ఇంద్రాది దేవతలందరు దుఃఖించుచుండుటను గాంచెను (38). 'ఆ రాక్షసులను బలప్రయోగముతో సంహరించి మూడు నగరములను భగ్నము చేసి దేవకార్యమును సిద్ధింపజేయుట యెట్లు?' అని విష్ణువు చింతతో దుఃఖితుడాయెను (39), ధర్మాత్ములకు అచార ప్రయోగముచే నాశము లేదని వేదాచారప్రమాణమును నిర్ణయించు శివుడు స్వయముగా చెప్పియున్నాడు (40). ఆ రాక్షసులు ధర్మాత్ములు. త్రిపురములందు నివసించు వారందరు ధర్మాత్ములు. ఓ దేవవరేణ్యులారా! కావుననే వీరిని వధించుట శక్యము గాకున్నది. మరియొక ఉపాయము తోచకున్నది (41).

కృత్వా తు సుమహత్పాపం రుద్రమభ్యర్చయంతి తే ।
ముచ్యంతే పాతకై స్సర్వైః పద్మ పత్ర మివాంభసా ॥
రుద్రాభ్యర్చనతో దేవాస్సర్వే కామా భవంతి హి ।
నానోపభోగసంపత్తిర్వశ్యతాం యాతి వై భువి ॥
తస్మాత్తద్భోగినో దైత్యా లింగార్చన పరాయణాః ।
అనేక విధ సంపత్తేర్మోక్షస్యాపి పరత్ర చ ॥
తతః కృత్వా ధర్మ విఘ్నం తేషామేవాత్మ మాయయా ।
దైత్యానాం దేవకార్యర్థం హరిష్యే త్రిపురం క్షణాత్ ॥

ఎవరైతే రుద్రుని ఆరాధించెదరో వారు మహాపాపములను చేసిన వారైననూ, తామర ఆకులకు నీటి తడి లేని విధముగా సర్వపాపములనుండి వారు విముక్తులగుదురు (42). ఓ దేవతలారా! రుద్రుని అర్చించు వారికి భూమండలము నందు కోర్కెలన్నియూ ఈడేరును. వారు భోగములనన్నిటినీ అనుభవించెదరు. వారు సంపదలను, వశీకరణ శక్తిని పొందెదరు (43). కావుననే ఆ రాక్షసులు లింగార్చనయందు నిష్ఠ గలవారై అనేక విధముల సంపదలను ఈ లోకములో అనుభవించి మరణించిన తరువాత మోక్షమును పొందెదరు (44). కావున నా మాయచే ఆ రాక్షసుల ధర్మమునకు ఆటంకమును కలిగించి, దేవకార్యసిద్ధి కొరకై త్రిపురములను క్షణములో నశింపజేసెదను (45).

విచార్యేత్థం తతస్తేషాం భగవాన్ పురుషోత్తమః ।
కర్తుం వ్యవసితః పశ్చా ద్ధర్మ విఘ్నం సురారిణామ్ ॥
యావచ్చ వేద ధర్మాస్తు యావద్వై శంకరార్చనమ్ ।
యావచ్చ శుచికృత్యాది తావన్నాశో భవేన్న హి ॥
తస్మాదేవం ప్రకర్తవ్యం వేదధర్మస్తతో వ్రజేత్ ।
త్యక్త లింగార్చనా దైత్యా భవిష్యంతి న సంశయః ॥
ఇతి నిశ్చిత్య వై విష్ణుర్విఘ్నార్థమకరోత్తదా ।
తేషాం ధర్మస్య దైత్యానా ముపాయం శ్రుతిఖండనమ్ ॥
తదైవోవాచ దేవాన్ స విష్ణుర్దేవసహాయకృత్ ।
శివాజ్ఞయా శివేనైవాజ్ఞప్త స్త్రైలోక్య రక్షణే ॥

పురుషోత్తముడగు విష్ణు భగవానుడు ఇట్లు ఆలోచించి ఆ రాక్షసుల ధర్మమునకు విఘ్నమును కలిగించుటకు నిశ్చయించెను (46). వేద ధర్మమును పాటించు చున్నంత వరకు, శంకరుని ఆరాధించు చున్నంత వరకు, శౌచము, నిత్యకర్మలు మొదలగు వాటిని పాటించుచున్నంత వరకు నాశము కలుగుట అసంభవము (47). కావున ఇట్లు చేసినచో, ఆ రాక్షసుల నుండి వేద ధర్మము తొలగిపోవును. రాక్షసులు లింగార్చనను విడనాడెదరు. సందేహము లేదు (48). ఇట్లు నిశ్చయించి విష్ణువు అపుడు రాక్షసుల ధర్మమునకు విఘ్నమును కలిగించి, వేదధర్మమును ఖండించే ఉపాయమును పన్నెను (49). దేవతలకు సాహాయ్యమును చేయువాడు, ముల్లోకముల రక్షణ యందు శివుని చేత నియోగింప బడినవాడునగు విష్ణువు శివుని ఆజ్ఞచే అపుడు దేవతలతో నిట్లనెను (50).

విష్ణురువాచ ।

హే దేవాస్సకలా యూయం గచ్ఛత స్వగృహాన్ ధ్రువమ్ ।
దైవకార్యం కరిష్యామి యథామతి న సంశయః ॥
తాన్ రుద్రాద్విముఖాన్నూనం కరిష్యామి సుయత్నతః ।
స్వభక్తి రహితాన్ జ్ఞాత్వా తాన్ కరిష్యతి భస్మసాత్ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ సర్వదేవతలారా! మీరు మీ గృహములకు నిశ్చయముగా మరలి పొండు. నేను నా బుద్ధికి తోచిన విధముగా దేవకార్యమును చేసెదను. సందేహము లేదు (51). నేను ప్రయత్నించి ఆ రాక్షసులను రుద్రుని నుండి విముఖులగు నట్లు చేసెదను. ఇది నిశ్చయము. వారికి తన యందు భక్తి లేదని యెరింగిన శివుడు వారిని భస్మము చేయగలడు (52).

సనత్కుమార ఉవాచ ।

తదాజ్ఞాం శిరసాధాయాశ్వాసితాస్తేఽ మరా మునే ।
స్వస్వధామాని విశ్వస్తా యయుర్బ్రహ్మాపి మోదితాః ॥
తతశ్చైవాకరోద్విష్ణుర్దేవార్థం హితముత్తమమ్ ।
తదేవ శ్రూయతాం సమ్యక్ సర్వపాప ప్రణాశనమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
త్రిపురవధోదయ వర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! విష్ణువు ఆజ్ఞను శిరసా వహించి ఆ దేవతలు విశ్వాసము గలవారై ఆనం◌ందముతో తమ తమ నెలవులకు వెళ్లిరి. వారికి ఓదార్పు కలిగెను. బ్రహ్మ కూడా తన ధామమునకు వెళ్లెను (53). అపుడు విష్ణువు దేవతలకు ఉత్తమమగు హితమును చేసెను. పాపములనన్నిటినీ నశింపజేయు ఆ గాథను చక్కగా వినుడు (54).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహిత యందు యుద్ధ ఖండలో త్రిపురవధోపాయ వర్ణన మనే మూడవ అధ్యాయము ముగిసినది (3).

4 - త్రిపుర వాసుల దీక్షా స్వీకారము

సనత్కుమార ఉవాచ ।

అసృజచ్చ మహాతేజాః పురుషం స్వాత్మసంభవమ్ ।
ఏకం మాయామయం తేషాం ధర్మ విఘ్నార్థమచ్యుతః ॥
ముండినం మానవస్త్రం చ గుంఫి పాత్ర సమన్వితమ్ ।
దధానం పుంజికాం హస్తే చాలయంతం పదే పదే ॥
వస్త్ర యుక్తం తథా హస్తం క్షీయమాణం ముఖే సదా ।
ధర్మేతి వ్యాహరంతం హి వాచా విక్లబయా మునే ॥
స నమస్కృత్య విష్ణుం తం తత్పురస్సంస్థితోఽథ వై ।
ఉవాచ వచనం తత్ర హరిం స ప్రాంజలిస్తదా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహాతేజస్వియగు అచ్యుతుడు త్రిపురాసురుల ధర్మమునకు విఘ్నము◌ును కలిగించుటకై తన దేహము నుండి ఒక మాయా పురుషుని సృష్టించెను (1). ఆతడు ముండితశిరస్కుడై చినిగిన వస్త్రములను ధరించి పాత్రలను త్రాటియందు గుచ్చి పట్టుకొనెను. ఆతడు చేతియందు మణిని ధరించి ప్రతి అడుగునందు దానిని త్రిప్పుచుండెను (2). ఆతడు చేతులపై వస్త్రములను ధరించెను. ముఖము నందు చిక్కి యున్న ఆతడు భయముతో నిండిన స్వరముతో ధర్మ శబ్దమును పలుకుచుండెను. ఓ మునీ! (3) ఆతడు పాపములను హరించు విష్ణువునకు నమస్కరించి ఆయన యెదుట నిలబడి చేతులు జోడించి అపుడు ఇట్లు పలికెను (4).

అరిహన్నచ్యుతం పూజ్యం కిం కరోమి తదాదిశ ।
కాని నామాని మే దేవ స్థానం వాపి వద ప్రభో ॥
ఇత్యేవం భగవాన్ విష్ణుశ్శ్రుత్వా తస్య శుభం వచః ।
ప్రసన్న మానసో భూత్వా వచనం చేదమబ్రవీత్ ॥

అరిహన్ అను పేరు గల ఆతడు పూజ్యుడగు అచ్యుతునితో నిట్లనెను : ఓ ప్రభూ! నేనేమి చేయవలెనో ఆదేశించుము. ఓ దేవా! నా నామములను, మరియు స్థానమును కూడా చెప్పుము (5). ఆతని ఈ శుభవచనమును విని విష్ణు భగవానుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై ఇట్లు పలికెను (6).

విష్ణురువాచ ।

యదర్థం నిర్మితోఽసి త్వం నిబోధ కథయామి తే ।
మదంగజ మహాప్రాజ్ఞ మద్రూపస్త్వం న సంశయః ॥
మమాంగాచ్చ సముత్పన్నో మత్కార్యం కర్తుమర్హసి ।
మదీయస్త్వం సదా పూజ్యో భవిష్యతి న సంశయః ॥
అరిహన్నామ తే స్యాత్తు హ్యన్యాని న శుభాని చ ।
స్థానం వక్ష్యామి తే పశ్చాచ్ఛృణు ప్రస్తుతమాదరాత్ ॥
మాయిన్ మాయామయం శాస్త్రం తత్ షోడశ సహస్రకమ్ ।
శ్రౌతస్మార్త విరుద్ధం చ వర్ణాశ్రమ వివర్జితమ్ ॥

విష్ణువు ఇట్లు పలికెను –

నా శరీరమునుండి పుట్టిన ఓ గొప్ప బుద్ధిశాలీ! నీవు సృష్టింపబడుటకు గల కారణమును చెప్పెదను. తెలుసుకొనుము. నీవు నా ,స్వరూపమే ననుటలో సందేహము లేదు (7). నా శరీరమునుండి జన్మించిన నీవు నా కార్యమును చేయ తగుదువు. నీవు నా వాడవు గనుక సర్వదా పూజల నందుకొనగలవు. సందేహము లేదు (8). నీకు అరిహన్ అను పేరు ప్రసిద్ధమగును. ఇతర నామములు ఉన్ననూ, అవి శుభకరములు గావు. నీ స్థానమును తరువాత చెప్పగలను. ఇప్పుడు ప్రస్తుత విషయమును శ్రద్ధతో వినుము (9). ఓ మాయావీ! పదునారు వేల శ్లోకములు గలది, వేదములకు స్మృతులకు విరుద్ధమైనది, వర్ణాశ్రమ విభాగము లేనిది అగు మోసముతో నిండిన శాస్త్రమును రచింపుము (10).

అపభ్రంశమయం శాస్త్రం కర్మవాదమయం తథా ।
రచయేతి ప్రయత్నేన తద్విస్తారో భవిష్యతి ॥
దదామి తవ నిర్మాణే సామర్థ్యం తద్భవిష్యతి ।
మాయా చ వివిధా శీఘ్రం త్వదధీనా భవిష్యతి ॥

మానవులను భ్రష్టులను చేయునట్టియు, పౌరుషమునకు మాత్రమే ప్రాధాన్యము నిచ్చు శాస్త్రమును ప్రయత్నపూర్వకముగా రచింపుము. అది విస్తారమును పొందగలదు (11). అట్టి శాస్త్రమును నిర్మించు సామర్థ్యమును నీకు నేను ఇచ్చెదను. నీకు అట్టి సామర్థ్యము కలుగ గలదు. అనేకరకముల మాయ శీఘ్రమే నీకు వశము కాగలదు (12).

తచ్ఛ్రుత్వా వచనం తస్య హరేశ్చ పరమాత్మనః ।
నమస్కృత్య ప్రత్యువాచ స మాయీ తం జనార్దనమ్ ॥

పాపహారి, పరమాత్మ, దుష్ట శిక్షకుడునగు విష్ణువు యొక్క ఆ మాటను విని ఆ మాయావి నమస్కరించి ఇట్లు బదులిడెను

ముండ్యువాచ ।

యత్కర్తవ్యం మయా దేవ ద్రుతమాదిశ తత్ప్రభో ।

త్వదాజ్ఞయా ఖిలం కర్మ సఫలం చ భవిష్యతి ॥

యతి ఇట్లు పలికెను -

ఓ దేవా! నా కర్తవ్యమేమి? ప్రభూ! నాకు కర్తవ్యమును వెంటనే ఆదేశించుము. నీ ఆజ్ఞచే సర్వకర్మలు సఫలము కాగలవు (14).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా పాఠయామాస శాస్త్రం మాయామయం తథా ।

ఇహైవ స్వర్గ నరక ప్రత్యయో నాన్యథా పునః ॥

తమువాచ పునర్విష్ణు స్స్మృత్వా శివపదాంబుజమ్ ।

మోహనీయా ఇమే దైత్యాస్సర్వే త్రిపురవాసినః ॥

కార్యాస్తే దీక్షితా నూనం పాఠనీయాః ప్రయత్నతః ।

మదాజ్ఞయా న దోషస్తే భవిష్యతి మహామతే ॥

ధర్మాస్తత్ర ప్రకాశంతే శ్రౌతస్మార్తా న సంశయః ।

అనయా విద్యయా సర్వే స్ఫోటనీయా ధ్రువం యతే ॥

సనత్కుమారుడిట్లు పలికెను --

ఇట్లు పలికిన తరువాత విష్ణువు ఆతనిచే మాయా ప్రధానమగు శాస్త్రమును పఠింపజేసెను. స్వర్గనరకములు ఇచటనే గలవు. మరణానంతరగతి ఏదీ లేదు. ఇది ఆ శాస్త్ర సారము (15). విష్ణువు శివుని పాదపద్మములను స్మరించి మరల ఆతనితో నిట్లనెను: ఈ త్రిపురాసురులను, త్రిపురవాసులను అందరినీ నీవు మోహింపజేయవలెను (16). వారికి నీవు దీక్షలనీయవలెను. వారిచే ఈ శాస్త్రమును ప్రయత్నపూర్వకముగా పఠింపజేయవలెను. ఓ మహాబుద్ధీ! నా ఆజ్ఞచే ప్రవర్తిల్లు నీకు దోషము అంటుకొనదు (17). ఆ త్రిపురములలో శ్రౌతస్మార్త ధర్మములు విలసిల్లు చున్నవనుటలో సందేహము లేదు. ఓ యతీ! నీవు ఈ విద్యతో వాటినన్నిటినీ నిశ్చయముగా నాశనము చేయవలెను (18).

గంతుమర్హసి నాశార్థం ముండిన్త్రి పురవాసినామ్ ।

తమో ధర్మం సంప్రకాశ్య నాశయస్వ పురత్రయమ్ ॥

తతశ్చైవ పునర్గత్వా మరుస్థల్యాం త్వయా విభో ।

స్థాతవ్యం చ స్వధర్మేణ కలిర్యావత్సమా వ్రజేత్ ॥

ప్రవృత్తే తు యుగే తస్మిన్ స్వీయో ధర్మః ప్రకాశ్యతామ్ ।

శిష్యైశ్చ ప్రతిశిష్యైశ్చ వర్తనీయస్త్వయా పునః ॥

మదాజ్ఞయా భవద్ధర్మో విస్తారం యాస్యతి ధ్రువమ్ ।

మదను జ్ఞాపరో నిత్యం గతిం ప్రాప్స్యసి మామకీమ్ ॥



ఓ యతీ! త్రిపుర నివాసుల వినాశము కొరకు నీవు బయలు దేరుము. వారికి ఈ తమోగుణ ప్రధానమగు ధర్మమును నేర్పి త్రిపురములను నశింపజేయుము (19). ఓ యతీ! ఆ తరువాత నీవు ఎడారి ప్రాంతమునకు వెళ్లి అచట నీ ధర్మమును పాటిస్తూ కలికాలము ఆరంభమగు వరకు నివసించి యుండవలెను (20). కలియుగము ఆరంభము కాగానే నీవు శిష్యుల ద్వారా, ప్రశిష్యుల ద్వారా నీ ధర్మమును ప్రచారము చేయవలెను. ఆ ధర్మమును నీవు పాటించుచుండవలెను (21), నా ఆజ్ఞచే నీ ధర్మము నిశ్చయముగా వ్యాప్తిని చెందగలదు. నీవు నిత్యము నా ఆజ్ఞను పాలిస్తూ నా సాయుజ్యమును పొందగలవు (22).

ఏవమాజ్ఞా తదా దత్తా విష్ణునా ప్రభవిష్ణునా ।

శాసనాద్దేవ దేవస్య హృదా త్వంతర్దధే హరిః ॥

తత స్స ముండీ పరిపాలయన్ హరేః ఆజ్ఞాం తథా నిర్మితవాంశ్చ శిష్యాన్ ।

యథాస్వరూపం చతురస్తదానీం మాయామయం శాస్త్రమపాఠయత్స్వయమ్ ॥

యథా స్వయం తథా తే చ చత్వారో ముండినశ్శుభాః ।

నమస్కృత్య స్థితాస్తత్ర హరయే పరమాత్మనే ॥

సర్వసమర్థుడగు విష్ణువు దేవ దేవుడగు శివుని ఆజ్ఞను మనస్సులో పొంది ఆతనికి ఈ విధముగా ఆజ్ఞాపించి అంతర్ధానమాయెను (23). అపుడా యతి విష్ణువు యొక్క ఆజ్ఞను పాలించి ఆ విధముగనే శిష్యులను నిర్మాణము చేసెను. సమర్థుడగు ఆ యతి అపుడు వారిచే మాయా ప్రధానమగు శాస్త్రమును యథాతథముగా స్వయముగా పఠింపజేసెను (24). ఆ యతి మరియు ఆయన వలెనే శిరో ముండనముతో నున్న ఆ నల్గురు శిష్యులు పాపహారి, పరమాత్మయగు విష్ణువునకు నమస్కరించి ఆయన యెదుట నిలబడిరి (25).

హరిశ్చాపి మునే తత్ర చతురస్తాంస్తదా స్వయమ్ ।

ఉవాచ పరమ ప్రీత శ్శివాజ్ఞా పరిపాలకః ॥

యథా గురుస్తథా యూయం భవిష్యథ మదాజ్ఞయా ।

ధన్యాస్స్థ సద్గతిమిహ సంప్రాప్స్యథ న సంశయః ॥

చత్వారో ముండినస్తేఽథ ధర్మం పాషండమాశ్రితాః ।

హస్తే పాత్రం దధానాశ్చ తుండవస్త్రస్య ధారకాః ॥

మలినాన్యేవ వాసాంసి ధారయంతో హ్యభాషిణః ।

ధర్మో లాభః పరం తత్త్వం వదంతస్త్వతి హర్షతః ॥

ఓ మహర్షీ! పాపహారి, శివుని ఆజ్ఞను పరిపాలించువాడు అగు విష్ణువు మిక్కిలి సంతసించి ఆ నల్గురు శిష్యులతో నిట్లనెను (26). మీరు మీ గురువు చేసినట్లు చేయుడు. నా ఆజ్ఞను పాలించుడు. సద్గతిని పొంది మీరు ధన్యులు

కొగలరు. సందేహము లేదు (27). వారు నల్గురు ముండిత శిరస్కులై అపధర్మము నాశ్రయించి చేతిలో పాత్రను పట్టుకొని, నోటిపై గుడ్డతో కట్టుకొని యుండిరి (28). వారు మలిన వస్త్రములను ధరించి యున్నారు. తాము పాటించు ధర్మము ననుసరించినచో పరమతత్త్వము చేజిక్కునని మహానందముతో ప్రకటించు చున్నారు. ఇతర విషయములను మాటలాడుట లేదు.

మార్జనీం ధ్రియమాణాశ్చ వస్త్ర ఖండ వినిర్మితామ్ ।
శనైశ్శనైశ్చలంతో హి జీవహింసా భయాద్ధ్రువమ్ ॥
తే సర్వే చ తదా దేవం భగవంతం ముదాన్వితాః ।
నమస్కృత్య పునస్తత్ర మునే తస్థుస్తదగ్రతః ॥
హరిణా చ తదా హస్తే ధృత్వా చ గురవేర్పితాః ।
అభ్యధాయి చ సుప్రీత్యా తన్నామాపి విశేషతః ॥
యథా త్వం చ తథైవైతే మదీయా వై న సంశయః ।
ఆదిరూపం చ తన్నామ పూజ్యత్వాత్పూజ్య ఉచ్యతే ॥

గుడ్డ పేలికలతో తుడిచే చీపురును తయారు చేసి పట్టుకున్నారు. ప్రాణులకు హింస కలుగకుండుటకై మెల్లమెల్లగా నడుచుచున్నారు (30). ఓ మహర్షీ! వారందరు అపుడు విష్ణు భగవానునకు ఆనందముతో నమస్కరించి మరల ఆయన యెదుట నిలబడిరి (31). అపుడు విష్ణువు వారిని చేతితో పట్టుకొని గురువునకు సమర్పించెను. మరియు వారి నామధేయములను మిక్కిలి ప్రీతితో ప్రకటించెను (32). నీవు నావాడవు. అటులనే వీరు కూడా నావారే. సందేహము లేదు. మీరందరు పూజనీయులు గనుక, మీ నామధేయములు 'పూజ్య' అను పదముతో ఆరంభమగు చుండును (33).

ఋషిర్యతిస్తథా కీర్య ఉపాధ్యాయ ఇతి స్వయమ్ ।
ఇమాన్యపి తు నామాని ప్రసిద్ధాని భవంతు వః ॥
మమాపి చ భవద్భిశ్చ నామ గ్రాహ్యం శుభం పునః ।
అరిహన్నితి తన్నామ ధ్యేయం పాపప్రణాశనమ్ ॥
భవద్భిశ్చైవ కర్తవ్యం కార్యం లోకసుఖావహమ్ ।
లోకానుకూలం చరతాం భవిష్యత్యుత్తమా గతిః ॥

ఋషి, యతి, కీర్యుడు, ఉపాధ్యాయుడు అనునవి మీ పేర్లు. నేను స్వయముగా పెట్టిన మీ ఈ నామములు లోకములో ప్రసిద్ధిని గాంచగలవు (34). మీరు శుభకరమగు నా నామమును కూడ ఉచ్చరించుడు. మీ గురువు యొక్క అరిహన్ అను పాపనాశకమగు నామమును కూడ ధ్యానము చేయుడు (35). మీరు ప్రాణులకు సుఖమును కలిగించు కార్యమును చేపట్టుడు. మీరు లోకముల క్షేమమునకు అనురూపముగా నడుచుకొనుడు. మీకు ఉత్తమగతి కలుగ గలదు (36).

సనత్కుమార ఉవాచ ।

తతః ప్రణమ్య తం మాయీ శిష్యయుక్త స్స్వయం తదా ।
జగామ త్రిపురం సద్య శ్శివేచ్ఛా కారిణం ముదా ॥
ప్రవిశ్య తత్పురం తూర్ణం విష్ణునా నోదితో వశీ ।
మహామాయవినా తేన ఋషిర్మాయాం తదాకరోత్ ॥
నగరో పవనే కృత్వా శిష్యైర్యుక్త స్స్థితిం తదా ।
మాయాం ప్రవర్తయామాస మాయినామపి మోహినీమ్ ॥
శివార్చన ప్రభావేణ తన్మాయా సహసా మునే ।
త్రిపురే న చచాలాశు నిర్విణ్ణోఽ భూత్తదా యతిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మాయావి యగు ఆ యతి శిష్యులతో కూడినవాడై, శివుని ఆజ్ఞను ఉల్లాసముతో పాలించు విష్ణువునకు ప్రణమిల్లి, వెంటనే త్రిపురమునకు వెళ్లెను (37). విష్ణువుచే ప్రేరేపింపబడినవాడు, జితేంద్రియుడు, మహామాయావి అగు ఆ యతి శీఘ్రముగా ఆ నగరమునందు ప్రవేశించి తన మాయను విస్తరింపజేసెను (38). ఆతడు శిష్యులతో గూడి నగరసమీపములోని ఉద్యానమునందు మకాము చేసి, మాయావులను కూడా మోహింపజేయు తన మాయను ప్రవర్తిల్ల జేసెను (39). ఓ మహర్షీ! ఆతని మాయ శివుని ఆరాధించిన మహిమచే వెనువెంటనే త్రిపురమునందు వ్యాపించలేదు. అపుడా యతి చకితుడయ్యెను (40).

అథ విష్ణుం స సస్మార తుష్టావ చ హృదా బహు ।
నష్టోత్సాహో విచేతస్కో హృదయేన విదూయతా ॥
తత్స్మృతస్స్వరితం విష్ణుస్సస్మార శంకరం హృది ।
ప్రాప్యాజ్ఞాం మనసా తస్య స్మృతవాన్నారదం ద్రుతమ్ ॥
స్మృతమాత్రేణ విష్ణోశ్చ నారదస్సముపస్థితః ।
నత్వా స్థిత్వా పురస్తస్య స్థితోఽ భూత్సాంజలిస్తదా ॥

అపుడు నశించిన ఉత్సాహము గలవాడు, కింకర్తవ్యతా విమూఢుడు అగు ఆ యతి దుఃఖముతో నిండిన హృదయముతో విష్ణువును స్మరించి మనసులో ఆయనను పరి పరి విధముల స్తుతించెను (41). వానిచే స్మరింపబడిన విష్ణువు వెంటనే తన హృదయములో శంకరుని స్మరించి మనస్సులో ఆయన ఆజ్ఞను పొంది వెంటనే నారదుని స్మరించెను (42). విష్ణువు స్మరించగానే నారదుడచటకు వచ్చి నమస్కరించి, ఆయన యెదుట చేతులు జోడించి నిలబడెను (43).

అథ తం నారదం ప్రాహ విష్ణుర్మతి మతాం వరః ।
లోకోపకారనిరతో దేవకార్యకరస్సదా ॥
శివాజ్ఞయోచ్యతే తాత గచ్ఛ త్వం త్రిపురం ద్రుతమ్ ।
ఋషిస్తత్ర గతశ్శిష్యైః మోహార్థం తత్పురవాసినామ్ ॥
ఇత్యాకర్ణ్య వచస్తస్య నారదో మునిసత్తమః ।
గతస్తత్ర ద్రుతం యత్ర స ఋషిర్మాయినాం వరః ॥
నారదోఽపి తథా మాయీ నియోగాన్మాయినః ప్రభోః ।
ప్రవిశ్య తత్పురం తేన మాయినా సహ దీక్షితః ॥
తతశ్చ నారదో గత్వా త్రిపురాధీశసన్నిధౌ ।
క్షేమ ప్రశ్నాదికం కృత్వా రాజ్ఞే సర్వం న్యవేదయత్ ॥

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, లోకోపకారము నందు సర్వదా నిమగ్నమైన వాడు, సర్వకాలములలో దేవకార్యమును చేయువాడు నగు విష్ణువు ఆ నారదునితో నిట్లనెను (44). వత్సా! నేను శివుని ఆజ్ఞచే చెప్పుచున్నాను. నీవు వెంటనే త్రిపురములకు వెళ్లుము. ఆ నగరములలో నివసించు వారిని మోహ పెట్టుటకై ఋషి శిష్యులతో గూడి అచటకు వెళ్లినాడు (45). విష్ణువు యొక్క మాటను విని, నారద మహర్షి మాయావులలో అగ్రేసరుడగు ఆ ఋషి ఉన్న స్థానమునకు వెంటనే వెళ్లెను (46). మాయావి యగు నారదుడు ఆ విధముగా మాయావియగు ప్రభుని ఆదేశముచే ఆ పురమును ప్రవేశించి ఆ మాయావి వద్ద దీక్షను స్వీకరించెను (47). తరువాత నారదుడు త్రిపురా ధిపతి వద్దకు వెళ్లి క్షేమ సమాచారమును ప్రశ్నించి, తరువాత విషయమునంతనూ ఆ మహారాజునకు విన్నవించెను (48).

నారద ఉవాచ ।

కశ్చిత్సమాగతశ్చాత్ర యతిర్ధర్మ పరాయణః ।
సర్వవిద్యా ప్రకృష్టో హి వేదవిద్యా పరాన్వితః ॥
దృష్టాః చ బహవో ధర్మా నైతేన సదృశాః పునః ।
వయం సుదీక్షితాశ్చాత్ర దృష్ట్వా ధర్మం సనాతనమ్ ॥
తవేచ్ఛా యది వర్తేత తద్ధర్మే దైత్యసత్తమ ।
తద్ధర్మస్య మహారాజ గ్రాహ్యా దీక్షా త్వయా పునః ॥

నారదుడిట్లు పలికెను –

ఇచటకు ధర్మ నిష్టుడు, విద్యలన్నింటిలో ఆరితేరినవాడు, వేదమునందలి పరావిద్యలను ఎరింగిన వాడు అగు యతి ఒకరు వచ్చి యున్నారు (49). నేను అనేక ధర్మములను చూచితిని గాని, అవి దీని సాటి గావు. ఈ ధర్మము సనాతనమని మాకు తోచినది. కావున మేమీ ధర్మములో దీక్షను గైకొంటిమి (50). ఓ రాక్షస శ్రేష్ఠా! మహారాజా! నీకు ఆ ధర్మము నందు అభిరుచి కలిగినచో, నీవు కూడా ఆ ధర్మమునకు సంబంధించిన దీక్షను గైకొనుము (51).

సనత్కుమార ఉవాచ ।

తదీయం స వచశ్శ్రుత్వా మహదర్థసుగర్భితమ్ ।
విస్మితో హృది దైత్యేశో జగౌ తత్ర విమోహితః ॥
నారదో దీక్షితో యస్మాద్వయం దీక్షా మవాప్నుమః ।
ఇత్యేవం చ విదిత్వా వై జగామ స్వయమేవ హ ॥
తద్రూపం చ తదా దృష్ట్వా మోహితో మాయయా తథా ।
ఉవాచ వచనం తస్మై నమస్కృత్య మహాత్మనే ॥

సనత్కుమారుడిట్లు పలికెను

గొప్ప అర్థముతో నిండి ప్రకాశించే ఆతని ఆ మాటను విని, ఆ రాక్షసరాజు మనస్సులో ఆశ్చర్యమును పొంది మోహితుడై అచటకు వెళ్లెను (52). 'నారదుడు దీక్షను స్వీకరించినాడు గనుక, మేము దీక్షను గైకొనెదము'. ఆతడు ఇట్లు తలపోసి స్వయముగా వెళ్లెను (53). ఆ యతి యొక్క రూపమును చూచి మరియు మాయచే మోహితుడై ఆతడు ఆ మహాత్మునకు నమస్కరించి ఇట్లు పలికెను (54).

త్రిపురాధిప ఉవాచ ।

దీక్షా దేయా త్వయా మహ్యం నిర్మలాశయ భో ఋషే ।
అహం శిష్యో భవిష్యామి సత్యం సత్యం న సంశయః ॥
ఇత్యేవం తు వచశ్శ్రుత్వా దైత్య రాజస్య నిర్మలమ్ ।
ప్రత్యువాచ సుయత్నేన ఋషిస్స చ సనాతనః ॥
మదీయా కరణీయా స్యాద్వద్యాజ్ఞా దైత్యసత్తమ ।
తదా దేయా మయా దీక్షా నాన్యథా కోటి యత్నతః ॥
ఇత్యేవం తు వచశ్శ్రుత్వా రాజా మాయా మయోఽ భవత్ ।
ఉవాచ వచనం శీఘ్రం యతిం తం హి కృతాంజలిః ॥

త్రిపురాధీశుడు ఇట్లు పలికెను -

పవిత్రమగు హృదయము గల ఓ మహర్షీ! నీవు నాకు దీక్షను ఇమ్ము నేను నీకు శి:ష్యుడను కాగలను. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (55). సనాతనుడగు ఆ యతి రాక్షస రాజు యొక్క ఆ కపటము లేని మాటను విని జాగరూకతతో నిట్లు బదులిడెను (56). ఓ రాక్షస శ్రేష్ఠా! నీవు నా ఆజ్ఞను పాలించే పక్షములో నేను నీకు దీక్షను ఇచ్చెదను. అట్లు గానిచో కోటి ప్రయత్నములను చేసిననూ దీక్షను ఈయజాలను (57). ఆ రాజు ఈ మాటను విని మాయా మోహితుడై వెంటనే చేతులు జోడించి ఆ యతితో నిట్లనెను (58).

దైత్య ఉవాచ ।

యథాజ్ఞాం దాస్యసి త్వం చ తత్తథైవ న చాన్యథా ।
త్వదాజ్ఞాం నోల్లంఘయిష్యే సత్యం సత్యం న సంశయః ॥

రాక్షసుడు ఇట్లు పలికెను -

నీవు ఆజ్ఞాపించినట్లే సర్వమును నేను చేయగలను. దీనికి తిరుగు లేదు. నీ ఆజ్ఞను నేను ఉల్లంఘించను. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (59).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య త్రిపురాధీశితుస్తదా ।
దూరీకృత్య ముఖాద్వస్త్రమువాచ ఋషిసత్తమః ॥
దీక్షాం గృహ్ణీష్వ దైత్యేంద్ర సర్వ ధర్మోత్తమోత్తమామ్ ।
దదౌ దీక్షా విధానేన ప్రాప్స్యసి త్వం కృతార్థతామ్ ॥
ఇత్యుక్త్వా స తు మాయావీ దైత్య రాజాయ సత్వరమ్ ।
దదౌ దీక్షాం స్వధర్మోక్తాం తస్మై విధివిధానతః ॥
దైత్యరాజే దీక్షితే చ తస్మిన్ ససహజే మునే ।
సర్వే చ దీక్షితా జాతాస్తత్ర త్రిపుర వాసినః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

త్రిపురాధీశ్వరుని ఈ మాటలను విని అపుడా యోగి శ్రేష్ఠుడు నోటికి కట్టిిన వస్త్రమును ప్రక్కకు తొలగించి ఇట్లనెను (60). ఓ రాక్షసరాజా! సర్వధర్మములలో ఉత్తమోత్తమమైన ఈ దీక్షను స్వీకరించుము. నీవు ఈ దీక్షను పాటించినచో కృతార్థుడవు కాగలవు(61). ఇట్లు పలికి మాయావి యగు ఆ యతి వెంటనే రాక్షసరాజునకు తన శాస్త్రములో విధింపబడిన విధానములో యథావిధిగా దీక్షను ఇచ్చేను (62). ఓ మహర్షీ! సోదరులతో కలిసి రాక్షసరాజు దీక్షను స్వీకరించగానే, త్రిపురములయందు నివసించు వారందరు దీక్షను స్వీకరించిరి (63).

మునే శిష్యైః ప్రశిష్యైశ్చ వ్యాప్తమాసీద్ద్రుతం తదా ।
మహామాయావినస్తత్తు త్రిపురం సకలం మునే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధ ఖండే త్రిపుర దీక్షావిధానం నామ చతుర్థోఽధ్యాయః ॥

ఓ మహర్షీ! అపుడు మహామాయవి యగు ఆ యతీశ్వరుని శిష్యప్రశిష్యులతో త్రిపురములన్నియూ శీఘ్రమే నిండి పోయెను (64).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహిత యందు యుద్ధఖండలో త్రిపుర వాసుల దీక్షా స్వీకారము అనే నాల్గవ అధ్యాయము ముగిసినది.

5 - త్రిపుర మోహనము

వ్యాస ఉవాచ ।

దైత్యరాజే దీక్షితే చ మాయినా తేన మోహితే ।
కిమువాచ తదా మాయీ కిం చకార స దైత్యపః ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఆ మాయావిచే మోహితుడైన రాక్షసరాజు దీక్షను స్వీకరించిన పిదప ఆ మాయావి ఏమనెను? ఆ రాక్షసరాజు ఏమి చేసెను? (1).

సనత్కుమార ఉవాచ ।

దీక్షాం దత్త్వా యతిస్తస్మా అరిహన్నారదాదిభిః ।
శిష్యైః స్సేవితపాదాబ్జో దైత్యరాజాన మబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అరిహన్ అనబడే ఆ యతి ఆ రాక్షసరాజునకు దీక్షను ఇచ్చి, నారదుడు మొదలగు శిష్యులచే సేవింపబడే పాదపద్మములు గల వాడై ఆతనితో నిట్లనెను (2).

అరిహన్నువాచ ।

శృణు దైత్యపతే వాక్యం మమ సంజ్ఞాన గర్భితమ్ ।
వేదాంతసారసర్వస్వం రహస్యం పరమోత్తమమ్ ॥
అనాదిసిద్ధస్సంసారః కర్తృ కర్మ వివర్జితః ।
స్వయం ప్రాదుర్భవత్యేవ స్వయమేవ విలీయతే ॥
బ్రహ్మాదిస్తంబ పర్యంతం యావద్దేహని బంధనమ్ ।
ఆత్మైవై కేశ్వరస్తత్ర న ద్వితీయస్తదీశతా ॥
యద్బ్రహ్మా విష్ణు రుద్రాఖ్యాస్తదా ఖ్యా దేహినామిమాః ।
ఆఖ్యా యథాస్మదా దీనా మరిహన్నాది రుచ్యతే ॥

అరిహన్ ఇట్లు పలికెను -

రాక్షసరాజా! మంచి జ్ఞానముతో నిండిన నా వాక్యములను వినుము. వేదాంతముల యొక్క సారసర్వస్వమనదగినది, రహస్యమైనది, ఉత్తమోత్తమమైనది అగు వాక్యమును చెప్పెదను (3). ఈ సంసారము అనాదినుండియు నిత్య సిద్ధమై యున్నది. దీనికి కర్త లేడు. ఇది క్రియనుండి జన్మించినది కాదు. ఇది స్వయముగా ప్రకటమై స్వయముగనే లీనమగు చుండును (4). బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు దేహములు ఏ తీరున గలవో, ఆ దేహములే ఆత్మ. దేహమే ఈశ్వరుడు. దేహములను పాలించు ఈశ్వరుడు వేరుగా లేడు (5). బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అనునవి దేహము గల ప్రాణుల నామములు మాత్రమే. నాకు అరిహన్ అనియు,

ఇతరులకు ఆయా నామములు ఉన్నవి గదా! సర్వత్రా అటులనే యుండును (6).

దేహో యథాస్మదాదీనాం స్వకాలేన విలీయతే ।
బ్రహ్మాది మశకాంతానాం స్వకాలాల్లీయతే తథా ॥
విచార్యమాణే దేహేఽ స్మిన్న కించిదధికం క్వచిత్ ।
ఆహారో మైథునం నిద్రా భయం సర్వత్ర యత్సమమ్ ॥
నిద్రాహారపరీమాణం ప్రాప్య సర్వో హి దేహభృత్ ।
సదృశీమేవ సంతృప్తిం ప్రాప్నుయాన్నాధికేతరామ్ ॥
యథా వితృషితాస్స్వామ పీత్వా పేయం ముదా వయమ్ ।
తృషితాస్తు తథాన్యేఽపి న విశేషోఽల్పకోఽధికః ॥

మన దేహములు వాటి వాటి ఆయుర్దాయము పూర్తి అయిన పిదప నశించును గదా! బ్రహ్మ మొదలు దోమ వరకు గల ప్రాణుల దేహములు కూడా అటులనే కొంతకాలము జీవించి నశించును (7). విచారణ చేసినచో సర్వప్రాణుల దేహముల యందు ఆహారము, మైథునము, నిద్ర, భయము అనునవి సమానముగ నున్నవి. ఇంతకు మించి దేహములో అధికముగా ఏదీ లేదు (8). సర్వప్రాణులు ఆహారమును భుజించు నప్పుడు మరియు నిద్రించునప్పుడు పొందే సంతృప్తి సమానముగా నుండును. హెచ్చుతగ్గులు ఉండవు (9), మనము దాహము వేసినప్పుడు నీటిని త్రాగి ఆనందించెదము. దప్పిక తీరును. ఇతర ప్రాణుల విషయములో కూడ నింతే. తేడా గాని, హెచ్చు తగ్గులు గాని లేవు (10).

సంతు నార్యస్సహస్రాణి రూపలావణ్య భూమయః ।
పరం నిధువనే కాలే హ్యేకైవేహోపయుజ్యతే ॥
అశ్వాః పరశ్శతాస్సంతు సంత్యేనే కేష్వనే కథా ।
అధిరోహే తథాప్యేకో న ద్వితీయస్తథాత్మనః ॥
పర్యంకశాయినాం స్వాపే సుఖం యదుపజాయతే ।
తదేవ సౌఖ్యం నిద్రాభిర్భూతభూశాయినా మపి ॥
యథైవ మరణాద్భీతి రస్మదాది వపుష్మతామ్ ।
బ్రహ్మాది కీటకాంతానాం తథా మరణతో భయమ్ ॥

సౌందర్య లావణ్యములకు నిధానమనదగిన స్త్రీలు వేలాది మంది ఉండవచ్చును. కాని వివాహమాడి గృహస్థ జీవనమునకు అంకితమయ్యేది ఒక స్త్రీతో మాత్రమే గదా! (11). కొన్ని వందల గుర్రములు ఉపలభ్యముగానున్ననూ, అధిరోహించు కాలమునందు ఉపకరించునది ఒక గుర్రమే గాని, రెండు కాదు (12). హంస తూలికా తల్పముపై పరున్న వానికి ఏ నిద్రా సుఖము కలుగునో, భూమిపై శయనించువానికి కూడా అదియే నిద్రాసుఖము లభించును (13). మనవంటి దేహధారులకు ఎట్టి మరణభయము గలదో, అదే మరణ భయము బ్రహ్మ మొదలు కీటకము వరకు గల ప్రాణులన్నింటికీ గలదు (14).

సర్వే తను భృతస్తుల్యా యది బుద్ధ్యా విచార్యతే ।

ఇదం నిశ్చిత్య కేనాపి నో హింస్యః కోఽపి కుత్రచిత్ ॥

ధర్మో జీవదయా తుల్యో న క్వాపి జగతీతలే ।

తస్మాత్సర్వ ప్రయత్నేన కార్యా జీవదయా నృభిః ॥

ఏకస్మిన్ రక్షితే జీవే త్రైలోక్యం రక్షితం భవేత్ ।

ఘాతితే ఘాతితం తద్వత్తస్మాద్రక్షేన్న ఘాతయేత్ ॥

అహింసా పరమో ధర్మః పాపమాత్మ ప్రపీడనమ్ ।

అపరాధీనతా ముక్తి స్స్వర్గోఽ భిలషితాశనమ్ ॥

బుద్ధితో విచారణ చేసినచో, దేహధారులందరు సమానమే. ఈ సత్యమును దృఢముగా ఎరింగి ఎవ్వరైననూ ఎక్కడైననూ ఇతర ప్రాణులను హింసించరాదు (15). భూమండలమునందు భూతదయతో సమానమైన ధర్మము ఎచ్చటనూ లేదు. కావున మానవులు సర్వప్రయత్నములను చేసి భూతదయను పాలించవలెను (16). ఒక్క ప్రాణిని రక్షించినచో, ముల్లోకములను రక్షించినట్లు అగును. ఒక్క ప్రాణిని హింసించినచో, ముల్లోకములను హింసించినట్లు అగును. కావున ప్రాణులను రక్షించవలెనే గాని, హింసించరాదు (17). అహింస సర్వోత్తమ మగు ధర్మము. దేహమునకు హింసను కలిగించుట పాపము. పరాధీనుడు కాకుండుటయే మోక్షము. కోరిన సుఖముల ననుభవించుటయే స్వర్గము (18).

పూర్వసూరిభిరిత్యుక్తం సత్ప్రమాణతయా ధ్రువమ్ ।

తస్మాన్న హింసా కర్తవ్యా నరైర్నరకభీరుభిః ॥

న హింసాసదృశం పాపం త్రైలోక్యే సచరాచరే ।

హింసకో నరకం గచ్ఛేత్స్వర్గం గచ్ఛేదహింసకః ॥

సంతి దానాన్యనేకాని కిం తైస్తుచ్ఛ ఫలప్రదైః ।

అభీతిసదృశం దానం పరమేకమపీహ న ॥

ఇహ చత్వారి దానాని ప్రోక్తాని పరమర్షిభిః ।

విచార్య నానాశాస్త్రాణి శర్మణేఽ త్ర పరత్ర చ ॥

పూర్వులగు పండితులు సత్ప్రమాణములతో నిశ్చయించి ఇట్లు చెప్పిరి. కావున నరక భయము గల మానవులు హింసను చేయరాదు (19). స్థావర జంగమ ప్రాణులతో గూడియున్న ముల్లోకములలో హింసతో సమానమగు పాపము లేదు. హింస చేయువాడు నరకమును పొందును. అహింసా పరుడు స్వర్గమును బడయును (20). దానములనేకములు గలవు. అల్పఫలములనిచ్చు ఆ దానములతో పని యేమున్నది? అభయదానముతో సమమగు దానము గాని, అంతకంటే గొప్ప దానము గాని ఒక్కటి యైననూ లేదు (21). మహర్షులు శాస్త్రముల నన్నిటినీ పరిశీలించి ఇహ పరములలో సుఖమునిచ్చు నాలుగు దానములను నిర్ధారించిరి (22).

భీతేభ్య శ్చాభయం దేయం వ్యాధితేభ్య స్తథౌషధమ్ ।
దేయా విద్యార్థినాం విద్యా దేయమన్నం క్షుధాతురే ॥
యాని యానీహ దానాని బహుమున్యుదితాని చ ।
జీవాభయ ప్రదానస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥
అచిచింత్య ప్రభావం హి మణి మంత్రౌషధం బలమ్ ।
తదభ్యస్యం ప్రయత్నేన నామార్థోపార్జనాయ వై ॥
అర్థానుపార్జ్య బహుశో ద్వాదశాయతనాని వై ।
పరితః పరిపూజ్యాని కిమన్యైరిహ పూజితైః ॥
పంచ కర్మేంద్రియ గ్రామః పంచ బుద్ధీంద్రియాణి చ ।
మనో బుద్ధిరిహ ప్రోక్తం ద్వాదశాయతనం శుభమ్ ॥

భయపడిన వారికి అభయమును, వ్యాధి గ్రస్తులకు మందును, విద్యార్థులకు విద్యను, ఆకలి గొన్నవారికి అన్నమును ఈయవలెను (23). అనేక మహర్షులు చెప్పిన దానములు ఈ లోకములో ఎన్ని గలవో, అవి అన్నియు ప్రాణులకు ఇచ్చే అభయ దానము యొక్క పదునారవ అంశమునకైననూ సరిదూగవు (24). మణులకు, మంత్రములకు, మందులకు ఊహకు అందని శక్తులు గలవు. కావున మానవుడు పేరు ప్రతిష్ఠలను, ధనమును సంపాదించుట కొరకై ప్రయత్నముతో వాటిని అభ్యసించవలెను (25). ధనమును అధికముగా సంపాదించి పన్నెండు ఆయతనములను శ్రద్ధతో పూజించవలెను. ఇతరములను పూజించుట వలన ప్రయోజనమేమున్నది? (26) అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, మనస్సు మరియు బుద్ధి కలిసి పన్నెండు శుభకరమగు ఆయతనములు అగును (27).

ఇహైవ స్వర్గనరకౌ ప్రాణినాం నాన్యతః క్వచిత్ ।
సుఖం స్వర్గస్సమాఖ్యాతా దుఃఖం నరకమేవ హి ॥
సుఖేషు భుజ్యమానేషు యత్ స్యాద్దేహ విసర్జనమ్ ।
అయమేవ పరో మోక్షో విజ్ఞేయస్తత్త్వ చింతకైః ॥
వాసనాసహితే క్లేశసముచ్ఛేదే సతి ధ్రువమ్ ।
అజ్ఞానో పరమో మోక్షో విజ్ఞేయస్తత్త్వ చింతకైః ॥
ప్రామాణికీ శ్రుతిరియం ప్రోచ్యతే వేదవాదిభిః ।
న హింస్యాత్సర్వ భూతాని నాన్యా హింసా ప్రవర్తికా ॥

ప్రాణులు ఇచటనే స్వర్గనరకముల ననుభవించెదరు. ఇంతకు మించి ఎక్కడనో స్వర్గనరకములు లేవు. సుఖమే స్వర్గము. దుఃఖమే నరకము (28). సుఖముల ననుభవిస్తూ ప్రాణములను విడనాడుటయే గొప్ప మోక్షము అగునని తత్త్వవేత్తలు ఎరుంగవలెను (29). వాసనలతో సహా చిత్తక్లేశములు నశించగా అజ్ఞానము నిశ్చయముగా తొలగిపోవును. అదియే మోక్షమని తత్త్వచింతకులు తెలియవలెను (30). వేదవేత్తలు బోధించే పరమ ప్రమాణమగు శ్రుతి ఇట్లు

చెప్పుచున్నది : ఏ ప్రాణులనైననూ హింసించరాదు. హింసను బోధించు ఇతర శ్రుతివాక్యములు ప్రమాణము కావు (31).

అగ్నిష్టోమీయమితి యా భ్రామికా సాఽ సతామిహ ।
న సా ప్రమాణం జ్ఞాతౄణాం పశ్వాలంభనకారికా ॥
వృక్షాంశ్ఛిత్త్వా పశూన్ హత్వా కృత్వా రుధిర కర్దమమ్ ।
దగ్ధ్వ వహ్నౌ తిలా జ్యాది చిత్రం స్వర్గోఽ భిలష్యతే ॥
ఇత్యేవం స్వమతం ప్రోచ్య యతిస్త్రిపుర నాయకమ్ ।
శ్రావయిత్వాఖిలాన్ పౌరానువాచ పునరాదరాత్ ॥
దృష్టార్థ ప్రత్యయకరాన్ దేహసౌఖ్యైక సాధకాన్ ।
బౌద్ధాగమ వినిర్దిష్టాన్ ధర్మాన్ వేదపరాంస్తతః ॥

ఈ లోకములో దుష్టులు ఆచరించే అగ్నిష్టోమాది యజ్ఞములు భ్రమ పూర్ణములు. పశువుల హింసతో కూడియున్న ఆ యజ్ఞములను విద్వాంసులు ప్రమాణముగా అంగీకరించరు (32). చెట్లను నరకి, పశువులను సంహరించి, రక్తమును చిందించి, అగ్నిలో, తిలలు, నేయి మొదలగు వస్తువులను దహించి వీరు స్వర్గమును పొందగోరుచున్నారు. ఇది విచిత్రము (33). ఆ యతి త్రిపురాధీశునకు, పౌరులందరికీ ఈ విధముగా తన మతమును చెప్పి వినిపించి మరల ఆదరముతో నిట్లనెను (34). ప్రత్యక్షముగా కనబడు వాటిని మాత్రమే విశ్వసించునవి, దేహసౌఖ్యమును సాధించుట ప్రముఖ లక్ష్యముగా గలవి అగు బౌద్ధాగమములోని ధర్మములు వేదము కంటే గొప్పవి (35).

ఆనందం బ్రహ్మణో రూపం శ్రుత్యైవం యన్ని గద్యతే ।
తత్తథైవేహ మంతవ్యం మిథ్యా నానాత్వకల్పనా ॥
యావత్ స్వస్థమిదం వర్ష్మ యావన్నేంద్రియవిక్లబః ।
యావజ్జరా చ దూరే ఽస్తి తావత్సౌఖ్యం ప్రసాధయేత్ ॥
అస్వాస్థ్యేంద్రియవైకల్యే వార్ధకే తు కుతస్సుఖమ్ ।
శరీరమపి దాతవ్యమర్థిభ్యోఽ తస్సు ఖేప్సుభిః ॥
యాచమాన మనోవృత్తి ప్రీణనే యస్య నో జనిః ।
తేన భూర్భారవత్యేషా సముద్రాగద్రుమైర్న హి ॥

బ్రహ్మ యొక్క స్వరూపము ఆనందమని వేదము చెప్పుచున్నది. అది సత్యము. కాని ఆ ఆనందము ఈ లోకములో మాత్రమే పొందదగినది అని తెలియదగును. ఈ లోకములోని నానాత్వము మిథ్య, కల్పితము (36). ఈ దేహము ఆరోగ్యముగా నున్నంతవరకు, ఇంద్రియములు నీరసములు కానంతవరకు మరియు ముసలిదనము మీద బడనంతవరకు సుఖములననుభవించవలెను (37). దేహములో ఆరోగ్యము లేని, ఇంద్రియములలో శక్తి లేని ముసలి దనములో సుఖమెక్కడది? కావున సుఖమును గోరు మానవులు యాచకులకు తమ దేహమునైననూ దానము చేయవలెను (38). యాచకుల మనస్సులకు

ఆనందమును కలిగించని మానవుడు పుట్టుట వలన భూమికి భారము పెరుగుచున్నది. సముద్రములు, పర్వతములు, వృక్షములు భూమికి భారము కావు (39).

సత్వరం గత్వరో దేహ సంచయాస్సు పరిక్షయాః ।
ఇతి విజ్ఞాయ విజ్ఞాతా దేహ సౌఖ్యం ప్రసాధయేత్ ॥
శ్వవాయస కృమీణాం చ ప్రాతర్భోజ్యమిదం వపుః ।
భస్మాంతం తచ్ఛరీరం చ వేదే సత్యం ప్రపశ్యతే ॥
ముధా జాతివికల్పోఽ యం లోకేషు పరికల్ప్యతే ।
మానుష్యే సతి సామాన్యే కోఽ ధమః కోఽథ చోత్తమః ॥
బ్రహ్మాది సృష్టి రేషేతి ప్రోచ్యతే వృద్ధపూరుషైః ।
తస్య జాతౌ సుతౌ దక్ష మరీచీ చేతి విశ్రుతౌ ॥

దేహము కొద్దికాలములో పడిపోవును. సంపాదించిన ధనము శాశ్వతము కాదు. బుద్ధి మంతుడు ఈ సత్యము నెరింగి దేహసౌఖ్యమును సంపాదించుకొనవలెను (40). కుక్కలు, కాకులు, క్రిములు ఈ శరీరమును చల్ది అన్నముగా చేసుకొని భుజించును. ఈ శరీరము అంతములో బూడిద యగునను వేదవాక్కు సత్యము (41). మానవులలో వీరు వ్యర్థముగా జాతి భేదమును కల్పించు చున్నారు. అందరిలో మానవత్వము సమానమై యుండగా, అధముడెవరు? ఉత్తముడెవరు? (42) ఈ సృష్టిని బ్రహ్మ రచించినాడని వృద్ధులు చెప్పెదరు. మరియు, ఆ బ్రహ్మ గారికి దక్షుడు, మరీచి అను ఇద్దరు కుమారులు గలరని పురాణ ప్రసిద్ధి గలదు (43).

మారీచేన కశ్యపేన దక్ష కన్యా స్సులోచనాః ।
ధర్మేణ కిల మార్గేణ పరిణీతాస్త్ర యోదశ ॥
అభీదానీంతనైర్మర్త్యై రల్పబుద్ధిపరాక్రమైః ।
అపి గమ్యస్యగమ్యోఽయం విచారః క్రియతే ముధా ॥
ముఖబాహూరు సంజాతం చాతుర్వర్ణ్యం సహోదితమ్ ।
కల్పనేయం కృతా పూర్వైర్న ఘటేత విచారతః ॥
ఏకస్యాం చ తనౌ జాతా ఏకస్మాద్యది వా క్వచిత్ ।
చత్వారస్తనయాస్తత్కం భిన్నవర్ణత్వమాప్నుయుః ॥

మరీచుని కుమారుడగు కశ్యపుడు దక్షుని కుమార్తెలగు పదముగ్గురు సుందరీ మణులను ధర్మమార్గములో వివాహమాడినాడు (44). కాని అల్పమగు బుద్ధి, అల్పమగు పరాక్రమము గల ఈనాటి మనుష్యులు 'వీనితో సంభోగించరాదు; వీనితో సంభోగించవచ్చును' అంటూ వ్యర్థమగు చర్చలను చేయుచున్నారు (45). బ్రహ్మగారి ముఖము, బాహువులు, ఊరువులు, పాదములనుండి క్రమముగా నాలుగు వర్ణములు జన్మించినవి అను కల్పనను పూర్వీకులు చేసి యుండిరి. ఈ కల్పన విచారము చేసినచో నిలబడదు (46). ఒకే భార్యా భర్తలకు నల్గురు

కుమారులు పుట్టినచో, ఒకే దేహమునుండి పుట్టిన ఆ నల్గురు వేర్వేరు వర్ణముల వారు అగుదురా యేమి? (47).

వర్ణా వర్ణ విభాగోఽ యం తస్మాన్న ప్రతి భాసతే ।
అతో భేదో న మంతవ్యో మానుష్యే కేన చిత్ క్వచిత్ ॥

ఈ వర్ణ విభాగము యుక్తి యుక్తముగా ఉన్నట్లు కన్పట్టుట లేదు. కావున ఎక్కడైననూ మానవులందరూ సమానమే. వారిలో భేదమును భావన చేయరాదు (48). **సనత్కుమార ఉవాచ ।**

ఇత్థమా భాష్య దైత్యేశం పౌరాంశ్చ స యతిర్మునే ।
సశిష్యో వేద ధర్మాంశ్చ నాశయా మాస చాదరాత్ ॥
స్త్రీ ధర్మం ఖండయామాస పాతివ్రత్య పరం మహత్ ।
జితేంద్రియత్వం సర్వేషాం పురుషాణాం తథైవ సః ॥
దేవధర్మాన్ విశేషేణ శ్రాద్ధ ధర్మాంస్తథైవ చ ।
మఖధర్మాన్ వ్రతాదీంశ్చ తీర్థ శ్రాద్ధం విశేషతః ॥
శివపూజాం విశేషేణ లింగారాధన పూర్వికామ్ ।
విష్ణు సూర్య గణేశాది పూజనం విధి పూర్వకమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ యతి రాక్షసరాజునకు, పౌరులకు ఇట్లు ప్రవచించి, శిష్యులచే వేదధర్మములను పట్టుదలతో నశింపజేసెను (49). స్త్రీలకు పరమ ధర్మమగు పాతివ్రత్యమును, పురుషులందరు పాటింపదగిన ఇంద్రియ జయమును ఆతడు ఖండించెను (50). ఆతడు దేవ (యజ్ఞాది) ధర్మములను, శ్రాద్ధ ధర్మములను, వ్రతములు మొదలగు వాటిని, ప్రత్యేకించి తీర్థములలో చేయు శ్రాద్ధములను ఖండించెను (51). లింగారాధన పూర్వకముగా చేయు శివపూజను ఆతడు ప్రత్యేకముగా ఖండించెను. యథావిధిగా చేయబడే విష్ణు సూర్య గణేశాది పూజలను ఆతడు ఖండించెను (52).

స్నానదానాదికం సర్వం పర్వకాలం విశేషతః ।
ఖండయామాస స యతిర్మాయీ మాయావినాం వరః ॥
కిం బహూక్తేన విప్రేంద్ర త్రిపురే తేన మాయినా ।
వేదధర్మాశ్చ యే కేచిత్తే సర్వే దూరతః కృతాః ॥
పతి ధర్మాశ్రయాస్సర్వా మోహితాస్త్రి పురాంగనాః ।
భర్తృ శుశ్రూషణవతీం విజహుర్మతి ముత్తమామ్ ॥
అభ్యస్యాకర్షణీం విద్యాం వశీకృత్యమయీ మపి ।
పురుషాస్సఫలీ చక్రుః పరదారేషు మోహితాః ॥

మాయావి, మాయావులలో అగ్రేసురుడు అగు ఆ యతి స్నానదానాదులను, విశేషించి పర్వకాలములో చేయు స్నానదానాదులను ఖండించెను (53). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! ఇన్ని మాటలేల? ఆ మాయావి త్రిపురములలో గల వేద ధర్మములన్నియూ దూరమగునట్లు చేసెను (54). పాతివ్రత్య ధర్మము ప్రధానముగా గల త్రిపురస్త్రీలు అందరు మోహితలై భర్తను శుశ్రూష చేయవలెననే ఉత్తమ బుద్ధిని విడనాడిరి (55). పురుషులు స్త్రీలను ఆకర్షించి వశము చేసుకొనే విద్యను నేర్చి మాయామోహితులై పరస్త్రీలయందు ఆ విద్యను సఫలమొనర్చిరి (56).

అంతః పురచరా నార్యస్తథా రాజకుమారకాః ।

పౌరాః పురాంగనాశ్చాపి సర్వే తైశ్చ విమోహితాః ॥

ఏవం పౌరేషు సర్వేషు నిజధర్మేషు సర్వథా ।

పరాఙ్ముఖేషు జాతేషు ప్రోల్లలాస వృషేతరః ॥

మాయా చ దేవ దేవస్య విష్ణోస్తస్యాజ్ఞయా ప్రభోః ।

అలక్ష్మీశ్చ స్వయం తస్య నియోగాత్త్రిపురం గతా ॥

యా లక్ష్మీ స్తపసా తేషాం లబ్ధా దేవేశ్వరాదరాత్ ।

బహిర్గతా పరిత్యజ్య నియోగా ద్బృహ్మణః ప్రభోః ॥

అంతః పురస్త్రీలు, రాజకుమారులు, పౌరులు మరియు పురస్త్రీ లు అందరు వాని శిష్యులచే మోహింప చేయబడిరి (57). ఇట్లు పౌరులందరు అన్ని విధములా స్వధర్మ విముఖులు కాగా అధర్మము తాండవించెను (58). దేవదేవుడగు విష్ణు ప్రభుని ఆజ్ఞచే మాయ, మరియు అలక్ష్మి స్వయముగా త్రిపురములకు వెళ్లిరి (59). దేవతలకు ప్రభువగు బ్రహ్మ తపస్సునకు మెచ్చి ఏ లక్ష్మిని వారికి ఇచ్చినాడో, ఆ లక్ష్మి బ్రహ్మ గారి ఆజ్ఞచే వారిని విడిచి దూరముగా వెళ్లిపోయెను (60).

బుద్ధి మోహం తథా భూతం విష్ణోర్మాయా వినిర్మితమ్ ।
తేషాం దత్త్వా క్షణాదేవ కృతార్థోఽ భూత్స నారదః ॥
నారదోఽపి తథారూపో యథా మాయీ తథైవ సః ।
తథాపి వికృతో నాభూత్పరమేశాదను గ్రహాత్ ॥
ఆసీత్కుంఠిత సామర్థ్యో దైత్యరాజోఽపి భో మునే ।
భ్రాతృభ్యాం సహితస్తత్ర మయేన చ శివేచ్ఛయా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధ ఖండే త్రిపుర మోహనం నామ పంచమోఽధ్యాయః ॥

ఆ నారదుడు విష్ణువు యొక్క మాయచే నిర్మితమైన అట్టి బుద్ధి వ్యామోహమును వారికి క్షణకాలములో కలిగించి కృతార్థుడాయెను (61). ఆ మాయావియగు యతి ఏ రూపములో నుండెనో, నారదుడు కూడ అదే రూపములో నుండెను. అయిననూ పరమేశ్వరుని అనుగ్రహముచే ఆయన బుద్ధిలో ఎట్టి వికారములు కలుగలేదు (62). ఓ మహర్షీ! అచట సోదరులిద్దరితో మరియు మయునితో కూడి యున్న ఆ రాక్షసరాజు యొక్క సామర్థ్యము శివుని సంకల్పముచే మొక్క వోయెను (63).

శ్రీ శివమహాపురాణములో రుద్రసంహితయందు యుద్ధ ఖండములో త్రిపురమోహనమనే అయిదవ అధ్యాయము ముగిసినది (5).

6 - శివస్తుతి

వ్యాస ఉవాచ ।

తస్మిన్ దైత్యాధిపే పౌరే సభ్రాతరి విమోహితే ।
సనత్కుమార కిం హ్యాసీత్త దాచక్ష్వాఖిలం విభో ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమార ప్రభూ! రాక్షసరాజు, ఆతని సోదరులు, మరియు పౌరులు ఇట్లు మోహములో పడగా, తరువాత ఏమాయెను? ఆ విషయము నంతనూ చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

త్రిపురే చ తథా భూతే దైత్యే త్యక్త శివార్చనే ।
స్త్రీ ధర్మే నిఖిలే నష్టే దురాచారే వ్యవస్థితే ॥
కృతార్థ ఇవ లక్ష్మీశో దేవై స్సార్ధ ముమాపతిమ్ ।
నివేదితుం తచ్చరిత్రం కైలాసమగమద్ధరిః ॥
తస్యోపకంఠం స్థిత్వాసౌ దేవైస్సహ రమాపతిః ।
తతో భూరి స చ బ్రహ్మా పరమేణ సమాధినా ॥
మనసా ప్రాప్య సర్వజ్ఞం బ్రహ్మణా స హరిస్తదా ।
తుష్టావ వాగ్భి రిష్టాభి శ్శంకరం పురుషోత్తమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

త్రిపురములు అట్లు భ్రష్టమైనవి. త్రిపురాసురులు శివార్చనను విడనాడిరి. స్త్రీ ధర్మ మంతయు నాశనమయ్యెను. దురాచారము స్థిరపడెను (2). లక్ష్మీపతి యగు విష్ణువు ఇట్లు కృతార్థుడై ఆ వృత్తాంతమును శివునకు నివేదించుటకు దేవతలతో గూడి కైలాసమునకు వెళ్లెను (3). లక్ష్మీపతియగు విష్ణువు దేవతలతో గూడి కైలాసమునకు సమీపములో నుండి పరమ సమాధిలోనికి వెళ్లెను. బ్రహ్మ కూడ అటులనే చేసెను (4). అపుడు పురుషోత్తముడగు విష్ణువు, మరియు బ్రహ్మ సమాధిలో మనస్సుతో సర్వజ్ఞుడగు శంకరుని దర్శించి అభీష్టములగు వచనములతో స్తుతించిరి (5).

విష్ణురువాచ ।

మహేశ్వరాయ దేవాయ నమస్తే పరమాత్మనే ।
నారాయణాయ రుద్రాయ బ్రహ్మణే బ్రహ్మరూపిణే ॥
ఏవం కృత్వా మహాదేవం దండవత్ ప్రణిపత్య హ ।
జజాప రుద్ర మంత్రం చ దక్షిణా మూర్తి సంభవమ్ ॥
జలే స్థిత్వా సార్ధ కోటి ప్రమితం తన్మనాః ప్రభుః ।
సంస్మరన్ మనసా శంభుం స్వప్రభుం పరమేశ్వరమ్ ॥
తావద్దేవాస్తదా సర్వే తన్మనస్కా మహేశ్వరమ్ ॥

విష్ణువు ఇట్లు పలికెను –

పరమాత్మ, బ్రహ్మ విష్ణు రుద్రులను రూపములను దాల్చినవాడు, మహేశ్వరుడు, ప్రకాశ స్వరూపుడు అగు నీకు నమస్కారము (6). ఇట్లు స్తుతించి మహాదేవునకు సాష్టాంగ ప్రణామము నాచరించి, దక్షిణామూర్తి ఋషిగా గల రుద్రమంత్రమును జపించెను (7). ఆ విష్ణు ప్రభుడు నీటిలో నిలబడి మనస్సును తన ప్రభువు, పరమేశ్వరుడు అగు శంభునిపై నిలిపి ఆయనను స్మరిస్తూ ఒకటిన్నర కోట్ల జపమును చేసెను (8). అంతవరకు ఆ దేవతలందరు మహేశ్వరుని మనస్సులో నిలిపి ధ్యానించిరి (9).

దేవా ఊచుః ।

నమస్సర్వాత్మనే తుభ్యం శంకరాయార్తి హారిణే ।
రుద్రాయ నీలకంఠాయ చిద్రూపాయ ప్రచేతసే ॥
గతిర్నస్సర్వదా త్వం హి సర్వాపద్వినివారకః ।
త్వమేవ సర్వదాస్మాభిర్వేద్యో దేవారి సూదన ॥
త్వమాదిస్త్వమనాదిశ్చ స్వానందశ్చాక్షయః ప్రభుః ।
ప్రకృతేః పురుషస్యాపి సాక్షాత్స్రష్టా జగత్ప్రభుః ॥
త్వమేవ జగతాం కర్తా భర్తా హర్తా త్వమేవ హి ।
బ్రహ్మా విష్ణుర్హరో భూత్వా రజస్సత్త్వతమోగుణైః ॥

దేవతలిట్లు పలికిరి –

సర్వాత్మకుడు, మంగళకరుడు, కష్టములను పారద్రోలువాడు, నీలకంఠుడు, చైతన్య స్వరూపుడు, జ్ఞానఘనుడు అగు నీకు నమస్కారము (10). ఆపదలనన్నిటినీ నివారించే నీవే మాకు సర్వకాలములలో శరణు అగుచున్నావు. దేవశత్రువులను సంహరించు వాడా! సర్వకాలములలో మాచే తెలియదగిన వాడవు నీవే (11). నీవు సర్వకారణుడవు. నీకు కారణము లేదు. నీవు ఆనందఘనుడవు, వినాశములేని ప్రభుడవు. ప్రకృతి పురుషులనిద్దరినీ సృష్టించిన జగదీశ్వరుడవు నీవే (12). రజస్సత్త్వ తమోగుణములను స్వీకరించి క్రమముగా బ్రహ్మ విష్ణు

రుద్రరూపములను దాల్చి జగత్తులను సృష్టించి పాలించి సంహరించు వాడవు నీవే (13).

తారకోఽసి జగత్యస్మిన్ సర్వేషామధిపోఽవ్యయః ।
వరదో వాఙ్మయో వాచ్యో వాచ్య వాచక వర్జితః ॥
యాచ్యో ముక్త్యర్థ మీశానో యోగిభిర్యోగ విత్తమైః ।
హృత్పుండరీకవివరే యోగినాం త్వం హి సంస్థితః ॥
వదంతి వేదాస్త్వాం సంతః పరబ్రహ్మ స్వరూపిణమ్ ।
భవంతం తత్త్వ మిత్యద్య తేజోరాశిం పరాత్పరమ్ ॥
పరమాత్మానమిత్యాహురస్మిన్ జగతి యద్విభో ।
త్వమేవ శర్వ సర్వాత్మన్ త్రిలోకాధిపతే భవ ॥

ఈ లోకములో రక్షకుడవు, సర్వేశ్వరుడవు, నాశము లేనివాడవు, వరముల నిచ్చువాడవు, శబ్దస్వరూపుడవు, శబ్దప్రమాణముచే నిరూపింపబడెడివాడవు, వాచ్యవాచక భావమునకు అతీతుడవు నీవే (14). యోగవిశారదులగు యోగులు ముక్తి కొరకు ఈశానుడవగు నిన్ను ప్రార్థించెదరు. నీవు యోగుల హృదయపుండరీకమునందలి ఆకాశములో స్థిరముగా నుండెదవు (15). పరబ్రహ్మ స్వరూపుడు, తేజోనిధి, ప్రకృతి కంటె పరుడు అగు నిన్ను పవిత్రములగు వేదములు తత్త్వమసి ఇత్యాది మహా వాక్యములతో ప్రతిపాదించు చున్నవి (16). హే విభో! ఈ జగత్తులోని సర్వము నీవే. పరమాత్ముడవు నీవేనని ఋషులు చెప్పెదరు. హే శర్వా! భవా! సర్వము నీ స్వరూపమే. ముల్లోకములకు ప్రభువు నీవే (17).

దృష్టం శ్రుతం స్తుతం సర్వం జ్ఞాయమానం జగద్గురో ।
అణోరల్పతరం ప్రాహుర్మహతోఽపి మహత్తరమ్ ॥
సర్వతః పాణి పాదాంతం సర్వతోఽక్షి శిరోముఖమ్ ।
సర్వతశ్శ్రవణ ఘ్రాణం త్వాం నమామి చ సర్వతః ॥
సర్వజ్ఞం సర్వతో వ్యాపిన్ సర్వేశ్వరమనావృతమ్ ।
విశ్వరూపం విరూపాక్షం త్వాం నమామి చ సర్వతః ॥
సర్వేశ్వరం భవాధ్యక్షం సత్యం శివమనుత్తమమ్ ।
కోటి భాస్కర సంకాశం త్వాం నమామి చ సర్వతః ॥

ఓ జగద్గురూ! చూడబడే, వినబడే, తెలియబడే సర్వము నీవే. నీవు అణువు కంటె సూక్ష్మ తరుడవు. మిక్కిలి పెద్ద దానికంటే పెద్దవాడవు అని ఋషులు చెప్పుచున్నారు (18). సర్వత్రా నీ చేతులు, కాళ్లు, కళ్లు, శిరస్సులు, ముఖములు, చెవులు, ముక్కులు గలవు. సర్వాత్మకుడవగు నీకు నమస్కారము (19). ఓ సర్వవ్యాపీ! సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, మాయావరణము లేనివాడు, జగద్రూపుడు, ముక్కంటి అగు నిన్ను అన్ని దిక్కుల యందు నమస్కరించు చున్నాను (20). సర్వేశ్వరుడు,

జగదధ్యక్షుడు, సత్యస్వరూపుడు, మంగళ స్వరూపుడు, సర్వోత్కృష్టుడు, కోటి సూర్యుల కాంతి గలవాడు అగు నీకు సర్వదిక్కుల యందు నమస్కరించు చున్నాను (21).

విశ్వ దేవ మనాద్యంతం షడ్వింశత్క మనీశ్వరమ్ ।

ప్రవర్తకం చ సర్వేషాం త్వాం నమామి చ సర్వతః ॥

ప్రవర్తకం చ ప్రకృతేస్సర్వస్య ప్రపితామహమ్ ।

సర్వ విగ్రహమీశం హి త్వాం నమామి చ సర్వతః ॥

ఏవం వదంతి వరదం సర్వావాసం స్వయం భువమ్ ।

శ్రుతయశ్శ్రుతి సారజ్ఞం శ్రుతిసారవిదశ్చ యే ॥

జగత్తునకు ప్రభువు, ఆద్యంతములు లేనివాడు, ఇరువదియారు తత్త్వములను ప్రవర్తిల్లజేయువాడు, తనకంటె పైన ప్రభువు లేనివాడు, సర్వప్రాణులను ప్రవర్తిల్ల జేయువాడు అగు నిన్ను అన్ని వైపుల నుండియూ నమస్కరించు చున్నాను (22). ప్రకృతికి చైతన్యము నిచ్చి అనుగ్రహించు వాడు, సర్వజగత్తును సృష్టించిన బ్రహ్మకు తండ్రి, సర్వదేవతా స్వరూపుడు, ఈశ్వరుడు అగు నిన్ను అన్ని విధములుగా నమస్కరించు చున్నాను (23). వేదములు, వేదవేత్తలు నిన్ను వరముల నిచ్చువాడనియు, సర్వులకు అధిష్ఠానమనియు, స్వయంసిద్ధుడవనియు వర్ణించుచున్నారు (24).

అదృశ్య మస్మాభిరనేక భూతం త్వయా కృతం యద్భవతాథ లోకే ।

త్వామేవ దేవాసుర భూసురాశ్చ అన్యే చ వై స్థావరజంగమాశ్చ ॥

పాహ్యనన్య గతీన్ శంభో సురాన్నో దేవవల్లభ ।

నష్టప్రాయాంస్త్రి పురతో వినిహత్యాసురాన్ క్షణాత్ ॥

మాయయా మోహితాస్తేఽ ద్య భవతః పరమేశ్వర ।

విష్ణునా ప్రోక్త యుక్త్యా త ఉజ్ఝితా ధర్మతః ప్రభో ॥

నీవు ఈ లోకములో సృష్టించిన వివిధ ప్రాణి సమూహములను మేము పూర్తిగా చూడజాలము. దేవతలు, రాక్షసులు, బ్రాహ్మణులు, మరియు ఇతర చరాచర ప్రాణులు నిన్నే శరణు జొచ్చు చున్నారు (25). ఓ దేవ దేవా! శంభో! మాకు నీవు తక్క మరియొక గతి లేదు. త్రిపురాసురులు దేవతలను ఇంచుమించు నశించిన వారినిగా చేసినారు. నీవు క్షణములో ఆ రాక్షసులను సంహరించి మమ్ములను కాపాడుము (26). ఓ పరమేశ్వరా! వారీనాడు నీ మాయచే మోహమును పొంది యున్నారు. ఓ ప్రభూ! విష్ణువు చెప్పిన ఉపాయముచే వారు ధర్మ భ్రష్టులై ఉన్నారు (27).

సంత్యక్త సర్వధర్మాశ్చ బౌద్ధాగమ సమాశ్రితాః ।

అస్మద్భాగ్యవశాజ్జాతా దైత్యాస్తే భక్తవత్సల ॥

సదా త్వం కార్యకర్తా హి దేవానాం శరణ ప్రద ।

వయం తే శరణాపన్నా యథేచ్ఛసి తథా కురు ॥

ఓ భక్త ప్రియా! మా భాగ్యవశముచే ఆ రాక్షసులు సర్వధర్మములను విడనాడి బౌద్ధధర్మమునాశ్రయించి ఉన్నారు (28). శరణు నిచ్చువాడా! నీవు సర్వదా దేవకార్యములను చేయుచుంటివి. మేము నిన్ను శరణు జొచ్చితిమి. నీకు నచ్చిన రీతిని చేయుము

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుత్వా మహేశానం దేవాస్తు పురతస్స్థితాః ।

కృతాంజలిపుటా దీనా ఆసన్ సన్నతమూర్తయః ॥

స్తుతశ్చైవం సురేంద్రాద్యైర్విష్ణోర్జాప్యేన చేశ్వరః ।

అగచ్ఛత్తత్ర సర్వేశో వృషమారుహ్య హర్షితః ॥

విష్ణుమాలింగ్య నందీశాదవరుహ్య ప్రసన్నధీః ।

దదర్శ సుదృశా తత్ర నందీదత్త కరోఽఖిలాన్ ॥

అథ దేవాన్ సమాలోక్య కృపాదృష్ట్యా హరిం హరః ।

ప్రాహ గంభీరయా వాచా ప్రసన్నః పార్వతీపతిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవతలు దీనులై తలలు వంచి చేతులు జోడించి ఈ విధముగా మహేశ్వరుని స్తుతుతించి ఆయన యెదుట నిలబడిరి (30). ఇంద్రుడు మొదలగు దేవతలు ఇట్లు స్తుతించగా, మరియు విష్ణువు చేసిన జపము చేత ఆనందించిన సర్వేశ్వరుడగు శివుడు వృషభము నధిష్ఠించి అచటకు విచ్చేసెను (31). ప్రసన్నమగు మనస్సు గల శివుడు వృషభము (నంది) నుండి దిగి విష్ణువును కౌగిలించు కొని నందిపై చేతిని ఉంచి దయతో కూడిన చూపులతో అందరినీ చూచెను (32). పార్వతీపతి యగు హరుడు దయా దృష్టితో దేవతలను, విష్ణువును చూచి, ప్రసన్నుడై గంభీరమగు వాక్కుతో ఇట్లనెను (33).

శివ ఉవాచ ।

జ్ఞాతం మయేదమధునా దేవకార్యం సురేశ్వర ।
విష్ణోర్మాయాబలం చైవ నారదస్య చ ధీమతః ॥
తేషామధర్మనిష్ఠానాం దైత్యానాం దేవసత్తమ ।
పురత్రయవినాశం చ కరిష్యేఽహం న సంశయః ॥
పరం తు తే మహాదైత్యా మద్భక్తా దృఢమానసాః ।
అథ వధ్యా మయైవ స్యుర్వ్యాజ త్యక్త వృషోత్తమాః ॥
విష్ణుర్హన్యాత్పరో వాథ యత్త్వాజిత వృషాః కృతాః ।
దైత్యా మద్భక్తి రహితాస్సర్వే త్రిపురవాసినః ॥

శివుడు ఇట్లు పలికెను -

ఓ ఇంద్రా! ఈ దేవకార్యమును గురించి నేను ఎరుంగుదును. విష్ణువు యొక్క మాయా శక్తి మరియు బుద్ధిమంతుడగు నారదుని చాతుర్యము నాకు తెలిసినవియే (34). ఓ దేవ శ్రేష్ఠా! అధర్మ నిష్ఠులగు ఆ రాక్షసుల త్రిపురములను నేను నిస్సందేహముగా నశింపజేసెదను (35). కాని ఆ రాక్షసోత్తములు నా భక్తులు, దృఢమగు మనశ్శక్తి గల వారు. కాని వారు మీమోసముచే ఉత్తమమగు ధర్మమును విడనాడినారు. వారిని నేను మాత్రమే సంహరించవలెను (36). కాని వారు ధర్మ మార్గమును విడనాడునట్లు చేయబడినారు. ఇపుడు త్రిపురముల యందు నివసించు రాక్షసులందరు నా భక్తికి దూరమైనారు. కావున వారిని విష్ణువు గాని, మరియొకరు. గాని సంహరించవచ్చును (37).

ఇతి శంభోస్తు వచనం శ్రుత్వా సర్వే దివౌకసః ।
విమనస్కా బభూవుస్తే హరిశ్చాపి మునీశ్వర ॥
దేవాన్ విష్ణు ముదాసీనాన్ దృష్ట్వా చ భవకృద్విధిః ।
కృతాంజలిపుటశ్శంభుం బ్రహ్మా వచన మబ్రవీత్ ॥

ఓ మహర్షీ! శంభుని ఈ మాటను విని సమస్త దేవతలు మరియు విష్ణువు కూడా నిరుత్సాహమును పొందిరి (38). దేవతలు మరియు విష్ణువు నిరుత్సాహముగా నుండుటను గాంచి, సృష్టి కర్త యగు బ్రహ్మ చేతులు జోడించి శంభునితో నిట్లు పలికెను (39).

బ్రహ్మోవాచ ।

న కించిద్విద్యతే పాపం యస్మాత్త్వం యోగవిత్తమః ।
పరమేశః పరబ్రహ్మా సదా దేవర్షి రక్షకః ॥
తవైవ శాసనాత్తే వై మోహితాః ప్రేరకో భవాన్ ।
త్యక్త స్వధర్మత్వత్పూజాః పరవధ్యాస్తథాపి న ॥
అతస్త్వయా మహాదేవ సురర్షి ప్రాణ రక్షక ।
సాధూనాం రక్షణార్థాయ హంతవ్యా మ్లేచ్ఛ జాతయః ॥
రాజ్ఞస్తస్య న తత్పాపం విద్యతే ధర్మతస్తవ ।
తస్మా ద్రక్షేద్ద్విజాన్ సాధూన్ కంటకాద్యై విశోధయేత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దీనిలో మేము చేసిన పాపము ఏదీ లేదు. ఏమనగా, నీవు యోగులలో శ్రేష్ఠుడవు, పరమేశ్వరుడవు, పరబ్రహ్మవు. నీవు దేవతలను, ఋషులను సర్వకాలములలో రక్షించెదవు (40). నీ ఆజ్ఞచేతనే వారు మోహమును పొందునట్లు చేయబడెను. ప్రేరకుడవు నీవే. వారు స్వధర్మమును విడనాడి నీ పూజను మానివేసిరి. అయిననూ వారికి ఇతరుల చేతిలో మరణము లేదు (41). ఓ మహాదేవా! నీవు దేవతల మరియు ఋషుల ప్రాణులను రక్షించువాడవు. కావున సత్పురుషుల రక్షణ కొరకై ఈ మ్లేచ్ఛ జాతులను సంహరించుము (42). నీ ధర్మమును పాటించు రాజులకు దుష్టశిక్షణ వలన పాపము కలుగదు. కావున, రాజు లోకకంటకులను సంహరించి బ్రాహ్మణులను, సాధువులను రక్షించవలెను (43).

ఏవ మిచ్ఛేదిహాన్యత్ర రాజా చేద్రాజ్యమాత్మనః ।
ప్రభుత్వం సర్వలోకానాం తస్మాద్రక్షస్వ మా చిరమ్ ॥
మునీంద్రేశాస్తథా యజ్ఞా వేదాశ్శాస్త్రాదయోఽ ఖిలాః ।
ప్రజాస్తే దేవ దేవేశ హ్యయం విష్ణురపి ధ్రువమ్ ॥
దేవతా సార్వభౌమస్త్వం సమ్రాట్ సర్వేశ్వరః ప్రభో ।
పరివారస్తవైవైష హర్యాది సకలం జగత్ ॥

ఇహలోకములో రాజ్యమును, పరలోక సుఖములను గోరు రాజు సాధు రక్షణను చేయవలెను. లోకములన్నింటికీ రాజువు నీవు గనుక, శీఘ్రమే రక్షింపుము (44). ఓ దేవ దేవా! ఈశ్వరా! మహర్షులు, ఇంద్రుడు, దిక్పాలకులు, యజ్ఞములు, వేదములు, శాస్త్రములు మొదలగునవి, మరియు సమస్త దేవతలు నీ రాజ్యములోని పౌరులు అగుదురు. విష్ణువు కూడా వారిలో ఒకడు. ఇది నిశ్చయము (45). ఓ ప్రభూ! నీవు దేవతలకు సార్వభౌముడవు. సమ్రాట్టు నీవే. నీవు సర్వేశ్వరుడవు. విష్ణువుతో సహా ఈ జగత్తు అంతయూ నీపరి వారమే గదా! (46)

యువరాజో హరిస్తేఽజ బ్రహ్మాహం తే పురోహితః ।
రాజ కార్యకరశ్శక్ర స్త్వదాజ్ఞా పరిపాలకః ॥
దేవా అన్యేపి సర్వేశ తవ శాసనయంత్రితాః ।
స్వస్వకార్యకరా నిత్యం సత్యం సత్యం న సంశయః ॥

పుట్టుక లేనివాడా! విష్ణువు నీకు యువరాజు. బ్రహ్మనగు నేను నీకు పురోహితుడను. నీ ఆజ్ఞను పాలించే ఇంద్రుడు నీకు రాజకార్యములను చక్కబెట్టు మంత్రి వంటివాడు (47). సర్వమును పాలించు వాడా! నీ శాసనముచే నియంత్రింపబడే ఇతర దేవతలు కూడా నిత్యము తమ తమ కర్తవ్యముల ననుష్ఠించెదరు. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (48).

సనత్కుమార ఉవాచ ।

ఏత చ్ఛృత్వా వచస్తస్య బ్రహ్మణః పరమేశ్వరః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా శంకరస్సురపో విధిమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బ్రహ్మ యొక్క ఈ మాటను విని పరమేశ్వరుడు, దేవతలను రక్షించు వాడునగు శంకరుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై బ్రహ్మకు ఇట్లు బదులిడెను (49).

శివ ఉవాచ ।

హే బ్రహ్మన్ యద్యహం దేవరాజస్సమ్రాట్ ప్రకీర్తితః ।
తత్ప్రకారో న మే కశ్చి ద్గృహ్ణీయాం యమిహ ప్రభుః ॥
రథో నాస్తి మహా దివ్యస్తాదృక్ సారథినా సహ ।
ధనుర్బాణాధికం చాపి సంగ్రామే జయకారకమ్ ॥
యమాస్థాయ ధనుర్బాణాన్ గృహీత్వా యోజ్య వై మనః ।
నిహనిష్యామ్యహం దైత్యాన్ ప్రబలానపి సంగరే ॥

శివుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! నేను దేవతలకు ప్రభువునని, సమ్రాట్టుని నీచే కీర్తింపబడితిని. సరే. ఆ రాక్షసులను సంహరించే సామగ్రి ఏదియూ నా వద్ద లేదు. నేను సమర్థుడనే. కాని ఏ సాధనములను నేను స్వీకరించవలెను? (50) సారథితో కూడిన మహాదివ్యమగు రథము లేదు. యుద్ధములో జయమును కలిగించే ధనస్సు, బాణములు మొదలగు సాధనములైననూ లేవు (51). నేను ఏ ధనుర్బాణములను చేపట్టదగును? నేను మనస్సును లగ్నము చేసి ధనుర్బాణములను చేపట్టి యుద్ధములో మహాబలశాలురగు రాక్షసులనైననూ సంహరించగల్గుదును (52).

సనత్కుమార ఉవాచ ।

అద్య సబ్రహ్మకా దేవాస్సేంద్రోపేంద్రాః ప్రహర్షితాః ।
శ్రుత్వా ప్రభోస్తదా వాక్యం నత్వా ప్రోచుర్మహేశ్వరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు మరియు ఇతర దేవతలు ప్రభుని ఆ వాక్యమును విని మిక్కిలి ఆనందించిరి. వారు మహేశ్వరునకు నమస్కరించి ఇట్లు పలికిరి (53).

దేవా ఊచుః ।

వయం భవామ దేవేశ తత్స్ర కారా మహేశ్వర ।
రథాదికా తవ స్వామిన్ సంనద్ధాస్సంగరాయ హి ॥
ఇత్యుక్త్వా సంహతాస్సర్వే శివేచ్ఛామధిగమ్య హ ।
పృథగూచుః ప్రసన్నాస్తే కృతాంజలి పుటాస్సురాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధ ఖండే శివస్తుతి వర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవ దేవా! మహేశ్వరా! స్వామీ! యుద్ధమునకు సంసిద్ధముగా నుండే రథాది సాధనములుగా మారి మేము నీకు తోడ్పడెదము (54). దేవతలందరు ఒకచో గూడి శివుని అభిలాషను అర్థము చేసుకొని ఆనందించిరి. వారు చేతులను జోడించి ప్రసన్నమగు మనస్సుతో పై విధముగా వేర్వేరుగా విన్నవించు కొనిరి (55).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండములో శివస్తుతి యను ఆరవ అధ్యాయము ముగిసినది (6).

7 – శివుడు అనుగ్రహించుట

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వా తు సర్వేషాం దేవాదీనాం వచో హరః ।
అంగీచకార సుప్రీత్యా శరణ్యో భక్తవత్సలః ॥
ఏతస్మిన్నంతరే దేవీ పుత్రాభ్యాం సంయుతా శివా ।
ఆజగామ మునే తత్ర యత్ర దేవాన్వితో హరః ॥
అథాగతాం శివాం దృష్ట్వా సర్వే విష్ణ్వాదయో ద్రుతమ్ ।
ప్రణేమురతిన నమ్రాస్తే విస్మితా గతసంభ్రమాః ॥
ప్రోచుర్జయేతి సద్వాక్యం మునే సర్వే సులక్షణమ్ ।
తూష్ణీమాసన్న జానంతస్తదా గమన కారణమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను --

శరణాగతవత్సలుడు, భక్తప్రియుడు అగు హరుడు దేవతలందరి ఈ మాటను విని పరమ ప్రీతితో అంగీకరించెను (1). ఓ మహర్షీ! ఇంతలో పార్వతీదేవి పుత్రులిద్దరితో గూడి, శివుడు దేవతలతో గూడియున్న స్థలమునకు విచ్చేసెను (2). అట్లు విచ్చేసిన పార్వతిని గాంచి విష్ణువు మొదలగు దేవతలందరు ఆశ్చర్యముతో తొట్రుపాటు పడిరి. వారు వెంటనే పరమవినయముతో ఆమెకు ప్రణమిల్లిరి (3). ఓ మహర్షీ! వారందరు 'జయమగు గాక!' అను శుభవాక్యమును చక్కగా పలికి మిన్నకుండిరి. ఆమె వచ్చుటకు గల కారణమును వారెరుంగరు (4).

అథ సర్వైస్స్తుతా దేవైర్దేవ్యద్భుత కుతూహలా ।
ఉవాచ స్వామినం ప్రీత్యా నానాలీలా విశారదమ్ ॥

అపుడు దేవతలందరిచే స్తోత్రము చేయబడిన ఆ దేవి అధికమగు కుతూహలము గలదై, అనేక లీలలను వెలయించుటలో నిపుణుడగు శివస్వామిని ఉద్దేశించి ప్రేమతో నిట్లు పలికెను (5).

దేవ్యువాచ ।

క్రీడమానం విభో పశ్య షణ్ముఖం రవిసన్నిభమ్ ।
పుత్రం పుత్రవతాం శ్రేష్ఠ భూషితం భూషణైర్వరైః ॥
ఇత్యేవం లోకమాత్రా చ వాగ్భి స్సంబోధితశ్శివః ।
న యయౌ తృప్తి మీశానః పిబన్ స్కందాననామృతమ్ ॥
న సస్మారాగతాన్ దైత్యాన్ని జతేజో నిపీడితాన్ ।
స్కందమాలింగ్య చాఘ్రాయ ముమోదాతి మహేశ్వరః ॥
జగదంబాథ తత్రైవ సంమంత్ర్య ప్రభుణా చ సా ।
స్థిత్వా కించిత్సముత్తస్థౌ నానాలీలావిశారదా ॥

దేవి ఇట్లు పలికెను -

పుత్రులు గల వారిలో శ్రేష్ఠుడవగు హే ప్రభో! సూర్యుని వలె ప్రకాశించుచువాడు, శ్రేష్ఠములగు ఆభరణములచే అలంకరింపబడిన వాడు అగు షణ్ముఖుని ఆటపాటలను పరికించుము. నీ కుమారుని గాంచుము (6). జగన్మాతచే ఇట్టి వచనములతో సంబోధింపబడిన వాడై, పరమేశ్వరుడగు శివుడు స్కందుని ముఖమును చిరకాలము చూచి ఆనందించెను. ఎంత చూచిననూ ఆయనకు. తనివి తీరలేదు (7). తనను ఆరాధించి పొందిన తేజస్సు గల రాక్షసులచే మిక్కిలి పీడింపబడి తనను శరణు జొచ్చిన దేవతల సంగతిని ఆయన విస్మరించెను. ఆ మహేశ్వరుడు స్కందుని కౌగిలించు కొని ముద్దాడి మిక్కిలి ఆనందించెను (8). అనేక లీలలను ప్రకటించుటలో నిపుణురాలగు ఆ జగన్మాత అపుడు శివునితో సంప్రదించి కొంత సమయము అచటనే ఉండి, తరువాత లేచి నిలబడెను (9).

తతస్స నందీ సహ షణ్ముఖేన తయా చ సార్ధం గిరిరాజపుత్ర్యా ।
వివేశ శంభుర్భవనం సులీలః సురైస్సమస్తై రభివంద్యమానః ॥
ద్వారస్య పార్శ్వతస్తస్థుర్దేవ దేవస్య ధీమతః ।
తేఽథ దేవా మహోవ్యగ్రా విమనస్కా మునేఽ ఖిలాః ॥
కిం కర్తవ్యం క్వ గంతవ్యం కస్స్యా దస్మత్సుఖ ప్రదః ।
కిం తు కిం త్వితి సంజాతం హా హతాస్స్మేతి వాదినామ్ ॥

అపుడు చక్కని లీలలను వెలయించు శంభుడు, దేవతలందరు నమస్కరించు చుండగా, నందీశ్వరుడు, షణ్ముఖుడు మరియు హిమవత్పుత్రి యగు ఆ జగన్మాతలతో గూడి భవనములోపలికి ప్రవేశించెను (10). ఓ మహర్షీ! అపుడు దేవతలందరు మనసు చెడి మిక్కిలి కంగారు పడినవారై, ధీమంతుడు, దేవదేవుడు అగు శివుని భవనము యొక్క సింహద్వారమునకు ప్రక్కన నిలబడి యుండిరి (11). ఏమి చేయవలెను? ఎచటకు పోవలెను? మనకు సుఖమును కలిగించు వారెవరు? ఏమైనది? ఏమైనది? అయ్యో! మనము హతులమైతిమి అని వారు పలుకుచుండిరి (12).

అన్యోన్యం ప్రేక్ష్య శక్రాద్యా బభూవు శ్చాతి విహ్వలాః ।
ప్రోచుర్వికల వాక్యం తే ధిక్కుర్వంతో నిజం విధిమ్ ॥
పాపా వయమిహేత్యన్యే హ్యా భాగ్యాశ్చేతి చాపరే ।
తే భాగ్యవంతో దైత్యేంద్రా ఇతి చాన్యేఽ బ్రువన్ సురాః ॥
తస్మిన్నేవాంతరే తేషాం శ్రుత్వా శబ్దానేకశః ।
కుంభోదరో మహాతేజా దండేనా తాడయత్సురాన్ ॥
దుద్రువుస్తే భయావిష్టా దేవా హా హేతి వాదినః ।
అపతన్మునయశ్చాన్యే విహ్వలత్వం బభూవ హ ॥

ఇంద్రాది దేవతలు ఒకరినొకరు చూచుకుంటూ చాల కంగారు పడిరి. వారు తమ విధిని నిందిస్తూ దుఃఖపూర్ణమగు వాక్యములను పలుకు చుండిరి (13). 'మనము పాపాత్ములము' అని కొందరు దేవతలు పలికిరి. మనము అభాగ్యులమని మరికొందరు పలికిరి. ఆ రాక్షసరాజులు భాగ్యవంతులని ఇంకొందరు దేవతలు పలుకుచుండిరి (14). ఇంతలో అనేక భంగుల శబ్దమును చేయుచున్న దేవతలను గాంచి వారి శబ్దమును విని కోపించిన మహాతేజస్వియగు కుంభోదరుడు వారిని దండముతో కొట్టెను(15). ఆ కొట్లాటలో దేవతలు హాహాకారమును చేస్తూ పరుగులు తీసిరి. మునులు క్రిందబడిరి. అంతటా గందర గోళము నెలకొనెను (16).

ఇంద్రస్తు వికలోఽ తీవ జానుభ్యా మవనీం గతః ।
అన్యే దేవర్షయోఽ తీవ వికలాః పతితా భువి ॥
సర్వే మిలిత్వా మునయస్సు రాశ్చ సమమాకులాః ।
సంగతా విధిహర్యోస్తు సమీపం మిత్రచేతసోః ॥
అహో విధిబలం చైతన్మునయః కశ్యపాదయః ।
వదంతి స్మ తదా సర్వే హరిం లోకభయాపహమ్ ॥
అభాగ్యా న్న సమాప్తం తు కార్యమిత్యపరే ద్విజాః ।
కస్మా ద్విఘ్న మిదం జాతమిత్యన్యే హ్యతివిస్మితాః ॥

ఇంద్రుడు మోకాళ్ల మీద నేలపై బడి అతిశయించిన దుఃఖమును పొందెను. ఇతర దేవతలు మరియు మహర్షులు నేలపై బడి దుఃఖమును పొందిరి(17). మునులు మరియు దేవతలు చాల ఆందోళనను చెందిన వారై అందరు సమగూడి ప్రేమతో నిండిన హృదయము గల బ్రహ్మ విష్ణువుల సమీపమునకు వెళ్లిరి(18). అపుడు కశ్యపుడు మొదలగు ఋషులందరు ప్రాణుల భయములను తొలగించే విష్ణువుతో 'ఆశ్చర్యము! విధి బలీయమైనది' అని పలుకుచుండిరి (1,9). అభాగ్యవశముచే మన పని సిద్ధించలేదని కొందరు ఋషులు పలికిరి. మరికొందరు మిక్కిలి ఆశ్చర్యమును పొందినవారై 'ఈ విఘ్నము ఏల కలిగినది?' అని ప్రశ్నించుచుండిరి (20).

ఇత్యేవం వచనం శ్రుత్వా కశ్యపాద్యుదితం మునే ।
ఆశ్వాసయన్మునీన్ దేవాన్ హరిర్వాక్యముపాదదే ॥

ఓ మహర్షీ! కశ్యపుడు మొదలగు వారు పలికిన ఈ మాటలను విని, విష్ణువు మునులను, దేవతలను ఓదార్చుచూ ఇట్లు పలికెను (21).

విష్ణురువాచ ।

హే దేవా మునయస్సర్వే మద్వచశ్శృణుతాదరాత్ ।
కిమర్థం దుఃఖమాపన్నా దుఃఖం తు త్యజతాఖిలమ్ ॥
మహ దారాధనం దేవా న సుసాధ్యం విచార్యతామ్ ।
మహదారాధనే పూర్వం భవేద్దుఃఖమితి శ్రుతమ్ ॥
విజ్ఞాయ దృఢతాం దేవాః ప్రసన్నో భవతి ధ్రువమ్ ।
శివస్సర్వ గణాధ్యక్ష స్సహసా పరమేశ్వరః ।
విచార్యతాం హృదా సర్వే కథం వశ్యో భవేదితి ॥
ప్రణవం పూర్వముచ్చార్య నమః పశ్చాదుదాహరేత్ ।
శివాయేతి తతః పశ్చా చ్ఛుభద్వయమతః పరమ్ ॥
కురుద్వయం తతః ప్రోక్తం శివాయ చ తతః పునః ।
నమశ్చ ప్రణవశ్చైవ మంత్రమేవం సదా బుధాః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవతలారా! మునురాలా! మీరందరు నా మాటను శ్రద్ధతో వినుడు. మీరేల దుః౧ఃఖించు చుంటిరి? మీరు దుఃఖమును పూర్తిగా విడువుడు (22). ఓ దేవతలారా! మహాత్ముల ఆరాధన సరళము గాదు. ఆలోచించుడు. మహాదేవుని ఆరాధనలో ఆరంభము నందు దుఃఖము కలుగునని పెద్దల వలన విని యుంటిమి (23). ఓ దేవతలారా! మీరు దృఢచిత్తులై యున్నచో, గణములన్నింటికీ అధ్యక్షుడు, పరమేశ్వరుడు అగు శివుడు మీ భక్తిని గాంచి వెంటనే ప్రసన్నుడగుట నిశ్చయము. శివుడు నిశ్చయముగా మనకు ప్రసన్నమయ్యే ఉపాయమును మీరు మనస్సులో ఆలోచించుడు (24). "ఓం నమః శివాయ శుభం శుభం కురు కురు శివాయ నమః ఓం" అను మంత్రమును సర్వదా జపించవలెనని పండితులు చెప్పుచున్నారు (25, 26).

అవర్తధ్వం పునర్యాయం యది శంభుకృతే తదా ।
కోటి మేకం తథా జప్త్వా శివః కార్యం కరిష్యతి ॥
ఇత్యుక్తే చ తదా తేన హరిణా ప్రభవిష్ణునా ।
తథా దేవాః పునశ్చ క్రుర్హరస్యారాధనం మునే ॥
సంజజాప హరిశ్చాపి సవిధిశ్శివమానసః ।
దేవానాం కార్యసిద్ధ్యర్థం మునీనాం చ విశేషతః ॥
ముహుశ్శివేతి భాషంతో దేవా ధైర్యసమన్వితాః ।
కోటి సంఖ్యం తదా కృత్వా స్థితాస్తే మునిసత్తమ ॥
ఏతస్మి న్నంతరే సాక్షాచ్ఛివః ప్రాదురభూత్స్వయమ్ ।
యథోక్తేన స్వరూపేణ వచనం చేదమబ్రవీత్ ॥

మీరు శివుని అనుగ్రహమును కాంక్షించువారైనచో ఈ మంత్రమును కోటి పర్యాయములు జపించుడు. అపుడు శివుడు మీ కార్యమును నెరవేర్చగలడు (27). ఓ మహర్షీ! సర్వసమర్థుడగు ఆ హరి అపుడిట్లు పలుకగా దేవతలు మరల శివారాధనను చేయ మొదలిడిరి (28). దేవతల యొక్క మరియు విశేషించి మహర్షుల యొక్క కార్యము సిద్ధించుట కొరకై విష్ణువు మరియు బ్రహ్మ శివుని మనస్సునందు నిలిపి జపమును చేసిరి (29). ఓ మహర్షీ! దేవతలు ధైర్యమును వహించి పలుమార్లు శివనామమును ఉచ్చరిస్తూ కోటి మంత్రజపమును చేసి నిరీక్షించుచుండిరి (30). ఇంతలో శివుడు పూర్వమందు వర్ణింపబడిన రూపముతో స్వయముగా ప్రత్యక్షమై ఇట్లు పలికెను (31).

శ్రీ శివ ఉవాచ ।

హే హరే హే విధే దేవా మునయశ్చ శుభవ్రతాః ।
ప్రసన్నోఽస్మి వరం బ్రూత జపేనానేన చేప్సితమ్ ॥

శ్రీ శివుడిట్లు పలికెను –

ఓ హరీ! విధీ! దేవతలారా! మునులారా! మీరు శుభకరమగు వ్రతము నాచరించితిరి. మీరు చేసిన ఈ జపముచే నేను ప్రసన్నుడనైతిని. మీకు అభీష్టమైన వరమును కోరుకొనుడు (32).

దేవా ఊచుః ।

యది ప్రసన్నో దేవేశ జగదీశ్వర శంకర ।
సురాన్ విజ్ఞాయ వికలాన్ హన్యతాం త్రిపురాణి చ ॥
రక్షాస్మాన్ పరమేశాన దీన బంధో కృపాకర ।
త్వయైవ రక్షితా దేవాస్సదాపద్భ్యో ముహుర్ముహుః ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ దేవ దేవా! జగన్నాథా! శంకరా! దేవతల ఈ దుఃఖమును నీవు గాంచితివి. కాన త్రిపురాసురులను సంహరించుము (33). ఓ పరమేశ్వరా! దీనబంధూ! మమ్ములను రక్షింపుము. దేవతలను అనేక పర్యాయములు ఆపదల నుండి రక్షించినవాడవు నీవే (34).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తం వచనం తేషాం శ్రుత్వా స హరివేధసామ్ ।
విహస్యాంతస్తదా బ్రహ్మన్ మహేశః పునరబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ మహర్షీ! బ్రహ్మ విష్ణువులతో గూడియున్న వారి ఆ మాటలను విని మహేశ్వరుడు తనలో నవ్వుకొని వారితో నిట్లనెను (35).

మహేశ ఉవాచ ।

హే హరే హే విధే దేవా మునయశ్శృణుతా వచః ।
మదీయం శృణుతాదృత్య నష్టం మత్వా పురత్రయమ్ ॥
రథం చ సారథిం దివ్యం కార్ముకం శరముత్తమమ్ ।
పూర్వమంగీకృతం సర్వముపపాదయతా చిరమ్ ॥
హే విష్ణో హే విధే త్వం హి త్రిలోకాధిపతిర్ధ్రువమ్ ।
సర్వసమ్రాట్ ప్రకారం మే కర్తు మర్హసి యత్నతః ॥
నష్టం పురత్రయం మత్వా దేవసాహాయ్య మిత్యుత ।
కరిష్యథః ప్రయత్నేనాధికృతౌ సర్గ పాలనే ॥
అయం మంత్రో మహాపుణ్యో మత్ప్రీతిజనకశ్శుభః ।
భుక్తి ముక్తి ప్రదస్సర్వ దశ్శైవకాహవమ్ ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

హే హరీ! విధీ! దేవతలారా! మునులారా! మీరందరు నా మాటను శ్రద్ధతో వినుడు. త్రిపురములు నశించినవనియే తలంపుడు (36). రథమును, సారథిని, దివ్యమగు ధనస్సును, గొప్ప బాణమును పూర్వము అంగీకరించిన విధంబున మీరు సమకూర్చుడు. ఈ సర్వమును శీఘ్రమే ఏర్పాటు చేయుడు (37). ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! మీరు ముల్లోకములకు అధిపతులు. సర్వమును శాసించు చక్రవర్తులు. కావున నాకు కావలసిన పరికరములను శ్రద్ధతో సమగూర్చుడు (38). క్రమముగా సృష్టి స్థితులయందు అధికృతులైన మీరిద్దరు త్రిపురములు నశించినవి అనియే తలపోయుడు. ఈ దేవకార్యమునందు శ్రద్ధతో సహకరించుడు (39). మహాపుణ్య ప్రదమగు ఈ శుభమంత్రము నాకు ప్రీతిని కలిగించి ఇహపరములను మాత్రమే గాక సర్వమును ఇచ్చి శివభక్తులకు ఆనందమును కలిగించును (40).

ధన్యో యశస్య ఆయుష్య స్స్వర్గ కామార్థినాం నృణామ్ ।
అపవర్గో హ్యకామానాం ముక్తానాం భుక్తిముక్తిదః ॥
య ఇమం కీర్తయేన్మంత్రం శుచిర్భూత్వా సదా నరః ।
శృణుయాచ్ఛావయే ద్వాపి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥

సకామముగా జపించు మానవులకు ఈ మంత్రము ధన్యతను గూర్చి కీర్తిని, ఆయుర్దా◌ాయమును, స్వర్గమును ఇచ్చును. నిష్కాములకు మోక్షమును ఇచ్చును. ముక్తులకు భుక్తిని, ఆనందమును కలిగించును (41). ఏ మానవుడైతే శుచిగా నుండి సర్వదా ఈ మంత్రమును జపించునో, వినునో, లేదా ఇతరులకు వినిపించునో, అట్టి వాని కోర్కెలన్నియూ ఈడేరును (42).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య శివస్య పరమాత్మనః ।
సర్వే దేవా ముదం ప్రాపుర్హరి బ్రహ్మాదికం తథా ॥
సర్వవేదమయం దివ్య రథం పరమశోభనమ్ ।
రచయామాస విశ్వార్థే విశ్వకర్మా తదాజ్ఞయా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధ ఖండే
దేవస్తుతిర్నామ సప్తమోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

పరమాత్ముడగు ఆ శివుని వచనమును విని దేవతలందరు ఆనందించిరి. విష్ణువు మరియు బ్రహ్మ గొప్ప ఆనందమును పొందిరి (43). వారి ఆజ్ఞచే విశ్వకర్మ లోకక్షేమము కొరకై సర్వవేద స్వరూపము, పరమ సుందరమునగు దివ్య రథమును నిర్మించెను (44).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు యుద్ధ ఖండములో దేవస్తుతి అనే ఏడవ అధ్యాయము ముగిసినది (7).

8 – రథ నిర్మాణము

వ్యాస ఉవాచ।

సనత్కుమార సర్వజ్ఞ శైవ ప్రవర సన్మతే ।
అద్భుతేయం కథా తాత శ్రావితా పరమేశితుః ॥
ఇదానీం రథ నిర్మాణం బ్రూహి దేవమయం పరమ్ ।
శివార్థం యత్కృతం దివ్యం ధీమతా విశ్వకర్మణా ॥

వ్యాసుడిట్లు పలికెను –

తండ్రీ! సనత్కుమారా! నీవు సర్వమునెరింగిన వాడవు. శివభక్త శిఖామణివి◌ి. ఈశ్వరుని యందు లగ్నమైన మనస్సు గలవాడవు. పరమేశ్వరుని ఈ అద్భుత గాథను వినిపించితివి (1). బుద్ధిమంతుడగు విశ్వకర్మ శివుని కొరకు నిర్మించిన దేవాత్మకమగు పరమదివ్యరథము యొక్క నిర్మాణమును గూర్చి ఇపుడు వివరించుము (2).

సూత ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్య స మునీశ్వరః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥

సూతుడిట్లు పలికెను –

ఆ వ్యాసుని ఈ మాటను విని మహర్షి శ్రేష్ఠుడగు ఆ సనత్కుమారుడు శివుని పాదపద్మములను స్మరించి ఇట్లు పలికెను (3).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహా ప్రాజ్ఞ రథాదేర్నిర్మితిం మునే ।
యథామతి ప్రవక్ష్యేఽహం స్మృత్వా శివపదాంబుజమ్ ॥
అథ దేవస్య రుద్రస్య నిర్మితో విశ్వకర్మణా ।
సర్వలోకమయో దివ్యో రథో యత్నేన సాదరమ్ ॥
సర్వభూతమయశ్చైవ సౌవర్ణస్సర్వ సంమతః ।
రథాంగం దక్షిణం సూర్యస్తద్వామం సోమ ఏవ చ ॥
దక్షిణం ద్వాదశారం హి షోడశారం తథోత్తరమ్ ।
అరేషు తేషు విప్రేంద్ర ఆదిత్యా ద్వాదశైవ తు ॥
శశినః షోడశారాస్తు కలా వామస్య సువ్రత ।
ఋక్షాణి తు తథా తస్య వామస్యైవ విభూషణమ్ ॥
ఋతవో నేమయః షట్ చ తయోర్వై విప్రపుంగవ ।
పుష్కరం చాంతరిక్షం వై రథనీడశ్చ మందరః ॥
అస్తాద్రి రుదయాద్రిస్తు తావుభౌ కూబరౌ స్మృతౌ ।
అధిష్ఠానం మహామేరు రాశ్రయాః కేశరాచలాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

వ్యాసా! నీవు గొప్ప బుద్ధిశాలివి. ఓ మునీ! రథము మొదలగు వాటి నిర్మాణమును గురించి వినుము. నేను పాదపద్మములను స్మరించి నా బుద్ధికి తోచిన విధముగా చెప్పెదను (4). అపుడు రుద్రదేవుని కొరకు విశ్వకర్మ శ్రద్ధతో ప్రయత్న పూర్వకముగా సర్వలోకములను తనలో కలిగియున్న దివ్యరథమును నిర్మించెను (5). సర్వభూతములు ఆ రథము నందు గలవు. ఆ బంగరు రథము అందరి ప్రశంసల నందుకొనెను. దాని కుడి చక్రము సూర్యుడు కాగా, చంద్రుడు ఎడమ చక్రమాయెను (6). కుడి చక్రమునకు పన్నెండు, ఎడమ చక్రమునకు పదహారు కమ్మీలు ఉండెను. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా ! ఆ కమ్మీల యందు ద్వాదశాదిత్యులు అధిష్ఠించి యుండిరి (7). గొప్ప వ్రతము గలవాడా! చంద్రుని పదునారు కళలు ఎడమ చక్రము యొక్క కమ్మీలు అయినవి. నక్షత్రములు ఆ ఎడమ చక్రమునకు ఆభరణములైనవి (8). ఓ విప్రశ్రేష్ఠా! ఆరు ఋతువులు ఆ చక్రములను చుట్టి యుండు బద్దీలైనవి. అంతరిక్షము రథమునకు ముందు భాగము ఆయెను. మందర పర్వతము రథములో కూర్చుండు స్థానమాయెను (9). అస్తాచల, ఉదయాచలములు రథమునకు ముందు ఉండు స్తంభములాయెను. మహామేరువు మూలాధిష్ఠానము కాగా, మేరు శిఖరములు అధిష్ఠానములోని ఇతర భాగములాయెను (10).

వేగస్సంవత్సరాస్తస్య అయనే చక్రసంగమౌ ।
ముహూర్తా బంధురాస్తస్య శమ్యాశ్చైవ కలాస్స్మృతాః ॥
తస్య కాష్ఠాః స్మృతా ఘోణాశ్చాక్షదండాః క్షణాశ్చ వై ।
నిమేషాశ్చానుకర్షశ్చ ఈషాశ్చానులవాః స్మృతాః ॥
ద్యౌర్వరూథం రథస్యాస్య స్వర్గమోక్షావుభౌ ధ్వజౌ ।
యుగాంత కోటి తౌ తస్యా భ్రముకామదుమౌ స్మృతౌ ॥
ఈషాదండ స్తథావ్యక్తం బుద్ధిస్తస్యైవ నడ్వలః ।
కోణాస్తస్యాప్యహంకారో భూతాని చ బలం స్మృతమ్ ॥
ఇంద్రియాణి చ తస్యైవ భూషణాని సమంతతః ।
శ్రద్ధా చ గతిరస్యైవ రథస్య మునిసత్తమ ॥
తదానీం భూషణాన్యేవ షడంగాన్యుప భూషణమ్ ।
పురాణన్యాయ మీమాంసా ధర్మశాస్త్రాణి సువ్రతాః ॥
బలాశయా వర్ణాశ్చైవ సర్వలక్షణ సంయుతాః ।
మంత్రా ఘంటాః స్మృతాస్తేషాం వర్ణాః పాదాసదాశ్రమాః ॥

సంవత్సరములు దాని వేగము ఆయెను. ఉత్తరాయణ, దక్షిణాయనములు చక్రముల ఇరుసులు ఆయెను. ముహూర్తములు దాని భూషణముకుటములాయెను. ఘడియలు దాని కీలలాయెను (11). విఘడియలు ముక్కువంటి అగ్రభాగములు కాగా, క్షణములు ఇరుసుకర్రలు ఆయెను.

నిముషములు క్రింది కర్రలు కాగా, లవము (సెకండులో ఆరవభాగము) లు నిలువు కర్రలు ఆయెనని చెప్పబడినది (12). ద్యులోకము ముందుండే ఇనుపకమ్మీ ఆయెను. ఆ రథమునకు స్వర్గమోక్షములు రెండు ధ్వజములు ఆయెను. అభ్రము (దేవగజము) మరియు కామధేనువు కాడి యొక్క కొనలు ఆయెను (13). ప్రకృతి నిలువు స్తంభము కాగా, మహత్తత్త్వము వెదురు గడల ఆసనమాయెను. అహంకారము కోణములు కాగా, పంచభూతములు దాని బలము అయ్యెనని మహర్షులు చెప్పెదరు (14). ఇంద్రియములు ఆ రథమునకు అంతటా ఉన్న ఆభరణములు ఆయెను. ఓ మహర్షీ! శ్రద్ధ ఆ రథమునకు గమనము ఆయెను (15). గొప్ప వ్రతము గల ఓ మునులారా! అపుడు ఆరు వేదాంగములు ఆ రథమునకు భూషణములు కాగా, పురాణ న్యాయ మీమాంసా ధర్మశాస్త్రములు ఉపభూషణము లాయెను (16). బలమైనవి, సర్వలక్షణములు గలవి అగు శ్రేష్ఠ మంత్రములు ఆ రథమునకు ఘంటలనియు, వర్ణాశ్రమములు పాదములనియు చెప్పబడెను (17).

అథో బంధో హ్యనంతస్తు సహస్రఫణ భూషితః ।
దిశః పాదా రథస్యాస్య తథా చోపదిశశ్చ హ ॥
పుష్కరాద్యాః పతాకాశ్చ సౌవర్ణా రత్న భూషితాః ।
సముద్రాస్తస్య చత్వారో రథకంబలినః స్మృతాః ॥
గంగాద్యా స్సరిత శ్శ్రేష్ఠా స్సర్వాభరణ భూషితాః ।
చామరాసక్త హస్తాగ్రా స్సర్వాస్త్రీ రూపశోభితాః ॥
తత్ర తత్ర కృతస్థానా శ్శోభయాం చక్రిరే రథమ్ ।
ఆవహాద్యాస్తథా సప్త సోపానం హైమముత్తమమ్ ॥
లోకాలోకా చలస్తస్యోపసోపాన స్సమంతతః ।
విషమశ్చ తథా బాహ్యో మానసాదిస్తు శోభనః ॥
పాశాస్సమంతతస్తస్య సర్వే వర్షాచాలాః స్మృతాః ।
తలాస్తస్య రథస్యాథ సర్వే తలనివాసినః ॥

తరువాత వేయి పడగలతో విరాజిల్లు అనంతనాగుడు కట్టు త్రాడు ఆయెను. మరియు ఆ రథమునకు దిక్కులు, ఉపదిక్కులు కట్టు త్రాళ్ళు ఆయెను (18). పుష్కరాది తీర్థములు రత్నములచే అలంకరింపబడిన బంగరు పతాకము లాయెను. నాల్గు సముద్రములు ఆ రథమును కప్పి ఉంచు కంబళ్ళు ఆయెను (19). గంగాది శ్రేష్ఠ నదులన్నియు ఆభరణములన్నిటినీ అలంకరించు కొన్న స్త్రీ రూపములను ధరించి వింజామరలను చేత బట్టి నిలబడిరి (20). వారు ఆయా స్థానములలో నిలబడి రథము యొక్క శోభను ఇనుమడింప జేసిరి. ఆవహాది సప్త వాయువులు దానికి ఉత్తమ సోపానములైనవి (21). లోకాలో కపర్వతము రథమునకు నలువైపులా ఉపసోపానమాయెను. మానసాది సరోవరములు దానికి బయట ఉండే సుందరమగు విషమ స్థానము ఆయెను (22). వర్ష

పర్వతములన్నియు ఆ రథమునకు నలువైపులా ఉండే త్రాళ్లు ఆయెనని చెప్పబడెను. పాతాళాది అధోలోకములయందు నివసించు ప్రాణులన్నియు ఆ రథమునకు ఉపరితలములు ఆయెను (23).

సారథిర్భగవాన్ బ్రహ్మా దేవో రశ్మిధరః స్మృతః ।
ప్రతోదో బ్రహ్మణస్తస్య ప్రణవో బ్రహ్మదైవతమ్ ॥
అకారశ్చ మహచ్ఛత్రం మందరః పార్శ్వదండభాక్ ।
శైలేంద్రః కార్ముకం తస్య జ్యా భుజంగాధిపతి స్స్వయమ్ ॥
ఘంటా సరస్వతీ దేవీ ధనుషశ్శ్రుతిరూపిణీ ।
ఇషుర్విష్ణుర్మహాతేజా స్త్వగ్ని శ్శల్యం ప్రకీర్తితమ్ ॥
హయాస్తస్య తథా ప్రోక్తా శ్చత్వారో నిగమా మునే ।
జ్యోతీంషి భూషణం తేషామవశిష్టాన్యతః పరమ్ ॥
అనీకం విషసం భూతం వాయవో వాజకాః స్మృతాః ।
ఋషయో వ్యాసముఖ్యాశ్చ వాహవాహాస్తథాభవన్ ॥
స్వల్పాక్షరైస్సంబ్రవీమి కిం బహూక్త్యా మునీశ్వర ।
బ్రహ్మాండే చైవ యత్ కించిద్వస్తు తద్వై రథే స్మృతమ్ ॥
ఏవం సమ్యక్ కృతస్తేన ధీమతా విశ్వకర్మణా ।
స రథాది ప్రకారో హి బ్రహ్మ విష్ణ్వాజ్ఞయా శుభః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే రథ నిర్మాణ వర్ణనం నామ అష్టమోఽధ్యాయః ॥

బ్రహ్మదేవుడు సారథియై కళ్లెములను పట్టు కొనెను. బ్రహ్మ అధిష్ఠాన దేవతగా గల ఓంకారము ఆ బ్రహ్మకు చేతి కొరడా ఆయెను (24). అకారము పెద్ద గొడుగు ఆయెను. మందర పర్వతము ప్రక్కన ఉండే నిలువు కమ్మీ ఆయెను. హిమవంతుడు శివునకు ధనస్సు కాగా, నాగరాజగు శేషుడు దాని నారిత్రాడు ఆయెను (25). వేదస్వరూపిణి యగు సరస్వతీ దేవి ఆ ధనస్సునకు గంట ఆయెను. మహాతేజశ్శాలి యగు విష్ణువు బాణము కాగా, అగ్ని ఆ బాణము యొక్క వాడి మొన ఆయెనని మహర్షులు చెప్పిరి ఓ మహర్షీ! నాలుగు వేదములు ఆ రథమునకు నాలుగు గుర్రములు ఆయెను. మిగిలియున్న నక్షత్రాది తేజః పిండములు ఆ గుర్రములకు ఆభరణములాయెను (27). విషము నుండి పుట్టిన పదార్థములు సేన కాగా, వాయువులు వాద్యగాళ్లు ఆయెను. వ్యాసాది మహర్షులు ఆ గుర్రములకు సంరక్షకులుగా నుండిరి (28). ఓ మహర్షీ! ఇన్ని మాటలేల? కొద్ది మాటలలో చెప్పెదను. బ్రహ్మాండములో నుండే సర్వవస్తువులు ఆ రథము నందు ఉండెనని చెప్పెదరు (29). ఇట్లు బుద్ధిమంతుడగు ఆ విశ్వకర్మ బ్రహ్మ విష్ణువుల యాజ్ఞచే శుభకరమగు ఆ రథమును చక్కగా నిర్మించెను (30).

9 – శివుని యాత్ర

సనత్కుమార ఉవాచ ।

ఈదృగ్విధం మహాదివ్యం నానాశ్చర్యమయం రథమ్ ।
సంనహ్య నిగమానశ్వాంస్తం బ్రహ్మా ప్రార్పయ చ్ఛివమ్ ॥
శంభవేఽసౌ నివేద్యాధి రోపయామాస శూలినమ్ ।
బహుశః ప్రార్థ్య దేవేశం విష్ణ్వాది సురసంమతమ్ ॥
తతస్తస్మిన్ రథే దివ్యే రథప్రాకారసంయుతే ।
సర్వదేవమయ శ్శంభురారురోహ మహాప్రభుః ॥
ఋషిభిస్స్తూ యమానశ్చ దేవగంధర్వపన్నగైః ।
విష్ణునా బ్రహ్మణా చాపి లోకపాలై ర్వృథావ హ ॥
ఉపావృతశ్చాప్సరసాం గణైర్గీత విశారదైః ।
శుశుభే వరదశ్శంభుస్స తం ప్రేక్ష్య చ సారథిమ్ ॥
తస్మిన్నారోహతి రథం కల్పితం లోకసంభృతమ్ ।
శిరోభిః పతితా భూమౌ తురంగా వేదసంభవాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను --

ఇటువంటి మహాదివ్యమైన, అనేకములగు ఆశ్చర్యములతో కూడియున్న రథమునకు వేదముపలనే గుర్రములను పూన్చి బ్రహ్మ శివునకు అర్పించెను (1). దేవదేవుడు, విష్ణువు మొదలగు దేవతలచే కొలువబడువాడు, శూలధారియగు శంభుని పరిపరివిధముల స్తుతించి బ్రహ్మ ఆయనను రథమును అధిష్ఠింపజేసెను (2). సర్వదేవతా స్వరూపుడు, మహాప్రభుడునగు శంభుడు అపుడు రథసామగ్రితో కూడిన ఆ దివ్య రథమును అధిష్ఠించెను (3). అపుడాయనను ఋషులు, దేవతలు, గంధర్వులు, నాగులు, విష్ణువు, బ్రహ్మ మరియు లోకపాలకులు స్తుతించిరి (4). సంగీతకుశలురగు అప్సరసల గణములు చుట్టు వారి యుండగా, సారథియగు బ్రహ్మను గాంచినవాడై, వరములనిచ్చు ఆ శంభుడు విరాజిల్లెను (5). లోకములోని వస్తువులచే రచింపబడిన ఆ రథమును శివుడు అధిరోహించగానే, వేదముల నుండి పుట్టిన గుర్రములు శిరస్సులపై నేల గూలినవి (6).

చచాల వసుధా చేలుస్సకలాశ్చ మహీధరాః ।
చకంపే సహసా శేషోఽ సోఢా తద్భారమాతురః ॥
అథాధస్స రథస్యాస్య భగవాన్ ధరణీధరః ।
వృషేంద్రరూపీ చోత్థాయ స్థాపయామాస వై క్షణమ్ ॥
క్షణాంతరే వృషేంద్రోఽపి జానుభ్యామగమద్ధరామ్ ।
రథారూఢ మహేశస్య సుతేజస్సోఢుమక్షమః ॥
అభీషు హస్తో భగవానుద్యమ్య చ హయాంస్తదా ।
స్థాపయామాస దేవస్య వచనాద్వై రథం వరమ్ ॥

తతోఽసౌ నోదయామాస మనో మారుతరంహసః ।
బ్రహ్మా హయాన్ వేదమయాన్నద్ధాన్ రథవరే స్థితః ॥
పురాణ్యుద్దిశ్య వై త్రీణి తేషాం ఖస్థాని తాని హి ।
అధిష్ఠితే మహేశే తు దానవానాం తరస్వినామ్ ॥
అథాహ భగవాన్రుద్రో దేవానాలోక్య శంకరః ।
పశూనా మాధిపత్యం మే ధధ్వం హన్మి తతోఽసురాన్ ॥

భూమి కంపించెను. పర్వతములన్నియు చలించినవి. శివుని భారమును సహించలేక శేషుడు శీఘ్రమే భయ విహ్వలుడై కదలాడి పోయెను (7). అపుడు భూమిని మ్రోయు శేష భగవానుడు గొప్ప ఎద్దురూపముతో ఆ రథము క్రిందకు జేరి క్షణములో దానిని పైకి ఎత్తి నిలబెట్టెను (8). కాని రథము నధిష్ఠించియున్న మహేశ్వరుని గొప్ప తేజస్సును సహింప జాలక ఆయన కూడ మరుక్షణములో మోకాళ్లపై నేలగూలెను (9). అపుడు భగవాన్ బ్రహ్మ చేతి యందు కొరడాను బట్టి గుర్రముల నదలించి శివుని మాటచే ఆ శ్రేష్ఠ రథమును నిలబెట్టెను (10). అపుడు బ్రహ్మ శ్రేష్ఠమగు ఆ రథమునందు కూర్చున్నవాడై మనో వేగ వాయు వేగములు గల, వేదరూపములైన, ఆ రథమునకు పూన్చబడి యున్న గుర్రములను తోలెను (11). మహావీరులగు ఆ రాక్షసుల యొక్క, ఆకసము నందుండే మూడు నగరములను లక్ష్యముగా చేసుకొని బ్రహ్మ మహేశ్వరునిచే అధిష్ఠింపబడిన ఆ రథమును నడిపెను (12). అపుడు మంగళకరుడగు రుద్ర భగవానుడు దేవతల వైపు చూచి 'నాకు పశుపతిత్వమును కల్పించినచో, నేను రాక్షసులను సంహరించెదను' అని పలికెను (13).

పృథక్ పశుత్వం దేవానాం తథాన్యేషాం సురోత్తమాః ।
కల్పయిత్వైవ వధ్యాస్తే నాన్యథా దైత్యసత్తమాః ॥

ఓ దేవశ్రేష్ఠులారా! దేవతలకు మరియు ఇతర జీవులకు వేర్వేరుగా పశుత్వమును కల్పించినచో, ఆ రాక్షసులు సంహరింపబడెదరు. అట్లు గానిచో, ఆ రాక్షసవీరులు సంహరింపబడరు (14).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య దేవదేవస్య ధీమతః ।
విషాదమగమన్ సర్వే పశుత్వం ప్రతి శంకితాః ॥
తేషాం భావమథ జ్ఞాత్వా దేవదేవోఽ ంబికాపతిః ।
విహస్య కృపయా దేవాన్ శంభుస్తానిదమ బ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ధీమంతుడు, దేవదేవుడునగు శివుని ఆ మాటను విని అందరు పశుభావమును గూర్చిన శంక గలవారై దుఃఖమును పొందిరి (15). దేవదేవుడు, పార్వతీపతి యగు శంభుడు ఆ దేవతల మనోగతము నెరింగి నవ్వి వారిని ఉద్దేశించి దయతో నిట్లనెను (16).

శంభు రువాచ ।

మాహోఽస్తు పశుభావేఽపి పాతో విబుధసత్తమాః ।
శ్రూయతాం పశుభావస్య విమోక్షః క్రియతాం చ సః ॥
యో వై పాశు పతం దివ్యం చరిష్యతి సమోక్ష్యతి ।
పశుత్వాదితి సత్యం వః ప్రతిష్టాతం సమాహితాః ॥
యే చాప్యన్యే కరిష్యంతి వ్రతం పాశుపతం మమ ।
మోక్ష్యంతి తే న సందేహః పశుత్వా త్సురసత్తమాః ॥
నైష్ఠికం ద్వాదశాబ్దం వా తదర్ధం వర్షకత్రయమ్ ।
శుశ్రూషాం కారయేద్యస్తు స పశుత్వాద్విముచ్యతే ॥
తస్మాత్పరమిదం దివ్యం చరిష్యథ సురోత్తమాః ।
పశుత్వాన్మోక్ష్యథ తదా యూయమత్ర న సంశయః ॥

శంభుడు ఇట్లు పలికెను -

ఓ దేవశ్రేష్ఠులారా! మీరు పశుభావమును పొందిననూ పతనమును పొందరు. పశుభావము నుండి విముక్తిని పొందే ఉపాయమును గురించి విని, ఆ విధమును ఆచరించుడు (17). ఎవడైతే దివ్యమగు పాశుపత వ్రతమునాచరించునో, ఆతడు పశుత్వము నుండి విముక్తిని పొందగలడు. ఇది సత్యము. నేను ప్రతిజ్ఞను చేయుచున్నాను. గమనించుడు (18). ఓ దేవ శ్రేష్ఠులారా! మీరే గాక ఇతరులైననూ నా ఈ పాశుపతవ్రతము నాచరించినచో పశుత్వము నుండి విముక్తులగుదురనుటలో సందియము లేదు (19). ఎవడైతే జీవితకాలమంతయూ, లేదా పన్నెండు సంవత్సరములు, లేక ఆరు సంవత్సరములు, లేక మూడు సంవత్సరములు శుశ్రూషను చేయునో, వానికి పశుత్వము నుండి ముక్తి కలుగును (20). ఓ దేవ శ్రేష్ఠులారా! కావున ఈ శ్రేష్ఠమగు దివ్యవ్రతము నాచరింపుడు. మీకు నిస్సంశయముగా పశుత్వము నుండి విముక్తి కలుగును (21).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య మహేశస్య పరాత్మనః ।
తథేతి చాబ్రువన్ దేవా హరి బ్రహ్మాదయస్తథా ॥
తస్మాద్వై పశవస్సర్వే దేవాసురవరాః ప్రభోః ।
రుద్రః పశుపతిశ్చైవ పశుపాశ విమోచకః ॥
తదా పశుపతీత్యేతత్తస్య నామ మహేశితుః ।
ప్రసిద్ధమభవద్యధ్వా సర్వలోకేషు శర్మదమ్ ॥
ముదా జయేతి భాషంతస్సర్వే దేవర్షయస్తదా ।
అముదంశ్చాతి దేవేశో బ్రహ్మా విష్ణుః పరేపి చ ॥
తస్మింశ్చ సమయే యచ్చ రూపం తస్య మహాత్మనః ।
జాతం తద్వర్ణితుం శక్యం న హి వర్ష శతైరపి ॥
ఏవం విధో మహేశానో మహేశాన్య ఖిలేశ్వరః ।
జగామ త్రిపురం హంతుం సర్వేషాం సుఖదాయకః ॥
తం దేవ దేవం త్రిపురం నిహంతుం తదా ను సర్వే తు రవిప్రకాశః ।
గజైర్హయైస్సింహవరై రథైశ్చ వృషైర్యయుస్తేఽమరరాజ ముఖ్యాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

పరమాత్మయగు ఆ మహేశ్వరుని ఈ మాటను విని, విష్ణు బ్రహ్మాది దేవతలు 'సరే' అని తమ అంగీకారమును తెలిపిరి (22). అందువలననే, దేవతలు, దేవశ్రేష్ఠులు, రాక్షసవీరులు అందరు ఆ ప్రభునకు పశువులు అయిరి. పశువుల పాశములను విడిపించు రుద్రుడు పశుపతి ఆయెను (23). అప్పటి నుండియు మహేశ్వరునకు పశుపతి యను మంగళకరమగు నామము లోకములన్నిటి యందు ప్రసిద్ధిని గాంచెను (24). అపుడు బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, ఋషులు మరియు ఇతరలు అందరు ఆనందముతో జయధ్వానములను చేయుచూ మిక్కిలి ఆనందించిరి (25). ఆ సమయములో మహాత్ముడగు శివునకు గల రూపమును వందల సంవత్సరముల కాలములోనైననూ వర్ణించుటకు శక్యము గాదు (26). మహేశ్వరుడు, సర్వలోకములకు ప్రభువు, సర్వులకు సుఖము నిచ్చువాడు అగు పార్వతీపతి ఈ విధముగా త్రిపుర సంహారమునకై బయల్వెడలెను (27). ఇంద్రుడు మొదలైన, సూర్యునితో సమమగు తేజస్సు గల దేవవీరులు త్రిపురవధ కొరకై ఏనుగులపై, గుర్రములపై, గొప్ప సింహములపై, రథములపై మరియు వృషభములపై అధిష్ఠించి ఆ దేవదేవుని అనుసరించి వెళ్లిరి (28).

హలైశ్చ శాలైర్ముశలై ర్భుశుండైః గిరీంద్ర కల్పైర్గిరి సన్నిభాశ్చ ।
నానాయుధై స్సంయుత బాహవస్తే తతోను హృష్టాః ప్రయయుస్సురేశాః ॥

నానాయుధాఢ్యాః పరమప్రకాశా మహోత్సవాశ్శంభుజయం వదంతః ।
యయుః పురస్తస్య మహేశ్వరస్య తదేంద్ర పద్మోద్భవ విష్ణు ముఖ్యాః ॥

జహృషుర్మునయస్సర్వే దండహస్తా జటాధరాః ।
వవృషుః పుష్పవర్షాణి ఖేచరాస్సిద్ధ చారణాః ॥

పురత్రయం చ విప్రేంద్రా ప్రజన్ సర్వే గణేశ్వరాః ।
తేషాం సంఖ్యాం చ కః కర్తుం సమర్థో వచ్మి కాంశ్చన ॥

గణేశ్వరైర్దేవగణైశ్చ భృంగీ సమావృత స్సర్వగణేంద్ర వర్యః ।
జగామ యోగింస్త్రి పురం నిహంతుం విమానమారుహ్య యథా మహేంద్రః ॥

ఆ దేవశ్రేష్ఠులు నాగళ్లతో, వృక్షములతో, రోకళ్లతో, భుశుండమనే ఆయుధములతో కూడిన బాహువులు గలవారై శివుని అనుసరించి పయనమైరి. పర్వతాకారులగు వారి చేతులలో పర్వతముల వంటి ఆయుధములు ఉండెను (29). అపుడు ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలు అనేకములగు ఆయుధములచే ఒప్పుచున్నవారై, గొప్ప ప్రకాశము గల వారై, మహోత్సవముతో శంభునకు జయధ్వానములు పలుకుతూ ఆ మహేశ్వరుని యెదుట నడిచిరి (30). చేతులలో దండములను ధరించిన జటాధారులగు మునులందరు ఆనందించిరి. ఆకాశమునందు సంచరించే సిద్ధులు, చారణులు పూలవానను కురిపించిరి(31). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! గణాధ్యక్షులందరు త్రిపురములకు పయనమైరి. వారి సంఖ్యను గణించగల సమర్థుడు ఎవడు గలడు? అయిననూ కొన్ని వివరములను చెప్పెదను (32). ఓ యోగీ! గణాధ్యక్షులతో, మరియు దేవగణములతో చుట్టు వారబడి యున్నవాడు, గణాధ్యక్షులందరిలో ప్రముఖుడు అగు భృంగి విమానము నధిష్ఠించి మహేంద్రుని వలె త్రిపురాసుర సంహారము కొరకు బయలు దేరి వెళ్లెను (33).

కేశో విగతవాసశ్చ మహాకేశో మహాజ్వరః ।
సోమవల్లీ సవర్ణశ్చ సోమదస్సనకస్తథా ॥
సోమధృక్ సూర్యవర్చాశ్చ సూర్య ప్రేషణకస్తథా ।
సూర్యాక్ష స్సూరీనామా చ సురస్సుందర ఏవ చ ॥
ప్రస్కందః కుందరశ్చండః కంపనశ్చాతికంపనః ।
ఇంద్రశ్చేంద్రజవశ్చైవ యంతా హిమకరస్తథా ॥
శతాక్షశ్చైవ పంచాక్షస్సహస్రాక్షో మహోదరః ।
సతీజహుశ్చశతాస్యశ్చ రంకః కర్పూర పూతనః ॥
ద్విశిఖస్త్రి శిఖశ్చైవ తథాహంకార కారకః ।
అజవక్త్రోఽష్ట వక్త్రశ్చ హయవక్త్రోఽర్ధవక్షకః ॥
ఇత్యాద్యా గణపా వీరా బహవోఽ పరిమేయకాః ।
ప్రయయుః పరివార్యేశం లక్ష్య లక్షణవర్జితాః ॥

కేశుడు, విగతవాసుడు, మహాకేశుడు, మహాజ్వరుడు, సోమవల్లీ సవర్ణుణుడు, సోమదుడు, సనకుడు (34), సోమధృక్, సూర్యవర్చసుడు, సూర్యప్రేషణకుడు, సూర్యాక్షుడు, సూరినాముడు, సురుడు, సుందరుడు (35), ప్రస్కందుడు, కుందరుడు, చండుడు, కంపనుడు, అతికంపనుడు, ఇంద్రుడు, ఇంద్రజవుడు, యంత, హిమకరుడు (36), శతాక్షుడు, పంచాక్షుడు, సహస్రాక్షుడు, మహోదరుడు, సతీజహుడు, శతాస్యుడు, రంకుడు, కర్పూరపూతనుడు (37), ద్విశిఖుడు, . త్రిశిఖుడు, అహంకార కారకుడు, అజవక్రుడు, అష్టవక్రుడు, హయవక్రుడు, అర్ధవక్తకుడు (38) మొదలైన అపరిమిత బలశాలురైన, వీరులగు గణాధ్యక్షులు అనేకులు లక్ష్యమును గురించి గాని, లక్షణముల గురించి గాని చింత చేయని వారై శివుని చుట్టుముట్టి ముందునకు సాగిరి (39).

సమావృత్య మహాదేవం తదాపుస్తే పినాకినమ్ ।
దగ్ధుం సమర్థా మనసా క్షణేన సచరాచరమ్ ॥
దగ్ధుం జగత్సర్వమిదం సమర్థాః కిం త్వత్ర దగ్ధుం త్రిపురం పినాకీ ।
రథేన కిం చాత్ర శరేణ తస్య గణైశ్చ కిం దేవగణైశ్చ శంభోః ॥
స ఏవ దగ్గుం త్రిపురాణి తాని దేవద్విషాం వ్యాస పినాకపాణిః ।
స్వయం గతస్తత్ర గణైశ్చ సార్ధం నిజైస్సురాణామపి సోఽ ద్భుతోఽతిః ॥
కిం తత్ర కారణం చాన్యద్వచ్మి తే ఋషి సత్తమ ।
లోకేషు ఖ్యాపనార్థం వై యశః పరమలాపహమ్ ॥
అన్యచ్చ కారణం హ్యేతద్దుష్టానాం ప్రత్యయాయ వై ।
సర్వేష్వపి చ దేవేషు యస్మా న్నాన్యో విశిష్యతే ॥
ఇతి శ్రీ శివ మహా పురాణే రుద్రసంహితాయాం యుద్ధ ఖండే శివయాత్రా
వర్ణం నామ నవమోఽధ్యాయః ॥

వారు అపుడు పినాకధారియగు మహాదేవుని చుట్టు వారి యుండిరి. వారు సంకల్పమాత్రముచే చరాచర జగత్తును భస్మము చేయుటకు సమర్థులు (40). ఈ జగత్తునంతనూ దహించుటకు వారే సమర్థులై యుండగా, త్రిపురనాశము కొరకు పినాకధారియగు శివుడు స్వయముగా వచ్చుటకు కారణమేమి? ఆ శివునకు రథముతో గాని, బాణముతో గాని, రుద్ర గణములతో గాని, దేవగణములతో గాని ప్రయోజనమేమి గలదు? (41) ఓ వ్యాసా! ఆ రాక్షసుల త్రిపురములను దహించుటకు ఆయన ఒక్కడే సమర్థుడు. అయినను ఆ పినాకపాణి స్వీయగణములతో, మరియు దేవగణములతో గూడి స్వయముగా బయలు దేరినాడు. ఇది అత్యాశ్చర్యము (42). ఓ మహర్షీ! ఆయన అట్లు చేయుటకు గల కారణమును చెప్పెదను. ఆయన పరమపవిత్రమగు కీర్తిని లోకములో విస్తరింపజేయుట కొరకై అట్లు చేసెను (43). ఇట్లు చేయుటకు మరియొక కారణము గలదు. దేవతలందరిలో సర్వోత్తముడు శివుడే గాని మరియొకడు గాడు అను నమ్మకము దుష్టులకు కలిగించుట కొరకై భగవానుడట్లు చేసెను (44).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధ ఖండలో శివయాత్రా వర్ణనమనే తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (9).

10 – త్రిపుర దహనము

సనత్కుమార ఉవాచ ।

అథ శంభుర్మహాదేవో రథస్థ స్సర్వసంయుతః ।
త్రిపురం సకలం దగ్ధుముద్యతోఽ భూత్సురద్విషామ్ ॥
శీర్షం స్థానకమాస్థాయ సంధాయ చ శరోత్తమమ్ ।
సజ్జం తత్కార్ముకం కృత్వా ప్రత్యాలీఢం మహాద్భుతమ్ ॥
నివేశ్య దృఢముష్టౌ చ దృష్టం దృష్టౌ నివేశ్య చ ।
అతిష్ఠన్నిశ్చలస్తత్ర శతం వర్ష సహస్రకమ్ ॥
తతోఽగుష్ఠే గణాధ్యక్షస్సు తుదైత్య నిశంస్థితః ।
న లక్ష్యం వివిశుస్తాని పురాణ్యస్య త్రిశూలినః ॥
తతోఽతరిక్షా దశృణోద్ధనుర్బాణధరో హరః ।
ముంజకేశో విరూపాక్షో చం పరమ శోభనామ్ ॥
భో భో న యావద్భగవన్నర్చితోఽసౌ వినాయకః ।
పురాణి జగదీశేశ సాంప్రతం న హనిష్యతి ॥
ఏతచ్ఛృత్వా తు వచనం గజవక్త్ర మపూజయత్ ।
భద్రకాలీం సమాహూయ తతోఽధక నిషూదనః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

అపుడు సర్వసామగ్రితో కూడి రథమునందున్న మహాదేవుడగు శంభుడు ఆ రాక్షసుల త్రిపురములను సంపూర్ణముగా దహించి వేయుటకు సన్నద్ధుడై యుండెను (1). ఆయన రథము యొక్క అగ్రాసనమునందు ఒక కాలు ముందుకు మరియొక కాలు వెనుకకు వేసి యుండే అద్భుతమగు రథిక విన్యాసము గలవాడై ఆ ధనస్సునకు నారిత్రాటిని తగిల్చి గొప్ప బాణమును దానిపై సంధించెను (2). ధనస్సును పిడికిలి యందు గట్టిగా పట్టి చూపును చూపుతో కలిపి నిశ్చలముగా అచట ఆయన లక్ష సంవత్సరములు నిలబడెను (3). అపుడు గణపతి ఆయన బొటన వ్రేలి యందున్నవాడై నిరంతరమగు పీడను కలిగించగా, త్రిశూలధారియగు శివుని ఆ బాణములు త్రిపురములు అనే లక్ష్యమును చేరలేకపోయినవి (4). ధనుర్బాణములను ధరించి యున్నవాడు, జటాజూటధారి, ముక్కంటి అగు హరుడు ఆకాశము నుండి పరమ మంగళకరమగు వచనమును వినెను (5). హే భగవాన్! జగదీశ్వరా! ఈశా! నీవు వినాయకుని పూజించనంత వరకు త్రిపురనాశము సంభవము కాదు (6). అంధకాసురుని సంహరించిన శివుడు ఈ మాటను విని భద్రకాళిని పిలిచి గజాననుని పూజించెను (7). .

తస్మిన్ సంపూజితే హర్షాత్పరితుష్టే పురస్సరే ।
వినాయకే తతో వ్యోమ్ని దదర్శ భగవాన్ హరః ॥
పురాణి త్రీణి దైత్యానాం తారకాణాం మహాత్మనామ్ ।
యథాతథం హి యుక్తాని కేచిదిత్థం వదంతి హి ॥
పరబ్రహ్మణి దేవేశ సర్వోపాస్యే మహేశ్వరే ।
అన్య ప్రసాదతః కార్యసిద్ధిర్ఘటతి నేతి హి ॥
స స్వతంత్రః పరం బ్రహ్మ సగుణో నిర్గుణోఽపి హ ।
అలక్ష్య స్వకలైస్స్వామీ పరమాత్మా నిరంజనః ॥
పంచదేవాత్మకః పంచదేవోపాస్యః పరః ప్రభుః ।
తస్యోపాస్యో న కోప్యస్తి స ఏవోపాస్య ఆలయమ్ ॥
అథవా లీలయా తస్య సర్వం సంఘటతే మునే ।
చరితం దేవదేవస్య వరదాతుర్మహేశితుః ॥
తస్మింస్థితే మహాదేవే పూజయిత్వా గణాధిపమ్ ।
పురాణి తత్ర కాలేన జగ్మురేకత్వమాశు వై ॥

సర్వకార్యములకు ముందు ఉండే వినాయకుడు ఈ తీరున పూజింపబడి సం◌ంతసించెను. అపుడు హరభగవానుడు ఆకాశమునందు (8) మహాత్ములగు తారకాక్షుడు మొదలగు రాక్షసుల త్రిపురములను గాంచెను. ఆ నగరములు ఎప్పటివలెనే యోగ్యముగా నుండెను. కొందరు ఇట్లు చెప్పుచున్నారు (9). పరబ్రహ్మ, దేవదేవుడు, సర్వులచే ఉపాసింపబడు వాడు అగు మహేశ్వరుని యందు ఇతర దేవతానుగ్రహముచే కార్యము సిద్ధించుట అనునది ఘటిల్లదు గదా! (10) ఆ పరబ్రహ్మ స్వతంత్రుడు. సగుణుడు, నిర్గుణుడు కూడ ఆయనయే. పరమాత్మ, కర్మలేపము లేనివాడు అగు ఆ స్వామి అందరికీ కానరాడు (11). ఆ పరమ ప్రభుడు పంచదేవ (బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశాన, సదాశివ) స్వరూపుడు, పంచదేవతలచే ఉపాసింపబడువాడు. ఆయనచే ఉపాసింపబడే మరియొకరు ఎవ్వరూ లేరు. ప్రలయము వరకు అందరిచే ఉపాసింపబడువాడు ఆయనయే (12). అయిననూ, ఓ మునీ! దేవ దేవుడు, వరముల నిచ్చువాడు అగు మహేశ్వరుని లీలచే సర్వవృత్తాంతములు ఘటిల్లు చుండును (13). ఆ మహాదేవుడు గణాధిపతిని పూజించి అచట నిలబడి యుండగా, కొద్ది సేపటిలో ఆ మూడు పురములు ఒక్కటిగా అయినవి (14).

ఏకీ భావం మునే తత్ర త్రిపురే సముపాగతే ।
బభూవ తుములో హర్షో దేవాదీనాం మహాత్మనామ్ ॥

తతో దేవగణాస్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః ।
జయేతి వాచో ముముచు స్తువంతశ్చాష్టమూర్తినమ్ ॥

అథాహేతి తదా బ్రహ్మా విష్ణుశ్చ జగతాం పతిః ।
సమయోఽపి సమాయాతో దైత్యానాం వధకర్మణః ॥

తేషాం తారకపుత్రాణాం త్రిపురాణాం మహేశ్వర ।
దేవకార్యం కురు విభో ఏకత్వమపి చాగతమ్ ॥

యావన్న యాన్ తి దేవేశ విప్రయోగం పురాణి వై ।
తావద్బాణం విముంచస్వ త్రిపురం భస్మ సాత్కురు ॥

అథ సజ్యం ధనుః కృత్వా శర్వస్సంధాయ తం శరమ్ ।
పూజ్యం పాశుపతాస్త్రం స త్రిపురం సమచింతయత్ ॥

అథ దేవో మహాదేవో వరలీలా విశారదః ।
కేనాపి కారణేనాత్ర సావజ్ఞం తదవైక్షత ॥

ఓ మహర్షీ! మూడు పురములు ఒక్క రేఖలోనికి రాగానే, మహాత్ములగు దేవతలు బిగ్గరగా హర్షధ్వానములను చేసిరి (15). అపుడు దేవగణములు, సిద్ధులు, మహర్షులు అందరు అష్టమూర్తియగు శివుని స్తుతించి జయ జయధ్వానములను చేసిరి (16). అపుడు బ్రహ్మ, మరియు జగత్ప్రభువగు విష్ణువు ఇట్లు పలికిరి : రాక్షసులను సంహరించే సమయము ఆసన్నమైనది (17). ఓ మహేశ్వరా! త్రిపురములు ఒక్కరేఖ లోనికి వచ్చినవి. హే విభో! తారకపుత్రులగు ఆ రాక్షసులను సంహరించి దేవకార్యమును చేయుము (18). ఓ దేవదేవా! ఆ పురములు మరల విడిపోకమునుపే బాణమును ప్రయోగించి త్రిపురమును భస్మము చేయుము (19). అపుడా శివుడు ధనస్సునకు నారిత్రాటిని తగిల్చి బాణమును సంధానము చేసి పూజ్యమగు పాశుపతాస్త్రమును మనస్సులో ధ్యానము చేసెను (20). అపుడు మహాదేవుడు, గొప్ప లీలలను నెరపుటలో నిపుణుడునగు ఆ శివుడు ఏదో ఒక కారణముచే దానిని నిరాదరణ భావముతో పరికించెను (21).

పురత్రయం విరూపాక్షః కర్తుం తద్భస్మసాత్ క్షణాత్ ।
సమర్థః పరమేశానో మీనాతు చ సతాం గతిః ॥
దగ్ధుం సమర్థో దేవశ వీక్షణేన జగత్త్రయమ్ ।
అస్మద్యశో వివృద్ధ్యర్థం శరం మోక్తు మిహార్హసి ॥
ఇతి స్తుతోఽమరైస్సర్వై ర్విష్ణ్వాది విధిభిస్తదా ।
దగ్ధుం పురత్రయం తద్వై బాణేనైచ్ఛన్మహేశ్వరః ॥
అభిలాఖ్యముహూర్తే తు వికృష్య ధనురద్భుతమ్ ।
కృత్వా జ్యాతలనిర్ఘోషం నాదమత్యంత దుస్సహమ్ ॥
ఆత్మనో నామ విశ్రావ్య సమాభాష్య మహాసురాన్ ।
మార్తండకోటి వపుషం కాండముగ్రో ముమోచ హ ॥
దదాహ త్రిపురస్థాంస్తాన్ దైత్యాంస్త్రీన్ విమలాపహః ।
స ఆశుగో విష్ణుమయో వహ్నిశల్యో మహోజ్జ్వలన్ ॥
తతః పురాణి దగ్ధాని చతుర్జలధి మేఖలామ్ ।
గతాని యుగపద్భూమిం త్రీణి దగ్ధాని భస్మశః ॥

పరమేశ్వరుడు, సత్పురుషులకు శరణ్యుడు అగు ఆ ముక్కంటి దైవము ఆ మూడు పురములను క్షణములో భస్మము చేయుటకు సమర్థుడు. ఓ ఈశ్వరా! నీవు ఆ పురములకు బాణములను గురిపెట్టుము (22). ఓ దేవదేవా! నీవు నీ కంటి చూపుచే ముల్లోకములను భస్మము చేయ సమర్థుడవు. కాన మా కీర్తిని ఇనుమడింప జేయుట కొరకై ఆ బాణమును ప్రయోగించుము (23). విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలందరు.ఇట్లు స్తుతించగా, మహేశ్వరుడు ఆ త్రిపురములను బాణముచే దహించుటకు నిశ్చయించెను (24). అభిజిల్లగ్నము నందు శంకరుడు అద్భుతమగు ఆ ధనస్సును ఎక్కు పెట్టి, మిక్కిలి సహింపశక్యము కాని సింహనాదమును చేయుచూ నారిత్రాటిని మీటజొచ్చెను (25). తన పేరును అందరికీ వినిపించి, ఆ గొప్ప రాక్షసులను బిగ్గరగా ఆహ్వానించి, భయంకరాకారుడగు శివుడు కోటిసూర్యుల కాంతితో ప్రకాశించే ఆ బాణమును విడిచి పెట్టెను (26). సమస్త దోషములను తొలగించునది, విష్ణుస్వరూపమైనది, వేగముగా పయనించునది, భయంకరముగా మండుచున్నది అగు ఆ అగ్నిబాణము త్రిపురమునందున్న ఆ ముగ్గురు రాక్షసులను కాల్చివేసెను (27). అపుడా మూడు పురములు దగ్ధమై బూడిద రూపములో ఒక్కసారి, నాల్గు సముద్రములు మేఖలగా గల పృథివిపై పడినవి (28).

దైత్యాస్తు శతశో దగ్ధాస్తస్య బాణస్థవహ్నినా ।
హాహాకారం ప్రకుర్వంతశ్శివపూజా వ్యతి క్రమాత్ ॥
తారకాక్షస్తు నిర్దగ్ధో భ్రాతృభ్యాం సహితోఽ భవత్ ।
సస్మార స్వప్రభుం దేవం శంకరం భక్తవత్సలమ్ ॥
భక్త్యా పరమయా యుక్తః ప్రలపన్ వివిధా గిరః ।
మహాదేవం సముద్వీక్ష్య మనసా తమువాచ సః ॥

శివపూజను నిరాకరించిన కారణముచే వందలాది రాక్షసులు హాహాకారమును చే◌ేయుచూ ఆ బాణాగ్నిచే దహింపబడిరి (29). తారకాక్షుడు సోదరులతో గూడి దహింపబడు చున్నవాడై తనకు ప్రభువు, భక్తవత్సలుడు నగు శంకర దేవుని స్మరించెను (30). ఆతడు పరమ భక్తి గలవాడై అనేక వచనములను పలుకుచూ, మనస్సులో మహాదేవుని దర్శించి, ఆయనతో నిట్లనెను (31).

తారకాక్ష ఉవాచ ।

భవ జ్ఞాతోఽసి తుష్టోఽసి యద్యస్మాన్ సహ బంధుభిః ।
తేన సత్యేన భూయోఽ పి కదా త్వం ప్రదహిష్యసి ॥
దుర్లభం లబ్ధ మస్మాభిర్యద ప్రాప్యం సురాసురైః ।
త్వద్భావభావితా బుద్ధి ర్జాతే జాతే భవత్వితి ॥
ఇత్యేవం విబ్రువంతస్తే దానవాస్తేన వహ్నినా ।
శివాజ్ఞయాద్భుతం దగ్ధా భస్మసాదభవన్మునే ॥
అన్యేఽపి బాలా వృద్ధాశ్చ దానవాస్తేన వహ్నినా ।
శివాజ్ఞయా ద్రుతం వ్యాస నిర్దగ్ధా భస్మసాత్కృతాః ॥
స్త్రియో వా పురుషా వాది వాహనాని చ తత్ర యే ।
సర్వే తేనాగ్నినా దగ్ధాః కల్పాంతే తు జగద్యథా ॥
భర్తౄన్ కంఠ గాతాన్ హిత్వా కాశ్చిద్దగ్ధా వరస్త్రియః ।
కాశ్చిత్సుప్తాః ప్రమత్తాశ్చ రతిశ్రాంతాశ్చ యోషితః ॥
అర్ధదగ్ధా విబుద్ధాశ్చ బభ్రముర్మోహ మూర్ఛితాః ।
తేన నాసీత్సుసూక్ష్మోఽపి ఘోరత్రిపురవహ్నినా ॥
అవిదగ్ధో వినిర్ముక్త స్స్థావరో జంగమోఽపి వా ।
వర్జయిత్వా మయం దైత్యం విశ్వకర్మాణ మవ్యయమ్ ॥

తారకాక్షుడిట్లు పలికెను -

హే భవా! నేను నిన్ను తెలుసుకుంటిని. మమ్ములను బంధువులతో సహా దహించుటలో నీకు ఆనందమున్నచో, నీవు మమ్ములను మరల వాస్తవముగా ఎప్పుడు దహించెదవు? (32) దేవతలకు గాని, రాక్షసులకు గాని లభింపశక్యము గాని భాగ్యము మాకు లభించినది. మా మనస్సులు జన్మజన్మలలో నీ చింతనతో నిండి యుండు గాక! (33) ఓ మునీ! ఆ రాక్షసులు ఇట్లు పలుకుతూ శివుని యాజ్ఞచే ఆ అగ్నిచే దహింపబడి బూడిదయైనారు. ఆ దృశ్యము అద్భుతముగ నుండెను (34). ఓ వ్యాసా! బాలురు, వృద్ధులు అగు ఇతర రాక్షసులు కూడా శివాజ్ఞచే శీఘ్రముగా ఆ అగ్నిచే దహింపబడి బూడిదయైనారు (35). కల్పాంతమునందు జగత్తు భస్మ మగు తీరున, ఆ త్రిపురములోని స్త్రీలు, పురుషులు, అచట నున్న వాహనములు ఇత్యాది సర్వము ఆ అగ్నిచే భస్మము చేయబడెను (36). కొందరు సుందర యువతులు భర్తను కంఠమునందు కౌగిలించి యుండగానే దహింపబడిరి. ఆటపాటలలో అలసి సొలసి, మరియు మత్తెక్కి నిద్రించియున్న స్త్రీలు అటులనే దగ్ధమైరి (37). కొందరు సగము కాలి తెలివి తెచ్చుకొని మోహముతో ఇటునటు పరువులెత్తి మూర్ఛిల్లిరి. ఘోరమగు ఆ అగ్నిచే దహింపబడని సూక్ష్మమగు వస్తువు అయిననూ ఆ త్రిపురములో లేకుండెను (38). కదలాడని జడములు గాని, కదలాడే ప్రాణులు గాని దహింపబడకుండగా విడువబడినవి అచట లేకుండెను. రాక్షసుల విశ్వకర్మయగు మయాసురునకు వినాశము లేదు. ఆయన తక్క సర్వము నశించెను (39).

అవిరుద్ధం తు దేవానాం రక్షితం శంభుతేజసా ।
విపత్కాలేఽ పి సద్భక్తం మహేశ శరణాగతమ్ ॥
సన్నిపాతో హి యేషాం నో విద్యతే నాశకారకః ।
దైత్యానామన్యసత్త్వానాం భావాభావే కృతాకృతే ॥
తస్మా ద్యత్నస్సుసంభావ్యస్సద్భిః కర్తవ్య ఏవ హి ।
గర్హణాత్ క్షీయతే లోకో న తత్కర్మ సమాచరేత్ ॥
న సంయోగో యథా తేషాం భూయాత్త్రి పురవాసినామ్ ।
మతమేతద్ధి సర్వేషాం దైవాద్యది యతో భవేత్ ॥
యే పూజయంతస్తత్రాపి దైత్యా రుద్రం సబాంధవాః ।
గాణపత్యం యయుస్సర్వే శివపూజా విధేర్బలాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధ ఖండే త్రిపుర దాహవర్ణనం నామ దశమోఽధ్యాయః ॥

మయుడు దేవతలకు విరోధి కాదు. ఆపత్కాలమునందైననూ మహాభక్తుడు, మహేశుని శరణు పొందినవాడు అగు మయుడు శంభుని తేజస్సుచే రక్షింపబడెను (40). రాక్షసులు గాని, ఇతర ప్రాణులు గాని చేయు కర్మలు, పరిత్యజించు కర్మలు, మరియు వారి రాగ ద్వేషములు పతనహేతువులు కొనిచో, వారికి వినాశము కలుగదు (41). కావున సత్పురుషులు మిక్కిలి యోగ్యమగు కర్మను ఆచరించుటకై యత్నించవలెను. పాపకర్మచే ఇహపరములు నశించును. కావున అట్టి నిందనీయమగు కర్మను చేయరాదు (42). త్రిపురవాసులకు ఘటిల్లిన సంగము వంటి సంగము ఇతరులకు కలుగకుండు గాక! అట్టి సంగము దానిని సర్వులు స్వీకరించవలసినదే గదా! (43) ఆ రాక్షసులు బంధువులతో గూడి త్రిపురములలో నున్నవారై శివుని పూజించిరి గదా! వారందరు ఆ శివపూజానుషాన ప్రభావముచే గాణపత్య స్థానమును పొందిరి (44).

శ్రీ శివ మహా పురాణములోని రుద్ర సంహితయందు యుద్ధఖండలో త్రిపుర దహన వర్ణనమనే పదియవ అధ్యాయము ముగిసినది (10).

11 - దేవస్తుతి

వ్యాస ఉవాచ ।

బ్రహ్మపుత్ర మహాప్రాజ్ఞ ధన్యస్త్వం శైవసత్త మ ।
కిమకార్షు స్తతో దేవా దగ్ధే చ త్రిపురేఽ ఖిలాః ॥
మయః కుత్ర గతో దగ్ధో పతయః కుత్ర తే గతాః ।
తత్సర్వం మే సమాచక్ష్వ యది శంభుకథాశ్రయమ్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

హే బ్రహ్మపుత్రా! శివ భక్తాగ్ర గణ్యుడవగు నీవు మహా ప్రాజ్ఞుడవు, ధన్యుడవు. త్రిపురమునందలి అందరు దహింపబడిన తరువాత దేవతలు ఏమి చేసిరి? (1) మయుడు ఎచటకు వెళ్లెను? ఆ త్రిపురాధిపతులు ఎట్టి గతిని పొందినారు? శంభుని గాథ ఆశ్రయముగా గల ఆ వృత్తాంతమునంతనూ నాకు చెప్పుము (2).

సూత ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వ్యాసవాక్యం భగవాన్ భవకృత్సుతః ।
సనత్కుమారః ప్రోవాచ శివపాదయుగం స్మరన్ ॥

సూతుడిట్లు పలికెను -

బ్రహ్మ పుత్రుడగు సనత్కుమార భగవానుడు వ్యాసుని ఈ మాటను విని, శివుని పాదయుగళమును స్మరించి ఇట్లు బదులిడెను (3).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాబుద్ధే పారాశర్య మహేశితుః ।
చరితం సర్వపాపఘ్నం లోకలీలాను సారిణః ॥
మహేశ్వరేణ సర్వస్మింస్త్రిపురే దైత్యసంకులే ।
దగ్ధే విశేషతస్తత్ర విస్మితాస్తేఽ భవన్ సురాః ॥
న కించిదబ్రువన్ దేవాః సేంద్రోపేంద్రా దయస్తదా ।
మహాతేజస్వినం రుద్రం సర్వే వీక్ష్య ససంభ్రమాః ॥
మహాభయంకరం రౌద్రం ప్రజ్వలంతం దిశో దశ ।
కోటి సూర్యప్రతీకాశం ప్రలయానిల సన్నిభమ్ ॥
భయాద్దేవం నిరీక్ష్యైవ దేవీం చ హిమవత్సుతామ్ ।
బిభ్యురే నిఖిలా దేవ ప్రముఖాస్తస్థు రానతాః ॥
దృష్ట్వానీకం తదా భీతం దేవానామృషిపుంగవాః ।
న కించి దూచుస్సంతస్థుః ప్రణేముస్తే సమంతతః ॥

అథ బ్రహ్మాపి సంభీతో దృష్ట్వా రూపం చ శాంకరమ్ ।
తుష్టావ తుష్టహృదయో దేవైః స్వహ సమాహితః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! మహాబుద్ధీ! పరాశరా పుత్రా! లోక లీలలను అనుసరించే మహేశ్వరుని చరితమును వినుము. ఈ చరితము సర్వపాపములను నిర్మూలించును (4). రాక్షసులతో నిండియున్న త్రిపురములు సంపూర్ణముగా మహేశ్వరునిచే దహింపబడగా, అచట ఆ దేవతలు పరమాశ్చర్య భరితులైరి (5). ఇంద్రుడు, విష్ణువు మొదలగు దేవతలందరు అపుడు మహాతేజశ్శాలియగు రుద్రుని గాంచి తొట్రుపాటును చెందినవారై ఏమియూ పలుకకుండగా మిన్నకుండిరి (6). మహాభయంకరమగు ఉగ్రరూపము గలవాడు, పది దిక్కులను తన తేజస్సుచే మండునట్లు చేయువాడు, కోటి సూర్యుల తేజస్సు గలవాడు, ప్రళయ కాలాగ్నిని బోలియున్నవాడు (7) అగు శివుని, మరియు హిమవత్పుత్రియగు ఉమాదేవిని గాంచిన దేవోత్తములు అందరు భయపడి తలలు వంచి నిలబడి యుండిరి (8). ఇట్లు భయపడియున్న దేవసైన్యమును గాంచిన మహర్షులు నిశ్శబ్దముగా అన్ని దిక్కులయందు నమస్కరించి మిన్నకుండిరి (9). అపుడు సంతుష్టి చెందిన హృదయము గల బ్రహ్మ శంకరుని ఆ రూపమును గాంచి మిక్కిలి భీతిల్లి దేవతలతో కూడిన వాడై సమాహిత చిత్తముతో స్తుతించెను (10).

విష్ణునా చ స భీతేన దేవ దేవం భవం హరమ్ ।
త్రిపురారిం సగిరిజం భక్తా ధీనం మహేశ్వరమ్ ॥

బ్రహ్మ భయపడియున్న విష్ణువుతో గూడి, దేవదేవుడు, పాపహారి, భవుడు, త్రిపురాంతకుడు, పార్వతీపతి, భక్తులకు వశమగు వాడు అగు మహేశ్వరుని స్తుతించెను (11).

బ్రహ్మోవాచ ।

దేవ దేవ మహాదేవ భక్తానుగ్రహకారక ।
ప్రసీద పరమేశాన సర్వ దేవహిత ప్రద ॥
ప్రసీద జగతాం నాథ ప్రసీదానంద దాయక ।
ప్రసీద శంకరాస్వామిన్ ప్రసీద పరమేశ్వర ॥
ఓంకారాయ నమస్తుభ్యం మాకారపర తారక ।
ప్రసీద సర్వదేవేశ త్రిపురఘ్న మహేశ్వర ॥
నానావాచ్యాయ దేవాయ వరణప్రియ శంకర ।
అగుణాయ నమస్తుభ్యం ప్రకృతేః పురుషాత్పర ॥
నిర్వికారాయ నిత్యాయ నిత్యతృప్తాయ భాస్వతే ।
నిరంజనాయ దివ్యాయ త్రిగుణాయ నమోఽస్తుతే ॥

సగుణాయ నమస్తుభ్యం స్వర్గేశాయ నమోఽస్తుతే ।

సదాశివాయ శాంతాయ మహేశాయ పినాకినే ॥

సర్వజ్ఞాయ శరణ్యాయ సద్యోజాతాయ తే నమః ।

వామదేవాయ రుద్రాయ తథా తత్ పురుషాయ చ ॥

అఘోరాయ సుసేవ్యాయ భక్తా ధీనాయ తేనమః ।

ఈశానాయ వరేణ్యాయ భక్తానంద ప్రదాయినే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవ దేవా! మహా దేవా! భక్తులననుగ్రహించు వాడా! దేవతలందరికీ హితమును కలుగజేయువాడా! పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము(12). ఓ జగన్నాథా! ప్రసన్నుడవు కమ్ము. ఆనందమునిచ్చువాడా! అనుగ్రహించుము. శంకరస్వామీ! ప్రసన్నుడవు కమ్ము. పరమేశ్వరా! దయను చూపుము (13). ఓం కారస్వరూపుడవగు నీకు నమస్కారము. నీ రూపమును ధ్యానించు వారిని నీవు రక్షించెదవు. సర్వదేవ ప్రభూ! త్రిపుర సంహారా! మహేశ్వరా! ప్రసన్నుడవగుము.(14). నామములన్నింటిచే నిర్దేశింపబడువాడు, భక్తప్రియుడు, నిర్గుణుడు, ప్రకృతి పురుషుల కంటె అతీతుడు అగు నీకు, ఓ శంకర దేవా! నమస్కారము (15). వికారములు లేనివాడు, శాశ్వతుడు, సర్వదా తృప్తిని చెందియుండు వాడు, ప్రకాశస్వరూపుడు, కర్మ లేపము లేనివాడు, త్రిగుణాత్మకుడు అగు నీకు నమస్కారము (16). సగుణుడవగు నీకు నమస్కారము. స్వర్గమునకు ప్రభువు, సదాశివుడు, శాంతుడు, మహేశ్వరుడు, పినాకధారి యగు నీకు నమస్కారము (17). సర్వజ్ఞుడు, శరణ్యుడు, సద్యోజాతుడు, వామదేవుడు, తత్పురుషుడు, రుద్రుడు అగు నీకు నమస్కారము (18). శాంతస్వరూపుడు, చక్కగా సేవింప దగినవాడు, భక్తులకు వశములో నుండువాడు, సర్వేశ్వరుడు, సర్వ శ్రేష్ఠుడు, భక్తులకు ఆనందము నిచ్చువాడు అగు శివునకు నమస్కారము (19).

రక్ష రక్ష మహాదేవ భీతాన్నస్సకలా మరాన్ ।

దగ్ధ్వా చ త్రిపురం సర్వే కృతార్థా అమరాః కృతాః ॥

స్తుత్వైవం దేవతాస్సర్వా నమస్కారం పృథక్ పృథక్ ।

చక్రుస్తే పరమ ప్రీతా బ్రహ్మాద్యాస్తు సదాశివమ్ ॥

అథ బ్రహ్మా స్వయం దేవం త్రిపురారిం మహేశ్వరమ్ ।

తుష్టావ ప్రణతో భూత్వా నతస్కంధః కృతాంజలిః ॥

ఓ మహా దేవా! భయపడి యున్న మా దేవతల నందరినీ రక్షింపుము. రక్షింపుము. నీవు త్రిపురములను దహించుటచే మా దేవతలందరు కృతార్థులైనారు (20). బ్రహ్మ మొదలగు దేవతలందురు ఇట్లు స్తుతించి, పరమప్రీతులై సదా శివునకు ఒక్కొక్కరుగా నమస్కరించిరి (21). అపుడు బ్రహ్మ చేతులు ఒగ్గి సాష్టాంగ ప్రణామమాచరించి త్రిపురాంతకుడగు మహేశ్వర దేవుని స్వయముగా నిట్లు స్తుతించెను (22).

బ్రహ్మోవాచ।

భగవన్ దేవ దేవేశ త్రిపురాంతక శంకర ।

త్వయి భక్తిః పరామేఽస్తు మహాదేవానపాయినీ ॥

సర్వదా మేఽస్తు సారథ్యం తవ దేవేశ శంకర ।

అనుకూలో భవ విభో సదా త్వం పరమేశ్వర ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హే భగవన్ ! దేవ దేవా! ఈశ్వరా! త్రిపుర సంహారీ! శంకరా! మహా దేవా! నాకు నీ యందు ఎన్నటికీ తొలగిపోని పరా భక్తి కలుగు గాక! (23) ఓ దేవదేవా! శంకరా! నీవు అన్నివేళలా సారథివై నన్ను నడిపించుము. హే విభో! పరమేశ్వరా! నీవు నాకు సర్వదా అనుకూలుడవు కమ్ము (24).

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుత్వా విధిశ్శంభుం భక్తవత్సలమానతః ।

విరరామ నతస్కంధః కృతాంజలి రుదారధీః ॥

జనార్దనోఽపి భగవాన్ నమస్కృత్య మహేశ్వరమ్ ।

కృతాంజలి పుటో భూత్వా తుష్టావ చ మహేశ్వరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

విశాలహృదయుడగు బ్రహ్మ చేతులను జోడించి సాష్టాంగప్రణామాచరించి భక్తవత్సలుడగు శంభుని ఈ విధంబున స్తుతించి విరమించెను (25). విష్ణు భగవానుడు కూడా చేతులు జోడించి మహేశ్వరునకు నమస్కరించి ఇట్లు స్తుతించెను (26).

విష్ణురువాచ ।

దేవాధీశ మహేశాన దీనబంధో కృపాకర ।

ప్రసీద పరమేశాన కృపాం కురు నతప్రియ ॥

నిర్గుణాయ నమస్తుభ్యం పునశ్చ సగుణాయ చ ।

పునః ప్రకృతిరూపాయ పునశ్చ పురుషాయ చ ॥

పశ్చాద్గుణ స్వరూపాయ నతో విశ్వాత్మనే నమః ।

భక్తి ప్రియాయ శాంతాయ శివాయ పరమాత్మనే ॥

సదాశివాయ రుద్రాయ జగతాం పతయే నమః ।

త్వయి భక్తిర్దృఢా మే ఽద్య వర్ధమానా భవత్వితి ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవాధి దేవా! మహేశ్వరా! దీనబంధూ! కృపానిధీ! ప్రసన్నుడవగుము. ఓ పరమేశ్వరా! నమస్కరించు వారిపై ప్రేమ గల నీవు దయను చూపుము (27).

నిర్గుణుడవు, సగుణుడవు కూడ నీవే. పురుషుడవు, ప్రకృతి కూడ నీవే. అట్టి నీకు నమస్కారము (28), సృష్టి అయిన తరువాత త్రిగుణాత్మకుడైన విశ్వస్వరూపుడు, భక్తి ప్రియమైనవాడు, శాంతుడు, శివుడు, పరమాత్మ అగు నీకు నమస్కారము (29). సదాశివుడు, రుద్రుడు, జగత్తులకు ప్రభువు అగు నీకు నమస్కారము. నీ యందు నాకు దృఢమగు భక్తి ఈనాడు వర్ధిల్లును గాక! (30)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా విరరామాసౌ శైవ ప్రవరసత్తమః ।
సర్వే దేవాః ప్రణమ్యోచుస్తతస్తం పరమేశ్వరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శివభక్తులలో అగ్రగణ్యుడగు విష్ణువు ఇట్లు పలికి విరమించెను. అపుడు దేవతలందరు ఆ పరమేశ్వరునకు ప్రణమిల్లి ఇట్లు పలికిరి (31).

దేవా ఊచుః ।

దేవనాథ మహాదేవ కరుణాకర శంకర ।
ప్రసీద జగతాం నాథ ప్రసీద పరమేశ్వర ॥
ప్రసీద సర్వకర్తా త్వం నమామస్త్వాం వయం ముదా ।
త్వయి భక్తిర్దృఢాస్మాకం నిత్యం స్యాదనపాయినీ ॥

దేవతలిట్లు పలికిరి -

దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! శంకరా! జగన్నాథా! ప్రసన్నుడవగుము. పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము (32). సర్వమును చేయువాడవు నీవే. నిన్ను మేము ఆనందముతో నమస్కరించు చున్నాము. మాకు నీ యందు ఎన్నటికీ తొలగిపోని నిత్యమగు భక్తి దృఢముగా కలుగు గాక! (33)

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుతశ్చ దేవేశో బ్రహ్మణా హరిణామరైః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా శంకరో లోకశంకరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బ్రహ్మ విష్ణువులు, మరియు దేవతలు ఇట్లు స్తుతించగా, లోకములకు మంగళములను కలుగజేయు శంకరుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై ఇట్లు బదులిడెను (34).

శంకర ఉవాచ ।

హే విధే హే హరే దేవాః ప్రసన్నోఽస్మి విశేషతః ।

మనోఽభిలషితం బ్రూత వరం సర్వే విచారతః ॥

శంకరుడిట్లు పలికెను –

ఓ బ్రహ్మా! హరీ! దేవతలారా! నేను మిక్కిలి ప్రసన్నుడనైతిని. మీరందరు విచారము చేసి మీ మనస్సులలోని అభీష్టమును చెప్పుడు. వరము నిచ్చెదను (35).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తం వచనం శ్రుత్వా హరేణ మునిసత్తమ ।

ప్రత్యూచుస్సర్వదేవాశ్చ ప్రసన్నేనాంతరాత్మనా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ మహర్షీ ! హరుడు ప్రసన్నమగు మనస్సుతో పలికిన ఈ మాటను విని దేవతలందరు ఇట్లు బదులిడిరి (36).

సర్వే దేవా ఊచుః ।

యది ప్రసన్నో భగవన్ యది దేయో వరస్త్వయా ।

దేవదేవేశ చాస్మభ్యం జ్ఞాత్వా దాసాన్ హి నస్సురాన్ ॥

యదా దుఃఖం తు దేవానాం సంభవేద్దేవ సత్తమ ।

తదా త్వం ప్రకటో భూత్వా దుఃఖం నాశయ సర్వదా ॥

దేవతలందరు ఇట్లు పలికిరి –

హే భగవాన్! నీవు ప్రసన్నుడవై వరమునీయ దలంచినచో, దేవతలమగు మమ్ములను నీ దాసులుగా స్వీకరించుము. ఓ దేవదేవా! ఈశ్వరా! (37) దేవశ్రేష్ఠా! దేవతలకు ఎప్పుడెప్పుడు దుఃఖము కలిగిననూ, అప్పుడప్పుడు నీవు నిశ్చయముగా ప్రకటమై దుఃఖమును నశింపజేయుము (38).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తో భగవాన్రుద్రో బ్రహ్మణా హరిణామరైః ।
యుగపత్ప్రాహ తుష్టాత్మా తథేత్యస్తు నిరంతరమ్ ॥
స్తవైరేతైశ్చ తుష్టోఽస్మి దాస్యామి సర్వదా ధ్రువమ్ ।
యదభీష్టతమం లోకే పఠతాం శృణ్వతాం సురాః ॥
ఇత్యుక్త్వా శంకరః ప్రీతో దేవదుఃఖహరస్సదా ।
సర్వదేవ ప్రియం యద్వై తత్సర్వం చ ప్రదత్తవాన్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే దేవస్తుతి
వర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బ్రహ్మ, విష్ణువు మరియు దేవతలు ఒక్కుమ్మడిగా ఇట్లు పలుకగా, రుద్రభగవానుడు సంతసించిన అంతఃకరణము గలవాడై అనేక పర్యాయములు 'తథాస్తు' అని పలికెను (39). మీ ఈ స్తోత్రములచే సంతసించితిని. వీటిని పఠించు వారలకు, విను వారలకు సర్వకాలములయందు అభీష్టతమములైన సర్వసంపదలను నిశ్చయముగా నీయగలను. ఓ దేవతలారా! తెలియుడు (40). సర్వదా దేవతల దుఃఖములను పోగొట్టు శంకరుడు సంతసిల్లి ఇట్లు పలికి, దేవతలందరికీ అభీష్టమైన కోర్కెలనన్నిటినీ ఇచ్చెను (41).

శ్రీ శివ మహాపురాణములో రుద్రసంహితయందు యుద్ధఖండలో దేవస్తుతి యను పదునొకండవ అధ్యాయము ముగిసినది (11).

12 - మయస్తుతి

సనత్కుమార ఉవాచ ।

ఏతస్మిన్నంతరే శంభుం ప్రసన్నం వీక్ష్య దానవః ।
తత్రాజగమ సుప్రీతో మయోఽదగ్ధః కృపాబలాత్ ॥
ప్రణనామ హరం ప్రీత్యా సురానన్యానపి ధ్రువమ్ ।
కృతాంజలి ర్నతస్కంధః ప్రణనామ పునశ్శివమ్ ॥
అథోత్థాయ శివం దృష్ట్వా ప్రేమ్ణా గద్గదసుస్వరః ।
తుష్టావ భక్తి పూర్ణాత్మా స దానవవరో మయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఇంతలో శంభుడు ప్రసన్నుడగుటను గాంచి, శంభుని అనుగ్రహ బలముచే దహింప బడని మయాసురుడు ఆనందముతో అచటకు వచ్చెను (1). ఆతడు చేతులు జోడించి శివునకు ప్రీతితో నమస్కరించి, ఇతర దేవతలకు గూడ నిశ్శంకముగా నమస్కరించి, మరల శివునకు సాష్టాంగ నమస్కారమును చేసెను (2). దానవ శ్రేష్ఠుడగు ఆ మయుడు అపుడు లేచి శివుని చూచి ప్రేమతో బొంగురు వోయిన కంఠస్వరము గలవాడై, భక్తితో నిండిన అంతరంగము గలవాడై ఇట్లు స్తుతించెను (3).

మయ ఉవాచ ।

దేవ దేవ మహాదేవ భక్తవత్సల శంకర ।
కల్పవృక్ష స్వరూపోఽసి సర్వపక్ష వివర్జితః ॥
జ్యోతీ రూపో నమస్తేస్తు విశ్వరూప నమోఽస్తు తే ।
నమః పూతాత్మనే తుభ్యం పావనాయ నమో నమః ॥
చిత్ర రూపాయ నిత్యాయ రూపాతీతాయ తే నమః ।
దివ్యరూపాయ దివ్యాయ సుదివ్యా కృతయే నమః ॥
నమః ప్రణతసర్వార్తి నాశకాయ శివాత్మనే ।
కర్త్రే భర్త్రే చ సంహర్త్రే త్రిలోకానాం నమో నమః ॥
భక్తి గమ్యాయ భక్తానాం నమస్తుభ్యం కృపాలవే ।
తపస్సత్ఫలదాత్రే తే శివాకాంత శివేశ్వర ॥
న జానామి స్తుతిం కర్తుం స్తుతిప్రియ వరేశ్వర ।
ప్రసన్నో భవ సర్వేశ పాహి మాం శరణాగతమ్ ॥

మయుడిట్లు పలికెను -

దేవ దేవా! మహా దేవా! భక్త ప్రియా! శంకరా! కల్పవృక్ష స్వరూపుడవగు నీకు స్వపర భేదము లేదు (4). జ్యోతిస్స్వరూపుడవగు నీకు నమస్కారము. జగద్రూపుడవగు నీకు నమస్కారము. పవిత్రమగు అంతఃకరణము గల నీకు నమస్కారము. పవిత్రము చేయు నీకు అనేక నమస్కారములు (5). చిత్రమగు ఆకారము గల వాడవు, నిత్యుడవు, రూపములకు అతీతమైన వాడవు అగు నీకు నమస్కారము. దివ్య స్వరూపుడవు, దివ్యమగు ఆకారము గలవాడవు అగు నీకు నమస్కారము (6). నమస్కరించిన వారి కష్టముల నన్నిటినీ నశింపజేయువాడు, మంగళ స్వరూపుడు, ముల్లోకములను సృష్టించి భరించి పోషించి లయమును చేయువాడు అగు నీకు అనేక నమస్కారములు (7). భక్తిచే పొందదగినవాడు, భక్తులయెడ దయతో నిండినవాడు, తపస్సునకు యోగ్యమగు ఫలము నొసంగువాడు, పార్వతీపతి, మంగళరూపుడు, జగదీశ్వరుడు అగు నీకు నమస్కారము (8). ఓ శ్రేష్ఠమగు ప్రభువా! నీవు స్తోత్రప్రియుడవు. కాని స్తుతించుట నేను ఎరుంగను. ఓ సర్వేశ్వరా! నీవు ప్రసన్నుడవై శరణు జొచ్చిన నన్ను రక్షింపుము (9).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య మయోక్తాం హి సంస్తుతిం పరమేశ్వరః ।
ప్రసన్నోఽ భూద్ద్విజ శ్రేష్ఠ మయం ప్రోవాచ చాదరాత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! మయుడు చేసిన ఈ స్తోత్రమును విని పరమేశ్వరుడు ప్రసన్నుడై ప్రేమతో మయుని ఉద్దేశించి ఇట్లు పలికెను (10).

శివ ఉవాచ ।

వరం బ్రూహి ప్రసన్నోఽహం మయ దానవసత్తమ ।
మనోఽ భిలషితం యత్తే తద్దాస్యామి న సంశయః ॥

శివుడిట్లు పలికెను -

ఓ రాక్షసశ్రేష్ఠా! మయా! నేను ప్రసన్నుడనైతిని. నీ మనస్సునకు నచ్చిన వరమును కోరుకొనుము. నేను ఇచ్చెదను. సంశయము లేదు (11).

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వా శివం వచశ్శంభోస్స మయో దానవర్షభః ।
ప్రత్యువాచ ప్రభుం నత్వా నతస్కంధః కృతాంజలిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

రాక్షస శ్రేష్ఠుడగు ఆ మయుడు శంభుని ఈ మంగళ కరమగు వచనమును విని చేతులు జోడించి ప్రభువునకు సాష్టాంగ నమస్కారమును జేసి ఇట్లు బదులిడెను (12).

మయ ఉవాచ ।

దేవ దేవ మహాదేవ ప్రసన్నో యది మే భవాన్ ।
వరయోగ్యోఽ స్మ్యహం చేద్ధి స్వభక్తిం దేహి శాశ్వతీమ్ ॥
స్వభక్తేషు సదా సఖ్యం దీనేషు చ దయాం సదా ।
ఉపేక్షామన్య జీవేషు ఖలేషు పరమేశ్వర ॥
కదాపి నాసురో భావో భవేన్మ మ మహేశ్వర ।
నిర్భయస్స్యాం సదా నాథ మగ్నస్త్వద్భజనే శుభే ॥

మయుడిట్లు పలికెను -

దేవ దేవా! మహాదేవా! నీవు నా యందు ప్రసన్నుడవైనచో, నేను వరమునకు అర్హుడనైనచో, నాకు నీయందు శాశ్వత భక్తి కలుగునట్లు అనుగ్రహించుము (13). నీ భక్తులతో నిత్యమైత్రిని, దీనుల యెడ సర్వదా దయాభావమును, ఇతరప్రాణులయందు దుష్టులయెడల ఉపేక్షాభావమును ఇమ్ము. ఓ పరమేశ్వరా! (14) నాకు ఎన్నటికి అసుర భావము కలుగకుండు గాక! ఓ మహేశ్వరా! నేను సర్వదా మంగళకరమగు నీ భజన యందు నిమగ్నుడనై నిర్భయుడనై ఉండెదను గాక! (15)

సనత్కుమార ఉవాచ ।

ఇతి సంప్రార్థ్యమానస్తు శంకరః పరమేశ్వరః ।
ప్రత్యువాచ మయేనాథ ప్రసన్నో భక్తవత్సలః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మయుడు ఇట్లు ప్రార్థించగా భక్తవత్సలుడు, పరమేశ్వరుడునగు శంకరుడు ప్రసన్నుడై అపుడు ఇట్లు బదులిడెను (16).

మహేశ్వర ఉవాచ ।

దానవర్షభ ధన్యస్త్వం మద్భక్తో నిర్వికారవాన్ ।
ప్రదత్తాస్తే వరాస్సర్వేఽ భీప్సితా యే తవాధునా ॥
గచ్ఛ త్వం వితలం లోకం రమణీయం దివోఽపి హి ।
సమేతః పరివారేణ నిజేన మమ శాసనాత్ ॥
నిర్భయస్తత్ర సంతిష్ఠ సంహృష్టో భక్తిమాన్ సదా ।
కదాపి నాసురో భావో భవిష్యతి మదాజ్ఞయా ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

రాక్షసశ్రేష్ఠా! నా భక్తుడవగు నీవు ధన్యుడవు. నీ యందు వికారములు లేవు. నీవు ఇపుడు కోరిన వరములనన్నిటినీ నీకు ఇచ్చుచున్నాను (17). నీవు నా శాసనముచే నీ పరివారముతో గూడి, స్వర్గము కంటే కూడా సుందరమైన వితలలోకమునకు వెళ్లుము (18). నీవు అచట నిర్భయముగా ఆనందముతో జీవించుము. సర్వదా భక్తిని కలిగియుండుము. నా ఆజ్ఞచే నీకు ఏనాడైననూ అసురభావము కలుగబోదు (19).

సనత్కుమార ఉవాచ।

ఇత్యాజ్ఞాం శిరసాధాయ శంకరస్య మహాత్మనః ।
తం ప్రణమ్య సురాంశ్చాపి వితలం ప్రజగామ సః ॥
ఏతస్మిన్నంతరే తే వై ముండినశ్చ సమాగతాః ।
ప్రణమ్యోచుశ్చ తాన్ సర్వాన్ విష్ణు బ్రహ్మాదికాన్ సురాన్ ॥
కుత్ర యామో వయం దేవాః కర్మ కిం కరవామహే ।
ఆజ్ఞాపయత నశ్శీఘ్రం భవదాదేశ కారకాన్ ॥
కృతం దుష్కర్మ చాస్మాభిర్హే హరే హే విధే సురాః ।
దైత్యానాం శివ భక్తానాం శివభక్తిర్వినాశితా ॥
కోటికల్పాని నరకే నో వాసస్తు భవిష్యతి ।
నోద్ధారో భవితా నూనం శివభక్తి విరోధినామ్ ॥
పరం తు భవదిచ్ఛాత ఇదం దుష్కర్మ నః కృతమ్ ।
తచ్ఛాంతిం కృపయా బ్రూత వయం వశ్శరణాగతాః ॥
తేషాం తద్వచనం శ్రుత్వా విష్ణు బ్రహ్మాదయస్సురాః ।
అబ్రువన్ముండినస్తాంస్తే స్థితానగ్రే కృతాంజలీన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహాత్ముడగు శంకరుని ఈ ఆజ్ఞను శిరసా వహించి ఆతడు దేవతలకు కూడ నమస్కరించి వితలలోకమునకు వెళ్లెను (20). ఇంతలో ఆ ముండిత శిరస్కులగు సన్న్యాసులు అచటకు వచ్చి బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలందరికీ

ప్రణమిల్లి ఇట్లు పలికిరి (21). దేవతలారా! మేము ఎచ్చటకు పోవలెను? ఏ పనిని చేయవలెను? మీ ఆజ్ఞను నిర్వర్తించు మమ్ములను శీఘ్రముగా ఆజ్ఞాపించుడు (22). ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! దేవతలారా! మేము చెడు పనిని చేసితిమి. శివభక్తులగు రాక్షసుల శివభక్తిని చెడగొట్టితిమి (23). మాకు కోటికల్పముల వరకు నరకవాసము తప్పదు. శివభక్తి విరోధులమగు మమ్ములను ఉద్ధరించువాడు నిశ్చయముగా ఉండబోడు (24). కాని మీ కోర్కెననుసరించి ఈ చెడు పనిని మేము చేసితిమి. దయతో దానికి ప్రాయశ్చిత్తమును చెప్పుడు. మేము మిమ్ములను శరణు జొచ్చితిమి (25). ఆ సన్న్యాసులు ఇట్లు పలికి చేతులు జోడించి ఎదురుగా నిలబడిరి. వారి ఆ మాటలను విని, విష్ణువు బ్రహ్మ మొదలగు దేవతలు ఇట్లు పలికిరి (26).

విష్ణ్వాదయ ఊచుః ।

న భేతవ్యం భవద్భిస్తు ముండినో వై కదాచన ।
శివాజ్ఞయేదం సకలం జాతం చరితముత్తమమ్ ॥
యుష్మాకం భవితా నైవ కుగతిర్దుః ఖదాయినీ ।
శివవాచా యతో యూయం దేవర్షి హితకారకాః ॥
సురర్షిహిత కృచ్ఛంభు స్సురర్షి హితకృత్ప్రియః ।
సురర్షిహితకృన్నృణాం కదాపి కుగతిర్న హి ॥
అద్యతో మతమేతం హి ప్రవిష్టానాం నృణాం కలౌ ।
కుగతిర్భవితా బ్రూమస్సత్యం నైవాత్ర సంశయః ॥
భవద్భిర్ముండినో ధీరా గుప్తభావాన్మమాజ్ఞయా ।
తావన్మరుస్థలీ సేవ్యా కలిర్యావత్సమా వ్రజేత్ ॥
ఆగతే చ కలౌ యూయం స్వమతం స్థాపయిష్యథ ।
కలౌ తు మోహితా మూఢా స్సంగ్రహీష్యంతి వో మతమ్ ॥
ఇత్యా జ్ఞప్తాస్సురేశైశ్చ ముండినస్తే మునీశ్వర ।
నమస్కృత్య గతాస్తత్ర యథోద్దిష్టం స్వమా శ్రమమ్ ॥

విష్ణువు మొదలగు దేవతలు ఇట్లు పలికిరి -

ఓ సన్న్యాసులారా! మీరు ఎన్నటికీ భయపడకుడు. ఈ ఉత్తమమగు వృత్తాంతమంతయూ శివుని ఆజ్ఞచే ఘటిల్లినది (27). మీకు దుఃఖదాయకమగు దుర్గతి ఎన్నటికీ కలుగబోదు. ఏలయనగా, మీరు శివుని ఆజ్ఞచే దేవతలకు, ఋషులకు హితమును చేసియున్నారు (28). దేవతలకు, ఋషులకు హితమును చేయు శివునకు దేవర్షులకు హితమును చేయువారియందు ప్రీతి మెండు. దేవతలకు, ఋషులకు హితమును చేయు మానవులకు ఎన్నటికీ దుర్గతి కలుగబోదు (29). ఈనాటి నుండియూ కలియుగములో ఈ మతములో ప్రవేశించిన మానవులకు దుర్గతి కలుగును. మేము సత్యమును పలుకుచున్నాము. దీనిలో సందేహము లేదు (30). ధీరులగు ఓ సన్న్యాసులారా! మీరు నా ఆజ్ఞచే కలి వచ్చువరకు ఎడారి ప్రదేశమును ఆశ్రయించి రహస్యముగా ఉండుడు (31). కలి

ప్రవేశించగానే మీరు మీ మతమును స్థాపించుడు. మూర్ఖులు అజ్ఞానమునకు వశులై కలియుగములో మీ మతమును స్వీకరించగలరు (32). ఓ మహర్షీ! దేవోత్తములు ఇట్లు ఆజ్ఞాపించగా, ఆ సన్న్యాసులు నమస్కరించి, తమకు నిర్దేశింపబడిన నివాస స్థానమునకు వెళ్లిరి (33).

తతస్స భగవాన్ రుద్రో దగ్ధ్వా త్రిపురవాసినః ।
కృతకృత్యో మహాయోగీ బ్రహ్మాద్యైరభిపూజితః ॥
స్వగణైర్నిఖిలైర్దేవ్యా శివయా సహితః ప్రభుః ।
కృత్వామర మహత్కార్యం ససుతోఽంతరధాదథ ॥
తతశ్చాంతర్హితే దేవే పరివారాన్వితే శివే ।
ధనుశ్శర రథాద్యాశ్చ ప్రాకారోఽంతర్ధి మాగమత్ ॥
తతో బ్రహ్మా హరిర్దేవా మునిగంధర్వకిన్నరాః ।
నాగా స్సర్పాశ్చాప్సరసస్సంహృష్టాశ్చాథ మానుషాః ॥
స్వం స్వం స్థానం ముదా జగ్ము శ్శృంసంత శ్శాంకరం యశః ।
స్వం స్వం స్థానమను ప్రాప్య నివృత్తి పరమాం యయుః ॥
ఏతత్తే కథితం సర్వం చరితం శశిమౌలినః ।
త్రిపురక్షయసంసూచి పరలీలాన్వితం మహత్ ॥

మహాయోగియగు ఆ రుద్రభగవానుడు త్రిపురవాసులను భస్మము చేసి కృతకృత్యుడై బ్రహ్మాదులచే పూజింపబడెను (34). సర్వగణములతో, పార్వతీ దేవితో మరియు పుత్రులతో కూడియున్న ఆ ప్రభుడు దేవతలకొరకై ఆ మహాకార్యమును నిర్వర్తించి అంతర్ధానమును చెందెను (35). శివదేవుడు పరివారముతో గూడి అంతర్ధానము కాగానే, ధనస్సు, బాణము, రథము మొదలగు సామగ్రి కూడ అంతర్ధానమయ్యెను (36). అపుడు బ్రహ్మ, విష్ణువు, దేవతలు, మునులు, గంధర్వులు, కిన్నరులు, నాగులు, సర్పములు, అప్సరసలు మరియు మానవులు మిక్కిలి సంతసించినవారై (37), శివుని యశస్సును ఆనందముతో గానము చేయుచూ, తమ తమ నెలవులకు బయలుదేరిరి. వారు తమ తమ నెలవులకు చేరి పరమానందమును పొందిరి (38). త్రిపురాసుర సంహారము అనే గొప్ప లీలతో గూడియున్న, చంద్రశేఖరుని మహాచరిత్రమునంతనూ నీకీ తీరున వివరించితిని (39).

ధన్యం యశస్యమాయుష్యం ధనధాన్య ప్రవర్ధకమ్ ।
స్వర్గదం మోక్షదం చాపి కిం భూయశ్శ్రోతు మిచ్ఛసి ॥
ఇదం హి పరమాఖ్యానం యః పఠేచ్ఛృణు యాత్సదా ।
ఇహ భుక్త్వాఖిలాన్ కామానంతే ముక్తి మవాప్నుయాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధ ఖండే మయస్తుతి వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥

ఈ ధన్యమగు వృత్తాంతము కీర్తిని, ఆయుర్దాయమును ఇచ్చి ధనధాన్యములను వృద్ధి పొందించుటయే గాక, స్వర్గమును మోక్షమును కూడ ఇచ్చును. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? (40) ఈ గొప్ప వృత్తాంతమును నిత్యము పఠించువాడు, మరియు వినువాడు ఇహలోకములో సమస్త భోగముల ననుభవించి, దేహత్యాగానంతరము మోక్షమును పొందును (41).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందలి యుద్ధఖండములో మయస్తుతి వర్ణనమనే పన్నెండవ అధ్యాయము ముగిసినది (12).

13 – ఇంద్రుడు ప్రాణములతో బయటపడుట

వ్యాస ఉవాచ ।

భో బ్రహ్మన్ భగవన్ పూర్వం శ్రుతం మే బ్రహ్మపుత్రక ।
జలంధరం మహాదైత్య మవధీచ్ఛంకరః ప్రభుః ॥
తత్త్వం వద మహాప్రాజ్ఞ చరితం శశి మౌలినః ।
విస్తారపూర్వకం శృణ్వన్ కస్తృప్యేతద్యశోఽమలమ్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓయీ పూజ్య బ్రాహ్మణా! బ్రహ్మకుమారా! శంకరప్రభుడు జలంధరుడను మహారాక్షసుని సంహరించెనని నేను పూర్వము వినియుంటిని (1). ఓ మహాప్రాజ్ఞా! ఆ వృత్తాంతమును నీవు విస్తారముగా చెప్పుము. చంద్రశేఖరుని నిర్మలమగు కీర్తిని వినువాడు ఎవ్వాడు తృప్తిని చెందును? (2)

సూత ఉవాచ ।

ఇత్యేవం వ్యాససంపృష్టో బ్రహ్మపుత్రో మహామునిః ।
ఉవాచార్థవదవ్యగ్రం వాక్యం వాక్యవిశారదః ॥

సూతుడిట్లు పలికెను -

బ్రహ్మ పుత్రుడు, మహర్షి, వాక్యనిపుణుడునగు సనత్కుమారుడు వ్యాసునిచే ఇట్లు ప్రశ్నింపబడినవాడై తొందరపాటు లేని అర్థవంతమైన వాక్యమును ఇట్లు పలికెను (3).

సనత్కుమార ఉవాచ ।

ఏకదా జీవశక్రౌ చ భక్త్యా పరమయా మునే ।
దర్శనం కర్తుమీశస్య కైలాసం జగ్మతుర్భృశమ్ ॥
అథ గుర్వింద్రయోర్ జ్ఞాత్వాగమనం శంకరః ప్రభుః ।
పరీక్షితుం తయోర్ జ్ఞానం స్వదర్శనరతాత్మనోః ॥
దిగంబరోఽథ తన్మార్గమారుధ్య సద్గతిస్సతామ్ ।
జటాబద్ధేన శిరసా సాతిష్ఠత్సం శోభితాననః ॥
అథ తౌ గురుశక్రౌ చ కుర్వంతౌ గమనం ముదా ।
ఆలోక్య పురుషం భీమం మార్గమధ్యేఽద్భుతా కృతిమ్ ॥
మహాతేజస్వినం శాంతం జటా సంబద్ధమస్తకమ్ ।
మహా బాహుం మహోరస్కం గౌరం నయన భీషణమ్ ॥
అథో పురందరోఽపృచ్ఛత్ స్వాధికారేణ దుర్మదః ।
పురుషం తం స్వమార్గాంత స్థిత మజ్ఞాయ శంకరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఒకప్పుడు బృహస్పతి, మరియు ఇంద్రుడు పరమభక్తితో ఈశ్వరుని దర్శించగోరి వేగముగా కైలాసమునకు బయలుదేరిరి (4). తన దర్శనమునాకాంక్షించే మనస్సు గల ఇంద్ర బృహస్పతులు బయలు దేరిన సంగతిని ఎరింగిన శంకరప్రభుడు వారి జ్ఞానమును పరీక్షింప గోరి (5), వారి మార్గమునకు అడ్డముగా దిగంబరుడై నిలబడి యుండెను. సత్పురుషులకు శరణ్యుడు అగు శివుడు వెనుకకు కట్టబడిన జటలతో ప్రకాశించు ముఖము గలవాడై నిలబడి యుండెను (6). అపుడా ఇంద్రబృహస్పతులు ఆనందముతో పయనిస్తూ, మార్గమధ్యములో అద్భుత భయంకరాకారము గల పురుషుని గాంచిరి (7). అతడు మహాతేజశ్శాలి, శాంతుడు, జటలతో కట్టబడిన శిరస్సు గలవాడు, పెద్ద బాహువులు గలవాడు, విశాలమగు వక్షస్థలము గలవాడు, గౌరవర్ణము గలవాడు, మరియు భయంకరముగు కన్నులు గలవాడు (8). తమ మార్గమునకు అడ్డుగా నున్న ఆ పురుషుడు శంకరుడే నని యెరుంగక, అధికారముచే గర్వితుడై యున్న ఇంద్రుడు అప్పుడు అతనితో నిట్లనెను (9).

పురందర ఉవాచ ।

కస్త్వం భోః కుత ఆయాతః కిం నామ వద తత్త్వతః
స్వస్థానే సంస్థితశ్శంభుః కిం వాన్యత్ర గతః ప్రభుః ॥

ఇంద్రుడిట్లు పలికెను -

ఓయీ! నీవెవరివి? ఎచటనుండి వచ్చితివి? నీ పేరేమి? సత్యమును పలుకుము. శంభుడు తన ధామమునందే ఉన్నాడా? లేక ఆ ప్రభుడు ఎచటి కైననూ వెళ్లియున్నాడా? (10)

సనత్కుమార ఉవాచ ।

శక్రేణేత్థం స పృష్టస్తు కించిన్నోవాచ తాపసః ।
శక్రః పునరపృచ్ఛద్వై నోవాచ స దిగంబరః ॥
పునః పురందరో ఒపృచ్ఛల్లోకానా మధిపేశ్వరః ।
తూష్ణీమాస మహాయోగీ లీలారూపధరః ప్రభుః ॥
ఇత్థం పునః పునః పృష్టశ్శక్రేణ స దిగంబరః ।
నోవాచ కించిద్భగవాన్ శక్రజ్ఞాన పరీక్షయా ॥
అథ చుక్రోధ దేవేశ స్త్రైలోక్యైశ్వర్యగర్వితః ।
ఉవాచ వచనం చైవ తం నిర్భర్త్స్య జటాధరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను

ఇంద్రుడిట్లు ప్రశ్నించగా ఆ తాపసుడు ఏమియూ పలుకలేదు. ఇంద్రుడు మరల ప్రశ్నించగా ఆ తాపసుడు సమాధానము నీయలేదు (11). లోకములకు ప్రభువగు ఇంద్రుడు మరల ప్రశ్నించెను. మహాయోగి, లీలచే వివిధరూపములను ధరించువాడు అగు ఆ ప్రభుడు మిన్నకుండెను (12). ఈ విధముగా ఇంద్రుడు అనేక పర్యాయములు ప్రశ్నించెను. కాని దిగంబరుడగు ఆ భగవానుడు ఇంద్రుని జ్ఞానమును పరీక్షింప గోరి, ఏమియు పలుకలేదు (13). ముల్లోకముల ఐశ్వర్యముచే గర్వించియున్న దేవేంద్రుడు అపుడు కోపించి, ఆ జటాధారిని గద్దించి ఇట్లు పలికెను (14).

ఇంద్ర ఉవాచ ।

రే మయా పృచ్ఛ్యమానోఽపి నోత్తరం దత్తవానసి ।
అతస్త్వాం హన్మి వజ్రేణ కస్తే త్రాతాస్తి దుర్మతే ॥

ఇంద్రుడిట్లు పలికెను -

ఓరీ! నేను ప్రశ్నించు చున్ననూ నీవు ఉత్తరము నీయకున్నావు. కావున నిన్ను వజ్రముతో సంహరించెదను. ఓరీ దుర్బుద్ధీ ! నిన్ను కాపాడు వారెవరు గలరు?(15)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుదీర్య తతో వజ్రీ సంనిరీక్ష్య క్రుధా హి తమ్ ।
హంతుం దిగంబరం వజ్రముద్యతం స చకార హ ॥
పురందరం వజ్రహస్తం దృష్ట్వా దేవస్సదాశివః ।
చకార స్తంభనం తస్య వజ్రపాతస్య శంకరః ॥
తతో రుద్రః క్రుధావిష్టః కరాలాక్షో భయంకరః ।
ద్రుతమేవ ప్రజజ్వాల తేజసా ప్రదహన్నివ ॥
బాహు ప్రతిష్టంభభువా మన్యునాంతశ్శచీపతిః ।
సమదహ్యత భోగీవ మంత్రరుద్ధ పరాక్రమః ॥
దృష్ట్వా బృహస్పతిస్తూర్ణం ప్రజ్వలంతం స్వతేజసా ।
పురుషం తం ధియా జ్ఞాత్వా ప్రణనామ హరం ప్రభుమ్ ॥
కృతాంజలి పుటో భూత్వా తతో గురురుదారధీః ।
నత్వా చ దండవద్భూమౌ ప్రభుం స్తోతుం ప్రచక్రమే ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

వజ్రధారియగు ఇంద్రుడు ఇట్లు పలికి, ఆ దిగంబరుని కోపముతో చూచి, ఆతనిని సంహరించుటకు వజ్రమును పైకి ఎత్తెను (16). ఇంద్రుడు వజ్రమును ఎత్తుటను గాంచి, సదా మంగళస్వరూపుడగు శంకరదేవుడు ఆ వజ్రపు దెబ్బను స్తంభింపజేసెను (17). అపుడు రుద్రుడు క్రోధావేశమును పొంది, భయంకరమగు కన్నులు గలవాడై తేజస్సుతో దహించివేయునా యన్నట్లు మండిపడెను (18). మంత్రముచే నిరోధింపబడిన సర్పము వలె బాహువు స్తంభించుటచే కలిగిన కోపముతో శచీపతియగు ఇంద్రుడు తనలో తాను తపింప చేయబడెను (19). ఆ పురుషుడు స్వీయతేజస్సుతో ప్రకాశించుటను గాంచిన బృహస్పతి వెంటనే తన బుద్ధిచే ఆయనను గుర్తు పట్టి, ఆ శివ ప్రభువునకు ప్రణమిల్లెను (20). ప్రజ్ఞాశాలియగు బృహస్పతి అపుడు చేతులు జోడించి నేలపై బడి సాష్టాంగ ప్రణామము నాచరించి ఆ ప్రభువును స్తుతించుట మొదలిడెను(21).

గురురువాచ ।

నమో దేవాధిదేవాయ మహాదేవాయ చాత్మనే ।
మహేశ్వరాయ ప్రభవే త్ర్యంబకాయ కపర్దినే ॥
దీననాథాయ విభవే నమోఽంధక నిషూదినే ।
త్రిపురఘ్నాయ శర్వాయ బ్రహ్మణే పరమేష్ఠినే ॥
విరూపాక్షాయ రుద్రాయ బహురూపాయ శంభవే ।
విరూపాయాతిరూపాయ రూపాతీతాయ తే నమః ॥
యజ్ఞ విధ్వంసకర్త్రే చ యజ్ఞానాం ఫలదాయినే ।
నమస్తే మఖరూపాయ పరకర్మ ప్రవర్తి నే ॥
కాలాంతకాయ కాలాయ కాలభోగిధరాయ చ ।
నమస్తే పరమేశాయ సర్వత్ర వ్యాపి నే నమః ॥
నమో బ్రహ్మశిరోహంత్రే బ్రహ్మచంద్రస్తుతాయ చ ।
బ్రహ్మణ్యాయ నమస్తేస్తు నమస్తే పరమాత్మనే ॥
త్వమగ్నిరనిలో వ్యోమ త్వమేవాపో వసుంధరా ।
త్వం సూర్యశ్చంద్రమా భాని జ్యోతిశ్చక్రం త్వమేవ హి ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

దేవతలకు అధిదేవుడు, ఆత్మరూపుడు, మహేశ్వరుడు, ప్రభువు, ముక్కంటి, జటాజూట ధారి యగు మహాదేవుని కొరకు నమస్కారము (22). దీనులకు ప్రభువు, సర్వవ్యాపకుడు, అంధకాసురుని సంహరించిన వాడు, త్రిపురములను నాశము చేసినవాడు, పరంబ్రహ్మ, పరమేష్ఠి అగు శర్వునకు నమస్కారము (23). బేసి కన్నులవాడు, అనేకరూపములలో ప్రకటమై మంగళములను చేయువాడు, రుద్రుడు, వికృతరూపుడు, పెద్ద రూపము గలవాడు,

రూపములకు అతీతుడు అగు నీకు నమస్కారము (24). దక్షయజ్ఞమును నాశనము చేసినవాడు, యజ్ఞముల ఫలమును ఇచ్చు వాడు, యజ్ఞ స్వరూపుడు, శ్రేష్ఠకర్మలను చేయించు వాడు అగు నీకు నమస్కారము (25). మృత్యువునకు మృత్యువు, కాల స్వరూపుడు, కాలసర్పములను ధరించువాడు, పరమేశ్వరుడు, సర్వవ్యాపకుడు అగు నీకు నమస్కారము (26). బ్రహ్మ యొక్క శిరస్సును దునిమిన వాడు, బ్రహ్మచే మరియు చంద్రునిచే స్తుతింపబడిన వాడు, పరబ్రహ్మ, పరమాత్మ అగు నీకు అనేక నమస్కారములు (27). అగ్నివి నీవే. వాయువు నీవే. ఆకాశము నీవే. జలములు నీవే. భూమి నీవే. సూర్యుడు నీవే. చంద్రుడు నీవే. నక్షత్రములు నీవే. జ్యోతిర్మండలములతో నిండిన బ్రహ్మాండము నీవే (28).

త్వమేవ విష్ణుస్త్వం బ్రహ్మా తత్ స్తుతస్త్వం పరేశ్వరః ।
మునయస్సనకాద్యాస్త్వం నారదస్త్వం తపోధనః ॥
త్వమేవ సర్వలోకేశస్త్వమేవ జగదాత్మకః ।
సర్వాన్వయస్సర్వభిన్నస్త్వమేవ ప్రకృతేః పరః ॥
త్వం తు సృజసి లోకాంశ్చ రజసా విధినామభాక్ ।
సత్త్వేన హరిరూపస్త్వం సకలం పాసి వై జగత్ ॥
త్వమేవాసి మహాదేవ తమసా హరరూపధృక్ ।
లీలయా భువనం సర్వం నిఖిలం పాంచ భౌతికమ్ ॥
త్వద్ధ్యానబలత స్సూర్యస్తపతే విశ్వభావన ।
అమృతం చ్యవతే లోకే శశీ వాతి సమీరణః ॥
త్వద్ధ్యాన బలతో మేఘాశ్చాంబు వర్షంతి శంకర ।
త్వద్ధ్యాన బలతశ్శ క్రస్త్రి లోకీం పాతి పుత్రవత్ ॥
త్వద్ధ్యాన బలతోఽ మోఘాస్సర్వే దేవా మునీశ్వరాః ।
స్వాధికారం చ కుర్వంతి చకితా భవతో భయాత్ ॥

విష్ణువు నీవే. బ్రహ్మ నీవే. వారిచే స్తుతింపబడే పరమేశ్వరుడవు నీవే. సనకాది మహర్షులు నీ స్వరూపమే. తపోధనుడగు నారదుడవు నీవే (29). సర్వలోకములకు ప్రభువు నీవే. జగత్స్వరూపుడవు నీవే. సర్వపదార్థములయందు అనుగతముగ నుండు వాడవు నీవే. కాని నీవు సర్వము కంటే భిన్నుడవు. నీవు ప్రకృతికంటె అతీతుడవు (30). రజోగుణమునాశ్రయించి బ్రహ్మ అను పేరును పొంది నీవేలో కములను సృష్టించుచున్నావు. సత్త్వ గుణమునాశ్రయించి విష్ణురూపుడవై నీవే సమస్త జగత్తును పాలించుచున్నావు (31). ఓ మహదేవా! నీవే తమోగుణమునాశ్రయించి హరరూపమును ధరించి పంచభూతాత్మకమగు బ్రహ్మాండము నంతనూ లీలగా ఉపసంహరించెదవు (32). ఈ జగత్తు నీ కల్పనయే. సూర్యుడు నిన్ను ధ్యానించి ఆ బలముచే తపించుచున్నాడు. నీ ధ్యానబలముచే చంద్రుడు లోకములో అమృతకిరణములను వెదజల్లుచున్నాడు. వాయువు

చంద్రుడు లోకములో అమృతకిరణములను వెదజల్లుచున్నాడు. వాయువు వీచుచున్నాడు (33). ఓ శంకరా! నిన్ను ధ్యానించిన బలముచే మేఘములు నీటిని వర్షించుచున్నవి. నిన్ను ధ్యానించిన బలముచే ఇంద్రుడు ముల్లోకములను తన సంతానమును వలె రక్షించుచున్నాడు (34). నిన్ను ధ్యానించిన బలను చేతనే దేవతలు అందరు తమ తమ అధికారములను ప్రవర్తిల్ల జేయుచున్నారు. నీ భయముచే వారు అట్లు చేయుచున్నారు. నీ ధ్యానముచే మహర్షులు అమోఘమగు తపస్సు గల వారగుచున్నారు (35).

త్వత్పాదకమలస్యైవ సేవనాద్భువి మానవాః ।
నాద్రియంతే సురాన్రుద్ర లోకైశ్వర్యం చ భుంజతే ॥
త్వత్పాదకమలస్యైవ సేవనాదగమన్ పరామ్ ।
గతిం యోగధనా నామప్య గమ్యాం సర్వ దుర్లభామ్ ॥

ఓ రుద్రా! భూలోకములో మానవులు నీ పాదపద్మములను సేవించి దేవతలను ఆదరించుటను మానిరి. అయిననూ, వారు పుణ్య లోకములలోని భోగముల ననుభవించుచున్నారు (36). యోగసంపన్నులకైననూ పొందశక్యము కానిది, మిక్కిలి దుర్లభమైనది అగు పరమగతి (మోక్షము)ని మానవులు నీ పాదపద్మముల నారాధించి పొందు చున్నారు (37).

సనత్కుమార ఉవాచ ।

బృహస్పతిరితి స్తుత్వా శంకరం లో కశంకరమ్ ।
పాదయోః పాతయామాస తస్యేశస్య పురందరమ్ ॥
పాతయిత్వా చ దేవేశమింద్రం నతశిరోధరమ్ ।
బృహస్పతిరువాచేదం ప్రశ్రయావనతశ్శివమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

లోకములకు మంగళములను కలిగించు శంకరుని బృహస్పతి ఇట్లు స్తుతించి, ఇంద్రుని ఆ ఈశుని పాదములపై పడవేసెను (38). వంచిన శిరస్సుగల దేవేంద్రుని అట్లు పడవేసి, బృహస్పతి ఆదరముతో శివునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను (39).

బృహస్పతిరువాచ ।

దీననాథ మహాదేవ ప్రణతం తవ పాదయోః ।
సముద్ధర చ శాంతం స్వం క్రోధం నయనజం కురు ॥
తుష్టో భవ మహాదేవ పాహీంద్రం శరణాగతమ్ ।
అగ్నిరేష శమం యాతు భాలనేత్ర సముద్భవః ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

దీనులకు ప్రభువగు మహాదేవా! నీ పాదములకు నమస్కరించుచున్న వీనిని ఉద్ధరింపుము. నీ కన్నులనుండి పుట్టిన కోపమును శాంతింపజేయుము (40). ఓ మహాదేవా! తుష్టుడవై శరణు జొచ్చిన ఇంద్రుని రక్షింపుము. నీ లలాట నేత్రమునుండి పుట్టిన అగ్ని చల్లారు గాక! (41)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య గురోర్వాక్యం దేవదేవో మహేశ్వరః ।

ఉవాచ కరుణాసింధుర్మేఘనిర్హ్రాదయా గిరా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బృహస్పతి యొక్క ఈ మాటను విని దేవదేవుడు, కరుణాసముద్రుడునగు మహేశ్వరుడు మేఘగర్జనవలె గంభీరమగు స్వరముతో నిట్లనెను (42).

మహేశ్వర ఉవాచ ।

క్రోధం చ నిస్సృతం నేత్రాద్ధారయామి బృహస్పతే ।

కథం హి కంచుకీం సర్పస్సంధత్తే నోజ్ఝితం పునః ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

ఓ బృహస్పతీ! కంటినుండి బయల్వెడలిన కోపమును నేను మరల ఎట్లు వెనుకకు ఉపసంహరించ గల్గుదును? పాము విడిచిన కుబుసమును మరల తాను ధరించలేదు గదా! (43)

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య శంకరస్య బృహస్పతిః ।

ఉవాచ క్లిష్టరూపశ్చ భయవ్యాకులమానసః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

భయముచే కంగారుపడిన బృహస్పతి శంకరుని ఆ మాటను విని దేహములో మిక్కిలి క్లేశమును పొంది ఇట్లు పలికెను (44).

బృహస్పతిరువాచ ।

హే దేవ భగవన్ భక్తా అనుకంప్యాస్సదైవ హి ।
భక్తవత్సల నామేతి త్వం సత్యం కురు శంకర ॥
క్షేప్తు మన్యత్ర దేవేశ స్వతేజోఽత్యు గ్రమర్హసి ।
ఉద్ధర్తస్సర్వ భక్తానాం సముద్ధర పురందరమ్ ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

ఓ భగవన్! దేవా! నీవు సర్వకాలములయందు భక్తులపై దయను చూపవలెను. ఓ శంకరా! నీకు భక్తవత్సలుడను పేరు గలదు. దానిని సార్థకము చేయుము (45). ఓ దేవదేవా! నీ అతి భయంకరమగు తేజస్సును మరియొక చోటకు ప్రసరింపచేయుట దగును. భక్తులనందరినీ ఉద్ధరించువాడా! ఇంద్రుని ఉద్ధరించుము (46).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తో గురుణా రుద్రో భక్త వత్సలనామభాక్ ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా సురేజ్యం ప్రణతార్తిహా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

భక్త వత్సలుడను పేరు గలవాడు, నమస్కరించినవారి ఆపదలను హరించు వాడు అగు రుద్రుడు బృహస్పతిచే ఇట్లు పలుకబడి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఇట్లు బదులిడెను (47).

శివ ఉవాచ ।

ప్రీతస్స్తు త్యానయా తాత దదామి వరముత్తమమ్ ।
ఇంద్రస్య జీవదానేన జీవేతి త్వం ప్రథాం వ్రజ ॥
సముద్భూతోఽ నలో యోఽయం ఖాలనే త్రాత్సురేశహా ।
ఏనం త్యక్ష్యామ్యహం దూరం యథేంద్రం నైవ పీడయేత్ ॥

శివుడిట్లు పలికెను -

వత్సా! నీ ఈ స్తుతిచే ప్రసన్నుడనైతిని. నీకు ఉత్తమవరము నిచ్చెదను. నీవు ఇంద్రుని ప్రాణములను నిలబెట్టితివిగాన, నీకు జీవుడను పేరు ప్రసిద్ధిని గాంచగలదు (48). దేవేంద్రుని సంహరించుటకై నా ఫాలనేత్రమునుండి పుట్టిన ఈ అగ్నిని, ఇంద్రునకు పీడ కలుగని విధంబున, నేను దూరముగా విడిచి పెట్టెదను (49).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తం కరే ధృత్వా స్వతేజోఽ నలమద్భుతమ్ ।
భాలనేత్రాత్సముద్భూతం ప్రాక్షిపల్లవణాంభసి ॥
తతశ్చాంతర్దధే రుద్రో మహాలీలాకరః ప్రభుః ।
గురుశక్రౌ భయాన్ముక్తౌ జగ్మతుస్సుఖముత్తమమ్ ॥
యదర్థం గమనోద్యుక్తౌ దర్శనం ప్రాప్య తస్య వై ।
కృతార్థౌ గురుశక్రౌ హి స్వస్థానం జగ్మతుర్ముదా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే శక్రజీవనం నామ త్రయోదశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఇట్లు పలికి ఫాలనేత్రము నుండి పుట్టిన అద్భుతమగు ఆ స్వీయతేజస్సును చేతితో పట్టుకొని సముద్రములో పారవైచెను (50). గొప్ప లీలలను చేయు ఆ రుద్రప్రభుడు అపుడు అంతర్ధానమయ్యెను. మరియు ఇంద్ర బృహస్పతులు భయమును వీడి ఉత్తమమగు సుఖమును పొందిరి (51). ఎవని దర్శనము కొరకు బయలుదేరిరో అట్టి శివుడు దారిలోనే దర్శనము నీయగా, ఇంద్రబృహస్పతులు కృతార్థులై అనందముతో స్వస్థానమునకు చేరిరి (52).

శ్రీ శివమహాపురాణములో రుద్రసంహితయందు యుద్ధఖండలో ఇంద్రుని జీవనము అనే పదమూడవ అధ్యాయము ముగిసినది (13)

14 – జలంధరుని జన్మ, వివాహము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ బ్రహ్మపుత్ర నమోఽస్తుతే ।
శ్రుతేయమద్భుతా మేఽద్య కథా శంభోర్మహాత్మనః ॥
క్షిప్త స్వతేజసి బ్రహ్మన్ భాలనేత్ర సముద్భవే ।
లవణాంభసి కిం తాతా భవత్తత్ర వదాశు తత్ ॥

వ్యాసుడిట్లు పలికెను –

సనత్కుమారా! సర్వము నెరింగిన వాడా! బ్రహ్మపుత్రా! నీకు నమస్కార మగుగాక! నేనీ నాడు మహాత్ముడగు శంభుని అద్భుతమగు ఈ కథను వింటిని (1). ఓ పూజ్యా! తండ్రీ! లలాటనేత్రమునుండి పుట్టిన తన తేజస్సును శివుడు సముద్రములోనికి విసిరివేసిన పిదప అచట ఏమాయెను? ఆ విషయమును శీఘ్రముగా చెప్పుము (2).

సనత్కుమార ఉవాచ ।

శృణు తాత మహాప్రాజ్ఞ శివలీలాం మహాద్భుతామ్ ।
యచ్ఛ్రుత్వా శ్రద్ధయా భక్తో యోగినాం గతి మాప్నుయాత్ ॥
అథో శివస్య తత్తేజో భాలనేత్ర సముద్భవమ్ ।
క్షిప్తం చ లవణాంభోధౌ సద్యో బాలత్వమాప హ ॥
తత్ర వై సింధు గంగాయాస్సాగరస్య చ సంగమే ।
రురోదోచ్చై స్స వై బాలస్సర్వలోక భయం కరః ॥
రుదతస్తస్య శబ్దేన ప్రాకంపద్ధరణీ ముహుః ।
స్వర్గశ్చ సత్యలోకశ్చ తత్స్వనాద్బధిరీకృతః ॥
బాలస్య రోదనేనైవ సర్వే లోకాశ్చ తత్రసుః ।
సర్వతో లోకపాలాశ్చ విహ్వలీకృతమానసాః ॥
కిం బహూక్తేన విప్రేంద్ర చచాల సచరాచరమ్ ।
భువనం నిఖిలం తాత రోదనాత్తచ్ఛిశోర్విభోః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

వత్సా! నీవు గొప్ప బుద్ధిమంతుడవు. మహాద్భుతమగు శివలీలను వినుము. ఏ భక్తు(?)డు దీనిని శ్రద్ధతో వినునో, అతడు యోగులు పొందే గతిని పొందును (3). శివుని ఫాలనేత్రమునుండి పుట్టి సముద్రములోనికి విసిరి వేయబడిన ఆ తేజస్సు అపుడు వెంటనే బాలుని రూపమును పొందెను (4). అచట గంగా సాగరసంగమమునందు, సర్వలోకములకు భయమును కలిగించు ఆ బాలుడు. బిగ్గరగా నేడ్చెను (5). ఆ బాలుని రోదనధ్వనిచే భూమి అనేక

పర్యాయములు కంపించెను. ఆ శబ్దముచే స్వర్గసత్యలోకములలోని జనులు చెవిటివారుగా అయిరి (6). ఆ బాలుని రోదనము వలన లోకములన్నియు భయపడినవి. లోకపాలకుల మనస్సులు భయముతో నిండిపోయినవి (7). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! ఇన్ని మాటలేల? వత్సా! సర్వమును వ్యాపించిన ఆ శిశువు యొక్క రోదనధ్వనిచే స్థావరజంగమాత్మకమగు జగత్తు అంతయూ కంపించెను (8).

అథతే వ్యాకులాస్సర్వే దేవాస్సమునయో ద్రుతమ్ ।
పితామహం లోకగురుం బ్రహ్మాణం శరణం యయుః ॥
తత్ర గత్వా చ తే దేవా మునయశ్చ సవాసవాః ।
ప్రణమ్య చ సుసంస్తుత్య ప్రోచుస్తం పరమేష్ఠినమ్ ॥

అపుడు ఆ దేవతలు, మునులు అందరు కంగారుపడి వెంటనే లోకములకు పెద్ద, పితామహుడునగు బ్రహ్మను శరణుజొచ్చిరి (9). ఆ దేవతలు మరియు మునులు ఇంద్రునితో గూడి అచటకు వెళ్లి ఆ పరమేష్ఠికి ప్రణమిల్లి చక్కగా స్తుతించి ఇట్లు పలికిరి (10).

దేవా ఊచుః ।

లోకధీశ సురాధీశ భయం నస్సముపస్థితమ్ ।
తన్నాశయ మహాయోగిన్ జాతోఽయం హ్యద్భుతో రవః ॥

దేవతలిట్లు పలికిరి -

లోకనాథా! దేవా ధీశా! మాకు భయము వచ్చి పడినది. ఈ అద్భుతమగు శబ్దము పుట్టుచున్నది. ఓ మహాయోగీ! దానిని నశింపజేయుము (11).

సనత్కుమార ఉవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం బ్రహ్మా లోకపితామహః ।
గంతు మైచ్ఛత్తతస్తత్ర కిమేతదితి విస్మితః ॥
తతో బ్రహ్మా సురైస్తాతావతరత్సత్యలోకతః ।
రవం తత్ జ్ఞాతుమిచ్ఛన్ స సముద్రమగమత్తదా ॥
యావత్త త్రాగతో బ్రహ్మా సర్వలోక పితామహః ।
తావత్సముద్రస్యోత్సంగే తం బాలం స దదర్శ హ ॥
ఆగతం విధిమాలోక్య దేవరూప్యథ సాగరః ।
ప్రణమ్య శిరసా బాలం తస్యోత్సంగే న్యవేశయత్ ॥
తతో బ్రహ్మాబ్రవీద్వాక్యం సాగరం విస్మయాన్వితః ।
జలరాశే ద్రుతం బ్రూహి కస్యాయం శిశురద్భుతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

లోకములకు పితామహుడగు బ్రహ్మ వారి ఈ మాటను విని 'ఇది ఏమి?' అని విస్మయమును పొంది అచటకు వెళ్లవలెనని తలంచెను (12). వత్సా! అపుడు బ్రహ్మ ఆ శబ్దమును గురించి తెలియ గోరి దేవతలతో సహా సత్య లోకమునుండి భూమి పైకి దిగి సముద్రమువద్దకు వెళ్లెను (13). సర్వలోకములకు పితామహుడగు ఆ బ్రహ్మ అచటకు వచ్చుట తోడనే సముద్రుని ఒడిలో ఆ బాలకుని చూచెను (14). దేవతా రూపమును ధరించియున్న సముద్రుడు అచటకు విచ్చేసిన బ్రహ్మను గాంచి శిరస్సుతో ప్రణమిల్లి ఆ బాలకుని ఆయన ఒడిలో కూర్చుండ బెట్టెను (15). అపుడు ఆశ్చర్యమును పొందియున్న బ్రహ్మ సముద్రునితో నిట్లనెను: ఓయీ సముద్రా! వెంటనే చెప్పుము. ఈ అద్భుత బాలకుడు ఎవని కుమారుడు? (16)

సనత్కుమార ఉవాచ ।

బ్రహ్మణో వాక్య మాకర్ణ్య ముదితస్సాగరస్తదా ।
ప్రత్యువాచ ప్రజేశం స నత్వా స్తుత్వా కృతాంజలిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు సముద్రుడు బ్రహ్మయొక్క మాటను విని సంతసిల్లి, చేతులు జోడించి నమస్కరించి కొనియాడి ఆ ప్రజానాథునితో నిట్లనెను (17).

సముద్ర ఉవాచ ।

భోభో బ్రహ్మన్ మయా ప్రాప్తో బాలకోఽయమజానతా ।
ప్రభవం సింధు గంగాయామకస్మాత్సర్వలోకప ॥
జాతకర్మాది సంస్కారాన్ కురుష్వస్య జగద్గురో ।
జాతకోక్త ఫలం సర్వం విధాతర్వక్తు మర్హసి ॥

సముద్రుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! నాకు తెలియకుండగనే నాకు ఈ బాలుడు దొరికినాడు. సర్వ లోకములను పాలించువాడా! ఈతడు అకస్మాత్తుగా గంగాసాగరసంగమమునుండి పుట్టినాడు (18). ఓ జగద్గురూ! ఈతనికి జాతకర్మ మొదలగు సంస్కారములను చేయించుము. ఓ విధాతా! వీని జాతకములో కనబడే భవిష్యత్ఫలము నంతనూ వివరించ తగుదువు (19).

సనత్కుమార ఉవాచ ।

ఏవం వదతి పాథోధౌ బాల స్సాగరాత్మజః ।
బ్రహ్మాణ మగ్రహీత్కంఠే విధున్వంతం ముహుర్ముహుః ॥
విధూననం చ తస్యైవం సర్వలోక కృతో విధేః ।
పీడితస్య చ కాలేయ నేత్రా భ్యామగ మజ్జలమ్ ॥
కరాభ్యామబ్ధి జాతస్య తత్సుతస్య మహౌజసః ।
కథం చిన్ముక్త కంఠస్తు బ్రహ్మా ప్రోవాచ సాదరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

సముద్రుడిట్లు పలుకుచుండగా తలను పలుమారు ఊపుచున్న బ్రహ్మను సముద్రపుత్రుడగు ఆ బాలకుడు కంఠమునందు పట్టుకొనెను (20). ఓ వ్యాసా! సర్వలోకములను సృష్టించిన విధి తలను ఊపుచుండగా ఆ బాలుడు కంఠమును బిగించుటచే వ్యథను పొందెను. ఆయన నేత్రములనుండి నీరు ఉబికెను (21). చేతులతో కంఠమును పట్టుకొని యున్న మహాతేజశ్శాలియగు ఆ సముద్ర పుత్రుని పట్టునుండి బ్రహ్మ అతికష్టముపై విడిపించుకొని ఆదరముతో నిట్లు పలికెను (22).

బ్రహ్మోవాచ ।

శృణు సాగర వక్ష్యామి తవాస్య తనయస్య హి ।
జాతకోక్త ఫలం సర్వం సమాధానరతః ఖలు ॥
నేత్రాభ్యాం విధృతం యస్మాదనేనైవ జలం మమ ।
తస్మాజ్జలంధరేతీహ ఖ్యాతో నామ్నా భవత్వసౌ ॥
అధునైవైష తరుణస్సర్వశాస్త్రార్థ పారగః ।
మహాపరాక్రమో ధీరో యోద్ధా చ రణదుర్మదః ॥
భవిష్యతి చ గంభీరస్త్వం యథా సమరే గుహః ।
సర్వజేతా చ సంగ్రామే సర్వసంపద్విరాజితః ॥
దైత్యానామధిపో బాలస్సర్వేషాం చ భవిష్యతి ।
విష్ణోరపి భవేజ్జేతా న కుతశ్చిత్పరాభవః ॥
అవధ్య స్సర్వభూతానాం వినా రుద్రం భవిష్యతి ।
యత ఏష సముద్భూత స్తత్రైదానీం గమిష్యతి ॥
పతివ్రతాస్య భవితా పత్నీ సౌభాగ్యవర్ధినీ ।
సర్వాంగ సుందరీ రమ్యా ప్రియవాక్ శీలసాగరా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ సముద్రా! నీ ఈ కుమారుని జాతకఫలమునంతనూ చెప్పెదను. మనస్సును ఏకాగ్రము చేసి నా మాటను శ్రద్ధగా వినుము (23). ఈతడు నా కన్నులనుండి జలమును రప్పించినాడు గాన ఈతనికి జలంధరుడను పేరు

ప్రఖ్యాతమగుగాక! (24) ఈతడు యువకుడై ఆ వయస్సులోనే శాస్త్రార్థములన్నిటినీ తరచి చూడగలడు. మహాపరాక్రమ శాలియగు ఈ ధీరుడు యుద్ధములో గర్వించి శత్రువులను దునుమాడగలడు (25). ఈతడు నీవలె గంభీరుడు, కుమారస్వామివలె యుద్ధములో సర్వులను జయించువాడు, సర్వ సంపదలతో విరాజిల్లువాడు కాగలడు (26). ఈ బాలుడు రాక్షసులందరికి అధినాయకుడు కాగలడు. విష్ణువును కూడ జయించగలడు. ఈతనికి ఎచట నైననూ పరాభవము కలుగబోదు (27). రుద్రుడు తప్ప ఈతనిని సర్వప్రాణులలో ఎవ్వరైననూ సంహరించజాలరు. ఈతడు ఏ రుద్రుని వలన పుట్టినాడో, ఆతని వలననే పరాజయమును పొందును (28). ఈతని భార్య పతివ్రత, సౌభాగ్యమును వర్ధిల్లజేయునది, సర్వాంగసుందరి, రమ్య, ప్రియమును పలుకునది, మరియు సచ్ఛీలమునకు పెన్నిధి కాగలదు (29).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా శుక్రమాహూయ రాజ్యే తం చాభ్యషేచయత్ ।
ఆమంత్ర్య సరితాం నాథం బ్రహ్మాంతర్ధాన మన్వగాత్ ॥
అథ తద్దర్శనోత్ఫుల్ల నయనస్సాగర స్తదా ।
తమాత్మజం సమాదాయ స్వగేహ మగమన్ముదా ॥
అపోషయన్మహోపాయై స్స్వబాలం ముదితాత్మకః ।
సర్వాంగ సుందరం రమ్యం మహాద్భుత సుతేజసమ్ ॥
అథాంబుధిస్సమాహూయ కాలనేమిం మహాసురమ్ ।
వృందా ఇధాం సుతాం తస్య తద్భార్యార్థ మయాచత ॥
కాలనేమ్యసురో వీరో ఽసురాణాం ప్రవరస్సుధీః ।
సాధు మేనేఽబుధేర్యాచ్ఞాం స్వకర్మ నిపుణో మునే ॥
జలంధరాయ వీరాయ సాగర ప్రభవాయ చ ।
దదౌ బ్రహ్మవిధానేన స్వసుతాం ప్రాణవల్లభామ్ ॥
తదోత్సవో మహానాసీద్వివాహే చ తయోస్తదా ।
సుఖం ప్రాపుర్నదా నద్యోఽ సురాశ్చైవాఖిలా మునే ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

బ్రహ్మ ఇట్లు పలికి శుక్రుని ఆహ్వానించి ఆ బాలకుని రాజ్యాభిషిక్తుని చేసె:ను. ఆయన సముద్రుని వద్ద సెలవు తీసుకొని అంతర్ధానమును జెందెను (30). అపుడు ఆ బాలకుని చూచి వికసించే నయనములు గల ఆ సముద్రుడు ఆ కుమారుని తీసుకొని ఆనందముతో స్వగృహమునకు వెళ్లెను (31). ఆనందముతో నిండిన మనస్సు గల సముద్రుడు సర్వావయవముల యందు అందగాడు, ఉల్లాసమును కలిగించువాడు, మహాద్భుతమగు తేజస్సు గలవాడు అగు తన బాలకుని అనేకములగు చక్కని ఉపాయములతో పెంచి పోషించెను (32). అపుడు

సముద్రుడు కాలనేమియను గొప్ప రాక్షసుని పిలిచి అతని కుమార్తెయగు వృందను జలంధరునకిచ్చి వివాహమును చేయుమని గోరెను (33). రాక్షసశ్రేష్ఠుడు, వీరుడు, బుద్ధి మంతుడు, తన పనిలో నిపుణుడు అగు కాలనేమి సముద్రుని కోరిక యోగ్యముగా నున్నదని తలంచెను. ఓ మహర్షీ! (34) సముద్రపుత్రుడు, వీరుడునగు జలంధరునకు ఆతడు ప్రాణప్రియురాలగు తన కుమార్తెనిచ్చి వేదోక్తవిధానముతో వివాహమును చేసెను (35). వారిద్దరి వివాహములో అపుడు గొప్ప ఉత్సవము జరిగెను. ఓ మహర్షీ! నదులు, నదములు, సమస్తరాక్షసులు ఆనందమును పొందిరి (36).

సముద్రోఽతి సుఖం ప్రాప సుతం దృష్ట్వా హి సస్త్రియమ్ ।
దానం దదౌ ద్విజాతిభ్యోఽప్యన్యే భ్యశ్చ యథావిధి ॥
యే దేవైర్నిర్జితాః పూర్వం దైత్యాః పాతాల సంస్థితాః ।
తే హి భూమండలం యాతా నిర్భయా స్తముపాశ్రితాః ॥
తే కాలనేమి ప్రముఖాస్తతోఽసురాః తస్మై సుతాం సింధు సుతాయ దత్త్వా
।
బభూవురత్యంతముదాన్వితా హి తమాశ్రితా దేవ వినిర్భయాయ ॥
స చాపి వీరోఽబ్ధి బాలకోఽసౌ జలంధరాఖ్యోఽ సుర వీరవీరః ।
సంప్రాప్య భార్యామతి సుందరీం వశీ చకార రాజ్యం హి కవి ప్రభావాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
జలంధరోత్పత్తి వివాహ వర్ణనం నామ చతుర్దశోఽధ్యాయ ॥

భార్యతో గూడియున్న కుమారుని చూచి సముద్రుడు మిక్కిలి ఆనందించి, బ్రా◌ాహ్మణులకు, మరియు ఇతరులకు యథావిధిగా దానమునిచ్చెను (37). పూర్వము దేవతలచే పరాజితులై పాతాళమునందు తలదాచుకొనిన రాక్షసులు నిర్భయముగా భూమండలమునకు వచ్చి ఆతనిని ఆశ్రయించిరి (38). సముద్రపుత్రుడగు ఆతనికి తన కుమార్తెను కన్యాదానము చేసిన కాలనేమి, మరియు ప్రముఖులగు ఇతర రాక్షసులు మిక్కిలి ఆనందమును పొందినవారై, దేవతలను నిర్జించుట కొరకు ఆతని కొలువులో చేరిరి (39). వీరుడు, సముద్రపుత్రుడు, రాక్షసవీరులలో శ్రేష్ఠుడు అగు ఈ జలంధరుడు మిక్కిలి సుందరియగు భార్యను పొంది, శుక్రుని ప్రభావముచే ఇంద్రియ జయముగలవాడై రాజ్యము నేలెను (40).

శ్రీ శివమహాపురాణములో రుద్రసంహితయందు యుద్ధ ఖండలో జలంధరుని పుట్టుక, వివాహము అనే పదునాల్గవ అధ్యాయము ముగిసినది (14).

15 – దేవజలంధర సంగ్రామము

సనత్కుమార ఉవాచ ।

ఏకదా వారిధిసుతో వృందాపతి రుదారధీః ।
సభార్యస్సంస్థితో వీరోఽ సురైస్సర్వైస్సమన్వితః ॥
తత్రాజగామ సుప్రీతస్సు వర్చాస్త్వథ భార్గవః ।
తేజః పుంజో మూర్త ఇవ భాసయన్ సకలా దిశః ॥
తం దృష్ట్వా గురుమాయాంత మసురాస్తేఽ ఖిలా ద్రుతమ్ ।
ప్రణేముః ప్రీతమనస స్సింధుపుత్రోఽపి సాదరమ్ ॥
దత్త్వాశీర్వచనం తేభ్యో భార్గవస్తేజసాం నిధిః ।
నిషసాదాసనే రమ్యే సంతస్థుస్తేఽపి పూర్వవత్ ॥
అథ సింధ్వాత్మజో వీరో దృష్ట్వా ప్రీత్యా నిజాం సభామ్ ।
జలంధరః ప్రసన్నోఽభూ దనష్ట వరశాసనః ॥
తత్ స్థితం ఛిన్న శిరసం దృష్ట్వా రాహుం స దైత్యరాట్ ।
పప్రచ్ఛ భార్గవం శీఘ్రమిదం సాగరనందనః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఒకనాడు వృందాపతి, విశాల హృదయుడు, వీరుడు, సముద్రపుత్రుడునగు జలంధరుడు భార్యతో గూడి రాక్షసులందరిచే చుట్టు వారబడి యుండెను (1). ప్రేమతో నిండిన హృదయము గలవాడు, గొప్ప తేజశ్శాలి, మూర్తీభవించిన తేజో రాశి వలె నున్నవాడు అగు శుక్రుడు దిక్కుల నన్నిటినీ ప్రకాశింప జేయుచూ అచటకు విచ్చేసెను (2). గురువు వచ్చుచుండుటను గాంచిన రాక్షసులందరు వెంటనే ఆనందముతో నిండిన మనస్సు గలవారై ఆయనకు నమస్కరించిరి. సముద్రపుత్రుడు కూడా ఆదరముతో నమస్కరించెను (3). తేజోరాశియగు శుక్రుడు వారిని ఆశీర్వదించి సుందరమగు ఆసనములో కూర్చుండెను. వారు కూడా తమ తమ ఆసనములలో గూర్చుండిరి (4). నాశము లేని గొప్ప శాసనము గలవాడు, సముద్రపుత్రుడు, వీరుడు అగు జలంధరుడు అపుడు తన సభను ప్రీతితో గాంచి మిక్కిలి ప్రసన్నుడాయెను (5). సభలో దేహమునుండి నరుకబడి వేరుచేయబడిన శిరస్సు గల రాహువును గాంచి రాక్షసేశ్వరుడగు జలంధరుడు వెంటనే శుక్రుని ఇట్లు ప్రశ్నించెను (6).

జలంధర ఉవాచ ।

కేనేదం విహితం రాహోశ్శిరచ్ఛేదనకం ప్రభో ।

తద్ బ్రూహి నిఖిలం వృత్తం యథావత్తత్త్వతో గురో ॥

జలంధరుడిట్లు పలికెను –

ప్రభూ! రాహువు యొక్క శిరస్సును ఈ విధముగా ఖండించినదెవరు? ఓ గురూ! ఆ వృత్తాంతము నంతనూ సారరూపముగా యథాతథముగా చెప్పుము (7).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య సింధు పుత్రస్య భార్గవః ।

స్మృత్వా శివపదాంభోజం ప్రత్యువాచ యథార్థవత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

జలంధరుని ఈ మాటను విని శుక్రుడు శివుని పాదపద్మములను స్మరించి వృత్తాంతమును యథార్థముగా నిట్లు చెప్పెను (8).

శుక్ర ఉవాచ ।

జలంధర మహావీర సర్వాసురసహాయక ।

శృణు వృత్తాంతమఖిలం యథావత్కథయామి తే ॥

పురాభవద్బలిర్వీరో విరోచనసుతో బలీ ।

హిరణ్య కశిపోశ్చైవ ప్రపౌత్రో ధర్మవిత్తమః ॥

పరాజితాస్సు రాస్తేన రమేశం శరణం యయుః ।

సవాసవాస్స్వ వృత్తాంత మాచఖ్యు స్స్వార్థసాధకాః ॥

తదాజ్ఞయా సురైస్సార్ధం చక్రుస్సంధిమథోఽ సురాః ।

స్వకార్యసిద్ధయే తాత ఛలకర్మ విచక్షణాః ॥

అథామృతార్థం సింధోశ్చ మంథనం చక్రురాదరాత్ ।

విష్ణోస్సహాయినస్తే హి సురాస్సర్వేఽ సురైస్సహ ॥

తతో రత్నో పహరణమకార్షు ర్దైత్యశత్రవః ।

జగృహుర్యత్నతో దేవాః పపురప్యమృతం ఛలాత్ ॥

తతః పరాభవం చక్రురసురాణాం సహాయతః ।

విష్ణోస్సు రాస్సుచక్రాస్త్రేఽ మృతపానాద్బలాన్వితాః ॥

శుక్రుడిట్లు పలికెను –

జలంధరా! మహావీరా! రాక్షసులందరికీ సహాయమును చేయువాడా! జరిగిన వృత్తాంతమునంతనూ యథాతథముగా చెప్పెదను. వినుము (9). పూర్వము బలవంతుడు, వీరుడు, విరోచనుని కుమారుడు, హిరణ్యకశిపుని మునిమనుమడు, గొప్ప ధర్మవేత్త అగు బలి యనువాడు ఒకడు ఉండెను (10). స్వార్థ సంపాదనలో ఘనులగు దేవతలు వానిచే ఓడింపబడి ఇంద్రునితో గూడి లక్ష్మీ పతిని శరణు జొచ్చి

తమ వృత్తాంతమును చెప్పిరి (11). తరువాత ఆయన ఆజ్ఞచే రాక్షసులు దేవతలతో సంధిని కుదుర్చుకొనిరి. మోసపుచ్చుటలో పండితులగు దేవతలు తమ కార్యమును చక్కబెట్టుకొనుట కొరకై అట్లు చేసిరి. వత్సా (12) అపుడు విష్ణువు యొక్క సాహాయ్యము గల దేవతలందరు రాక్షసులతో గూడి అమృతము కొరకు సముద్రమును శ్రద్ధతో మథించిరి (13). తరువాత రాక్షసులకు శత్రువులగు దేవతలు యోజన చేసి శ్రేష్ఠవస్తువులను గొని పోయిరి. మరియు మోసము చేసి అమృతమును త్రాగిరి (14). మరియు విష్ణువు యొక్క సాహాయ్యముతో అమృతమును త్రాగి బలమును పొందిన ఆ దేవతలు రాక్షసులను పరాభవించిరి. విష్ణువు యొక్క చక్రము వారికి సహాయపడెను (15).

శిరశ్ఛేదం చకారాసౌ పిబతశ్చామృతం హరిః ।
రాహోర్దేవసభాయాం హి పక్షపాతీ హరేస్సదా ॥

నిత్యము ఇంద్రుని పక్షమును వహించు విష్ణువు, దేవతల ప్రక్కన చేరి అమృతమును త్రాగుచున్న రాహువు యొక్క శిరస్సును నరికి వేసెను (16).

సనత్కుమార ఉవాచ ।

ఏవం కవిస్తస్య శిరశ్ఛేదం రాహోశ్శశంస చ ।
అమృతార్థే సముద్రస్య మంథనం దేవకారితమ్ ॥
రత్నోపహరణం చైవ దైత్యానాం చ పరాభవమ్ ।
దేవైరమృతపానం చ కృతం సర్వం చ విస్తరాత్ ॥
తదాకర్ణ్య మహావీరోఽబుధిబాలః ప్రతాపవాన్ ।
చుక్రోధ క్రోధరక్తాక్ష స్స్వపితుర్మంథనం తదా ॥
అథ దూతం సమాహూయ ఘస్మరాభిధ ముత్తమమ్ ।
సర్వం శశంస చరితం యదాహ గురురాత్మవాన్ ॥
అథ తం ప్రేషయామాస స్వదూతం శక్రసన్నిధౌ ।
సమ్మాన్య బహుశః ప్రీత్యాఽభయం దత్త్వా విశారదమ్ ॥
దూతస్త్రి విష్టపం తస్య జగామారమలం సుధీః ।
ఘస్మరోఽబుధి బాలస్య సర్వదేవ సమన్వితమ్ ॥
తత్ర గత్వా స దూతస్తు సుధర్మాం ప్రాప్య సత్వరమ్ ।
గర్వాదఖర్వమౌలిర్హి దేవేంద్రం వాక్యమబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శుక్రాచార్యుడు రాహువు యొక్క శిరశ్ఛేదమును గురించి, అమృతము కొరకు దేవతలు సముద్రమును మథించుట గురించి వివరించి చెప్పెను (17). శ్రేష్ఠ వస్తువు లను దేవతలు గొని పోవుట, రాక్షసులు పరాభవమును పొందుట, దేవతలు అమృత పానమును చేయుట అను వృత్తాంతమునంతనూ విస్తరముగా

చెప్పెను (18). మహావీరుడు, ప్రతాపవంతుడు అగు జలంధరుడు తన తండ్రి మథింపబడిన వృత్తాంతమును విని కోపించెను. కోపముచే ఆతని కన్నులు ఎరుపెక్కెను (19). స్వాభిమానము గల జలంధరుడు అపుడు ఘస్మరుడనే ఉత్తముడగు దూతను పిలిపించి శుక్రుడు వివరించిన వృత్తాంతమునంతనూ చెప్పెను (20). అప్పుడాతడు బుద్ధిశాలియగు ఆ దూతను ప్రీతితో బలుతెరంగుల సన్మానించి అభయమునిచ్చి ఇంద్రుని సన్నిధికి పంపెను.(21) జలంధరుని దూత, బుద్ధిమంతుడు అగు ఘస్మరుడు దేవతలందరితో విరాజిల్లే స్వర్గమునకు వెళ్లెను (22). ఆ దూత అచటకు వెళ్లి వెంటనే సుధర్మయను దేవసభకు వెళ్లి గర్వముతో తలను పైకెత్తి దేవేంద్రునితో నిట్లు పలికెను (23).

ఘస్మర ఉవాచ ।

జలంధరోఽబ్ధితనయ స్సర్వదైత్య జనేశ్వరః ।
సుప్రతాపీ మహావీరస్స్వయం కవిసహాయవాన్ ॥
దూతోఽహం తస్య వీరస్య ఘస్మరాఖ్యో న ఘస్మరః ।
ప్రేషితస్తేన వీరేణ త్వత్సకాశమిహాగతః ॥
అవ్యాహతాజ్ఞ స్సర్వత్ర జలంధర ఉదగ్రధీః ।
నిర్జితాఖిల దైత్యారిస్స యదాహ శృణుష్వ తత్ ॥

ఘస్మరుడిట్లు పలికెను -

జలంధరుడు రాక్షస జనులందరికీ ప్రభువు. సముద్రుని పుత్రుడు. గొప్ప ప్రతాపశాలి. మహావీరుడు. శుక్రుని ఆలంబనము గలవాడు (24). నేను ఆ వీరుని దూతను. నా పేరు ఘస్మరుడు. కాని నేను కార్యనాశకుడను గాదు. ఆ వీరుడు పంపగా నేను మీవద్దకు వచ్చి యుంటిని (25). జలంధరుని ఆజ్ఞకు ఎక్కడనైననూ తిరుగు లేదు. కుశాగ్రబుద్ధి యగు ఆతడు రాక్షస శత్రువుల నందరినీ జయించినాడు. ఆతడు చెప్పిన సందేశమును వినుము (26).

జలంధర ఉవాచ ।

కస్మాత్త్వయా మమ పితా మథితస్సాగరోఽద్రిణా ।
నీతాని సర్వరత్నాని పితుర్మే దేవతాధమ ॥
ఉచితం న కృతం తేఽద్య తాని శీఘ్రం ప్రయచ్ఛ మే ।
మమాయాహి విచార్యేత్థం శరణం దైవతై స్సహ ॥
అన్యథా తే భయం భూరి భవిష్యతి సురాధమ ।
రాజ్య విధ్వంసనం చైవ సత్యమేతద్బ్రవీ మ్యహమ్ ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓ దేవతాధముడా! నీవు నా తండ్రియగు సముద్రుని పర్వతముతో మథించి నా తండ్రికి చెందిన శ్రేష్ఠవస్తువులనన్నిటినీ గొని పోతివి. ఇట్లు చేయుటకు కారణమేమి? (27) నీవు చేసినది తగని పని. కావున వాటిని వెంటనే నాకు

సమర్పించుము. జాగ్రత్తగా ఆలోచించి దేవతలతో సహా నన్ను శరణు జొచ్చుము (28). ఓ దేవాధమా! అట్లు చేయనిచో నీకు గొప్ప భయము కలుగును. రాజ్యము వినాశమగును. నేను సత్యమును పలుకుచున్నాను (29).

సనత్కుమార ఉవాచ ।

ఇతి దూతవచశ్శ్రుత్వా విస్మితస్త్రి దశాధిపః ।
ఉవాచ తం స్మరన్నింద్రో భయరోషసమన్వితః ॥
అద్రయో మద్భయాత్త్రస్తా స్స్వకుక్షిస్స్థా యతః కృతాః ।
అన్యేఽపి మద్విషస్తేన రక్షితా దితిజాః పురా ॥
తస్మాత్త ద్రత్నజాతం తు మయా సర్వం హృతం కిల ।
న తిష్ఠతి మమ ద్రోహీ సుఖం సత్యం బ్రవీమ్యహమ్ ॥
శంఖోఽప్యేవం పురా దైత్యో మాం ద్విషన్ సాగరాత్మజః ।
అభవన్మూఢచిత్తస్తు సాధుసంగాత్సము జ్ఝితః ॥
మమానుజేన హరిణా నిహతస్స హి పాపధీః ।
హింసకస్సాధు సంఘస్య పాపిష్ఠస్సాగరోదరే ॥
తద్గచ్ఛ దూత శీఘ్రం త్వం కథయస్వాస్య తత్త్వతః ।
అబ్ధిపుత్రస్య సర్వం హి సింధోర్మంథన కారణమ్ ॥
ఇత్థం విసర్జితో దూతో ఘస్మరాఖ్యస్సు బుద్ధిమాన్ ।
తదేంద్రేణా గమత్తూర్ణం యత్ర వీరో జలంధరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దూత యొక్క ఈ మాటను వినిన దేవేంద్రుడు ఆశ్చర్యపడెను. ఆయన గతమును స్మరించి భయమును మరియు రోషమును పొంది అతనితో నిట్లనెను (30). నాకు భయపడి పారిపోయిన పర్వతములను సముద్రుడు తన గర్భములో దాచినాడు. మరియు అతడు పూర్వము నా శత్రువులగు ఇతరులను కూడా రక్షించినాడు (31). అందువలననే ఆతని శ్రేష్ఠవస్తువులనన్నిటినీ అపహరించినాను. నాకు ద్రోహమును చేయు వ్యక్తి సుఖముగా మనజాలడు. నేను సత్యమును పలుకుచున్నాను (32). ఇదే విధముగా పూర్వము సముద్ర పుత్రుడగు శంఖాసురుడు మూర్ఖుడగుటచే సత్పురుషులతోడి మైత్రిని విడనాడి నన్ను ద్వేషించుట మొదలిడెను (33). సముద్రుని పుత్రునిగా జన్మించి సాధుసమాజమును హింసించిన ఆ మహాపాపిని నా తమ్ముడగు విష్ణువు సంహరించినాడు (34). ఓయీ దూతా! కావున నీవు వెంటనే వెళ్లి ఆ సముద్రపుత్రునకు ఈ సత్యమును తెలుపుము. సముద్రమును మథించుటకు గల కారణమును సమగ్రముగా వివరించుము (35). ఇంద్రుడు ఈ తీరున పలికి పంపివేసెను. అపుడు మహాబుద్ధిశాలి, ఘస్మరుడను పేరు గలవాడునగు ఆ దూత శీఘ్రమే వీరుడగు జలంధరుడు ఉన్న స్థానమునకు వెళ్లెను (36).

తదిదం వచనం దైత్యరాజో హితేన ధీమతా ।
కథితో నిఖిలం శక్రప్రోక్తం దూతేన వై తదా ॥
తన్నిశమ్య తతో దైత్యో రోషాత్ప్రస్ఫురితాధరః ।
ఉద్యోగమకరోత్తూర్ణం సర్వదేవ జిగీషయా ॥
తదోద్యోగే ఽసురేంద్రస్య దిగ్భ్యః పాతాలతస్తథా ।
దితిజాః ప్రత్యపద్యంత కోటిశః కోటిశస్తథా ॥
అథ శుంభ నిశుంభాద్యైర్బలాధిపతి కోటిభిః ।
నిర్జగామ మహావీరస్సింధుపుత్రః ప్రతాపవాన్ ॥
ప్రాప త్రివిష్టపం సద్య స్సర్వసైన్య సమావృతః ।
దధ్మౌ శంఖం జలధి జో నేదుర్వీరాశ్చ సర్వతః ॥
గత్వా త్రివిష్టపం దైత్యో నందనాధిష్ఠితో ఽభవత్ ।
సర్వసైన్యం సమావృత్య కుర్వాణస్సింహవ ద్రవమ్ ॥
పురమావృత్య తిష్ఠ తద్దృష్ట్వా సైన్యబలం మహత్ ।
నిర్యయుస్త్వమరావత్యా దేవా యుద్ధాయ దంశితాః ॥

ఆ బుద్ధి మంతుడగు దూత అపుడు ఇంద్రుడు పలికిన వచనములనన్నింటినీ రాక్షసరాజునకు నివేదించెను (37). ఆ మాటలను విని పిదప కోపముతో వణుకు చున్న క్రింది పెదవిగల ఆ రాక్షసుడు దేవతలనందరినీ జయించవలెనను కోరికతో వెంటనే సైన్యమును సన్నద్ధము చేసెను (38). రాక్షసేంద్రుని ఆ సైన్యసన్నాహము లోనికి అన్ని దిక్కులనుండియు, మరియు పాతాళములనుండియు రాక్షసులు కోట్ల సంఖ్యలో వచ్చి చేరిరి (39). ప్రతాపశాలి, మహావీరుడు, సముద్రపుత్రుడునగు జలంధరుడు అపుడు శుంభ నిశుంభాది రాక్షసులతో, కోట్లాది సైన్యముతో, సేనానాయకులతో గూడి బయలుదేరెను (40). ఆ సముద్రపుత్రుడు సైన్యములన్నింటితో గూడి శీఘ్రమే స్వర్గమును చేరి శంఖము నూదగా, వీరులు అంతటా సింహనాదములను చేసిరి (41). ఆ రాక్షసుడు స్వర్గమును జేరి నందనవనములో విడిది చేసి మహాసైన్యముతో చుట్టు వారబడి యున్నవాడై సింహనాదమును చేసెను (42). అమరావతీ నగరమును ముట్టడించిన ఆ మహాసైన్యమును గాంచిన దేవతలు కవచములను ధరించి యుద్ధము కొరకై నగరమునుండి బయలుదేరిరి (43).

తతస్సమభవద్యుద్ధం దేవదానవసేనయోః ।
ముసలైః పరిఘైర్బాణైర్గదాపరశుశక్తి భిః ॥
తే ఽన్యోన్యం సమధావేతాం జఘ్నతుశ్చ పరస్పరమ్ ।
క్షణేనా భవతాం సేనే రుధిరౌఘ పరిప్లుతే ॥
పతితైః పాత్యమానైశ్చ గజాశ్వరథ పత్తిభిః ।
వ్యరాజత రణే భూమి స్సంధ్యా భ్రపటలైరివ ॥

తత్ర యుద్ధే మృతాన్ దైత్యాన్ భార్గవస్తాన జీవయత్ ।
విద్యయా మృత జీవిన్యా మంత్రితైస్తోయ బిందుభిః ॥
దేవానపి తథా యుద్ధే తత్రా జీవయదంగిరాః ।
దివ్యౌషధైస్సమానీయ ద్రోణాద్రేస్తు పునః పునః ॥
దృష్టవాన్ స తథా యుద్ధే పునరేవ సముత్థితాన్ ।
జలంధరః క్రోధవశో భార్గవం వాక్యమబ్రవీత్ ॥

అపుడు దేవసైన్యము, రాక్షస సైన్యముల మధ్య యుద్ధము జరిగెను. దానిలో వారు ముసలములను, రోకళ్లను, పరిఘలను, బాణములను, గదలను, గొడ్డళ్లను, శక్తి ఆయుధములను వాడిరి (44). ఆ రెండు సైన్యములు ఒక దానిపై నొకటి దండయాత్ర చేసినవి. సైనికులు ఒకరినొకరు సంహరింప మొదలిడిరి. క్షణములో ఆ రెండు సేనలలో రక్తము ప్రవహింపజొచ్చెను (45). నేలగూలినట్టియు, మరియు నేల గూలుచున్న ఏనుగులతో, గుర్రములతో, రథములతో మరియు సైనికులతో ఆ యుద్ధభూమి మేఘపు తునకలతో గూడిన సంధ్యాకాలపు టాకాశము వలె ప్రకాశించెను (46). శుక్రుడు మృతసంజీవినీ మంత్రమును పఠించి, ఆ మంత్రించిన జలములను చల్లి అచట యుద్ధములో మరణించిన రాక్షసులను మరల బ్రతికించెడివాడు (47). అదే విధముగా అంగిరసుడు ద్రోణపర్వతమునుండి అనేకపర్యాయములు దివ్యమగు ఓషధులను తెచ్చి యుద్ధమునందు అసువులను బాసిన దేవతలను జీవింపజేసెడివాడు (48). యుద్ధములో మరణించియు మరల బ్రతికి వచ్చిన దేవతలను గాంచి జలంధరుడు మిక్కిలి కోపించి శుక్రాచార్యునితో నిట్లనెను (49).

జలంధర ఉవాచ ।

మయా దేవా హతా యుద్ధే ఉత్తిష్ఠంతి కథం పునః ।
తతస్సంజీవినీ విద్యా నైవాన్య త్రేతి వై శ్రుతా ॥

జలంధరుడిట్లు పలికెను –

నా చేతిలో మరణించిన దేవతలు యుద్ధరంగములో మరల జీవించుట ఎట్లు సంభవమగుచున్నది? సంజీవినీ విద్య మరియొకని వద్ద లేదని నేను విని యుంటిని (50).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య సింధుపుత్రస్య భార్గవః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా గురుశ్శుక్రో జలంధరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఆ సముద్రతనయుని వాక్యమును విని గురువగు శుక్రాచార్యుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై జలంధరునకిట్లు బదులిడెను (51).

శుక్ర ఉవాచ ।

దివ్యౌషధీస్సమానీయ ద్రోణాద్రేరంగిరాస్సురాన్ ।
జీవయత్యేష వై తాత సత్యం జానీహి మే వచః ॥
జయమిచ్ఛసి చేత్తాత శృణు మే వచనం శుభమ్ ।
తతస్సోఽరం భుజాభ్యాం త్వం ద్రోణమబ్ధావుపాహర ॥

శుక్రుడిట్లు పలికెను -

వత్సా! అంగిరసుడు ద్రోణపర్వతమునుండి దివ్యమగు ఓషధులను తెచ్చి దేవతలను బ్రతికించుచున్నాడు. నా ఈ వచనము సత్యమని యెరుంగుము (52). వత్సా! నీవు జయమును గోరువాడవైనచో, నేను చెప్పే శుభవచనమును వినుము. నీవు శీఘ్రమే నీ భుజములతో ఆ ద్రోణ పర్వతమును సముద్రములోనికి త్రోసి వేయుము (53).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తస్స దైత్యేంద్రో గురుణా భార్గవేణ హ ।
ద్రుతం జగామ యత్రాసావాస్తే చైవాద్రిరాట్ చ సః ॥
భుజాభ్యాం తరసా దైత్యో నీత్వా ద్రోణం చ తం తదా ।
ప్రాక్షిపత్సాగరే తూర్ణం చిత్రం న హరతేజసి ॥
పునరాయాన్మహా వీరస్సింధుపుత్రో మహాహవమ్ ।
జఘానా స్త్రైశ్చ వివిధైస్సురాన్ కృత్వా బలం మహత్ ॥
అథ దేవాన్ హతాన్ దృష్ట్వా ద్రోణాద్రిమగమద్గురుః ।
తావత్తత్ర గిరీంద్రం తం న దదర్శ సురార్చితః ॥
జ్ఞాత్వా దైత్యహృతం ద్రోణం ధిషణా భయవిహ్వలః ।
ఆగత్య దేవాన్ ప్రోవాచ జీవో వ్యాకుల మానసః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

గురువగు భార్గవుడిట్లు చెప్పగా, ఆ రాక్షసరాజు వెను వెంటనే ఆ గొప్ప పర్వతము ఉన్న స్థలమునకు వచ్చెను (54). ఆ రాక్షసుడు తన భుజములతో ఆ పర్వతమును వేగముగా లాగుకొనిపోయి వెంటనే సముద్రములో పారవైచెను. శివుని తేజస్సు నుండి పుట్టిన వ్యక్తి ఇట్టి పనిని చేయుట ఆశ్చర్యము కాదు (55). మహావీరుడగు ఆ జలంధరుడు వెనుకకు మరలివచ్చి ఆ మహాసంగ్రామములో తన గొప్ప బలమును ప్రదర్శించు వాడై దేవతలను వివిధములగు అస్త్రములతో సంహరింపజొచ్చెను (56). ఇట్లు దేవతలు సంహరింపబడుటను గాంచి, దేవతలచే పూజింపబడు వాడు, గురువునగు అంగిరసుడు ద్రోణ పర్వతము వద్దకు చనెను. కాని ఆతనికి అచట ఆ పర్వతము కానరాలేదు (57). ద్రోణపర్వతము రాక్షసులచే అపహరింపబడినదని తెలియగానే బుద్ధిశాలి యగు బృహస్పతి భయముతో నిండిన మనస్సు గల వాడై వచ్చి దేవతలతో నిట్లనెను (58).

గురురువాచ ।

పలాయ ధ్వం సురాస్సర్వే ద్రోణో నాస్తి గిరిర్మహాన్ ।

ధ్రువం ధ్వస్తశ్చ దైత్యేన పాథోధితనయేన హి ॥

జలంధరో మహాదైత్యో నాయం జేతుం క్షమో యతః ।

రుద్రాంశ సంభవో హ్యేష సర్వామర విమర్దనః ॥

మయా జ్ఞాతః ప్రభావోస్య యథోత్పన్న స్స్వయం సురాః ।

శివాపమాన కృచ్ఛక్రచేష్టితం స్మరతాఖిలమ్ ॥

గురువు ఇట్లు పలికెను-

దేవతలారా! మీరందరు పారిపొండు. గొప్ప ద్రోణపర్వతము ఇప్పుడు లేదు. సముద్రపుత్రుడగు ఆ రాక్షసుడు దానిని నిశ్చితముగా నాశనము చేసి యుండును (59). జలంధరుడు మహారాక్షసుడు, రుద్రుని అంశచే జన్మించిన వాడు, మరియు శత్రువులనందరినీ జయించినవాడు. ఈతనిపై విజయమును పొందుట శక్యము కాదు (60), ఓ దేవతలారా! ఈతడు జన్మించిన విధానము, ఈతని ప్రభావము నాకు తెలిసినవి. శివుని అవమానిస్తూ ఇంద్రుడు చేసిన చేష్టను అంతనూ గుర్తుకు తెచ్చుకొనుడు (61).

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వా తద్వచనం దేవాస్సురాచార్య ప్రకీర్తితమ్ ।
జయాశాం త్యక్త వంతస్తే భయవిహ్వలితా స్తథా ॥
దైత్యరాజేన తేనాతి హన్యమానాస్సమంతతః ।
ధైర్యం త్యక్త్వా పలాయంత దిశో దశ సవాసవాః ॥
దేవాన్ విద్రావితాన్ దృష్ట్వా దైత్య స్సాగరనందనః ।
శంఖభేరీ జయరవైః ప్రవివేశామ రావతీమ్ ॥
ప్రవిష్టే నగరీం దైత్యే దేవాశ్శక్ర పురోగమాః ।
సువర్ణా ద్రిగుహాం ప్రాప్తా న్యవసన్ దైత్య తాపితాః ॥
తదైవ సర్వేష్వసురోఽధికారేష్వింద్రాదికానాం వినివేశ్య సమ్యక్ ।
శుంభాదికాన్ దైత్యవరాన్ పృథక్ పృథక్ స్వయం సువర్ణాద్రిగుహాం వ్యగాన్మునే ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే దేవ జలంధర యుద్ధవర్ణనం నామ పంచదశోఽధ్యాయః॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవగురువు యొక్క ఆ మాటలను విని దేవతలు జయమునందలి ఆశను వీడి భయముతో కంగారు పడజొచ్చిరి (62). ఆ రాక్షసవీరుడు దేవతలను నలువైపులనుండియూ సంహరించ మొదలిడెను. ఇంద్రుడు మొదలగు దేవతలు అపుడు ధైర్యమును గోల్పోయి పది దిక్కులకు పారిపోయిరి (63). సముద్రనందనుడగు ఆ రాక్షసుడు దేవతల పలాయనమును గాంచి, శంఖధ్వనులతో భేరీధ్వనులతో జయరావములతో అమరావతిలోనికి ప్రవేశించెను (64). ఇట్లు ఆ రాక్షసుడు అమరావతిని ప్రవేశించగా, ఇంద్రాది దేవతలు ఆ రాక్షసుని బాధలకు తాళలేక మేరుపర్వత గుహను చేరి తలదాచుకొనిరి (65). ఓ మహర్షీ! అపుడా రాక్షసుడు ఇంద్రాది దేవతల అధికారములన్నింటియందు శుంభుడు మొదలగు రాక్షస శ్రేష్ఠులను వేర్వేరుగా చక్కగా నియమించి తాను స్వయముగా మేరుపర్వత గుహ వద్దకు వెళ్లెను (66).

శ్రీ శివమహాపురాణములో రుద్రసంహితయందు యుద్ధఖండలో దేవజలంధర యుద్ధ వర్ణనమనే ఇరువది అయిదవ అధ్యాయము ముగిసినది (25).

16 – దేవాసుర యుద్ధము

సనత్కుమార ఉవాచ ।

పునర్దైత్యం సమాయాతం దృష్ట్వా దేవాస్సవాసవాః ।
భయాత్ప్ర కంపితాస్సర్వే సహైవాదు ద్రువుర్ద్రుతమ్ ॥
వైకుంఠం ప్రయయుస్సర్వే పురస్కృత్య ప్రజాపతిమ్ ।
తుష్టువుస్తే సురా నత్వా స ప్రజాపతయోఽ ఖిలాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

మరల అచటకు వచ్చిన ఆ రాక్షసుని గాంచి ఇంద్రాది దేవతలందరు భయముతో వణుకుతూ శీఘ్రముగా పలాయనమును చిత్తగించిరి (1). వారందరు బ్రహ్మగారిని ముందిడు కొని వైకుంఠమునకు వెళ్లి నమస్కరించి స్తుతించిరి (2).

దేవా ఊచుః ।

హృషీ కేశ మహాబాహో భగవన్ మధుసూదన ।
నమస్తే దేవదేవేశ సర్వదైత్య వినాశక ॥
మత్స్యరూపాయ తే విష్ణో వేదాన్నీతవతే నమః ।
సత్యవ్రతేన సద్రజ్ఞా ప్రలయాబ్ధి విహారిణే ॥
కుర్వాణానాం సురాణాం చ మంథనాయోద్యమం భృశమ్ ।
బిభ్రతే మందరగిరిం కూర్మరూపాయ తే నమః ॥
నమస్తే భగవన్నాథ క్రతవే సూకరాత్మనే ।
వసుంధరాం జనాధారాం మూర్ధతో బిభ్రతే నమః ॥
వామనాయ నమస్తుభ్యముపేంద్రాఖ్యాయ విష్ణవే ।
విప్రరూపేణ దైత్యేంద్రం బలిం ఛలయతే విభో ॥
నమః పరశురామాయ క్షత్రనిః క్షత్ర కారిణే ।
మాతుర్విత్తకృతే తుభ్యం కుపితాయాసతాం ద్రుహే ॥
రామాయ లోకరామాయ మర్యాదాపురుషాయ తే ।
రావణాంతకారాయాశు సీతాయాః పతయే నమః ॥

దేవతలిట్లు పలికిరి –

ఇంద్రియములకు ప్రభువైన వాడా! హేభగవాన్! గొప్ప బాహువులు గలవాడా! మధువు అను రాక్షసుని సంహరించిన వాడా! దేవదేవా! ఈశ్వరా! రాక్షసుల నందరినీ నశింపజేసినవాడా! నీకు నమస్కారము (3). హే విష్ణో! సత్యవ్రతుడనే పుణ్యశీలుడగు రాజుతో గూడి ప్రలయ కాలమునందు మత్స్యరూపముతో సముద్రమునందు విహరించి వేదములను కాపాడిన నీకు నమస్కారము (4). సముద్రమును మథించుటకు దేవతలు పెద్ద యత్నమును చేయుచుండగా కూర్మరూపమును దాల్చి మందరపర్వతమును మోసిన నీకు

నమస్కారము (5). హే భగవాన్! నాథా! యజ్ఞవరాహరూపమును దాల్చి జనులకు ఆధారమైన భూమిని శిరస్సుపై ధరించిన నీకు నమస్కారము (6). హే ప్రభో! వామనావతారములో నీవు ఇంద్రుని సోదరుడవై బ్రాహ్మణ వేషముతో రాక్షసరాజైన బలిని మోసగించి బ్రహ్మాండమునంతనూ నీ అడుగులతో వ్యాపించినావు. అట్టి నీకు నమస్కారము (7). పాపులను సంహరించు నీవు పరశురాముడవై తల్లి హితము కొరకు క్రోధముతో భూమియందు క్షత్రియులు లేకుండగా చేయుటకు ఉద్యమించితివి. అట్టి నీకు నమస్కారము (8). లోకుల మనస్సులను రంజింప చేయువాడు, మర్యాదాపురుషోత్తముడు, సీతాపతి అగు రాముని రూపమును దాల్చి రావణుని సంహరించిన నీకు నమస్కారము (9).

నమస్తే జ్ఞానగూఢాయ కృష్ణాయ పరమాత్మనే ।
రాధావిహారశీలాయ నానాలీలాకారాయ చ ॥
నమస్తే గూఢదేహాయ వేద నిందాకరాయ చ ।
యోగాచార్యాయ జైనాయ బౌద్ధరూపాయ మాపతే ॥
నమస్తే కల్కిరూపాయ మ్లేచ్ఛానామంత కారిణే ।
అనంతశక్తి రూపాయ సద్ధర్మ స్థాపనాయ చ ॥
నమస్తే కపిల రూపాయ దేవహూత్యై మహాత్మనే ।
వదతే సాంఖ్య యోగం చ సాంఖ్యాచార్యాయ వై ప్రభో ॥
నమః పరమహంసాయ జ్ఞానం సంవదతే వరమ్ ।
విధాత్రే జ్ఞానరూపాయ యేనాత్మా సంప్ర సీదతి ॥
వేదవ్యాసాయ వేదానాం విభాగం కుర్వతే నమః ।
హితాయ సర్వలోకానాం పురాణరచనాయ చ ॥
ఏవం మత్స్యాదితనుభిర్భక్త కార్యోద్యతాయ తే ।
సర్గస్థితిధ్వంస కర్త్రే నమస్తే బ్రహ్మణే ప్రభో ॥

జ్ఞానస్వరూపుడవు, పరమాత్మవు అగు నీవు శ్రీకృష్ణ రూపమును దాల్చి, రాధతో గూడి విహరిస్తూ అనేక లీలలను వెలయించితివి. అట్టి నీకు నమస్కారము (10). ఓ లక్ష్మీ పతీ! జినరూపములో, బుద్ధరూపములో నిగూఢమగు అవతారమును దాల్చిన నీవు వేదములను నిందించి యోగాచార్యుడవైతివి. అట్టి నీకు నమస్కారము (11). అనంతశక్తి స్వరూపుడవగు నీవు కల్కి రూపమును దాల్చి మ్లేచ్ఛుల నంతమొందించి సద్ధర్మమును స్థాపించెదవు. అట్టి నీకు నమస్కారము (12). ఓ ప్రభూ! మహాత్ముడగు కపిలుని రూపము దాల్చి సంఖ్యాచార్యుడవై సాంఖ్యయోగమును దేవహూతికి బోధించిన నీకు నమస్కారము (13). ఏ జ్ఞానముచే అంతఃకరణము మిక్కిలి ప్రసన్నమగునో అట్టి పరమజ్ఞానమును బోధించువాడు, సృష్టిస్థితిలయకర్త, జ్ఞానస్వరూపుడు అగు పరమహంసకు నమస్కారము (14). సర్వజనుల హితమును గోరి వేదములను విభజించి

పురాణములను రచించిన వేదవ్యాసుడు నీ స్వరూపమే. అట్టి నీకు నమస్కారము (15). ఓ ప్రభూ! ఈ తీరున నీవు మత్స్యాది అవతారములను దాల్చి భక్తుల కార్యమును చేయుటకు సంసిద్ధుడ వగుచుందువు. సృష్టి స్థితిలయములకు కారణమైన పరబ్రహ్మవు నీవే. నీకు నమస్కారము (16).

ఆర్తిహంత్రే స్వదాసానాం సుఖదాయ శుభాయ చ ।
పీతాంబరాయ హరయే తార్క్ష్యయానాయ తే నమః ।
సర్వ క్రియాయైక కర్త్రే శరణ్యాయ నమో నమః ॥
దైత్యసంతాపితామర్త్య దుః ఖాదిధ్వంసవజ్రక ।
శేషతల్పశయాయార్క చంద్రనేత్రాయ తే నమః ॥
కృపాసింధో రమానాథ పాహి నశ్శరణాగతాన్ ।
జలంధరేణ దేవాశ్చ స్వర్గాత్సర్వే నిరాకృతాః ॥
సూర్యో నిస్సారితస్స్వా నా చ్చంద్రో వహ్నిస్తథైవ చ ।
పాతాలాన్నాగరాజశ్చ ధర్మరాజో నిరాకృతః ॥
విచరంతి యథా మర్త్యాశ్శోభంతే నైవ తే సురాః ।
శరణం తే వయం ప్రాప్తా వధస్తస్య విచింత్య తామ్ ॥

తన దాసుల కష్టములను పోగొట్టి సుఖములను, శుభములను ఇచ్చువాడు, పచ్చని వస్త్రమును ధరించువాడు, పాపములను పోగొట్టు వాడు, గరుడుడు వాహనముగా గలవాడు అగు నీకు నమస్కారము. క్రియలన్నిటినీ చేయు ఒకే ఒక కర్తవు నీవే. శరణు పొందదగిన నీకు అనేక నమస్కారములు (17). దైత్యులచే పీడింపబడుచున్న దేవతల దుఃఖములు మొదలగు వాటిని నశింపజేయుటలో వజ్రము వంటి వాడా! శేషశయ్యపై పరుండు వాడవు, సూర్యచంద్రులు నేత్రములుగా గల వాడవు అగు నీకు నమస్కారము (18). దయానిధీ! లక్ష్మీపతీ! శరణు పొందిన మమ్ములను రక్షించుము. జలంధరుడు స్వర్గమునుండి దేవతల నందరినీ వెళ్లగొట్టినాడు (19). సూర్యచంద్రులను, అగ్నిని, యమధర్మరాజును అతడు తమ తమ స్థానములనుండి వెళ్లగొట్టినాడు. పాతాళమునుండి వాసుకిని తరిమివేసినాడు (20). మానవుల వలె తిరుగాడు చున్న దేవతలలో శోభ అంతరించినది. మేము నిన్ను శరణు పొందుచున్నాము. వానిని వధించు ఉపాయమును ఆలోచించుము (21).

సనత్కుమార ఉవాచ ।

ఇతి దీనవచశ్శ్రుత్వా దేవానాం మధుసూదనః ।
జగాద కరుణా సింధు ర్మేఘ నిర్హ్రాదయా గిరా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవతల ఈ దీనాలాపములను విని కరుణా సముద్రుడగు మధుసూదనుడు మేఘగంభీరమగు వాక్కుతో నిట్లనెను (22).

విష్ణురువాచ ।

భయం త్యజత హే దేవా గమిష్యామ్యహ మాహవమ్ ।
జలంధరేణ దైత్యేన కరిష్యామి పరాక్రమమ్ ॥
ఇత్యుక్త్వా సహసోత్థాయ దైత్యారిః ఖిన్నమానసః ।
ఆరోహద్గరుడం వేగాత్కృపయా భక్త వత్సలః ॥
గచ్ఛంతం వల్లభం దృష్ట్వా దేవై స్సార్ధం సముద్రజా ।
సాంజలిర్బాష్పనయనా లక్ష్మీర్వచన మబ్రవీత్ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవతలారా! భయమును విడనాడుడు. నేను యుద్ధమునకు వెళ్లి, జలంధరాసురునకు నా పరాక్రమమును చూపించెదను (23). భక్త ప్రియుడు, రాక్షసశత్రువు అగు విష్ణువు ఇట్లు పలికి దయచే దుఃఖితమైన మనస్సు గలవాడై శీఘ్రముగా గరుడుని అధిష్ఠించెను (24). సముద్రపుత్రియగు లక్ష్మి దేవతలతో గూడి వెళ్లుచున్న తన భర్తను గాంచి కన్నీళ్లతో చేతులను జోడించి ఇట్లు పలికెను (25).

లక్ష్మ్యు వాచ।

అహం తే వల్లభా నాథ భక్తా యది చ సర్వదా ।
తత్కథం తే మమ భ్రాతా యుద్ధే వధ్యః కృపానిధే ॥

లక్ష్మి ఇట్లు పలికెను -

ఓ నాథా! నేను నీకు ప్రియురాలనైనచో, నేను ఎల్లవేళలా నీకు భక్తురాలనైనచో, ఓ దయాసముద్రా! నా సోదరుని నీవు యుద్ధములో ఎట్లు వధించగలుదువు? (26)

విష్ణురువాచ ।

జలంధరేణ దైత్యేన కరిష్యామి పరాక్రమమ్ ।
త్రైస్సంస్తుతో గమిష్యామి యుద్ధాయ త్వరితాన్వితః ॥
రుద్రాంశ సంభవత్వాచ్చ బ్రహ్మణా వచనా దపి ।
ప్రీత్యా చ తవ నైవాయం మమ వధ్యో జలంధరః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

జలంధరాసురునకు నా పరాక్రమమును చూపించెదను. దేవతలు కొనియాడుచుండగా శీఘ్రముగా యుద్ధము కొరకు వెళ్లగలను (27). కాని రుద్రుని అంశచే జన్మించిన వాడగుట వలన, బ్రహ్మ యొక్క వచనము వలన, మరియు నీ అనురాగము వలన జలంధరుడు నాచే వధింపబడడు (28).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా గరుడారూఢశ్శంఖచక్ర గదాసి భృత్ ।
విష్ణుర్వేగా ద్యయౌ యోద్ధుం దేవైశ్శక్రాదిభిస్సహ ॥
ద్రుతం స ప్రాప తత్రైవ యత్ర దైత్యో జలంధరః ।
కుర్వన్ సింహరవం దేవైర్జ్వలద్భి ర్విష్ణుతేజసా ॥
అథారుణానుజ జవ పక్షవాత ప్రపీడితాః ।
వాత్యా వివర్తితా దైత్యా బభ్రముః ఖే యథా ఘనాః ॥
తతో జలంధరో దృష్ట్వా దైత్యాన్ వాత్యా ప్రపీడితాన్ ।
ఉద్ధృత్య వచనం క్రోధాద్ద్రుతం విష్ణుం సమభ్య గాత్ ॥
ఏతస్మి న్నంతరే దేవాశ్చ క్రుర్యుద్ధం ప్రహర్షితాః ।
తేజసా చ హరేః పుష్టా మహాబల సమన్వితాః ॥
యుద్ధాద్యతం సమాలో క్య దేవసైన్యముప స్థితమ్ ।
దైత్యానా జ్ఞాపయమాస సమరే చాతిదుర్మదాన్ ॥

సనత్కుమారుడిట్లనెను -

విష్ణువు ఇట్లు పలికి శంఖమును, చక్రమును, గదను, కత్తిని చేతబట్టి గరుడునిపై నెక్కి ఇంద్రాది దేవతలతో గూడి యుద్ధమును చేయుట కొరకు శీఘ్రమే వెళ్ళెను (29). విష్ణువు యొక్క తేజస్సుచే కాంతిని పొందిన దేవతలతో గూడి సింహనాదమును చేస్తూ, విష్ణువు జలంధరాసురుడు ఉన్న స్థలమును శీఘ్రముగా చేరుకొనెను (30). అపుడు గరుడుని రెక్కల గాలిచే పీడించబడిన రాక్షసులు ఆకాశమునందలి మేఘములు తుఫానుయందు వలె గిరగిర తిరుగుచుండిరి (31). అపుడు జలంధరుడు రెక్కల సుడిగాలిచే రాక్షసులు పీడింపబడుటను గాలిచే ఎగురవేయబడుటను గాంచి కోపించిన వాడై శీఘ్రమే విష్ణువుపై దాడి చేసెను (32), విష్ణువు యొక్క తేజస్సుచే ఉత్సాహితులైన దేవతలు మహాబలమును పొంది అదే సమయములో యుద్ధమును చేయనారంభించిరి (33). యుద్ధమునకు సన్నద్ధమై విచ్చేసిన దేవసైన్యమును గాంచి జలంధరుడు మహాబలశాలురగు రాక్షసులను యుద్ధమునకు ఆజ్ఞాపించెను (34).

జలంధర ఉవాచ ।

భో భో దైత్యవరా యూయం యుద్ధం కురుత దుస్తరమ్ ।
శక్రాద్యైరమరై రద్య ప్రబలైః కాతరైస్సదా ॥
మౌర్యాస్తు లక్షసంఖ్యాకా దౌమ్రా హి శతసంఖ్యకాః ।
అసురాః కోటి సంఖ్యాతాః కాలకేయాస్తథైవ చ ॥
కాలకానాం దౌర్హృదానాం కంకానాం లక్ష సంఖ్యయా ।
అన్యేఽపి స్వబలై ర్యుక్తా వినిర్యాంతు మమాజ్ఞయా ॥
సర్వే సజ్జా వినిర్యాత బహుసేనాభి సంయుతాః ।
నానాశస్త్రా స్త్ర సంయుక్తా నిర్భయా గతసంశయాః ॥
భో భో శుంభనిశుంభౌ చ దేవాన్ సమరకాతరాన్ ।
క్షణేన సుమహావీర్యౌ తుచ్ఛాన్నాశయతం యువామ్ ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓ రాక్షసవీరులారా! బలశాలురు, కాని పిరికి వారునగు ఇంద్రాది దేవతలతో మీరు భయంకరమగు యుద్ధమును చేయుడు (35). లక్షమంది మౌర్యులు, వందమంది దౌర్జ్యదులు, కోటిమంది కాలకేయాసురులు (36), లక్షమంది కంకులు మరియు ఇతరులు తమసైన్యములతో గూడి నా ఆజ్ఞచే బయలుదేరెదరు గాక! (37) మీరందరు వివిధ శస్త్రములను, అస్త్రములను దోడ్కొని, సంశయములను విడనాడి నిర్భయులై, పెద్ద సైన్యమును వెంటబెట్టుకొని సన్నద్ధులై బయలుదేరుడు (38), ఓ శుంభనిశుంభులారా! మహావీరులగు మీరిద్దరు యుద్ధమునకు భయపడే నీచులగు దేవతలను క్షణకాలములో నాశనము చేయుడు (39).

సనత్కుమార ఉవాచ ।

దైత్యా జలంధరాజ్ఞప్తా ఇత్థం యుద్ధవిశారదాః ।
యుయుధుస్తేఽ సురాస్సర్వే చతురంగ బలాన్వితాః ॥
గదాభిస్తీక్ష్ణ బాణైశ్చ శూలపట్టిశ తోమరైః ।
కేచిత్పరశు శూలైశ్చ నిజఘ్నుస్తే పరస్పరమ్ ॥
నానాయుధైశ్చ పరై స్తత్ర నిజఘ్నుస్తే బలాన్వితాః ।
దేవాస్తథా మహావీరా హృషీకేశ బలాన్వితాః ॥
యుయుధు స్తీక్ష్ణ బాణాశ్చ క్షిపంతస్సింహవ ద్రవాః ।
కేచిద్బాణైస్సు తీక్ ష్ణైశ్చ కేచిన్ముసల తోమరైః ॥
ఇష్టం సురాణాం దైత్యానాం సంగ్రామస్సమ భూన్మహాన్ ।
అత్యుల్బణో మునీనాం హి సిద్ధానాం భయకారకః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే దేవయుద్ధ
వర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను - .

యుద్ధనిపుణులగు ఆ రాక్షసులందరు జలంధరునిచే ఇట్లు ఆజ్ఞాపించబడిన వారై చతురంగ సైన్యముతో గూడి యుద్ధమును చేసిరి (40). దేవదానవులు గదలతో, పదునైన బాణములతో, శూలములతో, పట్టిశములతో, తోమరాయుధములతో, గొడ్డళ్లతో, శూలములతో ఒకరినొకరు సంహరించుకొనిరి (41). హృషీకేశుని సన్నిధిచే బలమును పొందియున్న మహావీరులగు ఆ దేవతలు కూడ. ఇతరములగు వివిధాయుధములతో రాక్షసులను సంహరించిరి (42). దేవదానవులు సింహనాదములను చేస్తూ వాడి బాణములను ప్రయోగిస్తూ, మరియు రోకళ్లతో తోమరాయుధములతో యుద్ధమును చేసిరి (43). ఈ తీరున దేవదానవులకు గొప్ప సంగ్రామము జరిగెను. అత్యుగ్రమగు ఆ యుద్ధము మునులకు సిద్ధులకు భయమును కలిగించెను (44).

శ్రీ శివమహాపురాణములో రుద్రసంహితయందలి యుద్ధఖండలో దేవాసుర యుద్ధ వర్ణన మనే పదునారవ అధ్యాయము ముగిసినది (16).

17 - విష్ణు జలంధర యుద్ధము

సనత్కుమార ఉవాచ ।

అథ దైత్యా మహావీర్యాశ్శూలైః పరశుపట్టిశైః ।
నిజఘ్ను స్సర్వదేవాంశ్చ భయవ్యాకుల మానసాన్ ॥
దైత్యాయుధైస్సమావిద్ధ దేహా దేవాస్సవాసవాః ।
రణాద్విదుద్రువు స్సర్వే భయవ్యాకుల మానసాః ॥
పలాయన పరాన్ దృష్ట్వా హృషీకేశస్సు రానథ ।
విష్ణుర్వై గరుడారూఢో యోధుమభ్యాయయౌ ద్రుతమ్ ॥
సుదర్శనేన చక్రేణ సర్వతః ప్రస్ఫురన్ రుచా ।
సుశోభితకరాబ్జశ్చ రేజే భక్తాభయంకరః ॥
శంఖఖడ్గ గదా శార్ఙ్గ ధారీ క్రోధసమన్వితః ।
కఠోరాస్త్రో మహావీరస్సర్వయుద్ధ విశారదః ॥
ధనుషం శార్ఙ్గ నామానం విస్ఫూర్య విననాద హ ।
తస్య నాదేన త్రైలోక్యం పూరితం మహతా మునే ॥
శార్ఙ్గ ని స్సృత బాణైశ్చ దితి జానాం శిరాంసి వై ।
చకర్త భగవాన్ విష్ణుః కోటిశో రుట్ సమాకులః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు మహావీరులగు రాక్షసులు భయముతో కల్లోలపడిన మనస్సు గల దేవతల నందరినీ శూలములతో, గొడ్డళ్లతో, పట్టిశములతో హింసించ మొదలిడిరి (1). రాక్షసుల ఆయుధములచే కొట్టబడిన దేహములు గల ఇంద్రాది దేవతలు అందరు భయముచే కల్లోల పడిన మనస్సులు గలవారై యుద్ధరంగమునుండి పరుగులెత్తిరి (2). ఇంద్రియములకు ప్రభువగు విష్ణువు పారిపోవుచున్న దేవతలను గాంచి గరుడుని అధిష్ఠించిన వాడై వెంటనే యుద్ధమునకు ముందునకురికెను (3). భక్తులకు అభయమునిచ్చు విష్ణువు అంతటా ప్రకాశించే కాంతులు గల సుదర్శన చక్రముతో విరాజిల్లు, పద్మము వంటి హస్తము గలవాడై ప్రకాశించెను (4).శంఖమును, ఖడ్గమును, గదను, శార్ఙ్గమను ధనస్సును ధరించిన వాడు, భయంకరమగు అస్త్రములు గలవాడు, మహావీరుడు, అన్ని విధముల యుద్ధమునందు నిపుణుడు అగు విష్ణువు మిక్కిలి కోపించెను (5). విష్ణువు శార్ఙ్గ ధనస్సుపై బాణము నెక్కు పెట్టి సింహనాదమును చేసెను. ఓ మునీ! ఆ గొప్ప నాదముచే ముల్లోకములు నిండెను (6). దుఃఖముచే కల్లోలమైన మనస్సు గల విష్ణుభగవానుడు శార్ఙ్గ ధనస్సు నుండి బయల్వెడలిన బాణములతో కోట్ల సంఖ్యలో రాక్షసుల తలలను తెగవేసెను (7).

అథారుణామ జ జవ పక్షవాత ప్రపీడితాః ।
వాత్యావివర్తితా దైత్యా బభ్రముఃఖే యథాఘనాః ॥
తతో జలంధరో దృష్ట్వా దైత్యాన్ వాత్యా ప్రపీడితాన్ ।
చుక్రోధాతి మహాదైత్యో దేవబృందభయంకరః ॥
మర్దయంతం చ తం దృష్ట్వా దైత్యాన్ ప్రస్ఫురితాధరః ।
యోద్ధు మభ్యాయయౌ వీరో వేగేన హరిణా సహ ॥
స చకార మహానాదం దేవాసుర భయంకరమ్ ।
దైత్యానామధిపః కర్ణా విదీర్ణా శ్రవణాత్తతః ॥
భయంకరేణ దైత్యస్య నాదేన పూరితం తదా ।
జలంధరస్య మహతా చకంపే సకలం జగత్ ॥
తతస్సమభవద్యుద్ధం విష్ణు దైత్యేంద్రయోర్మహత్ ।
ఆకాశం కుర్వతో బాణైస్తదా నిరవకాశవత్ ॥
తయోశ్చ తేన యుద్ధేన పరస్పరమభూన్మునే ।
దేవాసురర్షి సిద్ధానాం భీకరేణాతి విస్మయః ॥

అపుడు గరుడుని రెక్కల వేగమునుండి పుట్టిన గాలిచే పీడను పొందిన రాక్షసు ులు తుపానులో మేఘములవలె ఆకాశములో పల్టీలు కొట్టిరి (8). అపుడు మహారాక్షసుడు, దేవతల సమూహములకు భయమును గొల్పువాడు అగు జలంధరుడు పెనుగాలిచే దుఃఖితులగుచున్న రాక్షసులను చూచి మిక్కిలి కోపించెను (9). రాక్షసులను సంహరించుచున్న విష్ణువును గాంచి కోపముతో వణకుచున్న అధరము గల వీరుడగు జలంధరుడు విష్ణువుతో యుద్ధమును చేయుట కొరకై ముందునకురికెను (10). ఆ రాక్షసేశ్వరుడు దేవతలకు, రాక్షసులకు కూడ భయమును గొల్పు గొప్ప నాదమును చేసెను. దానిని విన్న వారి చెవులు పగిలినవి (11). జలంధరాసురుని భయంకరమగు గొప్ప నాదముచే నిండిపోయిన జగత్తు అంతయు ఆ సమయములో కంపించెను(12). అపుడు విష్ణువునకు, ఆ రాక్షసరాజునకు మధ్య గొప్ప యుద్ధము జరిగెను. వారు ఆకాశమునంతనూ లేశమైననూ అవకాశము లేని విధముగా బాణములతో నింపి వేసిరి (13). ఓ మహర్షీ! వారి ద్వంద్వయుద్ధమును గాంచిన దేవతలు, రాక్షసులు, మహర్షులు, సిద్ధులు పరమాశ్చర్యమును పొందిరి (14).

విష్ణుర్దైత్యస్య బాణౌఘైర్ధ్వజం ఛత్రం ధనుశ్శరాన్ ।
చిచ్ఛేద తం చ హృదయే బాణేనైకేన తాడయన్ ॥
తతో దైత్యస్సముత్పత్య గదాపాణిస్త్వరాన్వితః ।
ఆహత్య గరుడం మూర్ధ్నా పాతయామాస భూతలే ॥
విష్ణుం జఘాన శూలేన తీక్ష్ణేన ప్రస్ఫురద్రుచా ।
హృదయే క్రోధ సంయుక్తో దైత్యః ప్రస్ఫురితాధరః ॥

విష్ణుర్గదాం చ ఖడ్గేన బిచ్ఛేద ప్రహసన్నివ ।
తం వివ్యాధ శరైస్తీక్ష్ణైశ్శార్ఙ్గం విస్ఫూర్య దైత్యహా ॥
విష్ణుర్జలంధరం దైత్యం భయదేన శరేణ హ ।
క్రోధావిష్టోఽతితీక్ష్ణేన జఘానాశు సురారిహా ॥
ఆగతం తస్య తం బాణం దృష్ట్వా దైత్యో మహాబలః ।
ఛిత్త్వా బాణేన విష్ణుం చ జఘాన హృదయే ద్రుతమ్ ॥
కేశవోఽపి మహాబాహుః విక్షిప్తమసురేణ తమ్ ।
శరం తిల ప్రమాణేన ఛిత్త్వా వీరో ననాద హ ॥

విష్ణువు అనేక బాణములను ప్రయోగించి ఆ రాక్షసుని ధ్వజమును, ఛత్రమును, ధనుస్సును, బాణములను ఛేదించి, ఆతనిని హృదయముపై ఒక బాణముతో కొట్టెను (15). అపుడు ఆ రాక్షసుడు గదను చేతబట్టి వేగముగా పైకి లంఘించి గరుడుని తలపై మోది నేలపై పారవైచెను (16). కోపముతో వణకుచున్న క్రింది పెదవి గల ఆ రాక్షసుడు గొప్ప ప్రకాశము గలది, వాడియైనది అగు శూలముతో విష్ణువును హృదయమునందు పొడిచెను (17). రాక్షస సంహారకుడగు విష్ణువు చిరునవ్వు గలవాడై కత్తితో గదను విరుగకొట్టి శార్ఙ్గధనస్సును ఎక్కు పెట్టి వాడి బాణములతో వానిని కొట్టెను (18). రాక్షస సంహారకుడగు విష్ణువు క్రోధావేశమును పొంది మిక్కిలి వాడియగు భయంకరమైన బాణముతో జలంధరాసురుని శీఘ్రముగా నొప్పించెను (19). మహాబలవంతుడగు ఆ రాక్షసుడు విష్ణువుచే ప్రయోగింపబడి మీదకు వచ్చుచున్న ఆ బాణమును గాంచి, దానిని మరియొక బాణముతో ఛేదించి వెంటనే విష్ణువును వక్షస్థలముపై గొట్టెను (20). మహాబాహుడు, వీరుడు అగు విష్ణువు కూడా రాక్షసునిచే ప్రయోగింప బడిన ఆ బాణమును నువ్వుగింజ ప్రమాణములో నుగు చేసి సింహనాదమును చేసెను (21).

పునర్బాణం సమాధత్త ధనుషి క్రోధ వేపితః ।
మహాబలోఽథ బాణేన బిచ్ఛేద స శిలీముఖమ్ ॥
వాసుదేవః పునర్బాణం నాశాయ విబుధద్విషః ।
క్రోధేనా ధత్త ధనుషి సింహవద్వ్యనదాద హ ॥
జలంధరోఽథ దైత్యేంద్రః కోపప్ఛిన్నాధరో బలీ ।
శరేణ స్వేన శార్ ఙ్గాఖ్యం ధనుశ్చిచ్ఛేద వైష్ణవమ్ ॥
పునర్బాణై స్సుతీక్ ష్ణైశ్చ జఘాన మధుసూదనమ్ ।
ఉగ్రవీర్యో మహావీరో దేవానాం భయకారకః ॥
సచ్ఛిన్నధన్వా భగవాన్ కేశవో లోకరక్షకః ।
జలంధరస్య నాశాయ చిక్షేప స్వర్గదాం పరామ్ ॥
సా గదా హరిణా క్షిప్తా జ్వలజ్జ్వలన సన్నిభా ।
అమోఘగతికా శీఘ్రం తస్య దేహే లలాగ హ ॥
తయా హతో మహాదైత్యో న చచాలాపి కించన ।
జలంధరో మదోన్మత్తః పుష్పమాలాహతో యథా ॥

మహాబలుడగు జలంధరుడు కోపముతో వణుకుచున్నవాడై ధనస్సు నందు మరల బాణమును సం(ం)ధించగా, విష్ణువు దానిని కూడ విరుగగొట్టెను (22). వాసుదేవుడు దేవశత్రువగు జలంధరుని సంహరించ గోరి కోపముతో మరల బాణమును ధనస్సు నందు సంధించి సింహనాదమును చేసెను (23). రాక్షసరాజు, బలశాలి యగు జలంధరుడు అపుడు కోపముతో పెదవిని కొరికి తన బాణముతో విష్ణువు యొక్క శార్ఙ్గధనస్సును విరుగగొట్టెను (24). భయంకరమగు పరాక్రమము గలవాడు, మహావీరుడు, దేవతలకు భయమును గొల్పువాడు నగు జలంధరుడు మరల మధుసూదనుని మిక్కిలి వాడియగు బాణముతో కొట్టెను (2 5). లోకములను రక్షించే కేశవభగవానుడు విరిగిన ధనస్సు గలవాడై జలంధరుని సంహరించుటకై దివ్యమగు గదను ప్రయోగించెను (26). మండే అగ్నిని బోలియున్నది, అమోఘమగు గతి కలది అగు ఆ గద విష్ణువుచే ప్రయోగింపబడి వెంటనే ఆతని దేహమునకు తగిలెను (27). బలముతో గర్వించినవాడు, మహారాక్షసుడునగు జలంధరునకు ఆ గద పుష్పమాలవలె తగిలి, లేశమైననూ ఆతనిని కదిలించలేక పోయెను (28).

తతో జలంధరః క్రోధీ దేవత్రాస కరోఽక్షిపత్ ।
త్రిశూల మనలాకారం హరయే రణదుర్మదః ॥
అథ విష్ణుస్తత్త్రి శూలం చిచ్ఛేద తరసా ద్రుతమ్ ।
నందకాఖ్యేన ఖడ్గేన స్మృత్వా శివపదాంబుజమ్ ॥
ఛిన్నే త్రిశూలే దైత్యేంద్ర ఉత్ప్లుత్య సహసా ద్రుతమ్ ।
ఆగత్య హృదయే విష్ణుం జఘాన దృఢముష్టినా ॥
సోఽపి విష్ణుర్మహా వీరోఽ విగణయ్య చ తద్ వ్యథామ్ ।
జలంధరం చ హృదయే జఘాన దృఢముష్టినా ॥
తతతో బాహుయుద్ధేన యుయుధాతే మహాబలౌ ।
బాహుభిర్ముష్టిభిశ్చైవ జానుభిర్నాదయన్మహీమ్ ॥
ఏవం హి సుచిరం యుద్ధం కృత్వా తేనాసురేణ వై ।
విస్మితోఽ భూన్మని శ్రేష్ఠ హృది గ్లాని మవాప హ ॥
అథ ప్రసన్నో భగవాన్మాయీ మాయా విదాం వరః ।
ఉవాచ దైత్యరాజానం మేఘగంభీరయా గిరా ॥

యుద్ధములో సహింప శక్యము కాని పరాక్రమము గలవాడు, దేవతలకు భయమును గొల్పువాడునగు జలంధరుడు అపుడు కోపించి అగ్నిహోత్రమువలె మిరుమిట్లు గొల్పు చున్న త్రిశూలమును విష్ణువు పైకి విసిరెను (29). అపుడు విష్ణువు శివుని పాదపద్మములను స్మరించి వెంటనే నందకమను ఖడ్గముతో ఆ త్రిశూలమును ముక్కలు చేసెను (30). త్రిశూలము ముక్కలు కాగానే, ఆ రాక్షసవీరుడు వెంటనే పైకి దుమికి వచ్చి విష్ణువును బలమగు పిడికిలితో వక్షస్థలముపై కొట్టెను (31). మహావీరుడగు ఆ విష్ణువు కూడా ఆ బాధను

లెక్కచేయక, బలమగు పిడికిలితో జలంధరుని వక్షస్థలముపై కొట్టెను (32). అపుడు వారిద్దరు మహాబలులు చేతులతో పిడికిళ్లతో మోకాళ్లతో మల్లయుద్ధమును చేసిరి. ఆ శబ్దముతో భూమి ప్రతిధ్వనించెను (33). ఓ మహర్షీ! విష్ణువు చిరకాలము ఆ రాక్షసునితో యుద్ధమును చేసి ఆశ్చర్యమును పొందినవాడై మనస్సులో క్లేశమును, అలసటను పొందెను (34). మాయను ఎరింగిన వారిలో శ్రేష్ఠుడు, మాయకు అధీశ్వరుడు అగు విష్ణు భగవానుడు అపుడు ప్రసన్నుడై, ఆ రాక్షసరాజును ఉద్దేశించి మేఘగంభీరమగు స్వరముతో నిట్లనెను (35).

విష్ణురువాచ ।

భో భోదైత్యవర శ్రేష్ఠ ధన్యస్త్వం రణదుర్మదః ।
మహాయుధవరైర్యత్త్వం న భీతో హి మహాప్రభుః ॥
ఏభిరేవాయుధైరుగ్రైర్దైత్యా హి బహవో హతాః ।
మహౌజా దుర్మదా వీరాశ్ఛిన్నదేహా మృతిం గతాః ॥
యుద్ధేన తే మహాదైత్య ప్రసన్నోఽస్మి మహాన్ భవాన్ ।
న దృష్టస్త్వత్సమో వీరస్త్రైలోక్యే సచరాచరే ॥
వరం వరయ దైత్యేంద్ర ప్రీతోఽస్మి తవ విక్రమాత్ ।
అదేయమపి తే దద్మి యత్తే మనసి వర్తతే ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓయీ! రాక్షసశ్రేష్ఠా! యుద్ధములో సహింప శక్యము గాని పరాక్రమము గల నీవు ధన్యుడవు. ఏలయన, మహాప్రభుడవగు నీవు గొప్ప ఆయుధములకైననూ భయపడుట లేదు (36). క్రూరములగు ఇవే ఆయుధములను ప్రయోగించగా గొప్ప బలము, తేజస్సు గల వీరులైన రాక్షసులు చాలామంది తెగిన దేహములు గలవారై మృతిని చెందిరి (37). ఓ గొప్ప రాక్షసుడా! నీ యుద్ధముచే నేను ప్రసన్నుడనైతిని. నీవు మహాత్ముడవు. స్థావర జంగమాత్మక మగు ముల్లోకములలో నీతో సమమగు వీరుడు కానరాడు (38). ఓ రాక్షసరాజా! వరమును కోరుకొనుము. నీ విక్రమమునకు నేను సంతసించితిని. నీకు ఈయరాని వరమునైననూ ఇచ్చెదను. నీ మనసులోని మాటను బయటపెట్టుము (39).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య విష్ణోర్మాయావినో హరేః ।
ప్రత్యువాచ మహాబుద్ధిర్దైత్యరాజో జలంధరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మాయను వశము చేసుకొన్నవాడు, పాపములను పోగొట్టువాడు అగు ఆ విష్ణువు యొక్కక ఈ మాటను విని మహాబుద్ధిశాలి, రాక్షసుడునగు జలంధరుడు ఇట్లు బదులిడెను (40).

జలంధర ఉవాచ ।

యది భావుక తుష్టోఽ సి వరమేతం దదస్వ మే ।
మద్భగిన్యా మయా సార్ధం మద్గేహే సగణో వస ॥

జలంధరుడిట్లనెను -

బావా! నీవు సంతుష్టుడవైనచో, నాకీ వరమునిమ్ము. నీవు నీ గణములతో, మరియు మా చెల్లెలితో గూడి నా ఇంటిలో నివసించుము (41).

సనత్కుమార ఉవాచ ।

తదాకర్ణ్య వచస్తస్య మహాదైత్యస్య ఖిన్నధీః ।
తథాస్త్వితి చ దేవేశో జగాద భగవాన్ హరిః ॥
ఉవాస స తతో విష్ణుస్సర్వదేవగణైస్సహ ।
జలంధరం నామ పురమాగత్య రమయా సహ ॥
అథో జలంధరో దైత్యస్స్వ భగిన్యా చ విష్ణునా ।
ఉవాస స్వాలయం ప్రాప్తో హర్షాకులితమానసః ॥
జలంధరోఽథ దేవానా మధికారేషు దానవాన్ ।
స్థాపయిత్వా సహర్షస్సన్ పునరాగాన్మహీతలమ్ ॥
దేవ గంధర్వసిద్ధేషు యత్ కించిద్రత్న సంచితమ్ ।
తదాత్మ వశగం కృత్వాఽతిష్ఠ త్సాగరనందనః ॥
పాతాలభవనే దైత్యం నిశుంభం సుమహాబలమ్ ।
స్థాపయిత్వా స శేషాదీనానయద్భూతలం బలీ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ మహారాక్షసుని ఈ మాటను విని దేవదేవుడు, పాపహారియగు విష్ణుభగవానుడు ఖేదముతో నిండిన మనస్సు గలవాడై 'అటులనే యగుగాక!' అని పలికెను (42). తరువాత విష్ణువు దేవగణములందరితో, మరియు లక్ష్మీదేవితో గూడి జలంధరమను నగరమునకు వచ్చి నివసించెను (43). అపుడు ఆ జలంధరాసురుడు తన సోదరియగు లక్ష్మితో మరియు విష్ణువుతో గూడి తన ఇంటికి చేరి ఆనందముతో నిండిన మనస్సు గలవాడై నివసించెను (44). అపుడు జలంధరుడు దేవతల అధికారపదవులలో రాక్షసులను నియమించి ఆనందముతో భూమండలమునకు మరలి వచ్చెను (45). సముద్రతనయుడగు జలంధరుడు దేవగంధర్వ సిద్ధుల వద్ద గల శ్రేష్ఠవస్తువుల నన్నిటినీ స్వాధీనమొనర్చు కొనెను (46). బలవంతుడగు జలంధరుడు పాతాళభవనమునందు మిక్కిలి బలశాలియగు నిశుంభుని స్థాపించి, శేషుడు మొదలగు వారిని భూమండలమునకు తీసుకువచ్చెను (47).

దేవగంధర్వ సిద్ధౌఘాన్ సర్పరాక్షసమానుషాన్ ।

స్వపురే నాగరాన్ కృత్వా శశాస భువనత్రయమ్ ॥

ఏవం జలంధరః కృత్వా దేవాన్ స్వవశవర్తినః ।

ధర్మేణ పాలయామాస ప్రజాః పుత్రానివౌరసాన్ ॥

న కశ్చిద్వ్యా ధితో నైవ దుఃఖితో న కృశస్తథా ।

న దీనో దృశ్యతే తస్మిన్ ధర్మాద్రాజ్యం ప్రశాసతి ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే విష్ణు జలంధరయుద్ధ వర్ణనం నామ సప్తదశఽధ్యాయః ॥

ఆతడు దేవ గంధర్వ సిద్ధ సమూహములను, నాగరాక్షసమనుష్యులను తన నగరములో పౌరులుగా చేసుకొని ముల్లోకములను శాసించెను (48). జలంధరుడు ఈ తీరున దేవతలను తన వశము చేసుకొని, ప్రజలను స్వంత బిడ్డలను వలె రక్షించి, ధర్మబద్ధముగా రాజ్యము నేలెను (49). ఆతడు ధర్మముతో రాజ్యము నేలుచుండగా, రాజ్యములో వ్యాధిగ్రస్తులు గాని, దుఃఖితులు గాని, క్రుంగి కృశించినవారు గాని, దీనులు గాని ఒక్కడైననూ కానరాలేదు (50).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో విష్ణు జలంధర యుద్ధ వర్ణనమనే పదునేడవ అధ్యాయము ముగిసినది (17).

18- నారద జలంధర సంవాదము

సనత్కుమార ఉవాచ ।

ఏవం శాసతి ధర్మేణ మహీం తస్మిన్మహాసురే ।
బభూవుర్దుఃఖినో దేవా భ్రాతృభావాన్మునీశ్వర ॥
దుఃఖితాస్తే సురాస్సర్వే శివం శరణమాయయుః ।
మనసా శంకరం దేవదేవం సర్వప్రభుం ప్రభుమ్ ॥
తుష్టువుర్వాగ్భిరిష్టా భిర్భగవంతం మహేశ్వరమ్ ।
నివృత్తయే స్వదుఃఖస్య సర్వదం భక్తవత్సలమ్ ॥
ఆహూయ స మహాదేవో భక్తానాం సర్వకామదః ।
నారదం ప్రేరయామాస దేవకార్య చికీర్షయా ॥
అథ దేవమునిర్ జ్ఞానీ శంభుభక్త స్సతాం గతిః ।
శివాజ్ఞయా యయౌ దైత్యపురే దేవాన్ స నారదః ॥
వ్యాకులాస్తే సురాస్సర్వే వాసవాద్యా ద్రుతం మునిమ్ ।
ఆగచ్ఛంతం సమాలోక్య సముత్తస్థుర్హి నారదమ్ ॥
దదుస్త ఆసనం నత్వా మునయే ప్రీతిపూర్వకమ్ ।
నారదాయ సురాశ్శక్రముఖ ఉత్కంఠితాననాః ॥
సుఖాసీనం మునివరమాసనే సుప్రణమ్య తమ్ ।
పునః ప్రోచుస్సురా దీనా వాసవాద్యా మునీశ్వరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ మహాసురుడు ఈ తీరున భూమిని ధర్మబద్ధముగా పాలించుచుండగా, జ్ఞాతులగుటచే దేవతలు దుఃఖితులైరి (1). దుఃఖితులై యున్న ఆ దేవతలందరు మంగళకరుడు, దేవదేవుడు, సర్వసమర్థుడు అగు శివ ప్రభుని మనస్సులో శరణు పొందిరి (2). భక్తప్రియుడు, సర్వమునిచ్చు వాడునగు మహేశ్వరభగవానుని వారు తమ దుఃఖములు తొలగుట కొరకై అభీష్టములగు వచనములతో స్తుతించిరి (3). భక్తుల కోర్కెలనన్నిటినీ ఈడేర్చు ఈ మహాదేవుడు దేవకార్యమును చేయగోరి నారదుని పిలిపించి ప్రేరేపించెను (4). అపుడు దేవర్షి, జ్ఞాని, శివభక్తుడు, సత్పురుషులకు శరణ్యుడు అగు ఆ నారదుడు శివుని ఆజ్ఞచే జలంధరుని నగరములో నున్న దేవతల వద్దకు వెళ్లెను (5). దుఃఖితులై యున్న ఆ ఇంద్రాది దేవతలందరు నారదముని వచ్చుచుండుటను గాంచి వెంటనే లేచి నిలబడిరి (6). ఆదుర్దా ముఖమునందు వ్యక్తమగు చుండగా ఇంద్రాది దేవతలు నారదమహర్షికి ప్రీతిపూర్వకముగా నమస్కరించి ఆసనమునిచ్చిరి (7). దీనులగు ఇంద్రాది దేవతలు ఆసనమునందు ఉపవిష్టుడైన ఆ నారదమహర్షికి మరల నమస్కరించి ఇట్లు పలికిరి (8).

దేవా ఊచుః ।

భో భో మునివర శ్రేష్ఠ దుఃఖం శృణు కృపాకర ।
శ్రుత్వా తన్నాశయ క్షిప్రం ప్రభుస్త్వం శంకరప్రియః ॥
జలంధరేన దైత్యేన సురా విద్రావితా భృశమ్ ।
స్వస్థానా ధ్ధర్వ ఖావాచ్చ దుఃఖితా వయమాకులాః ॥
స్వస్థానా దుష్ణరశ్మిశ్చ చంద్రోనిస్సారితస్తథా ।
వహ్నిశ్చ ధర్మరాజశ్చ లోకపాలాస్తథేతరే ॥
సుబలిష్ఠేన వై తేన సర్వే దేవాః ప్రపీడితాః ।
దుఃఖం ప్రాప్తా వయం చాతి శరణం త్వాం సమాగతాః ॥
సంగ్రామే స హృషీకేశం స్వవశం కృతనాన్ బలీ ।
జలంధరో మహాదైత్య స్సర్వామర విమర్ధకః ॥
తస్య వశ్యో వరాధీనోఽ వాత్సీ త్తత్సదనే హరిః ।
సలక్ష్మ్యా సహితో విష్ణుర్యో న స్సర్వార్థ సాధకః ॥
జలంధర వినాశాయ యత్నం కురు మహామతే ।
త్వం నో దైవవశాత్ప్రాప్తస్సదా సర్వార్థ సాధకః ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ మహర్షీ! దయానిధీ! మా కష్టమును గురించి వినుము. విని వెంటనే దానిని దూరము చేయుము. నీవు సమర్థుడవు. శంకరునకు ప్రియమైన వాడవు. (9). జలంధరాసురుడు దేవతలను తమ తమ స్థానములనుండి, మరియు అధికారములనుండి పూర్ణముగా వెళ్లగొట్టినాడు. మేము మిక్కిలి ఆదుర్దాను, దుఃఖమును పొంది యున్నాము (10). సూర్యుడు, చంద్రుడు, అగ్ని, యమధర్మరాజు, మరియు ఇతరలోక పాలకులు తమ స్థానములనుండి త్రోసివేయబడినారు (11). మహా బలశాలియగు ఆతడు దేవతలనందరినీ పీడించుచున్నాడు. మేము మహాదుఃఖమును పొంది యున్నాము. నిన్ను శరణు జొచ్చుచున్నాము (12). బలశాలి, దేవతలనందరినీ పీచమడంచిన మహా రాక్షసుడు అగు జలంధరుడు యుద్ధములో హృషీకేశుని తన వశము గావించుకొనినాడు (13). మనకు కార్యముల నన్నిటినీ సాధించిపెట్టిన విష్ణువు తాను ఇచ్చిన వరమునకు అధీనుడై ఆతనికి వశుడై లక్ష్మీదేవితో గూడి ఆతని ఇంటిలో నివసింప జొచ్చెను (14). ఓ మహాప్రాజ్ఞా! జలంధరుని వినాశము కొరకు ప్రయత్నమును చేయుము. నీవు మాకు దైవానుగ్రహముచే దొరికితివి. నీవు సర్వదా దేవకార్యములనన్నింటినీ చక్క బెట్టితివి (15).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషా మమరాణాం స నారదః ।
ఆశ్వాస్య ముని శార్దూలస్తానువాచ కృపాకరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ దేవతల ఈ మాటను విని దయానిధియగు ఆ నారదమహర్షి వారిని ఓదార్చి ఇట్లు పలికెను (16).

నారద ఉవాచ ।

జానేఽహం వై సురా యూయం దైత్యరాజ పరాజితాః ।
దుఃఖం ప్రాప్తాః పీడితాశ్చ స్థానాన్నిస్సారితాః ఖలు ॥
స్వశక్త్యా భవతాం స్వార్థం కరిష్యే నాత్ర సంశయః ।
అనుకూలోఽహమివ వో దుఃఖం ప్రాప్తా యతోఽమరాః ॥

నారదుడిట్లు పలికెను -

ఓ దేవతలారా! రాక్షసరాజు చేతిలో ఓడి ఆతనిచే మీ స్థానములనుండి వెళ్లగొట్టబడి మీరు ఆతనిచే పీడింపబడి దుఃఖమును పొంది యున్నారను విషయమును నేను ఎరుంగుదును (17). నేను నా శక్తికి తగినట్లు మీ కార్యమును చక్కబెట్టెదను. సందేహము వలదు. ఓ దేవతలారా! మీరు దుఃఖమును పొంది యున్నారు గనుక, నేను మీకు అనుకూలుడనే (18).

సనత్కుమార ఉవాచ ।

ఏవముక్త్వా మునిశ్రేష్ఠో ద్రష్టుం దానవవల్లభమ్ ।
ఆశ్వాస్య సకలాన్ దేవాన్ జలంధరసభాం యయౌ ॥
అథాగతం మునిశ్రేష్ఠం దృష్ట్వా దేవో జలంధరః ।
ఉత్థాయ పరయా భక్త్యా దదౌ శ్రేష్ఠాసనం వరమ్ ॥
స తం సంపూజ్య విధివద్దానవేంద్రోఽతి విస్మితః ।
సుప్రహస్య తదా వాక్యం జగాద మునిసత్తమమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ మహర్షి ఇట్లు పలికి దేవతలనందరినీ ఓదార్చి రాక్షసరాజగు జలంధరుని చూచుటకై అతని సభకు వెళ్ళెను (19). అపుడు జలంధర మహారాజు అచటకు విచ్చేసిన మహర్షిని గాంచి పరమభక్తితో లేచి నిలబడి శ్రేష్ఠమగు ఆసనమును ఇచ్చెను (20). ఆ రాక్షసరాజు మిక్కిలి ఆశ్చర్యమును పొంది, ఆ మహర్షిని యథావిధిగా పూజించి చిరునవ్వుతో నిట్లనెను (21).

జలంధర ఉవాచ ।

కుత ఆగమ్యతే బ్రహ్మన్ కిం చ దృష్టం త్వయా క్వచిత్ ।
యదర్థమిహ ఆయాత స్తదాజ్ఞాపయ మాం మునే ॥

జలంధరుడిట్లనెను -

ఓ మహర్షీ! ఎచటనుండి వచ్చుచున్నారు? మీరు ఎచట ఏమి చూసినారు?? ఇచటకు వచ్చిన పని యేమి? ఓ మునీ! ఆ పనిని నాకు ఆజ్ఞాపించుడు (22).

సనత్కుమార ఉవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య దైత్యేంద్రస్య మహామునిః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా నారదో హి జలంధరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

రాక్షసరాజగు జలంధరుని ఈ మాటను విని నారదమహర్షి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆతనికిట్లు బదులు చెప్పెను (23).

నారద ఉవాచ ।

సర్వదానవ దైత్యేంద్ర జలంధర మహామతే ।
ధన్యస్త్వం సర్వలోకేశ రత్న భోక్తా త్వమేవ హి ॥
మదాగమన హేతుం వై శృణు దైత్యేంద్రసత్తమ ।
యదర్థమిహ చాయాతస్త్వహం వక్ష్యేఽ ఖిలం హి తత్ ॥
గతః కైలాసశిఖరం దైత్యేంద్రాహం యదృచ్ఛయా ।
యోజనాయుత విస్తీర్ణం కల్పద్రుమ మహావనమ్ ॥
కామధేను శతాకీర్ణం చింతామణి సుదీపితమ్ ।
సర్వరుక్మమయం దివ్యం సర్వత్రాద్భుత శోభితమ్ ॥
తత్రోమయా సహాసీనం దృష్టవానస్మి శంకరమ్ ।
సర్వాంగ సుందరం గౌరం త్రినేత్రం చంద్రశేఖరమ్ ॥
తం దృష్ట్వా మహదాశ్చర్యం వితర్కో మేఽభవత్తదా ।
క్వాపీ దృశీ భవేదృద్ధి స్త్రైలోక్యే వా న వేతి చ ॥
తావత్త వాపి దైత్యేంద్ర సమృద్ధి స్సంస్మృతా మయా ।
తద్విలో కనకామోఽహం త్వత్సాన్నిధ్య మిహాగతః ॥

నారదుడిట్లు పలికెను -

రాక్షసులందరికీ ప్రభువైన జలంధరా! నీవు గొప్ప బుద్ధిమంతుడవు. నీవు ధన్యుడవు. ఓ సర్వలోక ప్రభూ! శ్రేష్ఠవస్తువు (రత్నము) లను అనుభవించు వాడవు నీవే (24). ఓ రాక్షస శ్రేష్ఠ! నేను వచ్చిన కారణమును వివరముగా చెప్పెదను. వినుము (25). ఓ రాక్షసరాజా! నేను అనుకోకుండగా కైలాసమునకు వెళ్లితిని. ఆ కైలాసశిఖరము పదివేల యోజనముల విస్తీర్ణము గలది. అచట కల్పవృక్షములనేకము గలవు (26). చింతామణుల ప్రకాశముతో నలరారు కైలాసమునందు వందలాది కామధేనువులు గలవు. దివ్యమగు కైలాసశిఖరము పూర్తిగా స్వర్ణమయము. అచట అంతటా అద్భుతములు శోభను గూర్చును (27). అచట సర్వావయవ సుందరుడు, పచ్చనివాడు, ముక్కంటి, చంద్రుని శిరముపై దాల్చినవాడు అగు శంకరుడు పార్వతితో గూడి ఉపవిష్టుడై యుండగా చూచితిని (28). ఆ గొప్ప అద్భుత దృశ్యమును చూచిన నాకు అపుడు మనస్సులో ఒక సందేహము కలిగెను. ఇట్టి సంపద ముల్లోకములలో ఎక్కడనైననూ ఉన్నదా? లేదా? (29) ఓరాక్షసరాజా! అంతలో నాకు నీ సంపద గుర్తుకు వచ్చినది. అందువలనే, నీ సంపదను చూచుటకై ఇచటకు నీ సన్నిధికి వచ్చి యుంటిని (30).

సనత్కుమార ఉవాచ ।

ఇతి నారదత శ్శ్రుత్వా స దైత్యేంద్రో జలంధరః ।
స్వసమృద్ధిం సమగ్రాం వై దర్శయామాస సాదరమ్ ॥
దృష్ట్వా స నారదో జ్ఞానీ దేవకార్య సుసాధకః ।
ప్రభు ప్రేరణయా ప్రాహ దైత్యేంద్రం తం జలంధరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

నారదుని ఈ మాటను విని రాక్షసరాజగు ఆ జలంధరుడు ఆదరముతో తన పూర్ణసంపదను చూపించెను (31). జ్ఞాని, దేవతల కార్యమును చక్కబెట్టువాడు అగు ఆ నారదుడు ఆ సంపదను చూచి శంకరుని ప్రేరణను పొంది, రాక్షసరాజగు ఆ జలంధరునితో నిట్లనెను (32).

నారద ఉవాచ ।

తవాస్తి సుసమృద్ధిర్హి వరవీర కిలాధునా ।
త్రైలోక్యస్య పతిస్త్వం హి చిత్రం కిం చాత్ర సంభవమ్ ॥
మణయో రత్నపుంజాశ్చ గజాద్యాశ్చ సమృద్ధయః ।
తే గృహేఽద్య విభాంతీహ యాని రత్నాని తాన్యపి ॥
గజరత్నం త్వయానీతం శక్రస్యైరావత స్తథా ।
అశ్వరత్నం మహావీర సూర్యస్యోచ్చైశ్శ్రవా హయః ॥
కల్పవృక్షస్త్వయానీతో నిధయో ధనదస్య చ ।
హంసయుక్త విమానం చ త్వయానీతం హి వేధసః ॥
ఇత్యేవం వరరత్నాని దివి పృథ్వ్యాం రసాతలే ।
యాని దైత్యేంద్ర తే భాంతి గృహే తాని సమస్త తః ॥
త్వత్సమృద్ధిమిమాం పశ్యన్ సంపూర్ణాం వివిధామహమ్ ।
ప్రసన్నోఽస్మి మహావీర గజాశ్వాది సుశోభితామ్ ॥
జాయారత్నం మహాశ్రేష్ఠం జలంధర న తే గృహే ।
తదానేతుం విశేషేణ స్త్రీ రత్నం వై త్వమర్హసి ॥
యస్య గేహే సురత్నాని సర్వాణి హి జలంధర ।
జాయారత్నం న చేత్తాని న శోభన్తే వృథా ధ్రువమ్ ॥

నారదుడిట్లు పలికెను -

ఓ గొప్ప వీరుడా! నీకు గొప్ప సంపద గలదు. నీవు ముల్లోకములకు ప్రభుడవు. దీనిలో ఆశ్చర్యమేమున్నది? (33) మణులు, రత్నములు నీవద్ద గుట్టలుగా గలవు. గజాది సమృద్ధులు కూడ నీకు గలవు. మరియు శ్రేష్ఠవస్తువులన్నియు ఈనాడు నీ ఇంటిలో విరాజిల్లుచున్నవి (34). గజ శ్రేష్ఠమగు ఐరావతమును నీవు ఇంద్రునివద్దనుండి తెచ్చుకొంటివి. ఓ మహావీరా! అశ్వశ్రేష్ఠమగు ఉచ్చైశ్శ్రవమును అశ్వమును సూర్యుని వద్దనుండి లాగు కొంటివి (35). నీవు కల్పవృక్షమును, కుబేరుని నిధులను, మరియు బ్రహ్మగారి హంసలను పూన్చిన విమానమును తెచ్చుకొంటివి (36). ఓ రాక్షసరాజా! ఈ విధముగా, స్వర్గము నందు భూమియందు పాతాళమునందు ఏయే శ్రేష్ఠవస్తువులు గలవో, అవి అన్నియూ నీ ఇంటిలో ప్రకాశించుచున్నవి (37). ఓ మహావీరా ! గజములు, అశ్వములు మొదలగు వాటితో మిక్కిలి ప్రకాశించునది, వివిధమైనది, సంపూర్ణమైనది అగు నీ ఈ సమృద్ధిని గాంచి నేను ప్రసన్నుడనైతిని (38). ఓ జలంధరా! నీ గృహములో శ్రేష్ఠమగు భార్యారత్నము లేకున్నది. కావున నీవు విశేషించి స్త్రీ రత్నమును దోడ్కొని రావలెను (39). ఓ జలంధరా! గృహములో శ్రేష్ఠవస్తువులు అన్నీ ఉన్ననూ, భార్యారత్నము లేనిచో, అవి శోభిల్లవు. అవి వ్యర్థమగును. ఇది నిశ్చయము (40).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా నారదస్య మహాత్మనః ।

ఉవాచ దైత్యరాజో హి మదనాకులమానసః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహాత్ముడగు నారదుని ఈ మాటలను విని ఆ రాక్షసరాజు మన్మథునిచే కల్లోల పరచబడిన మనస్సు గలవాడై ఇట్లు పలికెను (41).

జలంధర ఉవాచ।

భోభో నారద దేవర్షే నమస్తేఽస్తు మహా ప్రభో ।

జాయారత్న వరం కుత్ర వర్తతే తద్వదాధునా ॥

బ్రహ్మాండే యత్ర కుత్రాపి తద్రత్నం యది వర్తతే ।

తదానేష్యే తతో బ్రహ్మన్ సత్యం సత్యం న సంశయః ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓయీ నారదా! దేవర్షి! మహాప్రభూ! నీకు నమస్కారము అగు గాక! అట్టి భార్యారత్నము ఎచ్చట గలదో ఇప్పుడు నాకు చెప్పుము (42). ఓ బ్రాహ్మణా! అట్టి స్త్రీ రత్నము బ్రహ్మాండములో ఎచ్చట నున్ననూ నేను దోడ్కొని రాగలను. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (43).

నారద ఉవాచ ।

కైలాసే హ్యతిరమ్యే చ వర్యర్ధి సుసమాకులే ।
యోగిరూపధరశ్శంభురస్తి తత్ర దిగంబరః ॥
తస్య భార్యా సురమ్యా హి సర్వలక్షణలక్షితా ।
సర్వాంగసుందరీ నామ్నా పార్వతీతి మనోహరా ॥
తదీదృశం రూపమనన్య సంగతం దృష్టం న కుత్రాపి కుతూహలాఢ్యమ్ ।
అత్యద్భుతం మోహనకృత్సు యోగినాం సుదర్శనీయం పరమర్ధి కారి ॥
స్వచిత్తే కల్పయామ్యద్య శివాదన్యస్సమృద్ధిమాన్ ।
జాయారత్నా న్వితా ద్వీర త్రిలోక్యా న జలంధర ॥
యస్యా లావణ్య జలధౌ నిమగ్నశ్చతురాననః ।
స్వధైర్యం ముముచే పూర్వం తయా కాన్యోప మీయతే ॥
గతరా గోఽపి హి యయా మదనారిస్స్వ లీలయా ।
నిజతంత్రోఽపి యతస్స స్వాత్మ వశగః కృతః ॥
యథాస్త్రీ రత్న సంభోక్తు స్సమృద్ధి స్తస్య సాభవత్ ।
తథా న తవ దైత్యేంద్ర సర్వరత్నాధిపస్య చ ॥

నారదుడిట్లు పలికెను -

మిక్కిలి సుందరమైనది, శ్రేష్ఠ సంపదలతో నిండియున్నది అగు కైలాసములో దిగంబరుడగు శంభుడు యోగిరూపమును ధరించి యున్నాడు (44). ఆతని భార్య పేరు పార్వతి. ఆమె సర్వావయవ సుందరి; మిక్కిలి రమ్యమైనది; మంచి లక్షణములన్నింటితో గూడి మనస్సునకు ఆహ్లాదమును కలిగించునది (45). మిక్కిలి కుతూహలమును రేకెత్తించే ఆమె రూపము వంటి రూపము మరెక్కడనూ కానరాదు. అత్యద్భుతమగు ఆమె రూపము గొప్ప యోగులకైననూ మోహమును కలిగించును. గొప్ప సంపదలనిచ్చే ఆమె రూపము చూడ ముచ్చటను గొల్పును (46). ఓ వీరా! జలంధరా! గొప్ప భార్యతో గూడియున్న శివునికంటె గొప్ప సమృద్ధి గలవాడు ముల్లోకములలో మరియొకడు లేడని ఇప్పుడు నా మనస్సులో తోచుచున్నది (47). ఏ యువతి యొక్క సౌందర్య సముద్రములో మునిగిన బ్రహ్మగారు పూర్వము తన ధైర్యమును గోల్పోయి నాడో, అట్టి ఆమెతో ఇంకొకరిని పోల్చుట ఎట్లు సంభవము? (48). రాగద్వేషములకు అతీతుడు, మన్మథ శత్రువు, స్వతంత్రుడు అగు శివుని కూడ ఆమె తన లీలచే తన వశము చేసుకొనెను (49). అట్టి స్త్రీ రత్నమును వివాహమాడిన వానికి ఏ సమృద్ధి గలదో, అట్టి సమృద్ధి, ఓ రాక్షసరాజా! సర్వశ్రేష్ఠ వస్తువులకు నీవు ప్రభువే అయిననూ, నీ వద్ద లేదు (50).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా స తు దేవర్షిర్నారదో లోక విశ్రుతః ।

యయౌ విహాయసా దేవోపకార కరణోద్యతః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే దేవర్షి జలంధర సంవాదో నామ అష్టాదశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దేవర్షి, లోకములో ప్రఖ్యాతిని గాంచిన వాడు, దేవతలకు ఉపకారమును చేయుటకై సర్వదా సంసిద్ధముగ నుండు వాడు అగు ఆ నారదుడు ఇట్లు పలికి ఆకాశమార్గమున నిర్గమించెను (51).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో నారద జలంధర సంవాదమనే పదునెనిమిదవ అధ్యాయము ముగిసినది (18).

19 - దూతసంవాదము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ నారదే హి గతే దివి ।
దైత్యరాట్ కిమకార్షీత్స తన్మే వద సువిస్తరాత్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. నారదుడు ఆకాశమార్గములో నిర్గమించిన పిదప, ఆ రాక్షసరాజు ఏమి చేసెను? వివరముగా చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

తమామంత్ర్య గతే దైత్యం నారదే దివి దైత్య రాట్ ।
తద్రూప శ్రవణాదాసీ దనంగ జ్వరపీడితః ॥
అథో జలంధరో దైత్యః కాలాధీనః ప్రనష్టధీః ।
దూత మాహ్వయయామాస సైంహికేయం విమోహితః ॥
ఆగతం తం సమాలోక్య కామాక్రాంత మనాస్స హి ।
సుసంబోధ్య సమాచష్ట సింధుపుత్రో జలంధరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

నారదుడు సెలవు తీసుకొని ఆకాశమార్గములో నిర్గమించిన పిదప ఆ రాక్షసు◌ుడు ఆమెయొక్క రూపమును గూర్చి వినియుండుట వలన మన్మథ జ్వరము యొక్క పీడకు గురి ఆయెను (2). బుద్ధి నశించి, మోహమునకు వశుడై మృత్యువునకు అధీనుడై జలంధరాసురుడు అపుడు రాహువును దూతగా పంపుటకై పిలిపించెను (3). సముద్ర తనయుడగు జలంధరుడు కామనచే ఆక్రమింపబడిన మనస్సు గలవాడై తన వద్దకు వచ్చిన రాహువును గాంచి చక్కగా సంబోధించి ఇట్లు వివరించెను (4).

జలంధర ఉవాచ ।

భో భో దూతవరశ్రేష్ఠ సర్వకార్య ప్రసాధక ।
సైంహికేయ మహాప్రాజ్ఞ కైలాసం గచ్ఛ పర్వతమ్ ॥
తత్రాస్తి యోగీ శంభ్వాఖ్యస్త పస్వీ చ జటాధరః ।
భస్మ భూషితసర్వాంగో విరక్తో విజితేంద్రియః ॥
తత్ర గత్వేతి వక్తవ్యం యోగినం దూత శంకరమ్ ।
జటాధరం విరక్తం తం నిర్భయేన హృదా త్వయా ॥
హే యోగింస్తే దయాసింధో జాయారత్నేన కిం భవేత్ ।
భూతప్రేత పిశాచాది సేవితేన వనౌకసా ॥
మన్నాథే భువనే యోగిన్నోచితా గతిరీదృశీ ।
జాయారత్న మతస్స్వం మే దేహి రత్న భుజే నిజమ్ ॥
యాని యాని సురత్నాని త్రైలోక్యే తాని సంతి మే ।
మదధీనం జగత్సర్వం విద్ధి త్వం సచరాచరమ్ ॥
ఇంద్రస్య గజరత్నం చోచ్చైశ్శ్రవో రత్న ముత్తమమ్ ।
బలాద్గృహీతం సహసా పారి జాతస్తరుస్తథా ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓయీ రాహూ! నీవు దూతలందరిలో శ్రేష్ఠుడవు. నీవు కార్యముల నన్నిటినీ చక్కబెట్టగలవు. ఓయీ మహాబుద్ధిశాలీ! కైలాస పర్వతమునకు వెళ్లుము (5). అచట తపశ్శాలి, జటలను ధరించువాడు, భస్మతో అలంకరింపబడిన సర్వావయవములు గలవాడు, విరాగి, ఇంద్రియములను జయించినవాడు అగు శంభుయోగి గలడు (6). ఓయీ దూతా! నీవు అచటకు వెళ్లి, జటాధారి, వైరాగ్యసంపన్నుడు అగు శంకరయోగితో నిర్భయమగు హృదయముతో నిట్లు చెప్పుము (7). ఓయీ యోగీ! దయానిధీ! భూత ప్రేతపిశాచాదులతో సేవింపబడే వనవాసివగు నీకు భార్యారత్నముతో పని యేమి? (8) ఓ యోగీ! నేను భువనమునకు ప్రభువునై యుండగా ఇట్టి పరిస్థితి ఉచితము కాదు. కావున నీవు శ్రేష్ఠవస్తువులకు భోక్తనగు నాకు నీ భార్యారత్నమునిమ్ము (9). ముల్లోకములలోని శ్రేష్ఠ సుందరవస్తువులన్నియు నా వద్ద గలవు. స్థావర జంగమాత్మకమగు ఈ జగత్తు అంతయు నా ఆధీనములో నున్నదని యెరుంగుము (10). ఏనుగులలో గొప్పది యగు ఇంద్రుని ఐరావతమును, ఉత్తమమగు ఉచ్చైశ్శ్రవసమనే గుర్రమును, మరియు పారిజాత వృక్షమును నేను శీఘ్రమే బలాత్కారముగా లాగుకొంటిని (11).

విమానం హంస సంయుక్త మంగణే మమ తిష్ఠతి ।
రత్నభూతం మహాదివ్యముత్తమం వేధసోఽద్భుతమ్ ॥
మహాపద్మాదికం దివ్యం నిధిరత్నం స్వదస్య చ ।
ఛత్రం మే వారుణం గేహే కాంచనస్రావి తిష్ఠతి ॥
కింజల్కినీ మహామాలా సర్వదామ్లాన పంకజా ।
మత్పితుస్సా మమైవాస్తి పాశశ్చ కపతేస్తథా ॥
మృత్యోరుత్క్రాంతిదా శక్తిర్మయా నీతా బలాద్వరా ।
దదౌ మహ్యం శుచిర్దివ్యే శుచిశౌచే చ వాసనీ ॥
ఏవం యోగీంద్ర రత్నాని సర్వాణి విలసంతి మే ।
అతస్త్వమపి మే దేహి స్వస్త్రీ రత్నం జటాధర ॥

హంసలు పూన్చినది, విమానములలో శ్రేష్ఠమైనది, మహాదివ్యమైనది, ఉత్తమమైనది, అద్భుతమైనది అగు బ్రహ్మగారి విమానము నా వాకిట నిలబడియున్నది (12). మహాపద్మము మొదలగు కుబేరుని గొప్ప నిధులన్నియు నా ఇంటిలో నున్నవి. వరుణుని ఛత్రము బంగరు కాంతులను వెదజల్లుతూ నా ఇంటియందు గలదు (13). ఎన్నటికీ వాడని పద్మముల కేసరములతో శోభిల్లు గొప్ప మాల నావద్ద గలదు. నా తండ్రి, జలాధిపతి యగు వరుణుని పాశము కూడ నా వద్ద గలదు (14). ప్రాణులకు మరణమునొసంగు గొప్ప శక్తిని నేను యముని వద్దనుండి బలాత్కారముగా లాగు కొంటిని. అగ్ని నాకు శుద్ధమైన రెండు దివ్యవస్త్రముల నిచ్చినాడు (15). ఓ యోగి శ్రేష్ఠ! ఈ తీరున శ్రేష్ఠవస్తువులన్ని యు నావద్ద విలసిల్లు చున్నవి. ఓ జటాధారీ! కావున నీవు కూడ స్త్రీ రత్నమగు నీ భార్యను నాకు ఇమ్ము (16).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య నందినా స ప్రవేశితః ।
జగామోగ్ర సభాం రాహు ర్విస్మయాద్భుతలోచనః ॥
తత్ర గత్వా శివం సాక్షాద్దేవదేవం మహా ప్రభుమ్ ।
స్వతేజో ధ్వస్త తమసం భస్మలేప విరాజితమ్ ॥
మహారాజోప చారేణ విలసంతం మహాద్భుతమ్ ।
సర్వాంగ సుందరం దివ్య భూషణైర్భూషితం హరమ్ ॥
ప్రణనామ చ తం గర్వాత్తత్తేజః క్రాంతవిగ్రహః ।
నికటం గతవాన్ శంభోః స్వ దూతో రాహుసంజ్ఞకః ॥
అథో తదగ్ర ఆసీనో వక్తుకామో హి సైంహికః ।
త్ర్యంబకం స తదా సంజ్ఞా ప్రేరితో వాక్య మబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

రాహువు ఈ జలంధరుని మాటలను విని అచటకు వెళ్లెను. నంది ఆయనను శివుని సభలో ప్రవేశపెట్టెను. ఆతడు ఆశ్చర్యముతో విప్పారిన నేత్రములతో ఆ అద్భుతమగు సభను గాంచెను (17). అచటకు వెళ్లి, దేవదేవుడు, మహాప్రభుడు, తన తేజస్సుచే చీకట్లను నశింపజేయు చున్నవాడు, విభూతి లేపనముచే ప్రకాశించువాడు (18), మహారాజునకు ఈయబడే పరిచర్యలతో మహాద్భుతముగా ప్రకాశించుచున్నవాడు, సర్వావయవములయందు సుందరుడు, దివ్యములగు భూషణములచే అలంకరింపబడినవాడు, పాపహారియగు శివుని ప్రత్యక్షముగా గాంచి (19), ఆయనకు నమస్కరించెను. ఆయన తేజస్సుచే వ్యాప్తమైన దేహము గలవాడు, రాహువు అను పేరు గలవాడు అగు ఆ దూత గర్వముతో శివుని సమీపమునకు వెళ్లెను (20). ఆయనతో మాటలాడగోరి సింహికాపుత్రుడగు రాహువు ఆయన ఎదుట గూర్చుండెను. అపుడాతడు సంజ్ఞచే ప్రేరితుడై ముక్కంటి దైవముతో నిట్లనెను (21).

రాహురువాచ ।

దైత్య పన్నగ సేవ్యస్య త్రైలోక్యాధిపతే స్సదా ।
దూతోఽహం ప్రేషితస్తేన త్వత్సకాశమిహాగతః ॥
జలంధరోఽబ్ధి తనయ స్సర్వదైత్య జనేశ్వరః ।
త్రైలోక్యస్యేశ్వరస్సోఽ థా భవత్సర్వాధినాయకః ॥
స దైత్యరాజో బలవాన్ దేవానామంతకోపమః ।
యోగినం త్వాం సముద్దిశ్య స యదాహ శృణుష్వ తత్ ॥
మహాదివ్య ప్రభావస్య తస్య దైత్యపతేః ప్రభోః ।
సర్వరత్నేశ్వరస్య త్వమజ్ఞాం శృణు వృషధ్వజ ॥
శ్మశాన వాసినో నిత్యమస్థి మాలాధరస్య చ ।
దిగంబరస్య తే భార్యా కథం హైమవతీ శుభా ॥
అహం రత్నాధి నాథోఽస్మి సా చ స్త్రీ రత్న సంజ్ఞితా ।
తస్మాన్మమైవ సా యోగ్యా నైవ భిక్షాశినస్తవ ॥
మమ వశ్యాస్త్రయో లోకా భుంజేఽహం మఖభాగకాన్ ।
యాని సంతి త్రిలోకేఽస్మిన్ రత్నాని మమ సద్మని ॥
వయం రత్నభుజస్త్వం తు యోగీ ఖలు దిగంబరః ।
స్వస్త్రీ రత్నం దేహి మహ్యం రాజ్ఞ స్సుఖకరాః ప్రజాః ॥

రాహువు ఇట్లు పలికెను -

దైత్యులచే నాగులచే సేవింపబడు వాడు, సర్వదా ముల్లోకములకు అధిపతి యగు ఆ జలంధరునిచే పంపబడినవాడనై దూతనగు నేను నీ వద్దకు వచ్చి యుంటిని (22). సముద్రుని కుమారుడు, దితిపుత్రులందరికీ ప్రభువు అగు జలంధరుడు తరువాతి కాలములో సర్వులకు అధినాయకుడై ముల్లోకములకు ప్రభువైనాడు (23). బలవంతుడు, దేవతలకు మృత్యువుతో సమమైనవాడు అగు ఆ రాక్షసరాజు యోగివి అగు నిన్ను ఉద్దేశించి పలికిన పలుకులను వినుము (24). ఓ వృషభధ్వజా! గొప్ప దివ్యమైన ప్రభావము గలవాడు, రాక్షసాధిపతి, సర్వశ్రేష్ఠవస్తువులకు యజమాని అగు ఆ రాక్షసప్రభుని ఆజ్ఞను నీవు వినుము (25). శ్మశానమునందు నివసించువాడవు, నిత్యము ఎముకల మాలను ధరించు వాడవు, మరియు దిగంబరుడవు అగు నీకు శుభకరురాలు అగు హిమవత్పుత్రి భార్య ఎట్లు అయినది ? (26) నేను రత్నములకు అధీశ్వరుడను. ఆమె స్త్రీలలో శ్రేష్ఠురాలు. కావున ఆమె నాకు మాత్రమే యోగ్యురాలగును. భిక్షుకుడవగు నీకు ఆమె తగదు (27). నాకు ముల్లోకములు వశములో నున్నవి. నేను యజ్ఞభాగములను భుజించు చున్నాను. ఈ ముల్లోకములలోని శ్రేష్ఠవస్తువు లన్నియు. నా ఇంటిలో నున్నవి (28). మేము శ్రేష్ఠవస్తువులను అనుభవించే రారాజులము. నీ వైతే యోగివి, దిగంబరుడవు. నీవద్దనున్న స్త్రీరత్నమును నాకు సమర్పించుము. ప్రజలు రాజునకు సుఖమును కలిగించ వలెను గదా! (29)

సనత్కుమార ఉవాచ ।

వదత్యేవం తథా రాహౌ భ్రూమధ్యాచ్ఛూల పాణినః ।
అభవత్పురుషో రౌద్ర స్తీవ్రాశని సమస్వనః ॥
సింహాస్య ప్రచల జిహ్వస్స జ్వాల నయనో మహాన్ ।
ఊర్ధ్వకేశ శ్శుష్కతనుర్నృసింహ ఇవ చాపరః ॥
మహాతనుర్మహా బాహు స్తాల జంఘో భయంకరః ।
అభిదుద్రావ వేగేన రాహుం స పురుషో ద్రుతమ్ ॥
సతం ఖాదితు మాయాంతం దృష్ట్వా రాహుర్భయాతురః ।
అథావదాత వేగేన బహిస్స చ దధార తమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

రాహువు ఇట్లు పలుకు చుండగా, శూలపాణియగు శివుని కనుబొమల మధ్యనుండి భయంకరుడు, తీవ్రమగు పిడుగుతో సమమగు ధ్వని గలవాడు అగు పురుషుడు ఉదయించెను (30). సింహపు నోటిలో వలె కదలాడు చున్న నాలుక గలవాడు, నిప్పులు గ్రక్కు కన్నులవాడు, పెద్ద శరీరము గలవాడు, పైకి లేచి నిలబడిన శిరోజములు గలవాడు, శుష్కించిన దేహము గలవాడు అగు ఆ పురుషుడు అపరనృసింహుని వలె నుండెను (31). పెద్ద దేహము, పొడుగాటి

బాహువులు, తాటి చెట్ల వంటి పిక్కలు కలిగి భయమును గొల్పుచున్న ఆ పురుషుడు వెంటనే వేగముగా రాహువుపైకి పరుగెత్తెను (32). తనను తినివేయుటకు వచ్చుచున్న ఆ . పురుషుని గాంచి రాహువు భయపీడితుడై వేగముగా పారిపోవుచుండగా ఆ పురుషుడు ఆతనిని బయట పట్టుకొనెను (33).

రాహురువాచ ।

దేవదేవ మహేశాన పాహి మాం శరణాగతమ్ ।

సురాసురైస్సదా వంద్యః పరమైశ్వర్యవాన్ ప్రభుః ॥

బ్రాహ్మణం మాం మహాదేవ ఖాదితుం సముపాగతః ।

పురుషోఽయం తవేశాన సేవకోఽతి భయంకరః ॥

ఏతస్మాద్రక్ష దేవేశ శరణాగతవత్సలః ।

న ఖాదేత యథాయం మాం నమస్తేఽస్తు ముహుర్ముహుః ॥

రాహువు ఇట్లు పలికెను –

ఓ దేవ దేవా! శరణు జొచ్చిన నన్ను రక్షించుము. నీవు దేవతలచే, రాక్షసులచే సర్వదా నమస్కరింపబడు ప్రభుడవు. నీ ఐశ్వర్యము పరమోత్కృష్టమైనది (34). ఓ మహాదేవా! ఈశానా! నీ సేవకుడు, అతి భయంకరుడు నగు ఈ పురుషుడు బ్రాహ్మణుడనగు నన్ను భక్షించుటకై మీదకు వచ్చుచున్నాడు (35). ఓ దేవదేవా! శరణాగత రక్షకుడవగు నీవు ఈతడు నన్ను తినివేయకముందే వీని నుండి నన్ను రక్షింపుము. నీకు అనేక పర్యాయములు ప్రణమిల్లు చున్నాను (36).

సనత్కుమార ఉవాచ ।

మహాదేవో వచశ్శ్రుత్వా బ్రాహ్మణస్య తదా మునే ।

అబ్రవీత్స్వగణం తం వై దీనానాథప్రియః ప్రభుః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ మునీ! దీనులను అనాథులను ప్రేమించు మహాదేవప్రభుడు అపుడా బ్రాహ్మణుని మాటను విని తన కింకరుడగు ఆ పురుషునితో నిట్లనెను (37).

మహాదేవ ఉవాచ ।

ప్రభుం చ బ్రాహ్మణం దూతం రాహ్వాఖ్యం శరణాగతమ్ ।

శరణ్యా రక్షణీయా హి న దండ్యా గణసత్తమ ॥

మహాదేవుడిట్లు పలికెను –

ఓ గణశ్రేష్ఠా! బ్రాహ్మణుడు, దూత, శరణు జొచ్చినవాడు అగు ఈ రాహువును శిక్షించవలదు. శరణుజొచ్చిన వారిని రక్షించవలెను సుమా ! (38)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తో గిరిజేశేన స గణః కరుణాత్మనా ।
రాహుం తత్యాజ సహసా బ్రాహ్మణేతి శ్రుతాక్షరః ॥
రాహుం త్యక్త్వాఽఽఽబరే సోఽథ పురుషో దీనయా గిరా ।
శివోపకంఠ మాగత్య మహాదేవం వ్యజిజ్ఞపత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

కరుణాంతరంగుడగు పార్వతీపతి ఇట్లు పలుకగా ఆ కింకరుడు బ్రాహ్మణుడను మాటను విన్న వెంటనే రాహువును విడిచిపెట్టెను (39). అపుడా పురుషుడు రాహువును ఆకాశములో విడిచి పెట్టి శివుని సమీపమునకు వచ్చి ఆ మహాదేవునితో దీనమగు వచనములతో నిట్లనెను (40).

పురుష ఉవాచ ।

దేవదేవ మహాదేవ కరుణాకర శంకర ।
త్యాజితం మమ భక్ష్యం తే శరణాగతవత్సలః ॥
క్షుధా మాం బాధతే స్వామిన్ క్షుత్ క్షామశ్చాస్మి సర్వథా ।
కిం భక్ష్యం మమ దేవేశ తదాజ్ఞాపయ మాం ప్రభో ॥

పురుషుడిట్లు పలికెను –

ఓ దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! శంకరా! శరణాగతవత్సలుడవగు నీవు దొరికిన ఆహారమును నేను విడిచిపెట్టునట్లు చేసితివి (41). ఓ స్వామీ ! ఆకలి నన్ను బాధించుచున్నది. నేను మలమల మాడి పోవుచున్నాను. ఓ దేవదేవా! నేను ఏమి తినవలెను? ఓ ప్రభూ! నన్ను ఆజ్ఞాపించుము (42).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య పురుషస్య మహాప్రభుః ।
ప్రత్యువాచాద్భుతోతిస్స కౌతుకీ స్వహితం కరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

గొప్ప లీలలను ప్రకటించు వాడు, తన భక్తులకు హితము చేయు ఉత్కంఠ గలవా◌ాడు నగు ఆ మహాప్రభుడు ఆ పురుషుని ఈ మాటలను విని ఇట్లు బదులిడెను (43).

మహేశ్వర ఉవాచ ।

బుభుక్షా యది తేఽతీవ క్షుధా త్వాం బాధతే యది ।
సంభక్షయాత్మన శ్శీఘ్రం మాంసం త్వం హస్తపాదయోః ॥

మహేశ్వరుడిట్లు పలికెను –

నీవు మిక్కిలి ఆకలి గొని యున్నచో, ఆకలి నిన్ను బాధించుచున్నచో, నీవు నీ కాళ్ల చేతుల మాంసమును వెంటనే చక్కగా భక్షించుము (44).

సనత్కుమార ఉవాచ ।

శివేనైవ మాజ్ఞప్త శ్చఖాద పురుషస్స్వకమ్ ।
హస్త పాదోద్భవం మాంసం శిరశ్శేషోఽ భవద్యథా ॥
దృష్ట్వా శిరో విశేషం తు సుప్రసన్నస్సదాశివః ।
పురుషం భీమకర్మాణం తమువాచ సవిస్మయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ పురుషుడు శివునిచే ఇట్లు ఆజ్ఞాపించబడిన వాడై తన కాళ్లచేతుల లోని మాంసమును ు భక్షించెను. శిరస్సు మాత్రమే మిగిలి యుండెను (45). శిరస్సు మాత్రమే మిగిలి యుండుటను గాంచి సదాశివుడు మిక్కిలి ప్రసన్నుడై భయంకరమగు కర్మను ఆచరించిన ఆ పురుషునితో విస్మయపూర్వకముగా నిట్లనెను (46).

శివ ఉవాచ ।

హే మహాగణ ధన్యస్త్వం మదాజ్ఞా ప్రతిపాలకః ।
సంతుష్టశ్చాస్మి తేఽతీవ కర్మణానేన సత్తమ ॥
త్వం కీర్తి ముఖ సంజ్ఞో హి భవ మద్ద్వారకస్సదా ।
మహాగణా మహావీరస్సర్వ దుష్టభయంకరః ॥
మత్ప్రియస్త్వం మదర్చాయాం సదా పూజ్యో హి మజ్జనైః ।
త్వదర్చాం యే న కుర్వంతి నైవ తే మత్ప్రియంకరాః ॥

శివుడిట్లు పలికెను -

ఓయీ మహాగణా! నా ఆజ్ఞను పాలించు నీవు ధన్యుడవు. ఓయీ శ్రేష్ఠపురుషా! నీ ఈ కర్మను గాంచి నేను మిక్కిలి సంతసించితిని (47). సర్వదా నా కుమారుడవు, మహాగణుడవు, మహావీరుడవు, దుష్టులందరికీ భయమును గొల్పువాడవు అగు నీవు కీర్తిముఖుడను పేరును గాంచుము (48). నన్ను పూజించు నా భక్తులు నాకు ప్రియుడవగు నిన్ను కూడ సర్వదా పూజించెదరు. నిన్ను పూజించని వారు నాకు ఎన్నటికీ ప్రీతి పాత్రులు కాజాలరు (49).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శంభోర్వరం ప్రాప్య పురుషః ప్రజహర్ష సః ।
తదా ప్రభృతి దేవేశద్వారే కీర్తి ముఖస్థితః ॥
పూజనీయో విశేషేణ స గణశ్శివపూజనే ।
నార్చయంతీహ యే పూర్వం తేషామర్చా వృథా భవేత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే
దూతసంవాదో నామ ఏకోనవింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శివుని నుండి ఇట్టి వరమును పొంది ఆ పురుషుడు మిక్కిలి సంతసిల్లెను. అప్పటి నుండియు కీర్తిముఖుడు దేవదేవుని ద్వారము వద్ద నిలబడి యున్నాడు (50). శివును పూజించువారు ఆ గణుని శ్రద్ధతో పూజించవలెను. ఎవరైతే ముందుగా ఆతనిని పూజించరో, వారి పూజ వ్యర్థమగును (51).

శ్రీ శివ మహాపూరాణములోని రుద్రసంహితయందలి యుద్ధ ఖండములో దూతసంవాదమనే పందొమ్మిదవ అధ్యాయము ముగిసినది (19).

20 - రుద్రగణములతో రాక్షసుల యుద్ధము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ కథా తే శ్రావితా ద్భుతా ।
మహాప్రభోశ్శంకరస్య యత్ర లీలా చ పావనీ ॥
ఇదానీం బ్రూహి సుప్రీత్యా కృపాం కృత్వా మమోపరి ।
రాహుర్ముక్తః కుత్ర గతః పురుషేణ మహామునే ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! సర్వజ్ఞుడవగు నీవు శంకరమహాప్రభుని అద్భుత గాథను వినిపించితివి. ఈ గాథలోని లీల పావనము (1.). ఓ మహర్షీ! నీవిపుడు నాపై దయను చూపి, ఆ పురుషునిచే విడిచిపెట్టబడిన రాహువు ఎచటకు వెళ్లెను? అను విషయమును మిక్కిలి ప్రీతితో చెప్పుము (2).

సూత ఉవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామిత మేధసః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా బ్రహ్మపుత్రో మహామునిః ॥

సూతుడిట్లు పలికెను -

మహాబుద్ధి మంతుడగు ఆ వ్యాసుని ఈ మాటను విని బ్రహ్మపుత్రుడగు ఆ మహర్షి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఇట్లు బదులిడెను (3).

సనత్కుమార ఉవాచ ।

రాహుర్విముక్తో యస్తేన సోఽపి తద్బర్బరస్థలే ।
అతస్స వర్బరో భూత ఇతి భూమౌ ప్రథాం గతః ॥
తతస్స మన్యమానస్స్వం పునర్జనిమథానతః ।
గతగర్వో జగామాథ జలంధరపురం శనైః ॥
జలంధరాయ సోఽ భ్యేత్య సర్వమీశ విచేష్టితమ్ ।
కథయామాస తద్వ్యాసాద్వ్యాస దైత్యేశ్వరాయ వై ॥
జలంధరస్తు తచ్ఛ్రుత్వా కోపాకులిత విగ్రహః ।
బభూవ బలవాన్ సింధుపుత్రో దైత్యేంద్రసత్తమః ॥
తతః కోపపరాధీన మానసో దైత్య సత్తమః ।
ఉద్యోగం సర్వసైన్యానాం దైత్యానామాదిదేశ హ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ పురుషుడు రాహువును ఆభరదేశములో విడిచి పెట్టుటచే, రాహువు జాతి బాహ్యుడై, భూలోకములో అట్టి ప్రఖ్యాతిని గాంచినాడు (4). తరువాత ఆతడు తనకు పునర్జన్మ లభించినదని భావించి తలవంచుకొని తొలగిన గర్వము గలవాడై మెల్లగా జలంధరుని నగరమును చేరెను (5). ఓ వ్యాసా! ఆతడు జలంధరుని వద్దకు వెళ్లి ఈశ్వరుని వ్యవహారము నంత నూ ఆ రాక్షసరాజునకు సంగ్రహముగా చెప్పెను (6). సముద్రపుత్రుడు, రాక్షసవీరులలో శ్రేష్ఠుడు, బలవంతుడు అగు జలంధరుడు ఆ వృత్తాంతమును విని కోపముతో కదలిపోయిన దేహము గలవాడు ఆయెను (7). అపుడు కోపమునకు పూర్తిగా వశమైన మనస్సు గల ఆ రాక్షసవీరుడు రాక్షససైన్యములన్నియు యుద్ధమునకు సన్నద్ధము కావలెనని ఆదేశించెను (8).

జలంధర ఉవాచ ।

నిర్గచ్ఛంత్వ ఖిలా దైత్యాః కాలనేమిముఖాః ఖలు ।
తథా శుంభనిశుంభాద్యా వీరాస్స్వబల సంయుతాః ॥
కోటివీరకులోత్పన్నాః కంబువంశ్యాశ్చ దౌర్హృదాః ।
కాలకాః కాలకేయాశ్చ మౌర్యా ధౌమ్రాస్తథైవ చ ॥
ఇత్యాజ్ఞాప్యాసురపతి స్సింధుపుత్రః ప్రతాపవాన్ ।
నిర్జగామాశు దైత్యానాం కోటిభిః పరివారితః ॥
తతస్తస్యా గ్రతశ్శుక్రో రాహుశ్ఛిన్నశిరోఽ భవత్ ।
ముకుటశ్చాపతద్భూమౌ వేగాత్ప్రస్ఖలిత స్తదా ॥
వ్యరాజత నభః పూర్ణం ప్రావృషీవ యథా ఘనైః ।
జాతా అశకునా భూరి మహోపద్రవసూచకాః ॥
తస్యోద్యోగం తథా దృష్ట్వా గీర్వాణాస్తే సవాసవాః ।
అలక్షితాస్తదా జగ్ముః కైలాసం శంకరాలయమ్ ॥
తత్ర గత్వా శివం దృష్ట్వా సుప్రణమ్య సవాసవాః ।
దేవాస్సర్వే నతస్కంధాః కరౌ బద్ధ్వా చ తుష్టువుః ॥

జలంధరుడిట్లు పలికెను -

కాలనేమి, శుంభుడు, నిశుంభుడు మొదలగు రాక్షసవీరులందరు తమ సైన్యములతో గూడి బయలుదేరెదరు గాక! (9) కోటివీరకులమునందు పుట్టిన వారు, కంబు వంశజాతులు, దౌర్హృదులు, కాలకులు, కాలకేయులు, మౌర్యులు మరియు ధూమ్రులు కూడ బయల్వెడలెదరు గాక! (10) సముద్రపుత్రుడు, ప్రతాపవంతుడు అగు ఆ రాక్షసరాజు ఈ విధముగా ఆజ్ఞాపించి కోట్ల రాక్షసులతో చుట్టు వారబడి యున్నవాడై శీఘ్రముగా బయలు దేరెను (11). ఆతనికి ముందు శుక్రుడు మరియు తెగిన శిరస్సుతో కూడిన రాహువు నడిచిరి. అపుడాతని కిరీటము వేగము వలన జారి భూమిపై పడెను (12). ఆకాశమంతయు

వర్షాకాలములో వలె మేఘములతో నిండి ప్రకాశించెను. గొప్ప ఉపద్రవమును సూచించే అపశకునములు అధికముగా బయలు దేరెను (13). ఆతని సైన్యోద్యోగమును పరికించిన ఇంద్రాదిదేవతలు అపుడాతనికి కానరాకుండా శంకరుని నివాసమగు కైలాసమునకు వెళ్లిరి (14). ఇంద్రాది దేవతలు అందరు అచటకు వెళ్లి శివుని దర్శించి తలలు వంచి నమస్కరించి చేతులు జోడించి స్తుతించిరి (15).

దేవా ఊచుః ।

దేవదేవ మహాదేవ కరుణాకర శంకర ।
నమస్తేఽస్తు మహేశాన పాహి న శ్శరణాగతాన్ ॥
విహ్వాలా వయమత్యుగ్రం జలంధరకృతాత్ప్రభో ।
ఉపద్రవాత్స దేవేంద్రాస్స్థాన భ్రష్టాః క్షితిస్థితాః ॥
న జానాసి కథం స్వామిన్ దేవాపత్తిమిమాం ప్రభో ।
తస్మాన్నో రక్షణార్థాయ జహి సాగరనందనమ్ ॥
అస్మాకం రక్షణార్థాయ యత్పూర్వం గరుడధ్వజః ।
నియోజితస్త్వయా నాథ న క్షమస్సోఽ ద్య రక్షితుమ్ ॥
తదధీనో గృహే తస్య తిష్ఠత్యద్య మయా సహ ।
వయం చ తత్ర తిష్ఠామస్తదాజ్ఞావశగాస్సురాః ॥
అలక్షితా వయం చాత్రా గతా శ్శంభో త్వదంతికమ్ ।
స ఆయాతి త్వయా కర్తుం రణం సింధుసుతో బలీ ॥
అతస్స్వామిన్ రణే త్వం తమవిలంబం జలంధరమ్ ।
హంతుమర్హసి సర్వజ్ఞ పాహి నశ్శరణాగతాన్ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! శంకరా! నీకు నమస్కారమగు గాక! ఓ మహేశ్వరా! శరణు పొందిన మమ్ములను కాపాడుము (16). ఓ ప్రభూ! దేవేంద్రునితో సహా మేమందరము స్థాన భ్రష్టులమై భూమియందు నివసిస్తూ జలంధరుడు చేయుచున్న ఉపద్రవములచే చాల దుఃఖితులమై ఉన్నాము (17). ఓ స్వామీ ! ప్రభూ! దేవతలకు వచ్చి పడిన ఈ ఆపదను నీవు ఎరుంగక పోవుట ఎట్లు సంభవము? కావున మమ్ములను రక్షించుటకొరకై సముద్రతనయుడగు జలంధరుని సంహరించుము (18). ఓ నాథా! నీవు పూర్వము మా రక్షణ కొరకై గరుడవాహనుడగు విష్ణువును ఆదేశించి యుంటివి. కాని ఆతడీ నాడు మమ్ములను రక్షింప సమర్థుడు గాడు (19). అతడు లక్ష్మీదేవితో సహా జలంధరునకు వశుడై వాని గృహములో నివసించుచున్నాడు. వాని ఆజ్ఞకు వశవర్తులమగు మేము దేవతలము కూడా అచటనే ఉన్నాము (20). ఓ శంభూ! బలవంతుడగు ఆ సముద్రతనయుడు నీతో యుద్ధమును చేయుటకు వచ్చుచున్నాడు. మేము ఆతని

కంట బడకుండగా ఇచటకు నీ సన్నిధికి వచ్చి యుంటిమి (21). ఓ స్వామీ! కావున నీవు శీఘ్రముగా ఆ జలంధరుని యుద్ధములో సంహరించ తగుదువు. ఓ సర్వజ్ఞా! శరణు జొచ్చిన మమ్ములను రక్షింపుము (22).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తే సురాస్సర్వే ప్రభుం నత్వా సవాసవాః ।
పాదౌ నిరీక్ష్య సంతస్థుర్మహేశస్య వినమ్రకాః ॥
ఇతి దేవవచశ్శ్రుత్వా ప్రహస్య వృషభధ్వజః ।
ద్రుతం విష్ణుం సమాహూయ వచనం చేదమబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ ఇంద్రాది దేవతలందరు ఇట్లు పలికి ఆ ప్రభువునకు ప్రణమిల్లి మహేశ్వరుని పాదములను దర్శిస్తూ వినయముతో నిలబడిరి (23). వృషభధ్వజుడగు శివుడు దేవతల ఈ మాటలను విని నవ్వి వెంటనే విష్ణువును పిలిపించి ఈ మాటను పలికెను (24).

ఈశ్వర ఉవాచ ।

హృషీకేశ మహావిష్ణో దేవాశ్చాత్ర సమాగతాః ।
జలంధర కృతాపీడా శ్శరణం మేఽతివిహ్వలాః ॥
జలంధరః కథం విష్ణో సంగరే న హతస్త్వయా ।
తద్గృహం చాపి యాతోఽసి త్యక్త్వా వైకుంఠమాత్మనః ॥
మయా నియోజితస్త్వం హి సాధు సంరక్షణాయ చ ।
నిగ్రహాయ ఖలానాం చ స్వతంత్రేణ విహారిణా ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ ఇంద్రియాధిపతీ! మహావిష్ణూ! జలంధరునిచే పీడింపబడి మిక్కిలి దుఃఖమును పొందిన దేవతలు ఇచటకు వచ్చి నన్ను శరణు పొందినారు (25). ఓ విష్ణూ! నీవు యుద్ధములో జలంధరుని సంహరించ పోవుటకు కారణమేమి? పైగా, నీవు వైకుంఠమును విడిచిపెట్టి వాని గృహమునకు చేరు కొంటివి (26). స్వతంత్రుడను, లీలావిహారిని అగు నేను నిన్ను సాధుపురుషుల రక్షణ కొరకు, దుష్టుల శిక్షణ కొరకు నియోగించి యున్నాను గదా! (27)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య మహేశస్య వచనం గరుడధ్వజః ।

ప్రత్యువాచ వినీతాత్మా నతక స్సాంజలిర్హరిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహేశ్వరుని ఈ మాటను విని గరుడధ్వజుడగు విష్ణువు వినయముతో నిండిన అంతః కరణము గలవాడై చేతులు జోడించి నమస్కరించి ఇట్లు బదులిడెను (28).

విష్ణురువాచ ।

తవాంశసంభవత్వాచ్చ భ్రాతృత్వాచ్చ తథా శ్రియః ।

మయా న నిహతస్సంఖ్యే త్వమేనం జహి దానవమ్ ॥

మహాబలో మహావీరోఽజేయ స్సర్వదివౌకసామ్ ।

అన్యేషాం చాపి దేవేశ సత్యమేతద్బ్రవీ మ్యహమ్ ॥

మయా కృతో రణస్తేన చిరం దేవాన్వితేన వై ।

మదుపాయో న ప్రవృత్తస్తస్మిన్ దానవపుంగవే ॥

తత్పరాక్రమతస్తుష్టో వరం బ్రూహీత్యహం ఖలు ।

ఇతి మద్వచనం శ్రుత్వా స వవ్రే వరముత్తమమ్ ॥

మద్భగిన్యా మయా సార్ధం మద్గేహ ససురో వస ।

మదధీనో మహావిష్ణో ఇత్యహం తద్గృహం గతః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

నీ అంశనుండి జన్మించిన వాడగుట, లక్ష్మికి సోదరుడగుట అను కారణములచే ఆ రాక్షసుని నేను యుద్ధములో సంహరించలేదు. వానిని నీవే సంహరించుము (29). ఓ దేవదేవా! మహాబలుడు, మహావీరుడు అగు ఆ రాక్షసుని సర్వదేవతలు గాని, ఇతరులు గాని జయించలేరు. ఈ నా మాట సత్యము (30). నేను దేవతలతో గూడి చిరకాలము ఆ రాక్షస వీరునితో యుధమును చేసితిని. నా ఉపాయము వాని యందు విఫలమాయెను (31). ఆతని పరాక్రమమునకు నేను సంతసిల్లి 'వరమును కోరుకొనుము' అని పలికితిని. నా ఈ మాటను విని ఆతడు ఉత్తమమగు వరమును కోరెను (32). 'ఓమహావిష్ణూ! నా సోదరియగు లక్ష్మితో మరియు దేవతలతో గూడి నా ఇంటిలో నివసించుము; నాకు అధీనుడవై ఉండుము' అని ఆతడు కోరినాడు. కావుననే, నేనాతని గృహమునకు వెళ్లియుంటిని (33).

సనత్కుమార ఉవాచ ।

ఇతి విష్ణోర్వచశ్శ్రుత్వా శంకరస్స మహేశ్వరః ।

విహస్యోవాచ సుప్రీతస్సదయో భక్తవత్సలః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

విష్ణువు యొక్క ఈ మాటను విని, మంగళకరుడు దయామయుడు భక్తవత్సలుడు నగు ఆ మహేశ్వరుడు మిక్కిలి సంతసిల్లి నవ్వుతూ ఇట్లు పలికెను (34).

మహేశ్వర ఉవాచ ।

హే విష్ణో సురవర్య త్వం శృణు మద్వాక్యమాదరాత్ ।

జలంధరం మహాదైత్యం హనిష్యామి న సంశయః ॥

స్వస్థానం గచ్ఛ నిర్భీతో దేవా గచ్ఛంత్వపి ధ్రువమ్ ।

నిర్భయా వీతసందేహా హతం మత్వాఽ సురాధిపమ్ ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

దేవతలలో శ్రేష్ఠుడవగు ఓ విష్ణూ! నా మాటను నీవు శ్రద్ధతో వినుము. మహారాక్షసుడగు జలంధరుని నిస్సందేహముగా సంహరించగలను (35). నీవు నిర్భయముగా నీ స్థానమునకు వెళ్లుము. ఆ రాక్షసరాజు హతుడైనాడని తలంచి దేవతలు కూడా నిస్సందేహముగా నిర్భయముగా నిశ్చయముగా తమ స్థానములకు వెళ్లెదరు గాక! (36)

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా మహేశస్య వచనం స రమాపతిః ।

సనిర్జరో జగామాశు స్వస్థానం గతసంశయః ॥

ఏతస్మిన్నంతరే వ్యాస స దైత్యేంద్రోఽ తివిక్రమః ।

సన్నద్ధైరసురైస్సార్ధం శైలప్రాంతం యయౌ బలీ ॥

కైలాసమవరుధ్యాథ మహత్యా సేనయా యుతః ।

సంతస్థౌ కాలసంకాశః కుర్వన్ సింహరవం మహాన్ ॥

అథ కోలాహలం శ్రుత్వా దైత్యనాదసముద్భవమ్ ।

చుక్రోధాతి మహేశానో మహాలీలః ఖలాంతకః ॥

సమాదిదేశ సంక్రుద్ధః స్వగణాన్ స మహాబలాన్ ।

నంద్యాదికాన్మహాదేవో మహోతిః కౌతుకీ హరః ॥

నందీభముఖసేనానీ ముఖాస్సర్వే శివాజ్ఞయా ।

గణాశ్చ సమనహ్యంత యుద్ధాయాతిత్వరాన్వితాః ॥

అవతేరుర్గణాస్సర్వే కైలాసా త్క్రోధ దుర్మదాః ।

వల్గంతో రణశబ్దాంశ్చ మహావీరా రణాయ హి ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహేశ్వరుని ఈ మాటను విని ఆ లక్ష్మీపతి తొలగిన సంశయములు గల వాడై దేవతలతో గూడి తన స్థానమునకు శీఘ్రముగా చేరుకొనెను (37). ఓ వ్యాసా! ఇంతలో మహాపరాక్రమ శాలి, బలశాలి అగు ఆ రాక్షసరాజు యుద్ధ సన్నద్ధులైన రాక్షసులతో గూడి కైలాసపర్వత సమీపమునకు చేరెను (38). యమునితో సమమగు ఆ జలంధరుడు పెద్దసేనతో గూడిన వాడై కైలాసమును ముట్టడించి సింహనాదమును చేయుచూ ఉత్కర్ష గల వాడై స్థిరము.గా నుండెను (39). గొప్ప లీలలు గలవాడు, దుష్టసంహారకుడు అగు శివుడు రాక్షసుల సింహనాదమునుండి బయల్వెడలిన ఆ కోలాహలమును విని అపుడు మిక్కిలి కోపించెను (40). గొప్ప లీలలు గలవాడు, యుద్ధమునందు ఉత్సాహము గలవాడు, పాపహారి అగు మహాదేవుడు మహాబలశాలురగు నంది మొదలైన తన గణములను యుద్ధమునకు ఆదేశించెను (41). నంది, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి మొదలగు గణములందరు శివుని ఆజ్ఞచే మిక్కిలి వేగముతో యుద్ధమునకు సన్నద్ధులైరి. (42). క్రోధముచే మిక్కిలి మదించి ఉన్న మహావీరులగు గణములందరు సింహనాదములను చేయుచూ యుద్ధము కొరకై కైలాసమునుండి క్రిందకు దిగిరి (43).

తతస్సమభవద్యుద్ధం కైలాసోపత్య కాసు వై ।
ప్రమథాధిపదైత్యానాం ఘోరం శస్త్రాస్త్ర సంకులమ్ ॥
భేరీమృదంగశంఖౌఘైర్నిస్వానై ర్వీరహర్షణైః ।
గజాశ్వరథశబ్దైశ్చ నాదితా భూర్వ్యకంపత ॥
శక్తితో మరబాణౌఘైర్ముసలైః పాశపట్టిశైః ।
వ్యరాజత నభః పూర్ణం ముక్తాభిరివ సంవృతమ్ ॥
నిహతైరివ నాగాశ్వైః పత్తి భిర్భూర్వ్యరాజత ।
వజ్రాహతైః పర్వతేంద్రైః పూర్వమాసీత్సు సంవృతా ॥
ప్రమథాహత దైత్యౌ ఘైర్దైత్యాహతగణైస్తథా ।
వసాసృజ్ మాంసపంకాఢ్యా భూరగమ్యా భవత్తదా ॥
ప్రమథాహతదైత్యౌఘాన్ భార్గవస్సమజీవయత్ ।
యుద్ధే పునః పునశ్చైవ మృత సంజీవనీ బలాత్ ॥
దృష్ట్వా వ్యాకులితాస్తాంస్తు గణాస్సర్వే భయార్దితాః ।
శశంసుర్దేవదేవాయ సర్వే శుక్రవిచేష్టితమ్ ॥

తరువాత కైలాస పర్వత స్థానువులయందు ప్రమథ గణములకు రాక్షసులకు మధ్య శస్త్ర - అస్త్రములతో అల్లకల్లోలముగనున్న ఘోరయుద్ధము జరిగెను (44). భేరీలు, మృదంగములు, శంఖములు ధ్వని చేయుచూ వీరులకు ఉత్సాహము కలిగించుచుండెను. ఏనుగులు, గుర్రములు మరియు రథముల

శబ్దములచే భూమి మారు మ్రోగి కంపించెను (45). శక్తి, తోమర, ముసల, పాశ, పట్టిశములను ఆయుధములతో మరియు బాణసమూహములతో నిండియున్న ఆకాశము అంతయూ ముత్యములను వెదజల్లినట్లు ప్రకాశించెను (46). సంహరింపబడిన ఏనుగులతో, గుర్రములతో మరియు పదాతి సైనికులతో నిండియున్న భూమి, పూర్వము వజ్రముచే కొట్టబడిన పర్వత శ్రేష్ఠములచే కప్పబడి ఉన్న స్థితిని పోలియుండెను (47). ప్రమథుల చేతిలో అనేక రాక్షసులు, రాక్షసుల చేతిలో అనేక గణములు సంహరింపబడిరి. వారి రక్త మాంసముల బురదతో నిండి భూమి యొక్క ఉపరితలము కాలుపెట్టుటకు వీలులేనిదై ఉండెను (48). ప్రమథులచే సంహరింపబడిన రాక్షసులనందరినీ శుక్రాచార్యుడు మృతసంజీవని యొక్క బలముచే పలుమార్లు యుద్ధములో మరల బ్రతికించుచుండెను (49). గణములందరు వారిని చూచి కంగారుపడి భయపీడితులై శుక్రుని ఆ కార్యమును గూర్చి దేవదేవుడగు శివునకు విన్నవించిరి (50).

తచ్ఛ్రుత్వా భగవాన్రుద్రశ్చకార క్రోధముల్బణమ్ ।
భయం కరోకతి రౌద్రశ్చ బభూవ ప్రజ్వలన్ దిశః ॥
అథ రుద్రముఖాత్కృత్యా బభూవాతీవ భీషణా ।
తాల జంఘోదరీ వక్త్రా స్తనాపీడిత భూరుహా ॥
సా యుద్ధభూమిం తరసా ససాద మునిసత్తమ ।
విచచార మహాభీమా భక్షయంతీ మహాసురాన్ ॥
అథ సా రణమధ్యే హి జగామ గత భీర్ద్రుతమ్ ।
యత్రాస్తే సంవృతో దైత్యవరేంద్రైస్స హి భార్గవః ॥
స్వతేజసా నభో వ్యాప్య భూమిం కృత్వా చ సా మునే ।
భార్గవం స్వభగే ధృత్వా జగామాంతర్హితం నభః ॥
విద్రుతం భార్గవం దృష్ట్వా దైత్య సైన్య గణాస్తథా ।
ప్రంలాన వదనా యుద్ధాన్నిర్జగ్ముర్యుద్ధ దుర్మదాః ॥
అథోఽ భజ్యత దైత్యానాం సేనా గణ భయార్దితా ।
వాయువేగహతా యద్వత్ప్రకీర్ణా తృణ సంహతిః ॥

ఆ మాటలను విని రుద్రభగవానుడు తీవ్రమగు కోపమును పొందెను. ఆయన మిక్కిలి రౌద్రాకారమును పొంది భయమును గొల్పెను. ఆయన తన తేజస్సుచే దిక్కులను మండునట్లు చేసెను (51). అపుడు రుద్రుని ముఖమునుండి అతి భయంకరమగు కృత్య (క్షుద్రశక్తి) ఉద్భవించెను. తాటి చెట్లు వంటి పిక్కలు, పర్వతగుహవంటి నోరుగల ఆమె తన స్తనములతో వృక్షములను చూర్ణము చేసెను (52). ఓ మహర్షీ! ఆమె వెంటనే యుద్ధభూమికి చేరుకొని అతి భయంకరాకారముతో మహారాక్షసులను భక్షిస్తూ సంచరించెను (53). అపుడామె

యుద్ధ మధ్యములో రాక్షసశ్రేష్ఠులచే చుట్టు వారబడిన శుక్రుడు ఉన్న స్థానమునకు శీఘ్రముగా నిర్భయముగా చేరెను (54). ఓ మునీ! ఆమె తన తేజస్సుతో ఆకాశమును నింపి, తాను నడిచిన భూభాగమును బ్రద్దలు కొట్టి, భార్గవుని ఒడిసి పట్టి ఆకాశములోనికి ఎగిరి అంతర్ధానమాయెను (55). యుద్ధమునందు మదించియున్న రాక్షస సైనికులు యుద్ధరంగమునుండి భార్గవుడు అంతర్హితుడగుటను గాంచి మాడిపోయిన ముఖములు గల వారై యుద్ధమునుండి వెనుదిరిగిరి (56). అపుడు తుఫాను గాలిచే ఎగురగొట్టబడి గడ్డిమోపు చెల్లాచెదరైన తీరున, ప్రమథగణములచే పీడింపబడిన రాక్షససేన భయముతో చెల్లాచెదరయ్యెను (57).

భగ్నాం గణభయాద్దైత్య సేనాం దృష్ట్వాత్యమర్షితాః ।
నిశుంభశుంభౌ సేనాన్యౌ కాలనేమిశ్చ చుక్రుశుః ॥
త్రయస్తే వరయామాసుర్గణసేనాం మహాబలాః ।
ముంచంతశ్శరవర్షాణి ప్రావృషీవ బలాహకాః ॥
తతో దైత్యశరౌఘాస్తే శలభానామివ ప్రజాః ।
రురుధుః ఖం దిశస్సర్వా గణసేనామ కంపయన్ ॥
గణాశ్శరశతైర్భిన్నా రుధిరాసారవర్షిణః ।
వసంతకింశుకాభాసా న ప్రాజానన్ హి కించన ॥
తతః ప్రభగ్నం స్వబలం విలోక్య నంద్యాది లంబోదర కార్తికేయాః ।
త్వరాన్వితా దైత్యవరాన్ ప్రసహ్య నివారయామాసురమర్షణాస్తే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
ప్రమథగణాసురయుద్ధ వర్ణనం నామ వింశోఽధ్యాయః ॥

గణముల భయము వలన చెల్లాచెదరైన రాక్షస సేనను చూచి సేనానాయకులగు శుంభనిశుంభులు మరియు కాలనేమి మిక్కిలి కోపించి కేకలను వేసిరి (58). మహాబలశాలురగు వారు ముగ్గురు, వర్షాకాలమునందు మేఘములు వలె, గణసైన్యముపై బాణవృష్టిని కురిపించి ఆ సైన్యమును నిలువరించిరి (5 9). అపుడు ఆ రాక్షసుల బాణసమూహములు మిడతల దండుల వలె ఆకాశమును అన్ని దిక్కులను కప్పి వేసి ప్రమథగణసైన్యము వణికి పోవునట్లు చేసినవి (60). అసంఖ్యాకములగు శరములచే చీల్చివేయబడిన గణములు రక్తమును ప్రవాహముగా వర్షించి వసంతకాలము నందలి కింశుకవృక్షములను బోలి యుండిరి. వారికి ఏమి చేయవలెనో తోచలేదు (61). అపుడు నంది, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి మొదలగు గణాధ్యక్షులు తమ సైన్యము చెల్లాచెదరు అగుచుండుటను గాంచి మిక్కిలి కోపించి తొందరపడి ఆ రాక్షసవీరులను బలముగా ఎదుర్కొని ఆపివేసిరి (62).

21 - గణాధ్యక్షుల యుద్ధము

సనత్కుమార ఉవాచ ।

తే గణాధిపతీన్ దృష్ట్వా నందీభముఖ షణ్ముఖాన్ ।
అమర్షాదభ్యధావంత ద్వంద్వ యుద్ధాయ దానవాః ॥
నందినం కాలనేమిశ్చ శుంభో లంబోదరం తథా ।
నిశుంభష్షణ్ముఖం దేవమభ్యధావత శంకితః ॥
నిశుంభః కార్తికేయస్య మయూరం పంచభిశ్శరైః ।
హృది వివ్యాధ వేగేన మూర్ఛితస్స పపాత హ ॥
తతశ్శక్తిధరః క్రుద్ధో బాణైః పంచభిరేవ చ ।
వివ్యాధ స్యందనే తస్య హయాన్ యంతారమేవ చ ॥
శరేణాన్యేన తీక్ ష్ణేన నిశుంభం దేవవైరిణమ్ ।
జఘాన తరసా వీరో జగర్జ రణదుర్మదః ॥
అసురోఽపి నిశుంభాఖ్యో మహావీరోఽతి వీర్యవాన్ ।
జఘాన కార్తికేయం తం గర్జంతం స్వేషుణా రణే ॥
తతశ్శక్తిం కార్తికేయో యావజ్జగ్రాహ రోషతః ।
తావన్నిశుంభో వేగేన స్వశక్త్యా తమపాతయత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

నంది, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి అను గణాధ్యక్షులను గాంచి ఆ రాక్షసులు కోపముతో ద్వంద్వయుద్ధము కొరకై వారిపైకి ఉరికిరి (1). కాలనేమి నందితో మరియు శుంభుడు విఘ్నేశ్వరునితో తలపడిరి. నిశుంభుడు సందేహిస్తూనే షణ్ముఖదేవుని పైకి ఉరికెను (2). నిశుంభుడు అయిదు బాణములతో కుమారస్వామి యొక్క నెమలిని బలముగా హృదయమునందు కొట్టగా, అది మూర్ఛిల్లి నేలగూలెను (3). అపుడు శక్తి ధరుడగు కుమారస్వామి కోపించి అయిదు బాణములతో వాని గుర్రములను, మరియు సారథిని కూడ కొట్టెను (4). యుద్ధములో అజేయుడగు ఆ వీరుడు మరి యొక వాడి బాణముతో నిశుంభాసురుని గట్టిగా కొట్టి గర్జించెను (5). మహావీరుడు గొప్ప పరాక్రమ శాలియగు నిశుంభాసురుడు కూడ యుద్ధములో సింహనాదము చేయుచున్న ఆ కుమారస్వామిని తన బాణముతో కొట్టెను (6). తరువాత కుమారస్వామి కోపముతో శక్తిని తీసుకోన బోవునంతలో నిశుంభుడు వేగముగా తన శక్తితో దానిని కూల్చి వేసెను (7).

ఏవం బభూవ తత్రైవ కార్తికేయ నిశుంభయోః ।
అహోవో హి మహాన్ వ్యాస వీరశబ్దం ప్రగర్జతోః ॥
తతో నందీశ్వరో బాణైః కాలనేమిమవిధ్యత ।
సప్తభిశ్చ హయాన్ కేతుం రథం సారథి మాచ్ఛినత్ ॥
కాలనేమిశ్చ సంక్రుద్ధో ధనుశ్చిచ్ఛేద నందినః ।
స్వశరాసన నిర్ముక్తైర్మహాతీక్ష్ణై శ్శిలీముఖైః ॥
అథ నందీశ్వరో వీరః కాల నేమిం మహాసురమ్ ।
తమపాస్య చ శూలేన వక్షస్య భ్యహనద్దృఢమ్ ॥
స శూలభిన్నహృదయో హతాశ్వో హతసారథిః ।
అద్రేశ్శిఖరముత్పాట్య నందినం సమతాడయత్ ॥
అథ శుంభో గణేశశ్చ రథమూషకవాహనౌ ।
యుధ్యమానౌ శరవ్రాతైః పరస్పరమ విధ్యతామ్ ॥
గణేశస్తు తదా శుంభం హృది విద్యాథ పత్రిణా ।
సారథిం చ త్రిభిర్బాణైః పాతయామాస భూతలే ॥

ఈ విధముగా అచట వీరశబ్దములతో గర్జించుచున్న కార్తికేయనిశుంభులకు గొప్పొప్ప యుద్ధము జరిగెను. ఓవ్యాసా! (8) అపుడు నందీశ్వరుడు ఏడు బాణములతో కాలనేమిని కొట్టి గుర్రములను, జెండాను, రథమును మరియు సారథిని చీల్చి వేసెను (9). కాలినేమి కూడ కోపించి తన ధనస్సు నుండి వీడిబి పెట్టబడిన మిక్కిలి వాడియగు బాణములతో నందియొక్క ధనస్సును విరుగగొట్టెను (10). అపుడు వీరుడగు నందీశ్వరుడు మహారాక్షసుడగు ఆ కాలనేమిని ప్రక్కకు నెట్టి శూలముతో గట్టిగా వక్షస్థలమునందు గొట్టెను. (11). అతని వక్షస్థలము ఆ శూలపు దెబ్బకు చీలియుండెను. ఆతని గుర్రములు మరియు సారథి మరణించిరి. అపుడు ఆతడు పర్వత శిఖరమును పెకలించి దానితో నందిని కొట్టెను (12). మరియు రథమును అధిష్టించియున్న శుంభుడు, మూషకవాహనుడగు గజాననుడు యుద్ధమును చేయుచూ, బాణపరంపరలతో ఒకరినొకరు కొట్టిరి (13). అపుడు గజాననుడు శుంభుని బాణముతో హృదయమునందు కొట్టెను. మరియు మూడు బాణములతో సారథిని నేలగూల్చెను (14).

తతోఽతి క్రుద్ధశ్శుంభోఽపి బాణవృష్ట్యా గణాధిపమ్ ।
మూషకం చ త్రిభిర్విద్ధ్వా ననాద జలదస్వనః ॥
మూషకశ్శరభిన్నాంగశ్చచాల దృఢవేదనః ।
లంబోదరశ్చ పతితః పదాతిరభవత్స హి ॥
తతో లంబోదరశ్శుంభం హత్వా పరశునా హృది ।
అపాతయత్తదా భూమౌ మూషకం చారురోహ సః ॥

సమరాయోద్యతశ్చాభూత్పునర్గజముఖో విభుః ।
ప్రహస్య జఘ్నతుః క్రోధాత్తో శ్రేణీవ మహాద్విపమ్ ॥
కాలనేమిర్నిశుంభశ్చ హ్యుభౌ లంబోదరం శరైః ।
యుగపచ్చఘ్నతుః క్రోధాదాశీ విషసమైర్ద్రుతమ్ ॥
తం పీడ్యమానమాలోక్య వీరభద్రో మహాబలః ।
అభ్యధావత వేగేన కోటి భూతయుతస్తథా ॥
కూష్మాండా భైరవాశ్చాపి వేతాలా యోగినీగణాః ।
పిశాచా డాకినీ సంఘా గణాశ్చాపి సమం యయుః ॥

అపుడు శుంభుడు కూడ మిక్కిలి కోపించి గజాననుని బాణవర్షముతో ముంచెత్తి మూషికమును మూడు బాణములతో గొట్టి మేఘమువలె గర్జించెను (15). బాణములచే చీల్చబడిన అవయవములు గల మూషకము తీవ్రవేదనచే కంపించి పోయెను. నేలపై బడిన గజాననుడు పదాతి ఆయెను (16). అపుడు గజాననుడు శుంభుని పరశువుతో హృదయమునందు కొట్టి నేలపై బడవేసి మూషకమునధిష్ఠించెను (17). మరల విఘ్నేశ్వర ప్రభుడు యుద్ధమునకు సంసిద్ధుడాయెను. శుంభుడు నవ్వి పెద్ద ఏనుగును అంకుశముతో కొట్టిన విధంబున ఆయనను కోపముతో కొట్టెను (18). కాలనేమి మరియు నిశుంభుడు వీరిద్దరు కలిసి క్రోధమును ప్రదర్శిస్తూ ఏకకాలములో, సర్పముల వలె ప్రాణాంతకములగు బాణములతో గజాననుని ఒక్కుమ్మడిగా ముట్టడించిరి (19). ఇట్లు వ్యథను పొందియున్న గజాననుని గాంచి మహాబలుడగు వీర భద్రుడు కోటి భూతములతో గూడి వేగముగా ఆతని వైపునకు పరుగెత్తెను (20). ఆయనతో బాటు కూష్మాండులు, భైరవులు, వేతాళులు, యోగినీగణములు, పిశాచములు, డాకిన్యాది గణములు కూడ వచ్చినవి (21).

తతః కిలకిలాశబ్దైస్సింహ నాదైస్సఘర్ఘరైః ।
వినాదితా డమరుకైః పృథివీ సమకంపత ॥
తతో భూతాః ప్రధావంతో భక్షయంతి స్మ దానవాన్ ।
ఉత్పత్య పాతయంతి స్మ నన్యతుశ్చ రణాంగణే ॥
ఏతస్మిన్నంతరే వ్యాసా భూతాం నందీ గుహశ్చ తౌ ।
ఉత్థితావాప్త సంజ్ఞౌ హి జగర్జతురలం రణే ॥
స నందీ కార్తికేయశ్చ సమాయాతౌ త్వరాన్వితౌ ।
జఘ్నతుశ్చ రణే దైత్యా న్నిరంతర శరవ్రజైః ॥
ఛిన్నైర్భిన్నైర్మృతైర్దైత్యైః పతితైర్భక్షితైస్తథా ।
వ్యాకులా సాభవత్సేనా విషణ్ణవదనా తదా ॥
ఏవం నందీ కార్తికేయో వికటశ్చ ప్రతాపవాన్ ।
వీరభద్రో గణాశ్చాన్యే జగర్జు స్సమరేఽవధికమ్ ॥
నిశుంభశుంభౌ సేనాన్యౌ సింధుపుత్రస్య తౌ తథా ।
కాలనేమిర్మహాదైత్యోఽసురాశ్చాన్యే పరాజితాః ॥

అపుడు భూమి కిలకిలారావములతో, సింహనాదములతో, గర్జనలతో మరియు డమరుక ధ్వనులతో నిండి కంపించెను (22). అపుడు భూతములు యుద్ధ భూమిలో వేగముగా పరుగులెత్తుచూ రాక్షసులను తినుచుండెను; పైకి ఎత్తి క్రింద పారవేయుచుండెను; మరియు నాట్యమాడు చుండెను (23). ఓ వ్యాసా! ఇంతలో నంది మరియు గుహుడు సంజ్ఞను పొంది లేచి నిలబడిరి. వారు అపుడా యుద్ధరంగములో అనేక పర్యాయములు గర్జించిరి (24). అపుడు నంది, మరియు గుహుడు వేగముగా యుద్ధములోనికి ప్రవేశించి అవకాశము లేని విధముగా బాణపరంపరలతో రాక్షసులను ముంచెత్తి సంహరించిరి (25). తెగ గొట్ట బడిన వారు, చితుక గొట్టబడినవారు, సంహరింపబడిన వారు, నేలగూలిన వారు మరియు భక్షింపబడినవారు అగు రాక్షసులతో ఆ సైన్యము అల్లకల్లోలమయ్యెను. సైన్యములో విషాదము అలుముకొనెను (26). ఈ తీరున భయంకరాకారుడు ప్రతాపవంతుడు అగు కుమారస్వామి, నంది, వీరభద్రుడు మరియు ఇతర గణములు ఆ యుద్ధములో అధికముగా గర్జించిరి (27). జలంధరుని సేనానాయకులగు నిశుంభ శుంభులు, మహాసురుడగు కాలనేమి మరియు ఇతర రాక్షసులు పరాజయమును పొందిరి (28).

ప్రవిధ్వస్తాం తతస్సేనాం దృష్ట్వా సాగరనందనః ।
రథేనాతి పతాకేన గణానభియయౌ బలీ ॥
తతః పరాజితా దైత్యా అప్య భూవన్మహోత్సవాః ।
జగర్జురధికం వ్యాస సమరాయోద్యతాస్తదా ॥
సర్వే రుద్ర గణాశ్చాపి జగర్జుర్జయశాలినః ।
నంది కార్తికదంత్యాస్య వీరభద్రాదికా మునే ॥
హస్త్యశ్వరథ సంప్రదశ్శంఖ భేరీరవస్తథా ।
అభవత్సింహ నాదశ్చ సేనయోరుభయోస్తథా ॥
జలంధరశరవ్రాతైర్నీ హారపటలైరివ ।
ద్యావాపృథ్వ్యో రాచ్ఛన్నమంతరం సమపద్యత ॥
శైలాదిం పంచభిర్విద్ధ్వా గణేశం పంచభిశ్శరైః ।
వీరభద్రం చ వింశత్యా ననాద జలదస్వనః ॥
కార్తికేయస్తతో దైత్యం శక్త్యా వివ్యాధ సత్వరం ।
జలంధరం మహావీరో రుద్రపుత్రో ననాద చ ॥

అపుడు సముద్రపుత్రుడు, బలశాలి యగు జలంధరుడు తన సేన చెల్లాచెదరగుటను గాంచి, రెపరెపలాడు తున్న జెండా గల రథముపై నెక్కి గణముల వైపునకు వేగముగా వెళ్లెను (29). ఓ వ్యాసా! అపుడు పరాజితులై యున్న రాక్షసులు కూడా గొప్ప, ఉత్సాహమును పొంది యుద్ధమునకు సన్నద్ధులై అధికముగా గర్జించిరి (30). నంది, కుమారస్వామి, గజాననుడు, వీరభద్రుడు

మొదలుగా గల రుద్రగణములందరు కూడా జయోత్సాహము గలవారై, గర్జించిరి. ఓ మునీ! (31) రెండు సేనలలో గుర్రముల సకిలింపులు, ఏనుగుల ఘీంకారములు, రథముల ధ్వని, శంఖముల ధ్వని, భేరీల ధ్వనీ, మరియు సింహనాదములు మిన్ను ముట్టెను (32). భూమికి, స్వర్గమునకు మధ్యలో గల ఆకాశము జలంధరుని బాణములచే పొగమంచు తునకలతో వలె కప్పివేయబడెను (33). ఆతడు నందిని అయిదు, గణేశుని అయిదు, మరియు వీరభద్రుని ఇరవై బాణములతో కొట్టి మేఘధ్వనితో సింహనాదమును చేసెను (34). అపుడు వెంటనే మహావీరుడు, రుద్రపుత్రుడు అగు కుమారస్వామి జలంధరాసురుని శక్తితో కొట్టి సింహనాదమును చేసెను (35).

స ఘూర్ణనయనో దైత్యశ్శక్తి నిర్భిన్నదేహకః ।
పపాత భూమౌ త్వరితముదతిష్ఠ న్మహాబలః ॥
తతః క్రోధపరీతాత్మా కార్తికేయం జలంధరః ।
గదయా తాడయామాస హృదయే దైత్యపుంగవః ॥
గదా ప్రభావం సఫలం దర్శయన్ శంకరాత్మజః ।
విధిదత్త వరాద్వ్యాస స తూర్ణం భూతలే ఒపతత్ ॥
తథైవ నందీ హ్యపతద్భూతలే గదయా హతః ।
మహావీరోఽపి రిపుహా కించిద్వ్యాకులమానసః ॥।
తతో గణేశ్వరః క్రుద్ధ స్స్మృత్వా శివపదాంబుజమ్ ।
సంప్రాప్యాతిబలో దైత్యగదాం పరశునాచ్ఛినత్ ॥
వీరభద్రస్త్రి బిర్బాణైర్హృది వివ్యాధ దానవమ్ ।
సప్తభిశ్చ హయాన్ కేతుం ధనుశ్చత్రం చ చిచ్ఛిదే ॥
తతోఽతి క్రుద్ధా దైత్యేంద్రశ్శక్తి ముద్యమ్య దారుణామ్ ।
గణేశం పాతయామాస రథమన్యం సమారుహత్ ॥

శక్తిచే చీల్చబడిన దేహము గల ఆ రాక్షసుడు కన్నులు తిరుగుటచే నేలపై బడెను. కాని మహాబలశాలి యగుటచే వెంటనే లేచి నిలబడెను (36). అపుడు రాక్షసశ్రేష్ఠుడగు జలంధరుడు క్రోధముతో నిండిన మనస్సు గలవాడై కుమారస్వామినీ గదతో వక్షస్థలముపై కొట్టెను (37). శంకరపుత్రుడగు ఆ కుమారస్వామి వరముగా నీయబడిన ఆ గద ప్రభావశాలి యనియు, వరము సఫలమనియు నిరూపించుటకై వెంటనే నేలపై బడెను (38). అదే విధముగా మహావీరుడు, శత్రువులను సంహరించువాడు అయిననూ నంది కొంత కల్లోలమును పొందిన మనస్సు గలవాడై గదచే కొట్టబడి నేలపై బడెను. (39). అపుడు విఘ్నేశ్వరుడు మిక్కిలి కోపించి శివుని పాదపద్మములను స్మరించి అచటకు వచ్చి మహాబలశాలియై పరశువుతో రాక్షసుని గదను విరుగగొట్టెను (40).

వీరభద్రుడు ఆ రాక్షసుని వక్షస్థలముపై మూడు బాణములతో కొట్టి ఏడు బాణములతో గుర్రములను సంహరించి జెండాను, ధనస్సును మరియు గొడుగును ఛేదించెను (41). అపుడు ఆ రాక్షసరాజు మిక్కిలి కోపించి భయంకరమగు శక్తిని పైకి ఎత్తి విఘ్నేశ్వరుని నేలపై బడవేసి తాను మరియొక రథము నధిష్ఠించెను (42).

ఆభ్య గాదథ వేగేన స దైత్యేంద్రో మహాబలః ।
విగణయ్య హృదా తం వై వీరభద్రం రుషాన్వితః ॥
వీరభద్రం జఘానాశు తీక్ష్ణేనాశీవిషేణ తమ్ ।
ననాద చ మహావీరో దైత్యరాజో జలంధరః ॥
వీరభద్రోఽపి సంక్రుద్ధ స్శితధారణ చేషుణా ।
చిచ్ఛేద తచ్ఛరం చైవ వివ్యాధ మహేషుణా ॥
తతతో సూర్యసంకాశౌ యుయుధాతే పరస్పరమ్ ।
నానాశస్త్రైస్తథా స్త్రైఇశ్చ చిరం వీరవరోత్తమౌ ॥
వీరభద్రస్తతస్తస్య హయాన్ బాణైరపాతయత్ ।
ధనుశ్చిచ్ఛేద రథినః పతాకం చాపి వేగతః ॥
అథో స దైత్య రాజోఽపి పుప్లువే పరిఘాయుధః ।
వీరభద్రోపకంతం స ద్రుతమాప మహాబలః ॥
పరిఘేనాతి మహతా వీరభద్రం జఘాన హ ।
మహాబలోఽబ్ధితనయో మూర్ధ్ని వీరో జగర్జ చ ॥

అపుడు మహాబలశాలియగు ఆ రాక్షసరాజు మనస్సులో ఆ వీరభద్రుని ఏమియూ లెక్కకచేయక కోపముతో నిండినవాడై వేగముగా ఆతని పైకి దండెత్తెను (43). మహావీరుడు, రాక్షసరాజు అగు జలంధరుడు ఆ వీరభద్రుని ఒక వాడి బాణముతో వేగముగా కొట్టి సింహనాదమును చేసెను (44). వీరభద్రుడు కోపించి పదునైన బాణముతో ఆ బాణమును ఛేదించి ఒక గొప్ప బాణముతో ఆతనిని కొట్టెను (45). ఆ తరువాత మహావీరులలో అగ్రగణ్యులు, సూర్యునితో సమమగు తేజస్సు గలవారు అగు వారిద్దరు అనేక శస్త్రములతో చిరకాలము ద్వంద్వ యుద్ధమును చేసిరి (46). అపుడు వీరభద్రుడు రథియగు ఆ జలంధరుని గుర్రములను బాణములతో నేలగూల్చి, ధనస్సును ఛేదించి, వేగముగా జెండాను కూడా పడగొట్టెను (47). అపుడు మహాబలుడగు రాక్షసరాజు పరిఘను చేతబట్టి వేగముగా గెంతి వీరభద్రుని సమీపమునకు వచ్చెను. (48). మహాబలుడు, సముద్రపుత్రుడు, వీరుడు అగు ఆ జలంధరుడు మిక్కిలి పెద్ద పరిఘతో వీరభద్రుని శిరస్సుపై కొట్టి గర్జించెను (49).

పరిఘేనాతిమహతా భిన్నమూర్ధా గణాధిపః ।
వీరభద్రః పపాతోర్వ్యాం ముమోచ రుధిరం బహు ॥
పతితం వీరభద్రం తు దృష్ట్వా రుద్రగణా భయాత్ ।
అపాగచ్ఛన్ రణం హిత్వా క్రోశమానా మహేశ్వరమ్ ॥
అథ కోలాహలం శ్రుత్వా గణానాం చంద్రశేఖరః ।
నిజపార్శ్వస్థితాన్ వీరానపృచ్ఛద్గణసత్తమాన్ ॥

గణాధ్యక్షుడగు వీరభద్రుడు మిక్కిలి పెద్దదియగు పరిఘచే కొట్టబడి పగిలిన శిరస్సు గలవాడై నేలపై బడెను. ఆతని తలనుండి చాలా రక్తము స్రవించెను (50). వీరభద్రుడు నేల గూలుటను గాంచి రుద్రగణములు భయముతో ఆక్రోశిస్తూ యుద్ధమును వీడి మహేశ్వరుని వద్దకు పరుగెత్తిరి (51). అపుడు చంద్రశేఖరుడు గణముల కోలాహలమును విని తన ప్రక్కన నిలబడియున్న వీరులగు గణనాయకులను ప్రశ్నించెను (52).

శంకర ఉవాచ ।

కిమర్థం మద్గణానాం హి మహాకోలాహలోఽభవత్ ।
విచార్యతాం మహావీరాశ్శాంతిః కార్యా మయా ధ్రువమ్ ॥
యావత్స ఇతి దేవేశో గణాన్ పప్రచ్ఛ సాదరమ్ ।
తావద్గణవరాస్తే హి సమాయాతాః ప్రభుం ప్రతి ॥
తాన్ దృష్ట్వా వికలాన్ రుద్రః పప్రచ్ఛ కుశలం ప్రభుః ।
యథావత్తే గణా వృత్తం సమాచఖ్యుశ్చ విస్తరాత్ ॥
తచ్ఛ్రుత్వా భగవాన్ రుద్రో మహాలీలాకరః ప్రభుః ।
అభయం దత్త వాంస్తేభ్యో మహోత్సాహం ప్రవర్ధయన్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే విశేషయుద్ధ
వర్ణనం నామ ఏక వింశతితమోఽధ్యాయః ॥

శంకరుడిట్లు పలికెను —

నా గణములలో పెద్ద కోలాహలము చెలరేగుచున్నది. కారణమేమి? మహావీ◌ీరులారా! పరిశీలించుడు. నేను నిశ్చయముగా ఈ కోలాహలమును శాంతింప జేయవలెను (53). ఆ దేవదేవుడు ఈ తీరున సాదరముగా గణాధ్యక్షులను ప్రశ్నించుచునంతలో, ఆ గణములు ప్రభువు సమీపమునకు వచ్చిరి (54). దుఃఖితులై యున్న వారిని గాంచి రుద్రప్రభుడు 'కుశలమేనా?' యని ప్రశ్నించెను. ఆ గణములు జరిగిన వృత్తాంతమును యథా తథముగా విస్తరముగా చెప్పిరి (55). గొప్ప లీలలను చేయు భగవాన్ రుద్రప్రభుడు ఆ వృత్తాంతమును విని వారికి అభయమునిచ్చి వారిలో గొప్ప ఉత్సాహము వర్ధిల్లు నట్లు చేసెను (56).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో విశేష యుద్ధవర్ణమనే ఇరువది ఒకటవ అధ్యాయము ముగిసినది (21).

22 - శివజలంధరుల యుద్ధము

సనత్కుమార ఉవాచ ।

అథ వీరగణై రుద్రో రౌద్రరూపో మహాప్రభుః ।
అభ్యగాద్వృషభారూఢ స్సంగ్రామం ప్రహసన్నివ ॥
రుద్రమాయాంత మాలోక్య సింహనాదైర్గణాః పునః ।
నివృత్తాస్సంగరే రౌద్రా యే హి పూర్వం పరాజితాః ॥
వీరశబ్దం చ కుర్వంతస్తే ఒప్యన్యే శాంకరా గణాః ।
సోత్సవాస్సాయుధా దైత్యాన్ని జఘ్నుశ్శర వృష్టిభిః ॥
దైత్యా హి భీషణం రుద్రం సర్వే దృష్ట్వా విదుద్రువుః ।
శాంకరం పురుషం దృష్ట్వా పాతకానీవ తద్భయాత్ ॥
అథో జలంధరో దైత్యాన్ని వృత్తాన్ ప్రేక్ష్య సంగరే ।
అభ్యధావత్స చండీశం ముంచన్ బాణాన్ సహస్రశః ॥
నిశుంభ శుంభ ప్రముఖా దైత్యేంద్రాశ్చ సహస్రశః ।
అభిజగ్ముశ్శివం వేగా ద్రోషా త్సందష్ట దచ్ఛదాః ॥
కాలనేమిస్తథా వీరః ఖడ్గరోమా బలాహకః ।
ఘస్మరశ్చ ప్రచండశ్చాపరే చాపి శివం యయుః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు మహా ప్రభుడగు రుద్రుడు రౌద్రరూపమును దాల్చి వృషభము నధిష్ఠించి వీరులగు గణములతో గూడి చిరునవ్వుతో యుద్ధరంగమునకు వెళ్లెను (1). రుద్రుడు వచ్చుచుండుటను గాంచి పూర్వము పరాజయమును పొంది యున్న గణములు సింహనాదములను చేయుచూ భయంకరాకారులై యుద్ధరంగమునకు మరలి వచ్చిరి (2). వారు మరియు ఇతర శంకరగణములు ఉత్సాహముతో వీరశబ్దములను చేయుచూ ఆయుధములన దాల్చి రాక్షసులను బాణవర్షములతో ముంచెత్తిరి (3). శివభక్తునకు భయపడి పాపములు పారిపోవు విధముగా, రాక్షసులందరు భయంకరాకారకుడగు రుద్రుని చూచి పరుగులెత్తిరి (4). అప్పుడు యుద్ధరంగము నుండి వెనుదిరిగి రాక్షసులని గాంచి జలంధరుడు చండీశుడగు శివునిపై వేలాది బాణములను ప్రయోగిస్తూ ముందునకు ఉరికెను (5). నిశుంభ శుంభాది ప్రముఖులకు రాక్షసవీరులు కూడ వేలసంఖ్యలో శివునిపై వేగముగా విరుచుకుపడిరి. వారు కోపముతో పెదవులను కొరుకుచుండిరి. అదే విధముగా వీరుడగు కాలనేమి, ఖడ్గరోముడు, బలాహకుడు. ఘస్మరుడు, ప్రచండుడు మరియు ఇతరులు కూడా శివునికై వెళ్లిరి.

బాణైస్సంఛాదయామాసుద్భుతం రుద్రగణాంశ్చతే ।
అంగాని చిచ్ఛిదుర్వీరాః శుంభాద్యా నిఖిలా మునే ॥
భాణాంధకార సంఛన్నం దృష్ట్వా గణబలం హరః ।
తద్భూత జాలమాచ్ఛిద్య బాణైరానవృతే నభః ॥
దైత్యాంచ భాణవాత్యాభిః పీడితానకరోత్తదా ।
ప్రచండ బాణజాలౌఘై రపాతయత భూతలే ॥
ఖడ్గరోమశిరః కాయాత్తథా పరశునాచ్ఛినత్ ।
బలావాకస్య చ శర ర్వాంగేనా కరోద్విదా ॥
స బద్ధ్వా ఘస్మరం దైత్యం పాశేనాభ్యహనద్భువి ।
మహావీరప్రచండం చ చకర్త త్రిశిఖేన హ ॥
వృషభేణ హతాః కేచిత్కే చిద్బాణైర్ని పాతితాః ।
న శేకురాసురాస్స్థాతుం గజాస్సింహ్మార్దితా ఇవ ॥
తతః క్రోధపరీతాత్మా దైత్యాన్ ధిక్ కృతవాన రణే ।
శుంబాదికాన్ మహాదైత్యః ప్రహసన్ ప్రాహ ధైర్యవాన్ ॥

ఓ మునీ! శుంభుడు మొదలగు ఆ వీరులు అందరు రుద్రగణములను బాణములతో కప్పివేసి వారి అవయవములను ఛేదించిన (8). గణసైన్యము బాణపరంపరల చీకటిచే కప్పవేయబడి యుండుటను ఉంచి శివుడు ఆ బాణసమూహములను చీల్చి తన బాణములచే ఆకాశమును నింపివేసెను (9). ఆయన బాణములు తుఫానులచే రాక్షసులను దుఃఖింపచేసెను. మరియు భయంకరమగు బాణములను గుప్పించి వారిని నేల గూల్చెను (10). మరియు ఖడ్గరోముని శిరస్సును పరశువుతో నరికి దేహమునుండి వేరు చేసెను. మరియు ఖట్వాంగముతో బలాహకుని శిరస్సును రెండు ముక్కలుగా చేసెను (11). ఆయన ఘస్మరాసురుని పాశముతో బంధించి నేల గూల్చెను. మహావీరుడగు ప్రచుండుని త్రిశూలముతో నరికివేసెను (12). వృషభము కొందరిని సంహరించగా, మరి కొందరు బాణములచే సంహరింపబడిరి, సిమ్హములచే పీడింపబడిన ఏనుగులు వలె ఆ రాక్షసులు అచట నిలబడలేక పోయిరి (13). అప్పుడు ధైర్యశాలి, మహారాక్షసుడు అగు జలంధరుడు క్రోధముతో నిండిన మనస్సు గలవాడై శుంభాది రాక్షసులను ఆ యుద్ధము. నిందించి ఇట్లు పలికెను (14).

జలంధర ఉవాచ ।

కిం వ ఉచ్చరితైర్మాతుర్ధావద్భిః పృష్ఠతో హతైః ।
నహి భీతవధశ్లాఘ్యః స్వర్గదశ్శూరమా వినాం ॥
యది వః ప్రధనే శ్రద్ధా సారో హృది ।
అగ్రే తిష్ఠత మాత్రం మే న చేద్ధామ్యసుఖే స్పృహా ॥
రణే మృత్యుర్వరశ్చాస్తి సర్వకామ ఫలప్రదశ ।
యశః ప్రదో విశేషేణ మోక్షదోఽపి ప్రకీర్తితః ॥
సూర్యస్య మండలం భిత్త్వా యాయాద్వై పరమం పదం ।
పరివ్రాట్ పరమజ్ఞానీ రణే యస్సమ్ముఖే హతః ॥
మృత్యోర్భయం న కర్తవ్యం కదాచిత్కుత్రచిద్బుధైః ।
అనివార్యో యతో హ్యేష ఉపాయైర్నిఖిలైరపి ॥
మృత్యుర్జన్మవతాం వీరా దేహేన సహ జాయతే ।
అద్య వాబ్దశతాంతే వా మృత్యుర్వై ప్రాణినాం ధ్రువః ॥
తన్మృత్యు భయముత్సార్య యుధ్యధ్వం సమరే ముదా ।
సర్వథా పరమానంద ఇహాముత్రాప్య సంశయః ॥

జలంధరుడిట్లు పలికెను –

శత్రువులచే పృష్ఠ భాగమునందు కొట్టబడుతూ పారిపోయే మీరు మాతృవంశమును గూర్చి గొప్పలను చెప్పి ఫలమేమున్నది? మేము శూరులమని భావించు వారలు భయపడి పారిపోతూ వధింపబడుట కొని యాడదగినది కాదు; స్వర్గమును ఈయబోదు (15). ఓ అల్పులారా! మీకు యుద్ధమునందు శ్రద్ధ ఉన్నచో, హృదయములో దార్ఢ్యము ఉన్నచో, తుచ్ఛసుఖముల యందు తృష్ణలేని వారైనచో, కేవలము నా ఎదుట నిలబడుడు (16). యుద్ధములో మరణించుట శ్రేష్ఠము. ఆ మరణము కోర్కెలనన్నిటినీ ఈడేర్చును. సర్వఫలములను, కీర్తిని, మరియు విశేషించి మోక్షమును కూడా ఇచ్చునని మహర్షులచే కీర్తింపబడినది (17). మహాజ్ఞాని యగు సన్న్యాసి, యుద్ధములో శత్రువును ఎదుర్కొని మరణించు వాడు సూర్యమండలమును దాటి పరమపదము (మోక్షము) ను పొందుట నిశ్చయము (18). బుద్ధిమంతులు ఎప్పుడైననూ, ఎక్కడనైననూ మృత్యువునకు భయపడరాదు. ఏలయన, సర్వ ఉపాయములచేతనైననూ మృత్యువునుండి తప్పించుకొనుట సంభవము కాదు (19). ఓ వీరులారా! పుట్టిన ప్రాణులకు దేహముతో బాటు మృత్యువు కూడ పుట్టుచున్నది. ఈ నాడు గాని, లేదా వందసంవత్సరముల తరువాతనైననూ ప్రాణులు మరణించుట నిశ్చయము (20). కావున మృత్యు భయమును పారద్రోలి,ఆనందముతో యుద్ధములో పాల్గొనుడు. అట్లు చేయుట వలన ఇహపరములలో అన్ని విధములుగా పరమానందము లభించుననుటలో సందేహములేదు (21).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా బోధయామాస స్వవీరాన్ బహుశస్స హి ।
ధైర్యం దధుర్న తే భీతా పలాయంత రణాద్ద్రుతమ్ ॥
అథ దృష్ట్వా స్వసైన్యం తత్ పలాయన పరాయణమ్ ।
చుక్రోధాతి మహావీరస్సింధుపుత్రో జలంధరః ॥
తతః క్రోధపరీతాత్మా క్రోధాద్రుద్రం జలంధరః ।
ఆహ్వాపయామాస రణే తీవ్రాశని సమస్వనః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆతడిట్లు పలికి తన వీరులకు పరిపరి విధముల బోధించిననూ, వారు ధైర్యమును పట్టజాలక భయపడి యుద్ధమునుండి శీఘ్రముగా పారిపోయిరి (22). అపుడు మహావీరుడు, సముద్రపుత్రుడునగు జలంధరుడు తన సైన్యము పలాయనమును చిత్తగించు చుండుటను గాంచి మిక్కిలి కోపమును పొందెను (23). అపుడు క్రోధముతో నిండిన హృదయముగల జలంధరుడు భయంకరమగు పిడుగును బోలిన ధ్వనితో రుద్రుని యుద్ధమునకు ఆహ్వానించెను (24).

జలంధర ఉవాచ ।

యుధ్యస్వాద్య మయా సార్ధం కిమేభిర్నిహతైస్తవ ।
యచ్చ కించిద్బలం తేఽస్తి తద్దర్శయ జటాధర ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓ జటాధారీ! ఇపుడు నీవు నాతో యుద్ధమును చేయుము. వీరిని సంహరించుట వలన నీకు లాభమేమి? నీకు గల కొద్ది పాటి బలమును నాకు చూపించుము (25).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా బాణసప్తత్యా జఘాన వృషభధ్వజమ్ ।
జలంధరో మహాదైత్యశ్శంభుమక్లిష్ట కారిణమ్ ॥
తానప్రాప్తాన్మ హాదేవో జలంధరశరాన్ ద్రుతమ్ ।
నిజైర్బా నిశితైర్బాణైశ్చిచ్ఛేద ప్రహసన్నివ ॥
తతో హయాన్ ధ్వజం ఛత్రం ధనుశ్చిచ్ఛేద సప్తభిః ।
జలంధరస్య దైత్యస్య న తచ్చిత్రం హరే మునే ॥
సచ్ఛిన్న ధన్వా విరథః పాథోధితనయోఽ సురః ।
అభ్యధావచ్ఛివం క్రుద్ధో గదాముద్యమ్య వేగవాన్ ॥
ప్రభుర్గదాం చ తత్క్షిప్తాం సహసైవ మహేశ్వరః ।
పారాశర్య మహాలీలో ద్రుతం బాణైర్ద్విధాకరోత్ ॥
తథాపి ముష్టిముద్యమ్య మహాక్రుద్ధో మహాసురః ।
అభ్యుద్యయౌ మహావేగా ద్రుతం తం తజ్జిఘాంసయా ॥
తావదేవేశ్వరేణాశు బాణౌఘైస్స జలంధరః ।
అక్లిష్ట కర్మకారేణ క్రోశమాత్ర మపాకృతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

మహారాక్షసుడగు జలంధరుడిట్లు పలికి, సర్వకార్యములను తేలికగా చేయువాడు, వృషభధ్వజుడు అగు శంభుని డెబ్బది బాణములతో కొట్టెను (26). మహాదేవుడు జలంధరుని ఆ బాణములను తన వద్దకు చేరకమునుపే చిరునవ్వుతో వేగముగా తన వాడి బాణములతో ఛేదించెను (27). తరువాత ఆయన ఏడు బాణములతో జలంధరాసురుని గుర్రములను, ధ్వజమును, గొడుగును, ధనస్సును ఛేదించెను. ఓ మునీ! శివుడిట్లు చేయుటలో ఆశ్చర్యము లేదు (28). సముద్రతనయుడగు ఆ రాక్షసుడు విరిగిన ధనస్సు, రథము గలవాడై గదను చేతబట్టి కోపముతో వేగముగా శివునిపైకి ఉరికెను (29). ఓ వ్యాసా! గొప్ప లీలలను చూపే . ఆ మహేశ్వరప్రభుడు తన పైకి విసరబడిన ఆ గదను వెంటనే బాణములతో రెండు ముక్కలుగా చేసెను (30). అయిననూ ఆ మహాసురుడు మహాక్రోధముతో పిడికిలిని బిగించి శివుని కొట్టవలెననే సంకల్పము గలవాడై మహావేగముతో వెంటనే ఆయన పైకి ఉరికెను (31). ఇంతలోనే, తేలికగా సర్వకార్యములను నిర్వహించు ఈశ్వరుడు వెంటనే జలంధరునిపై బాణములను గుప్పించి రెండుమైళ్ల దూరమువరకు నెట్టివేసెను (32).

తతో జలంధరో దైత్యో రుద్రం మత్వా బలాధికమ్ ।
ససర్జ మాయాం గాంధర్వీమద్భుతాం రుద్రమోహినీమ్॥
తస్య మయా ప్రభావాత్తు గంధర్వాప్సరసాం గణాః ।
ఆవిర్భూతా అనేకే చ రుద్రమోహన హేతవే ॥
తతో జగుశ్చ సనృతుర్గంధర్వాప్సరసాం గణాః ।
తాలవేణు మృదంగాంశ్చ వాదయంతి స్మ చాపరే ॥
తద్దృష్ట్వా మహదాశ్చర్యం గణై రుద్రో విమోహితః ।
పతితాన్యపి శస్త్రాణి కరేభ్యో న వివేద సః ॥
ఏకాగ్రీభూతమాలోక్య రుద్రం దైత్యో జలంధరః ।
కామతస్తు జగామాశు యత్ర గౌరీ స్థితాఽ భవత్ ॥
యుద్ధే శుంభనిశుంభాఖ్యౌ స్థాపయిత్వా మహాబలౌ ।
దశదోర్దండ పంచాస్యస్త్రి నేత్రశ్చ జటాధరః ॥
మహావృషభమారూఢస్సర్వథా రుద్రసంనిభః ।
ఆసుర్యా మాయయా వ్యాస స బభూవ జలంధరః ॥

అపుడు జలంధరాసురుడు బలములో రుద్రుడు అధికుడని గ్రహించి రుద్రుని మోహిం◌ంపజేసే అద్భుతమగు గాంధర్వమాయను సృష్టించెను (33). వాని మాయా ప్రభావముచే అనేకములగు గంధర్వ-అప్సరసల గణములు రుద్రుని మోహింప జేయుట కొరకై ఆవిర్భవించినవి (34). అపుడు గంధర్వ- అప్సరసల గణములు గానమును, నాట్యమును చేసిరి. మరి కొందరు తాళములను, వేణువులను, మృదంగములను వాదనము చేసిరి (35). ఆ గణములు చూపించిన ఆ మహాశ్చర్యమును గాంచి రుద్రుడు మోహమును పొందెను. ఆయన చేతులనుండి ఆయుధములు జారినను, ఆయన ఎరుంగలేక పోయెను (36). రుద్రుడు ఏకాగ్రతతో వారిని చూచుచుండగా గాంచిన జలంధరాసురుడు మాయావేషముతో వెంటనే గౌరీదేవి ఉన్నచోటకు వెళ్లెను (37). ఆతడు యుద్ధములో మహాబలశాలురగు, శుంభ నిశుంభులను వారిని నిలబెట్టెను. పది చేతులు అయిదు ముఖములు, మూడు కన్నులు, జటలు గలవాడై (38) గొప్ప వృషభమున దిష్ఠించి అన్ని విధములుగా రుద్రుని పోలియున్న వాడై ఆ జలంధరుడు అచటకు వెళ్లెను. ఓ వ్యాసా! రాక్షసమాయచే జలంధరుడు అట్లు కాగల్గెను (39).

అథ రుద్రం సమాయాంత మాలోక్య భవవల్లభా ।
అభ్యాయయౌ సఖీ మధ్యాత్తద్దర్శన పథేఽ భవత్ ॥
యావద్దదర్శ చార్వంగీం పార్వతీం దనుజేశ్వరః ।
తావత్స వీర్యం ముముచే జడాంగశ్చా భవత్తదా ॥
అథ జ్ఞాత్వా తదా గౌరీ దానవం భయవిహ్వలా ।
జగామాంతర్హితా వేగాత్సా తదోత్తరమానసమ్ ॥
తామదృశ్య తతో దైత్యః క్షణాద్విద్యుల్లతామివ ।
జవేనా గాత్పునర్యోద్ధుం యత్ర దేవో మహేశ్వరః ॥
పార్వత్యపి మహావిష్ణుం సస్మార మనసా తదా ।
తావద్దదర్శ తం దేవం సోపవిష్టం సమీపగమ్ ॥
తం దృష్ట్వా పార్వతీ విష్ణుం జగన్మాతా శివప్రియా ।
ప్రసన్నమనసోవాచ ప్రణమంతం కృతాంజలిమ్ ॥

అపుడు భవాని రుద్రుడు వచ్చుచుండుటను గాంచి సఖురాండ్ర మధ్యనుండి లేచి ఎదురేగెను. ఆమె ఆయన దృష్టి ప్రసరించు స్థలమునకు వచ్చియుండెను (40). ఆ రాక్షసేశ్వరుడు సుందరియగు పార్వతిని చూచెను. వెంటనే ఆతని అవయవములు శక్తిని గోల్పోవుటచే అతడు జడునివలె ఆయెను (41). అపుడా గౌరీదేవి రాక్షసుని గుర్తుపట్టి భయముతో కంగారుపడి అంతర్ధానము చెంది వేగముగా మానస సరస్సు యొక్క ఉత్తరతీరమునకు వెళ్లెను (42). ఆ రాక్షసుడు మెరుపుతీగవలె క్షణములో అంతర్హితురాలైన పార్వతిని గాంచలేక, వెంటనే మరల యుద్ధమును చేయుటకొరకై మహేశ్వరుడు వున్న స్థానమునకు వెళ్లెను (43). అపుడు పార్వతి మనస్సులో మహావిష్ణువును స్మరించెను. వెంటనే ఆమె తన సమీపములో కూర్చుండి యున్న విష్ణుదేవుని గాంచెను (44). జగన్మాత, శివునకు ప్రియురాలు అగు పార్వతి, చేతులు జోడించి నమస్కరించుచున్న ఆ విష్ణువును గాంచి ప్రసన్నమగు మనస్సుతో నిట్లనెను

పార్వత్యువాచ ।

విష్ణో జలంధరో దైత్యః కృతవాన్ పరమాద్భుతమ్ ।
తత్కిం న విదితం తేఽస్తి చేష్టితం తస్య దుర్మతేః ॥
తచ్ఛ్రుత్వా జగదంబాయా వచనం గరుడధ్వజః ।
ప్రత్యువాచ శివాం నత్వా సాంజలిర్నమ్రకంధరః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ విష్ణూ! జలంధరాసురుడు గొప్ప అద్భుతమును చేసియున్నాడు. ఆ దుష్టుని వ్యవహారము నీకు తెలియదా యేమి? (45) గరుడధ్వజుడగు విష్ణువు జగన్మాత, శివుని ప్రియురాలు అగు ఆమె యొక్క ఆ మాటను విని చేతులు జోడించి తలవంచి నమస్కరించి ఇట్లు బదులిడెను (47).

శ్రీ భగవానువాచ ।

భవత్యాః కృపయా దేవి తద్వృత్తం విదితం మయా ।
యదాజ్ఞాపయ మాం మాతః తత్కుర్యాం త్వదనుజ్ఞయా ॥

శ్రీ భగవానుడిట్లు పలికెను —

ఓ దేవీ! నీ దయచే ఆ వృత్తాంతము నాకు తెలిసినదియే. ఓ తల్లీ! నీవు నాకు ఏ ఆజ్ఞను ఇచ్చిననూ, నేను దానిని నీ అనుమతితో చేసెదను (48).

సనత్కుమార ఉవాచ ।

తచ్ఛ్రుత్వా విష్ణువచనం పునరప్యాహ పార్వతీ ।
హృషీకేశం జగన్మాతా ధర్మనీతిం సుశిక్షయన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

జగన్మాతయగు పార్వతికి ఇంద్రియములకు అధిపతియగు ఆ విష్ణువు యొక్క ఆ మాటను(ు విని అతనికి ధర్మమును, నీతిని నేర్పుచున్నదై మరల ఇట్లు పలికెను (49).

పార్వత్యువాచ ।

తేనైవ దర్శితః పంథా బుధ్యస్వ త్వం తథైవ హి ।
తత్స్త్రీ పాతివ్రతం ధర్మం భ్రష్టం కురు మదాజ్ఞయా ॥
నాన్యథా స మహాదైత్యో భవేద్వధ్యో రమేశ్వర ।
పాతివ్రతసమో నాన్యో ధర్మోఽ స్తి పృథివీతలే ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఆతడు స్వయముగా దారిని చూపించినాడు. నీవు ఆ విషయమును అటులనే గ్రహించుము(ు. నా ఆజ్ఞచే అతని భార్య యొక్క పాతివ్రత్య ధర్మమును భ్రష్టమొనర్చుము. ఓ లక్ష్మీ పతీ! ఆ మహారాక్షసుని వధించుటకు మరియొక ఉపాయములేదు. ఈ భూ మండలములో పాతివ్రత్యముతో సమానమగు ధర్మము మరియొకటి లేదు (57).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యనుజ్ఞాం సమాకర్ణ్య శిరసాధాయ తాం హరిః ।
ఛలం కర్తుం జగామాశు పునర్జాలంధరం పురం ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
జలంధరయుద్ధ వర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను-

విష్ణువు ఈ విధముగా ఆమె ఆజ్ఞను విని శిరసా స్వీకరించి కపటమును చేయుటకై వెంటనే జలంధరుని నగరమునకు మరల వెళ్లెను (52).

23 - పాతివ్రత్య భంగము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ వద త్వం వదతాం వర ।
కిమకార్షీద్ధరిస్తత్ర ధర్మం తత్యాజ సాకథమ్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! నీవు వక్తలలో శ్రేష్ఠుడవు. అచట విష్ణువు ఏమి చేసెను? ఆమె ధర్మమునెట్లు విడిచిపెట్టెను? చెప్పుము

సనత్కుమార ఉవాచ।

విష్ణుర్జాలంధరం గత్వా దైత్యస్య పురభేదనమ్ ।
పాతివ్రత్యస్య భంగాయ బృందాయాశ్చ కరోన్మతిమ్ ॥
బృందాం స దర్శయామాస స్వప్నం మాయావినాం వరః ।
స్వయం తన్నగరో ద్యానమాస్థితోఽ ద్భుత విగ్రహః ॥
అథ బృందా తదా దేవీ తత్పత్నీ నిశి సువ్రతా ।
హరేర్మాయా ప్రభావాత్తు దుస్స్వప్నం సా దదర్శ హ ॥
స్వప్న మధ్యే హి సా విష్ణుమాయయా ప్రదదర్శ హ ।
భర్తారం మహిషారూఢం తైలాభ్యక్తం దిగంబరమ్ ॥
కృష్ణ ప్రసూనభూషాఢ్యం క్రవ్యాద గణసేవితమ్ ।
దక్షిణాశాం గతం ముండం తమసా చ వృతం తదా ॥
స్వపురం సాగరే మగ్నం సహసై వాత్మనా సహ ।
ఇత్యాది బహుదుస్స్వప్నాన్ని శాంతే సా దదర్శ హ ॥
తతః ప్ర బుధ్య సా బాలా తం స్వప్నం స్వం సచిన్వతీ ।
దదర్శోదితమాదిత్యం సచ్ఛిద్రం నిః ప్రభం ముహుః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

విష్ణువు జలంధరాసురుని పురములో ప్రవేశించి బృందయొక్క పాతివ్రత్యమును చెడగొట్టుటకు నిశ్చయించెను (2). మాయవులలో శ్రేష్ఠుడగు శ్రీ విష్ణువు అద్భుతమగు రూపమును దాల్చి ఆ నగరము యొక్క ఉద్యానవనములో స్వయముగా మకాముచేసి బృంద ఒక స్వప్నమును గనునట్లు చేసెను (3). అపుడు జలంధరుని భార్య, గొప్ప వ్రతము గలది అగు ఆ బృందా దేవి విష్ణువు యొక్క మాయా ప్రభావముచే రాత్రియందు చెడుకలను గనెను (4). ఆమె విష్ణుమాయచే స్వప్న మధ్యములో దున్నను ఆరోహించిన వాడు, నూనె రాసుకొని దిగంబరముగ నున్న వాడు. నల్లని పుష్పములను అలంకారముగా ధరించి యున్నవాడు, రాక్షసగణములచే సేవింపబడు చున్నవాడు, తల గొరిగించుకొని దక్షిణ దిక్కునకు వెళ్లుచున్నవాడు, ఆ సమయములో చీకటిచే ఆవరింపబడినవాడు అగు తన

భర్తను గాంచెను (5,6). ఆ నగరము తనతో సహా సముద్రములో మునిగి పోయినట్లు వెంటనే ఆ కలలో ఆమెకు కన్పట్టెను. ఆమె తెల్లవారు సమయములో ఇట్టి అనేక దుస్స్వప్నములను గాంచేను (7). ఆ అమాయకురాలు అప్పుడు నిద్రలేచి ఆ కలను గురించి తలపోయుచుండగనే ఉదయించుచున్న సూర్యుని గాంచెను. ఆ సూర్యమండలములో మధ్యలో ఛిద్రము కొనవచ్చెను. మరియు సూర్యుడు అనేక పర్యాయములు వెలవెల బోవుచుండెను (8).

తదనిష్టమిదం జ్ఞాత్వా రుదంతీ భయవిహ్వలా ।
కుత్రచిన్నాప సా శర్మ గోపురాట్టాల భూమిషు ॥
తతస్సఖీద్వయయుతా నగరోద్యాన మాగమత్ ।
తత్రాపి సా గతా బాలా న ప్రాప కుత్ర చిత్సుఖమ్ ॥
తతో జలంధరస్త్రీ సా నిర్విణ్ణో ద్విగ్న మానసా ।
వనాద్వనాంతరం యాతా నైవ వేదాత్మనా తదా ॥
భ్రమతీ సా తతో బాలా దదర్శాతీవ భీషణౌ ।
రాక్షసౌ సింహవదనౌ దృష్ట్వా దశనభాసురౌ ॥
తౌ దృష్ట్వా విహ్వలా తీవ పలాయన పరా తదా ।
దదర్శ తాపసం శాంతం సశిష్యం మౌనమాస్థితమ్ ॥
తతస్తత్కంఠనూ సాద్య నిజాం బాహులతాం భయాత్ ।
మునే మాం రక్ష శరణమాగతాస్మీత్య భాషత ॥
మునిస్తాం విహ్వలాం దృష్ట్వా రాక్షసాను గతాం తదా ।
హుంకారేణైవ తౌ ఘోరౌ చకార విముఖౌ ద్రుతమ్ ॥
తద్ధుంకార భయత్రస్తౌ దృష్ట్వా తౌ విముఖౌ గతౌ ।
విస్మితా తీవ దైత్యేంద్రపత్నీ సాభూన్మునే హృది ॥
తతస్సా మునినాథం తం భయాన్ముక్తా కృతాంజలిః ।
ప్రణమ్య దండ వద్భూమౌ బృందా వచనమబ్రవీత్ ॥

అది చెడు శకునమని గుర్తించి ఆమె భయభీతురాలై ఏడుస్తూ గోపురములయందు, ప్రాసాద ఉపరి- భాగమునందు, మరియు ఇతర స్థలములలో ఎక్కడైననూ సుఖమును పొందలేకపోయెను (9). అపుడా యువతి ఇద్దరు సఖురాండ్రతో గూడి నగరోద్యానవనమునకు వచ్చెను. ఆమె అక్కడ విహరించియు ఏ స్థలమునందైననూ సుఖమును పొందలేదు (10). అపుడా జలంధరుని భార్య నిరాశతో ఉద్వేగముతో నిండిన మనస్సు గలదై తనకు తెలియకుండగనే ఆ వనములో ఒక భాగమునుండి మరియొక భాగమునకు తిరుగజొచ్చెను (11). అట్లు తిరుగాడుచున్న ఆ సుందరి అతి భయంకరాకారులు, సింహముఖము గలవారు, కోరలతో ప్రకాశించువారు అగు ఇద్దరు రాక్షసులను చూచెను (12). ఆమె వారిని చూచి చాల భయపడి పారిపోతూ, శిష్యులతో గూడి శాంతముగా మౌనముగా

కూర్చుండియున్న తపస్విని ఒకనిని గాంచెను (13). ఆమె భయముతో తన లతవంటి బాహువును అతని కంఠము చుట్టూ వేసి 'ఓ మునీ! నిన్ను శరణు పొందినాను; నన్ను రక్షింపుము' అని పలికెను (14). రాక్షసులచే తరుమబడి మిక్కిలి భయపడియున్న ఆమెను గాంచి అపుడా ముని వెంటనే హుంకారమాత్రముచే ఆ భయంకర రాక్షసులు పారిపోవునట్లు చేసెను (15). వారిద్దరు అతని హుంకారమునకు భయపడి వెనుకకు మరలుటను గాంచి ఆ జలంధరపత్ని మనస్సులో మిక్కిలి ఆశ్చర్యమును పొందెను. ఓ మునీ! (16) అపుడా బృంద తొలగిన భయము గలదై ఆ ముని వర్యునకు సాష్టాంగ ప్రణామమాచరించి చేతులు జోడించి ఇట్లు పలికెను (17).

బృందోవాచ ।

మునినాథ దయాసింధో పరపీడా నివారక ।
రక్షితాహం త్వయా ఘోరాద్భయాదస్మాత్ఖలోద్భవాత్ ॥
సమర్థస్సర్వథా త్వం హి సర్వజ్ఞోఽపి కృపానిధే ।
కించిద్విజ్ఞప్తుమిచ్ఛామి కృపయా తన్నిశామయ ॥
జలంధరో హి మద్భర్తా రుద్రం యోద్ధుం గతః ప్రభో ।
స తత్రాస్తే కథం యుద్ధే తన్మే కథయ సువ్రత ॥

బృంద ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! దయాసముద్రా! ఇతరుల దుఃఖమును పోగొట్టు వాడా! ఈ దుష్టులు కలిగించిన ఘోర భయమునుండి నీవు నన్ను రక్షించితివి (18). ఓ దయా నిధీ! నీవు అన్ని విధములుగా సమర్థుడవు; సర్వజ్ఞుడవు. నేను నీకు ఒక విన్నపమును చేసెదను. దయతో వినుము (19). ఓ ప్రభూ! నా భర్తయగు జలంధరుడు రుద్రునితో యుద్ధమును చేయుటకు వెళ్లినాడు. ఓ గొప్ప వ్రతము గలవాడా! ఆతడు అచట యుద్ధములో ఎట్లు ఉన్నాడో నాకు చెప్పుము (20).

సనత్కుమార ఉవాచ ।

మునిస్తద్వాక్యమాకర్ణ్య మౌనం కపటమాస్థితః ।
కర్తుం స్వార్థం విధానజ్ఞః కృపయోర్ధ్వ మవైక్షత ॥
తావత్కపీశావాయాతౌ తం ప్రణమ్యాగ్రతస్స్థితౌ ।
తతస్తద్భ్రూలతా సంజ్ఞా నియుక్తౌ గగనం గతౌ ॥
నీత్వా క్షణార్ధమాగత్య పునస్తస్యాగ్రత స్థ్సితౌ ।
తస్యైవ చ కబంధం చ హస్తావాసాం మునీశ్వర ॥
శిరః కబంధ హస్తౌ తౌ దృష్ట్వాబ్ధి తనయస్య సా ।
పపాత మూర్ఛితా భూమౌ భర్తృవ్యసన దుఃఖితా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ ముని ఆమె మాటలను విని కపట మౌనమును దాల్చెను. తన స్వార్థమును సా◌ాధించే ఉపాయములలో దిట్టయగు ఆతడు దయతో పైకి చూచెను (21). వెంటనే రెండు గొప్ప కోతులు వచ్చి ఆతనికి నమస్కరించి ఎదుట నిలబడెను, అవి ఆతని కనుబొమల కదలిక ద్వారా ఈయబడిన ఆజ్ఞను స్వీకరించి ఆకసమునకు ఎగిరినవి (22). అవి అరక్షణకాలము గడిచిన తరువాత మరల వచ్చి ఆతని ఎదుట నిలబడెను. ఓ మహర్షీ! అవి జలంధరుని మొండెమును, తలను, చేతులను తీసుకొని వచ్చెను (23). సముద్రపుత్రుడగు జలంధరుని ఆ శిరస్సును, మొండెమును, చేతులను గాంచి ఆమె భర్త మరణముచే దుఃఖతురాలై మూర్ఛిల్లి నేలపై కూలబడెను (24).

బృందో వాచ।

యః పురా సుఖసంవాదైర్వినోదయసి మాం ప్రభో ।
స కథం న వదస్యద్య వల్లభాం మామనాగసమ్ ॥
యేన దేవాస్సగంధర్వా నిర్జితా విష్ణునా సహ ।
కథం స తాపసేనాద్య త్రైలోక్యవిజయీ హతః ॥
నాంగీకృతం హి మే వాక్యం రుద్రతత్త్వ మజానతా ।
పరం బ్రహ్మ శివశ్చేతి వదంత్యా దైత్యసత్తమ ॥
తతస్త్వం హి మయా జ్ఞాతస్తవ సేవా ప్రభావతః ।
గర్వితేన త్వయా నైవ కుసంగవశగేన హి ॥
ఇష్టం ప్రభాష్య బహుధా స్వధర్మస్థా చ తత్ప్రియా ।
విలలాప విచిత్రం సా హృదయేన విదూయతా ॥
తతస్సా ధైర్యమాలంబ్య దుఃఖోచ్ఛ్వాసాన్విముంచతీ ।
ఉవాచ మునివర్యం తం సుప్రణమ్య కృతాంజలిః ॥
కృపానిధే మునిశ్రేష్ఠ పరోపకరణాదర ।
మయి కృత్వా కృపాం సాధో జీవయైనం మమ ప్రభుమ్ ॥
యత్త్వమస్య పునశ్శక్తో జీవనాయ మతో మమ ।
అతస్సంజీవయైనం మే ప్రాణ నాథం మునీశ్వర ॥

బృంద ఇట్లు పలికెను -

ఓ ప్రభూ! పూర్వము నీవు సుఖకరమగు సల్లాపములతో నాకు వినోదమును కలిగించెడి◌ వాడవు. నిర్దోషిని, ప్రియురాలను ఈ అగు నాతో నీవు ఇప్పుడు ఏల మాటలాడుట లేదు? (25) దేవతలను, గంధర్వులను, విష్ణువును కూడ జయించిన, త్రిలోక విజేతయగు ఆ జలంధరుడు ఈ నాడు ఒక తాపసిచే ఎట్లు సంహరింపబడినాడు? (26) ఓ రాక్షసశ్రేష్ఠ! శివుడు పరబ్రహ్మయని నేను చెప్పితిని.

కాని రుద్రతత్త్వమునెరుంగని నీవు నామాటను అంగీకరించక పోతివి (27). నేను నిన్ను సేవించి దాని ప్రభావముచే నిన్ను బాగుగా తెలుసుకొనగల్గితిని. నీవు గర్విష్ఠివి కావు. కాని నీవు దుష్టుల సహవాసమునకు లోబడినావు (28). పాతివ్రత్య నిష్ఠురాలగు జలంధరుని భార్య కల్లోలితమైన హృదయముతో ఇట్లు పరిపరి విధముల పలికి బహుతెరంగుల రోదించెను (29). ఆపుడామె ధైర్యమును చేబట్టి, దుఃఖపూర్ణమగు ఉచ్ఛ్వాసలను విడుస్తూ ఆ మహర్షికి చేతులు జోడించి నమస్కరించి ఇట్లు పలికెను (30). ఓ దయానిధీ! మహర్షీ! పరోపకారపారీణా! సాధూ! నాపై దయను చూపి నా ఈ భర్తను బ్రతికించుము (31). ఓ మహర్షీ! వీనిని మరల బ్రతికించే శక్తి నీకు గలదని నేను తలంచుచున్నాను. కావున నా ఈ ప్రాణనాథుని మరల జీవింప చేయుము (32).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా దైత్యపత్నీ సా పాతివ్రత్యపరాయణా ।

పాదయోః పతితా తస్య దుఃఖశ్వాసాన్ విముంచతీ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

పాతివ్రత్య ధర్మమునందు పరమనిష్ఠ గల ఆ జలంధరుని భార్య ఇట్లు పలికి దుఃఖముతో నిండిన నిట్టూర్పులను విడచుచూ ఆతని పాదములపై పడెను (33).

మునిరువాచ ।

నాయం జీవయితుం శక్తో రుద్రేణ నిహతో యుధి ।

రుద్రేణ నిహతా యుద్ధే న జీవంతి కదాచన ॥

తథాపి కృపయావిష్ట ఏనం సంజీవయామ్యహమ్ ।

రక్ష్యాశ్శరణగాశ్చేతి జానన్ ధర్మం సనాతనమ్ ॥

ముని ఇట్లు పలికెను -

రుద్రునిచే యుద్ధమునందు సంహరింపబడిన ఈ జలంధరుని జీవింపజేయుట సంభవము కాదు. రుద్రునిచే యుద్ధమునందు సంహరింపబడిన వారు ఎన్నడైననూ జీవించరు (34). అయిననూ, శరణు జొచ్చిన వారిని రక్షించవలెననే సనాతన ధర్మమును ఎరింగియున్న నేను దయతో నిండిన హృదయము గలవాడనై ఈతనిని బ్రతికించెదను (35).

సనత్కుమార ఉవాచ।

ఇత్యుక్త్వా స మునిస్తస్యా జీవయిత్వా పతిం మునే ।
అంతర్దధే తతో విష్ణుస్సర్వమాయావినాం వరః ॥
ద్రుతం స జీవితస్తేనోత్థిత స్సాగరనందనః ।
బృందామాలింగ్య తద్వక్త్రం చుచుంబ ప్రీతమానసః ॥
అథ బృందాపి భర్తారం దృష్ట్వా హర్షితమానసా ।
జహౌ శోకం చ నిఖిలం స్వప్నవద్హృద్యమన్యత ॥
అథ ప్రసన్నహృదయా సా హి సంజాతహృచ్ఛయా ।
రేమే తద్వనమధ్యస్థా తద్యుక్తా బహువాసరాన్ ॥
కదా చిత్సురతస్యాంతే దృష్ట్వా విష్ణుం తమేవ హి ।
నిర్భర్త్స్య క్రోధసంయుక్తా బృందా వచనమబ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! మాయావులందరిలో అగ్రగణ్యుడగు విష్ణువు ఆ ముని రూపములో నున్న వాడై ఆమె భర్తను బ్రతికించి వెంటనే అంతర్హితుడాయెను (36). వానిచే జీవింపచేయబడి లేచి నిలబడిన ఆ సముద్రనందనుడు వెంటనే బృందను కౌగిలించుకొని ప్రీతితో నిండిన మనస్సు గలవాడై ఆమె ముఖమును ముద్దాడెను (37). అపుడ బృందకూడా భర్తను గాంచి ఆనందముతో నిండిన మనస్సు గలదై శోకమునంతనూ విడనాడెను. అమె తన మనస్సులో ఆ వృత్తాంతము ఒక స్వప్నము వంటిదని భావించెను (38). ప్రసన్నమగు హృదయముగల ఆమె మనస్సులో కోర్కెలు చెలరేగెను. ఆమె ఆతనితో గూడి ఆ వనమధ్యములోనున్నదై అనేక దినములు రమించెను (39). ఒకనాడు విహారము అయిన తరువాత ఆతడు విష్ణువు అని గుర్తించి బృంద క్రోధముతో కూడినదై ఆతనిని నిందిస్తూ ఇట్లు పలికెను (40).

బృందోవాచ ।

ధిక్ తదేవం హరే శీలం పరదారాభిగామినః ।
జ్ఞాతోఽసి త్వం మయా సమ్యక్ మాయీ ప్రత్యక్షతాపసః ॥

బృంద ఇట్లు పలికెను -

ఓయీ హరీ! పరభార్యను ఈ తీరున కాంక్షించే నీ శీలమునకు నిందయగు గా◌ాక! తాపసుని వేషములో కనబడిన మాయావివి నీవే నని నేను చక్కగా గుర్తు పట్టినాను (41).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా క్రోధమాపన్నా దర్శయంతీ స్వతేజసమ్ ।
శశాప కేశవం వ్యాస పాతివ్రత్యరతా చ సా ॥
రే మహాధమ దైత్యారే పరధర్మ విదూషక ।
గృహ్ణీష్వ శర మద్దత్తం శాపం సర్వవిషోల్బణమ్ ॥
యౌ త్వయా మాయయా ఖ్యాతౌ స్వకీయౌ దర్శితౌ మమ ।
తావేవ రాక్షసౌ భూత్వా తవ భార్యాం హరిష్యతః ॥
త్వం చాపి భార్యా దుఃఖార్తో వనే కపి సహాయవాన్ ।
భ్రమ సర్పేశ్వరేణాయం యస్తే శిష్యత్వమాగతః ॥
ఇత్యుక్త్వా సా తదా బృందా ప్రావిశద్ధవ్య వాహనమ్ ।
విష్ణునా హార్యమాణాపి తత్ స్మితా సక్త చేతసా ॥
తస్మిన్నవసగే దేవా బ్రహ్మాద్యా నిఖిలా మునే ।
ఆగతాః ఖే సమందారైస్సద్గతిం వై దిదృక్షవః ॥
అథ దైత్యేంద్రపత్న్యాస్తు తజ్జ్యోతిః పరమం మహత్ ।
పశ్యతాం సర్వదేవానామలోక మగమద్భుతమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! పాతివ్రత్య పరాయణురాలగు ఆమె ఇట్లు పలికి మిక్కిలి కోపమును పొందినదై తన తేజస్సును ప్రదర్శిస్తూ కేశవుని శపించెను (42). ఓరీ! అధమాధమా! దైత్యశత్రూ! పరుల ధర్మమును చెడగొట్టు వాడా! మాయావీ! నేను ఇచ్చే, విషము లన్నింటి కంటే తీక్ష్ణతరమైన శాపమును స్వీకరించుము (43). నీవు నీ అనుచరులనిద్దరిని మాయచే నా యెదుట ప్రవేశపెడితివి. వారిద్దరు రాక్షసులై నీ భార్యను అపహరించగలరు (44). నీవు భార్యావియోగదుఃఖ పీడితుడవై కోతుల సాహాయ్యమును పొంది అడవులలో తిరుగాడుము. నీ శిష్యుని వలె నటించిన ఈ శేషుడు నీకు తోడు కాగలడు (45). ఆమె యొక్క చిరునవ్వుమందు ఆసక్తి గల మనస్సుతో గూడిన విష్ణువు వారించుచున్ననూ లెక్క చేయకుండగా, ఆ బృంద అపుడు ఇట్లు పలికి, అగ్నిలో ప్రవేశించెను (46). ఓ మునీ! ఆ సమయములో బ్రహ్మాది దేవతలందరు భార్యలతో గూడి బృంద సద్గతిని పొందుటను చూడగోరి ఆకసము నందు వచ్చి యుండిరి (47). అపుడు జలంధరపత్ని యొక్క సర్వోత్కృష్టమైన ఆ మహాతేజస్సు దేవతలందరు చూచు చుండగా శీఘ్రముగా శివలోకమును చేరెను (48).

శివాతనౌ విలీనం తద్బృందాతేజో బభూవ హ ।
ఆసీజ్జయ జయరావః ఖస్థితా మరపంక్తిషు ॥
ఏవం బృందా మహారాజ్ఞీ కాలనేమి సుతోత్తమా ।
పాతివ్రత్య ప్రభావాచ్చ ముక్తిం ప్రాప పరాం మునే ॥
తతో హరిస్తామను సంస్మరన్ముహుర్బృందా చితా భస్మరజోవ గుంఠితః ।
తత్రైవ తస్థౌ సురసిద్ధ సంఘకైః ప్రబోధ్యమానోఽపి యయౌ న శాంతిమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే బృందా పాతివ్రత్య భంగవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥

ఆ బృంద యొక్క తేజస్సు పార్వతీదేవి యొక్క దేహములో కలిసి పోయెను◌ు. ఆకాశమునందున్న దేవతల వరుసలలో జయజయధ్వనులు చెలరేగెను (4 9). ఈ విధముగా మహారాణి, కాలనేమి కుమార్తె, ఉత్తమురాలు అగు బృంద పాతివ్రత్యమహిమచే పరమముక్తిని పొందెను. ఓ మునీ! (50) అపుడు విష్ణువు బృందయొక్క చితా భస్మను ముఖమునందు దాల్చి ఆమెను పలుపర్యాయములు స్మరిస్తూ అచటనే ఉండెను. దేవతా గణములు, సిద్ధగణములు బోధించిననూ ఆయన శాంతిని పొందలేదు (51).

శ్రీ శివమహాపురాణమునందలి రుద్రసంహితలోని యుద్ధఖండములో బృందాపాతివ్రత్య భంగవర్ణనమనే ఇరువది మూడవ అధ్యాయము ముగిసినది (23).

24 – జలంధర సంహారము

వ్యాస ఉవాచ ।

విధేశ్శ్రేష్ఠసుత ప్రాజ్ఞ కథేయం శ్రావితా ద్భుతా ।
తతశ్చ కిమభూదాజౌ కథం దైత్యో హతో వద ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓయీ ప్రాజ్ఞా! బ్రహ్మపుత్రులలో నీవు శ్రేష్ఠుడవు. అద్భుతమగు ఈ గాథను వినిపించితివి. ఆ తరువాత యుద్ధములో ఏమి ఆయెను? ఆ రాక్షసుడు ఎట్లు వధింపబడెను? చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ।

అదృశ్య గిరిజాం తత్ర దైత్యేంద్రే రణమాగతే ।
గాంధర్వే చ విలీనే హి చైతన్యోఽభూద్వృషధ్వజః ॥
అంతర్ధానగతాం మాయాం దృష్ట్వా బుద్ధో హి శంకరః ।
చుక్రోధాతీవ సంహారీ లౌకికీం గతిమాశ్రితః ॥
తతశ్శివో విస్మితమానసః పునః జగామ యుద్ధాయ జలంధరం రుషా ।
స చాపి దైత్యః పునరాగతం శివం దృష్ట్వా శరౌఘైస్సమవాకిరద్రణే ॥
క్షిప్తం ప్రభుస్తం శరజాలముగ్రం జలంధరేణాతి బలీయసా హరః ।
ద్రుతం ప్రచిచ్ఛేద శరైర్వరైర్న్విజైర్న చిత్రమత్ర త్రిభవప్రహంతుః ॥
తతో జలంధరో దృష్ట్వా రుద్రమద్భుత విక్రమమ్ ।
చకార మాయయా గౌరీం త్ర్యంబకం మోహయాన్నివ ॥
రథోపరి గతాం బద్ధాం రుదంతం పార్వతీం శివః ।
నిశుంభశుంభదైత్యైశ్చ వధ్యమానాం దదర్శ సః ॥
గౌరీం తథావిధాం దృష్ట్వా లౌకికీం దర్శయన్ గతిమ్ ।
బభూవ ప్రాకృత ఇవ శివోఽప్యుద్విగ్నమానసః ॥

సనత్కుమారుడిట్లు పలికెను --

ఆ రాక్షసరాజు అచట గిరిజను గానలేక యుద్ధరంగమునకు మరలి వచ్చెను. గంధర్వమాయ విలీనము కాగానే వృషభధ్వజుడగు శివుడు తెలివిని దెచ్చుకొనెను (2). లోకగతిని అనుసరించియున్న శంకరుడు మాయ అంతర్ధానమగుటను గాంచి తెలివిని దెచ్చుకొనెను. లయకర్తయగు ఆ శివ్పుడు మిక్కిలి కోపించెను (3). అప్పుడు శివుడు మనస్సులో విస్మయమును పొంది క్రోధముతో మరల జలంధరుని పైకి యుద్ధమునకు వెళ్లెను. ఆ రాక్షసుడు కూడ మరల వచ్చిన శివుని గాంచి యుద్ధమునందు ఆయనపై బాణసమూహములను గుప్పించెను (4). శివప్రభుడు మహాబల శాలియగు జలంధరునిచే ప్రయోగింపబడిన భయంకర బాణసమూహమును వెంటనే తన శ్రేష్ఠమగు బాణములతో చెల్లాచెదరు అగునట్లు చేసెను. ముల్లోకములను సంహరించు శివుని

విషయములో ఇది ఆశ్చర్యము కాదు (5). అప్పుడు జలంధరుడు అద్భుతపరాక్రమము గల రుద్రుని గాంచి మాయచే గౌరీదేవిని సృష్టించి ఆ ముక్కంటిని మోహింపజేయ దలచెను (6). పార్వతి రథము నందు బంధింపబడి ఏడ్చుచుండగా శుంభాసుర, నిశుంభాసురులు ఆమెను సంహరించిన దృశ్యమును ఆ శివుడు గాంచెను (7). ఆ స్థితిలో నున్న గౌరీదేవిని గాంచి శివుడు కూడ లోకగతిని ప్రకటించువాడై సామాన్య జనుని వలె మనస్సులో ఉద్వేగమును పొందెను.

తవాఙ్ముఖస్థిత స్తూష్ణీం నానాలీల విశారదః ।
శిథిలాంగో విషణ్ణాత్మా విస్మృత్య స్వపరాక్రమం ॥
తతో జలందరో పరాత్రి భిర్విన్యార సాయకైః ।
ఆపుంఖమగ్నైస్తం రుద్రం శిరస్యురసి చోదరే ॥
తతో రుద్రో మహాలీలో జ్ఞానతత్త్వః క్షణాత్ప్రభుః ।
రౌద్రరూపధరో జాతో జ్వాలామాలాతిభీషణః ॥
తస్యాతీవ మహారౌద్రరూపం దృష్ట్వా మహాసురాః ।
నశేకుః ప్రముఖే స్థాతుం భేజిరే తే దిశో దశ ॥
నిహాంభశుంభావపి యౌ విఖ్యాతౌ వీరసత్తమౌ ।
అపి తౌ శేకతిర్నైవ రణే స్థాతుం మునీశ్వర ॥
జలంధరాకృతా మాయాంతర్హితాభూచ్చ తత్ క్షణం ।
హహకారో మహానాసీత్సం గ్రామే సర్వతోముఖే ॥
తతశ్శాసం దదౌ రుద్రస్తయోశ్శుంభని నిశుంభయోః ।
పలాయమానౌ తౌ దృష్ట్వా ధిక్కృత్య క్రోధసమ్యుతః ॥

అనేక లీలాపండితుడగు శివుడు తలవంచుకొని మిన్నకుండెను. ఆయన తన పరాక్రమము ను విస్మరించి, దుఃఖముతో నిండిన మనస్సు గలవాడై శిథిలమైన అవయవములు కలిగి యుండెను (9). అపుడు జలంధరుడు వేగముతో మూడు బాణములతో ఆ రుద్రుని శిరస్సు నందు, వక్షఃస్థలము నందు, మరియు ఉదరమునందు కొట్టగా అవి పుంఖము వరకు ఆయన శరీరములో దిగబడెను (10). అపుడు గొప్ప లీలలు గలవాడు, జ్ఞానస్వరూపుడు అగు రుద్రప్రభుడు క్షణములో అగ్నిజ్వాలల మాలలతో అతి భీషణుడై ఉగ్రరూపమును ధరించెను (11). రుద్రుని ఆ అతిభయంకర రూపమును గాంచి రాక్షస శ్రేష్ఠులు ఆయన యెదుట నిలువ జాలక పది దిక్కులయందు పరుగిడిరి (12). గొప్ప వీరులని ప్రఖ్యాతి గాంచిన ఆ శుంభనిశుంభులు కూడా యుద్ధములో నిలబడలేక పోయిరి. ఓ మహర్షీ! (13) అదే క్షణములో జలంధరుడు. నిర్మించిన మాయను అంతర్ధానము జెందెను. ఆ యుద్ధరంగములో అన్ని వైపుల నుండి పెద్ద హాహాకారము బయలుదేరెను (14). అపుడు పారిపోవుచున్న ఆ శుంభనిశుంభులను గాంచి రుద్రుడు వారిని క్రోధముతో నిందించి శాపమునిచ్చెను (15).

రుద్ర ఉవాచ ।

యువాం దుష్టావతి ఖలావపరాధకరౌ మమ ।
పార్వతీ దండదా తారౌ గణాదస్మాత్పరాఙ్ ముఖౌ ॥
పరాఙ్ ముఖో న హంతవ్య ఇతి వధ్యౌ న మే యువామ్ ।
మమ యుద్ధాదతి క్రాంతౌ గౌర్యా వధ్యౌ భవిష్యతః ॥
ఏవం వదతి గౌరీశే సింధుపుత్రో జలంధరః ।
చుక్రోధాతీవ రుద్రాయ జ్వలజ్జ్వలన సన్నిభః ॥
రుద్రే రణే మహావేగా ద్వవర్ష నిశితాన్ శరాన్ ।
బాణాంధకార సంఛన్నం తథా భూమితలం హ్య భూత్ ॥
యావద్రుద్రః ప్రచిచ్ఛేద తస్య బాణగణాన్ ద్రుతమ్ ।
తావత్స పరిఘేణాశు జఘాన వృషభం బలీ ॥
వృషస్తేన ప్రహారేణ పరావృత్తో రణాంగణాత్ ।
రుద్రేణ కృష్యమాణోఽ పి న తస్థౌ రణభూమిషు ॥
అథ లోకే మహారుద్ర స్స్వీయం తేజోఽ తి దుస్సహమ్ ।
దర్శయామాస సర్వస్మై సత్యమేతన్మునీశ్వర ॥

రుద్రుడిట్లు పలికెను -

మీరు ఇద్దరు పరమ దుర్మార్గులు. పార్వతిని హింసించి నా ఎదుట మహాపరాధమును చేసి ఈ యుద్ధరంగమునుండి మీరు పారిపోవుచున్నారు (16). పారిపోవు వానిని సంహరించరాదు గనుక నేను మీ ఇద్దరినీ సంహరించుటలేదు. మీరు నాతోటి యుద్ధమునుండి బయట పడిననూ, గౌరి మిమ్ములను వధించగలదు (17), పార్వతీ పతి ఇట్లు పలుకగా, సముద్రపుత్రుడగు జలంధరుడు రుద్రునిపై మిక్కిలి కోపించి మండే అగ్నిజ్వాలలను పోలియుండెను (18). యుద్ధములో ఆతడు రుద్రునిపై మహావేగముతో వాడి బాణముల వర్షమును గురిపించెను. భూతలమంతయు బాణముల వలన ఏర్పడిన చీకటితో వ్యాప్తమయ్యెను (19). రుద్రుడు వానిచే ప్రయోగింపబడిన బాణపరంపరలను ఛేదించునంతలో, బలశాలియగు ఆ జలంధరుడు వెంటనే పరిఘతో ఎద్దును కొట్టెను (20). ఆ దెబ్బను తినిన ఎద్దు రణరంగమునుండి తిరుగు ముఖము పట్టెను. రుద్రుడు లాగిననూ అది రణరంగములో నిలబడలేదు (21). ఓ మహర్షీ! అపుడు మహారుద్రుడు యుద్ధరంగములోనున్న సర్వులకు మిక్కిలి దుస్సహమగు తన తేజస్సును ప్రదర్శించెను. ఇది యథార్థము (22).

తతః పరమసంక్రుద్ధో రుద్రో రౌద్రవపుర్ధరః ।

ప్రలయానలవద్ ఘోరో బభూవ సహసా ప్రభుః ॥

దృష్ట్వా పురస్థ్సితం దైత్యం మేరుకూటమివ స్థితమ్ ।

అవధ్యత్వమపి శ్రుత్వాస్యస్యై రభ్యుధ్యతోఽ భవత్ ॥

బ్రహ్మణో వచనం రక్షన్ రక్షకో జగతాం ప్రభుః ।

హృదాను గ్రహమాతన్వం స్తద్వధాయ మనో దధత్ ॥

కోపం కృత్వా పరం శూలీ పాదాంగుష్ఠేన లీలయా ।

మహాంభసి చకారాశు రథాంగం రౌద్రమద్భుతమ్ ॥

కృత్వార్ణవాంభసి శితం భగవాన్ రథాంగం స్మృత్వా జగత్త్రయమనేన హతం

పురారిః ।

దక్షాంధ కాంతక పురత్రయ యజ్ఞ హంతా లోకత్రయాంతక కరః ప్రహసన్ను

వాచ ॥

అపుడు రుద్రప్రభుడు వెంటనే కోపించి ప్రలయకాలాగ్ని వలె అతి భయంకరమగు ఘోరశరీరమును దాల్చెను (23). తన ఎదుట మేరుపర్వత శిఖరము వలె నిలబడియున్న ఆ రాక్షసుని గాంచి, ఆతనిని సంహరించుట అసంభవమని విని యున్ననూ, శివుడు సంసిద్ధుడాయెను (24). జగద్రక్షకుడగు ఆ ప్రభుడు బ్రహ్మయొక్క మాటను నిలబెట్టగోరి, హృదయములో ఆతనియందు అనుగ్రహమును భావన చేసి, ఆతనిని వధించుటకు మనస్సులో నిర్ణయమును చేసెను (25). శూలధారియగు శివుడు మిక్కిలి కోపించి కాలి బొటన వ్రేలితో లీలగా మహాసముద్రమునందు అద్భుతమగు భయంకరమైన చక్రమును శీఘ్రముగా సృష్టించెను (26). త్రిపురాంతకుడు, ముల్లోకములను లయము చేయువాడు, దక్ష-అంధకాసురులను సంహరించినవాడు, దక్షయజ్ఞ విధ్వంసకుడు నగు ఆ శివుడు, ముల్లోకములు జలంధరునిచే పీడింపబడి యుండుటను స్మరించి, సముద్రజలము నుందు వాడియగు చక్రమును సృష్టించి, చిరునవ్వుతో నిట్లనెను (27).

మహారుద్ర ఉవాచ ।

పాదేన నిర్మితం చక్రం జలంధర మహాంభసి ।

బలవాన్ యది చోద్ధర్తుం తిష్ఠ యోద్ధుం న చాన్యథా ॥

మహారుద్రుడిట్లు పలికెను -

ఓ జలంధరా! నా చే మహాసముద్రమునందు పాదముతో నిర్మింపబడిన చక్రమును ఎత్తగలిగే బలము నీయందు ఉన్నచో యుద్ధము కొరకు నిలబడుము. లేనిచో, తొలగి పొమ్ము (28).

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా క్రోధేనా దీప్తలోచనః ।
ప్రదహన్నివ చక్షుర్భ్యాం ప్రాహాలోక్య స శంకరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శంకరుని ఆ మాటను విని ఆ జలంధరుడు క్రోధముతో ఎర్రనైన నేత్రములనుండి వెలువడే చూపులతో దహించి వేయునా యన్నట్లు చూస్తూ శంకరునితో నిట్లనెను (29).

జలంధర ఉవాచ ।

రేఖాముద్ధృత్య హత్వా చ సగణం త్వాం హి శంకర ।
హత్వా లోకాన్ సురైస్సార్ధం స్వభాగం గరుడో యథా ॥
హంతుం చరాచరం సర్వం సమర్థోఽహం సవాసవమ్ ।
కో మహేశ్వర మద్బాణైరభేద్యో భువనత్రయే ॥
బాలభావేన భగవాన్ తపసైవ వినిర్జితః ।
బ్రహ్మా బలిష్ఠస్స్థానే మే మునిభిస్సుర పుంగవైః ॥
దగ్ధం క్షణేన సకలం త్రైలోక్యం సచరాచరమ్ ।
తపసా కిం త్వయా రుద్ర నిర్జితో భగవానపి ॥
ఇంద్రాగ్నియమవిత్తేశవాయు వారీశ్వరాదయః ।
న సహిరే యథా నాగా గంధం పక్షిపతేరివ ॥
న లబ్ధం దివి భూమౌ చ వాహనం మమ శంకర ।
సమస్తాన్ పర్వతాన్ ప్రాప్య ధర్షితాశ్చ గణేశ్వరాః ॥
గిరీంద్రో మందరశ్శ్రీమాన్ నీలో మేరుస్సు శోభనః ।
ధర్షితో బాహుదండేన కండూ ఉత్సర్పణాయ మే ॥

జలంధరుడిట్లు పలికెను -

ఓ శంకరా! ఆ చక్రమును పైకెత్తి గణములతో సహా నిన్ను సంహరించి దేవతలతో సహా సర్వులను సంహరించి గరుడునివలె నా భాగమును నేను పొందెదను (31). ఇంద్రునితో సహా స్థావరజంగమాత్మకమగు ప్రపంచమును అంతనూ సంహరించే సామర్థ్యము నాకు గలదు. ఓ మహేశ్వరా! ముల్లోకములలో నా బాణములచే భేదింపబడని వాడెవ్వడు? (31) నేను బాలుడనై యుండగనే తపస్సుచే బ్రహ్మ భగవానుని నిర్జించితిని. బలశాలియగు బ్రహ్మ, దేవతా శ్రేష్ఠులతో మరియు మునులతో గూడి నా స్థానము నందున్నాడు (32). చరాచరప్రాణులతో గూడిన ముల్లోకములను పూర్ణముగా క్షణములో తగులబెట్టితిని, ఓ రుద్రా! నీవు గాని, నీ తపస్సుగాని లెక్కయేమి? భగవాన్ బ్రహ్మను కూడ నేను జయించితిని (33). నాగములు గరుడుని గంధమును కూడ సహింపజాలవు. అటులనే, ఇంద్ర-

అగ్ని-యమ-కుబేర-వాయు-వరుణాదులు నన్ను సహించలేరు (34). స్వర్గమునందు గాని, భూలోకమునందు గాని నాకు అడ్డుకొనరాలేదు. ఓ శంకరా! నేను పర్వతముల నన్నిటినీ దాటి, గణాధ్యక్షుల నందరినీ జయించితిని (35). నాకు కలిగిన దురదను పోగొట్టుకొనుటకై నేను నా భుజదండముతో పర్వత శ్రేష్ఠమగు మందరమును, శోభాయుతమగు నీలపర్వతమును, మిక్కిలి అందమగు మేరు పర్వతమును ఢీకొట్టితిని (36).

గంగా నిరుద్ధా బాహుభ్యాం లీలార్థం హిమవద్గిరౌ ।
అరీణాం మమ భృత్యైశ్చ జయో లబ్ధో దివౌకసామ్ ॥
వడవాయా ముఖం బద్ధం గృహీత్వా తాం కరేణ తు ।
తత్క్షణాదేవ సకలమేకార్ణవమభూత్తదా ॥
ఐరావతాదయో నాగాః క్షిప్తాస్సింధు జలోపరి ।
సరథో భగవానింద్రః క్షిప్తశ్చ శతయోజనమ్ ॥
గరుడోఽపి మయా బద్ధో నాగపాశేన విష్ణునా ।
ఉర్వశ్యాద్యా మయా నీతా నార్యః కారాగృహాంతరమ్ ॥
మాం న జానాసి రుద్ర త్వం త్రైలోక్య జయకారిణమ్ ।
జలంధరం మహాదైత్యం సింధుపుత్రం మహాబలమ్ ॥

నేను ఆటలాడుతూ హిమవత్పర్వతమునందు బాహువులతో గంగను ఆపివేసితిని. నాకు శత్రువులగు దేవతలపై నా సేవకులు కూడ విజయమును పొందిరి (37). నేను బడబాగ్నిని చేతితో పట్టుకొని దాని నోటిని మూసి వేయగా, ఒక క్షణకాలములో అపుడు సర్వము ఏకసముద్రము ఆయెను (38). ఐరావతము మొదలగు ఏనుగులను సముద్రములలోనికి విసిరివేసితిని. ఇంద్రభగవానుని రథముతో సహా వందయోజనముల వరకు విసిరి వేసితిని (39). ఊర్వశి మొదలగు స్త్రీలను చెరసాలలో పెట్టితిని. గరుడుని విష్ణువుతో సహా నాగపాశముతో బంధించితిని (40). ఓ రుద్రా! నేను ముల్లోకములను జయించిన జలంధరుడను, సముద్రపుత్రుడగు మహారాక్షసుడను, మహాబలుడను. నీవు నన్ను ఎరుంగవు (41).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వాథ మహాదేవం తదా వారిధినందనః ।
న చచాల న సస్మార నిహతాన్ దానవాన్ యుధి ॥
దుర్మదేనావినీతేన దోర్భ్యా మాస్ఫోట్య దోర్బలాత్ ।
తిరస్కృతో మహాదేవో వచనైః కటుకాక్షరైః ॥
తచ్ఛ్రుత్వా దైత్యవచనమమంగల మితీరితమ్ ।
విజహాస మహాదేవః పరమం క్రోధమాదధే ॥
సుదర్శనాఖ్యం యచ్చక్రం పదాంగుష్ఠ వినిర్మితమ్ ।
జగ్రాహ తత్కరే రుద్రస్తేన హంతుం సముద్యతః ॥

సుదర్శనాఖ్యం తచ్చక్రం చిక్షేప భగవాన్ హరః ।
కోటి సూర్య ప్రతీకాశం ప్రలయానిల సన్నిభమ్ ॥
ప్రదహద్రోదసీ వేగాత్త దాసాద్య జలంధరమ్ ।
జహార తచ్ఛిరో వేగాన్మహదాయతలోచనమ్ ॥
రథాభత్కాయః పపాతో ర్వ్యాం నాదయన్ వసుధాతలమ్ ।
శిరశ్చాప్యబ్ధి పుత్రస్య హాహాకారో మహానభూత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

సముద్రనందనుడగు జలంధరుడు అపుడు మహాదేవునితో నిట్లు పలికి అచటనుండి కదలలేదు. యుద్ధములో సంహరింపబడిన రాక్షసులు ఆతనికి గుర్తు రాలేదు (42). అహంకారి, వినయము నెరుంగని వాడు అగునాతడు భుజముల రెండింటినీ చేతులతో చరిచి పరుషములగు వచనములతో మహాదేవుని ఉద్దేశించి తిరస్కారమును చేసినాడు (43). ఈ విధముగా ఆ రాక్షసుడు పలికిన అమంగళవచనములను విని మహాదేవుడు నవ్వి, తీవ్రమగు కోపమును పొందెను (44). తన కాలి బొటన వ్రేలితో నిర్మించిన సుదర్శనచక్రమును రుద్రుడు చేతిలోనికి తీసుకొని అతనిని సంహరించుటకు సంసిద్ధుడాయెను (45). కోటిసూర్యుల కాంతి గలది, ప్రలయకాలాగ్నిని బోలియున్నది అగు ఆ సుదర్శన చక్రమును హరభగవానుడు ప్రయోగించెను (46). ఆ చక్రము అంతరిక్షములో జ్వాలలను విరజిమ్ముచూ విశాలమగు నేత్రములు గల జలంధరుని సమీపించి వాని శిరమును వేగముగా నరికివేసెను (47). సముద్రపుత్రుడగు జలంధరుని మొండెము, తల రథమునుండి శబ్దము చేయుచూ భూమిపై బడినవి. పెద్ద హాహాకారము చెలరేగెను (48).

ద్విధా పపాత తద్దేహో హ్యంజనాద్రిరివాచలః ।
కులిశేన యథా వారాం నిధౌ గిరివరో ద్విధా ॥
తస్య రౌద్రేణ రక్తేన సంపూర్ణమభవజ్జగత్ ।
తతస్సమస్తా పృథివీ వికృతా భూన్ము నీశ్వర ॥
తద్రక్త మఖిలం రుద్రనియోగాన్మాంసమేవ చ ।
మహారౌరవమాసాద్య రక్త కుండమభూదిహా ॥
తత్తేజో నిర్గతం దేహాద్రుద్రే చ లయమాగమత్ ।
బృందా దేహోద్భవం యద్వద్గౌర్యాం హి విలయం గతమ్ ॥
జలంధరం హతం దృష్ట్వా దేవగంధర్వపన్నగాః ।
అభవన్ సుప్రసన్నాశ్చ సాధు దేవేతి చాబ్రువన్ ॥
సర్వే ప్రసన్నతాం యాతా దేశ సిద్ధమునీశ్వరాః ।
పుష్పవృష్టిం ప్రకుర్వాణాస్తద్యశో జగురుచ్చకైః ॥
దేవాంగనా మహామోదాన్ననృతుః ప్రేమవిహ్వలాః ।
కలస్వరాః కలపదం కిన్నరైస్సహా సంజగుః ॥

దిశః ప్రసేదుస్సర్వాశ్చ హతే బృందాపతౌ మునే ।
పవుః పుణ్యాస్సుఖస్పర్శా వాయవస్త్రి విధా అపి ॥
చంద్రమాశ్శీతతాం యాతో రవిస్తేపే సుతేజసా ।
అగ్నయో జజ్వలుశ్శాంతా బభూవ వికృతం నభః ॥
ఏవం త్రైలోక్యమఖిలం స్వాస్థ్య మాపాధికం మునే ।
హతేఽబ్ధితనయే తస్మిన్ హరేణానంతమూర్తినా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే జలంధరవధ వర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥

వజ్రముచే కొట్టబడి రెండు ముక్కలై సముద్రములో పడిన గొప్ప అంజన పర్వతమువలె అతని దేహము రెండు ముక్కలై నేలబడెను (49). ఆతని భయంకరమగు రక్తముచే జగత్తు అంతయూ నిండెను. ఓ మహర్షీ! దానివలన భూమి అంతయూ వికృతమాయెను (50). రుద్రుని ఆజ్ఞచే ఆ రక్తము మరియు మాంసము సర్వము మహారౌరవనరకమునకు చేర్చబడెను. అది అచట భక్తకుండము ఆయెను (51). బృందా దేవియొక్క దేహమునుండి పుట్టిన తేజస్సు గౌరీగవిలో విలీనమైన విధముగా, ఆతని దేహమునుండి పుట్టిన తేజస్సు కూడ రుద్రునిలో విలీనమయ్యెను (52). దేవతలు, గంధర్వులు, నాగులు జలంధరుడు సంహరింపబడుటను గాంచి మిక్కిలి ప్రసన్నులై 'ఓ దేవా ! సాధు' అని పలికిరి (53). దేవతలు, సిద్ధులు, మహర్షులు అందరు ప్రసన్నులైరి. వారు పుష్పవృష్టిని కురిపిస్తూ శివుని కీర్తిని బిగ్గరగా గానము చేసిరి (54). దేవతా స్త్రీలు ప్రేమను పట్టజాలక మహానందముతో నాట్యమును చేస్తూ కిన్నరులతో కూడి మధురస్వరముతో మధురగీతములను చక్కగా పాడిరి (55). ఓ మునీ బృందాదేవికి భర్తయగు జలంధరుడు సంహరింపబడగానే, దిక్కులన్నియు ప్రసన్నములాయెను. త్రివిధములగు వాయువులు కూడా పరమపవిత్రతతో సుఖమగు స్పర్శను కలిగిస్తూ వీచినవి (56). చంద్రుడు చల్లని కిరణములను వెదజల్లెను. సూర్యుడు గొప్ప తేజస్సుతో ప్రకాశించెను. అగ్నులు శాంతముగా మండజొచ్చినవి. ఆకాశము ధూళిలేనిది ఆయెను (57). ఓ మునీ! ఈ విధముగా సముద్రపుత్రుడగు. ఆ జలంధరుడు అనంతస్వరూపుడగు శివునిచే సంహరింపబడగా ముల్లోకములు మిక్కలి అధికముగు స్వస్థతను పొందినవి (52).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధ ఖండలో జలంధర వధవర్ణనమనే ఇరువది నాల్గవ అధ్యాయము ముగిసినది (24).

25 - దేవతలు శివుని స్తుతించుట

సనత్కుమార ఉవాచ ।

అథ బ్రహ్మాదయో దేవా మునయశ్చాఖిలా స్తథా ।
తుష్టువుర్దేవదేవేశం వాగ్భిరిష్టా భిరానతాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు బ్రహ్మాది దేవతలు మరియు మునులందరు దేవదేవుడగు శివుని నమస్కరించి ఆనందకరమగు వచనములతో స్తుతించిరి (1).

దేవా ఊచుః ।

దేవదేవ మహాదేవ శరణాగత వత్సల ।
సాధుసౌఖ్య ప్రదస్త్వం హి సర్వదా భక్తదుఃఖహా ॥
త్వం మహాద్భుత సల్లీలో భక్తి గమ్యో దురాసదః ।
దురారాధ్యోఽసతాం నాథ ప్రసన్న స్సర్వదా భవ ॥
వేదోఽపి మహిమానం తే న జానాతి హి తత్త్వతః ।
యథామతి మహాత్మానస్సర్వే గాయంతి సద్యశః ॥
మాహాత్మ్యమతి గూఢం తే సహస్రవదనాదయః ।
సదా గాయంతి సుప్రీత్యా పునంతి స్వగిరం హి తే ॥
కృపయా తవ దేవేశ బ్రహ్మజ్ఞానీ భవేజ్జడః ।
భక్తి గమ్యస్సదా త్వం వా ఇతి వేదా బ్రువంతి హి ॥
త్వం వై దీనదయాలుశ్చ సర్వత్ర వ్యాపకస్సదా ।
ఆవిర్భవసి సద్భక్త్యా నిర్వికారస్సతాం గతిః ॥
భక్త్యైవ తే మహేశాన బహవస్సిద్ధి మాగతాః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా దుఃఖితా నిర్వికారతః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! శరణు జొచ్చు వారిని ప్రేమతో రక్షించువాడా! నీవు సర్వకాలములయందు సాధుపురుషులకు సౌఖ్యముల నొసంగెదవు ; మరియు భక్తుల దుఃఖమును పోగొట్టెదవు (2). గొప్ప అద్భుతమైన పవిత్రలీలలు గల నీవు భక్తిచే పొందదగుదువు. దుష్టులకు నిన్ను ఆరాధించుటగాని, పొందుటగాని సంభవము కాదు. ఓ నాథా! నీవు సర్వకాలములలో ప్రసన్నుడవు కమ్ము (3). వేదము కూడ నీ మహిమను యథాతథముగా నెరుంగదు. మహాత్ములందరు తమ బుద్ధికి అందినంతవరకు నీ పవిత్రకీర్తిని గానము చేయుచున్నారు (4). ఇంద్రాదులు అతి రహస్యమగు నీ మహిమను సర్వకాలములలో మిక్కిలి ప్రీతితో గానముచేసి తమ వాక్కును పవిత్రము చేసుకొనుచున్నారు. (5). ఓ దేవదేవా! నీ దయచే మూర్ఖుడు

బ్రహ్మజ్ఞాని యగును. నీవు సర్వదా భక్తిచే పొందదగుదువని వేదములు చెప్పుచున్నవి (6). వికారములు లేని వాడవు, సత్పురుషులకు శరణ్యుడవు, దీనుల పాలిటి రక్షకుడవు, సర్వవ్యాపకుడవు అగు నీవు సర్వదా మంచి భక్తిచే సాక్షాత్కరించెదవు (7). ఓ మహేశ్వరా! అనేకులు నీ భక్తి చేతనే సిద్ధిని పొందినారు. వారు ఇహలోకములో సర్వ సుఖములనను భవించినప్పుడు, మరియు దుఃఖమును పొందినప్పుడు వికారమును పొందలేదు (8).

పురా యదుపతిర్భక్తో దాశార్హస్సిద్ధిమాగతః ।

కలావతీ చ తత్పత్నీ భక్త్యైవ పరమాం ప్రభో ॥

తథా మిత్రసహో రాజా మదయంతీ చ తత్ప్రియా ।

భక్త్యైవ తవ దేవేశ కైవల్యం పరమం యయౌ ॥

సౌమినీ నామ తనయా కై కేయాగ్రభువస్తథా ।

తవ భక్త్యా సుఖం ప్రాప పరం సద్యోగిదుర్లభమ్ ॥

విమర్షణో నృపవరస్సప్త జన్మానధి ప్రభో ।

భుక్త్వా భోగాంశ్చ వివిధాంస్త్వద్భక్త్యా ప్రాప సద్గతిమ్ ॥

చంద్రసేనో నృపవరస్త్వద్భక్త్యా సర్వభోగభుక్ ।

దుఃఖముక్తస్సుఖం ప్రాప పరమత్ర పరత్ర చ ॥

గోపీపుత్ర శ్శ్రీకరస్తే భక్త్యా భుక్త్వేహ సద్గతిమ్ ।

పరం సుఖం మహావీరశిష్యః ప్రాప పరత్ర వై ॥

త్వం సత్యరథ భూజానేర్దుఃఖహర్తా గతిప్రదః ।

ధర్మగుప్తం రాజపుత్రమతార్షీస్సుఖినం త్విహ ॥

ఓ ప్రభూ! పూర్వము యదువంశమునకు ప్రభువు, భక్తుడు అగు దాశారుడు, మరియు ఆతని భార్యయగు కలావతి భక్తిచేతనే పరమసిద్ధి (మోక్షము) ని పొందియున్నారు. (9). ఓ దేవదేవా! అదే విధముగా, మిత్రసహ మహారాజు మరియు ఆతని ప్రియురాలగు మదయంతి నీయందలి భక్తి చేతనే పరమకైవల్య (మోక్ష)మును పొందినారు (10). కేకయమహారాజు యొక్క అన్నగారి కుమార్తె యగు సౌమిని అదే విధముగా నీయందలి భక్తిచే మహాయోగులకైననూ లభించని పరమసుఖము (మోక్షము) ను పొందెను (11). ఓ ప్రభూ! విమర్షణ మహా రాజు నీ భక్తిచే ఏడు జన్మలవరకు అనేక భోగములననుభవించి ఉత్తమగతి (మోక్షము) ని పొందెను (12). చంద్రసేన మహారాజు నీ భక్తిచే దుఃఖమునుండి విముక్తుడై ఇహలోకములో భోగముల నన్నిటినీ అనుభవించి దేహత్యాగానంతరము పరమసుఖమును పొందెను (13). గొల్లయువతి పుత్రుడు, మహావీరుని శిష్యుడు అగు శ్రీకరుడు నీ భక్తిచే ఇహలోకములో గొప్ప సుఖమునసుభవించి పరలోకములో సద్గతిని పొందెను (14). నీవు సత్యరథ మహారాజు యొక్క దుఃఖమును పోగొట్టి సద్గతినొసంగితివి. నీవు రాజకుమారుడగు ధర్మగుప్తునకు ఇహలోకములో సుఖములనొసంగి సంసారసముద్రమును దాటించితివి (15).

తథా శుచివ్రతం విప్రమదరిద్రం మహా ప్రభో ।
త్వద్భక్తవర్తినం మాత్రా జ్ఞానినం కృపయాఽ కరోః ॥
చిత్రవర్మా నృపవరస్త్వద్భక్త్యా ప్రాప సద్గతిమ్ ।
ఇహలోకే సదా భుక్త్వా భోగానమగదుర్లభాన్ ॥
చంద్రాంగదో రాజపుత్ర స్సీమంతిన్యా స్త్రియా సహ ।
విహాయ సకలం దుఃఖం సుఖీ ప్రాప మహాగతిమ్ ॥
ద్విజో మందరనామాపి వేశ్యా గామీ ఖలోఽధమః ।
త్వద్భక్తశ్శివ సంపూజ్య తయా సహ గతిం గతః ॥
భద్రాయుస్తే నృపసుతస్సుఖమాప గతవ్యథః ।
త్వద్భక్త కృపయా మాత్రా గతిం చ పరమాం ప్రభో ॥
సర్వస్త్రీ భోగ నిరతో దుర్జనస్తవ సేవయా ।
విముక్తోఽ భూదపి సదాఽ భక్ష్య భోజీ మహేశ్వర ॥
శంబరశ్శంకరే భక్త శ్చితా భస్మ ధరస్సదా ।
నియమాద్భస్మనశ్శంభో స్వస్త్రియా తే పురం గతః ॥

ఓ మహాప్రభూ! నీ భక్తి యందు స్థిరముగా నున్న శుచివ్రతుడను బ్రాహ్మణునకు ఆతని తల్లితో సహా దయతో జ్ఞానమునిచ్చి ఆతని దారిద్ర్యమును తొలగించితివి (16). చిత్రవర్మమహారాజు నీయందలి భక్తిచే ఇహలోకములో సర్వదా దేవతలకు కూడ లభింప శక్యము కాని భోగముల ననుభవించి సద్గతిని పొందెను (17). చంద్రాంగదుడనే రాజకుమారుడు తన భార్యయగు సీమంతినితో గూడి సకల దుఃఖములనుండి విముక్తుడై సుఖములను, ఉత్తమ గతిని పొందెను (18). ఓ శివా! వేశ్యతో తిరుగువాడు, దుష్టుడు, అధముడు అగు మందరుడనే బ్రాహ్మణుడు కూడ నీ భక్తుడై నిన్ను చక్కగా పూజించి ఆమెతో సహా సద్గతిని పొందినాడు (19). భద్రాయుడనే రాజకుమారుడు నీ భక్తుని దయచే, మరియు నీ దయచే దుఃఖ వినిర్ముక్తుడై తల్లితో గూడి సుఖములను పొంది పరమపదమును చేరినాడు. హే ప్రభూ! (20) మహేశ్వరా! స్త్రీలందరితో భోగమునందాసక్తి గల వాడు, సర్వదా తినకూడని 'పదార్థములను తినువాడు నగు దుష్టుడు కూడ నిన్ను సేవించి మోక్షమును పొందును (21). ఓ శంభూ! శంకర భక్తుడు, సర్వదా విభూతిని దాల్చువాడు నగు శంబరుడు విభూతి ధారణ నియమమువలన తన భార్యతో గూడి నీ పురమును చేరినాడు (22).

భద్రసేనస్య తనయస్తథా మంత్రిసుతః ప్రభో ।
సుధర్మ శుభకర్మాణౌ సదా రుద్రాక్షధారిణౌ ॥
త్వత్కృపాతశ్చ తౌ ముక్తావాస్తాం భుక్త్వేహ సత్సుఖమ్ ।
పూర్వజన్మని యౌ కీశకుక్కుటౌ రుద్రభూషణౌ ॥
పింగలా చ మహానందా వేశ్యే ద్వే తవ భక్తితః ।
సద్గతిం ప్రాపతుర్నాథ భక్తోద్ధార పరాయణ ॥
శారదా విప్ర తనయా బాలవైధవ్యమాగతా ।
తవ భక్తేః ప్రభావాత్తు పుత్రసౌభాగ్యవత్య భూత్ ॥
బిందుగో ద్విజమాత్రో హి వేశ్యా భోగీ చ తత్ప్రియా ।
వంచుకా త్వద్యశశ్శ్రుత్వా పరమాం గతి మాయయౌ ॥
ఇత్యాది బహవస్సిద్ధిం గతా జీవాస్తవ ప్రభో ।
భక్తి భావాన్మహేశాన దీనబంధో కృపాలయ ॥
త్వం పరః ప్రకృతేర్బ్రహ్మ పురుషాత్పరమేశ్వర ।
నిర్గుణస్త్రి గుణాధారో బ్రహ్మ విష్ణు హరాత్మకః ॥
నానా కర్మ కరో నిత్యం నిర్వికారోఽ ఖిలేశ్వరః ।
వయం బ్రహ్మాదయస్సర్వే తవ దాసా మహేశ్వర ॥
ప్రసన్నో భవ దేవేశ రక్షాస్మాన్ సర్వదా శివ ।
త్వత్ప్రజాశ్చ వయం నాథ సదా త్వచ్ఛరణం గతాః ॥

ఓ ప్రభూ! భద్రసేనుని కుమారుడగు సుధర్ముడు, మరియు మంత్రిపుత్రుడగు శుభకర్ముడు సర్వదా రుద్రాక్షలను ధరించి (23), నీ అనుగ్రహమువలన ఇహలోకములో ఉచితమగు సుఖముననుభవించి ముక్తిని పొందిరి. పూర్వజన్మలో కోతి, కోడి యైన వారిద్దరు రుద్రునకు అలంకారములైరి (24). ఓ నాథా! భక్తుల ఉద్ధారమే ప్రముఖకార్యముగా గలవాడా! పింగళ, మహానంద అను ఇద్దరు వేశ్యలు నీ భక్తి వలన సద్గతిని పొందిరి (25). బ్రాహ్మణుని కుమార్తెయగు శారద బాల్యములో భర్తృవియోగమును పొంది నీ భక్తి యొక్క ప్రభావమువలన పుత్రప్రాప్తి అనే సౌభాగ్యమును పొందెను (26). నామమాత్ర బ్రాహ్మణుడు, వేశ్యాలంపటుడునగు బిందుగుడు. మరియు వాని ప్రియురాలగు వంచుక నీ కీర్తిని విని, పరమగతిని పొందిరి (27). ఓ ప్రభూ! మహేశ్వరా! దీనబంధూ! కృపాసముద్రా! ఈ తీరున అనేక జీవులు నీయందు భక్తి భావము కలుగుట వలన సిద్ధిని పొందిరి (28). ఓ పరమేశ్వరా! నీవు ప్రకృతి పురుషాతీతమగు నిర్గుణ బ్రహ్మవు. నీవు త్రిగుణములను స్వీకరించి బ్రహ్మ విష్ణు రుద్రులను రూపములను దాల్చినావు (29). ఓ మహేశ్వరా! నీవు సర్వదా వివిధకర్మలను చేయుచున్ననూ నిర్వికారుడవు. బ్రహ్మాదులమగు మేము అందరము సర్వేశ్వరుడవగు నీకు దాసులము (30). ఓ దేవదేవా! ప్రసన్నుడవు కమ్ము.

మమ్ములను సర్వదా రక్షించుము. ఓ శివా! నాథా! నీ సంతానమగు మేము సర్వదా నిన్ను శరణు పొందియున్నాము (31).

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుత్వా చ తే దేవా బ్రహ్మాద్యాస్స మునీశ్వరాః ।
తూష్ణీం బభూవుర్హి తదా శివాంఘ్రిద్వంద్వ చేతసః ॥
అథ శంభుర్మహేశానశ్శ్రుత్వా దేవస్తుతిం శుభామ్ ।
దత్త్వా వరాన్ వరాన్ సద్యస్తత్రైవాంతర్దధే ప్రభుః ॥
దేవాస్సర్వేఽపి ముదితా బ్రహ్మాద్యా హతశత్రవః ।
స్వం స్వం ధామ యయుః ప్రీతా గాయంతశ్శివ సద్యశః ॥
ఇదం పరమమాఖ్యానం జలంధర విమర్దనమ్ ।
మహేశచరితం పుణ్యం మహాఘౌఘ వినాశనమ్ ॥
దేవస్తుతిరియం పుణ్యా సర్వపాప ప్రణాశినీ ।
సర్వసౌఖ్య ప్రదా నిత్యం మహేశానందదాయినీ ॥
యః పఠేత్పాఠయేద్వాఽపి సమాఖ్యానమిదం ద్వయమ్ ।
భుక్త్వేహ పరమం సౌఖ్యం గాణపత్యమవాప్నుయాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
దేవస్తుతివర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ బ్రహ్మాది దేవతలు మహర్షులతో గూడి ఇట్లు స్తుతించి శివుని పాదములపై లగ్నమైన మనస్సులు గలవారై అపుడు మిన్నకుండిరి (32). అపుడు మహేశ్వరుడగు శంభు ప్రభుడు పవిత్రమగు దేవతల స్తుతిని విని శ్రేష్ఠమగు వరములనిచ్చి వెంటనే అచటనే అంతర్హితుడాయెను (33). బ్రహ్మ మొదలగు దేవతలందరు కూడ శత్రువులు నశించుటచే ఆనందించిన వారై శివుని సత్కీర్తిని ప్రేమతో గానము చేయుచూ తమ తమ స్థానములకు వెళ్లిరి (34). మహేశ్వరుడు జలంధరుని సంహరించుట అనే ఈ గొప్ప గాథ పవిత్రమైనది, మరియు మహాపాపములను నశింపచేయునది (35). ఈ పవిత్రమగు దేవతల స్తుతి పాపములనన్నిటినీ పోగొట్టి నిత్యము సర్వసుఖముల నిచ్చును. ఈ స్తుతి మహేశునకు ఆనందమును కలిగించును (36). ఈ రెండు గాథలను ఎవరు పఠించెదరో, లేదా పఠింపజేసెదరో వారు ఇహలోకములో గొప్ప సుఖమునను భవించి గణాధ్యక్ష స్థానమును పొందెదరు (37).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో దేవస్తుతి వర్ణనమనే ఇరువది అయిదవ అధ్యాయము ముగిసినది (25).

26 - విష్ణువు యొక్క మోహమును తొలగించుట

వ్యాస ఉవాచ ।

బ్రహ్మపుత్ర నమస్తేఽస్తు ధన్యస్త్వం శైవసత్తమ ।
యచ్ఛ్రావితా మహాదివ్యా కథేయం శాంకరీ శుభా ॥
ఇదానీం బ్రూహి సుప్రీత్యా చరితం వైష్ణవం మునే ।
స బృందాం మోహయిత్వా తు కిమకార్షీత్కుతో గతః ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మపుత్రా! నీకు నమస్కారము. ఓ శివభక్తాగ్ర గణ్యా! నీవు ధన్యుడవు. నీవు మహాదివ్యము, శుభకరమునగు ఈ శంకరుని గాథను వినిపించి నావు (1). ఓ మునీ! ఇపుడు విష్ణుచరితమును ప్రేమతో చెప్పుము. ఆయన బృందను మోహింప జేసిన తరువాత ఏమి చేసెను? ఎచటకు వెళ్లెను ? (2)

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాప్రాజ్ఞ శైవ ప్రవరసత్తమ ।
వైష్ణవం చరితం శంభుచరితాఢ్యం సునిర్మలమ్ ॥
మౌనీ భూతేషు దేవేషు బ్రహ్మాదిషు మహేశ్వరః ।
సుప్రసన్నోఽవదచ్ఛంభు శ్శరణాగతవత్సలః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! వినుము. నీవు గొప్ప బుద్ధిశాలివి. శివ భక్తులలో ఉత్తముడవు. శంభుని చరితముతో విరాజిల్లునది, మిక్కిలి పవిత్రమైనది అగు విష్ణు చరితమును చెప్పెదను (3). శరణాగతవత్సలుడు, మహేశ్వరుడునగు శంభుడు బ్రహ్మాది దేవతలు మిన్నకుండగా మిక్కిలి ప్రసన్నుడై ఇట్లు పలికెను (4).

శంభురువాచ ।

బ్రహ్మన్ దేవవరాస్సర్వే భవదర్థే మయా హతః ।
జలంధరో మదంశోఽపి సత్యం సత్యం వదామ్యహమ్ ॥
సుఖమాపుర్న వా తాతాస్సత్యం బ్రూతామరాః ఖలు ।
భవత్కృతే హి మే లీలా నిర్వికారస్య సర్వదా ॥

శంభుడు ఇట్లు పలికెను -

ఓ బ్రహ్మా! సర్వదేవపుంగవులారా! జలంధరుడు నా అంశనుండి జన్మించి్ిన వాడే అయిననూ, మీ కొరకై వానిని సంహరించితిని. నేను నిస్సందేహముగా సత్యమును పలుకుచున్నాను (5). ఓ పుత్రులారా! మీకు సుఖము కలిగినదా? లేదా? ఓ దేవతలారా! . సత్యమును పలుకుడు. సర్వదా నిర్వికారుడనగు నా లీల మీకొరకు మాత్రమే గదా! (6)

సనత్కుమార ఉవాచ।

అథ బ్రహ్మాదయో దేవా హర్షాదుత్ఫుల్లలోచనాః ।
ప్రణమ్య శిరసా రుద్రం శశంసుర్విష్ణు చేష్టితమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు బ్రహ్మ మొదలగు దేవతలు ఆనందముతో విప్పారిన నేత్రములు గల వారై రుద్రునకు తలవంచి నమస్కరించి విష్ణువృత్తాంతమును చెప్పిరి (7).

దేవా ఊచుః ।

మహాదేవ త్వయా దేవా రక్షితాశ్శత్రుజాద్భయాత్ ।
కించిదన్యత్సముద్భూతం తత్ర కిం కరవామహే ॥
బృందా విమోహితా నాథ విష్ణునా హి ప్రయత్నతః ।
భస్మీ భూతా ద్రుతం వహ్నౌ పరమాం గతిమాగతా ॥
బృందాలావణ్య సంభ్రాంతో విష్ణుస్తిష్ఠతి మోహితః ।
తచ్చితా భస్మ సంధారీ తవ మాయావిమోహితః ॥
స సిద్ధ మునిసంఘైశ్చ బోధితోఽ స్మాభిరాదరాత్ ।
న బుధ్యతే హరిస్సోఽ థ తవ మాయావిమోహితః ॥
కృపాం కురు మహేశాన విష్ణుం బోధయ బోధయ ।
త్వదధీనమిదం సర్వం ప్రాకృతం స చరాచరమ్ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ మహాదేవా! నీవు శత్రువుల వలన కలిగిన భయమునుండి దేవతలను రక్షించితివి. కాని ఇపుడు మరియొక సమస్య ఉదయించినది. దాని విషయములో మేము ఏమి చేయవలెను? (8) ఓ ప్రభూ! విష్ణువు ప్రయత్నపూర్వకముగా బృందను

మోహింపజేయగా, ఆమె వెంటనే అగ్నిలో భస్మమై సరమగతిని పొందినది (9). బృందయొక్క సౌందర్యముచే భ్రమితుడైన విష్ణువు మోహమును పొంది యున్నాడు. నీ మాయచే విశేషముగా మోహమును పొంది యున్న విష్ణువు ఆమె యొక్క చితా భస్మను ధరించుచున్నాడు (10). మేము సిద్ధుల, మహర్షుల సంఘములతో గూడి ఆతనికి సాదరముగా బోధించితిమి. కాని నీ మాయచే విశేషముగా మోహితుడై యున్న ఆ విష్ణువు జ్ఞానమును పొందుట లేదు (11). ఓ మహేశ్వరా ! నీవు దయను చూపి విష్ణువునకు బోధించుము; బోధించుము. ప్రకృతినుండి పుట్టిన స్థావర జంగమాత్మకమగు ఈ జగత్తు అంతయూ నీ అధీనములో నున్నది (12).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య మహేశో హి వచనం త్రిదివౌకసామ్ ।
ప్రత్యువాచ మహాలీలస్స్వచ్ఛందస్తాన్ కృతాంజలీన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

గొప్ప లీలలు గలవాడు, స్వతంత్రుడు అగు మహేశుడు దేవతల ఈ మాటలను విని చేతులు జోడించి నమస్కరించుచున్న వారికి ఇట్లు బదులిడెను (13).

మహేశ ఉవాచ ।

హే బ్రహ్మన్ హే సురాస్సర్వే మద్వాక్యం శృణుతా దరాత్ ।
మోహినీ సర్వలోకానాం మమ మాయా దురత్యయా ॥
తదధీనం జగత్సర్వం యద్దేవాసురమానుషమ్ ।
తయైవ మోహితో విష్ణుః కామాధీనోఽభవద్ధరిః ॥
ఉమాఖ్యా సా మహాదేవీ త్రిదేవజననీ పరా ।
మూల ప్రకృతిరాఖ్యాతా సురామా గిరిజాత్మికా ॥
గచ్ఛధ్వం శరణా దేవా విష్ణుమోహాపనుత్తయే ।
శరణ్యాం మోహినీం మాయాం శివాఖ్యాం సర్వకామదామ్ ॥
స్తుతిం కురుత తస్యాశ్చ మచ్ఛక్తేః తోషకారిణీమ్ ।
సుప్రసన్నా యది చ సా సర్వం కార్యం కరిష్యతి ॥

మహేశుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! సర్వదేవతలారా! నా మాటను శ్రద్ధతో వినుడు. సర్వప్రాణులను మోహింపజేయు నా మాయ దాట శక్యము కానిది (14). దేవతలు, మానవులు, మరియు రాక్షసులతో సహా జగత్తు అంతయు దానికి లోబడి యున్నది. పాపహారియగు విష్ణువు దానిచేతనే మోహింపబడిన వాడై కామమునకు

వశుడైనాడు (15). మూల ప్రకృతియని పిలువబడు ఆ మాయ పర్వతరాజు పుత్రికయై ఉమా మహాదేవి యను పేరుతో ఆనందమును కలుగ జేయు చున్నది. ఆ పరామాయయే త్రిమూర్తులకు తల్లి (16). ఓ దేవతలారా! శరణు పొందదగినది, మోహింపజేయునది, శివా యను పేరు గలది, కోర్కెలనన్నిటినీ ఈ డేర్చునది అగు ఆ మాయను విష్ణువు యొక్క మోహమును పోగొట్టుట కొరకై శరణు పొందుడు (17). నా శక్తికి సంతోషమును కలిగించే స్తుతిని చేయుడు. ఆమె ప్రసన్నురాలైనచో కార్యమునంతనూ చక్కబెట్టగలదు (18).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తాన్ సురాన్ శంభుః పంచాస్యో భగవాన్ హరః ।
అంతర్దధే ద్రుతం వ్యాస సర్వైశ్చ స్వగణైస్సహ ॥
దేవాశ్చ శాసనాచ్ఛంభోర్బ్రహ్మాద్యా హి సవాసవాః ।
మనసా తుష్టువుర్మూల ప్రకృతిం భక్తవత్సలామ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! పంచముఖుడు, పాపహారియగు శంభు భగవానుడు ఆ దేవతలతో నిట్లు పలికి తన గణములందరితో గూడి అంతర్ధానము జెందెను (19). బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలు శంభుని శాసనముచే భక్తవత్సలు రాలగు మూలప్రకృతిని మనస్సులో స్తుతించిరి (20).

దేవా ఊచుః ।

యదుద్భవాస్సత్త్వ రజస్తమో గుణాస్సర్గ స్థితిధ్వంస విధాన కారకా ।
యదిచ్ఛయా విశ్వమిదం భవాభవౌ తనోతి మూలప్రకృతిం నతాస్స్మ తామ్ ॥
పాహి త్రయోవింశగుణాన్ సుశబ్దితాన్ జగత్యశేషే సమధిష్ఠితా పరా ।
యద్రూపకర్మాణి జగత్త్రయేఽపి తే విదుర్న మూలప్రకృతిం నతాస్స్మ తామ్ ॥
యద్భక్తియుక్తాః పురుషాస్తు నిత్యం దారిద్ర్యమోహాత్యయ సంభవాదీన్ ।
న ప్రాప్నువంత్యేవ హి భక్తవత్సలా సదైవమూల ప్రకృతిం నతాస్స్మ తామ్ ॥
కురు కార్యం మహాదేవి దేవానాం నః పరేశ్వరి ।
విష్ణుమోహం హర శివే దుర్గే దేవి నమోఽస్తుతే ॥
జలంధరస్య శంభోశ్చ రణే కైలాసవాసినః ।
ప్రవృత్తే తద్వధార్థాయ గౌరీశాసనతశ్శివే ॥
బృందా విమోహితా దేవి విష్ణునా హి ప్రయత్నతః ।
స్వవృషాత్త్యాజితా వహ్నౌ భస్మీ భూతా గతిం గతా ॥
జలంధరో హతో యుద్ధే తద్భయాన్మోచితా వయమ్ ।
గిరిశేన కృపాం కృత్వా భక్తాను గ్రహకారిణా ॥

దేవతలిట్లు పలికిరి -

దేనినుండి సత్త్వరజస్తమోగుణములు పుట్టినవో, ఏది సృష్టిస్థితిలయములను కర్మలను అనుష్ఠించుచున్నదో, దేని సంకల్పము చే ఈ జగత్తు జన్మమరణములను పొందుచున్నదో, అట్టి మూలప్రకృతికి నమస్కరించుచున్నాము (21). సంపూర్ణమగు జగత్తునందు స్పష్టముగా పరిగణించి ప్రకటింపబడిన ఇరువది మూడు గుణములను అధిష్ఠించి యున్న పరాశక్తి మమ్ములను రక్షించుగాక! ముల్లోకములలో దేని యొక్క రూపమును మరియు కర్మలను జనులు ఎరుంగరో అట్టి మూలప్రకృతిని నమస్కరించుచున్నాము (22). దేనియందు భకి గల పురుషులు సర్వదా దారిద్ర్యము, అజ్ఞానము, జన్మ, మరణములను నిశ్చితముగా పొందరో, అట్టి భక్త వత్సలయగు మూలప్రకృతిని సర్వదా నమస్కరించుచున్నాము (23). ఓ మహాదేవీ! పరమేశ్వరీ! మా కార్యమును చక్కబెట్టుము. ఓ శివా! దుర్గాదేవీ! విష్ణువు యొక్క మోహమును తొలగించుము. నీకు నమస్కారమగు గాక! (24) ఓ శివా ! కైలాసవాసియగు శంభునకు, జలంధరునకు యుద్ధము జరుగుచుండగా, గౌరీ దేవియొక్క ఆజ్ఞను పొంది వాని వధకొరకై (25) విష్ణువు ప్రయత్నపూర్వకముగా బృందను మోహింపజేసినాడు. ఆమె తన ధర్మమును నిలబెట్టుకొని అగ్నిలో దేహత్యాగమును చేసి పరమ గతిని పొందినది (26). యుద్ధములో జలంధరుడు సంహరింపబడినాడు. మాకు వాని వలన భయము తప్పినది. భక్తులను అనుగ్రహించే కైలాసపతి మాపై దయను చూపినాడు (27).

తదాజ్ఞయా వయం సర్వే శరణం తే సమాగతాః ।
త్వం హి శంభు ర్యువాం దేవి భక్తోద్ధారపరాయణౌ ॥
బృందాలావణ్య సంభ్రాంతో విష్ణుస్తిష్ఠతి తత్ర వై ।
తచ్చితా భస్మ సంధారీ జ్ఞాన భ్రష్టో విమోహితః ॥
స సిద్ధ సురసంఘైశ్చ బోధితోఽపి మహేశ్వరి ।
న బుధ్యతే హరిస్సోఽ థ తవ మాయావి మోహితః ॥
కృపాం కురు మహాదేవి హరిం బోధయ బోధయ ।
యథా స్వలోకం పాయాత్స సుచిత్తస్సుర కార్యకృత్ ॥
ఇతి స్తువంతస్తే దేవాస్తేజో మండల మాస్థితమ్ ।
దదృశుర్గగనే తత్ర జ్వాలావ్యాప్తదిగంతరమ్ ॥
తన్మధ్యాద్భారతీం సర్వే బ్రహ్మాద్యాశ్చ సవాసవాః ।
అమరాశ్శు శ్రువుర్వ్యాస కామదాం వ్యోమచారిణీమ్ ॥

ఆయన ఆజ్ఞచే మేము అందరము నిన్ను శరణు పొందినాము. ఓ దేవీ! నీవు మరియు శంభుడు మీరిద్దరు భక్తులను ఉద్ధరించుటయే ఏకైకధ్యేయముగా గలవారు (28). విష్ణువు బృందయొక్క సౌందర్యముచే ఆకర్షితుడై అచటనే నిలిచియున్నాడు. ఆతడు జ్ఞానభ్రష్టుడై మోహమును పొంది ఆమె యొక్క చితాభస్మను ధరించి యున్నాడు (29). ఓ మహేశ్వరీ! సిద్ధులు, దేవతా గణములు ఆతనికి బోధించినారు. కాని నీ మాయచే మిక్కిలి మోహితుడై యున్న ఆ హరి జ్ఞానమును పొందుటలేదు (30). ఓ మహాదేవీ! దయచూపి విష్ణువునకు బోధించుము. ఆతడు స్వస్థచిత్తుడై తన లోకమును చేరి దేవకార్యమును చేయు విధముగా బోధించుము (31). ఇట్లు స్తుతించుచున్న ఆ దేవతలు ఆకాశమునందు ఆవిర్భవించిన ఒక తేజోరాశిని చూచిరి. ఆ తేజోరాశి యొక్క జ్వాలలు దిగంతములకు వ్యాపించెను (32). బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలందరు ఆ తేజోరాశి మధ్యమునుండి శబ్దమును వినిరి. ఓ వ్యాసా! ఆ ఆకాశవాణి కోర్కెల నీడేర్చునది (33).

ఆకాశవాణ్యువాచ ।

అహమేవ త్రిధా భిన్నా తిష్ఠామి త్రివిధైర్గుణైః ।
గౌరీ లక్ష్మీ స్సురా జ్యోతీ రజస్సత్త్వ తమో గుణైః ॥
తత్ర గచ్ఛత యూయం వై తాసామంతిక ఆదరాత్ ।
మదాజ్ఞయా ప్రసన్నాస్తా విధాస్యంతే తదీప్సితమ్ ॥

ఆకాశవాణి పలికెను -

నేను మూడు రకముల గుణములచే మూడు రూపములుగా విడివడి యున్నాను. సత్త్వరజస్తమోగుణములచే నేను గౌరి, లక్ష్మి, సరస్వతి అను రూపములను ధరించి యున్నాను. ఓ దేవతలారా! (34) మీరు ఆదరముతో వారి వద్దకు వెళ్లుడు. ప్రసన్నులైన వారు నా ఆజ్ఞచే మీ కోరికను నెరవేర్చగలరు (35).

సనత్కుమార ఉవాచ ।

శృణ్వతామితి తాం వాచ మంతర్ధానమగా న్మహః ।
దేవానాం విస్మయోత్ఫుల్ల నేత్రాణాం తత్తదా మునే ॥
తతస్సర్వేఽపి తే దేవా శ్రుత్వా తద్వాక్య మాదరాత్ ।
గౌరీం లక్ష్మీం సురాం చైవ నేముస్తద్వాక్య చోదితాః ॥
తుష్టువుశ్చ మహాభక్త్యా దేవీస్తాస్సకలాస్సురాః ।
నానావిధాభిర్వాగ్భిస్తే బ్రహ్మాద్యా నతమస్తకాః ॥
తతోఽరం వ్యాస దేవ్యస్తా ఆవిర్భూతాశ్చ తత్పురః ।
మహాద్భుతైస్స్వతేజోభి ర్భాసయంత్యో దిగంతరమ్ ॥
అథ తా అమరా దృష్ట్వా సుప్రసన్నేన చేతసా ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా స్వకార్యం చ న్యవేదయన్ ॥

తతశ్చైతాన్సురాన్ దృష్ట్వా ప్రణతాన్ భక్తవత్సలాః ।
బీజాని ప్రదదుస్తేభ్యో వాక్య మూచుశ్చ సాదరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

వారా మాటలను విను చుండగనే ఆ తేజస్సు అంతర్హితమయ్యెను. ఓ మునీ! దేవతలు అపుడా తేజస్సును ఆశ్చర్యముతో విప్పారిన నేత్రములతో చూచుచుండిరి (36). అపుడా దేవతలందరు ఆ వాక్యమును ఆదరముచే విని దానిచే ప్రేరేపించబడినవారై గౌరీ లక్ష్మీసరస్వతులను ప్రణమిల్లిరి (37). బ్రహ్మ మొదలగు ఆ దేవతలందరు తలలను వంచి మహాభక్తితో ఆ దేవీ మూర్తులను వివిధములగు వాక్కులతో స్తుతించిరి (38). ఓ వ్యాసా! అపుడు వెంటనే ఆ దేవీ మూర్తులు వారి యెదుట ఆవిర్భవించిరి. వారు మహాద్భుతమగు తమ తేజస్సులచే దిగంతము వరకు ప్రకాశింపచేయుచుండిరి (39). అపుడు దేవతలు వారిని గాంచి ప్రసన్నమగు మనస్సు గలవారై వారికి భక్తితో ప్రణమిల్లి స్తుతించి తమ కార్యమును విన్నవించిరి (40). భక్తవాత్సల్యము గల ఆ దేవీ మూర్తులు అపుడు నమస్కరించియున్న దేవతలను గాంచి వారికి బీజములనిచ్చి వారితో సాదరముగా నిట్లనిరి (41).

దేవ్య ఊచుః ।

ఇమాని తత్ర బీజాని విష్ణుర్య త్రావ తిష్ఠతి ।
నిర్వపధ్వం తతః కార్యం భవతాం సిద్ధిమేష్యతి ॥

దేవీమూర్తులు ఇట్లు పలికిరి -

ఈ బీజములను విష్ణువు ఉన్న స్థానమునందు నాటుడు. అట్లు చేయుట వలన మీ పని సిద్ధించగలదు (42).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తాస్తతో దేవ్యోంతర్హితా అభవన్మునే ।
రుద్రవిష్ణు విధీనాం హి శక్తయస్త్రి గుణాత్మికాః ॥
తతస్తుష్టా స్సురాస్సర్వే బ్రహ్మాద్యాశ్చ సవాసవాః ।
తాని బీజాని సంగృహ్య యయుర్యత్ర హరిస్స్థితః ॥
బృందాచితా భూమితలే చిక్షిపుస్తాని తే సురాః ।
స్మృత్వా తాస్సంస్థి తాస్తత్ర శివశక్త్యంశకా మునే ॥
నిక్షిప్తే భ్యశ్చ బీజేభ్యో వనస్పత్యస్త్ర యోஉభవన్ ।
ధాత్రీ చ మాలతీ చైవ తులసీ చ మునీశ్వర ॥
ధాత్ర్యుద్భవా స్మృతా ధాత్రీ మాధవా మాలతీ స్మృతా ।
గౌరీభవా చ తులసీ తమస్సత్త్వ రజో గుణాః ॥
విష్ణుర్వనస్పతీర్దృష్ట్వా తదా స్త్రీ రూపిణీర్మునే ।
ఉదతిష్ఠత్తదా తాసు రాగాతిశయ విభ్రమాత్ ॥



దృష్ట్వా స యాచతే మోహాత్కామాసక్తేన చేతసా ।

తం చాపి తులసీ ధాత్రీ రాగేణైవావ లోకతామ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! బ్రహ్మ విష్ణురుద్రుల శక్తులు, త్రిగుణస్వరూపులు అగు ఆ దేవీమూర్తులు ఇట్లు పలికి పిదప అంతర్ధానమును చెందిరి (43). అపుడు బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలందరు సంతసిల్లి ఆ బీజములను శ్రద్ధగా స్వీకరించి విష్ణువు ఉన్న స్థానమునకు వెళ్లిరి (44). ఆ దేవతలు వాటిని బృందాదేవియొక్క చితా భూమియందు నాటిరి. ఓ మునీ! వారు శివుని శక్తి యొక్క అంశలగు ఆ దేవీమూర్తులను స్మరిస్తూ అచట నిలబడియుండిరి (45). ఓ మహర్షీ! నాటిన ఆ బీజములనుండి ధాత్రి, మల్లె మరియు తులసి అను మూడు మొక్కలు ఉద్భవించెను (46). సరస్వతినుండి ధాత్రి, లక్ష్మీదేవి నుండి మల్లె, మరియు గౌరీదేవి నుండి తులసి తమస్సత్త్వరజో గుణరూపములై పుట్టినవి (47). ఓ మునీ ! స్త్రీ రూపములో నున్న ఆ మొక్కలను చూడగానే విష్ణువు మోహముచే వాటియందు అతిశయించిన రాగము గలవాడై లేచి నిలబడెను (48). ఆతడు మోహమువలన కామనతో మిక్కిలి రాగయుక్తమైన మనస్సుతో వారిపై ఇచ్ఛను కలిగి యుండెను. తులసి మరియు ధాత్రి కూడా ఆతనిని ప్రేమతో చూచిరి (49).

యచ్చ బీజం పురా లక్ష్మ్యా మాయయైవ సమర్పితమ్ ।

తస్మాత్త దుద్భవా నారీ తస్మిన్నీర్ష్యా పరా భవత్ ॥

అతస్సా బర్బరీత్యాఖ్యా మవాపాతీవ గర్హితామ్ ।

ధాత్రీ తులస్యౌ తద్రాగాత్తస్య ప్రీతి ప్రదే సదా ॥

తతో విస్మృతదుఃఖోఽసౌ విష్ణుస్తాభ్యాం సహైవ తు ।

వైకుంఠమగమత్తుష్ట స్సర్వదేవైర్నమస్కృతః ॥

కార్తికే మాసి విప్రేంద్ర ధాత్రీ చ తులసీ సదా ।

సర్వదేవప్రియా జ్ఞేయా విష్ణోశ్చైవ విశేషతః ॥

తత్రాపి తులసీ ధన్యాతీవ శ్రేష్ఠా మహామునే ।

త్యక్త్వా గణేశం సర్వేషాం ప్రీతిదా సర్వకామదా ॥

వైకుంఠస్థం హరిం దృష్ట్వా బ్రహ్మేంద్రా ద్యాశ్చ తేఽమరాః ।

నత్వా స్తుత్వా మహావిష్ణుం స్వస్వధామాని వై యయుః ॥

పూర్వము ఏ బీజము లక్ష్మీ దేవి యొక్క శక్తిచే సమర్పింపబడినదో, దాని నుండి ఉద్భవించిన యువతి ఆ కారణముచేతనే ఆతనియందు ఈర్ష్య గలది ఆయెను (50). కావుననే మల్లె మిక్కిలి నిందించదగిన 'బర్బరి' అను పేరును గాంచెను. ధాత్రి మరియు తులసి మొక్కలు విష్ణువునందు ప్రేమను చూపుటచే ఆయనకు సర్వదా ప్రీతిపాత్రములాయెను (51). అపుడు ఆ విష్ణువు తన దుఃఖమును

విస్మరించి వారిద్దరితో గూడి దేవతలందరు నమస్కరించుచుండగా సంతోషముతో వైకుంఠమును చేరెను (52). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! కార్తికమాసములో ధాత్రి మరియు తులసి సర్వదేవతలకు, విశేషించి విష్ణువునకు ప్రీతికరములని యెరుంగుము (53). ఓ మహర్షీ! ఆ రెండిటిలో తులసి మరింత ధన్యము, శ్రేష్ఠము. విఘ్నేశ్వరుని మినహాయించి తులసి సర్వదేవతలకు ప్రీతిని కలిగించి, కోర్కెలనన్నిటినీ ఈడేర్చును (54). బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు ఆ దేవతలు పాపహారియగు మహావిష్ణువు వైకుంఠమునందుండుటను గాంచి ఆయనకు నమస్కరించి స్తుతించి తమ తమ ధామములకు వెళ్లిరి (55).

వైకుంఠేఽపి స్వలోకస్థో భ్రష్టమోహస్సు బోధవాన్ ।
సుఖీ చాభూన్మునిశ్రేష్ఠ పూర్వవత్సంస్మరన్ శివమ్ ॥
ఇత్యాఖ్యాన మఘౌఘఘ్నం సర్వకామప్రదం నృణామ్ ।
సర్వకామవికారఘ్నం సర్వవిజ్ఞాన వర్ధనమ్ ॥
య ఇదం హి పఠేన్నిత్యం పాఠయే ద్వాపి భక్తిమాన్ ।
శృణుయాచ్ఛ్రావయే ద్వాపి స యాతి పరమాం గతిమ్ ॥
పఠిత్వా య ఇదం ధీమానా ఖ్యానం పరమోత్తమమ్ ।
సంగ్రామం ప్రవిశేద్వీరో విజయీ స్యాన్న సంశయః ॥
విప్రాణాం బ్రహ్మవిద్యాదం క్షత్రియాణాం జయప్రదమ్ ।
వైశ్యానాం సర్వధనదం శూద్రాణాం సుఖదం త్విదమ్ ॥
శంభుభక్తి ప్రదం వ్యాస సర్వేషాం పాపనాశనమ్ ।
ఇహలోకే పరత్రాపి సదా సద్గతిదాయకమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే విష్ణుమోహ విధ్వంసవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥

ఓ మహర్షీ! విష్ణువుకూడ మోహము తొలగి జ్ఞానమును పొందినవాడై పూర్వమునందు వలె శివుని స్మరిస్తూ తన లోకమునందు సుఖముగా నుండెను (56). పాపసందోహములను నశింపజేయునది, మానవుల సర్వకామనల నీడేర్చునది, సర్వకామవికారములను పోగొట్టునది అగు ఈ గాథ సర్వవిజ్ఞానమును వర్ధిల్లజేయును (57). ఎవడైతే దీనిని నిత్యము భక్తితో పఠించునో లేక పఠింపజేయునో, వినునో, లేదా వినిపించునో, అట్టివాడు పరమగతిని పొందును (58). బుద్ధిమంతుడగు ఏ వ్యక్తి సర్వశ్రేష్ఠమగు ఈ గాథను పఠించి యుద్ధరంగమును ప్రవేశించునో, అట్టి వీరుడు నిస్సంశయముగా విజయమును పొందును (59). ఈ గాథ బ్రాహ్మణులకు బ్రహ్మవిద్యను, క్షత్రియులకు జయమును, వైశ్యులకు సమస్త సంపదలను, శూద్రులకు సుఖమును ఇచ్చును (60). ఓ వ్యాసా! అందరి పాపములను పోగొట్టి శంభునియందు భక్తిని కలిగించే ఈ గాథ ఇహపరలోకములలో సర్వదా సద్గతినిచ్చును (61).

27 - శంఖచూడుని జననము

సనత్కుమార ఉవాచ ।

అథాన్యచ్ఛంఖచరితం ప్రేమత శృణు వై మునే ।
యస్య శ్రవణమాత్రేణ శివ భక్తిర్దృఢా భవేత్ ॥
శంఖచూడా ఖ్యో వీరో దానవో దేవకంటకః ।
యథా శివేన నిహతో రణమూర్ధ్ని త్రిశూలతః ॥
తచ్ఛంఖ చరితం దివ్యం పవిత్రం పాపనాశనమ్ ।
శృణు వ్యాస సుసంప్రీత్యా వచ్మి సుస్నేహతస్తవ ॥
మరీచేస్తనయో ధాతుః పుత్రో యః కశ్యపో మునిః ।
స ధర్మిష్ఠ స్సృష్టికర్తా విధ్యాజ్ఞప్తః ప్రజాపతిః ॥
దక్షః ప్రీత్యా దదౌ తస్మై నిజకన్యాస్త్ర యోదశ ।
తాసాం ప్రసూతిః ప్రసభం న కథ్యా బహువిస్తృతాః ॥
యత్ర దేవాదినిఖిలం చరాచరమభూజ్జగత్ ।
విస్తరాత్త త్ప్రవక్తుం చ కః క్షమోఽస్తి త్రిలోకకే ॥
ప్రస్తుతం శృణు వృత్తాంతం శంఖలీలాన్వితం చ యత్ ।
తదేవ కథయామ్యద్య శృణు భక్తి ప్రవర్ధనమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! మరియొక శంఖుగా థను ప్రేమతో వినుము. దీనిని విన్నంతమాత్రాన శివుని యందలి భక్తి దృఢమగును (1). వీరుడు, దేవతలను పీడించువాడు అగు శంఖచూడుడనే రాక్షసుని సంగ్రామములో శివుడు త్రిశూలముతో సంహరించిన గాథను వినుము (2). ఓ వ్యాసా! దివ్యము, పవిత్రము, పాపనాశనము అగు ఆ శంఖుగాథను నీయందు గల స్నేహభావము వలన మిక్కిలి ప్రీతితో చెప్పు చున్నాను. వినుము (3). మరీచి ప్రజాపతి యొక్క కుమారుడగు కశ్యపమహర్షి ధర్మాత్ముడు. ఆయన బ్రహ్మచే ఆజ్ఞాపించబడిన వాడై సృష్టిని గావించిన ప్రజాపతి (4). దక్షుడు ఆయనకు తన పదముగ్గురు కుమార్తెలనిచ్చి ప్రీతితో వివాహమును చేసెను. మిక్కిలి విస్తరించిన వారి సంతానమును గూర్చి విపులముగా వర్ణించుట సంభవము కాదు (5). దేవతలు మొదలగు సమస్త స్థావర జంగమాత్మకమగు జగత్తు వారి సంతానమే. దానిని విస్తరముగా చెప్పగల సమర్థుడు ముల్లోకములలో ఎవరు గలరు? (6) శంఖుని లీలలతో గూడినది, భక్తిని వర్ధిల్ల జేయునది అగు ప్రస్తుత గాథను మాత్రమే ఇప్పుడు చెప్పెదను. వినుము (7).

తాసు కశ్యపపత్నీషు దనుస్త్వేకా వరాంగనా ।
మహారూపవతీ సాధ్వీ పతి సౌభాగ్యవర్ధినీ ॥
ఆసంస్తస్యా దనోః పుత్రా బహవో బలవత్తరాః ।
తేషాం నామాని నోచ్యంతే విస్తారభయతో మునే ॥
తేష్వేకో విప్రచిత్తిస్తు మహాబలపరాక్రమః ।
తత్పుత్రో ధార్మికో దంభో విష్ణు భక్తో జితేంద్రియః ॥
నాసీత్తత్తనయో వీరస్తత శ్చింతా పరోఽభవత్ ।
శుక్రాచార్యం గురుం కృత్వా కృష్ణమంత్రమవాప్య చ ॥
తపశ్చకార పరమం పుష్కరే లక్షవర్షకమ్ ।
కృష్ణమంత్రం జజాపైవ దృఢం బద్ధ్వాసనం చిరమ్ ॥
తపః ప్రకుర్వతస్తస్య మూర్ధ్నో నిస్సృత్య ప్రజ్వలత్ ।
విస సార చ సర్వత్ర తత్తేజో హి సుదుస్సహమ్ ॥
తేన తప్తాస్సురాస్సర్వే మునయో మనవస్తథా ।
సునాసీరం పురస్కృత్య బ్రహ్మాణం శరణం యయుః ॥
ప్రణమ్య చ విధాతారం దాతారం సర్వసంపదామ్ ।
తుష్టువుర్వికలాః ప్రోచుస్స్వవృత్తాంతం విశేషతః ॥
తదాకర్ణ్య విధాతాపి వైకుంఠం తైర్యయౌ సహ ।
తదేవ విజ్ఞాపయితుం నిఖిలేన హి విష్ణవే ॥
తత్ర గత్వా త్రిలోకేశం విష్ణుం రక్షాకరం పరమ్ ।
ప్రణమ్య తుష్టువుస్సర్వే కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥

ఆ కశ్యపుని భార్యలలో దనువు అను ఒక సుందరి గలదు. ఆమె గొప్ప రూపవతి, పతివ్రత, మరియు భర్తయొక్క సౌభాగ్యమును వృద్ధి చేయునది (8). ఆ దనువునకు మహాబలశాలురగు అనేక పుత్రులు గలరు. ఓ మునీ! విస్తారభయముచే వారి పేర్లను నేను చెప్పుట లేదు (9). వారిలో ఒకడు మహాబలపరాక్రమశాలి యగు విప్రచిత్తుడు. ఆతని పుత్రుడగు దంభుడు ధర్మాత్ముడు, విష్ణు భక్తుడు మరియు ఇంద్రియ జయము గలవాడు (10). ఆతనికి పుత్రసంతానము లేకుండెను. ఆ కారణము వలన ఆ వీరుడు దుఃఖితుడై శుక్రాచార్యుని గురువుగా చేసుకొని కృష్ణమంత్రమును స్వీకరించి (11), పుష్కర తీర్థమునందు లక్ష సంవత్సరములు గొప్ప తపస్సును చేసెను. ఆతడు ఆసనమును దృఢముగా బంధించి చిరకాలము కృష్ణ మంత్రమును మాత్రమే జపించెను (12). తపస్సును చేయుచున్న ఆతని శిరస్సునుండి సహింప శక్యము కానిది, జ్వాలలతో కూడి యున్నది అగు తేజస్సు ఉద్భవించి సర్వత్రా వ్యాపించెను (13). దానిచే పీడితులైన సర్వదేవతలు, మునులు మరియు మనువులు ఇంద్రుని ముందిడుకొని బ్రహ్మను శరణు వేడిరి (14). దుఃఖితులై యున్న వారు సమస్తసంపదలను ఇచ్చే బ్రహ్మను నమస్కరించి స్తుతించి

తమ వృత్తాంతమును విశేషముగా వివరించి చెప్పిరి (15). ఆ వృత్తాంతమును విని బ్రహ్మ వారితో గూడి, ఆ వృత్తాంతమును సమముగా విష్ణువునకు విన్నవించుటకొరకై వైకుంఠమునకు వెళ్లెను (16). వారందరు అచటకు వెళ్లి ముల్లోకములకు అధిపతి, రక్షకుడు, పరమాత్మయగు విష్ణువునకు ప్రణమిల్లి వినయముతో చేతులు కట్టుకొని స్తుతించిరి (17).

దేవా ఊచుః ।

దేవదేవ న జానీమో జాతం కిం కారణం త్విహ ।
సంతప్తాస్సకలా జాతాస్తేజసా కేన తద్వద ॥
తప్తాత్మనాం త్వమవితా దీనబంధోఽను జీవినామ్ ।
రక్ష రక్ష రమానాథ శరణ్యశ్శరణాగతాన్ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! కారణమేమి పుట్టినదో తెలియకున్నది. మేమందరము ఈ బ్రహ్మాండము లో తాపమును పొందుచున్నాము. దీనికి కారణమగు తేజస్సు ఏది? చెప్పుము (18). ఓ దీనబంధూ! తాపపీడితమైన మనస్సుగల నీ అనుచరులను నీవు రక్షించెదవు. ఓ రమానాథా! శరణ్యుడవగు నీవు శరణు పొందిన మమ్ములను రక్షింపుము, రక్షింపుము (19).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచో విష్ణు ర్బ్రహ్మాదీనాం దివౌకసామ్ ।
ఉవాచ విహసన్ ప్రేమ్ణా శరణాగతవత్సలః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బ్రహ్మాది దేవతల ఈ మాటలను విని శరణాగతవత్సలుడగు విష్ణువు ప్రేమతో నవ్వి ఇట్లు పలికెను (20).

విష్ణురువాచ ।

సుస్వస్థా భవతావ్యగ్రా న భయం కురుతామరాః ।
నోపప్లవా భవిష్యంతే లయకాలో న విద్యతే ॥
దానవో దంభనామా హి మద్భక్తః కురుతే తపః ।
పుత్రార్థీ శమయిష్యామి తమహం వరదానతః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవతలారా! ఆందోళనను విడనాడి పూర్ణస్వస్థతను పొందుడు. భయపడకుడు. జలప్రళయము రాబోవుట లేదు. ఇది ప్రళయసమయము కాదు (21). నా భక్తుడగు దంభుడనే దానవుడు పుత్రుని గోరి తపస్సును చేయుచున్నాడు. అతనికి వరమునిచ్చి ఆ తేజస్సును నేను చల్లార్చ గలను (22).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తాస్తే సురాస్సర్వే ధైర్యమాలంబ్య వై మునే ।
యయుర్బ్రహ్మాదయస్సు స్థాస్స్వస్వ ధామాని సర్వశః ॥
అచ్యుతోఽపి వరం దాతుం పుష్కరం సంజగామ హ ।
తపశ్చరతి యత్రాసౌ దంభనామా హి దానవః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! విష్ణువు ఇట్లు పలుకగా బ్రహ్మాది దేవతలందరు ధైర్యమును స్వస్థతను పొంది అన్ని వైపులలో గల తమ తమ స్థానములకు వెళ్లిరి (23). అచ్యుతుడు కూడా దంభుడనే దానవుడు తపస్సు చేయుచున్న పుష్కరమునకు వరమునిచ్చుట కొరకై వెళ్లెను (24).

తత్ర గత్వా వరం బ్రూహీత్యువాచ పరిసాంత్వయన్ ।
గిరా సూనృతయా భక్తం జపంతం స్వమనుం హరిః ॥
తచ్ఛ్రుత్వా వచనం విష్ణోర్దృష్ట్వా తం చ పురస్థ్సితమ్ ।
ప్రణనామ మహాభక్త్యా తుష్టావ చ పునః పునః ॥

విష్ణువు అచటకు వెళ్లి తన మంత్రమును జపించుచున్న ఆ భక్తుని మధురమగు వచనములతో ఉత్సాహపరిచి 'వరమును కోరుకొనుము' అని పలికెను (25). ఆతడు తన యెదుట నిలబడియున్న విష్ణువును గాంచి ఆయన పలుకులను విని మహాభక్తితో ప్రణమిల్లి పలుమార్లు స్తుతించెను (26).

దంభ ఉవాచ ।

దేవదేవ నమస్తేఽస్తు పుండరీక విలోచన ।
రమానాథ త్రిలోకేశ కృపాం కురు మమోపరి ॥
స్వభక్తం తనయం దేహి మహాబల పరాక్రమమ్ ।
త్రిలోకజయినం వీరమజేయం చ దివౌకసామ్ ॥

దంభుడిట్లు పలికెను -

ఓ దేవదేవా! నీకు నమస్కారము. పద్మముల వంటి కన్నులు గలవాడా! లక్ష్మీపతీ! త్రిలోకనాథా! నాపై దయను చూపుము (27). నీ భక్తుడు, గొప్ప బలము పరాక్రమము గలవాడు, ముల్లోకములను జయించు వాడు, వీరుడు, దేవతల కైననూ జయింపశక్యము కానివాడు అగు పుత్రుని ఇమ్ము (28).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త దానవేంద్రోణ తం వరం ప్రదదౌ హరిః ।

నివర్త్య చోగ్రతపసస్తతస్సోంతరధాన్మునే ॥

గతే హరౌ దానవేంద్రః కృత్వా తస్మై దిశే నమః ।

జగామ స్వగృహం సిద్ధ తపాః పూర్ణమనోరథః ॥

కాలేనాల్పేన తత్పత్నీ సగర్భా భాగ్య వత్యభూత్ ।

రరాజ తేజసాత్యంతం రోచయంతీ గృహాంతరమ్ ॥

సుదామా నామ గోపో యో కృష్ణస్య పార్షదాగ్రణీః ।

తస్యా గర్భే వివేశాసౌ రాధాశప్తశ్చ యన్మునే ॥

అసూత సమయే సాధ్వీ సుప్రభం తనయం తతః ।

జాతకం సు చకారాసౌ పితాహూయ మునీన్ బహూన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మునీ! ఆ రాక్షసేంద్రుడు ఇట్లు కోరగా విష్ణువు అతనికి ఆ వరమునిచ్చి కఠినమగు తపస్సును విరమింప జేసి తరువాత అంతర్ధానము జెందెను (29). విష్ణువు అంతర్ధానమైన తరువాత ఆ రాక్షసేంద్రుడు ఆ దిక్కునకు నమస్కారము చేసెను. ఆతని తపస్సు సిద్ధించెను. ఆతని కోరిక ఈడేరెను. అపుడాతడు తన గృహమునకు వెళ్లెను (30). కొద్ది కాలములో భాగ్యవంతురాలగు ఆతని భార్య గర్భవతియై తన తేజస్సుతో ఇంటిలోపల భాగములను మిక్కిలి ప్రకాశింపజేయుచూ శోభిల్లెను (31). ఓ మునీ! శ్రీ కృష్ణుని అనుయాయులలో మొదటి వాడు, రాధచే శపింపబడినవాడు అగు సుదాముడనే గోపాలకుడు ఆమె గర్భములో ప్రవేశించి యుండెను (32). తరువాత ఆ పతివ్రత నెలలు నిండిన పిదప గొప్ప తేజస్సు గల పుత్రుని గనెను. తండ్రి అనేక మహర్షులను పిలిపించి ఆ బాలుని జాతకర్మను చేయించెను (33).

ఉత్సవస్సుమహానాసీత్తస్మిన్ జాతే ద్విజోత్తమ ।
నామ చక్రే పితా తస్య శంఖచూడేతి సద్దినే ॥
పితుర్గేహే స వవృధే శుక్లపక్షే యథా శశీ ।
శైశవేఽ భ్యస్త విద్యస్తు స బభూవ సుదీప్తి మాన్ ॥
స బాలక్రీడయా నిత్యం పిత్రోర్హర్షం తతాన హ ।
ప్రియో బభూవ సర్వేషాం కులజానాం విశేషతః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
శంఖచూడోత్పత్తి వర్ణనం నామ సప్త వింశోఽధ్యాయః ॥

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! ఆ బాలుడు జన్మించగానే గొప్ప ఉత్సవము జరిగెను. వానికి తండ్రి శుభముహూర్తమునందు శంఖచూడుడు అని నామకరణము చేసెను (34). ఆ బాలుడు తండ్రి గృహములో శుక్లపక్ష చంద్రుని వలె పెరిగెను. గొప్ప తేజస్సు గల ఆ బాలుడు బాల్యమునందే విద్యలనభ్యసించెను (35). ఆ బాలుడు ఆటపాటలతో నిత్యము తల్లి దండ్రుల ఆనందమును విస్తరింప జేసెను. బంధువర్గములోని వారందరికీ ఆ బాలుడు విశేషించి ప్రీతి పాత్రుడాయెను (36).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శంఖచూడోత్పత్తి వర్ణనమనే ఇరువది ఏడవ అధ్యాయము ముగిసినది (27).

28 – శంఖచూడుని వివాహము

సనత్కుమార ఉవాచ ।

తతశ్చ శంఖచూడోఽసౌ జైగీషవ్యోపదేశతః ।
తతశ్చకార సుప్రీత్యా బ్రహ్మణః పుష్కరే చిరమ్ ॥
గురుదత్తాం బ్రహ్మవిద్యాం జజాప నియతేంద్రియః ।
స ఏకాగ్రమనా భూత్వా కరణాని నిగృహ్య చ ॥
తపంతం పుష్కరే తం వై శంఖచూడం చ దానవమ్ ।
వరం దాతుం జగామాశు బ్రహ్మా లోకగురుర్విభుః ॥
వరం బ్రూహీతి ప్రోవాచ దానవేంద్రం విధిస్తదా ।
స దృష్ట్వా తం ననామాతి నమస్తుష్టావ సద్గిరా ॥
వరం యయాచే బ్రహ్మాణమజేయత్వం దివౌకసామ్ ।
తథేత్యాహ విధిస్తం వై సుప్రసన్నేన చేతసా ॥
శ్రీ కృష్ణకవచం దివ్యం జగన్మంగల మంగలమ్ ।
దత్తవాన్ శంఖచూడాయ సర్వత్ర విజయప్రదమ్ ॥
బదరీం సంప్రయాహి త్వం తులస్యా సహ తత్ర వై ।
వివాహం కురు తత్రైవ సా తపస్యతి కామతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

అపుడా శంఖచూడుడు జైగీషవ్యమహర్షి ఉపదేశమును పొంది పుష్కర క్షేత్రమునందు చిరకాలము బ్రహ్మను ఉద్దేశించి పరమ ప్రీతితో తపస్సును చేసెను (1). ఆతడు ఇంద్రియములను నిగ్రహించి మనస్సును ఏకాగ్రము చేసి గురువుచే ఉపదేశింప బడిన బ్రహ్మ మంత్రమును జపించెను (2). లోకములకు తండ్రి, సర్వసమర్థుడు నగు బ్రహ్మ వెంటనే పుష్కరములో తపస్సు చేయుచున్న ఆ శంఖచూడాసురునకు వరము నిచ్చుటకై అచటకు వెళ్లెను (3). అపుడు బ్రహ్మ ఆ రాక్షసవీరునితో 'వరమును కోరుకొనుము' అని పలికెను. ఆతడు బ్రహ్మను గాంచి మిక్కిలి వినయముతో ప్రణమిల్లి పవిత్రమగు వచనములతో స్తుతించెను (4). దేవతలచే జయింపబడకుండుట అను వరమును ఆతడు బ్రహ్మనుండి కోరగా, ఆయన మిక్కిలి ప్రసన్నమగు మనస్సుతో తథాస్తు అనెను (5). జగత్తులోని సర్వమంగళవస్తువులకంటె మంగళప్రదమైనది, సర్వదేశములలో మరియు సర్వకాలములలో విజయము నొసంగునది, దివ్యమైనది అగు శ్రీకృష్ణకవచమును ఆయన శంఖచూడునకు ఇచ్చెను (6). నీవు బదరికి వెళ్లి అచట తులసిని వివాహమాడుము. ఆమె అచటనే తన కోరికననుసరించి తపస్సును చేయుచున్నది (7).

ధర్మధ్వజ సుతా సేతి సందిదేశ చ తం విధిః ।
అంతర్ధానం జగామాశు పశ్యతస్తస్య తత్ క్షణాత్ ॥
తతస్స శంఖచూడో హి తపస్సిద్ధోఽతి పుష్కరే ।
గలే బబంధ కవచం జగన్మంగల మంగలమ్ ॥
ఆజ్ఞయా బ్రహ్మణస్సోఽపి తపస్సిద్ధ మనోరథః ।
సమాయయౌ ప్రహృష్టాస్య స్తూర్ణం బదరికాశ్రమమ్ ॥
యదృచ్ఛయాఽఽ గతస్తత్ర శంఖచూడశ్చ దానవః ।
తపశ్చరంతీ తులసీ యత్ర ధర్మధ్వజాత్మజా ॥
సురూపా సుస్మితా తన్వీ శుభభూషణ భూషితా ।
సకటాక్షం దదర్శాసా తమేవ పురుషం పరమ్ ॥
దృష్ట్వా తాం లలితాం రమ్యాం సుశీలాం సుందరీం సతీమ్ ।
ఉవాస తత్సమీపే తు మధురం తామువాచ సః ॥

'ఆమె ధర్మధ్వజుని కుమార్తె' అని బ్రహ్మ ఆతనికి బోధించి ఆతడు చూచుచుండగా వెంటనే అదృశ్యుడాయెను (8). పుష్కరములో తపస్సును చేసి గొప్ప సిద్ధిని పొందియున్న ఆ శంఖచూడుడు అపుడు జగత్తులో మంగళములకు కూడ మంగళమైన కవచమును మెడలో కట్టుకొనెను (9). తపస్సుచే సిద్ధించిన మనోరథము గల ఆ శంఖచూడుడు బ్రహ్మ యొక్క ఆజ్ఞచే వెంటనే బదరికాశ్రమమును చేరెను. ఆతని ముఖములో ఆనందము తొణికిసలాడుచుండెను (10). ధర్మధ్వజుని కుమార్తెయగు తులసి తపస్సును చేయుచున్నస్థలమునకు శంఖచూడాసురుడు అనుకోకుండా వచ్చెను (11). మిక్కిలి అందమైనది, అందమగు చిరునవ్వు గలది, శుభకరమగు భూషణములను అలంకరించుకున్నది అగు ఆ యువతి ఆ మహాపురుషుని ప్రేమపూర్వకముగా పరికించెను (12). కోమలమగు దేహము గలది రమ్యమైనది, మంచి శీలము గలది, యగు ఆ యువతిని గాంచి ఆమెను సమీపించి ఆతడు ఆమెతో మధురముగా నిట్లనెను (13).

శంఖచూడ ఉవాచ ।

కా త్వం కస్య సుతా త్వం హి కిం కరోషి స్థితాత్ర కిమ్ ।
మౌనీ భూతా కింకరం మాం సంభావితు మిహార్హసి ॥

శంఖచూడుడిట్లు పలికెను -

నీవెవరు ? ఎవని కుమార్తెవు ? ఇచ్చట ఉండి నీవేమి చేయుచున్నావు ? నీవు మౌనముగా నుంటివేల ? నన్ను నీ సేవకునిగా తలపోయుము (14).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా స కామం తమువాచ సా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆతని ఈ మాటలను విని ఆమె ఆతనిని ఉద్దేశించి ప్రేమతో నిట్లనెను (15).

తులస్యువాచ ।

ధర్మధ్వజసుతాహం చ తపస్యామి తపస్వినీ ।

తపోవనే చ తిష్ఠామి కస్త్వం గచ్ఛ యథాసుఖమ్ ॥

నారీ జాతిర్మోహినీ చ బ్రహ్మాదీనాం విషోపమా ।

నింద్యా దోషకరీ మాయా శృంఖలా హ్యనుశాయినామ్ ॥

తులసి ఇట్లనెను -

నేను ధర్మధ్వజుని కుమార్తెను. తపశ్శాలిని యగు నేను తపోవనములోనుండి తపస్సును చేయుచున్నాను. నీవెవరు? సుఖముగా వెళ్లుము (16). విషముతో పోల్చదగిన స్త్రీ జాతి బ్రహ్మాదులనైననూ మోహింపజేయును. నిందార్హురాలు, దోషస్థానము, మోసగత్తె అగు స్త్రీ సాధకులకు సంకెల (17).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తులసీ తం చ సరసం విరరామ హ ।

దృష్ట్వా తాం సస్మితాం సోఽపి ప్రవక్తుము పచక్రమే ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

తులసి ఆతనితో ప్రేమపూర్వకముగా ఇట్లు పలికి విరమించెను. ఆతడు చిరునవ్వుతో గూడియున్న ఆమెను గాంచి ఇట్లు చెప్పుటకు ఉపక్రమించెను (18).

శంఖచూడ ఉవాచ ।

త్వయా యత్కథితం దేవి న చ సర్వమలీకకమ్ ।

కించిత్సత్యమలీకం చ కించిన్మత్తో నిశామయ ॥

పతివ్రతాస్స్త్రి యో యాశ్చ తాసాం మధ్యే త్వమగ్రణీః ।

న చాహం పాపదృక్కామీ తథా త్వం నేతి ధీర్మమ ॥

ఆగచ్ఛామి త్వత్సమీప మాజ్ఞయా బ్రహ్మణోఽధునా ।

గాంధర్వేణ వివాహేన త్వాం గ్రహీష్యామి శోభనే ॥

శంఖచూడోఽహమేవాస్మి దేవవిద్రావకారకః ।

మాం న జానాసి కిం భద్రేన శ్రుతోఽహం కదాచన ॥

దనువంశ్యో విశేషేణ దంభపుత్రశ్చ దానవః ।

సుదామా నామ గోపోఽహం పార్షదశ్చ హరేః పురా ॥

అధునా దానవేంద్రోఽహం రాధికాయాశ్చ శాపతః ।
జాతిస్మరోఽహం జానామి సర్వం కృష్ణ ప్రభావతః ॥

శంఖచూడుడు ఇట్లు పలికెను -

ఓ దేవీ! నీవు చెప్పిన సర్వము అసత్యము కాదు. కాని కొంత సత్యము, కొంత అసత్యము గలదు. నా మాటను వినుము (19). పతివ్రతాస్త్రీలలో నీవు అగ్రేసరురాలవు. నేను పాపదృష్టిగల కాముకుడను గాను. నీవు కూడ అట్టి దానవు కాదని నేను భావించుచున్నాను (20). ఇపుడు నేను బ్రహ్మ యొక్క ఆజ్ఞచే నీవద్దకు వచ్చియుంటిని. ఓ సుందరీ! నేను నిన్ను గాంధర్వవిధిలో వివాహమాడెదను (21). దేవతలు పారిపోవునట్లు చేయు శంఖచూడుడను నేను. ఓ మంగళస్వరూపురాలా! నన్ను ఎరుంగవా ? ఎప్పుడైననూ నా పేరు వినలేదా? (2 2) విశేషించి నేను దనువంశములో జన్మించితిని. నా తండ్రి పేరు దంభుడు. పూర్వజన్మలో నేను శ్రీ కృష్ణుని అనుంగు సహచరుడైన సుదాముడనే గోపాలకుడను (23). రాధాదేవియొక్క శాపముచే ఈ జన్మలో దానవవీరుడనై జన్మించితిని. శ్రీకృష్ణుని ప్రభావముచే నేను పూర్వ జన్మ వృత్తాంతమునంతనూ ఎరుంగుదును (24).

సనత్కుమార ఉవాచ ।

ఏవముక్త్వా శంఖచూడో విరరామ చ తత్పురః ।
దానవేంద్రోణ సేత్యుక్తా వచనం సత్యమాదరాత్ ॥
సస్మితం తులసీ తుష్టా ప్రవక్తు ముపచక్రమే ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శంఖచూడుడు ఆమె ఎదుట ఇట్లు పలికి విరమించెను. ఆ రాక్షసరాజు ఇట్లు ఆదరముతో సత్యవచనమును పలుకగా, ఆ తులసి సంతసించి చిరునవ్వుతో ఇట్లు చెప్పుట మొదలిడెను (25).

తులస్యువాచ।

త్వయాహమధునా సత్త్వవిచారేణ పరాజితా ।
స ధన్యః పురుషో లోకే న స్త్రియా యః పరాజితః ॥
సత్క్రియో ప్యశుచిర్నిత్యం స పుమాన్యస్త్రి యా జితః ।
నిందంతి పితరో దేవా మానవాస్సకలాశ్చ తమ్ ॥
శుధ్యే ద్విప్రో దశా హేన జాతకే మృతసూతకే ।
క్షత్రియో ద్వాదశహేన వైశ్యః పంచదశాహతః ॥
శూద్రో మాసేన శుధ్యేత్తు హేతి వేదానుశాసనమ్ ।
న శుచి స్త్రీ జితః క్వాపి చితాదాహం వినా పుమాన్ ॥
న గృహ్ణంతిచ్ఛయా తస్మాత్పితరః పిండతర్పణమ్ ।
న గృహ్ణంతి సురాస్తేన దత్తం పుష్పఫలాదికమ్ ॥

తస్య కిం జ్ఞాన సుతపోజప హోమ ప్రపూజనైః ।
విద్యయా దానతః కిం వా స్త్రీ జిర్యస్య మనో హృతమ్ ॥
విద్యా ప్రభావజ్ఞానార్థం మయా త్వం చ పరీక్షితః ।
కృత్వా కాంతపరీక్షాం వై వృణుయాత్కామినీ వరమ్ ॥

తులసి ఇట్లు పలికెను -

సాత్వికమనో భావములు గల నీచే నేను ఈ నాడు జయింపబడితిని. ఏ పురుషుడు ఈ లోకములో స్త్రీ చే జయింపబడడో, వాడే ధన్యుడు (26). ఏ పురుషుడు స్త్రీచే జయింపబడునో వాడు పవిత్రమగు కర్మలను చేయు వాడే అయిననూ సర్వదా శౌచవిహీనుడే. పితృదేవతలు, దేవతలు, మరియు సర్వమానవులు అట్టి వానిని నిందించెదరు (27). జాతాశౌచమృతాశౌచములలో బ్రాహ్మణుడు పది, క్షత్రియుడు పన్నెండు, వైశ్యుడు పదిహేను, శూద్రుడు ముప్పది రోజులలో శుద్ధిని పొందునని వేదము ఉపదేశించుచున్నది. కాని స్త్రీచే జయింపబడిన పురుషుడు చితిపై దహించుటచే తప్ప ఎక్కడనైననూ శుద్ధిని పొందడు (28, 29). కావున అట్టి వాడు సమర్పించిన పిండమును, తర్పణములను పితృదేవతలు ఆనందముతో స్వీకరించరు. ఆతడు సమర్పించిన పుష్పఫలాదులను దేవతలు స్వీకరించరు (30). ఎవని మనస్సు స్త్రీలచే అపహరింపబడినదో, వానికి జ్ఞానము, మంచి తపస్సు, జపము, హోమము, పూజ, విద్య, దానము అను వాటితో ఏమి ప్రయోజనము గలదు? (31) నీ విద్యను, ప్రభావమును, జ్ఞానమును తెలియుటకై నేను పరీక్ష చేసితిని. స్త్రీ వరుని పరీక్షించిన తరువాతనే భర్తగా వరించవలెను గదా! (32)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవం ప్రవదంత్యాం తు తులస్యాం తత్ క్షణే విధిః ।
తత్రాజగామ సంస్రష్టా ప్రోవాచ వచనం తతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

తులసి ఇట్లు మాటలాడు చుండగా, అదే క్షణములో సృష్టికర్తయగు బ్రహ్మ అచటకు విచ్చేసేను. అపుడాయన ఇట్లు పలికెను (33).

బ్రహ్మోవాచ ।

కిం కరోషి శంఖచూడ సంవాదమనయా సహ ।
గాంధర్వేణ వివాహేన త్వమస్యా గ్రహణం కురు ॥
త్వం వై పురుషరత్నం చ స్త్రీ రత్నం చ త్వియం సతీ ।
విదగ్ధాయా విదగ్ధేన సంగమో గుణవాన్ భవేత్ ॥
నిర్విరోధం సుఖం రాజన్ కో వా త్యజతి దుర్లభమ్ ।
యోఽ విరోధసుఖత్యాగీ స పశుర్నాత్ర సంశయః ॥
కిం త్వం పరీక్షసే కాంత మీదృశం గుణినం సతి ।
దేవానామసురాణాం చ దానవానాం విమర్దకమ్ ॥
అనేన సార్ధం సుచిరం విహారం కురు సర్వదా ।
స్థానే స్థానే యథేచ్ఛం చ సర్వలోకేషు సుందరి ॥
అంతే ప్రాప్స్యతి గోలోకే శ్రీ కృష్ణం పునరేవ సః ।
చతుర్భుజం చ వైకుంఠే మృతే తస్మింస్త్వమాప్స్యసి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ శంఖచూడా! ఈ మెతో నీవేమి సంభాషణను చేయుచున్నావు? ఈమెను నీవు గాంధర్వవిధిచే వివాహమాడుము (34). నీవు పురుషులలో శ్రేష్ఠుడవు. ఈ పతివ్రత స్త్రీలలో శ్రేష్ఠురాలు. జ్ఞానవంతురాలగు ఈమెకు జ్ఞానివగు నీతో వివాహము గొప్ప గుణకారి కాగలదు (35). విరోధము లేనిది, దుర్లభమైనది అగు సుఖమును ఎవడు విడిచిపెట్టును? ఓ రాజా! విరోధములేని సుఖమును పరిత్యజించు వ్యక్తి పశుప్రాయుడనుటలో సందేహము లేదు (36). ఓ పుణ్యాత్మురాలా! గుణవంతుడు, దేవతలను, అసురులను, దానవులను శిక్షించువాడు అగు ఇట్టి సుందరుని నీవు ఏమి పరీక్ష చేయుచున్నావు ?(37) నీవీతనితో గూడి చిరకాలము అన్ని వేళలలో సర్వలోకముల యందలి ప్రదేశములన్నింటిలో యథేచ్ఛగా విహరించుము. ఓ సుందరీ! (38) ఆతడు మరణించిన తరువాత గోలోకములో మరల శ్రీకృష్ణుని పొందగలడు. ఆతడు మరణించిన పిదప నీవు వైకుంఠములో చతుర్భుజుడగు విష్ణువును పొందగలవు (39).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవ మాశిషం దత్త్వా స్వాలయం తు యయౌ విధిః ।

గాంధర్వేణ వివాహేన జగృహే తాం చ దానవః ॥

ఏవం వివాహ్య తులసీం పితుస్స్థానం జగామ హ ।

స రేమే రమ్యయా సార్ధం వాసగేహే మనోరమే ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శంఖచూడ వివాహవర్ణనం నామ అష్టవింశోఽధ్యాయః (28).

సనత్కుమారుడిట్లు పలికెను -

బ్రహ్మ ఈ విధముగా ఆశీర్వదించి తన ధామమునకు వెళ్లెను. ఆ శంఖచూడుడు ఆమెను గాంధర్వవిధితో వివాహమాడెను (40). ఆతడు ఈ తీరున తులసిని వివాహమాడి తండ్రి గృహమునకు వెళ్లి మనోహరమగు ఆ నివాసములో ఆ సుందరితో గూడి రమించెను (41).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శంఖచూడ వివాహవర్ణనమనే ఇరువది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (28).

29 – శంఖచూడుని పూర్వజన్మ వృత్తాంతము

సనత్కుమార ఉవాచ ।

స్వగేహమాగతే తస్మిన్ శంఖచూడే వివాహితే ।
తపః కృత్వా వరం ప్రాప్య ముముదుర్దానవాదయః ॥
స్వలోకాదాశు నిర్గత్య గురుణా స్వేన సంయుతాః ।
సర్వేఽ సురాస్సంమిలితాస్సమాజగ్ము స్తదంతికమ్ ॥
ప్రణమ్య తం సవినయం సంస్తుత్య వివిధాధరాత్ ।
స్థితాస్తత్రైవ సుప్రీత్యా మత్వా తేజస్వినం విభుమ్ ॥
సోఽపి దంభాత్మజో దృష్ట్వాగతం కులగురుం చ తమ్ ।
ప్రణనామ మహాభక్త్యా సాష్టాంగం పరమాదరాత్ ॥
అథ శుక్రః కులాచార్యో దృష్ట్వాశిషమనుత్తమమ్ ।
వృత్తాంతం కథయామాస దేవదానవయోస్తదా ॥
స్వాభావికం చ తద్వైరమసురాణాం పరాభవమ్ ।
విజయం నిర్జరాణాం చ జీవ సాహాయ్యమేవ చ ॥
తతస్స సమ్మతం కృత్వాఽసురై స్సర్వైస్సముత్సవమ్ ।
దానవాద్యసురాణాం తమధిపం విదధే గురుమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఆ శంఖచూడుడు తపస్సు చేసి వరమును పొంది వివాహమాడి తన ఇంటికి తిరిగి వచ్చినందులకు దానవులు, ఇతరులు సంతసించిరి (1). రాక్షసులందరు కలసి తమ లోకమునుండి వెంటనే బయల్వెడలి తమ గురువును వెంట బెట్టుకొని ఆతని వద్దకు వచ్చిరి (2). వారు ఆతనికి సవినయముగా ప్రణమిల్లి వివిధస్తోత్రములను చేసి ఆదరముతో మిక్కిలి ప్రీతితో అచటనే ఉండిరి. ఆతడు తేజస్వి, సమర్థుడు అని వారు భావించిరి (3). దంభుని కుమారుడగు ఆ శంఖచూడుడు కూడ విచ్చేసిన కులగురువును గాంచి ఆయనకు మహాదరముతో పరమభక్తితో సాష్టాంగ ప్రణామమును చేసెను (4). అపుడు కులగురువగు శుక్రాచార్యుడు సర్వశ్రేష్ఠమగు ఆశీస్సును ఇచ్చి, తరువాత దేవదానవుల వృత్తాంతమును చెప్పెను (5). రాక్షసులకు దేవతలతో గల సహజవైరము, రాక్షసులకు జరిగిన పరాభవము, దేవతల విజయము, బృహస్పతి చేసిన సాహాయ్యము అను విషయములను వివరించెను (6). అపుడాతడు రాక్షసులందరి అనుమతిని తీసుకొని ఆయనను .దానవులకు, అసురులకు, మరియు తజ్జాతీయులకు అధిపతిగా, గురువుగా నియమించెను. అపుడు గొప్ప ఉత్సవము జరిగెను (7).

తదా సముత్సవో జాతోఽసురాణాం ముదితాత్మనామ్ ।
ఉపాయనాని సుప్రీత్యా దదుస్తస్మై చ తేఽఖిలాః ॥
అథ దంభాత్మజో వీరశ్శంఖచూడః ప్రతాపవాన్ ।
రాజ్యాభిషేకమాసాద్య స రేజేఽసురరాట్ తదా ॥
స సేనాం మహతీం కర్షన్ దైత్యదానవరక్షసామ్ ।
రథమాస్థాయ తరసా జేతుం శక్రపురీం యయౌ ॥
గచ్ఛన్ స దానవేంద్రస్తు తేషాం సేవన కుర్వతామ్ ।
విరేజే శశివద్భానాం గ్రహాణాం గ్రహరాడివ ॥
ఆగచ్ఛంతం శంఖచూడమా కర్ణ్యాఖండలస్స్వరాట్ ।
నిఖిలైరమరైస్సార్ధం తేన యోద్ధుం సముద్యతః ॥
తదాఽ సురైస్సురాణాం చ సంగ్రామస్తుములో హ్య భూత్ ।
వీరానందకరః క్లీబభయదో రోమహర్షణః ॥
మహాన్ కోలాహలో జాతో వీరాణాం గర్జతాం రణే ।
వాద్య ధ్వనిస్తథా చాసీత్తత్ర వీరత్వవర్ధినీ ॥

అప్పుడు ఆనందముతో నిండిన మనస్సు గల రాక్షసులు గొప్ప ఉత్సవమును జరుపుకొనిరి. వారందరు ఆతనికి గొప్ప ప్రీతితో బహుమతుల నందజేసిరి (8). అపుడు దంభుని పుత్రుడు, వీరుడు, ప్రతాపశీలియగు శంఖచూడుడు రాజ్యాభిషిక్తుడై రాక్షసరాజ పదవిని పొంది ప్రకాశించెను (9). ఆతడు దైత్యదానవరాక్షసులతో గూడిన పెద్ద సేన వెంటరాగా రథము నెక్కి వేగముగా ఇంద్రుని నగరమునకు జైత్రయాత్రకై బయల్వెడలెను (10). ఆ రాక్షసరాజు వారిచే సేవింపబడుతూ వెళ్లుచున్నవాడై నక్షత్రముల మధ్య చంద్రుని వలె, గ్రహముల మధ్య సూర్యునివలె ప్రకాశించెను (11). స్వర్గాధిపతియగు ఇంద్రుడు శంఖచూడుని రాకను గూర్చి విని దేవతలందరితో గూడి ఆతనితో యుద్ధమును చేయుటకు సన్నద్ధుడాయెను (12). అపుడు దేవతలకు రాక్షసులకు మధ్య వీరులకు ఆనందమును కలిగించునది, పరాక్రమవిహీనులకు భయమును గొల్పునది, గగుర్పాటు కలిగించునది, అద్భుతమైనది అగు యుద్ధము జరిగెను (13). యుద్ధములో వీరులు గర్జించుటచే పెద్ద కోలాహలము చెలరేగెను. మరియు అచట పరాక్రమమును వర్ధిల్లజేయు వాద్యముల ధ్వని చేయబడెను (14).

దేవాః ప్రకుప్య యుయుధురసురైర్బలవత్తరాః ।
పరాజయం చ సంప్రాపురసురా దుద్రువుర్భయాత్ ॥
పలాయమానాంస్తాన్ దృష్ట్వా శంఖచూడస్స్వయం ప్రభుః ।
యుయుధే నిర్జరైస్సాకం సింహనాదం ప్రగర్జ్య చ ॥
తరసా సహసా చక్రే కదనం త్రిదివౌకసామ్ ।
ప్రదుద్రువుస్సు రాస్సర్వే తత్సుతేజో న సేహిరే ॥
యత్ర తత్ర స్థితా దీనా గిరీణాం కందరాసు చ ।
తదధీనా న స్వతంత్రా నిష్ప్రభాస్సాగరా యథా ॥
సోఽపి దంభాత్మజశ్శూరో దానవేంద్రః ప్రతాపవాన్ ।
సురాధికారాన్ సంజహ్రే సర్వాంల్లోకాన్ విజిత్య చ ॥
త్రైలోక్యం స్వవశం చక్రే యజ్ఞభాగాంశ్చ కృత్స్నశః ।
స్వయమింద్రో బభూవాపి శాసితం నిఖిలం జగత్ ॥
కౌబేరమైందవం సౌర్యమాగ్నేయం యామ్యమేవ చ ।
కారయామాస వాయవ్యమధికారం స్వశక్తితః ॥

అధిక బలశాలురగు దేవతలు కోపించి రాక్షసులతో యుద్ధమును చేసిరి. రాక్షసులు పరాజయమును పొంది భయముతో పరుగెత్తిరి (15). సమర్థుడగు శంఖచూడుడు వారు పారిపోవుచుండుటను గాంచి సింహనాదమును చేసి స్వయముగా దేవతలతో యుద్ధమును చేసెను (16). ఆతడు వెంటనే వేగముగా దేవతలపై విరుచుకుపడగా, ఆతని గొప్ప తేజస్సును సహింపజాలక దేవతలందరు పరుగులెత్తిరి (17). కొండగుహలలో, మరియు ఇతరస్థలములలో ఎచటనో ఉన్నవారై దీనులగు దేవతలు ఆతనికి వశులై స్వాతంత్ర్యమును గోల్పోయి గడ్డకట్టిన సముద్రమువలె కాంతి విహీనులైరి (18), దంభుని పుత్రుడు, శూరుడు, ప్రతాపశీలియగు ఆ రాక్షసరాజు కూడ సర్వలోకములను జయించి దేవతల అధికారములను లాగుకొనెను (19). ఆతడు ముల్లోకములను తన వశము చేసుకొని యజ్ఞభాగములను పూర్తిగా తానే స్వీకరించి తానే ఇంద్రుడై జగత్తు నంతనూ పాలించెను (20). ఆతడు కుబేర, చంద్ర, సూర్య, అగ్ని, యమ, వాయువుల అధికారములను తన శక్తిచే నిర్వహించెను (21).

దేవానా మసురాణాం చ దానవానాం చ రక్షసామ్ ।
గంధర్వాణాం చ నాగానాం కిన్నరాణాం రసౌకసామ్ ॥
త్రిలోకస్య పరేషాం చ సకలానామధీశ్వరః ।
స బభూవ మహావీర శ్శంఖచూడో మహాబలీ ॥
ఏవం స బుభుజే రాజ్యం రాజరాజేశ్వరో మహాన్ ।
సర్వేషాం భువనానాం చ శంఖచూడశ్చిరం సమాః ॥
తస్య రాజ్యే న దుర్భిక్షం న మారీ నాఽ శుభగ్రహాః ।
ఆధయో వ్యాధయో నైవ సుఖిన్యశ్చ ప్రజాస్సదా ॥
అకృష్టపచ్యా పృథివీ దదౌ సస్యాన్యనేకశః ।
ఓషధ్యో వివిధాశ్చాసన్ సఫలాస్సరసాస్సదా ॥
మణ్యాకరాశ్చ నితరాం రత్న ఖన్యశ్చ సాగరాః ।
సదా పుష్పఫలా వృక్షా నద్యస్సుసలిలావహాః ॥
దేవాన్ వినా ఖిలా జీవాస్సుఖినో నిర్వికారకాః ।
స్వస్వధర్మస్థితాస్సర్వే చతుర్వర్ణాశ్రమాః పరే ॥

మహావీరుడు, మహాబలశాలి యగు ఆ శంఖచూడుడు దేవ- అసుర- దానవ- రాక్షస-గంధర్వ-నాగ- కిన్నర-సర్పాది సర్వులకు, ముల్లోకములకు అధీశ్వరుడాయెను (22, 23). రాజరాజేశ్వరుడు, మహాత్ముడునగు ఆ శంఖచూడుడు ఈ విధముగా సకల భువనా ధిపత్యమును అనేక సంవత్సరములనుభవించెను (24). ఆతని రాజ్యములో దుర్భిక్షము, రోగములు, అమంగళ గ్రహములు, అంటు వ్యాధులు, మనోవ్యాధులు లేక ప్రజలు సర్వదా సుఖముననుభవించిరి (25). భూమి దున్నకుండగనే అనేక సస్యముల నిచ్చెను. వివిధరకముల ఓషధులు సర్వదా రసవంతములై యుండి, సత్ఫలములనిచ్చెను (26). సముద్రములు మణులకు, రత్నములకు నిలయములై యుండెను. వృక్షములు అన్ని కాలములలో పుష్పములను ఫలములను కలిగియుండెను. నదులు స్వచ్ఛ జలములతో నిండి యుండెను (27). దేవతలు తక్క మిగిలిన ప్రాణులన్నియూ వికారములు లేకుండగా సుఖముగా నుండెను. నాలుగు వర్ణముల, మరియు ఆశ్రమములకు చెందిన ప్రజలు అందరు తమతమ ధర్మములను ననుష్ఠించిరి (28).

తస్మిన్ శాసతి త్రైలోక్యే న కశ్చిద్దుఃఖితోఽ భవత్ ।
భ్రాతృవైరత్వమాశ్రిత్య కేవలం దుఃఖినోఽమరాః ॥
స శంఖచూడః ప్రబలః కృష్ణస్య పరమస్సఖా ।
కృష్ణభక్తిరతస్సాధుస్సదా గోలకవాసినః ॥
పూర్వశాప ప్రభావేణ దానవీం యోనిమాశ్రితః ।
న దానవమతి స్సోఽ భూద్దానవత్వేఽ పి వై మునే ॥
తతస్సురగణాస్సర్వే హృతరాజ్యాః పరాజితాః ।
సంమంత్ర్య సర్షయస్తాత ప్రయయుర్బ్రహ్మణ స్సభామ్ ॥
తత్ర దృష్ట్వా విధాతారం నత్వా స్తుత్వా విశేషతః ।
బ్రహ్మణే కథయామాసుస్సర్వం వృత్తాంతమాకులాః ॥
బ్రహ్మా తదా సమాశ్వాస్య సురాన్ సర్వాన్మునీనపి ।
తైశ్చ సార్ధం యయౌ లోకే వైకుంఠం సుఖదం సతామ్ ॥
దదర్శ తత్ర లక్ష్మీశం బ్రహ్మా దేవగణైస్సహ ।
కిరీటినం కుండలినం వనమాలా విభూషితమ్ ॥
శంఖచక్ర గదా పద్మధరం దేవం చతుర్భుజమ్ ।
సనందనాద్యైస్సిద్ధైశ్చ సేవితం పీతవాససమ్ ॥
దృష్ట్వా విష్ణుం సురాస్సర్వే బ్రహ్మాద్యాస్సమునీశ్వరాః ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా బద్ధాంజలికరా విభుమ్ ॥

ఆతడు ముల్లోకములను పాలించుచుండగా ఎవ్వరైననూ దుఃఖితులు కాలేదు. కాని దేవతలు మాత్రమే జ్ఞాతివైరమును పట్టుకొని దుఃఖమును పొందిరి (29). బలశాలి, శ్రీకృష్ణుని అనుంగు మిత్రుడు, సర్వదా గోలోకవాసియగు శ్రీ కృష్ణుని భక్తి యందు నిష్ఠ గలవాడు, పూర్వజన్మలోని శాపముయొక్క ప్రభావముచే దానవవంశములో జన్మించిన వాడు అగు ఆ శంఖచూడుడు దానవుడే అయిననూ దానవబుద్ధిని కలిగియుండలేదు. ఓమునీ! (30,31) వత్సా! అపుడు పరాజయమును పొంది రాజ్యభ్రష్టులై యున్న దేవతాగణములందరు ఋషులతో కలిసి సంప్రదించి బ్రహ్మను దర్శించి ప్రణమిల్లి విశేషముగా స్తుతించి వృత్తాంతమునంతనూ ఆయనకు విన్నవించిరి (33). అపుడు బ్రహ్మ దేవతలను, మునులను అందరినీ ఓదార్చి వారిని వెంటనిడుకొని లోకమునందలి సత్పురుషులకు సుఖమునొసంగు వైకుంఠమునకు వెళ్లెను (34). బ్రహ్మ దేవతా గణములతో గూడి అచట కిరీట కుండల వనమాలలతో అలంకరింపబడిన వాడు, శంఖచక్ర గదా పద్మములను ధరించిన వాడు, ప్రకాశస్వరూపుడు, నాల్గు భుజములు గలవాడు, సనందనాది సిద్ధులచే సేవింపబడువాడు, పచ్చని వస్త్రమను ధరించువాడు లక్ష్మీపతి (35,36), అగు విష్ణువును గాంచెను. అపుడు బ్రహ్మాది సర్వదేవతలు, మునీశ్వరులతో గూడి సర్వేశ్వరుడగు విష్ణువును గాంచి ప్రణమిల్లి చేతులు జోడించి భక్తితో స్తుతించిరి (37).

దేవా ఊచుః ।

దేవదేవ జగన్నాథ వైకుంఠాధిపతే ప్రభో ।
రక్షాస్మాన్ శరణాపన్నాన్ శ్రీ హరే త్రిజగద్గురో ॥
త్వమేవ జగతాం పాతా త్రిలోకేశాచ్యుత ప్రభో ।
లక్ష్మీనివాస గోవింద భక్తప్రాణ నమోఽస్తుతే ॥
ఇతి స్తుత్వా సురాస్సర్వే రురుదుః పురతో హరేః ।
తచ్ఛ్రుత్వా భగవాన్ విష్ణు ర్బ్రహ్మాణమిదమబ్రవీత్ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! జగన్నాథా! వైకుంఠాధిపతీ! ప్రభూ! శ్రీహరీ! త్రిభువనములకు తండ్రీ! శరణు జొచ్చిన మమ్ములను రక్షింపుము . (38). ఓ అచ్యుత ప్రభూ! వక్షస్థలమునందు లక్ష్మి గలవాడా! ఓ త్రిలోకాధిపతీ! జగత్తులను రక్షించువాడవు నీవే. ఓ గోవిందా! భక్తప్రియా! నీకు నమస్కారము (39). దేవతలందరు ఇట్లు స్తుతించి విష్ణువు యెదుట ఏడ్చిరి. విష్ణుభగవానుడు అది విని బ్రహ్మతో ఇట్లు పలికెను (40).

విష్ణురువాచ ।

కిమర్థమాగతోఽసి త్వం వైకుంఠం యోగిదుర్లభమ్ ।
కిం కష్టం తే సముద్భూతం తత్త్వం వద మమాగ్రతః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

యోగులకైననూ పొంద శక్యము కాని వైకుంఠమునకు నీవేల వచ్చితివి? నీకు వచ్చిన కష్టమేమి? నా ఎదుట సత్యమును పలుకుము (41).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా హరేర్వాక్యం ప్రణమ్య చ ముహుర్ముహుః ।
బద్ధాంజలిపుటో భూత్వా వినయానతకంధరః ॥
వృత్తాంతం కథయామాస శంఖచూడకృతం తదా ।
దేవ కష్టసమాఖ్యానం పురో విష్ణోః పరాత్మనః ॥
హరిస్తద్వచనం శ్రుత్వా సర్వతస్సర్వభావవిత్ ।
ప్రహస్యోవాచ భగవాంస్త ద్రహస్యం విధిం ప్రతి ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

విష్ణువు యొక్క ఈ మాటను విని బ్రహ్మ పలుమార్లు ప్రణమిల్లి చేతులు జోడించి తల వంచి వినయముతో నమస్కరించి, అపుడు శంఖచూడుడు చేసిన పనిని, దేవతలకు సంప్రాప్తమైన ఆపదను విష్ణు పరమాత్మ యెదుట వివరముగా చెప్పెను (42,43). ఆ వృత్తాంతమునంతనూ విని అందరి మనో భావనలనెరింగే హరి భగవానుడు ఆ శంఖచూడుని రహస్యము నెరింగి నవ్వి బ్రహ్మతో నిట్లనెను (44).

శ్రీ భగవానువాచ ।

శంఖచూడస్య వృత్తాంతం సర్వం జానామి పద్మజ ।
మద్భక్తస్య చ గోపస్య మహాతేజస్వినః పురా ॥
శృణుతస్సర్వవృత్తాంతమితిహాసం పురాతనమ్ ।
సందేహో నైవ కర్తవ్యశ్శం కరిష్యతి శంకరః ॥
సర్వోపరి చ యస్యాస్తి శివలోకః పరాత్పరః ।
యత్ర సంరాజతే శంభుః పరబ్రహ్మ పరమేశ్వరః ॥
ప్రకృతేః పురుషస్యాపి యోఽధిష్ఠాతా త్రిశక్తి ధృక్ ।
నిర్గుణస్సగుణస్సోఽపి పరం జ్యోతిస్స్వరూపవాన్ ॥
యస్యాంగ జాస్తు వై బ్రహ్మంస్త్ర యస్సృష్ట్యాదికారకాః ।
సత్త్వాదిగుణసంపన్నా విష్ణు బ్రహ్మ హరాభిధాః ॥
స ఏవ పరమాత్మా హి విహరత్యుమయా సహ ।
యత్ర మాయావినిర్ముక్తో నిత్యానిత్య ప్రకల్పకః ॥
తత్సమీపే చ గోలోకో గోశాలా శంకరస్య వై ।
తస్యేచ్ఛయా చ మద్రూపః కృష్ణో వసతి తత్ర హ ॥

శ్రీవిష్ణుభగవానుడిట్లు పలికెను -

ఓ పద్మసంభవా! నా భక్తుడు, గొప్ప తేజశ్శాలి, పూర్వజన్మలో గోపాలకుడు అగు శంఖచూడుని వృత్తాంతమునంతనూ నేను ఎరుంగుదును (45). పూర్వము జరిగిన ఈ వృత్తాంతమునంతనూ వినుడు. శంకరుడు మంగళమును చేయగలడు. సందేహము వలదు (46). ఆ శివుని లోకము సర్వలోకములకు పైన గలదు. పరాత్పరుడు, పరబ్రహ్మ, పరమేశ్వరుడు అగు శంభుడు ఆ లోకములో అతిశయించి ప్రకాశించుచున్నాడు (47). ప్రకృతి పురుషులిద్దరికీ అధిష్ఠానమగు ఆయన ఇచ్ఛా క్రియా జ్ఞానములను మూడు శక్తులను ధరించి యున్నాడు. ఆయన నిర్గుణుడైననూ సగుణుడు కూడా. సర్వోత్కృష్టస్వయం ప్రకాశమే ఆయన స్వరూపము (48). ఓ బ్రహ్మా! సత్త్వరజస్తమో గుణ ప్రధానులై క్రమముగా సృష్టిస్థితిలయములను చేయు బ్రహ్మవిష్ణు హరులనే త్రిమూర్తులు ఆయన దేహమునుండి పుట్టినవారే (49). ఆయనయే పరమాత్మ. నిత్య, అనిత్యవస్తువులను కల్పించే ఆయన మాయా సంబంధము లేని వాడై ఉమాదేవితో గూడి విహరించుచున్నాడు (50). ఆ శివలోకమునకు సమీపములో గోలోకము, శంకరుని గోశాల గలవు. నా అవతారమగు శ్రీ కృష్ణుడు శంకరుని ఇచ్ఛచే ఆ గోలోకమునందు నివసించుచున్నాడు (51).

తద్గవాం రక్షణార్థాయ తేనాజ్ఞప్తస్సదా సుఖీ ।
తత్సంప్రాప్తసుఖస్సోఽపి సంక్రీడతి విహారవిత్ ॥

తస్య నారీ సమాఖ్యాతా రాధేతి జగదంబికా ।
ప్రకృతేః పరమా మూర్తిః పంచమీ సువిహారిణీ ॥

బహుగోపాశ్చ గోప్యశ్చ తత్ర సంతి తదంగజాః ।
సువిహారపరా నిత్యం రాధాకృష్ణాను వర్తినః ॥

స ఏవ లీలయా శంభోరిదానీం మోహితోఽనయా ।
సంప్రాప్తో దానవీం యోనిం ముధా శాపాత్స్వదుఃఖదామ్ ॥

రుద్రశూలేన తన్మృత్యుః కృష్ణేన విహితః పురా ।
తతస్స్వదేహముత్సృజ్య పార్షదస్స భవిష్యతి ॥

ఇతి విజ్ఞాయ దేవేశ న భయం కర్తుమర్హసి ॥
శంకరం శరణం యావస్స సద్యశ్శం విధాస్యతి ॥
అహం త్వం చామరాస్సర్వే తిష్ఠంతీహ విసాధ్వసాః ॥

శివుడు శ్రీకృష్ణుని తన గోవుల రక్షణ కొరకు నియోగించెను. శ్రీ కృష్ణుడు శివుని నుండి లభించిన సుఖమును అనుభవిస్తూ అచట సర్వదా క్రీడించుచుండును. ఆయన విహారకుశలుడు (52). జగన్మాత, ప్రకృతి కంటె ఉత్కృష్టమైన స్వరూపము గల అయిదవ మూర్తి, విహారప్రియురాలు అగు రాధ ఆతని ప్రియురాలు అని చెప్పబడినది (53). ఆమె నుండి జన్మించిన గోపాలకులు, గోపికలు చాలమంది అచట రాధాకృష్ణులను సేవిస్తూ నిత్యము చక్కని విహారమునందు నిమగ్నులై యుందురు (54). ఆ సుదాముడు శంభుని లీలచే రాధాదేవిని చూచి మోహితుడయ్యెను. ఆమె శపించగా ఆతడు తనకు దుఃఖమును కలుగజేసే దానవరూపమును వ్యర్థముగా పొందియున్నాడు (55). ఆతడు రుద్రుని శూలముచే వధింపబడునని పూర్వము శ్రీకృష్ణుడు నిర్ణయించి యున్నాడు. ఆతడు తన దేహమును విడిచిన పిదప శ్రీకృష్ణుని అనుచరుడు కాగలడు (56). ఓ ఇంద్రా! ఈ సత్యము నెరింగి భయమును విడనాడుము. మనము శంకరుని శరణు జొచ్చెదము. ఆయన వెంటనే మంగళమును చేయగలడు (57). నేను, నీవు, మరియు సర్వదేవతలు భయమును వీడి ఇచట నున్నాము (58).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా సవిధిర్విష్ణుశ్శివలోకం జగామ హ ।

సంస్మరన్మనసాశంభుం సర్వేశం భక్త వత్సలమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శంఖచూడ పూర్వభవవృత్తవర్ణనం నామ ఏకోన త్రింశోఽధ్యాయః (29).

సనత్కుమారుడిట్లు పలికెను -

ఇట్లు పలికి విష్ణువు బ్రహ్మతో గూడి సర్వేశ్వరుడు, భక్త వత్సలుడునగు శంభుని మనస్సులో స్మరిస్తూ శివలోకమునకు వెళ్లెను (59).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండములో శంఖచూడ పూర్వభవవృత్త వర్ణనమనే ఇరువది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (29).

30 - దేవదేవస్తుతి

సనత్కుమార ఉవాచ ।

గత్వా తదైవ సవిధిస్తదా వ్యాస రమేశ్వరః ।
శివలోకం మహాదివ్యం నిరాధారమభౌతికమ్ ॥
సాహ్లాదోఽభ్యంతరం విష్ణుర్జగామ ముదితాననః ।
నానారత్న పరిక్షిప్తం విలసంతం మహోజ్జ్వలమ్ ॥
సంప్రాప్య ప్రథమం ద్వారం విచిత్రం గణసేవితమ్ ।
శోభితం పరయా లక్ష్మ్యా మహోచ్చమతి సుందరమ్ ॥
దదర్శ ద్వారపాలాంశ్చ రత్నసింహాసన స్థితాన్ ।
శోభితాన్ శ్వేతవ స్త్రైశ్చ రత్నభూషణ భూషితాన్ ॥
పంచవక్త్రత్రినయనాన్ గౌర సుందరవిగ్రహాన్ ।
త్రిశూలాది ధరాన్ వీరాన్ భస్మరుద్రాక్షశోభితాన్ ॥
సబ్రహ్మాపి రమేశశ్చ తాన్ ప్రణమ్య వినమ్రకః ।
కథయామాస వృత్తాంతం ప్రభుసందర్శనార్థకమ్ ॥
తదాజ్ఞాం చ దదుస్తస్మై ప్రవివేశ తదాజ్ఞయా ।
పరం ద్వారం మహారమ్యం విచిత్రం పరమ ప్రభమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! లక్ష్మీ పతి అదే సమయములో బ్రహ్మతో కలిసి మహాదివ్య్యమైనది, ఆధారము లేనిది, భూత నిర్మితము కానిది యగు శివలోకమునకు వెళ్లి (1), ఆనందముతో గూడిన ముఖము గలవాడై లోపలికి వెళ్లెను. విష్ణువు అనేక రత్నములు పొదుగుటచే మిరిమిట్లు గొల్పుతూ మెరియుచున్నది (2), రంగురంగులది, గణములచే సేవింపబడుచున్నది, గొప్ప కాంతితో శోభిల్లునది, చాల పెద్దది, మిక్కిలి సుందరమైనది అగు మొదటి ద్వారమును గాంచెను (3). రత్నసింహాసనములయందు కూర్చున్నవారు, తెల్లని వస్త్రములతో ప్రకాశించుచున్నవారు, రత్న భూషణములతో అలంకరింపబడిన వారు, అయిదు ముఖములు మూడు కన్నులు గలవారు, పచ్చని అందమగు దేహములు గలవారు, త్రిశూలము మొదలగు ఆయుధములను దాల్చిన వీరులు, మరియు భస్మతో రుద్రాక్షలతో ప్రకాశించువారు అగు ద్వారపాలకులను కూడ గాంచెను (4,5). లక్ష్మీపతి బ్రహ్మతో సహా వినమ్రతతో వారికి ప్రణమిల్లి ప్రభుడగు శివుని దర్శించదగిన పని గలదని చెప్పెను (6). అపుడు వారు ఆతనికి అనుజ్ఞనీయగా, ఆతడు మిక్కిలి సుందరమైనది, రంగురంగులది, గొప్ప కాంతులను వెదజల్లునది అగు ఆ గొప్ప ద్వారము లోపలకు ప్రవేశించెను (7).

ప్రభూపకంఠ గత్యర్థం వృత్తాంతం సంన్యవేదయత్ ।
తద్ద్వారపాయ చాజ్ఞప్తస్తేనాన్యం ప్రవివేశ హ ॥
ఏవం పంచదశద్వారాన్ ప్రవిశ్య కమలోద్భవః ।
మహాద్వారం గతస్తత్ర నందినం ప్రదదర్శ హ ॥
సమ్యజ్ నత్వా చ తం స్తుత్వా పూర్వవత్తేన నందినా ।
ఆజ్ఞప్తశ్చ శనైర్విష్ణు ర్వివేశాభ్యంతరం ముదా ॥
దదర్శ గత్వా తత్రోచ్చైస్సభాం శంభోస్సముత్ప్రభామ్ ।
తాం పార్షదైః పరివృతాం లసద్దేహై స్సభాషితామ్ ॥
మహేశ్వరస్య రూపైశ్చ దిగ్భుజైశ్శుభకాంతిభిః ।
పంచవక్త్రైస్త్రి నయనైశ్శితికంఠైర్మహోజ్జ్వలైః ॥
సద్రత్నయుక్తరుద్రాక్ష భస్మాభరణ భూషితైః ।
నవేందు మండలాకారాం చతురస్రం మనోహరామ్ ॥
మణీంద్రహార నిర్మాణహీర సారసుశోభితామ్ ।
అమూల్యరత్నరచితాం పద్మపత్రైశ్చ శోభితామ్ ॥

అచట మరియొక ద్వారపాలకునకు కూడ తాను ప్రభువు వద్దకు వెళ్లవలసిన కారణము గలదని విష్ణువు విన్నవించి ఆతని అనుమతిని బడసి ఆ ద్వారము లోపల ప్రవేశించెను (8). బ్రహ్మ ఈ విధముగా పదిహేను ద్వారములను దాటి మహాద్వారమును చేరి అచట నందిని గాంచెను (9). విష్ణువు పూర్వము నందు వలె ఆ నందిని చక్కగా స్తుతించి నమస్కరించి ఆతని అనుమతిని పొంది ఆనందముతో మెల్లగా లోపలకు ప్రవేశించెను (10). అచటకు వెళ్లి అచట గొప్ప శోభ గలది, ఎత్తైనది, ప్రకాశించే దేహములు గల గణములతో చుట్టు వారబడి యున్నది, చక్కగా అలంకరించబడినది అగు శంభుని సభను గాంచెను (11). మహేశ్వరుని రూపముగల ఆ గణములు పది భుజములతో, అయిదు ముఖములతో, మూడు కన్నులతో నల్లని కంఠములతో ప్రకాశించిరి. వారు దివ్యకాంతులతో ఒప్పారుచుండిరి (12). వారు మంచి రత్నములు పొదిగిన ఆభరణములను రుద్రాక్షలను అలంకరించుకొని భస్మను ధరించి యుండిరి. చతురస్రాకారముతో మనోహరముగా నున్న ఆ సభ నూతన చంద్రమండలము వలె శోభిల్లెను (13). మణులు, వజ్రములు పొదిగిన హారములతో ఆ సభ శోభిల్లెను. విలువ కట్టలేని రత్నములు పొదిగియున్న ఆ సభ పద్మపత్రములతో శోభిల్లుచుండెను (14).

మాణిక్య జాలమాలాభిర్నానాచిత్ర విచిత్రితామ్ ।
పద్మరాగేంద్రరచితామద్భుతాం శంకరేచ్ఛయా ॥
సోపాన శతకైర్యుక్తాం స్యమంతక వినిర్మితైః ।
స్వర్ణసూత్ర గ్రంథియుక్తైశ్చారు చందన పల్లవైః ॥
ఇంద్రనీలమణి స్తంభైర్వేష్టితాం సుమనోహరామ్ ।
సుసంస్కృతాం చ సర్వత్ర వాసితాం గంధవాయునా ॥
సహస్రయోజనాయామాం సుపూర్ణాం బహుకింకరైః ।
దదర్శ శంకరం సాంబం తత్ర విష్ణుస్సురేశ్వరః ॥
వసంతం మధ్యదేశే చ యథేందుం తారకావృతమ్ ।
అమూల్యరత్ననిర్మాణ చిత్రసింహాసన స్థితమ్ ॥
కిరీటినం కుండలినం రత్నమాలా విభూషితమ్ ।
భస్మోద్ధూళిత సర్వాంగం బిభ్రాంతం కేళిపంకజమ్ ॥
పురతో గీతనృత్యం చ పశ్యంతం సస్మితం ముదా ॥

మాణిక్యముల తోరణములు కలిగినది, రంగురంగుల కాంతులను విరజిమ్ము నది, పద్మరాగ ఇంద్రనీల మణులతో అద్భుతముగా శంకరుని ఇచ్ఛకు అనురూపముగా నిర్మింపబడినది (15), స్యమంతకమణులు పొదిగినవి. బంగరు త్రాళ్లతో కట్టబడినవి, సుందరమగు చందననిర్మితమైన లతాపల్లవాదులతో శోభిల్లునవియగు వందమెట్లు కలిగినది (16), ఇంద్రనీలమణుల స్తంభములతో చుట్టువారబడి మిక్కిలి మనోహరముగా నున్నది, అంతటా చక్కగా అలంకరింపబడినది, పరిమళభరితమగు వాయువుచే నిండియున్నది (17), వేయి యోజనముల వెడల్పు గలది, అనేక మంది కింకరులతో నిండియున్నది అగు సభలో జగన్మాతతో గూడి యున్న శంకరుని దేవదేవుడగు విష్ణువు గాంచెను (18). సభామధ్యములో అమూల్యమగు రత్నములచే నిర్మింపబడిన వివిధవర్ణముల సింహాసనమునందు కూర్చుండి చుక్కలతో చుట్టువారు బడియున్న చందురునివలె శోభిల్లువాడు (19), కిరిట కుండల రత్నమాలలచే అలంకరింపబడినవాడు, భస్మలేపనము గల సర్వావయవములు గలవాడు, విలాసము కొరకై పద్మమును పట్టుకున్న వాడు (20), ఎదుట ప్రదర్శింపబడు చున్న గానసహిత నాట్యమును ఆనందపూర్వకముగా చిరునవ్వుతో తిలకించు చున్నవాడు అగు శివుని గాంచెను (21).

శాంతం ప్రసన్నమనసముమాకాంతం మహోల్లసమ్ ।
దేవ్యా ప్రదత్త తాంబూలం భుక్తవంతం సువాసితమ్ ॥
గణైశ్చ పరయా భక్త్యా సేవితం శ్వేతచామరైః ।
స్తూయమానం చ సిద్ధైశ్చ భక్తి నమ్రాత్మకంధరైః ॥
గుణాతీతం పరేశానం త్రిదేవజనకం విభుమ్ ।
నిర్వికల్పం నిరాకారం సాకారం స్వేచ్ఛయా శివమ్ ॥
అమాయమజమాద్యం చ మాయాధీశం పరాత్పరమ్ ।
ప్రకృతేః పురుషస్యాపి పరమం స్వప్రభుం సదా ॥
ఏవం విశిష్టం తం దృష్ట్వా పరిపూర్ణతమం సమమ్ ।
విష్ణుర్బ్రహ్మా తుష్టువతుః ప్రణమ్య సుకృతాంజలీ ॥

శాంతుడు, ప్రసన్నమగు మనస్సు గలవాడు, పార్వతీపతి, గొప్ప ప్రకాశము గలవాడు, దేవిచే ఈయబడిన సుగంధ తాంబూలమును నములుచున్న వాడు (22), తెల్లని వింజామరలతో గణములచే సేవింపబడుచున్నవాడు, భక్తితో నమ్రమైన శిరస్సులు గల సిద్ధులచే స్తుతింపబడుచున్న వాడు (23), త్రిగుణములకు అతీతుడు, పరమేశ్వరుడు, త్రిమూర్తులకు తండ్రి, సర్వవ్యాపకుడు, భేదరహితుడు, ఆకారము లేని వాడు, యథేచ్ఛగా ఆకారమును స్వీకరించువాడు (24), మాయాసంగము లేనివాడు, పుట్టుక లేనివాడు, సర్వకారణుడు, మాయను వశము చేసుకున్నవాడు, పరాత్పరుడు, ప్రకృతి పురుషులకు అతీతమైనవాడు, నిత్యస్వరాట్ (25), పరిపూర్ణ తముడు, సర్వమునందు సమముగా నుండువాడు అగు శివుని గాంచి బ్రహ్మ విష్ణువులు చేతులు జోడించి నమస్కరించి స్తుతించిరి (26).

విష్ణువిధీ ఊచతుః ।

దేవదేవ మహాదేవ పరబ్రహ్మాఖిలేశ్వర ।
త్రిగుణాతీత నిర్వ్యగ్ర త్రిదేవజనక ప్రభో ॥
వయం తే శరణాపన్నా రక్షాస్మాన్ దుఃఖితాన్ విభో ।
శంఖచూడార్దితాన్ క్లిష్టాన్ సన్నాథాన్ పరమేశ్వర ॥
అయం యోఽ ధిష్ఠితో లోకో గోలోక ఇతి స స్మృతః ।
అధిష్ఠాతా తస్య విభుః కృష్ణోఽ యం త్వదధిష్ఠితః ॥
పార్షద ప్రవరస్తస్య సుదామా దైవయంత్రితః ।
రాధాశప్తో బభూవాథ శంఖచూడశ్చ దానవః ॥
తేన నిస్సారితాశ్శంభో పీడ్యమానాస్సమంతతః ।
హృతాధికారాస్తే దశా విచరంతి మహీతలే ॥
త్వం వినా న స వధ్యశ్చ సర్వేషాం త్రిదివౌకసామ్ ।
తం ఘాతయ మహేశాన లోకానాం సుఖమావహ ॥
త్వమేవ నిర్గుణ స్సత్యోఽ నంతోఽ నంత పరాక్రమః ।
సగుణశ్చ సన్నివేశః ప్రకృతేః పురుషాత్పరః ॥

బ్రహ్మవిష్ణువులిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! పరబ్రహ్మా! సర్వేశ్వరా! సత్త్వరజస్తమో గుణములకు అతీతమైనవాడా! ఆనందస్వరూపా! త్రిమూర్తుల తండ్రీ! ప్రభూ! (27) మేము నిన్ను శరణు పొందుచున్నాము. ఓ విభూ! పరమేశ్వరా! శంఖచూడునిచే పీడింపబడి క్లేశములను పొంది దుఃఖితులమై యున్నాము. సత్స్వరూపుడవగు నీవే మాకు నాథుడవు. మమ్ములను రక్షింపుము (28). ఇచటకు సమీపములో నున్న లోకమునకు గోలోకమని పేరు. దానికి శ్రీకృష్ణ భగవానుడు అధీశ్వరుడు. ఆయనకు నీవు ప్రభుడవు (29). శ్రీకృష్ణుని అనుంగు సహచరుడగు సుదాముడు దైవవశముచే రాధచే శపింపబడి శంఖచూడుడనే దానవుడైనాడు (30). ఓ శంభూ! ఆతడు దేవతలను పలుపలు విధముల బాధలకు గురిచేసి స్వర్గమునుండి వెళ్లగొట్టినాడు. తమ అధికారములను పోగొట్టుకొనిన దేవతలు భూలోకములో తిరుగాడుచున్నారు (31). ఆతనిని దేవతలందరిలో ఒక్క రైననూ సంహరింపజాలరు. నీవు మాత్రమే ఆతనిని సంహరించగలవు. ఓ మహేశ్వరా! నీవాతనిని వధించి లోకములకు సుఖమును కలుగజేయుము (32). నిర్గుణుడు, సత్యస్వరూపుడు, అనంతుడు, అంతములేని పరాక్రమము గలవాడు, సగుణుడు, సత్పురుషులకు ఆశ్రయమైనవాడు, ప్రకృతిపురుషులకు అతీతుడు అగు పరమాత్మ నీవే (33).

రజసా సృష్టిసమయే త్వం బ్రహ్మా సృష్టి కృత్ప్రభో ।
సత్త్వేన పాలనే విష్ణుస్త్రి భువావనకారకః ॥
తమసా ప్రలయే రుద్రో జగత్సంహారకారకః ।
నిస్త్రైగుణ్యే శివాఖ్యాతస్తుర్యో జ్యోతిస్స్వరూపకః ॥
త్వదీక్షయా చ గోలోకే త్వద్గవాం పరిపాలకః ।
త్వద్గోశాల మధ్య గశ్చ కృష్ణః క్రీడత్యహర్నిశమ్ ॥
త్వం సర్వకారణం స్వామీ విధిర్విష్ణ్వీశ్వరః పరమ్ ।
నిర్వికారీ సదా సాక్షీ పరమాత్మా పరేశ్వరః ॥
దీనానాథ సహాయీ చ దీనానాం ప్రతిపాలకః ।
దీనబంధుస్త్రి లోకేశశ్శరణాగతవత్సలః ॥
అస్మానుద్ధర గౌరీశ ప్రసీద పరమేశ్వర ।
త్వదధీనా వయం నాథ యదిచ్ఛసి తథా కురు ॥

ఓ ప్రభూ! సృష్టి కాలములో నీవు రజోగుణ ప్రధానుడవై బ్రహ్మరూపములో సృష్టిని చేసెదవు. విష్ణురూపములో సత్త్వగుణ ప్రధానుడవై ముల్లోకములను రక్షించెదవు (34). తమో గుణ ప్రధానుడవై రుద్రరూపములో ప్రళయకాలము నందు జగత్తును నాశము చేసెదవు. త్రిగుణా తీతమగు తురీయ శుద్ధచైతన్య స్వరూపుడవై శివనామముతో ప్రసిద్ధిని గాంచి యున్నావు (35). శ్రీకృష్ణుడు నీ ఆజ్ఞచే నీ గోవులను రక్షిస్తూ గోలోకములో నీ గోశాల మధ్యలో నున్న వాడై రాత్రింబగళ్లు క్రీడించుచున్నాడు (36). సర్వమునకు కారణము మరియు ప్రభువు నీవే. బ్రహ్మ విష్ణురుద్రరూపములలో నున్న నిర్వికార పరబ్రహ్మవు నీవే. నిత్యసాక్షియగు పరమాత్మ నీవే. నీవు ఈశ్వరులకు ఈశ్వరుడవు (37). దీనులకు అనాథులకు సాహాయ్యకారియై వారిని పాలించు దీన బంధువు నీవే. త్రిలోకాధిపతివి అగు నీవు శరణు జొచ్చిన వారియందు వాత్సల్యమును చూపెదవు (38). ఓ గౌరీపతీ! పరమేశ్వరా! మమ్ములను నుద్ధరించుము. ప్రసన్నుడవు కమ్ము. ఓ నాథా! మేము నీ అధీనములో నున్నాము. నీకు ఎట్లు ఇష్టమైనచో, అటులనే చేయుము (39).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తౌ సురౌ వ్యాస హరిర్బ్రహ్మా చ వై తదా ।

విరేమతుశ్శివం నత్వా కరౌ బద్ధ్వా వినీతకౌ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే

దేవదేవస్తుతిర్నామ త్రింశోఽధ్యాయః (30).

ఓ వ్యాసా! బ్రహ్మ విష్ణువులనే ఆ దేవతలిద్దరు అపుడిట్లు పలికి వినయముతో చేతులు జోడించి శివునకు నమస్కరించి విరమించిరి (40).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో దేవదేవస్తుతియను ముప్పదియవ అధ్యాయము ముగిసినది (30).

31 – బ్రహ్మ విష్ణువులకు శివుని ఉపదేశము

సనత్కుమార ఉవాచ ।

అథాకర్ణ్య వచశ్శంభుర్వా రి విధ్యో స్సుదీనయోః ।
ఉవాచ విహసన్ వాణ్యా మేఘనాద గభీరయా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

మిక్కిలి దీనులగు ఆ బ్రహ్మ విష్ణువుల ఈ మాటలను విని శంభుడు నవ్వి మేఘగర్జన వలె గంభీరమగు స్వరముతో నిట్లనెను (1).

శివ ఉవాచ ।

హే హరే వత్స హే బ్రహ్మంస్త్యజతం సర్వతో భయమ్ ।
శంఖచూడోద్భవం భద్రం సంభవిష్యత్య సంశయమ్ ॥
శంఖచూడస్య వృత్తాంతం సర్వం జానామి తత్త్వతః ।
కృష్ణ భక్తస్య గోపస్య సుదామ్నశ్చ పురా ప్రభో ॥
మదాజ్ఞయా హృషీకేశో కృష్ణ రూపం విధాయ చ ।
గోశాలాయాం స్థితో రమ్యే గోలోకే మదధిష్ఠితే ॥
స్వతంత్రోఽహమితి స్వం స మోహం మత్వా గతః పురా ।
క్రీడాస్సమకరోద్భూహ్యాస్స్వైరవర్తీవ మోహితః ॥
తం దృష్ట్వా మోహమత్యుగ్రం తస్యాహం మాయయా స్వయా ।
తేషాం సంహృత్య సద్బుద్ధిం శాపం దాపితవాన్ కిల ॥
ఇత్థం కృత్వా స్వలీలాం తాం మాయాం సంహృతవానహమ్ ।
జ్ఞానయుక్తాస్తదా తే తు ముక్త మోహాస్సుబుద్ధయః ॥
సమీపమాగతాస్తే మే దీనీభూయ ప్రణమ్య మామ్ ।
అకుర్వన్ సునుతిం భక్త్యా కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥

శివుడిట్లు పలికెను –

ఓ హరీ! కుమారా! ఓ బ్రహ్మా! శంఖచూడుని వలన కలిగిన భయమును మీరు పూర్తిగా విడిచిపెట్టుడు. మీకు నిస్సంశయముగా మంగళము కలుగగలదు (2). ఓ ప్రభూ! శంఖచూడుని వృత్తాంతమును నేను పూర్తిగా యథాతథముగా నెరుంగుదును. ఆతడు పూర్వజన్మలో కృష్ణ భక్తుడు అగు సుదాముడనే గోపాలకుడు (3). ఇంద్రియాధిపతియగు విష్ణువు నాయాజ్ఞచే కృష్ణరూపమును దాల్చి నాచే శాసింపబడే సుందరమగు గోలోకము నందు గోశాలయందున్నాడు (4). పూర్వము ఆతడు తాను స్వతంత్రుడనని భావించి మోహితుడై స్వేచ్ఛాచారివలె అనేక క్రీడలను చేసెను (5). వాని ఆ మిక్కిలి తీవ్రమగు మోహమును గాంచి నేను నా మాయచే వారి మంచిబుద్ధిని ఉపసంహరించి శాపమునిప్పించితిని. (6). ఇట్లు

నా లీలను ప్రకటించి, తరువాత నా మాయను ఉపసంహరించితిని అపుడు వారు తొలగిన మోహము గల వారై సద్బుద్ధిని, జ్ఞానమును పొందిరి (7). వారు దీనవదనులై నా వద్దకు వచ్చి వినయముతో నమస్కరించి చేతులు జోడించి భక్తితో చక్కని స్తోత్రమును చేసిరి (8).

వృత్తాంతమవదన్ సర్వం లజ్జాకులితమానసాః ।
ఊచుర్మత్పురతో దీనా రక్ష రక్షేతి వై గిరః ॥
తదా త్వహం భవస్తేషాం సంతుష్టః ప్రోక్తవాన్ వచః ।
భయం త్యజత హే కృష్ణ యూయం సర్వే మదాజ్ఞయా ॥
రక్షకోఽహం సదా ప్రీత్యా సుభద్రం వో భవిష్యతి ।
మదిచ్ఛయాఽఖిలం జాతమిదం సర్వం న సంశయః ॥
స్వస్థానం గచ్ఛ త్వం సార్ధం రాధయా పార్షదేన చ ।
దానవస్తు భవేత్సోఽయం భారతేఽత్ర న సంశయః ॥
శాపోద్ధారం కరిష్యేఽహం యువయోస్సమయే ఖలు ।
మదుక్తమితి సంధార్య శిరసా రాధయా సహ ॥
శ్రీ కృష్ణో మోదదత్యంతం స్వస్థానమగమత్సుధీః ।
న్యష్టాతాం సభయం తత్ర మదారాధనతత్పరౌ ॥
మత్వాఖిలం మదధీనమస్వతంత్రం నిజం చ వై ।
స సుదామాఽ భవద్రాధాశాపతో దానవేశ్వరః ॥
శంఖచూడాభిధో దేవ ద్రోహీ ధర్మవిచక్షణః ।
క్లిశ్నాతి సబలాత్కృత్స్నం సదా దేవగణం కుధీః ॥
మన్మాయామోహితస్సోఽతి దుష్టమంత్రి సహాయవాన్ ।
తద్భయం త్యజతాశ్వేవ మయి శాస్తరి వై సతి ॥

వారు సిగ్గుతో కలవరపడిన మనస్సు గలవారై నా ఎదుట దైన్యముతో వృత్తాంతమునంతను చెప్పి 'రక్షింపుము, రక్షింపుము' అని పలికిరి (9). అపుడు భవుడనగు నేను సంతసిల్లి వారితో నిట్లంటిని; ఓ కృష్ణా! మీరందరు నా ఆజ్ఞచే భయమును విడనాడుడు (10). నేను సర్వదా ప్రేమతో మిమ్ములను రక్షించెదను. మీకు మంచి మంగళము కలుగ గలదు. ఇది అంతయూ నా ఇచ్ఛచేతనే జరిగినది. సందేహము లేదు (11). నీవు రాధతో మరియు నీ అనుచరునితో గూడి నీ స్థానమునకు వెళ్లుము. ఈతడు భారతదేశములో దానవుడై జన్మించును గాక! దీనిలో సంశయము లేదు (12). నేనే సమయము వచ్చినప్పుడు మిమ్ములనిద్దరినీ శాపమునుండి ఉద్ధరించెదను. నా ఈ మాటను రాధాకృష్ణులిద్దరు శిరసా వహించిరి (13). బుద్ధి మంతుడగు శ్రీకృష్ణుడు చాల సంతసించి తన స్థానమునకు వెళ్లెను. వారిద్దరు భయపడుతూ నా ఆరాధనయందు నిష్ఠ గలవారై అచటనే మకాము చేసిరి (14). సర్వము నా అధీనములో నున్నదనియు, తమకు

స్వాతంత్ర్యము లేదనియు వారు గుర్తించిరి. ఆ సుదాముడు రాధయొక్క శాపముచే దానవవీరుడై జన్మించెను (15). ధర్మవివేకము గల ఆ దానవుడు శంఖచూడుడను పేర ప్రసిద్ధిని గాంచి దేవతలకు ద్రోహమును తలపెట్టినాడు. ఆ దుష్టుడు దేవగణములనన్నింటినీ సర్వదా బలాత్కారముగా కష్టములకు గురిచేయుచున్నాడు (16). నా మాయచే మిక్కిలి మోహితుడై యున్న ఆ శంఖచూడునకు దుష్టులగు మంత్రులు తోడగుచున్నారు. మీరు వెనువెంటనే భయమును విడనాడుడు. నేను రక్షకుడను ఉన్నాను గదా! (17)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తవాన్ శివో యావద్ధరి బ్రహ్మపురః కథామ్ ।

అభవత్తావదన్యచ్చ చరితం తన్మునే శృణు ॥

తస్మిన్నేవాంతరే కృష్ణో రాధయా పార్షదైస్సహ ।

సద్గో పైరాయయౌ శంభుమనుకూలయితుం ప్రభుమ్ ॥

ప్రభుం ప్రణమ్య సద్భక్త్యా మిలిత్వా హరిమాదరాత్ ।

సంమతో విధినా ప్రీత్యా సంతస్థౌ శివశాసనాత్ ॥

తతశ్శంభుం పునర్నత్వా తుష్టావ విహితాంజలిః ।

శ్రీ కృష్ణో మోహ నిర్ముక్తో జ్ఞాత్వా తత్త్వం శివస్య హి ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

శివుడు ఈ తీరున బ్రహ్మ విష్ణువుల యెదుట వృత్తాంతమును చెప్పుచుండగనే, అచట మరియొక ఘటన జరిగినది. ఓ మునీ! దానిని వినుము (18). ఇదే సమయములో శ్రీకృష్ణుడు రాధతో మరియు మంచి గోపాలకులైన అనుచరులతో గూడి శంభు ప్రభుని ప్రసన్నునిగా చేయుట కొరకై విచ్చేసెను (19). ఆతడు మంచి భక్తితో ప్రభునకు ప్రణమిల్లి, హరిని ఆదరముతో కలుసుకొని, విధిచే ప్రీతిపూర్వకముగా ఆదరింపబడిన వాడై, శివుని యాజ్ఞచే నిలబడి యుండెను (20). తొలగిన మోహము గల శ్రీకృష్ణుడు శివుని తత్త్వము నెరింగి, అపుడు చేతులు జోడించి మరల శంభునకు నమస్కరించి ఇట్లు స్తుతించెను (21).

శ్రీకృష్ణ ఉవాచ ।

దేవదేవ మహాదేవ పరబ్రహ్మ సతాం గతే ।

క్షమస్వ చాపరాధం మే ప్రసీద పరమేశ్వర ॥

త్వత్త శ్చర్వ చ సర్వం చ త్వయి సర్వం మహేశ్వర ।

సర్వం త్వం నిఖిలా ధీశ ప్రసీద పరమేశ్వర ॥

త్వం జ్యోతిః పరమం సాక్షాత్సర్వవ్యాపీ సనాతనః ।

త్వయా నాథేన గౌరీశ సనాథాస్సకలా వయమ్ ॥

సర్వోపరి నిజం మత్వా విహరన్మోహమాశ్రితః ।

తత్ఫలం ప్రాప్త వానస్మి శాపం ప్రాప్త స్స్వామకః ॥

పార్షద ప్రవరో యో మే సుదామా నామ గోపకః ।
స రాధాశాపతస్స్వామిన్ దానవీం యోనిమాశ్రితః ॥
అస్మానుద్ధర దుర్గేశ ప్రసీద పరమేశ్వర ।
శాపోద్ధారం కురుష్వద్య పాహి నశ్శరణాగతాన్ ॥
ఇత్యుక్త్వా విరరామైన శ్రీ కృష్ణో రాధయా సహ ।
ప్రసన్నోఽభూచ్ఛివస్తత్ర శరణాగతవత్సలః ॥

శ్రీకృష్ణుడిట్లు పలికెను -

ఓ దేవదేవా! మహాదేవా! సత్పురుషులకు గతియైన వాడా! నా అపరాధమును క్షమించుము(21). ఓ పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము (22). ఓ శర్వా! సర్వము నీనుండి పుట్టుచున్నది. ఓ మహేశ్వరా! సర్వము నీయందు ఉన్నది. ఓ నిఖిలాధీశ్వరా! సర్వము నీవే. ఓ పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము (23). నీవు సాక్షాత్తుగా పరమజ్యోతిస్స్వరూపుడవు. సనాతనుడవగు నీవు సర్వవ్యాపివి. ఓ గౌరీపతీ! నాథుడవగు నీ చేత మాత్రమే మేము అందరము సనాథులమగు చున్నాము (24). నేనే సర్వమునకు అధీశ్వరుడననే మోహమును పొంది విహరిస్తూ దాని ఫలమును పొంది యుంటిని. తప్పుదారిలో నడచిన వాడు శాపమును పొందినాడు (25). ఓ స్వామీ! నా అనుచరులలో ప్రముఖుడు, గోపాలకుడు అగు సుదాముడు రాధయొక్క శాపముచే దానవుడై జన్మించినాడు (26). ఓ దుర్గాపతీ! మమ్ములనుద్ధరించుము. శరణు జొచ్చిన మమ్ములను రక్షింపుము (27). రాధా సమేతుడైన శ్రీకృష్ణుడిట్లు పలికి విరమించెను. అపుడు శరణాగత వత్సలుడగు శివుడు ప్రసన్నుడాయెను (28).

శ్రీ శివ ఉవాచ ।

హే కృష్ణ గోపికానాథ భయం త్యజ సుఖీ భవ ।
మయాను గృహ్ణతా తాత సర్వమాచరితం త్విదమ్ ॥
సంభవిష్యతి తే భద్రం గచ్ఛ స్వస్థానముత్తమమ్ ।
స్థాతవ్యం స్వాధికారే చ సావధానతయా సదా ॥
విహరస్వ యథా కామం మాం విజ్ఞాయ పరాత్పరమ్ ।
స్వకార్యం కురు నిర్వ్యగ్రం రాధయా పార్షదైః ఖలు ॥
వారాహ ప్రవరే కల్పే తరుణ్యా రాధయా సహ ।
శాపప్రభావం భుక్త్వా వై పునరాయాస్యసి స్వకమ్ ॥
సుదామా పార్షదో యో హి తవ కృష్ణ ప్రియ ప్రియః ।
దానవీం యోనిమా శ్రిత్యే దానీం క్లిశ్నాతి వై జగత్ ॥
శాపప్రభావా ద్రాధాయా దేవశత్రుశ్చ దానవః ।
శంఖచూడా భిధస్సోఽతి దైత్యపక్షీ సురద్రుహః ॥

తేన నిస్సారితా దేవాస్సేంద్రా నిత్యం ప్రపీడితాః ।
హృతాధికారా విక్రృతాస్సర్వే యాతా దిశో దశ ॥
బ్రహ్మాచ్యుతౌ తదర్థే హిహాగతౌ శరణం మమ ।
తేషాం క్లేశవినిర్మోక్షం కరిష్యే నాత్ర సంశయః ॥

శ్రీ శివుడిట్లు పలికెను –

ఓ కృష్ణా ! గోపీ వల్లభా! భయమును వీడి స్వస్థుడవు కమ్ము. వత్సా! అనుగ్రహబుద్ధి గల నాచే ఈ సర్వము చేయబడినది (29). నీకు మంగళము కలుగగలదు. ఉత్తమమగు నీ స్థానమునకు వెళ్లి, నిత్యము సావధానుడవై నీ కర్తవ్యమును నిర్వహించుము (30). నేను పరాత్పరుడనని యెరింగి యథేచ్ఛగా విహరించుము. రాధతో మరియు అనుచరులతో గూడి నిశ్చింతగా నీ కర్తవ్యమును చేయుము (31). శ్వేతవరాహ కల్పములో రాధాసుందరితో గూడి శాపప్రభావమునను భవించి మరల నీ స్థానమును చేరగలవు (32). ఓ కృష్ణా! నీకు పరమ ప్రియుడు, అనుచరుడునగు సుదాముడు ఇపుడు దానవుడై జన్మించి జగత్తును కష్టపెట్టుచున్నాడు (33). రాధయొక్క శాపప్రభావముచే దేవతలకు శత్రువు అగు దానవుడై జన్మించి శంఖచూడుడను పేరుతో ప్రసిద్ధిని గాంచినాడు (34). వానిచే నిత్యము పీడింపబడి బయటకు త్రోసివేయబడిన ఇంద్రాది దేవతలు అందరు తమ అధికారములను గోల్పోయి వికృతరూపములతో పదిదిక్కులకు తరలి వెళ్లినారు (35). వారి కొరకై బ్రహ్మ విష్ణువులు ఇచటకు వచ్చి నన్ను శరణు పొందినారు. నేను నిస్సందేహముగా వారి కష్టములను తొలగించగలను (36).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా శంకరః కృష్ణం పునః ప్రోవాచ సాదరమ్ ।
హరిం విధిం సమాభాష్య వచనం క్లేశనాశనమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

శంకరుడు శ్రీ కృష్ణునితో నిట్లు పలికి మరల బ్రహ్మావిష్ణువులను సాదరముగా సంబోధించి దుఃఖమును పోగొట్టే వచనము నిట్లు పలికెను (37).

శివ ఉవాచ ।

హే హరే హే విధే శ్రీత్యా మమేదం వచనం శృణు ।
గచ్ఛతం త్వరితం తాతౌ దేవానా దాయ నిర్భయమ్ ॥
కైలాసవాసినం రుద్రం మద్రూపం పూర్ణముత్తమమ్ ।
దేవకార్యార్థ ముద్భూతం పృథగా కృతి ధారిణమ్ ॥
ఏతదర్థే హి మద్రూపః పరిపూర్ణతమః ప్రభుః ।
కైలాసే భక్తవశతస్సంతిష్ఠతి గిరౌ హరే ॥

కైలాసే భక్తవశతస్సంతిష్ఠతి గిరౌ హరే ॥
మత్తస్సత్తో న భేదోఽస్తి యువయోస్సేవ్య ఏవ సః ।
చరాచరాణాం సర్వేషాం సురాదీనాం చ సర్వదా ॥
ఆవయోర్భేదకర్తా యస్స నరో నరకం వ్రజేత్ ।
ఇహాపి ప్రాప్నుయాత్కష్టం పుత్రపౌత్రవివర్జితః ॥
ఇత్యుక్తవంతం దుర్గేశం ప్రణమ్య చ ముహుర్ముహుః ।
రాధయా సహితః కృష్ణస్స్వస్థానం సగణో యయౌ ॥
హరిర్బ్రహ్మా చ తౌ వ్యాస సానందౌ గతసాధ్వసౌ ।
ముహుర్ముహుః ప్రణమ్యేశం వైకుంఠం యయతుర్ద్రుతమ్ ॥
తత్రాగత్యాఖిలం వృత్తం దేవేభ్యో వినివేద్య తౌ ।
తానాదాయ బ్రహ్మవిష్ణు కైలాసం యయతుర్గిరమ్ ॥
తత్ర దృష్ట్వా మహేశానం పార్వతీవల్లభం ప్రభుమ్ ।
దీనరక్షాత్తదేహం చ సగుణం దేవనాయకమ్ ॥
తుష్టువుః పూర్వవత్సర్వే భక్త్యా గద్గదయా గిరా ।
కరౌ బద్ధ్వా నతస్కంధా వినయేన సమన్వితాః ॥

శివుడిట్లు పలికెను –

ఓ హరీ! ఓ బ్రహ్మా! నా ఈ మాటను ప్రీతితో వినుడు. కుమారులారా! మీరు వెంటనే దేవతలను దోడ్కొని నిర్భయముగా కైలాసవాసియగు రుద్రుని వద్దకు వెళ్లుడు. ఉత్తమమగు నా పూర్ణరూపమే రుద్రుడు. నేను దేవకార్యము కొరకై రెండవ ఆకారమును దాల్చి ఉద్భవించినాను (38,3 9). ఓ హరీ! నా అవతారము, పరిపూర్ణుడు, సర్వసమర్థుడు అగు రుద్రుడు భక్తులకు సులభుడై వారి కొరకై కైలాసపర్వతమునందు స్థిరుడై ఉన్నాడు (40). నీకు నాకు భేదము లేదు. మీరిద్దరు ఆ రుద్రుని సేవించదగుదురు. దేవతలు మొదలగు స్థావరజంగమాత్మకమగు సర్వప్రాణులు ఆయనను సేవింతురు (41). మన ఇద్దరిలో భేదమును కల్పించు వ్యక్తి ఇహలోకములో పుత్రులచే, పౌత్రులచే నిరాకరింపబడినవాడై కష్టముల ననుభవించి, పిదప నరకమును పొందును (42). ఈ విధముగా పలికిన దుర్గాపతియగు శివుని రాధాసమేతుడైన శ్రీకృష్ణుడు పలుమార్లు ప్రణమిల్లి తన అనుచరులతో గూడి తన స్థానమునకు వెళ్లెను (43). ఓ వ్యాసా! బ్రహ్మ విష్ణువులు కూడ భయరహితులై ఆనందముతో ఈశ్వరునకు పలుమార్లు ప్రణమిల్లి వెంటనే వైకుంఠమునకు వెళ్లిరి (44). ఆ బ్రహ్మ విష్ణువులు అచటకు చేరి దేవతలకు వృత్తాంతమునంతను వివరించి వారిని దోడ్కొని కైలాసపర్వతమునకు వెళ్లిరి (45). అచట పార్వతీ వల్లభుడు, దీనుల రక్షణ కొరకై దేహమును స్వీకరించినవాడు, సగుణుడు, దేవదేవుడు అగు మహేశ్వర ప్రభుని గాంచి (46), పూర్వమునందు వలెనే వారందరు వినయముతో గూడిన వారై తలలు వంచి చేతులు జోడించి భక్తితో బొంగురుపోయిన కంఠములతో స్తుతించిరి (47).

దేవదేవ మహాదేవ గిరిజానాథ శంకర ।
వయం త్వాం శరణాపన్నా రక్ష దేవాన్ భయాకులాన్ ॥
శంఖచూడం దానవేంద్రం జహి దేవనిషూదనమ్ ।
తేన విక్లబితా దేవాస్సంగ్రామే చ పరాజితాః ॥
హృతాధికారాః కుతలే విచరంతి యథా నరాః ।
దేవలోకో హి దుర్దృశ్యస్తేషా మాసీచ్చ తద్భయాత్ ॥
దీనోద్ధర కృపాసింధో దేవానుద్ధర సంకటాత్ ।
శక్రం భయాన్మహేశాన హత్వా తం దానవాధిపమ్ ॥
ఇతి శ్రుత్వా వచశ్శంభుర్దేవానాం భక్తవత్సలః ।
ఉవాచ విహసన్ వాణ్యా మేఘనాద గభీరయా ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! గిరిజాపతీ! శంకరా! మేము నిన్ను శరణు జొచ్చి◌ సినాము. భయముచే కంగారు పడుతున్న దేవతలను రక్షించుము (48). దేవతలను నశింపజేసిన దానవవీరుడగు శంఖచూడుని సంహరించుము. ఆతడు దేవతలను యుద్ధములో జయించి కష్టములకు గురిచేసినాడు (49). దేవతలు అధికారములను గోల్పోయి మానవులవలె భూలోకములో తిరుగాడు చున్నారు. వాని భయము వలన వారు దేవలోకమును కన్నెత్తి చూడలేకున్నారు (50). దీనులనుద్ధరించే దయానిధీ! దేవతలనీ సంకటమునుండి ఉద్ధరించుము. ఆ దానవరాజును సంహరించి ఇంద్రునకు భయము నుండి విముక్తిని చేయుము. ఓ మహేశ్వరా! (51) ఈ మాటలను విని భక్త వత్సలుడగు శంభుడు నవ్వి మేఘగర్జనవలె గంభీరమగు స్వరముతో దేవతలనుద్దేశించి ఇట్లు పలికెను (52).

శ్రీ శంకర ఉవాచ ।

హే హరే హే విధే దేవాస్స్వస్థానం గచ్ఛత ధ్రువమ్ ।

శంఖచూడం వధిష్యామి సగణం నాత్ర సంశయః ॥

శ్రీశంకరుడిట్లు పలికెను -

ఓ హరీ! ఓ బ్రహ్మా! దేవతలారా! మీరు నిశ్చయముగా మీమీ. స్థానములకు వెళ్లుడు. అనుచరులతో సహా శంఖచూడుని వధించెదను. ఈ విషయములో సంశయము వలదు (53).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య మహేశస్య వచః పీయూషసన్నిభమ్ ।

తే సర్వే ప్రముదా హ్యాసన్నష్టం మత్వా చ దానవమ్ ॥

హరిర్జగామ వైకుంఠం సత్యలోకే విధిస్తదా ।

ప్రణిపత్య మహేశం చ సురాద్యాస్స్వపదం యయుః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శివోపదేశో నామ ఏకత్రింశో ఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహేశ్వరుని అమృతతుల్యమగు ఈ పలుకులను విని వారు అందరు శంఖచూడు◌ుడు నశించినట్లే యని తలంచి మహానందమును పొందిరి (54). అపుడు హరి వైకుంఠమునకు, బ్రహ్మ సత్యలోకమునకు వెళ్లిరి. దేవతలు మొదలగు వారు మహేశునకు ప్రణమిల్లి తమ స్థానములకు వెళ్లిరి (55).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శివోపదేశవర్ణనము అనే ముప్పది ఒకటవ అధ్యాయము ముగిసినది (31).

32 – పుష్పదంతుడు శంఖచూడునకు నచ్చజెప్పుట

సనత్కుమార ఉవాచ ।

అథేశానో మహారుద్రో దుష్టకాలస్సతాం గతిః ।
శంఖచూడవధం చిత్తే నిశ్చికాయ సురేచ్ఛయా ॥
దూతం కృత్వా చిత్రరథం గంధర్వేశ్వరమీప్సితమ్ ।
శీఘ్రం ప్రస్థాపయామాస శంఖచూడాంతికే ముదా ॥
సర్వేశ్వరాజ్ఞయా దూతో యయౌ తన్నగరం చ సః ।
మహేంద్రనగరోత్కృష్టం కుబేరభవనాధికమ్ ॥
గత్వా దదర్శ తన్మధ్యే శంఖచూడాలయం వరమ్ ।
రాజితం ద్వాదశైర్ద్వారైర్ద్వారపాల సమన్వితమ్ ॥
స దృష్ట్వా పుష్పదంతస్తు వరం ద్వారం దదర్శ సః ।
కథయామాస వృత్తాంతం ద్వారపాలాయ నిర్భయః ॥
అతిక్రమ్య చ తద్ద్వారం జగామాభ్యంతరే ముదా ।
అతీవ సుందరం రమ్యం విస్తీర్ణం సమలంకృతమ్ ॥
స గత్వా శంఖచూడం తం దదర్శ దనుజాధిపమ్ ।
వీరమండల మధ్యస్థం రత్నసింహాసనస్థితమ్ ॥
దానవేంద్రైః పరివృతం సేవితం చ త్రికోటిభిః ।
శతకోటిభిరన్యైశ్చ భ్రమద్భిశ్శస్త్ర పాణిభిః ॥
ఏవం భూతం చ తం దృష్ట్వా పుష్పదంతస్సవిస్మయః ।
ఉవాచ రణవృత్తాంతం యదుక్తం శంకరేణ చ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

తరువాత మహాభయంకర స్వరూపుడు, దుష్టులకు మృత్యువు, సత్పురుషులకు శరణు అగు ఈశ్వరుడు దేవతల కోర్కెపై శంఖచూడుని వధించవలెనని నిశ్చయించెను (1). తనకు ఇష్టుడగు చిత్రరథుడనే గంధర్వరాజును దూతను చేసి వెంటనే శంఖచూడుని వద్దకు ఆనందముతో పంపెను (2). ఆ దూత సర్వేశ్వరుని ఆజ్ఞచే, మహేంద్రనగరము వలె గొప్పదైన శంఖచూడుని నగరమునకు వెళ్లి, ఆ నగరమధ్యములో కుబేర భవనము కంటె గొప్పది, పన్నెండు ద్వారములతో ప్రకాశించునది, ద్వార పాలకులతో కూడినది అగు శంఖచూడుని శ్రేష్ఠమగు నివాసమును గాంచెను (3,4). ఆ పుష్పదంతుడు (చిత్రరథుడు) శ్రేష్ఠమగు ద్వారమును గాంచి తాను వచ్చిన పనిని నిర్భయముగా ద్వారపాలకునకు చెప్పెను (5). ఆతడు మిక్కిలి సుందరముగా అలంకరింపబడి యున్న ఆ విశాలద్వారమును

దాటి ఆనందముతో లోపలకు వెళ్లెను (6). ఆతడు లోపలకు వెళ్లి వీరుల సముదాయము మధ్యలో రత్నసింహాసనము పైనున్న రాక్షసేశ్వరుడగు ఆ శంఖచూడుని గాంచెను (7). మూడు కోట్లమంది వీరులగు రాక్షసులచే చుట్టువారబడి యున్నవాడు, శస్త్రములను ధరించి తిరుగుతున్న వందకోటి ఇతర సైనికులచే సేవింపబడుచున్న వాడు (8) అగు ఆ శంఖచూడుని గాంచి పుష్పదంతుడు ఆశ్చర్యచకితుడై శంకరుడు చెప్పిన యుద్ధవృత్తాంతమునాతనికి చెప్పెను (9).

పుష్పదంత ఉవాచ ।

రాజేంద్ర శివదూతోఽహం పుష్పదంతాభిధః ప్రభో ।
యదుక్తం శంకరేణైవ తచ్ఛృణు త్వం బ్రవీమి తే ॥

ఓ మహారాజా! నేను శివుని దూతను. పుష్పదంతుడు నా పేరు. ఓ ప్రభూ! శంకరుని సందేశమును నీకు చెప్పెదను. దానిని వినుము (10).

శివ ఉవాచ ।

రాజ్యం దేహి చ దేవానా మధికారం హి సాంప్రతమ్ ।
నో చేత్కురు రణం సార్ధం పరేణ చ మయా సతామ్ ॥
దేవా మాం శరణాపన్నా దేవేశం శంకరం సతామ్ ।
అహం క్రుద్ధో మహారుద్రస్త్వాం వధిష్యామ్యసంశయమ్ ॥
హరోఽస్మి సర్వదేవేభ్యో హ్యభయం దత్త వానహమ్ ।
ఖలదండధరోఽహం వై శరణాగతవత్సలః ॥
రాజ్యం దాస్యసి కిం వా త్వం కరిష్యసి రణం చ కిమ్ ।
తత్త్వం బ్రూహి ద్వయోరేకం దానవేంద్ర విచార్య వై ॥

శివుడిట్లు పలికెను -

వెంటనే దేవతలకు రాజ్యమును, అధికారమును అప్పజెప్పుము. లేనిచో సత్పురుషులకు పరమగమ్యమగు నాతో యుద్ధమును చేయుము (11). సత్పురుషులకు మంగళములను ఇచ్చు దేవదేవుడనగు నన్ను దేవతలు శరణు పొందినారు. మహారుద్రుడనగు నేను కోపించియున్నాను. నిన్ను నిస్సంశయముగా వధించగలను (12). సంహారకరుడను, దుష్టులను శిక్షించువాడను, శరణాగతవత్సలుడను అగు నేను దేవతలందరికీ అభయమునిచ్చి యున్నాను (13). రాజ్యమునప్ప జెప్పెదవా? లేక, యుద్ధమును చేసెదవా? ఓ రాక్షసేంద్రా! నీవు ఆలోచించి ఈ రెండింటిలో ఒక మార్గము నెన్నుకొని యథార్థమగు ప్రతివచనము నిమ్ము (14).

పుష్పదంత ఉవాచ ।

ఇత్యుక్తం యన్మహేశేన తుభ్యం తన్మే నివేదితమ్ ।
వితథం శంభువాక్యం న కదాపి దను జాధిప ॥
అహం స్వస్వామినం గంతుమిచ్ఛామి త్వరితం హరమ్ ।
గత్వా వక్ష్యామి కిం శంభోస్తథా త్వం వద మామిహ ॥

పుష్పదంతుడిట్లు పలికెను -

మహేశుడు చెప్పిన సందేశమును నేను నీకు విన్నవించితిని. ఓ రాక్షసరాజా! శంభుని వాక్యము ఎన్నటికీ పొల్లు పోదు (15). నేను నా ప్రభువగు హరుని వద్దకు శీఘ్రముగా చేరవలెనని ఆకాంక్షించుచున్నాను. నేను అచటకు వెళ్లి శంభునకు ఏమని చెప్పవలెను? నీ సమాధానమును ఇప్పుడు చెప్పుము (16).

సనత్కుమార ఉవాచ ।

ఇత్థం చ పుష్పదంతస్య శివదూతస్య సత్పతేః ।
ఆకర్ణ్య వచనం రాజా హసిత్వా తమువాచ సః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

సత్పురుషులకు ప్రభువగు శివుని దూతయైన పుష్పదంతుని ఈ వచనములను విని ఆ రాజు నవ్వి ఆతనితో నిట్లనెను (17).

శంఖచూడ ఉవాచ ।

రాజ్యం దాస్యే న దేవేభ్యో వీరభోగ్యా వసుంధరా ।
రణం దాస్యామి తే రుద్ర దేవానాం పక్ష పాతినే ॥
యస్యోపరి ప్రయాయీ స్యాత్స వీరో భువనే ఽధమః ।
అతః పూర్వమహం రుద్ర త్వాం గమిష్యామ్య సంశయమ్ ॥
ప్రభాత ఆగమిష్యామి వీరయాత్రా విచారతః ।
త్వం గచ్ఛాచక్ష్వ రుద్రాయ హీదృశం వచనం మమ ॥
ఇతి శ్రుత్వా శంఖచూడ వచనం సుప్రహస్య సః ।
ఉవాచ దానవేంద్రం స శంభుదూతస్తు గర్వితమ్ ॥
అన్యేషామపి రాజేంద్ర గణానాం శంకరస్య చ ।
న స్థాతుం సమ్ముఖే యోగ్యః కిం పునస్తస్య సమ్ముఖమ్ ॥
స త్వం దేహి చ దేవానా మధికారాణి సర్వశః ।
త్వమరే గచ్ఛ పాతాలం యది జీవితుమిచ్ఛసి ॥
సామాన్యమమరం తం నో విద్ధి దానవసత్తమ ।
శంకరః పరమాత్మా హి సర్వేషామీశ్వరేశ్వరః ॥

శంఖచూడుడిట్లు పలికెను -

దేవతలకు రాజ్యము నీయను. రాజ్యము (భూమి) వీరులు అనుభవింప దగినది. ఓ రుద్రా! దేవపక్షపాతివగు నీకు యుద్ధమును ఇచ్చెదను (18). శత్రువునకు తనపై దండెత్తే అవకాశము నిచ్చు వీరుడు ఈ లోకములో అధముడు. ఓరుద్రా! కావున నేను ముందుగా నీపై దండెత్తెదను. దీనిలో సందేహము లేదు (19). నా జైత్రయాత్రను పరిశీలించినచో, నేను రేపు తెల్లవారు సరికి అచటకు చేరగలను. నీవు వెళ్లి నా ఈ వచనమును రుద్రునకు చెప్పుము (20). శంభుని దూతయగు పుష్పదంతుడు గర్వితుడగు శంఖచూడుని ఈ వచనములను విని నవ్వి ఆ రాక్షసరాజుతో నిట్లనెను (21). ఓ రాజశేఖరా! శంకరుని గణముల యెదుట నైననూ నిలువగలిగే యోగ్యత నీకు లేదు. ఇక శంకరుని ఎదుట నిలబడుట గురించి చెప్పునదేమున్నది? (22) కావున నీవు అధికారములనన్నిటినీ దేవతలకు అప్పజెప్పుము. ఓరీ! నీకు జీవించు కోరిక ఉన్నచో, పాతాళమునకు పొమ్ము (23). ఓ రాక్షస శ్రేష్ఠా! శంకరుడు సామాన్య దేవతయని తలంచుకుము. ఆయన సర్వులకు, మరియు ఈశ్వరులకు కూడ అధీశ్వరుడగు పరమాత్మ (24).

ఇంద్రా ద్యాస్సకలా దేవా యస్యాజ్ఞావర్తినస్సదా ।
సప్రజాపతయస్సిద్ధా మునయశ్చాప్యహేశ్వరాః ॥
హరేర్విధేశ్చ స స్వామీ నిర్గుణస్సగుణస్స హి ।
యస్య భ్రూ భంగమాత్రేణ సర్వేషాం ప్రలయో భవేత్ ॥
శివస్య పూర్ణరూపశ్చ లోక సంహారకారకః ।
సతాం గతి ర్దుష్టహంతా నిర్వికారః పరాత్పరః ॥
బ్రహ్మణోఽ ధిపతిస్సోఽ పి హరేరపి మహేశ్వరః ।
అవమాన్యా న వై తస్య శాసనా దానవర్షభ ॥
కిం బహూక్తేన రాజేంద్ర మనసా సంవిచార్య చ ।
రుద్రం విద్ధి మహేశానం పరం బ్రహ్మ చిదాత్మకమ్ ॥
దేహి రాజ్యం హి దేవానామధికారాంశ్చ సర్వశః ।
ఏవం తే కుశలం తాత భవిష్యత్యన్యథా భయమ్ ॥

ఇంద్రాది సమస్త దేవతలు, ప్రజాపతులు, సిద్ధులు, మునులు, మరియు నాగశ్రేష్ఠులు ఆయన ఆజ్ఞకు నిత్యము వశవర్తులై ఉందురు (25). బ్రహ్మ విష్ణువులకు ప్రభువగు ఆయన సగుణుడు, నిర్గుణుడు కూడా అగుచున్నాడు. ఆయన కనుబొమను విరిచినంత మాత్రాన సర్వలోకములకు ప్రళయము వాటిల్లును (26). లోకములను సంహరించే రుద్రుడు శివుని పూర్ణస్వరూపుడు. వికారములు లేని ఆ పరాత్పరుడు దుష్టులను సంహరించి సత్పురుషులకు శరణు నొసంగును (27). ఆ మహేశ్వరుడు బ్రహ్మ విష్ణువులకు కూడ అధీశ్వరుడు. ఓ దానవ శ్రేష్ఠా! ఆయన శాసనమును తిరస్కరించుట తగదు (28). ఓ రాజశ్రేష్ఠా! ఇన్ని మాటలేల? మనస్సులో చక్కగా ఆలోచించుము. రుద్రుడే మహేశ్వరుడు, పరబ్రహ్మ, చైతన్యస్వరూపుడు అని తెలుసుకొనుము (29): దేవతలకు రాజ్యమును, సర్వాధికారములను అప్పజెప్పుము. కుమారా! ఈ తీరున చేసినచో నీకు క్షేమము కలుగ గలదు. అట్లు గానిచో, నీకు భయము తప్పదు (30).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా దానవేంద్రశ్శంఖచూడః ప్రతాపవాన్ ।
ఉవాచ శివదూతం తం భవితవ్య విమోహితః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ప్రతాపశాలి, దానవ శ్రేష్ఠుడు అగు శంఖచూడుడు ఈ పలుకులను విని విధిచే సమ్మోహితుడై ఆ శివుని దూతతో ఇట్లనెను (31).

శంఖచూడ ఉవాచ ।

స్వతో రాజ్యం న దాస్యామి నాధికారాన్ వినిశ్చయాత్ ।
వినా యుద్ధం మహేశేన సత్యమేత ద్బ్రవీమ్యహమ్ ॥
కాలాధీనం జగత్సర్వం విజ్ఞేయం సచరాచరమ్ ।
కాలాద్భవతి సర్వం హి వినశ్యతి చ కాలతః ॥
త్వం గచ్ఛ శంకరం రుద్రం మయోక్తం వద తత్త్వతః ।
స చ యుక్తం కరోత్యేవం బహువార్తాం కురుష్వ నో ॥

శంఖచూడుడిట్లు పలికెను -

మహేశ్వరునితో యుద్ధము చేయకుండగా నా అంతట నేను నిశ్చయించుకొని రాజ్య్యమును, అధికారములను అప్ప జెప్పుట కల్ల. నేను సత్యమును పలుకు చున్నాను (32). ఈ స్థావరజంగమాత్మకమగు జగత్తు అంతయూ కాలమునకు వశమై యున్నది. సర్వము కాలమునందు పుట్టి, కాలమునందు గిట్టును (33), నీవు మంగళకరుడగు రుద్రుని వద్దకు వెళ్లి నా సందేశమును యథాతథముగా చెప్పుము. ఆయన ఏది యోగ్యమో దానిని చేయగలడు. నీవు అధిక ప్రసంగమును చేయకుము (34).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా శివదూతోఽ సౌ జగామ స్వామినం నిజమ్ ।
యథార్థం కథయామాస పుష్పదంతశ్చ సన్మునే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
దూతగమనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆతడిట్లు పలుకగా శివుని దూతయగు పుష్పదంతుడు తన ప్రభువు వద్దకుం వెళ్లెను. ఓ మహర్షి! ఆతడు యథాతథముగా జరిగిన సంభాషణను రుద్రునకు చెప్పెను (35).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శివదూత శంఖచూడ సంవాదమనే ముప్పది రెండవ అధ్యాయము ముగిసినది (32).

33 - శంఖచూడునిపై శివుని యుద్ధసన్నాహము

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వాక్యమాకర్ణ్య సురరాట్ తతః ।
సక్రోధః ప్రాహ గిరిశో వీరభద్రాదికాన్ గణాన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆతని ఆ మాటలను విని అపుడా దేవదేవుడు, కైలాసవాసి యగు రుద్రుడు వీరభద్రుడు మొదలగు గణములతో కోపపూర్వకముగా నిట్లనెను (1).

రుద్ర ఉవాచ ।

హే వీరభద్ర హే నందిన్ క్షేత్రపాలాష్టభైరవాః ।
సర్వే గణాశ్చ సన్నద్ధాస్సాయుధా బలశాలినః ॥
కుమారాభ్యాం సహైవాద్య నిర్గచ్ఛంతు మమాజ్ఞయా ।
స్వసేనయా భద్రకాలీ నిర్గచ్ఛతు రణాయ చ ।
శంఖచూడ వధార్థాయ నిర్గచ్ఛామ్యద్య సత్వరమ్ ॥

రుద్రుడిట్లు పలికెను -

ఓ వీరభద్రా! నందీ! క్షేత్రపాలా! అష్టభైరవులారా! బలశాలురగు గణములందరు ఆయుధములను దాల్చి సన్నద్ధులు కండు (2). భద్రకాళి తన సేనను దోడ్కొని నా యాజ్ఞచే కుమారులిద్దరితో కలిసి ఈ నాడే యుద్ధము కొరకు బయల్వెడలును గాక! నేను ఈ నాడే శీఘ్రముగా శంఖచూడుని వధించుట కొరకై బయలు దేరుచున్నాను (3).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యా జ్ఞాప్య మహేశానో నిర్యయౌ సైన్యసంయుతః ।
సర్వే వీరగణాస్తస్యాను యయుస్సంప్రహర్షితాః ॥
ఏతస్మిన్నంతరే స్కందగణేశౌ సర్వసైన్యపౌ ।
యయతుర్ముదితౌ నద్ధౌ సాయుధౌ చ శివాంతికే ॥
వీరభద్రశ్చ నందీ చ మహాకాలస్సుభద్రకః ।
విశాలాక్షశ్చ బాణశ్చ పింగలాక్షో వికంపనః ॥
విరూపో వికృతిశ్చైవ మణిభద్రశ్చ బాష్కలః ।
కపిలాఖ్యో దీర్ఘ దంష్ట్రో వికరస్తా మ్రలోచనః ॥



కాలంకరో బలీ భద్రః కాలజిహ్వః కుటీ చరః ।
బలోన్మత్తో రణశ్లాఘ్యో దుర్జయో దుర్గమస్తథా ॥
ఇత్యాదయో గణేశానాస్సైన్యానాం పతయో వరాః ।
తేషాం చ గణనాం వచ్మి సావధానతయా శృణు ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మహేశ్వరుడు ఇట్లు ఆజ్ఞాపించి సైన్యముతో గూడి బయలుదేరెను. వీరులైన ఆయన గణములందరు మహానందముతో వెంట నడిచిరి (4). ఇంతలో సర్వసైన్యాధ్యక్షులైన కుమారస్వామి, గజాననుడు ఆయుధములను దాల్చి యుద్ధసన్నద్ధులై ఆనందముతో శివుని వద్దకు వచ్చిరి (5). వీరభద్రుడు, నంది, మహాకాలుడు, సుభద్రకుడు, విశాలాక్షుడు, బాణుడు, పింగలాక్షుడు, వికంపనుడు (6), విరూపుడు, వికృతి, మణిభద్రుడు, బాష్కలుడు, కపిలుడు, దీర్ఘదంష్ట్రుడు, వికరుడు, తామ్రలోచనుడు (7), కాలంకరుడు, బల భద్రుడు, కాలజిహ్వుడు, కుటీచరుడు, బలోన్మత్తుడు, రణశ్లాఘ్యుడు, దుర్జయుడు, మరియు దుర్గముడు (8) మొదలగు శ్రేష్ఠసేనాపతులైన గణాధ్యక్షులు బయలు దేరిరి. వారి సైన్యముల సంఖ్యను చెప్పుచున్నాను. సావధానుడవై వినుము (9).

శంఖకర్ణః కోటిగణైర్యుతః పరవిమర్దకః ।
దశభిః కేకరాక్షశ్చ వికృతోఽష్టాభిరేవ చ ॥
చతుష్షష్ట్యా విశాఖశ్చ నవభిః పారియాత్రికః ।
షడ్భిస్సర్వాంతక■మూంస్తథైవ వికృతాననః ॥
జాలకో హి ద్వాదశభిః కోటిభిర్గణపుంగవః ।
సప్తభిస్సమద ■మాన్ దుందుభోఽష్టాభిరేవ చ ॥
పంచభిశ్చ కరాలాక్షః షడ్భిస్సుందారకో వరః ।
కోటికోటిభిరేవేహ కందుకః కుండకస్తథా ॥
విష్టంభోఽష్టాభిరేవేహ గణపస్సర్వసత్తమః ।
పిప్పలశ్చ సహస్రేణ సంనా దశ్చ తథా విధః ॥
ఆవేశనస్తథాష్టాభిస్సప్తభిశ్చంద్రతాపనః ।
మహాకేశస్సహసేణ కోటీనాం గణపో వృతః ॥
కుండీ ద్వాదశభిర్వీరస్తథా పర్వతకశ్శుభః ।
కాలశ్చ కాలకశ్చైవ మహాకాలశ్శతేన వై ॥
అగ్నికశ్శతకోట్యా చ కోట్యాగ్నిముఖ ఏవ చ ।
ఆదిత్యో హ్యర్ధ కోట్యా చ తథా చైవం ఘనావహః ॥
సన్నాహశ్చ శతేనైవ కుముదః కోటిభిస్తథా ।
అమోఘః కో కిలశ్చైవ శతకోట్యా సుమంత్రకః ॥

కాకపాదః కోటి షష్ట్యా షష్ట్యా సంతానకస్తథా ।
మహాబలశ్చ నవభిః పంచభిర్మధు పింగలః ॥
నీలో నవత్యా దేవేశః పూర్ణభద్రస్తథైవ చ ।
కోటీనాం చైవ సప్తానాం చతుర్వక్త్రో మహాబలః ॥

★ తాత్పర్యము కొరకై రుద్రసంహితా - సతీ ఖండములోని 33 వ అధ్యాయమును చూడవలెను. ★

కోటికోటి సహస్రాణాం శతైర్వింశతిభిస్తథా ।
తత్రాజగ్ముస్తథా వీరాస్తే సర్వే సంగరోత్సవే ॥
భూతకోటి సహస్రేణ ప్రమథైః కోటిభిస్త్రిభిః ।
వీరభద్రశ్చతుష్షష్ట్యా లోమజానాం త్రికోటిభిః ॥
కాషారూఢశ్చతుషష్ట్యా సుకేశో వృషభస్తథా ।
విరూపాక్షశ్చ భగవాంశ్చతుష్షష్ట్యా సనాతనః ॥
తాలకేతుష్షడాస్యశ్చ పంచాస్యశ్చ ప్రతాపవాన్ ।
సంవర్తకస్తథా చైత్రో లంకులీశస్స్వయం ప్రభుః ॥
లోకాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాంతకః ప్రభుః ।
దేవో భృంగి రిటి శ్రీమాన్ దేవదేవప్రియస్తథా ॥
అశనిర్భానుకశ్చైవ చతుష్షష్ట్యా సహస్రశః ।
కంకాలః కాలకః కాలో నందీ సర్వాంతకస్తథా ॥
ఏతే చాన్యే చ గణపా అసంఖ్యాతా మహాబలాః ।
యుద్ధార్థం నిర్యయుః ప్రీత్యా శంఖచూడేన నిర్భయాః ॥

ఆ వీరులందరు వేయి, వంద మరియు ఇరవై కోట్ల గణములను వెంటనిడుకొని ఆ యుద్ధమహోత్సవములో పాల్గొనుటకై అచటకు విచ్చేసిరి (21). వేయి కోట్ల భూతములతో, మూడు కోట్ల ప్రమథులతో, మరియు అరవై ఏడు కోట్ల లోమజులతో (రుద్రగణములలో ఒక జాతి) కూడి వీరభద్రుడు విచ్చేసెను (22). కాషారూఢుడు, సుకేశుడు, వృషభుడు, పూజ్యుడగు విరూపాక్షుడు, మరియు సనాతనుడు ఒక్కొక్కరు అరవై నాలుగు కోట్ల గణములతో వచ్చిరి (23). తాలకేతువు, షడాస్యుడు, ప్రతాపవంతుడగు పంచాస్యుడు, సంవర్తకుడు, చైత్రుడు, లంకులీశుడు, స్వయం ప్రభుడు (24), లోకాంతకుడు, దీపాత్ముడు, సర్వసమర్థుడగు దైత్యాంతకుడు, జ్ఞానమూర్తి యగు భృంగి, శోభాయుక్తుడు దేవదేవునకు ప్రియుడు అగు రిటి (25), అశని, అరవై నాలుగు కోట్ల గణములతో గూడియున్న భానుకుడు, కంకాలుడు, కాలుడు, నంది మరియు సర్వాంతకుడు (26) మాత్రమే గాక, లెక్క లేనంతమంది మహాబలశాలురగు ఇతర గణాధ్యక్షులు నిర్భయులై శంఖచూడునితో యుద్ధము కొరకు ప్రేమతో బయలుదేరిరి (27).

సర్వే సహస్రహస్తాశ్చ జటాముకుటధారిణః ।
చంద్రరేఖావతంసాశ్చ నీలకంఠాస్త్రిలోచనాః ॥
రుద్రాక్షాభరణాస్సర్వే తథా సద్భస్మధారిణః ।
హారకుండల కేయూరముకుటాద్యైరలంకృతాః ॥
బ్రహ్మేంద్ర విష్ణుసంకాశా అణిమాది గుణైర్వృతాః ।
సూర్యకోటి ప్రతీకాశాః ప్రవీణా యుద్ధకర్మణి ॥
పృథివీచారిణః కేచిత్ కేచిత్ పాతాల చారిణః ।
కేచిద్వ్యో మచరాః కేచిత్సప్త స్వర్గచరా మునే ॥
కిం బహూక్తేన దేవర్షే సర్వలో కనివాసినః ।
యయుశ్శివగణాస్సర్వే యుద్ధార్థం దానవైస్సహ ॥
అష్టౌ చ భైరవా రౌద్రా రుద్రా శ్చైకదశాశు యే ।
వసవోఽ ష్టౌ వాసవశ్చాదిత్యా ద్వాదశ తే ద్రుతమ్ ॥
హుతాశనశ్చ చంద్రశ్చ విశ్వకర్మాశ్వినౌ చ తౌ ।
కుబేరశ్చ యమశ్చైవ నిర్ఋుతిర్నలకూబరః ॥

వారందరికీ వేయి చేతులు గలవు. వారు జటలను కిరీటముగా దాల్చి చంద్రరేఖను అలంకారముగా దాల్చిరి. వారు నల్లని కంఠమును, మూడు కన్నులను కలిగియుండిరి (28). వారందరు రుద్రాక్షలను, హారములను, కుండలములను, కేయూరములను, కిరీటములను ఇతర ఆభరణములను అలంకరించుకొని చక్కని భస్మను ధరించి యుండిరి (29). వారు బ్రహ్మ- ఇంద్ర-విష్ణువులను బోలియుండిరి. అణిమాది సిద్ధులను కలిగి కోటి సూర్యుల కాంతి గల ఆ గణములు యుద్ధ ప్రక్రియలో ఆరితేరియుండిరి (30). వారిలో కొందరు భూమండలమునందు, కొందరు పాతాళమునందు నివసించెదరు. ఓ మునీ! కొందరు ఆకాశమునందు, మరికొందరు సప్త స్వర్గములయందు నివసించెదరు (31). ఓ దేవర్షి! ఇన్ని మాటలేల? సర్వలోకములయందు నివసించే శివగణములందరు దానవులతో యుద్ధము కొరకై వెళ్లిరి (32). భయంకరాకారులగు అష్టభైరవులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ఇంద్రుడు, మరియు ద్వాదశాదిత్యులు శీఘ్రముగా వెళ్లిరి (33). అగ్ని, చంద్రుడు, విశ్వకర్మ, అశ్వినీ దేవతలు, కుబేరుడు, యముడు, నిర్ఋతి మరియు నల కూబరుడు కూడ వెళ్లిరి (34).

వాయుశ్చ వరుణశ్చైవ బుధశ్చ మంగలశ్చ వై ।
గ్రహాశ్చాన్యే మహేశేన కామదేవశ్చ వీర్యవాన్ ॥
ఉగ్రదంష్ట్రశ్చోగ్రదండః కోరటః కోట భస్తథా ।
స్వయం శతభుజా దేవీ భద్రకాలీ మహేశ్వరీ ॥
రత్నేంద్రసారనిర్మాణ విమానోపరి సంస్థితా ।
రక్త వస్త్ర పరీధానా రక్తమాల్యానులేపనా ॥
నృత్యంతీ చ హసంతీ చ గాయంతీ సుస్వరం ముదా ।
అభయం దదతీ స్వేభ్యో భయం చారిభ్య ఏవ సా ॥
బిభ్రతీ వికటాం జిహ్వాం సులోలాం యోజనాయతామ్ ।
శంఖచక్రగదాపద్మఖడ్గ చర్మధనుశ్శరాన్ ॥
ఖర్పరం వర్తులాకారం గంభీరం యోజనాయతమ్ ।
త్రిశూలం గగనస్పర్శి శక్తిం చ యోజనాయతామ్ ॥
ముద్గరం ముసలం వజ్రం ఖడ్గం ఫలక ముల్బణమ్ ।
వైష్ణవాస్త్రం వారుణాస్త్రం వాయవ్యం నాగపాశకమ్ ॥
నారాయణాస్త్రం గాంధర్వం బ్రహ్మాస్త్రం గారుడం తథా ।
పార్జన్యం చ పాశుపతం జృంభణాస్త్రం చ పార్వతమ్ ॥
మహావీరం చ సౌరం చ కాలకాలం మహానలమ్ ।
మహేశ్వరాస్త్రం యామ్యం చ దండం సంమోహనం తథా ॥
సమర్థమస్త్రకం దివ్యం దివ్యాస్త్రం శతకం పరమ్ ।
బిభ్రతీ చ కరైస్సర్వై రన్యాన్యపి చ సా తదా ॥

వాయు, వరుణ, బుధ, మంగళులు, ఇతర గ్రహములు మరియు వీర్యవంతుడగు కామదేవుడు కూడ మహేశ్వరుని వెనుక నడిచిరి (35). ఉగ్రదంష్ట్ర, ఉగ్రదండ, కోరట, కోటభులు కూడ శివుని వెంట నడిచిరి. వంద భుజములు గల మహేశ్వరియగు భద్రకాళీ దేవి స్వయముగా (36), గొప్ప రత్నములను పొదిగి నిర్మించిన విమానముపై కూర్చున్నదై ఎర్రని వస్త్రములను, ఎర్రని మాలను ధరించి, రక్తచందనమును పులుముకొని(37), చక్కని స్వరముతో పాడుతూ, ఆనందముతో నవ్వుతూ, నాట్యమాడుచూ, తన భక్తులకు అభయమును ఇస్తూ, శత్రువులకు భీతిని గొల్పుతూ (38) భయంకరము, మిక్కిలి చంచలము, యోజనము పొడవు గలది యగు నాలుకను కలిగినదై నడచెను. శంఖము, చక్రము, గద, పద్మము, ఖడ్గము, ధనస్సు, మరియు బాణములను (39), గుండ్రని లోతైన యోజనము వెడల్పుగల కపాలమును, ముద్గరమును, రోకలిని, ఆకసమును స్పృశించు త్రిశూలమును, యోజనము పొడవు గల శక్తిని, వజ్రమును, దట్టని డాలును ఆమె ధరించెను. ఆమె వైష్ణవ, వారుణ, వాయవ్యాస్త్రములను, నాగపాశమును (40, 41), నారాయణ, గాంధర్వ, బ్రహ్మ, గారుడ, పార్జన్య, పాశుపత, జృంభణ, పార్వత (42), మహావీర, సౌర, కాలకాల, మహానల, మహేశ్వర అస్త్రములను, యమదండమును, సంమోహన (43), సమర్థ అస్త్రములను, ఇంకనూ అనేకములగు దివ్యాస్త్రములను చేతులన్నిటియందు దాల్చి, అపుడామె బయలుదేరెను (44).

ఆగత్య తస్థౌ సా తత్ర యోగినీనాం త్రికోటిభిః ।
సార్ధం చ డాకినీనాం వై వికటానాం త్రికోటిభిః ॥

భూతప్రేతపిశాచాశ్చ కూష్మాండా బ్రహ్మరాక్షసాః ।
వేతాలా రాక్షసాశ్చైవ యక్షాశ్చైవ స కిన్నరాః ॥

తైశ్చైవాభివృతస్స్కందః ప్రణమ్య చంద్రశేఖరమ్ ।
పితుః పార్శ్వే సహాయో యస్సమువాస తదాజ్ఞయా ॥

అథ శంభుస్సమానీయ స్వసైన్యం సకలం తదా ।
యుద్ధార్థమగమద్రుద్రశ్శంఖచూడేన నిర్భయః ॥

చంద్రభాగా నదీతీరే వటమూలే మనోహరే ।
తత్ర తస్థౌ మహాదేవో దేవనిస్తారహేతవే ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే మహాదేవ యుద్ధయాత్రా వర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥

ఆమె భయంకరాకారులగు మూడుకోట్ల డాకినిలతో, మరియు మూడు కోట్ల యోగినులతో సహా వచ్చి అక్కడ నిలబడెను (45). భూత, ప్రేత, పిశాచ, కూష్మాండ, బ్రహ్మరాక్షస, వేతాల, రాక్షస, యక్ష, కిన్నరులతో (46) చుట్టువారబడియున్న కుమారస్వామి తండ్రియగు చంద్రశేఖరునకు ప్రణమిల్లి ఆయన ఆజ్ఞచే ఆయనకు సహాయకుడై ప్రక్కనే నిలబడెను (47). అపుడు ఉగ్రరూపుడు, నిర్భయుడు నగు శంభుడు తన సైన్యమునంతనూ తీసుకొని శంఖచూడునితో యుద్ధమునకు వెళ్లెను (48). దేవతల నుద్ధరించుట కొరకై మహాదేవుడు సుందరమగు చంద్రభాగానదీ తీరమునందు వటవృక్షముయొక్క మూలమునందు మకాము చేసెను (49).

శ్రీశివమహాపురాణములో రుద్రసంహితయందలి యుద్ధఖండలో మహాదేవుని యుద్ధయాత్రా వర్ణనమనే ముప్పది మూడవ ఆధ్యాయము ముగిసినది (33).

34 - శంఖచూడుని యుద్ధయాత్ర

వ్యాస ఉవాచ ।

విధితాత మహాబుద్ధే మునే జీవ చిరం సమాః ।
కథితం సుమహచ్చిత్రం చరితం చంద్రమౌలినః ॥
శివదూతే గతే తత్ర శంఖచూడశ్చ దానవః ।
కిం చకార ప్రతాపీ స తత్త్వం వద సువిస్తరమ్ ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మపుత్రా! నీవు మహాబుద్ధిశాలివి. ఓ మునీ ! చిరకాలము జీవించుము. చిత్రమైనది, చాలా గొప్పదియగు చంద్రశేఖరుని చరితమును చెప్పితివి (1). శివుని దూత మరలి పోగానే ప్రతాపవంతుడగు శంఖచూడాసురుడు ఏమి చేసినాడు? నీవా గాథను విస్తారముగా చెప్పుము (2).

సనత్కుమార ఉవాచ ।

అథ దూతే గతే తత్ర శంఖచూడః ప్రతాపవాన్ ।
ఉవాచ తులసీం వార్తాం గత్వాభ్యంతరమేవ తామ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దూత నిర్గమించిన తరువాత ప్రతాపవంతుడగు శంఖచూడుడు సభనుండి అంతఃపురము లోపలికి వెళ్లి ఆ వార్తను తులసికి చెప్పెను (3).

శంఖచూడ ఉవాచ ।

శంభుదూతముఖాద్దేవి యుద్ధాయాహం సముద్యతః ।
తేన గచ్ఛామ్యహం యోద్ధుం శాసనం కురు మే ధ్రువమ్ ॥
ఇత్యేవముక్త్వా స జ్ఞానీ నానా బోధనతః ప్రియామ్ ।
క్రీడాం చకార హర్షేణ తమనాదృత్య శంకరమ్ ॥
తౌ దంపతీ చిక్రీడాతే నిమగ్నౌ సుఖసాగరే ।
నానా కామకలాభిశ్చ నిశి చాటు శతైరపి ॥
బ్రాహ్మే ముహూర్త ఉత్థాయ ప్రాతః కృత్యం విధాయ చ ।
నిత్య కార్యం చ కృత్వాదౌ దదౌ దానమనంతకమ్ ॥
పుత్రం కృత్వా చ రాజేంద్రం సర్వేషు దానవేషు చ ।
పుత్రే సమర్ప్య భార్యాం చ సరాజ్యం సర్వసంపదమ్ ॥
ప్రియామాశ్వాసయామాస స రాజా రుదతీం పునః ।
నిషేధతీం చ గమనం నానావార్తాం ప్రకథ్య చ ॥
నిజసేనాపతిం వీరం సమాహూయ సమాదృతః ।
ఆదిదేశ స సన్నద్ధస్సం గ్రామం కర్తు ముద్యతః ॥

శంఖచూడుడిట్లు పలికెను -

ఓ దేవీ! శంభుని దూత పలికిన పలుకులు నన్ను యుద్ధమునకు ప్రేరేపించినవి. కావున, నేను యుద్ధము కొరకు వెళ్లుచున్నాను. నీవు నా ఆజ్ఞను నిశ్చయముగా పాలించుము (4).

జ్ఞానియగు ఆ శంఖచూడుడు ప్రియురాలితో నిట్లు పలికి ఆ శంకరుని అనాదరము చేసి ఆమెకు ఆనందముతో అనేకవిషయములను బోధిస్తూ ఆమెతో గూడి క్రీడించెను (5). ఆ దంపతులు రాత్రియందు సుఖసముద్రములో తేలియాడుతూ అనేక నర్మోక్తులను పలుకుతూ ఆనందముగా గడిపిరి (6). ఆతడు బ్రాహ్మ ముహూర్తమునందు నిద్ర లేచి, కాలకృత్యములను తీర్చుకొని ప్రాతఃకాల కర్మలననుష్ఠించి ముందుగా అంతులేని దానములను చేసెను (7). ఆతడు తన పుత్రుని సర్వదానవులకు చక్రవర్తిని చేసి రాజ్యమును, సర్వసంపదలను మరియు భార్యను అతనికి అప్పజెప్పెను (8). ఆ రాజు తన యాత్రను ప్రతిఘటిస్తూ ఏడ్చుచున్న ప్రియురాలికి మరల అనేక వచనములను బోధించి ఓదార్చెను (9). అపుడాతడు వీరుడగు తన సేనాపతిని పిలిపించెను. సాదరముగా నిలబడిన సేనానాయకుని సైన్యసన్నాహమును చేయుమని ఆదేశించి తాను స్వయముగా సంగ్రామమునకు సన్నద్ధుడాయెను (10).

అద్య సేనాపతే వీరా స్సర్వే సమరశాలినః ।
సన్నద్ధాఖిల కర్మాణో నిర్గచ్ఛంతు రణాయ చ ॥
దైత్యాశ్చ దానవాశ్శూరా షడశీతిరుదాయుధాః ।
కంకానాం బలినాం శీఘ్రం సేనా నిర్యాంతు నిర్భయాః ॥
పంచాశదసురాణాం హి నిర్గచ్ఛంతు కులాని వై ।
కోటివీర్యాణి యుద్ధార్థం శంభునా దేవపక్షిణా ॥
సన్నద్ధాని చ ధౌమ్రాణాం కులాని చ శతం ద్రుతమ్ ।
నిర్గచ్ఛంతు రణార్థం హి శంభునా మమ శాసనాత్ ॥
కాలకేయాశ్చ మౌర్యాశ్చ దౌర్హృదాః కాలకాస్తథా ।
సజ్జా నిర్యాంతు యుద్ధాయ రుద్రేణ మమ శాసనాత్ ॥

ఓ సేనాపతీ! ఈనాడు యుద్ధనిపుణులగు వీరులందరు యుద్ధమునకు కావలసిన ఏర్పాట్లనన్నిటినీ సంసిద్ధము చేసుకొని బయలుదేరెదరుగాక! (11) దైత్యుల యొక్క, శూరులగు దానవులయొక్క, మరియు బలవంతులగు కంకులయొక్క ఎనభై ఆరు పటాలముల సైన్యము ఆయుధములను సిద్ధము చేసుకొని నిర్భయముగా వెంటనే బయలుదేరవలెను (12). కోటి సైన్యముతో సమమగు పరాక్రమముగల అసురుల సేనలు ఏబది గలవు. దేవపక్షపాతియగు శంభునితో యుద్ధము కొరకై ఆ సేనలు బయలుదేరును గాక! (13) ధౌమ్రుల వంద సేనలు నా ఆజ్ఞచే సన్నద్ధులై శంభునితో యుద్ధము కొరకు వెంటనే బయలుదేరవలెను (14). కాలకేయులు, మౌర్యులు, దౌర్హృదులు మరియు కాలకులు నా ఆజ్ఞచే సన్నద్ధులై రుద్రునితో యుద్ధము కొరకు బయలుదేరెదరు గాక! (15)

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాజ్ఞప్యాసురపతిర్దానవేంద్రో మహాబలః ।
నిర్జగామ మహాసైన్యస్సహాస్త్రైర్బహుభిర్వృతః ॥
తస్య సేనాపతిశ్చైవ యుద్ధశాస్త్ర విశారదః ।
మహారథో మహావీరో రథినాం ప్రవరో రణే ॥
త్రిలక్షాక్షౌహిణీయుక్తో మాంగల్యం చ చకార హ ।
బహిర్బభూవ శిబిరాద్రణే వీరభయంకరః ॥
రత్నేంద్రం సారనిర్మాణం విమానమభిరుహ్య సః ।
గురువర్గం పురస్కృత్య రణార్థం ప్రయయౌ కిల ॥
పుష్పభద్రానదీ తీరే యత్రాక్షయవటశ్శుభః ।
సిద్ధాశ్రమే చ సిద్ధానాం సిద్ధి క్షేత్రం సు సిద్ధిదమ్ ॥
కపిలస్య తతస్స్థానం పుణ్య క్షేత్రే చ భారతే ।
పశ్చిమోదధిపూర్వే చ మలయస్య హి పశ్చిమే ॥
శ్రీశైలోత్తరభాగే చ గంధమాదన దక్షిణే ।
పంచయోజన విస్తీర్ణం దైర్ఘ్యే శతగుణస్తథా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

అసురులకు, దానవులకు ప్రభువు, మహాబలశాలియగు శంఖచూడుడు ఇట్లు ఆజ్ఞాపించి వేలాది పటాలముల మహాసైన్యముతో చుట్టు వారబడిన వాడై బయలు దేరెను (16). ఆతని సేనాపతి యుద్ధకళలో నిపుణుడు, మహారథి, మహావీరుడు, యుద్ధములో రథికులలో శ్రేష్ఠుడు (17). మూడు లక్షల అక్షౌహిణీల సేనతో గూడియున్న ఆ సేనాపతి మంగళకరమగు పూజాదులను చేసి శిబిరము బయటకు వచ్చెను. యుద్ధములో శత్రు వీరులకాతడు భయమును గొల్పు చుండెను (18). ఆతడు శ్రేష్ఠమగు రత్నములతో అద్భుతముగా నిర్మింపబడిన విమానము నధిష్ఠించి, పెద్దలందరికీ నమస్కరించిన తరువాత, యుద్ధము కొరకు బయలుదేరెను (19). పుష్పభద్రానదీ తీరమునందు శుభకరమగు అక్షయ వటవృక్షము గలదు. సిద్ధులకు తపస్సిద్ధినొసంగి సిద్ధి క్షేత్రమని పేరు పొందిన సిద్ధాశ్రామమచటనే గలదు (20). పుణ్య భూమి యగు భారతదేశములో కపిలుని స్థానమదియే. అది పశ్చిమసముద్రము నకు తూర్పునందు, మలయపర్వతమునకు పశ్చిమమునందు (21), శ్రీశైలమునకు ఉత్తరమునందు, గంధమాదన పర్వతమునకు దక్షిణమునందు గలదు. అది అయిదు యోజనముల వెడల్పు, అంతకు వందరెట్లు పొడవు కలిగి యుండెను (22).

శుద్ధస్పటిక సంకాశా భారతే చ సుపుణ్యదా ।
పుష్పభద్రా నదీ రమ్యా జలపూర్ణా సరస్వతీ ॥
లవణో దధిప్రియా భార్యా శశ్వత్సౌభాగ్యసంయుతా ।
సరస్వతీ సంశ్రితా చ నిర్గతా సా హిమాలయాత్ ॥
గోమంతం వామతః కృత్వా ప్రవిష్టా పశ్చిమో దదౌ ।
తత్ర గత్వా శంఖచూడశ్శివ సేనాం దదర్శ హ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శంఖచూడ యాత్రా వర్ణనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥

శుద్ధమగు స్పటికము వలె తెల్లనైన జలములతో నిండియున్నది, భారతదేశములో ని పుణ్యనదులలో గొప్పది, సుందరమైనది, సరస్వతి యను పేరు గలది, సముద్రునకు ప్రియురాలైన పత్నియైనది, భక్తులకీయదగిన సర్వసౌభాగ్యములు గలది, సరస్వతీనదిని ఆశ్రయించి ఉన్నది, హిమాలయమునుండి పుట్టినది, గోమంతము (గోవా) నకు ఎడమగా ప్రవహించి పశ్చిమసముద్రములో ప్రవేశించునది అగు పుష్పభద్రానది వద్దకు వెళ్లి, శంఖచూడుడు అచట శివుని సేనను గాంచెను (23, 24, 25).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శంఖచూడయాత్రా వర్ణనమనే ముప్పది నాలుగవ అధ్యాయము ముగిసినది (34).

35 - శంఖచూడుని దూత శివునితో సంభాషించుట

సనత్కుమార ఉవాచ ।

తత్ర స్థిత్వా దానవేంద్రో మహాంతం దానవేశ్వరమ్ ।
దూతం కృత్వా మహావిజ్ఞం ప్రేషయామాస శంకరమ్ ॥
స తత్ర గత్వా దూతశ్చ చంద్రభాలం దదర్శ హ ।
వటమూలే సమాసీనం సూర్యకోటి సమప్రభమ్ ॥
కృత్వా యోగాసనం దృష్ట్వా ముద్రాయుక్తం చ సస్మితమ్ ।
శుద్ధస్ఫటికసంకాశం జ్వలంతం బ్రహ్మతేజసా ॥
త్రిశూల పట్టిశధరం వ్యాఘ్ర చర్మాంబరావృతమ్ ।
భక్తమృత్యుహరం శాంతం గౌరీకాంతం త్రిలోచనమ్ ॥
తపసాం ఫలదాతారం కర్తారం సర్వ సంపదామ్ ।
ఆశుతోషం ప్రసన్నాస్యం భక్తానుగ్రహకారకమ్ ॥
విశ్వనాథం విశ్వబీజం విశ్వరూపం చ విశ్వజమ్ ।
విశ్వంభరం విశ్వకరం విశ్వసంహారకారణమ్ ॥
కారణం కారణానాం చ నరకార్ణవతారణమ్ ।
జ్ఞాన ప్రదం జ్ఞానబీజం జ్ఞానానందం సనాతనమ్ ॥
అవరుహ్య రథా దూతస్తం దృష్ట్వా దానవేశ్వరః ।
శంకరం సకుమారం చ శిరసా ప్రణనామ సః ॥
వామతో భద్రకాలీం చ స్కందం తత్పురతస్థితమ్ ।
లోకాశిషం దదౌ తస్మై కాలీ స్కందశ్చ శంకరః ॥
అథాసౌ శంఖచూడస్య దూతః పరమశాస్త్ర విత్ ।
ఉవాచ శంకరం నత్వా కరౌ బద్ధ్వా శుభం వ చః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ రాక్షసరాజు అక్కడ మకాము చేసి, మహాజ్ఞాని యగు ఒక గొప్ప దానవశ్రేష్ఠుని శివుని వద్దకు దూతగా పంపెను (1). ఆ దూత అచటకు వెళ్లి, ఫాలభాగమునందు చంద్రవంక గలవాడు, వట వృక్షమూలము నందు కూర్చున్నవాడు, కోటి సూర్యులతో సమానమగు కాంతి గలవాడు (2), యోగాసనమును వేసి కనులతో ముద్రను ప్రదర్శించువాడు, చిరునగవు మోమువాడు, స్వచ్ఛమగు స్ఫటికమును బోలియున్నవాడు, బ్రహ్మతేజస్సుతో వెలిగి పోవుచున్న వాడు (3), త్రిశూలమును పట్టిశమును పట్టుకున్న వాడు, వ్యాఘ్రచర్మమును వస్త్రముగా దాల్చినవాడు, భక్తుల మృత్యువును పోగొట్టువాడు,

శాంతస్వరూపుడు, గౌరీప్రియుడు, ముక్కంటి (4), తపస్సుల ఫలములనిచ్చువాడు, సర్వసంపదలను కలిగించువాడు, శీఘ్రముగా సంతోషించువాడు, ప్రసన్నమగు మోము గలవాడు, భక్తులను అనుగ్రహించువాడు (5), జగత్తునకు తండ్రి, జగత్తునకు కారణము, జగత్ స్వరూపములో నున్నవాడు, సర్వమునుండి పుట్టువాడు, సర్వమును పాలించువాడు, సర్వమునకు కర్త, జగత్తును ఉపసంహరించువాడు (6), సర్వకారణ కారణుడు, పాపసముద్రమును దాటించువాడు, జ్ఞానమునిచ్చువాడు, జ్ఞానమునకు కారణుడు, జ్ఞాన-ఆనంద స్వరూపుడు, ఆద్యంతములు లేనివాడు (7) అగు శంకరుడు కుమారస్వామితో కూడియుండగా చూచెను. దూతయగు ఆ దానవవీరుడు రథమునుండి దిగి ఆయనకు శిరము వంచి ప్రణమిల్లెను (8). ఆయనకు ఎడమవైపున భద్రకాళి, ఎదుట కుమారస్వామి ఉండిరి. లో కమర్యాదనను సరించి కాళి, కుమారస్వామి, మరియు శంకరుడు ఆతనిని ఆశీర్వదించిరి (9). గొప్ప శాస్త్రవేత్త యగు, శంఖచూడుని దూత అపుడు చేతులు జోడించి శంకరునకు ప్రణమిల్లి ఈ శుభవచనములను పలికెను (10).

దూత ఉవాచ ।

శంఖచూడస్య దూతోఽహం త్వత్సకాశమిహాగతః ।

వర్తతే తే కిమిచ్ఛాద్య తత్త్వం బ్రూహి మహేశ్వర ॥

దూత ఇట్లు పలికెను -

ఓ మహేశ్వరా! 'నేను శంఖచూడుని దూతను. నీవద్దకు ఇచటకు వచ్చి యున్నాను. ఇపుడు నీ కోరిక ఏమి? నాకు సత్యమును చెప్పుము (11).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా చ వచనం శంఖచూడస్య శంకరః ।

ప్రసన్నాత్మా మహాదేవో భగవాంస్తమువాచ హ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మంగళకరుడు, ప్రసన్నమగు మనస్సు గలవాడు అగు మహాదేవుడు శంఖచూడుని ఆ సందేశమును వినెను. భగవానుడా తనితో నిట్లనెను (12).

మహాదేవ ఉవాచ ।

శృణు దూత మహాప్రాజ్ఞ వచో మమ సుఖావహమ్ ।

కథనీయమిదం తస్మై నిర్వివాదం విచార్య చ ॥

విధాతా జగతాం బ్రహ్మా పితా ధర్మస్య ధర్మవిత్ ।

మరీచిస్తస్య పుత్రశ్చ కశ్యపస్తత్సుత స్స్మృతః ॥

దక్షః ప్రీత్యా దదౌ తస్మై నిజకన్యాస్త్రయోదశ ।
తాస్వేకా చ దనుస్సాధ్వీ తత్సౌభాగ్యవివర్ధినీ ॥
చత్వారస్తే దనోః పుత్రా దానవాస్తేజసోల్బణాః ।
తేష్వేకో విప్రచిత్తిస్తు మహాబలపరాక్రమః ॥
తత్పుత్రో ధార్మికో దంభో దానవేంద్రో మహామతిః ।
తస్య త్వం తనయ శ్శ్రేష్ఠో ధర్మాత్మా దానవేశ్వరః ॥
పురా త్వం పార్షదో గోపో గోపేష్వేవ చ ధార్మికః ।
అధునా రాధికాశాపాద్ధాతస్త్వం దానవేశ్వరః ॥
దానవీం యోని మాయాతస్తత్త్వతో న హి దానవః ।
నిజవృత్తం పురా జ్ఞాత్వా దేవవైరం త్యజాధునా ॥
ద్రోహం న కురు తైస్సార్ధం స్వపదం భుంక్ష్వ సాదరమ్ ।
నాధికం సవికారం చ కురు రాజ్యం విచార్య చ ॥
దేహి రాజ్యం చ దేవానాం మత్ప్రీతిం రక్ష దానవ ।
నిజరాజ్యే సుఖం తిష్ఠ తిష్ఠంతు స్వపదే సురాః ॥
అలం భూత విరోధేన దేవద్రోహేణ కిం పునః ।
కులీనా శ్శుద్ధకర్మాణస్సర్వే కశ్యప వంశజాః ॥
యాని కాని చ పాపాని బ్రహ్మహత్యాదికాని చ ।
జ్ఞాతి ద్రోహజ పాపస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥

మహాదేవుడిట్లు పలికెను -

ఓ దూతా! నీవు గొప్ప బుద్ధిశాలివి. సుఖకరమగు నా మాటను వినుము. నీవు ఆలోచించి వివాదమును తొలగించే ఈ మాటలను వానికి చెప్పుము (13). ధర్ముని తండ్రి, ధర్మజ్ఞుడు అగు బ్రహ్మ జగత్తులను సృష్టించెను. ఆయన కుమారుడు మరీచి. ఆయన కొడుకు కశ్యపుడు (14). దక్షుడు ఆ కశ్యపునకు తన పదముగ్గురు కుమార్తెలనిచ్చి ప్రీతి పూర్వకముగా వివాహమును చేసెను. వారిలో దనువు ఒకతె. ఆమె పతివ్రత. ఆమె వలన కశ్యపుని సౌభాగ్యము వర్ధిల్లెను (15). ఆ దనువునకు తేజశ్శాలురు, వీరులు అగు నల్గురు పుత్రులు గలరు. వారికి దానవులని పేరు. వారిలో మహాబలపరాక్రమశాలియగు విప్రచిత్తి ఒకడు (16). దానవశ్రేష్ఠుడు, మహాప్రాజ్ఞుడు ధార్మికుడు అగు దంభుడు ఆయన కుమారుడు. శ్రేష్ఠుడవు, ధర్మాత్ముడవు, దానవాధీశ్వరుడవు అగు నీవు దంభుని పుత్రుడవు (17). పూర్వజన్మలో నీవు ధర్మాత్ముడు, గోపబాలకులలో ప్రముఖుడు అగు శ్రీకృష్ణా నుచరుడవు. రాధాదేవి యొక్క శాపముచే ఈ జన్మలో దానవచక్రవర్తివై జన్మించినావు (18). నీవు దానవజన్మను పొందియున్ననూ, నీది దానవస్వభావము కాదు. నీవు నీ పూర్వజన్మ వృత్తాంతము నెరింగి ఇప్పుడు దేవతలతో నీకు గల వైరమును పరిత్యజింపుము (19). వారి యెడల ద్రోహము నాచరించకుము. నీ పదవిని ఆనందముగా

అనుభవించుము. నీ రాజ్యమును విస్తరింపజేయుటకు గాని, లేక కల్లోలమును సృష్టించుటకు గాని యత్నించకుము. ఆలోచించుము (20). దేవతలకు వారి రాజ్యమును అప్పజెప్పుము. ఓ దానవా! నాకు నీయందు గల ప్రేమను నిలబెట్టు కొనుము. నీ రాజ్యములో నీవు సుఖముగా నుండుము. దేవతలు తమ స్థానములో ఉండెదరు గాక! (21) ప్రాణులతో విరోధమును చాలించుము. దేవద్రోహము వలన ప్రయోజనమేమి గలదు? కశ్యపుని వంశములో పుట్టిన వారందరు శుద్ధమగు కర్మలననుష్ఠించి కులమర్యాదను నిలబెట్టెదరు (22). బ్రహ్మ హత్య మొదలగు ఏ పాపము లైననూ జ్ఞాతి ద్రోహము వలన కలిగే పాపములో పదునారవ వంతు అయిననూ కాజాలవు (23).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాది బహువార్తాం చ శ్రుతిస్మృతిపరాం శుభామ్ ।
ప్రోవాచ శంకరస్తస్మై బోధయన్ జ్ఞానముత్తమమ్ ॥
శిక్షితశ్శంఖచూడేన స దూతస్తర్క విత్తమః ।
ఉవాచ వచనం నమ్రో భవితవ్య విమోహితః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఈ తీరున శంకరుడు శ్రుతిస్మృతుల తాత్పర్యముతో కూడిన శుభకరమగు అనేక వచనములను పలికి ఆతనికి ఉత్తమమగు జ్ఞానమును బోధించెను (24). కాని ఆ దూత తర్కములో దిట్ట; పైగా శంఖచూడుడు ఆతనికి తర్ఫీదునిచ్చి పంపెను. కావున ఆతడు విధిబలముచే మోహమును పొంది వినయముతో నిట్లు పలికెను (25).

దూత ఉవాచ ।

త్వయా యత్క థితం దేవ నాన్యథా తత్తథా వచః ।
తథ్యం కించిద్యథార్థం చ శ్రూయతాం మే నివేదనమ్ ॥
జ్ఞాతి ద్రోహే మహత్పాపం త్వయోక్త మధునా చయత్ ।
తత్కిమీశాసురాణాం చ న సురాణాం వద ప్రభో ॥
సర్వేషామితి చేత్తర్హి తదా వచ్మి విచార్య చ ।
నిర్ణయం బ్రూహి తత్రాద్య కురు సందేహభంజనమ్ ॥
మధుకైటభయోర్దైత్యవరయోః ప్రలయార్ణవే ।
శిరశ్ఛేదం చకారాసౌ కస్మాచ్చక్రీ మహేశ్వర ॥
త్రిపురైస్సహ సంయుద్ధం భస్మత్వకరణం కుతః ।
భవాన్ చకార గిరిశ సురపక్షీతి విశ్రుతమ్ ॥
గృహీత్వా తస్య సర్వస్వం కుతః ప్రస్థాపితో బలిః ।
సుతలాది సముద్ధర్తుం తద్ద్వారే చ గదాధరః ॥

సభ్రాతృకో హిరణ్యాక్షః కథం దేవైశ్చ హింసితః ।
శుంభాదయోఽ సురాశ్చైవ కథం దేవైర్నిపాతితాః ॥

దూత ఇట్లు పలికెను -

ఓ దేవా! నీవు చెప్పిన వచనములన్నియూ సత్యమే. మరియొకటి గాదు. ఆయిననూ నేను కూడ కొన్ని యథార్థ విషయములను విన్నవించెదను. వినుడు (26). ఓ ప్రభూ! జ్ఞాతులకు ద్రోహము చేయుట మహాపాపమని నీవీనాడు చెప్పిన మాట రాక్షసులకు మాత్రమే ఏల వర్తించుచున్నది? ఓ ఈశా! అది దేవతలకు అన్వయించదా యేమి? చెప్పుడు (27). అందరికీ వర్తించుననే పక్షములో, నేను ఆలోచించి కొన్ని విషయములను చెప్పెదను. వాటిపై మీ నిర్ణయమును ప్రకటించి నా సందేహమును తొలగించుడు (28). ఓ మహేశ్వరా! ప్రళయసముద్రములో రాక్షసులలో శ్రేష్ఠులగు మధుకైటభుల తలలను చక్రధారి యగు విష్ణువు నరుకుటకు కారణమేమి? (29) నీవు త్రిపురాసులతో యుద్ధమును చేసి వారి నగరములను భస్మము చేయుటకు కారణమేమి? ఓ కైలాసగిరీశా! నీవు దేవపక్షపాతివని ప్రసిద్ధిని గాంచినావు (30). బలిచక్రవర్తి యొక్క సర్వస్వమును ఊడలాగుకొని, ఆతనిని పాతాళమునకు సాగనంపుటకు కారణమేమి? గదాధరుడగు విష్ణువు ద్వారపాలకుడై ఆతనిని ఉద్ధరించినాడు (31). దేవతలు హిరణ్యాక్షుని, ఆతని సోదరుని హింసించుటకు కారణమేమి? దేవతలు శుంభాది రాక్షసులను సంహరించుటకు కారణమేమి? (32)

పురా సముద్రమథనే పీయూషం భక్షితం సురైః ।
కేశ భాజో వయం తత్ర తే సర్వే ఫలభోగినః ॥
క్రీడా భాండమిదం విశ్వం కాలస్య పరమాత్మనః ।
స దదాతి యదా యస్మై తస్యైశ్వర్యం భవేత్తదా ॥
దేవదానవయోర్వైరం శశ్వన్నైమిత్తికం సదా ।
పరాజయో జయస్తేషాం కాలాధీనః క్రమేణ చ ॥
తవానయోర్విరోధే చ గమనం నిష్ఫలం భవేత్ ।
సమసంబంధినాం తద్వై రోచతే నేశ్వరస్య తే ॥
సురాసురాణాం సర్వేషామీశ్వరస్య మహాత్మనః ।
ఇయం తే రహితా లజ్జా స్పర్ధాస్మాభిస్సహాధునా ॥
యతోఽధికా చైవ కీర్తిర్హానిశ్చైవ పరాజయే ।
తవైతద్విపరీతం చ మనసా సంవిచార్య తామ్ ॥

పూర్వము సముద్రమును మథించినప్పుడు దేవతలు అమృతమును భక్షించిరి. అపుడు మేము ఇడుముల పాలైతిమి. వారందరు ఫలమును అనుభవించిరి (33). ఈ జగత్తు క్రీడారూపుడగు పరమాత్మకు ఆటవస్తువు. ఆయన ఎప్పుడు ఎవ్వనికి ఐశ్వర్యమునిచ్చునో, అప్పుడు వాడు దానిని భోగించును (34). దేవదానవుల మధ్య శాశ్వతమగు వైరము గలదు. సర్వదా దానికి నిమిత్తము కూడ గలదు. వారికి జయపరాజయములు క్రమముగా కాలమునకు అధీనమై లభించు చుండును (35). వారి ఈ విరోధములో నీవు తలదూర్చుట వ్యర్థము అగును. ఇరుపక్షముల వారికి నీతో సమసంబంధము గలదు. కావున ఈశ్వరుడవగు నీవు ఒక పక్షమున చేరుట సొగసుగా లేదు (36). దేవదానవులకు అందరికీ ప్రభుడవు, మహాత్ముడవు అగు నీవు ఈ నాడు ఈ విధముగా మాతో కయ్యమునకు దిగుట సిగ్గుచేటు (37). నీవు జయించినచో నీ కీర్తి లేశమైననూ ఇనుమడించదు. కాని నీవు ఓడినచో కీర్తికి హాని కలుగును. ఈ వైపరీత్యమును నీవు మనస్సులో చక్కగా విచారించదగును (38).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేతద్వచనం శ్రుత్వా సంప్రహస్య త్రిలోచనః ।
యథోచితం చ మధురమువాచ దానవేశ్వరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఈ మాటలను విని ముక్కంటి బిగ్గరగా నవ్వి దానవచక్రవర్తియగు శంఖచూడుని ఉద్దేశించి యథోచితము, మధురము అగు వచనమును పలికెను (39).

మహేశ ఉవాచ ।

వయం భక్తపరాధీనా న స్వతంత్రాః కదాపి హి ।
తదిచ్ఛయా తత్కర్మాణో న కస్యాపి చ పక్షిణః ॥
పురా విధి ప్రార్థనయా యుద్ధమాదౌ హరేరపి ।
మధుకైటభయోర్దైత్య వరయోః ప్రలయార్ణవే ॥
దేవ ప్రార్థనయా తేన హిరణ్య కశిపోః పురా ।
ప్రహ్లాదార్థం వధోఽ కారి భక్తానాం హితకారిణా ॥
త్రిపురైస్సహ సంయుద్ధం భస్మత్వకరణం తతః ।
దేవ ప్రార్థనయాఽ కారి మయాపి చ పురా శ్రుతమ్ ॥
సర్వేశ్వర్యాస్సర్వమాతుర్దేవ ప్రార్థనయా పురా ।
ఆసీచ్ఛుంభాదిభిర్యుద్ధం వధస్తేషాం తయా కృతః ॥
అద్యాపి త్రిదశాస్సర్వే బ్రహ్మాణం శరణం యయుః ।
స సదేవో హరిర్మాం చ దేవశ్శరణమాగతః ॥
హరి బ్రహ్మాదికానాం చ ప్రార్థనా వశతోఽప్యహమ్ ।
సురాణా మీశ్వరో దూత యుద్ధార్థమగమం ఖలు ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

మేము భక్తులకు వశవర్తులమై ఉండెదము. మేము ఎన్నటికీ స్వతంత్రులము కాము. భక్తు్లల కోర్కెచే వారి కార్యములను చేయువారమే గాని, ఏ ఇక్కరి పక్షమునైనా స్వీకరించువారము గాము (40). పూర్వము ప్రళయసముద్రములో విష్ణువు బ్రహ్మ యొక్క ప్రార్థన నాలకించి దైత్యవీరులగు మధుకైటభులతో సృష్ట్యాదియందు యుద్ధమును చేసెను (41). పూర్వము భక్తులకు హితమును చేయు విష్ణువు దేవతల ప్రార్థనను మన్నించి ప్రహ్లాదుని కొరకై హిరణ్యకశపుని సంహరించెను (42). పూర్వము నేను కూడా దేవతల ప్రార్థనను మన్నించి త్రిపురలతో గొప్ప యుద్ధమును చేసి వారి పురములను భస్మమొనర్చిన వృత్తాంతము లోక విదితమే (43). సర్వేశ్వరి, సర్వజగన్మాత యగు దుర్గ పూర్వము దేవతలు ప్రార్థించుటచే శుంభాదులతో జరిగిన యుద్ధములో వారిని సంహరించెను (44). ఈ నాడు కూడా దేవతలందరు బ్రహ్మను శరణు జొచ్చిరి. ఆ బ్రహ్మ, మరియు విష్ణువు దేవతలతో గూడి నన్ను శరణు పొందిరి (45). ఓ దూతా! బ్రహ్మ, విష్ణువు మొదలగు వారి ప్రార్థనను మన్నించి నేను సర్వేశ్వరుడనే అయిననూ ఈ దేవతల యుద్ధముకొరకు వచ్చి యుంటిని (46).

పార్షద ప్రవరస్త్వం హి కృష్ణస్య చ మహాత్మనః ।
యే యే హతాశ్చ దైతేయా న హి కేఽపి త్వయా సమాః ॥
కా లజ్జా మహతీ రాజన్ మమ యుద్ధే త్వయా సహ ।
దేవకార్యార్థమీశోఽహం వినయేన చ ప్రేషితః ॥
గచ్ఛ త్వం శంఖ చూడే వై కథనీయం చ మే వచః ।
స చ యుక్తం కరోత్వత్ర సురకార్యం కరోమ్యహమ్ ॥
ఇత్యుక్త్వా శంకరస్తత్ర విరరామ మహేశ్వరః ।
ఉత్తస్థౌ శంఖచూడస్య దూతోఽ గచ్ఛత్తదంతికమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శివ దూత
సంవాదో నామ పంచత్రింశోఽధ్యాయః ॥

మహాత్ముడగు శ్రీకృష్ణునకు నీవు అనుంగు సహచరుడవు. ఇంతకు ముందు సంహరింపబడిన రాక్షసు లెవ్వరూ నీతో సమానమైన వారు కారు (47). ఓ రాజా! నాకు నీతో యుద్ధమును చేయుటలో అధికమగు సిగ్గు ఏమి గలదు? ఈశ్వరుడనగు నన్ను దేవతలు వినయముతో ప్రార్థించగా, దేవకార్యము కొరకు వచ్చియుంటిని (48). నీవు వెళ్లి నా ఈ మాటలను శంఖచూడునకు చెప్పుము. ఆతడు తనకు యోగ్యమగు రీతిలో చేయుగాక! నేను దేవకార్యమును చేసెదను (49). మహేశ్వరుడగు శంకరుడిట్లు పలికి విరమించెను. అపుడు శంఖచూడుని దూత లేచి ఆతని వద్దకు వెళ్లెను (50).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శివదూత సంవాదమనే ముప్పది అయిదవ అధ్యాయము ముగిసినది (35).

36 - దేవాసుర సంగ్రామము

సనత్కుమార ఉవాచ ।

స దూతస్తత్ర గత్వా చ శివవాక్యం జగాద హ ।
స విస్తరం యథార్థం చ నిశ్చయం తస్య తత్త్వతః ॥
తచ్ఛ్రుత్వా శంఖచూడోఽసౌ దానవేంద్రః ప్రతాపవాన్ ।
అంగీచకార సుప్రీత్యా రణమేవ స దానవః ॥
సమారురోహ యానం చ సహామాత్యైశ్చ సత్వరః ।
ఆదిదేశ స్వసైన్యం చ యుద్ధార్థం శంకరేణ చ ॥
శివస్స్వసైన్యం దేవాంశ్చ ప్రేరయామాస సత్వరః ।
స్వయమప్య ఖిలేశోఽపి సన్నద్ధోఽ భూచ్చ లీలయా ॥
యుద్ధారంభో బభూవాశు నేదుర్వాద్యాని భూరిశః ।
కోలాహలశ్చ సంజాతో వీరశబ్దస్తథైవ చ ॥
దేవదానవయోర్యుద్ధం పరస్పరమభూన్మునే ।
ధర్మతో యుయుధే తత్ర దేవదానవయోర్గణః ॥
స్వయం మహేంద్రో యుయుధే సార్ధం చ వృషపర్వణా ।
భాస్కరో యుయుధే విప్రచిత్తినా సహ ధర్మతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఆ దూత అచటకు వెళ్లి శివుని వచనమును యథార్థముగా వివరముగా చెప్పెను. మరియు శివుని నిశ్చయమును ఉన్నది ఉన్నట్లుగా చెప్పెను (1). దానవచక్రవర్తి, ప్రతాపశాలియగు ఆ శంఖచూడుడు ఆ మాటలను విని మిక్కిలి ప్రీతితో యుద్ధమును స్వీకరించెను (2). ఆతడు వెంటనే రథమునధిష్ఠించెను. మంత్రులు ఆతనిని అనుసరించిరి. ఆతడు శంకరునితో యుద్ధము కొరకై తన సైన్యము నాదేశించెను (3). శివుడు కూడా వేగముగా తన సైన్యమును, మరియు దేవతలను ప్రేరేపించెను. ఆయన స్వయముగా సర్వేశ్వరుడే అయిననూ లీలచే యుద్ధమునకు సన్నద్ధుడా యెను (4). వెంటనే యుద్ధము ఆరంభమయ్యెను. అనేక రకముల వాద్యములు మ్రోగినవి. పెద్ద కోలాహలము వీరుల శబ్దముతో గూడి చెలరేగెను (5). ఓ మునీ! దేవదానవులు ఒకరితోనొకరు యుద్ధమును చేయ మొదలిడిరి. అచట దేవదానవ సైన్యములు ధర్మయుద్ధమును చేసినవి (6). మహేంద్రుడు స్వయముగా వృషపర్వునితో యుద్ధమును చేసెను. భాస్కరుడు విప్రచిత్తితో ధర్మయుద్ధమును చేసెను (7).

దంభేన సహ విష్ణుశ్చ చకార పరమం రణమ్ ।
కాలాసురేణ కాలశ్చ గోకర్ణేన హుతాశనః ॥
కుబేరః కాలకేయేన విశ్వకర్మా మయేన చ ।
భయంకరేణ మృత్యుశ్చ సంహారేణ యమస్తథా ॥
కాలంబికేన వరుణశ్చంచలేన సమీరణః ।
బుధశ్చ ఘటపృష్ఠేన రక్తాక్షేణ శనైశ్చరః ॥
జయంతో రత్నసారేణ వసవో వర్చసాం గణైః ।
అశ్వినౌ దీప్తి మద్భ్యాం చ ధూమ్రేణ నలకూబరః ॥
ధురంధరేణ ధర్మశ్చ గణకాక్షేణ మంగలః ।
శోభాకరేణ వైశ్వానః పిపిటేన చ మన్మథః ॥
గో కాముఖేన చూర్ణేన ఖడ్గనామ్నాఽ సురేణ చ ।
ధూమ్రేణ సంహలేనాపి విశ్వేన చ ప్రతాపినా ॥
పలాశేన ద్వాదశార్కా యుయుధుర్ధర్మతః పరే ।
అసురైరమరాస్సార్ధం శివసాహాయ్యశాలినః ॥

విష్ణువు దంభునితో గొప్ప యుద్ధమును చేసెను. కాలాసురునితో కాలుడు, గో◌ాగోకర్ణునితో అగ్ని (8), కాలకేయునితో కుబేరుడు, మయునితో విశ్వకర్మ, భయంకరునితో మృత్యువు, సంహారునితో యముడు (9), కాలంబికునితో వరుణుడు, చంచలునితో వాయువు, ఘటపృష్ఠునితో బుధుడు, రక్తాక్షునితో శని (10), రత్నసారునితో జయంతుడు, వర్చసుల గణముతో వసువులు, దీప్తి మంతులిద్దరితో అశ్వినీ దేవతలు, ధూమ్రునితో నలకూబరుడు (11), ధురంధరునితో ధర్ముడు, గణకాక్షునితో మంగళుడు, శోభాకరునితో వైశ్వానుడు, పిపిటునితో మన్మథుడు (12), గోకాముఖుడు, చూర్ణుడు, ఖడ్గాసురుడు, ధూమ్రుడు, సంహలుడు, విశ్వుడు, ప్రతాపి మరియు పలాశి అను వారితో పన్నెండుగురు ఆదిత్యులు ధర్మయుద్ధమును చేసిరి. శివునకు సాహాయ్యమును చేయుటకు వచ్చిన ఇతర దేవతలు రాక్షసులతో యుద్ధమును చేసిరి (13, 14).

ఏకాదశ మహారుద్రాశ్చైకాదశ భయంకరైః ।
అసురైర్యు యుధుర్వీరైర్మహా బలపరాక్రమైః ॥
మహామణిశ్చ యుయుధే చోగ్రచండాది భిస్సహ ।
రాహుణా సహ చంద్రశ్చ జీవశ్శుక్రేణ ధర్మతః ॥
నందీశ్వరాదయస్సర్వే దానవ ప్రవరైస్సహ ।
యుయుధుశ్చ మహాయుద్ధే నోక్తా విస్తరతః పృథక్ ॥
వటమూలే తదా శంభుస్తస్థౌ కాల్యా సుతేన చ ।
సర్వే చ యుయుధుస్సైన్యసమూహాస్సతతం మునే ॥

రత్నసింహాసనే రమ్యే కోటి దానవసంయుతః ।
ఉవాస శంఖచూడశ్చ రత్న భూషణభూషితః ॥
మహాయుద్ధో బభూవాథ దేవాసురవిమర్దనః ।
నానాయుధాని దివ్యాని చలంతి స్మ మహామృధే ॥
గదర్ష్టి పట్టిశాశ్చ క్రభుశుండి ప్రాసముద్గరాః ।
నిస్త్రింశభల్ల పరిఘాశ్శక్త్యున్ముఖ పరశ్వధాః ॥
శరతో మరఖడ్గాశ్చ శతఘ్న్యశ్చ సహస్రశః ।
భిందిపాలా దయ శ్చాన్యే వీరహస్తేషు శోభితాః ॥

పదకొండు గురు మహారుద్రులు, భయంకరులు, వీరులు, మహాబలశాలురునగు పదకొండుగురు రాక్షసులతో యుద్ధమును చేసిరి (15). ఉగ్రచండుడు మొదలగు వారితో మహామణి, రాహువుతో చంద్రుడు, మరియు శుక్రునితో బృహస్పతి ధర్మయుద్ధమును చేసిరి (16) నందీశ్వరుడు మొదలగు వారందరు ఆ మహాయుద్ధములో దానవవీరులతో యుద్ధమును చేసిరి. విస్తారభయముచే ఆ వివరములు వేర్వేరుగా చెప్పబడుట లేదు (17). అపుడు శంభుడు వటవృక్షమూలనందు కాళీ దేవితో, మరియు కుమారునితో కలిసి వేచియుండెను. ఓ మునీ! ఆ రెండు మహాసైన్యములలోని అందరు నిరంతరముగా యుద్ధమును చేయుచుండిరి (18). శంఖచూడుడు రత్నభూషణముల నలంకరించుకొని కోటి మంది దానవులు చుట్టూ చేరి యుండగా సుందరమగు రత్నసింహాసనముపై ఉపవిష్టుడై యుండెను (19). అపుడు దేవాసురవినాశకరమగు గొప్ప యుద్ధము జరిగెను. ఆ మహాయుద్ధములో దివ్యములగు అనేక ఆయుధములు ప్రయోగింపబడెను (20). గదలు, చురకత్తులు, పట్టిశములు, చక్రములు, భుశుండీలు, ప్రాసలు, ముద్గరములు, బల్లెములు, గడ్డపారలు, పరిఘలు, శక్తులు, శత్రువుపైకి ప్రయోగించుటకు సిద్ధముగా నున్న గొడ్డళ్లు (21), బాణములు, తోమరములు, కత్తులు, వేలాది ఫిరంగులు, భిందిపాలములు, మరియు ఇతరములగు ఆయుధములు వీరుల చేతులలో ప్రకాశించుచుండెను (22).

శిరాంశ్చ చిచ్ఛిదుశ్చైభిర్వీరాస్తత్ర మహోత్సవః ।
వీరాణాముభయోశ్చైవ సైన్యయోర్గర్జతో రణే ॥
గజాస్తురంగా బహవస్స్యందనాశ్చ పదాతయః ।
సారోహవాహా వివిధాస్తత్రాసన్ సువిఖండితాః ॥
నికృత్తబాహూరు కరకటీ కర్ణయుగాంఘ్రయః ।
సంఛిన్న ధ్వజ బాణాసితనుత్ర వర భూషణాః ॥
సముద్ధృత కిరీటైశ్చ శిరో భిస్సహ కుండలైః ।
సంరంభనష్టై రాకీర్ణా బభౌ భూః కరభోరుభిః ॥

మహోభుజై స్సాభరణై స్సంభిన్నైస్సాయుధైస్తథా ।
అంగైరన్యైశ్చ సహసా పటలైర్వా ససారఘైః ॥
మృధే భటాః ప్రధావంతః కబంధాన్ స్వశిరోక్షిభిః ।
పశ్యంతస్తత్ర చోత్పే తు రుద్యతాయుధ సద్భుజైః ॥
వల్గంతోఽ తితరాం వీరా యుయుధుశ్చ పరస్పరమ్ ।
శస్త్రాస్త్రైర్వివిధైస్తత్ర మహోబలపరాక్రమాః ॥

ఆ యుద్ధములో వీరులు వాటితో తలలను నరుకుచుండిరి. యుద్ధములో రెండు సైన్యములలోని వీరుల గర్జనలతో గొప్ప ఉత్సవము ప్రవర్తిల్లెను (23). ఆ యుద్ధమునందు ఏనుగులు, గుర్రములు, వాటిపై ఉపవిష్టులైన వీరులు, అనేకరథములలోని రథికులు, సారథులు, పదాతులు అనేక మంది తెగిన దేహములతో పడియుండిరి (24). తెగిన చేతులు, బాహువులు, తొడలు, నడుములు, చెవులు మరియు కాళ్లు, మరియు విరిగిన ధ్వజములు, బాణములు, కత్తులు, కవచములు, శ్రేష్ఠమగు అలంకారములు పడియుండెను (25). ఆ యుద్ధములో సంహరింపబడిన సైనికుల తలలు కుండలములతో గూడి నేలపై చెల్లాచెదరుగా పడియుండెను. ఎగురగొట్టబడిన కిరీటములు నేలపై బడి యుండెను. తెగి పడిన ఏనుగు తుండముల వంటి తొడలతో నిండి భూమి ప్రకాశించెను (26). ఆయుధములతో అలంకారములతో గూడి తెగి పడిన గొప్ప భుజములు మరియు ఇతర అవయవములు తేనెపట్టులవలె నేలపైబడి యుండెను (27). యుద్ధములో పరుగెత్తుచున్న భటులకు మొండెములు కానవచ్చెను. ఆ మొండెములు తమ చేతులలో ఆయుధములను ఎత్తి పట్టుకొని ఎగురుచుండెను (28). ఆ యుద్ధములో గొప్ప బల పరాక్రమములు గల వీరులు మిక్కుటముగా గర్జిస్తూ అనేకరకముల శస్త్రములతో ద్వంద్వ యుద్ధములను చేయుచుండిరి (29).

కేచిత్స్వర్ణముఖైర్బాణై ర్వినిహత్య భటాన్ మృధే ।
వ్యనదన్ వీరసన్నాదం సతోయా ఇవ తోయదాః ॥
సర్వతశ్శరకూటేన వీరస్సరథసారథిమ్ ।
వీరం సంఛాదయామాస ప్రావృట్ సూర్యమివాంబుదః ॥
అన్యోన్యమభి సంసృత్య యుయుధుర్ద్వంద్వయోధినః ।
ఆహ్వయంతో వింతోఽ గ్రే క్షిపంతో మర్మభిర్మిథః ॥
సర్వతో వీరసంఘాశ్చ నానాబాహుధ్వజాయుధాః ।
వ్యదృశ్యంత మహాసంఖ్యే కుర్వంతస్సింహసంరవమ్ ॥
మహారవాన్ స్వశంఖాంశ్చ విదధ్ముర్వై పృథక్ పృథక్ ।
వలినం చక్రిరే తత్ర మహావీరాః ప్రహర్షితాః ॥
ఏవం చిరతరం కాలం దేవదానవయోర్మహత్ ।
బభూవ యుద్ధం వికటం కరాలం వీరహర్షదమ్ ॥
మహాప్రభోశ్చ లీలేయం శంకరస్య పరాత్మనః ।
యయా సమ్మోహితం సర్వం సదేవాసురమానుషమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
దేవదానవయుద్ధ వర్ణనం నామ షట్ త్రింశోఽధ్యాయః ॥

కొందరు బంగరు అగ్రములు గల బాణములతో యుద్ధమునందు భటులను సంహరించి వర్షాకాలమేఘములవలె వీరగర్జనలను చేయుచుండిరి (30). ఒక వీరుడు మరియొక వీరుని, ఆతని రథము మరియు సారథితో సహా, వర్షాకాల మేఘము సూర్యుని వలె, అన్నివైపుల నుండి బాణపరంపరలతో కప్పివేసెను (31). ద్వంద్వయుద్ధ వీరులు పరస్పరము దాడిచేసుకొనుచూ, ఆహ్వానిస్తూ, ముందుకు దుముకుతూ, ఒకరి నొకరు మర్మస్థానములయందు గాయపరుస్తూ యుద్ధమును చేసిరి (32). ఆ మహాయుద్ధములో వీరుల గుంపులు తమ చేతులలో ధ్వజములను, ఆయుధములను ధరించి సింహనాదములను చేయుచూ అంతటా కానవచ్చిరి (33). ఆ యుద్ధమునందు మహావీరులు మహానందము గలవారై గొప్ప ధ్వనిని చేయు తమ శంఖములను వేర్వేరుగా మ్రోయించి బిగ్గరగా కేకలను వేయుచుండిరి (34). ఈ విధముగా దేవదానవుల మధ్య చాలకాలము గొప్ప భయంకరమైన బీభత్సకరమైన యుద్ధము జరిగి వీరులకు ఆనందమును కలిగించెను (35). పరమాత్మ, మహాప్రభుడు అగు శంకరుని ఈ లీలచే దేవ, దానవ, మనుష్యులతో సహా సర్వప్రాణులు మోహింప చేయబడుచున్నవి (36).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో దేవదానవయుద్ధ వర్ణనమనే ముప్పది ఆరవ అధ్యాయము ముగిసినది (36).

37 – స్కందశంఖచూడుల ద్వంద్వయుద్ధము

సనత్కుమార ఉవాచ ।

తదా దేవగణాస్సర్వే దానవైశ్చ పరాజితాః ।
దుద్రువుర్భయభీతాశ్చ శస్త్రాస్త్ర క్షతవిగ్రహాః ॥
తే పరావృత్య విశ్వేశం శంకరం శరణం యయుః ।
త్రాహి త్రాహీతి సర్వేశత్యూచుర్విహ్వలయా గిరా ॥
దృష్ట్వా పరాజయం తేషాం దేవాదీనాం స శంకరః ।
సభయం వచనం శ్రుత్వా కోపముచ్చైశ్చకార హ ॥
నిరీక్ష్య స కృపాదృష్ట్యా దేవేభ్యశ్చాభయం దదౌ ।
బలం చ స్వగణానాం వై వర్ధయామాస తేజసా ॥
శివాజ్ఞప్తస్తదా స్కందో దానవానాం గణైస్సహ ।
యుయుధే నిర్భయస్సంఖ్యే మహావీరో హరాత్మజః ॥
కృత్వా క్రోధం వీరశబ్దం దేవో యస్తారకాంతకః ।
అక్షౌహిణీనాం శతకం సమరే స జఘాన హ ॥
రుధిరం పాతయామాస కాలీ కమలలోచనా ।
తేషాం శిరాంసి సంఛిద్య బభక్ష సహసా చ సా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

అపుడు దేవగణములన్నియు దానవులచే ఓడింపబడి శస్త్రములచే గాయపడిన దేహములు గలవారై భయభీతులై పారిపోయిరి (1). వారు విశ్వేశ్వరుడగు శంకరుని వద్దకు తిరిగి వచ్చి దుఃఖముతో నిండిన వాక్కుతో 'ఓ సర్వేశ్వరా! రక్షింపుము, రక్షింపుము' అని పలుకుతూ శరణుజొచ్చిరి (2). ఆ దేవాదుల పరాజయమును గాంచి భయపూరితములగు వారి మాటలను విని ఆ శంకరుడు గొప్ప క్రోధమును పొందెను (3). ఆయన దేవతలపై దయాదృష్టిని బరపి అభయమునిచ్చి తన తేజస్సుతో తన గణముల బలమును వర్ధిల్ల జేసెను (4). అపుడు మహావీరుడు, శివపుత్రుడు అగు స్కందుడు శివుని ఆజ్ఞను పొంది యుద్ధములో భయములేని వాడై దానవగణములతో పోరు సలిపెను (5). తారకాంతకుడగు ఆ స్కందుడు సింహనాదమును చేసి కోపించినవాడై యుద్ధములో వంద అక్షౌహిణీల సైన్యమును మట్టుబెట్టెను (6). పద్మములవంటి కన్నులు గల కాళి వారి శిరస్సులను దునిమి శీఘ్రమే రక్తమును త్రాగి మాంసమును భక్షించెను (7).

పపౌ రక్తాని తేషాం చ దానవానాం సమంతతః ।
యుద్ధం చకార వివిధం సురదానవ భీషణమ్ ॥
శతలక్షం గజేంద్రాణాం శతలక్షం నృణాం తథా ।
సమాదాయైక హస్తేన ముఖే చిక్షేప లీలయా ॥
కబంధానాం సహస్రం చ ననర్త రణే బహు ।
మహాన్ కోలాహలో జాతః క్లీబానాం చ భయంకరః ॥
పునస్స్కందః ప్రకుప్యోచ్చైశ్శరవర్షం చకార హ ।
పాతయామాస క్షణతః కోటిశోఽ సురనాయకాన్ ॥
దానవాశ్శరజాలేన స్కందస్య క్షతవిగ్రహాః ।
భీతాః ప్రదుద్రువుస్సర్వే శేషా మరణతస్తదా ॥
వృషపర్వా విప్రచిత్తిర్దండశ్చాపి వికంపనః ।
స్కందేన యుయుధు స్సార్ధం తేన సర్వే క్రమేణ చ ॥
మహామారీ చ యుయుధే న బభూవ పరాఙ్ ముఖీ ।
బభూవుస్తే క్షతాంగాశ్చ స్కంద శక్తి ప్రపీడితాః ॥

ఆమె అన్నివైపులనుండి ఆ దానవుల రక్తమును త్రాగుచూ, దేవతలకు దానవులకు కూడ భయమును గొల్పు వివిధరకముల యుద్ధమును చేసెను (8). ఆమె కోటి శ్రేష్ఠమగు ఏనుగులను మరియు కోటి మంది మానవులను ఒకే చేతితో పట్టుకొని అవలీలగా నోటిలో పారవైచుకొనెను (9). ఆ యుద్ధములో వేలాది మొండెములు అనేక రకములుగా నాట్యమాడినవి. పిరికి వారికి భయమును గొల్పు పెద్ద కోలాహలము చెలరేగెను (10). మరల స్కందుడు పెద్దగా కోపించి బాణముల వర్షమును కురిపించి, క్షణకాలములో కోటి మంది రాక్షస వీరులను నేల గూర్చెను (11). స్కందుని బాణ పరంపరచే తెగిన దేహములు కలిగి మరణించగా మిగిలిన దానవులందరు అపుడు పారిపోయిరి (12). వృషపర్వుడు, విప్రచిత్తి, దండుడు మరియు వికంపనుడు అను వారందరు వరుసగా స్కందునితో యుద్ధమును చేసిరి. (13). మహామారి కూడ వెన్ను చూపకుండా యుద్ధమును చేసెను. స్కందుని శక్తి- ఆయుధముచే వారు తెగిన అవయవములు గలవారై అధికమగు పీడను పొందిరి (14).

మహామారీ స్కందయోశ్చ విజయోఽ భూత్తదా మునే ।
నేదుర్దుందుభయస్స్వర్గే పుష్పవృష్టిః పపాత హ ॥
స్కందస్య సమరం దృష్ట్వా మహారౌద్రం తమద్భుతమ్ ।
దానవానాం క్షయకరం యథా ప్రకృతి కల్పకమ్ ॥
మహామారీ కృతం తచ్చోపద్రవం క్షయహేతుకమ్ ।
చుకోపాతీవ సహసా సన్నద్ధోఽ భూత్స్వయం తదా ॥

వరం విమానమారుహ్య నానాశస్త్రాస్త్ర సంయుతమ్ ।
అభయం సర్వవీరాణాం నానారత్న పరిచ్ఛదమ్ ॥
మహావీరైశ్శంఖచూడో జగామ రథమధ్యతః ।
ధనుర్వికృష్య కర్ణాంతం చకార శరవర్షణమ్ ॥
తస్య సా శరవృష్టిశ్చ దుర్నివార్యా భయంకరీ ।
మహాఘోరాంధ కారశ్చ వధస్థానే బభూవ హ ॥
దేవాః ప్రదుదువుః సర్వే యోఽన్యే నందీశ్వరాదయః ।
ఏక ఏవ కార్తికేయస్తస్థౌ సమరమూర్ధని ॥

ఓ మునీ! అపుడు మహామారి, స్కందుడు విజయమును పొందిరి. స్వర్గములో దుం◌ందుభులు మ్రోగెను. పూల వాన కురిసెను (15). మిక్కిలి భయంకరము, అద్భుతము, ప్రకృతి శక్తులను బోలి దానవులను వినాశమొనర్చునది అగు ఆ స్కందుని సమరమును గాంచి (16), మహామారిచే చేయబడిన వినాశకరమగు ఆ ఉపద్రవమును కూడ గాంచి, అపుడు శంఖచూడుడు మిక్కిలి కోపించి వెంటనే స్వయముగా యుద్ధమునకు సన్నద్ధుడై (17), అనేక శస్త్రములతో గూడినది, దానవవీరులందరికీ అభయమునిచ్చునది, అనేక శ్రేష్ఠవస్తువులతో నిర్మితమైనది అగు శ్రేష్ఠవిమానమునెక్కి (18), మహావీరులతో గూడి యుద్ధరంగమునకు వెళ్లెను. ఆతడు ఆ విమానరూపమగు రథమధ్యములో నున్నవాడై ఆకర్ణాంతము నారిత్రాటిని లాగి బాణముల వర్షమును కురిపించెను (19). ఆతని ఆ బాణవర్షము భయంకరమైనది, నివారింపశక్యము కానిది. వధ స్థానము వంటి ఆ యుద్ధభూమిలో మిక్కిలి భయంకరమగు చీకటి నెలకొనెను (20). దేవతలు, మరియు నందీశ్వరుడు మొదలగు ఇతరులు అందరు పరుగెత్తిరి. రణరంగములో స్కందుడు ఒక్కడు మాత్రమే నిలబడి యుండెను (21).

పర్వతానాం చ సర్పాణాం నాగానాం శాఖినాం తథా ।
రాజా చకార వృష్టిం చ దుర్నివార్యాం భయంకరీమ్ ॥
తద్వృష్ట్యా ప్రహతస్స్కందో బభూవ శివనందనః ।
నీహారేణ చ సాంద్రేణ సంవృతో భాస్కరో యథా ॥
నానావిధాం స్వమాయాం చ చకార మయదర్శితామ్ ।
తాం నావిదన్ సురాః కేఽపి గణాశ్చ మునిసత్తమ ॥
తదైవ శంఖచూడశ్చ మహామాయీ మహాబలః ।
శరేణైకేన దివ్యేన ధనుశ్చిచ్ఛేద తస్య వై ॥
బభంజ తద్రథం దివ్యం చిచ్ఛేద రథ పీడకాన్ ।
మయూరం జర్జరీ భూతం దివ్యాస్త్రేణ చకార సః ॥
శక్తిం చిక్షేప సూర్యాభాం తస్య వక్షసి ఘాతినీమ్ ।
మూర్ఛా మవాప సహసా తత్ప్రహారేణ స క్షణమ్ ॥
పునశ్చ చేతనాం ప్రాప్య కార్తికః పరవీరహా ।
రత్నేంద్రసారనిర్మాణ మారురోహ స్వవాహనమ్ ॥

శంఖచూడుడు పర్వతములను, సర్పములను, కొండచిలువలను, మరియు వృక్షములను వర్షరూపములో కురిపించెను. భయంకరమగు ఆ వర్షమును నివారించుట సంభవము కాదు (22). ఆ వర్షముచే కొట్టబడిన శివపుత్రుడగు స్కందుడు దట్టమగు మంచుచే కప్పబడిన సూర్యుని వలె నుండెను (23). ఆతడు మయుడు నేర్పించిన వివిధరకముల మాయను ప్రదర్శించెను. ఓ మహర్షీ! దేవతలలో మరియు గణములలో ఒక్కరైననూ ఆ మాయను తెలియలేకపోయిరి (24). అదే సమయములో మహామాయావి, మహాబలశాలి యగు శంఖచూడుడు ఒక దివ్యమగు బాణముతో స్కందుని ధనస్సును విరుగ గొట్టెను (25). ఆతడు స్కందుని దివ్యరథమును విరుగగొట్టి, రథమును లాగు గుర్రములను సంహరించి దివ్యమగు అస్త్రముతో నెమలిని కూడ నిష్క్రియముగా చేసెను (26). ఆతడు సూర్యకాంతి కలిగిన ప్రాణములను తీసే శక్తితో స్కందుని వక్షఃస్థలముపై కొట్టగా, ఆతడు ఆ దెబ్బచే వెంటనే క్షణకాలము మూర్ఛిల్లెను (27). శత్రువీరులను సంహరించే స్కందుడు మరల తెలివిని పొంది, గొప్ప రత్నమును పొదిగి దృఢముగా నిర్మింపబడిన తన వాహనము నెక్కెను (28).

స్మృత్వా పాదౌ మహేశస్య సాంబికస్య చ షణ్ముఖః ।
శస్త్రాస్త్రాణి గృహీత్వైవ చకార రణముల్బణమ్ ॥
సర్వాంశ్చ పర్వతాంశ్చైవ వృక్షాంశ్చ ప్రస్తరాంస్తథా ।
సర్వాంశ్చిచ్ఛేద కోపేన దివ్యాస్త్రేణ శివాత్మజః ॥
వహ్నిం నివారయామాస పార్జన్యేన శరేణ హ ।
రథం ధనుశ్చ చిచ్ఛేద శంఖచూడస్య లీలయా ॥
సన్నాహం సర్వవాహాంశ్చ కిరీటం ముకుటోజ్జ్వలమ్ ।
వీరశబ్దం చకారాసౌ జగర్జ చ పునః పునః ॥
చిక్షేప శక్తిం సూర్యాభాం దానవేంద్రస్య వక్షసి ।
తత్ప్రహారేణ సంప్రాప మూర్ఛాం దీర్ఘతమేన చ ॥
ముహూర్త మాత్రం తత్ క్లేశం వినీయ స మహాబలః ।
చేతనాం ప్రాప్య చోత్తస్థౌ జగర్జ హరివర్చసః ॥
శక్త్యా జఘాన తం చాపి కార్తికేయం మహాబలమ్ ।
స పపాత మహీపృష్ఠే మోఘాం కుర్వన్ విధి ప్రదామ్ ॥
కాలీ గృహీత్వా తం క్రోడే నినాయ శివసన్నిధౌ ।
జ్ఞానేన తం శివశ్చాపి జీవయామాస లీలయా ॥
దదౌ బలమనంతం చ సముత్తస్థౌ ప్రతాపవాన్ ।
గమనాయ మతిం చక్రే పునస్తత్ర శివాత్మజః ॥
ఏతస్మిన్నంతరే వీరో వీరభద్రో మహాబలః ।
శంఖచూడేన యుయుధే సమరే బలశాలినా ॥

వవర్ష సమరేఽ స్త్రాణి యాని యాని చ దానవః ।
చిచ్ఛేద లీలయా వీరస్తాని తాని నిజైశ్శరైః ॥
దివ్యాన్య స్త్రాణి శతశో ముముచే దానవేశ్వరః ।
తాని చిచ్ఛేద తం బాణైర్వీరభద్రః ప్రతాపవాన్ ॥
అథాతీవ చుకోపోచ్చైశ్శంఖచూడః ప్రతాపవాన్ ।
శక్త్యా జఘానోరసి తం స చకంపే పపాత కౌ ॥
క్షణేన చేతనాం ప్రాప్య సముత్తస్థౌ గణేశ్వరః ।
జగ్రాహ చ ధనుర్భూయో వీరభద్రో గణాగ్రణీః ॥

కుమారస్వామి పార్వతీ పరమేశ్వరుల పాదములను స్మరించి శస్త్రములను అస్త్ర()ములను తీసుకొని భయంకరమగు యుద్ధమును చేసెను (29). శివపుత్రుడగు స్కందుడు కోపముతో దివ్యాస్త్రమును ప్రయోగించి సర్పములు, పర్వతములు, వృక్షములు, రాళ్లు మొదలగు వాటినన్నిటిని చెదరగొట్టెను (30). ఆతడు అగ్నిని పర్జన్యాస్త్రముతో చల్లార్చి, శంఖచూడుని రథమును, ధనస్సును, సర్వవాహనములను, ప్రకాశించే కిరీటమును పడగొట్టి సింహనాదమును చేసి పలుమార్లు గర్జించెను (32). మరియు దానవచక్రవర్తియగు శంఖచూడుని వక్షస్థలముపై సూర్యకాంతి గల శక్తితో కొట్టగా బలమగు ఆ దెబ్బచే ఆతడు మూర్ఛిల్లెను (33). సింహము యొక్క వర్చస్సు గలవాడు, మహాబలుడు అగు ఆ శంఖచూడుడు ఆ క్లేశమును కొద్ది సమయములో పోగొట్టుకొని తెలివిని పొంది లేచి నిలబడి గర్జించెను (34).మరియు ఆతడు మహాబలుడగు స్కందుని శక్తితో కొట్టెను. బ్రహ్మచే ఈయబడిన ఆ శక్తిని నిర్వీర్యము చేయనిచ్ఛగించని వాడై ఆతడు నేలపై బడెను (35). కాళి ఆతనిని తన ఒడిలోనికి తీసుకొని శివునిసన్నిధికి చేర్చగా, శివుడు తన జ్ఞానముచే ఆతనిని అవలీలగా జీవింపజేసెను (36). మరియు శివుడు ఆతనికి అనంత బలమునిచ్చెను. అపుడు ప్రతాపశాలి, శివపుత్రుడునగు స్కందుడు లేచి నిలబడి, మరల బయలుదేరుటకు సిద్ధపడెను (37). ఇంతలో వీరుడు, మహాబలుడు అగు వీరభద్రుడు యుద్ధములో గొప్ప బలమును ప్రదర్శించే శంఖచూడునితో పోరాడెను (38). శంఖచూడుడు యుద్ధములో ఏయే అస్త్రములను వర్షమువలె కురిపించెనో, ఆయా అస్త్రములను వీరుడగు వీరభద్రుడు తన బాణములచే అవలీలగా ఛేదించెను (39). ఆ రాక్షసరాజు వందలాది దివ్యాస్త్రములను ప్రయోగించెను. ప్రతాప శాలియగు వీరభద్రుడు వాటిని తన బాణములతో ఛేదించి వానిని కొను(40), అపుడు ప్రతాపవంతుడగు శంఖచూడుడు శక్తితో వక్షస్థలము నందు కొట్టెను. ఆతడు ఆ దెబ్బకు చలించి నేలపై బడెను (41). గణాధ్యక్షులలో అగ్రేసరుడగు వీరభద్రుడు క్షణములో తెలివిని దెచ్చు కొని లేచి నిలబడి మరల ధనస్సును చేతబట్టెను (42).

ఏతస్మిన్నంతరే కాలీ జగామ సమరం పునః ।
భక్షితుం దానవాన్ స్వాంశ్చ రక్షితుం కార్తికేచ్ఛయా ॥
వీరాస్తామను జగ్ముశ్చ తే చ నందీశ్వరాదయః ।
సర్వే దేవాశ్చ గంధర్వా యక్షా రక్షాంసి పన్నగాః ॥
వాద్య భాండాశ్చ బహుశశ్శతశో మధువాహకాః ।
పునస్సముద్యతాశ్చాసన్ వీరా ఉభయతోఽ ఖిలాః ॥।
ఇతి శ్రీశివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
ససైన్యశంఖచూడ యుద్ధవర్ణనం నామ సప్త త్రింశోఽధ్యాయః ॥

ఇంతలో కాళి స్కందుని కోర్కెపై, దానవులను భక్షించి తన వారిని రక్షింషించుట కొరకై మరల యుద్ధరంగమునకు వెళ్లెను (43). నందీశ్వరుడు మొదలగు వీరులు, సర్వదేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, మరియు నాగులు ఆమె వెనుక నడిచిరి (44). వాద్యములను మ్రోగించువారు, మరియు మధువును అందించు వారు పెద్దసంఖ్యలో అనుసరించిరి. మరల రెండు పక్షములలోని వీరులందరు యుద్ధమునకు సన్నద్ధులైరి (45).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో స్కందశంఖచూడుల ద్వంద్వ యుద్ధవర్ణనమనే ముప్పది ఏడవ అధ్యాయము ముగిసినది (37).

38 – భద్రకాళీ శంఖచూడుల యుద్ధము

సనత్కుమార ఉవాచ।

సా చ గత్వా హి సంగ్రామం సింహనాదం చకార హ ।
దేవ్యాశ్చ తేన నాదేన మూర్చామాపుశ్చ దానవాః ॥
అట్టాట్ట హాసమశివం చకార చ పునః పునః ।
తదా పపౌ చ మాధ్వీకం ననర్త రణమూర్ధని ॥
ఉగ్రదంష్ట్రా చోగ్రదండా కోటవీ చ పపౌ మధు ।
అన్యాశ్చ దేవ్యస్తత్రాజౌ ననృతుర్మధు సంపపుః ॥
మహాన్ కోలాహలో జాతో గణదేవదలే తదా ।
జహృషుర్జహు గర్జంతస్సర్వే సురగణాదయః ॥
దృష్ట్వా కాలీం శంఖచూడశ్శీఘ్రమాజౌ సమాయయౌ ।
దానవాశ్చ భయం ప్రాప్తా రాజా తేభ్యోఽభయం దదౌ ॥
కాలీ చిక్షేప వహ్నిం చ ప్రలయాగ్నిశిఖోపమమ్ ।
రాజా జఘాన తం శీఘ్రం వైష్ణవాంకిత లీలయా ॥
నారాయణాస్త్రం సా దేవీ చిక్షేప తదుపర్యరమ్ ।
వృద్ధిం జగామ తచ్చస్త్రం దృష్ట్వా వామం చ దానవమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఆమె యుద్ధరంగమునకు వెళ్లి సింహనాదమును చేసెను. ఆ దేవి యొక్క నాదమును తాళజాలక దానవులు మూర్ఛను పొందిరి (1). ఆమె అమంగళకరమగు అట్టహాసమును పలుమార్లు చేసి మధువును త్రాగి యుద్ధరంగములో నాట్యము చేసెను (2). ఉగ్రదంష్ట, ఉగ్రదండ, కోటవి అను పేరుగల దేవీ మూర్తులు కూడ ఇతర దేవీమూర్తులతో గూడి ఆ యుద్ధములో మధువును అధికముగా త్రాగి నాట్యమాడిరి (3). శివగణములలో మరియు దేవతల దళములలో అపుడ పెద్ద కోలాహలము బయలు దేరెను. దేవతలు, గణములు మరియు ఇతరులు అందరు అధికముగా గర్జిస్తూ అనందించిరి (4). కాళిని చూచి శంఖచూడుడు వెంటనే యుద్ధమునకు వచ్చెను. భయమును పొందియున్న దానవులకు ఆ రాక్షసరాజు అభయమునిచ్చెను. (5). కాళి ప్రళయకాలాగ్నిని బోలిన అగ్నిని విరజిమ్మెను. కాని ఆ దానవేంద్రుడు దానిని వెంటనే వైష్ణవాస్త్రముతో అవలీలగా త్రిప్పికొట్టెను (6). అపుడా దేవి వెంటనే అతనిపై నారాయణాస్త్రమును ప్రయోగించెను. ఆ దానవ వీరుని గాంచి ఆ అస్త్రము వర్ధిల్లెను (7).

తం దృష్ట్వా శంఖచూడశ్చ ప్రలయాగ్ని శిఖోపమమ్ ।
పపాత దండవద్భూమౌ ప్రణనామ పునః పునః ॥
నివృత్తిం ప్రాప తచ్ఛస్త్రం దృష్ట్వా నమ్రం చ దానవమ్ ।
బ్రహ్మాస్త్రమథ సా దేవీ చిక్షేప మంత్రపూర్వకమ్ ॥
తం దృష్ట్వా ప్రజ్వలంతం చ ప్రణమ్య భువి సంస్థితః ।
బ్రహ్మాస్త్రేణ దానవేంద్రో వినివారం చకార హ ॥
అథ క్రుద్ధో దానవేంద్రో ధనురాకృష్య రంహసా ।
చిక్షేప దివ్యాన్యస్త్రాణి దేవ్యై వై మంత్రపూర్వకమ్ ॥
ఆహారం సమరే చక్రే ప్రసార్య ముఖమాయతమ్ ।
జగర్జ సాట్టహాసం చ దానవా భయమాయయుః ॥
కాల్యై చిక్షేప శక్తిం స శతయోజనమాయతామ్ ।
దేవీ దివ్యాస్త్ర జాలేన శతఖండం చకార సా ॥
స చ వైష్ణవమస్త్రం చ చిక్షేప చండికోపరి ।
మాహేశ్వరేణ కాలీ చ వినివారం చకార సా ॥

ప్రళయకాలాగ్ని జ్వాలను బోలియున్న ఆ అగ్నిని గాంచి శంఖచూడుడు దండమువలె నేలపై బడి పలుమార్లు ప్రణమిల్లెను (8). వినీతుడై యున్న దానవుని గాంచి ఆ ఆయుధము వెనుదిరిగెను. అపుడా దేవి మంత్రమును పఠించి బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను (9). ఆ దానవవీరుడు నిప్పులు గ్రక్కు చున్న దానిని గాంచి నేలపై నిలబడి ప్రణమిల్లి బ్రహ్మాస్త్రముతో దానిని తప్పించెను (10). అపుడా దానవవీరుడు కోపించి వేగముగా ధనుస్సును ఎక్కు పెట్టి మంత్రములను పఠిస్తూ దేవిపై దివ్యాస్త్రములను ప్రయోగించెను (11). ఆమె విశాలమగు నోరును తెరచి ఆ అస్త్రమును ఆహారమును వలె భుజించి గర్జించి అట్టహాసమును చేయగా దానవులు భయపడిరి (12). ఆతడు వందయోజనముల వెడల్పు గల శక్తిని కాళిపై ప్రయోగించగా, ఆ దేవి అనేక దివ్యాస్త్రములతో దానిని వంద ముక్కలుగా చేసెను (13). ఆతడు చండికపై వైష్ణవాస్త్రమును ప్రయోగించగా, ఆమె మహేశ్వరాస్త్రముతో దానిని తప్పించెను (14).

ఏవం చిరతరం యుద్ధమన్యోన్యం సంబభూవ హ ।
ప్రేక్షకా అభవన్ సర్వే దేవాశ్చ దానవా అపి ॥
అథ క్రుద్ధా మహాదేవీ కాలీ కాలసమా రణే ।
జగ్రాహ మంత్రపూతం చ శరం పాశుపతం రుషా ॥
క్షేపాత్పూర్వం తన్నిషేద్ధుం వాగ్బభూవాశరీరిణీ ।
న క్షిపాస్త్ర మిదందేవి శంఖచూడాయ వై రుషా ॥
మృత్యుః పాశుపతాన్నాస్త్యమోఘాదపి చ చండికే ।
శంఖచూడస్య వీరస్యోపాయమన్యం విచారయ ॥
ఇత్యాకర్ణ్య భద్రకాలీ న చిక్షేప తదస్త్రకమ్ ।
శతలక్షం దానవానాం జఘాన లీలయా క్షుధా ॥

అత్తుం జగామ వేగేన శంఖచూడం భయంకరీ ।
దివ్యాస్త్రేణ చ రౌద్రేణ వారయామాస దానవః ॥
అథ క్రుద్ధా దానవేంద్రః ఖడ్గం చిక్షేప సత్వరమ్ ।
గ్రీష్మ సూర్యోపమం తీక్ష్ణ ధారమత్యంత భీకరమ్ ॥

ఈ తీరున వారిద్దరి మధ్య చిరకాలము యుద్ధము జరిగెను. దేవదానవులందరు ప్రేక్షకులుగా నుండి పోయిరి (15). అపుడు యుద్ధములో మృత్యుసమానురాలగు కాళీమహాదేవి కోపించి మంత్రముచే పవిత్రమైన పాశుపతాస్త్రమును స్వీకరించెను (16). దానిని ప్రయోగించుటకు పూర్వమే ఆపివేయుటకై ఆకాశవాణి ఇట్లు పలికెను: ఓ దేవీ! కోపముతో ఈ అస్త్రమును శంఖచూడునిపై ప్రయోగించకుము (17). ఓ చండికా! పాశుపతాస్త్రము అమోఘమైనదే అయినా వీనికి దానివలన మరణము రాదు. వీరుడగు శంఖచూడుని వధించుటకు మరియొక ఉపాయము నాలోచించుము (18). ఈ మాటను విని భద్రకాళి ఆ అస్త్రమును ప్రయోగించలేదు. అపుడామె ఆకలితో కోటి మంది దానవులను అవలీలగా తినివేసేను (19). భయంకరురాలగు అమె శంఖచూడుని భక్షించుటకై వేగముగా పరుగెత్తెను. ఆ దానవుడు దివ్యమైన రౌద్రాస్త్రముతో అమెను అపి వేసెను (20). అపుడు దానవవీరుడు కోపించి, గ్రీష్మకాలము నందలి సూర్యుని బోలిన పదునైన మిక్కిలి భయంకరమగు ఖడ్గమును వేగముగా ప్రయోగించెను (21).

సా కాలీ తం సమాలోక్యాయాంతం ప్రజ్వలితం రుషా ।
ప్రసార్య ముఖమాహారం చక్రే తస్య చ పశ్యతః ॥
దివ్యాన్యస్త్రాణి చాన్యాని చిచ్ఛేద దానవేశ్వరః ।
ప్రాప్తాని పూర్వతశ్చక్రే శతఖండాని తాని చ ॥
పునరత్తుం మహాదేవీ వేగతస్తం జగామ హ ।
సర్వసిద్ధేశ్వరశ్శ్రీమానంతర్ధానం చకార సః ॥
వేగేన ముష్టినా కాలీ తమదృష్ట్వా చ దానవమ్ ।
బభంజ చ రథం తస్య జఘాన కిల సారథీమ్ ॥
అథాగత్య ద్రుతం మాయీ చక్రం చిక్షేప వేగతః ।
భద్రకాల్యై శంఖచూడః ప్రలయాగ్నిశిఖోపమమ్ ॥
సా దేవీ తం తదా చక్రం వామహస్తేన లీలయా ।
జగ్రాహ స్వముఖేనైవాహారం చక్రే రుషా ద్రుతమ్ ॥
ముష్ట్యా జఘాన తం దేవీ మహాకోపేన వేగతః ।
బభ్రామ దానవేంద్రోఽపి క్షణం మూర్ఛామవాప సః ॥
క్షణేన చేతనాం ప్రాప్య స చోత్తస్థౌ ప్రతాపవాన్ ।
న చక్రే బాహుయుద్ధం చ మాతృబుద్ధ్యా తయా సహ ॥
గృహీత్వా దానవం దేవీ భ్రామయిత్వా పునః పునః ।
ఊర్ధ్వం చ ప్రాపయామాస మహాకోపేన వేగతః ॥

ఆ కాళి నిప్పులు చెరుగుతూ తన మీదకు వచ్చుచున్న ఆ కత్తిని గాంచి కోపముతో నోటిని తెరిచి, శంఖచూడుడు చూచుచుండగా, నమిలి వేసెను (22). దానవవీరుడగు ఆతడు ఇతరములగు దివ్యాస్త్రములను ప్రయోగించెను. కాని ఆమె వాటిని తనను చేరుటకు ముందే ముక్కముక్కలుగా చేసెను (23). తరువాత ఆ మహాదేవి ఆతనిని భక్షించుటకై వేగముగా మీదకు వెళ్లెను. కాని శోభాయుక్తుడు, సిద్ధులందరిలో గొప్ప వాడునగు అ శంఖచూడుడు అంతర్ధానమును చెందెను (24).. ఆ శంఖచూడుని గాన రాక, కాళి వేగముగా తన పిడికిలితో వాని రథమును విరుగగొట్టి సారథిని సంహరించెను (25). తరువాత మాయావి యగు శంఖచూడుడు వేగముగా మరలి వచ్చి భద్రకాళిపై ప్రలయకాలాగ్ని జ్వాలలను బోలియున్న చక్రమును వేగముగా ప్రయోగించెను (26), అపుడు దేవి ఆ చక్రమును ఎడమచేతితో అవలీలగా పట్టుకొని కోపముతో వెంటనే నోటిలో వేసుకొని భక్షించెను (27). ఆ దేవి మిక్కిలి కోపముతో వేగముగా వానిని పిడికిలితో కొట్టగా, ఆ దానవవీరుడు గిరగిర తిరిగి క్షణకాలము మూర్ఛిల్లెను (28). ప్రతాపశాలియగు ఆ శంఖచూడుడు మరుక్షణములో తెలివిని పొంది లేచి నిలబడెను. ఆమె యందు తల్లి యను భావన కలవాడగుటచే ఆమెతో బాహుయుద్ధమును ఆతడు చేయలేదు (29). ఆ దేవి మహాకోపముతో ఆ దానవుని పట్టుకొని పలుమార్లు గిరగిర త్రిప్పి పైకి వేగముతో విసిరివేసెను (30).

ఉత్పపాత చ వేగేన శంఖచూడః ప్రతాపవాన్ ।
నిపత్య చ సముత్తస్థౌ ప్రణమ్య భద్రకాలికామ్ ॥
రత్నేంద్రసార నిర్మాణ విమానం సుమనోహరమ్ ।
ఆరురోహ స హృష్టాత్మా న భ్రాంతోఽపి మహారణే ॥
దానవానాం హి క్షతజం సా పపౌ కాలికా క్షుధా ।
ఏతస్మి న్నంతరే తత్ర వాగ్బభూవాశరీరిణీ ॥
లక్షం చ దానవేంద్రాణా మవశిష్టం రణేఽధునా ।
ఉద్ధతం గుంజతాం సార్ధం తతస్త్వం భుంక్ష్వ చేశ్వరి ॥
సంగ్రామే దానవేంద్రం చ హంతుం న కురు మానసమ్ ।
అవధ్యోఽయం శంఖచూడస్తవ దేవీతి నిశ్చయమ్ ॥
తచ్ఛ్రుత్వా వచనం దేవీ నిస్సృతం వ్యోమమండలాత్ ।
దానవానాం బహూనాం చ మాంసం చ రుధిరం తథా ॥
భుక్త్వా పీత్వా భద్రకాళీ శంకరాంతిక మాయయౌ ।
ఉవాచ రణవృత్తాంతం పౌర్వా పర్యేణ సక్రమమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
కాళీయుద్ధవర్ణనం నామ అష్టత్రింశోఽధ్యాయః ॥

ప్రతాపవంతుడగు శంఖచూడుడు వేగముగా పైకి ఎగిరి మరల క్రిందకు దిగి నిలబడి భద్రకాళికకు ప్రణమిల్లెను (31). ఆతడు ఆనందముతో నిండిన మనస్సు గలవాడై శ్రేష్ఠమగు రత్నములతో గొప్ప కౌశలముతో నిర్మించబడిన మిక్కిలి అందమగు విమానము నధిరోహించెను. ఆ మహాయుద్ధములో ఆతడు కంగారు పడలేదు (32). ఆ కాళి ఆకలితో దానవుల రక్తమును త్రాగెను. ఇంతలో అచట ఆకాశవాణి ఇట్లు పలికెను (33). ఇంకనూ గర్వించి యున్న లక్ష మంది దానవవీరులు గర్జిస్తూ యుద్ధరంగములో మిగిలి యున్నారు. ఓ ఈశ్వరీ! నీవు వారిని భక్షించుము (34). యుద్ధములో శంఖచూడుని సంహరించవలెనని కోరకుము. ఓదేవీ ! ఆ దానవవీరుడు నీ చేతిలో మరణించడు. ఇది నిశ్చయము (35). ఆకాశమునుండి వెలువడిన ఆ పలుకులను విని ఆ భద్రకాళీ దేవి అపుడు అనేక మంది దానవుల రక్తమును త్రాగి మాంసమును తిని శంకరుని సన్నిధికి వచ్చి యుద్ధములో జరిగిన ఘటనలను ముందు వెనుకల క్రమమును తప్పకుండా చెప్పెను (36, 37).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో కాళీ యుద్ధవర్ణనమనే ముప్పది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (38).

39 - శంఖచూడుని సైన్యమును వధించుట

వ్యాస ఉవాచ ।

శ్రుత్వా కాల్యుక్త మీశానో కిం చకార కిముక్తవాన్ ।
తత్త్వం వద మహాప్రాజ్ఞ పరం కౌతూహలం మమ ॥

వ్యాసుడిట్లు పలికెను -

కాళి యొక్క వచనములను విని ఈశానుడు ఏమనినాడు? ఏమి చేసినాడు? ఓ మహా◌ాబుద్ధి శాలీ! నీవా విషయమును చెప్పుము. నాకు చాల కుతూహలముగ నున్నది (1).

సనత్కుమార ఉవాచ ।

కాల్యుక్తం వచనం శ్రుత్వా శంకరః పరమేశ్వరః ।
మహాలీలాకరశ్శంభుర్జహాసాశ్వాసయన్ చ తామ్ ॥
వ్యోమవాణీం సమాకర్ణ్య తత్త్వజ్ఞాన విశారదః ।
యయౌ స్వయం చ సమరే స్వగణైస్సహ శంకరః ॥
మహావృషభమారూఢో వీరభద్రాది సంయుతః ।
భైరవైః క్షేత్రపాలైశ్చ స్వసమానైస్సమన్వితః ॥
రణం ప్రాప్తో మహేశశ్చ వీరరూపం విధాయ చ ।
విరరాజాధికం తత్ర రుద్రో మూర్త ఇవాంతకః ॥
శంఖచూడశ్శివం దృష్ట్వా విమానా దవరుహ్య సః ।
ననామ పరయా భక్త్యా శిరసా దండవద్భువి ॥
తం ప్రణమ్య తు యోగేన విమానమారురోహ సః ।
తూర్ణం చకార సన్నాహం ధనుర్జగ్రాహ సేషుకమ్ ॥
శివదానవయోర్యుద్ధం శతమబ్దం బభూవ హ ।
బాణవర్ష మివోగ్రం తద్వర్షతో ర్మేఘయోస్తదా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

కాళి యొక్క మాటలను విని, పరమేశ్వరుడు, గొప్ప లీలలను చేయువాడు, మంగళకరుడు నగు శంభుడు నవ్వి ఆమెను ఓదార్చెను (2). ఆకాశవాణి యొక్క పలుకులను తెలుసుకొని, తత్త్వ జ్ఞాన పండితుడగు శంకరుడు తన గణములతో గూడి స్వయముగా యుద్ధమునకు వెళ్లెను (3). మహేశ్వరుడు గొప్ప వృషభము నెక్కి, వీరభద్రాదులు తోడు రాగా, తనతో సమానమైన భైరవులు, క్షేత్రపాలురు చుట్టువారి యుండగా, వీరరూపమును దాల్చి, రణరంగమును చేరెను. అచట ఆ రుద్రుడు మూర్తీభవించిన మృత్యువువలె అధికముగా

ప్రకాశించెను (4,5). ఆ శంఖచూడుడు శివుని గాంచి విమానమునుండి దిగి పరమభక్తితో శిరస్సును నేలపై ఉంచి సాష్టాంగ నమస్కారమును చేసెను (6). ఆతడు శివునకు ప్రణమిల్లిన పిదప యోగశక్తిచే విమానము నధిష్ఠించి వెంటనే ధనుర్బాణములను గ్రహించి యుద్ధమునకు సన్నద్ధుడాయెను (7). వారిద్దరు అపుడు వర్షించే రెండు మేఘముల వలె భయంకరమగు బాణవర్షమును కురిపిస్తూ వందసంవత్సరములు యుద్ధమును చేసిరి (8).

శంఖచూడో మహావీర శ్శరాంశ్చిక్షేప దారుణాన్ ।
చిచ్ఛేద శంకరస్తాన్ వై లీలయా స్వశరోత్కరైః ॥
తదంగేషు చ శస్త్రౌఘైస్తాడయామాస కోపతః ।
మహారుద్రో విరూపాక్షో దుష్టదండస్సతాం గతిః ॥
దానవో నిశితం ఖడ్గం చర్మ చాదాయ వేగవాన్ ।
వృషం జఘాన శిరసి శివస్య వరవాహనమ్ ॥
తాడితే వాహనే రుద్రస్తం క్షురప్రేణ లీలయా ।
ఖడ్గం చిచ్ఛేద తస్యాశు చర్మ చాపి మహోజ్జ్వలమ్ ॥
ఛిన్నేఽ సౌ చర్మణి తదా శక్తిం చిక్షేప సోఽసురః ।
ద్విధా చక్రే స్వబాణేన హరస్తాం సంముఖాగతామ్ ॥
కోపాధ్మాతశ్శంఖ చూడ శ్చక్రం చిక్షేప దానవః ।
ముష్టిపాతేన తచ్చాప్యచూర్ణయత్సహసా హరః ॥
గదా మావిధ్య తరసా సంచిక్షేప హరం ప్రతి ।
శంభునా సాపి సహసా భిన్నా భస్మత్వమా గతా ॥

మహావీరుడగు శంఖచూడుడు భయంకరములగు బాణములను ప్రయోగించగా, శంకరుడు వాటిని తన బాణపరంపరలచే అవలీలగా చీల్చివేసెను (9). ముక్కంటి, దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు నగు మహారుద్రుడు కోపించి వాని అవయవములను శస్త్రపరంపరలతో కొట్టెను (10). అపుడా రాక్షసుడు పదునైన ఖడ్గమును, డాలును తీసుకొని శివుని శ్రేష్ఠవాహనమగు వృషభమును శిరస్సుపై వేగముగా కొట్టెను (11). వాహనమీ తీరున కొట్టబడగా రుద్రుడు వాని ఖడ్గమును మరియు గొప్పగా ప్రకాశించే డాలును అవలీలగా శీఘ్రమే తన క్షురప్రమనే ఆయుధముతో విరుగగొట్టెను (12). తన డాలు విరుగగానే ఆ రాక్షసుడు అపుడు శక్తిని ప్రయోగించెను. తన మీదకు వచ్చుచున్న ఆ శక్తిని హరుడు తన బాణముతో రెండు ముక్కలుగా చేసెను (13). కోపముతో మండిపడిన శంఖచూడాసురుడు చక్రమును ప్రయోగించెను. హరుడు వెంటనే దానిని కూడ తన పిడికిలితో కొట్టి చూర్ణము చేసెను (14). ఆతడు వెంటనే గదను వేగముతో శివుని పైకి విసిరెను. శంభుడు దానిని కూడ వెంటనే విరిచి బూడిద చేసెను (15).

తతః పరశుమాదాయ హస్తేన దానవేశ్వరః ।
ధావతి స్మ హరం వేగా చ్ఛంఖచూడః క్రుధాకులః ॥
సమాహృత్య స్వబాణౌఘైరపాతయత శంకరః ।
ద్రుతం పరశుహస్తం తం భూతలే లీలయాసురమ్ ॥
తతః క్షణేన సంప్రాప్య సంజ్ఞామారుహ్య సద్రథమ్ ।
ధృతదివ్యాయుధశరో బభౌ వ్యాప్యా ఖిలం నభః ॥
ఆయాంతం తం నిరీక్ష్యైవ డమరుధ్వని మాదరాత్ ।
చకార జ్యారవం చాపి ధనుషో దుస్సహం హరః ॥
పూరయామాస కకుభశ్శృంగనాదేన చ ప్రభుః ।
స్వయం జగర్జ గిరిశస్త్రా సయన్నసురాం సదా ॥
త్యాజితేభమహాగర్వైర్మహానాదైర్వృషేశ్వరః ।
పూరయామాస సహసా ఖం గాం వసు దిశస్తథా ॥
మహాకాలస్సముత్పత్య తాడయద్గాం తథా నభః ।
కరాభ్యాం తన్నినాదేన క్షిప్తా ఆసన్ పురారవాః ॥

అపుడు దానవచక్రవర్తి యగు శంఖచూడుడు చేతితో గొడ్డలిని పట్టుకొని క్రోధముతో వ్యాకులుడై వేగముగా శివుని పైకి పరుగెత్తెను (16). గొడ్డలి చేతియందు గల ఆ రాక్షసుని శంకరుడు వెంటనే తన బాణపరంపరలచే కప్పివేసి అవలీలగా నేలపై బడవేసెను (17). తరువాత ఆతడు క్షణములో తెలివిని దెచ్చుకొని దివ్యములగు ఆయుధములను బాణములను ధరించి మంచి రథమునెక్కి ఆకాశమునంతనూ వ్యాపించి ప్రకాశించెను (18). తన మీదకు వచ్చుచున్న ఆ దానవుని గాంచి శివుడు ఉత్సాహముతో డమరుధ్వనిని చేసి, మరియు సహింప శక్యము కాని ధనస్సు యొక్క నారిత్రాటి శబ్దమును కూడ చేసెను (19). ఆ ప్రభుడు కొమ్ము బూరా ధ్వనితో దిక్కులను నింపి వేసెను. ఆ కైలాసపతి అపుడు రాక్షసులకు భయమును గొల్పువాడై స్వయముగా గర్జించెను (20). ఆయన అధిష్ఠించిన మహావృషభము బిగ్గరగా నాదములను చేసి ఆకాశమును భూమిని ఎనిమిది దిక్కులను శబ్దముతో నింపివేసెను. ఆ నాదమును విన్న ఏనుగులు తాము గొప్ప యను గర్వమును విడువవలసినదే (21). భయంకరాకారుడగు రుద్రుడు నేలపై రెండు చేతులతో కొట్టి ఆకాశములోనికి ఎగిరి చప్పట్లు కొట్టగా ఆ ధ్వని తత్పూర్వమునందలి ధ్వనులనన్నిటినీ మించి యుండెను (22).

అట్టాట్టహాసమశివం క్షేత్రపాలశ్చకార హ ।
భైరవోఽపి మహానాదం స చకార మహాహవే ॥
మహాకోలాహలో జాతో రణమధ్యే భయంకరః ।
వీరశబ్దో బభూవాథ గణమధ్యే సమంతతః ॥
సంత్రేసుర్దానవాస్సర్వే తైశ్శబ్దైర్భయదైః ఖరైః ।
చుకోపాతీవ తచ్ఛ్రుత్వా దానవేంద్రో మహాబలః ॥
తిష్ఠ తిష్ఠేతి దుష్టాత్మన్ వ్యాజహార యదా హరః ।
దేవైర్గణైశ్చ తై శ్శీఘ్రముక్తం జయ జయేతి చ ॥
అథాగత్య స దంభస్య తనయస్సు ప్రతాపవాన్ ।
శక్తిం చిక్షేప రుద్రాయ జ్వాలామాలాతి భీషణమ్ ॥
వహ్నికూట ప్రభాయాంతీ క్షేత్రపాలేన సత్వరమ్ ।
నిరస్తాగత్య సాజౌ వై ముఖోత్పన్నమహోల్కలా ॥
పునః ప్రవవృతే యుద్ధం శివదానవయోర్మహత్ ।
చకంపే ధరణీ ద్యౌశ్చ సనగాబ్ధి జలాశయా ॥

ఆ మహాయుద్ధములో క్షేత్రపాలుడు అమంగళకరమగు పెద్ద అట్టహాసమును చేసెను. భైరవుడు కూడ పెద్ద నాదమును చేసెను (23), సంగ్రామమధ్యములో భయంకరమగు పెద్ద కోలాహలము చెలరేగెను. అపుడు గణముల మధ్యలో అన్నివైపుల నుండియు వీరుల గర్జనలు బయలుదేరెను (24). భయంకరములగు ఆ పరుషశబ్దములను విని దానవులందరు చాల భయపడిరి. దానవచక్రవర్తి, మహాబలశాలి యగు శంఖచూడుడు ఆ ధ్వనులను విని మిక్కిలి కోపించెను (25). హరుడు 'ఓరీ దుర్బుద్ధీ ! నిలు నిలు' అని పలుకగానే, దేవతలు మరియు గణములు వెంటనే జయజయధ్వనులను చేసిరి (26). అపుడు దంభుని పుత్రుడు, గొప్ప ప్రతాపశాలియగు ఆ శంఖచూడుడు వచ్చి జ్వాలల మాలలతో మిక్కిలి భయమును గొల్పు శక్తిని రుద్రుని పైకి విసిరెను (27). యుద్ధరంగములో పెద్ద నిప్పుల గుండమువలె వచ్చుచున్న ఆ శక్తిని క్షేత్రపాలుడు వెంటనే తన నోటినుండి పుట్టిన పెద్ద ఉల్కతో చల్లార్చివేసెను. (28). మరల శివశంఖచూడుల మధ్య పెద్ద యుద్ధము చెలరేగెను. పర్వతములు, సరస్సులు మరియు సముద్రములతో కూడియున్న భూమి మరియు స్వర్గము కూడ కంపించెను (29).

దాంభిముక్తాన్ శరాన్ శంభుశ్శరాం స్తత్ప్రహితాన్ స చ ।
సహస్రశశ్శరైరు గ్రైశ్చిచ్ఛేద శతశస్తదా ॥
తతశ్శంభుస్త్రి శూలేన సంక్రుద్ధ స్తం జఘాన హ ।
తత్ప్రహారమసహ్యాశు కౌ పపాత స మూర్ఛితః ॥
తతః క్షణేన సంప్రాప సంజ్ఞాం స చ తదాసురః ।
ఆజఘాన శరై రుద్రం తాన్ సర్వానాత్త కార్ముకః ॥
బాహూనా మయుతం కృత్వా ఛాదయామాస శంకరమ్ ।
చక్రాయుతేన సహసా శంఖచూడః ప్రతాపవాన్ ॥
తతో దుర్గాపతిః క్రుద్ధో రుద్రో దుర్గార్తినాశనః ।
తాని చక్రాణి చిచ్ఛేద స్వశ్శరుత్తమై ర్ద్రుతమ్ ॥
తతో వేగేన సహసా గదామాదాయ దానవః ।
అభ్యధావత వై హంతుం బహుసేనావృతో హరమ్ ॥
గదాం చిచ్ఛేద తస్యాశ్వాపతత స్సోఽ సినా హరః ।
శితధారేణ సంక్రుద్ధో దుష్టగర్వాపహారకః ॥
ఛిన్నాయాం స్వగదాయాం చ చుకోపాతీవ దానవః ।
శూలం జగ్రాహ తేజస్వీ పరేషాం దుస్సహం జ్వలత్ ॥
సుదర్శనం శూలహస్త మాయాంతం దానవేశ్వరమ్ ।
స్వత్రిశూలేన వివ్యాధ హృది తం వేగతో హరః ॥

ఆ యుద్ధములో శంఖచూడుడు ప్రయోగించిన బాణములను శివుడు, శివుడు ప్రయోగించిన వేలాది బాణములను శంఖచూడుడు అనేక పర్యాయములు తమ తమ వాడి బాణములతో ఛేదించిరి (30). అపుడు శంభుడు కోపించి త్రిశూలముతో వానిని కొట్టగా, ఆ దెబ్బకు తాళజాలక ఆతడు మూర్ఛిల్లి నేలపై బడెను (31). అపుడా రాక్షసుడు క్షణములో తెలివి దెచ్చుకొని ధనస్సును ఎక్కు పెట్టి రుద్రుని, ఆయన అనుచరులనందరినీ బాణములతో కొట్టెను (32). ప్రతాపవంతుడగు శంఖచూడుడు పదివేల బాహువులను పొంది ఒక్కసారిగా పదివేల చక్రములతో శంకరుని కప్పివేసెను (33). అపుడు దుర్గకు భర్త, దుర్గమములగు కష్టములనుండి గట్టెక్కించువాడు నగు రుద్రుడు కోపించి వెంటనే ఉత్తమములగు తన బాణములతో ఆ చక్రములను ఛేదించెను (34). అపుడా దానవుడు పెద్ద సేనతో గూడి గదను చేతబట్టి వెంటనే శివుని కొట్టుటకై వేగముగా ముందునకురికెను (35). దుష్టుల మదమునడంచు ఆ శివుడు మిక్కిలి కోపించి, వేగముగా మీద పడబోవుచున్న ఆ శంఖచూడుని గదను పదునైన కత్తితో ముక్కలుగా చేసెను (36). తన గద ముక్కలు కాగా ఆ దానవుడు చాలా కోపించి శూలమును చేతబట్టెను. తేజశ్శాలియగు ఆతని శూలము మండుతూ శత్రువులకు సహింప శక్యము కానిదియై ఉండెను (37). శూలమును చేతబట్టి మీదకు వచ్చుచున్న సుందరాకారుడగు ఆ దానవచక్రవర్తిని హరుడు తన త్రిశూలముతో వేగముగా హృదయమునందు పొడిచెను (38).

త్రిశూల భిన్న హృదయాన్ని ష్క్రాంతః పురుషః పరః ।
తిష్ఠ తిష్ఠేతి చోవాచ శంఖచూడస్య వీర్యవాన్ ॥
నిష్క్రామతో హి తస్యాశు ప్రహస్య స్వనవత్తతః ।
చిచ్ఛేద చ శిరో భీమ మసినా సోఽపతద్భువి ॥
తతః కాలీ చఖాదోగ్రం దంష్ట్రాక్షుణ్ణ శిరోధరాన్ ।
అసురాంస్తాన్ బహూన్ క్రోధాత్ ప్రసార్య స్వముఖం తదా ॥
క్షేత్రపాలశ్చఖాదాన్యాన్ బహూన్ దైత్యాన్ క్రుధాకులః ।
కేచిన్నేశుర్భైరవాస్త్ర ఛిన్నా భిన్నాస్తథాపరే ॥
వీరభద్రోఽపరాన్ ధీమాన్ బహూన్ క్రోధాదనాశయత్ ।
నందీశ్వరో జఘానాన్యాన్బహూ నమరమర్దకాన్ ॥
ఏవం బహుగణా వీరాస్తదా సంనహ్యా కోపతః ।
వ్యనాశయన్ బహూన్ దైత్యానసురాన్ దేవమర్దకాన్ ॥
ఇత్థం బహుతరం తత్ర తస్య సైన్యం ననాశ తత్ ।
విద్రుతాశ్చాపరే వీరా బహవో భయకాతరాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధ ఖండే శంఖచూడ
సైన్యవధవర్ణనం నామ ఏకోన చత్వారింశోఽధ్యాయః ॥

త్రిశూలముచే చీల్చబడిన హృదయమునుండి ఒక గొప్ప పురుషుడు బయటకు వచ్చెను. శంఖచూడుని హృదయమునుండి వచ్చిన ఆ పరాక్రమశాలియగు పురుషుడు 'నిలు, నిలు' అని పలికెను (39). ఆతడు బయటకు వచ్చుట తోడనే శివుడు బిగ్గరగా నవ్వి ఆతని భయంకరమగు శిరస్సును కత్తితో నరుకగా ఆతడు నేలగూలెను. (40). తరువాతి కాళి తన నోటిని తెరచి అనేక మంది రాక్షసుల తలలు పళ్ల మధ్యలో నలుగుతుండగా క్రోధముతో భయంకరముగా వారిని భక్షించెను (41). మిగిలిన రాక్షసులలో చాలమందిని కోపముచే కల్లోలితుడైన క్షేత్రపాలుడు భక్షించెను. మరి కొందరు భైరవుని అస్త్రములచే చీల్చబడి మరణించిరి. ఇతరులు గాయపడిరి (42). బుద్ధిమంతుడగు వీరభద్రుడు అనేక మందిని క్రోధముతో సంహరించెను. దేవతలను హింసపెట్టిన అనేక రాక్షసులను నందీశ్వరుడు సంహరించెను (43). అపుడీ విధముగా వీరులగు అనేకగణములు కోపము గలవారై యుద్ధసన్నద్ధులై దేవతలను పీడించిన అనేకమంది రాక్షసులను సంహరించిరి (44). ఈ విధముగా ఆ యుద్ధములో శంఖచూడుని సైన్యములో అధికభాగము మట్టుపెట్టబడెను. మిగిలిన అనేకమంది వీరులు భయభీతులై పారిపోయిరి (45).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శంఖచూడసైన్యవధవర్ణనమనే ముప్పది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (39).

40 – శంఖచూడ వధ

సనత్కుమార ఉవాచ ।

స్వబలం నిహతం దృష్ట్వా ముఖ్యం బహుతరం తతః ।
తథా వీరాన్ ప్రాణసమాన్ చుకోపాతీవ దానవః ॥
ఉవాచ వచనం శంభుం తిష్ఠామ్యాజౌ స్థిరో భవ ।
కిమేతైర్నిహతైర్మేఽద్య సంముఖే సమరం కురు ॥
ఇత్యుక్త్వా దానవేంద్రోఽసౌ సన్నద్ధస్సమరే మునే ।
అగచ్ఛన్నిశ్చయం కృత్వాఽభిముఖే శంకరస్య చ ॥
దివ్యాన్యస్త్రాణి చిక్షేప మహారుద్రాయ దానవః ।
చకార శరవృష్టిం చ తోయవృష్టిం యథా ఘనః ॥
మాయాశ్చకార వివిధా అదృశ్యా భయదర్శితాః ।
అప్రతర్క్యాస్సురగణైర్నిఖిలైరపి సత్తమైః ॥
తా దృష్ట్వా శంకరస్తత్ర చిక్షేపాస్త్రం చ లీలయా ।
మాహేశ్వరం మహాదివ్యం సర్వమాయా వినాశనమ్ ॥
తేజసా తస్య తన్మాయా నష్టాశ్చాసన్ ద్రుతం తదా ।
దివ్యాన్యస్త్రాణి తాన్యేవ నిస్తేజాంస్య భవన్నపి ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

తన సైన్యములో ప్రముఖభాగము నశించుటయు, తనకు ప్రాణముతో సమమైన వీరులు సంహరింపబడుటను గాంచి అపుడా దానవుడు మిక్కిలి కోపించెను (1). అతడు శంభునితో, 'నేను యుద్ధములో నిలబడియున్నాను. నీవు కూడ నిలబడుము. వీరిని సంహరించుట వలన లాభమేమి గలదు? ఇపుడు నాఎదుట నిలబడి యుద్ధమును చేయుము' అని పలికెను (2). ఓ మునీ! ఆ దానవవీరుడు ఇట్లు పలికి దృఢనిశ్చయము చేసుకొని యుద్ధమునకు సన్నద్ధుడై శంకరుని ఎదుట నిలబడెను (3). ఆ దానవుడు మహారుద్రునిపై దివ్యములగు అస్త్రములను, బాణములను, మేఘము నీటిని వలె, వర్షించెను (4). దేవతలలో, గణములలో గల శ్రేష్ఠులందరు కూడ ఊహింప శక్యము కాని, కంటికి కానరాని, భయంకరములగు అనేక మాయలను ఆతడు ప్రదర్శించెను (5). అపుడు శంకరుడు వాటిని గాంచి గొప్ప దివ్యమైన, మాయలనన్నింటినీ నశింపజేయు మహేశ్వరాస్త్రమును అవలీలగా ప్రయోగించెను (6). అపుడు దాని తేజస్సుచే వాని మాయలన్నియు శీఘ్రమే అదృశ్యమగుటయే గాక వాని దివ్యాస్త్రములు కూడ తేజోవిహీనములాయెను (7).

అథ యుద్ధే మహేశానస్తద్వధాయ మహాబలః ।
శూలం జగ్రాహ సహసా దుర్నివార్యం సుతేజసామ్ ॥
తదైవ తన్ని షేద్ధుం చ వాగ్బభూవాశరీరిణీ ।
క్షిప శూలం న చేదానీం ప్రార్థనాం శృణు శంకర ॥
సర్వథా త్వం సమర్థో హి క్షణాద్ బ్రహ్మాండనాశనే ।
కిమేక దానవస్యేశ శంఖచూడస్య సాంప్రతమ్ ॥
తథాపి వేదమర్యాదా న నాశ్యా స్వామినా త్వయా ।
తాం శృణుష్వ మహాదేవ సఫలం కురు సత్యతః ॥
యావదస్య కరేఽ త్యుగ్రం కవచం పరమం హరేః ।
యావత్స తీత్వమస్త్యేవ సత్యా అస్య హి యోషితః ॥
తావదస్య జరామృత్యుశ్శంఖచూడస్య శంకర ।
నాస్తీత్య వితథం నాథ విధేహి బ్రహ్మణో వచః ॥
ఇత్యాకర్ణ్య నభోవాణీం తథేత్యుక్త్వే హరే తదా ।
హరేచ్ఛయాగతో విష్ణుస్తం దిదేశ సతాం గతిః ॥

పరమజ్ఞానమునిచ్చి శివభక్తిని వర్ధిల్లజేయును (42). దీనిని విన్న బ్రాహ్మణుడు బ్రహ్మవర్చస్విగను, క్షత్రియుడు విజయిగను, వైశ్యుడు సంపన్నుడు గను, శూద్రుడు మహాపురుషుడుగను అగుదురు (43).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శంఖచూడవధయను నలుబదియవ అధ్యాయము ముగిసినది (40).

41 – శాలగ్రామశిల విష్ణుస్వరూపము

వ్యాస ఉవాచ ।

నారాయణశ్చ భగవాన్ వీర్యాధానం చకార హ ।
తులస్యాః కేన యత్నేన యోనౌ తద్వక్తు మర్హసి ॥

వ్యాసుడిట్లు పలికెను –

నారాయణ భగవానుడు ఏ ప్రయత్నముచే తులసితో రమించగల్గెనో చెప్పుడు (1).

సనత్కుమార ఉవాచ ।

నారాయణో హి దేవానాం కార్యకర్తా సతాం గతిః ।
శంఖచూడస్య రూపేణ రేమే తద్రామయా సహ ॥
తదేవ శృణు విష్ణోశ్చ చరితం ప్రముదావహమ్ ।
శివశాసనకర్తుశ్చ మాతుశ్చ జగతాం హరేః ॥
రణమధ్యే వ్యోమవచశ్శ్రుత్వా దేవేన శంభునా ।
ప్రేరితశ్శంఖచూడస్య గృహీత్వా కవచం పరమ్ ॥
విప్రరూపేణ త్వరితం మాయయా నిజయా హరిః ।
జగామ శంఖచూడస్య రూపేణ తులసీ గృహమ్ ॥
దుందుభిం వాదయామాస తులసీద్వారసన్నిధౌ ।
జయశబ్దం చ తత్రైవ బోధయామాస సుందరీమ్ ॥
తచ్ఛ్రుత్వా చైవ సా సాధ్వీ పరమానందసంయుతా ।
రాజమార్గం గవాక్షేణ దదర్శ పరమాదరాత్ ॥
బ్రాహ్మణేభ్యో ధనం దత్త్వా కారయామాస మంగళమ్ ।
ద్రుతం చకార శృంగారం జ్ఞాత్వాఽఽయాతం నిజం పతిమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

దేవతల కార్యమును చేయువాడు, సత్పురుషులకు శరణ్యుడు అగు నారాయణుడు శంఖచూడరూపమును దాల్చి ఆతని భార్యతో రమించెను (2). జగన్మాత యగు పార్వతి మరియు శివుని శాసనమును అమలు జేయువాడు, పాపహరుడు అగు విష్ణువు యొక్క ఆనందదాయకమగు ఆ వృత్తాంతమును వినుము (3). రణరంగమధ్యములో ఆకాశవాణిని విన్న శంభుదేవునిచే ప్రేరేపితుడైన హరి శంఖచూడుని గొప్ప కవచమును తన మాయచే బ్రాహ్మణరూపమును ధరించి గ్రహించి, వెంటనే శంఖచూడుని రూపముతో తులసి యొక్క ఇంటికి వెళ్లెను. (4, 5). తులసి ఇంటి ద్వారమునకు సమీపములో దుందుభి ధ్వనులను, జయ జయ శబ్దములను చేయించి, ఆ సుందరికి తెలివి వచ్చునట్లు చేసెను (6). ఆ పతివ్రత ఆ శబ్దములను వినుట తోడనే పరమానందమును పొంది

అధికమగు ఆదరముతో రాజమార్గమును కిటికీలో నుండి చూచెను (7). తన భర్త తిరిగి వచ్చినాడని తెలుసుకొని ఆమె వెంటనే బ్రాహ్మణులకు ధనము నిచ్చి మంగళకర్మలను చేయించి, వెంటనే తాను అలంకరించు కొనెను (8).

అవరుహ్య రథాద్విష్ణు స్తద్దేవ్యా భవనం యయౌ ।
శంఖ చూడ స్వరూపస్స మాయవీ దేవ కార్యకృత్ ॥
దృష్ట్వా తం చ పురః ప్రాప్తం స్వకాంతం సా ముదాన్వితా ।
తత్పాదౌ క్షాలయామాస ననామ చ రురోద చ ॥
రత్న సింహాసనే రమ్యే వాసయామాస మంగలమ్ ।
తాంబూలం చ దదౌ తస్మై కర్పూరాది సువాసితమ్ ॥
అద్య మే సఫలం జన్మ జీవనం సంబభూవ హ ।
రణే గతంచ ప్రాణేశం పశ్యంత్యాశ్చ పునర్గృహే ॥
ఇత్యుక్త్వా సకటాక్షం సా నిరీక్ష్య సస్మితం ముదా ।
పప్రచ్ఛ రణ వృత్తాంతం కాంతం మధురయా గిరా ॥

మాయావి, దేవకార్యమును చేయువాడు అగు ఆ విష్ణువు శంఖచూడ రూపములో రథమునుండి దిగి ఆ దేవియొక్క భవనములోనికి వెళ్లెను (9). తన ఎదుటకు వచ్చిన తన ప్రియుని గాంచి ఆమె ఆనందించి ఆతని పాదములను కడిగి ప్రణమిల్లి రోదించెను (10). ఆతనిని సుందరమగు రత్న సింహాసనముపై కూర్చుండబెట్టి కర్పూరము మొదలగు సుగంధ ద్రవ్యములతో కూడిన మంగళ తాంబూలము నాతనికి అందజేసెను (11). యుద్ధమునకు వెళ్లి మరల తిరిగి వచ్చిన ప్రాణ ప్రియుని ఇంటిలో గాంచుచున్న నా యొక్క పుట్టుక మరియు జీవితము ఈనాడు సఫలమైనవి (12). ఇట్లు పలికి ఆమె ప్రియుని ఆనందముతో చిరునవ్వుతో ఓరచూపులు చూస్తూ మధురమగు వాక్కులతో యుద్ధవార్తలనిట్లు ప్రశ్నించెను (13).

తులస్యువాచ ।

అసంఖ్య విశ్వ సంహర్తా స దేవవరః ప్రభుః ।
యస్యాజ్ఞావర్తినో దేవా విష్ణు బ్రహ్మాదయస్సదా ॥
త్రిదేవ జనక స్సోఽత్ర త్రిగుణాత్మా చ నిర్గుణః ।
భక్తేచ్ఛయా చ సగుణో హరి బ్రహ్మ ప్రవర్తకః ॥
కుబేరస్య ప్రార్థనయా గుణరూపధరో హరః ।
కైలాస వాసీ గణపః పరబ్రహ్మ సతాం గతిః ॥
యస్యైక పలమాత్రేణ కోటి బ్రహ్మాండ సంక్షయః ।
విష్ణు బ్రహ్మాదయోఽతీతా బహవః క్షణమాత్రతః ॥
కర్తుం సార్ధం చ తేనైవ సమరం త్వం గతః ప్రభో ।
కథం బభూవ సంగ్రామస్తేన దేవసహాయినా ॥

కుశలీ త్వమిహాయాతస్తం జిత్వా పరమేశ్వరమ్ ।
కథం బభూవ విజయస్తవ బ్రూహి తదేవ మే ॥
శ్రుత్వేత్థం తులసీ వాక్యం స విహస్య రమాపతిః ।
శంఖచూడ రూపధరస్తాముపాచామృతం వచః ॥

తులసి ఇట్లు పలికెను -

దేవదేవుడు, సమస్త బ్రహ్మాండములను ఉపసంహరించువాడునగు ఆ శివ ప్రభుని కనుసన్నలలో విష్ణు బ్రహ్మాది దేవతలందరు సర్వదా మెలగుచుందురు (14). సత్త్వరజస్తమోగుణ స్వరూపుడు, బ్రహ్మ విష్ణు రుద్రులకు తండ్రి, నిర్గుణుడు, భక్తుల కోర్కె మేరకు రూపమును దాల్చినవాడు, బ్రహ్మ విష్ణువులను ప్రవర్తిల్ల జేయువాడు (15), కుబేరుని కోర్కె మేరకు త్రిగుణాత్మకమగు రూపమును దాల్చి కైలాసమునందుండు వాడు, పాపహారి, గణములను రక్షించువాడు, పరబ్రహ్మ, సత్పురుషులకు శరణ్యుడు (16) అగు శివుని ఒక క్షణ కాలములో కోటి బ్రహ్మాండములు క్షయమును పొందును. ఆయన యొక్క క్షణ మాత్ర కాలములో విష్ణు బ్రహ్మాదుల అనేకుల ఆయుర్దాయములు గడిచిపోవును (17). ఓ ప్రభూ! అట్టి శివునితో యుద్ధమును చేయుటకు నీవు వెళ్లి యుంటివి. దేవ సాహాయ్యకారియగు ఆయనతో యుద్ధము ఎట్లు జరిగినది? (18) నీవు పరమేశ్వరుని జయించి ఇచటకు క్షేమముగా తిరిగి వచ్చితివి. నీకు విజయము ఎట్లు కలిగెను? ఆ విషయమును నాకు నిశ్చయముగా చెప్పుము (19). తులసియొక్క ఈ మాటను విని శంఖ చూడుని రూపములోనున్న ఆ లక్ష్మీపతి నవ్వి ఆమెతో అమృతప్రాయములగు వచనముల నిట్లు పలికెను (20).

భగవానువాచ ।

యదాహం రణ భూమౌ చ జగామ సమరప్రియః ।
కోలాహలో మహాన్ జాతః ప్రవృత్తోఽ భూన్మహారణః ॥
దేవదానవయోర్యుద్ధం సంబభూవ జయైషిణోః ।
దైత్యాః పరాజితాస్తత్ర నిర్బలైర్బల గర్వితైః ॥
తదాహం సమరం తత్రాకార్షం దేవైర్బలోత్కటైః ।
పరాజితాశ్చ తే దేవాశ్శంకరం శరణం యయుః ॥
రుద్రోఽపి తత్సహాయార్థ మాజగామ రణం ప్రతి ।
తేనాహం వై చిరం కాల మయౌత్సం బలదర్పితః ॥
ఆవయోస్సమరః కాంతే పూర్ణమబ్దం బభూవ హ ।
నాశో బభూవ సర్వేషా మసురాణాం చ కామిని ॥
ప్రీతిం చ కారయామాస బ్రహ్మా చ స్వయమావయోః ।
దేవానామధికారాశ్చ ప్రదత్తా బ్రహ్మశాసనాత్ ॥
మయాగతం స్వభవనం శివలోకం శివో గతః ।
సర్వస్వాస్థ్య మతీవాప దూరీభూతో హ్యుపద్రవః ॥

భగవంతుడిట్లు పలికెను -

యుద్ధమునందు ప్రీతిగల నేను యుద్ధభూమికి వెళ్లి తిని. అచట పెద్ద కోలాహలముతో పెద్ద యుద్ధము ఆరంభమాయెను (21). జయకాంక్షులగు దేవతలు, దానవులు పరస్పర యుద్ధము నారంభించిరి. ఆ యుద్ధములో బలముచే గర్వించియున్న దేవతలచే దానవులు ఓడింపబడిరి (22). అపుడు నేను అచట బలగర్వితులైయున్న దేవతలతో యుద్ధమును చేసితిని. ఆ దేవతలు నా చేతిలో ఓడి శంకరుని శరణు పొందిరి (23). వారికి సాహాయ్య మొనర్చుటకై రుద్రుడు యుద్ధమునకు వచ్చెను. బలగర్వితుడనైన నేను ఆయనతో చిరకాలము యుద్ధమును చేసితిని (24). ఓ ప్రియులారా! మా ఇద్దరి యుద్ధము సంవత్సర కాలము జరిగెను. ఓ సుందరీ! దానవులందరు నశించిరి (25). బ్రహ్మ స్వయముగా మాకిద్దరికీ సంధిని చేయించెను. బ్రహ్మయొక్క ఆజ్ఞచే దేవతల అధికారములను వారికి అప్పజెప్పితిని (26). నేను నా ఇంటికి వచ్చితిని. శివుడు తన లోకమునకు వెళ్లెను. సర్వప్రాణులు గొప్ప సుఖమును పొందినవి. ఉపద్రవము తొలగి పోయినది (27).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా జగతాం నాథశ్శయనం చ చకార హ ।
రేమే రమాపతిస్తత్ర రమయా స తయా ముదా ॥
సా సాధ్వీ సుఖ సంభావకర్షణస్య వ్యతి క్రమాత్ ।
సర్వం వితర్కయా మాస కస్త్వ మేవేత్యువాచ సా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

జగత్ప్రభువగు ఆ లక్ష్మీపతి ఇట్లు పలికి అచట శయనించి సుందరితో కలసి ఆనందముగా రమించెను (28). సుఖము, ప్రీతి వచనములు, ఆకర్షణలలో గల భేదమును బట్టి ఆ పతివ్రత సర్వమును ఊహించి 'నీ వెవ్వరివి?' అని పలికెను (29).

తులస్యువాచ ।

కో వా త్వం వద మామాశు భుక్తాహం మాయయా త్వయా ।
దూరీకృతం యత్సతీత్వమథ త్వాం వై శపామ్యహమ్ ॥

తులసి ఇట్లు పలికెను -

నీ వెవ్వరివి? నాకు వెంటనే చెప్పుము. నీవు మాయచేసి నన్ను భోగించితివి. నా పాతివ్రత్యమును చెడగొట్టితివి. నీవు చెప్పనిచో, నిన్ను నేను శపించెదను (30).

సనత్కుమార ఉవాచ ।

తులసీవచనం శ్రుత్వా హరిశ్శాప భయేన చ ।
దధార లీలయా బ్రహ్మన్ స్వమూర్తిం సుమనోహరామ్ ॥
తద్దృష్ట్వా తులసీ రూపం జ్ఞాత్వా విష్ణుం తుచిహ్నతః ।
పాతివ్రత్య పరిత్యాగాత్ క్రుద్ధాసా తమువాచ హ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ బ్రాహ్మణా! తులసియొక్క మాటను విని,విష్ణువు శాపమువలన భయపడిన వాడై అవలీలగా మిక్కిలి అందమగు తన మూర్తిని దాల్చెను (31). తులసి ఆ రూపమును గాంచి, చిహ్నములను బట్టి విష్ణువు అని గ్రహించి, తన పాతివ్రత్యము చెడినందులకు కోపించి ఆతనితో నిట్లనెను (32).

తులస్యువాచ ।

హే విష్ణో తే దయా నాస్తి పాషాణ సదృశం మనః ।
పతిధర్మస్య భంగేన మమ స్వామీ హతః ఖలు ॥
పాషాణ సదృశస్త్వం చ దయాహీనో యతః ఖలః ।
తస్మాత్పాషణ రూపస్త్వం మచ్ఛాపేన భవాధునా ॥
యే వదంతి దయాసింధుం త్వాం భ్రాంతాస్తే న సంశయః ।
భక్తో వినాపరాధీన పరార్థే చ కథం హతః ॥

తులసి ఇట్లు పలికెను -

ఓ విష్ణో! నీకు దయ లేదు. నీ మనస్సు రాయి వంటిది. నా పాతివ్రత్యమునకు భంగము కలుగుటచే నా భర్త సంహరింపబడినాడు (33). నీవు దుష్టుడవు, రాయివంటి వాడవు, దయలేని వాడవు. కావున నా శాపముచే నీవు ఇప్పుడు పాషాణరూపుడవు కమ్ము (34). నీవు దయారూపుడవని పలుకువారు భ్రాంతిని పొందిన వారనుటలో సందేహము లేదు. ఇతరుల ప్రయోజనము కొరకై, అపరాధము చేయని ఒక భక్తుని ఎట్లు హతమార్చ గల్గితివి ? (35)

సనత్కుమార ఉవాచ।

ఇత్యుక్త్వా తులసీ సా వై శంఖచూడప్రియా సతీ ।
భృశం రురోద శోకార్తా విలలాప భృశం ముహుః ॥
తతస్తాం రుదతీం దృష్ట్వా స విష్ణుః పరమేశ్వరః ।
సస్మార శంకరం దేవం యేన సంమోహితం జగత్ ॥
తతః ప్రాదుర్బభూవాథ శంకరో భక్తవత్సలః ।
హరిణా ప్రణతశ్చాసీత్సంనుతో వినయేన సః ॥
శోకాకులం హరిం దృష్ట్వా విలపంతీం చ తత్ప్రియామ్ ।
నయేన బోధయామాస తం తాం కృపణవత్సలః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఇట్లు పలికి శంఖచూడుని ప్రియురాలు, పతివ్రతయగు ఆ తులసి శోకపీడితురాలై పలుమార్లు తీవ్రముగా రోదించెను (36). ఏడ్చుచున్న ఆమెను గాంచి అపుడా పరమేశ్వరుడగు విష్ణువు, ఎవనిచే జగత్తు మోహింపచేయబడుచున్నదో, అట్టి శంకరదేవుని స్మరించెను (37). అపుడు భక్తవత్సలుడగు శంకరుడు ఆవిర్భవించగా, విష్ణువు ఆయనకు వినయముతో ప్రణమిల్లి స్తుతించెను (38). శోకముతో కంగారుపడుతున్న విష్ణువును, ఏడ్చుచున్న శంఖచూడ ప్రియురాలగు తులసిని గాంచి దీనులయందు ప్రేమగల శివుడు వారిద్దరినీ అనునయించి నచ్చజెప్పెను (39).

శంకర ఉవాచ ।

మారోదీస్తులసి త్వం హి భుంక్తే కర్మఫలం జనః ।
సుఖదుఃఖదో న కోఽప్యస్తి సంసారే కర్మసాగరే ॥
ప్రస్తుతం శృణు నిర్దుఃఖం శృణోతి సమనా హరిః ।
ద్వయోస్సుఖకరం యత్ర బ్రవీమి సుఖహేతవే ॥
తపస్త్వయా కృతం భద్రే తస్యైవ తపసః ఫలమ్ ।
తదన్యథా కథం స్యాద్వై జాతం త్వయి తథా చ తత్ ॥
ఇదం శరీరం త్యక్త్వా చ దివ్యదేహం విధాయ చ ।
రమస్వ హరిణా నిత్యం రమయా సదృశీ భవ ॥
తవేయం తనురుత్సృష్టా నదీరూపా భవేదిహ ।
భారతే పుణ్య రూపా సా గండకీతి చ విశ్రుతా ॥
కియత్కాలం మహాదేవి దేవపూజన సాధనే ।
ప్రధానరూపా తులసీ భవిష్యతి వరేణ మే ॥
స్వర్గే మర్త్యే చ పాతాళే తిష్ఠ త్వం హరిసన్నిధౌ ।
భవ త్వం తులసీ వృక్షో వరా పుష్పేషు సుందరీ ॥
వృక్షాధిష్ఠాతృదేవీ త్వం వైకుంఠే దివ్యరూపిణీ ।
సార్ధం రహసి హరిణా నిత్యం క్రీడాం కరిష్యసి ॥

శంకరుడిట్లు పలికెను -

ఓ తులసీ! నీవు దుఃఖించకుము. మానవుడు కర్మఫలము ననుభవించును. కర్మసముద్రమనదగిన ఈ సంసారములో సుఖదుఃఖముల నిచ్చువారు ఇతరులు ఎవ్వరూ కారు (40). నీవు దుఃఖమును వీడి ప్రస్తుత కర్తవ్యమును గూర్చి వినుము. విష్ణువు ప్రసన్నమనస్కుడై వినుచున్నాడు.మీ ఇద్దరికీ సుఖమును కలిగించు ఉపాయము గలదు. దానిని చెప్పెదను (41). ఓ మంగళ స్వరూపురాలా! నీవు తపస్సును చేసితివి. ఆ తపస్సుయొక్క ఫలము నీకు

దక్కకుండా ఎట్లు పోవును? నీకు దాని ఫలము ఇపుడు లభించుచున్నది (42). నీవీ శరీరమును విడనాడి దివ్యదేహమును దాల్చి నిత్యము విష్ణువుతో రమిస్తూ లక్ష్మీ సమానురాలవు కమ్ము (43). నీచే విడువబడిన ఈ నీ దేహము పుణ్య నదీరూపమును దాల్చి గండకియని ప్రసిద్ధిని గాంచి ఈ భారతదేశములో ప్రవహించ గలదు (44). ఓ మహాదేవీ! దేవతలను పూజించే సామగ్రిలో నా వరముచే తులసి కొంతకాలము ప్రధానవస్తువు అగును (45). స్వర్గ భూలోక పాతాళములలో నీవు ఉంటూనే హరి సన్నిధియందు కూడ ఉండుము. నీవు తులసి మొక్కవు అగుము. ఈ మొక్క పుష్పములు గల మొక్కలకంటె సుందరముగ నుండును (46). తులసి వృక్షమునకు అధిష్ఠాత్రి దేవియగు నీవు దివ్యరూపమును దాల్చి వైకుంఠములో విష్ణువుతో గూడి నిత్యము ఏకాంతములో రమించగలవు (47).

నద్య ధిష్ఠాతృదేవీ యా భారతే బహుపుణ్యదా ।
లవణో దస్య పత్నీ సా హర్యంశస్య భవిష్యసి ॥
హరిర్వై శైలరూపీ చ గండకీ తీర సన్నిధౌ ।
సంకరిష్యత్యధిష్ఠానం భారతే తవ శాపతః ॥
తత్ర కోట్యశ్చ కీటాశ్చ తీక్ష్ణ దంష్ట్రా భయంకరాః ।
తచ్ఛిత్వా కుహరే చక్రం కరిష్యంతి తదీయకమ్ ॥
శాలగ్రామశిలా సా హి తద్భేదాదతి పుణ్యదా ।
లక్ష్మీనారాయణాఖ్యా దిశ్చక్ర భేదాద్భవిష్యతి ॥
శాలగ్రామ శిలా విష్ణో తులస్యాస్తవ సంగమః ।
సదా సాదృశ్య రూపా యా బహుపుణ్యా వివర్ధనీ ॥
తులసీ పత్ర విచ్ఛేదం శాలగ్రామే కరోతి యః ।
తస్య జన్మాంతరే భద్రే స్త్రీ విచ్ఛేదో భవిష్యతి ॥
తులసీపత్ర విచ్ఛేదం శంఖం హిత్వా కరోతి యః ।
భార్యాహీనో భవేత్స ఒపి రోగీ స్యాత్సప్త జన్మసు ॥
శాలగ్రామశ్చ తులసీ శంఖం చైకత్ర ఏవ హి ।
యో రక్షతి మహాజ్ఞానీ స భవే చ్ఛ్రీ హరిప్రియః ॥
త్వం ప్రియశ్శంఖ చూడస్య చైకమన్వంతరావధి ।
శంఖేన సర్ధిం త్వద్భేదః కేవలం దుఃఖదస్తవ ॥

భారతదేశములో ప్రవహించే, మహాపుణ్యమునిచ్చు నదికి అధిష్టాన దేవతవై, విష్ణువు యొక్క అంశయగు సముద్రునకు భార్యవు కాగలవు (48). నీ శాపముచే విష్ణువు భారతదేశములోని గండకీనదీ తీరమునందు శైలరూపమును దాల్చి ఆ శైలమునకు అధిష్టాన దేవత కాగలడు (49). దానియందు కోట్లాది భయంకరములైన, పదునైన దంతములుగల కీటకములు ఆ రాతిని ఛేదించి లోపల విష్ణుచక్రాకారమును మలచగలవు (50). ఆ పర్వతము నుండి వేరుపడిన అట్టి శకలమే మహాపుణ్యప్రదమగు శాలగ్రామ శిలయగును. వాటి లోపల గల చక్రమునందలి భేదమును బట్టి వాటికి లక్ష్మీనారాయణ ఇత్యాది నామములు కలుగును (51). ఓ విష్ణూ! నీతో తులసియొక్క సమాగమమునకు ప్రతీకయగు శాలగ్రామ శిల సర్వదా ఏకరూపముగ నుండి మహాపుణ్యమును వర్ధిల్లజేయును (52). ఓ మంగళస్వరూపురాలా! శాలగ్రామమునుండి తులసీ పత్రములను విడదీసిన వ్యక్తి మరు జన్మలో భార్యా వియోగమును పొందును(53). శంఖమును విడిచిపెట్టి తులసీ పత్రములను కోయు వ్యక్తి భార్యా వియోగమును పొందుటయే గాక ఏడు జన్మలలో రోగి.యగును (54). ఏ మహాజ్ఞాని శాలగ్రామమును, తులసిని, శంఖమును ఒకే స్థానములో భద్రము చేయునో, వాడు శ్రీహరికి ఇష్టుడు అగును(55). నీవు ఒక మన్వంతర కాలము శంఖచూడునకు ప్రియురాలవై ఉంటివి. ఇపుడు నీకు ఆతనితో వియోగము మహాదుఃఖమును కలిగించినది (56).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా శంకరస్తత్ర మాహాత్మ్యమూచివాం స్తదా ।
శాలగ్రామశిలాయాశ్చ తులస్యా బహుపుణ్య దమ్ ॥
తతశ్చాంతర్హితో భూత్వా మోదయిత్వా హరిం చ తామ్ ।
జగామ స్వాలయం శంభుశ్శర్మదో హి సదా సతామ్ ॥
ఇతి శ్రుత్వా వచశ్శంభోః ప్రసన్నా తు తులస్య భూత్ ।
తద్దేహం చ పరిత్యజ్య దివ్యరూపా బభూవ హ ॥
ప్రజగామ తయా సార్ధం వైకుంఠం కమలాపతిః ।
సద్యస్తద్దేహజాతా చ బభూవ గండకీ నదీ ॥
శైలోఽ భూదచ్యుతస్సోఽ పి తత్తీరే పుణ్యదో నృణామ్ ।
కుర్వంతి తత్ర కీటాశ్చ ఛిద్రం బహువిధం మునే ॥
జలే పతంతి యాస్తత్ర శిలాస్తాస్స్యతి పుణ్యదాః ।
స్థలస్థా పింగళా జ్ఞేయాశ్చోపతాపాయ చైవ హి ॥
ఇత్యేవం కథితం సర్వం తవ ప్రశ్నాను సారతః ।
చరితం పుణ్యదం శంభో స్సర్వకామ ప్రదం నృణామ్ ॥
ఆఖ్యానమిదమాఖ్యాతం విష్ణుమాహాత్మ్యమిశ్రితమ్ ।
భుక్తి ముక్తి ప్రదం పుణ్యం కిం భూయోశ్రోతు మిచ్ఛసి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే తులసీ
శాపవర్ణనం నామ ఏకచత్వారింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఈ తీరున ఆ సమయములో శంకరుడు శాలగ్రామ శిల, తులసి అను వాటి యొక్క మహాపుణ్యప్రదమగు మాహాత్మ్యమును చెప్పెను (57). అపుడు, సర్వదా సత్పురుషులకు సుఖమునిచ్చు శంభుడు విష్ణువును, తులసిని ఆనందింపజేసి అంతర్హితుడై తన ధామమును చేరెను (58). శంభుని ఈ పలుకులను విని తులసి ప్రసన్నురాలై ఆ దేహమును విడిచి దివ్య రూపమును పొందెను (59). లక్ష్మీపతి ఆమెతో గూడి వైకుంఠమునకు వెళ్లెను. ఆమె దేహమునుండి తత్క్షణమే గండకీనది ఆవిర్భవించెను (60). ఆ నదీ తీరమునందు విష్ణువు శైలరూపముగా వెలసి మానవులకు పుణ్యము నిచ్చుచున్నాడు. ఓ మునీ! అచట కీటకములు శిలలయందు బహువిధముల ఛిద్రములను చేయుచుండును (61). అచట నదీ జలములో పడిన శిలలు మహాపుణ్యము నిచ్చును. నేలమీద ఉన్న శిలలకు పింగళములని పేరు. అవి హానిని కలిగించును(62). ఈ విధముగా మానవులకు కోరికల నన్నిటినీ ఈడేర్చే పుణ్యప్రదమగు శంభుచరితము నంతనూ నీ ప్రశ్నకు తగినట్లుగా చెప్పియుంటిని (63). విష్ణువు యొక్క మాహాత్మ్యముతో కలిసియున్న ఈ పుణ్య గాథ భుక్తిని ముక్తిని ఇచ్చును. దీనిని చెప్పియుంటిని. ఇంకనూ ఏమి వినగోరు చున్నావు? (64)

42 - అంధకాసురుడు

నారద ఉవాచ ।

శంఖచూడవధం శ్రుత్వా చరితం శశిమౌలినః ।
అయం తృప్తోఽస్మి నో తృప్తోఽమృతం పీత్వా యథా జనః ॥
బ్రహ్మన్ యచ్చరితం తస్య మహేశస్య మహాత్మనః ।
మాయామాశ్రిత్య సల్లీలాం కుర్వతో భక్తమోదదామ్ ॥

నారదుడిట్లు పలికెను -

శంఖచూడుని వధను, చంద్రశేఖరుని గాథను నీ నుండి విని ఈ నేను అమృతమును త్రాగిన జనుని వలె తృప్తిని పొందలేకున్నాను (1). ఓ బ్రహ్మా! మహాత్ముడు, మాయను ఆశ్రయించి చక్కటి లీలను చేయువాడు అగు ఆ మహేశ్వరుని చరితమును మరియొక దానిని చెప్పుము. ఆయన గాథ భక్తులకు ఆనందమును కలిగించును (2).

బ్రహ్మోవాచ ।

జలంధరవధం శ్రుత్వా వ్యాసస్సత్య వతీ సుతః ।
అప్రాక్షీ దిమమేవార్థం బ్రహ్మపుత్రం మునీశ్వరమ్ ॥
సనత్కుమారః ప్రోవాచ వ్యాసం సత్యవతీ సుతమ్ ।
సుప్రశంస్య మహేశస్య చరితం మంగళాయనమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

సత్యవతీ పుత్రుడగు వ్యాసుడు జలంధరవధను విని బ్రహ్మపుత్రుడగు సనత్కుమార మహర్షిని ఇదే విధముగా ప్రశ్నించెను (3). అపుడు సనత్కుమారుడు సత్యవతీ పుత్రుడగు వ్యాసుని మిక్కిలి ప్రశంసించి, మంగళములకు నిదానమగు మహేశుని చరితమును చెప్పెను (4).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహేశస్య చరితం మంగళాయనమ్ ।
యథాంధకో గాణపత్యం ప్రాప శంభోః పరాత్మనః ॥
కృత్వా పరమ సంగ్రామం తేన పూర్వం మునీశ్వర ।
ప్రసాద్య తం మహేశానం సత్య భావాత్పునః పునః ॥
మాహాత్మ్య మద్భుతం శంభో శ్శరణాగత రక్షిణః ।
సుభక్త వత్సల స్యైవ నానాలీలా విహారిణః ॥
మాహాత్మ్య మేతద్వృషభధ్వజస్య శ్రుత్వా మునిర్గంధవతీసుతో హి ।
వచో మహార్థం ప్రణిపత్య భక్త్యా హ్యువాచ తం బ్రహ్మసుతం మునీంద్రమ్
॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ వ్యాసా! మంగళ నిధానమగు మహేశుని చరితమును, అంధకుడు శంభు పరమాత్మయొక్క గణాధ్యక్ష స్థానమును పొందిన వృత్తాంతమును వినుము (5). ఓ మహర్షీ! ఆతడు మహేశ్వరునితో గొప్ప యుద్ధమును చేసి తన సాత్త్విక భావములను పలుమార్లు ప్రదర్శించి తద్ద్వారా ఆతడు మహేశ్వరుని ప్రసన్నుని చేసుకొనెను (6). శరణు జొచ్చిన వారిని రక్షించువాడు, భక్తులయందు గొప్ప ప్రేమ గలవాడు, అనేక లీలలతో విహరించువాడు నగు శంభుని మాహాత్మ్యము అద్భుతమైనది (7). సత్యవతీపుత్రుడగు వ్యాస మహర్షి వృషభధ్వజుని ఈ మాహాత్మ్యమును విని నమస్కరించి భక్తితో బ్రహ్మపుత్రుడగు ఆ సనత్కుమార మహర్షితో గొప్ప అర్థము గల వచనము నిట్లు పలికెను (8).

వ్యాస ఉవాచ ।

కో హ్యంధకో వై భగవన్మునీశ కస్యాన్వయే వీర్యవతః పృథివ్యామ్ ।
జాతో మహాత్మా బలవాన్ ప్రధానః కిమాత్మకః కస్య సుతోఽధకశ్చ ॥
ఏతత్సమస్తం సరహస్యమద్య బ్రవీహి మే బ్రహ్మసుత ప్రసాదాత్ ।
స్కందాత్త్వయా వై విదితం హి సమ్యక్ మహేశ పుత్రాదమితావబోధాత్ ॥
గాణపత్యం కథం ప్రాప శంభోః పరమతేజసః ।
సోఽధకో ధన్య ఏవాతి యో బభూవ గణేశ్వరః ॥

వ్యాసుడిట్లు పలికెను –

ఓ భగవన్! మహర్షీ! అంధకుడెవ్వరు? మహాత్ముడు, బలవంతుడు, ప్రముఖుడు అగు ఈ అంధకుడు భూమియందు ఏ పరాక్రమవంతుని వంశములో జన్మించినాడు? ఆతని స్వరూపమేమి? అంధకుడు ఎవని పుత్రుడు? (9) ఓ బ్రహ్మపుత్రా! నీవు అనుగ్రహించి ఇపుడు ఈ రహస్యములతో గూడిన వృత్తాంతమునంతనూ నాకు చెప్పుము. మహేశ్వరుని కుమారుడు, గొప్ప జ్ఞానియగు కుమారస్వామినుండి నీవు ఈ వృత్తాంతమును చక్కగా తెలుసుకొని యుంటివి (10). ఆ అంధకుడు గణాధ్యక్షుడై అతి ధన్యుడైనాడు. ఆతడు మహాతేజస్వియగు శంభుని వద్ద గణాధ్యక్ష పదవిని ఎట్లు పొందినాడు? (11)

బ్రహ్మోవాచ ।

వ్యాసస్య చైతద్వచనం నిశమ్య ప్రోవాచ స బ్రహ్మ సుతస్తదానీమ్ ।
మహేశ్వరోతీః పరమాప్త లక్ష్మీస్సంశ్రోతుకామం జనకం శుకస్య ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

బ్రహ్మపుత్రుడగు ఆ సనత్కుమారుడు శుకుని తండ్రియగు వ్యాసుని ఆ మాటలను విని, పరమభక్తులకు సంపదలనొసంగు మహేశ్వరుని లీలలను వినగోరుచున్న ఆ మహర్షితో నిట్లనెను (12).

సనత్కుమార ఉవాచ.

పురాఽఽ గతో భక్తకృపాకరోఽసౌ కైలాసతశ్శైలసుతా గణాఢ్యః ।
విహర్తుకామః కిల కాశికాం వై స్వశైలతో నిర్జరచక్రవర్తీ ॥
స రాజధానీం చ విధాయ తస్యాం చక్రే పరోతీ స్సుఖదా జనానామ్ ।
తద్రక్షకం భైరవనామ వీరం కృత్వా సమం శైలజయా హి బహ్వీః ॥
స ఏకదా మందరనామధేయం గతో నగే తద్వర సుప్రభావాత్ ।
తత్రాపి నానా గణవీరముఖ్యై శ్శివాసమేతో విజహార భూరి ॥
పూర్వే దిశో మందర శైలసంస్థా కపర్దినశ్చండ పరాక్రమస్య ।
చక్రే తతో నేత్ర నిమీలనం తు సా పార్వతీ నర్మయుతం సలీలమ్ ॥
ప్రవాలహేమాబ్జ ధృత ప్రభాభ్యాం కరాంబుజాభ్యాం నిమిమీల నేత్రే ।
హరస్య నేత్రేషు నిమీలితేషు క్షణేన జాతస్సుమహాంధకారః ॥
తత్స్పర్శయోగాచ్చ మహేశ్వరస్య కరౌ చ తస్యాస్స్మలితం మదాంభః ।
శంభోర్లలాటే క్షణ వహ్నితప్తో వినిర్గతో భూరిజలస్య బిందుః ॥
గర్భో బభూవాథ కరాలవక్త్రో భయంకరః క్రోధపరః కృతఘ్నః ।
అంధో విరూపీ జటిలశ్చ కృష్ణో నరేతరో వైకృతికస్సురోమా ॥
గాయన్ హసన్ ప్రరుదన్నృత్యమానో విలేలిహానో ఘురఘోరఘోషః ।
జాతేన తేనాద్భుతదర్శనేన గౌరీం భవోఽసౌ స్మితపూర్వమాహ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

భక్తులయందు దయను వర్షించువాడు, దేవతలకు చక్రవర్తి అగు శివుడు పూర్వము పార్వతితో మరియు గణములతో ప్రకాశిస్తూ, విహరింపగోరి తన కైలాస పర్వతము నుండి కాశీ నగరమునకు విచ్చేసెను (13). ఆయన కాశీని రాజధానిగా చేసి, భైరవుడను వీరుని దానికి రక్షకునిగా నియమించి, పార్వతితో గూడి, జనులకు సుఖమును కలిగించే అనేకములగు గొప్ప లీలలను చేసెను (14). ఒకనా డాయన మందర పర్వతమునందలి శ్రేష్ఠమగు మాహాత్మ్యమును చూడగోరి అచటకు వెళ్లెను. ఆయన అచట కూడా ముఖ్యులగు అనేక గణాధ్యక్షులతో మరియు పార్వతీదేవితో గూడి అధికముగా విహరించెను (15). మందర పర్వతము యొక్క పూర్వ భాగమునందున్న ఆ పార్వతి భయంకర పరాక్రమము గలవాడు, జటాధారియగు శివుని కన్నులను అపుడు పరిహాసము కొరకై విలాసయుతముగా మూసెను (16). పగడములను, బంగారమును, పద్మమును పోలిన కాంతులు గల, పద్మమువంటి రెండు చేతులతో ఆమె కన్నులను మూసెను. శివుని మూడు కన్నులు మూయబడగానే క్షణకాలములో దట్టమగు చీకటి అలముకొనెను (17). ఆమె మహేశ్వరుని స్పృశించిన కారణముచే ఆమె చేతియందు ఉదయించిన మదజలము శంభుని మూడవకంటి యొక్క అగ్నిచే క్షణకాలము తపింపచేయబడి పెద్ద జలబిందువు రూపములో నిర్గమించెను (18). అపుడు గర్భము ఏర్పడి వికృతమగు

ముఖముతో భయమును గొల్పువాడు, క్రోధమే ప్రధానలక్ష్యముగా గలవాడు, కృతఘ్నుడు, గ్రుడ్డివాడు, విరూపి, జటలు గలవాడు, నల్లనివాడు, వికృతరూపము గలవాడు, అధికమగు రోమములు గలవాడు అగు అమానవుడు జన్మించెను (19). ఆతడు పాడుతూ, నవ్వుతూ, గట్టిగా ఏడ్చుచూ, నాట్యమును చేయుచూ, నాలుకను బయటపెట్టి భయంకరమగు శబ్దమును చేసెను. ఆ అద్భుతాకారుడు జన్మించగానే, శివుడు చిరునవ్వుతో పార్వతిని ఉద్దేశించి ఇట్లు పలికెను (20).

శ్రీ మహేశ ఉవాచ ।

నిమీల్య నేత్రాణి కృతం చ కర్మ బిభేషి సోఽ స్మాద్దయితే కథం త్వమ్ ।
గౌరీ హరాత్త ద్వచనం నిశమ్య విహస్యమానా ప్రముమోచ నేత్రే ॥
జాతే ప్రకాశే సతి ఘోరరూపో జాతోఽధకారాదపి నేత్రహీనః ।
తాదృగ్విధం తం చ నిరీక్ష్య భూతం పప్రచ్ఛ గౌరీ పురుషం మహేశమ్ ॥

శ్రీ మహేశ్వరుడిట్లు పలికెను –

ఓ ప్రియురాలా! నీవు కన్నులను మూయుట అను పనిని చేసి ఇపుడు దీనికి భయపడుచుంటివేల? శివుని ఈ మాటను విని పార్వతి నవ్వుతూ కన్నులపై నుండి చేతులను తీసివేసెను (21). వెలుతురు రాగానే పార్వతి, అంధకారమునుండి పుట్టుటచే కన్నులు లేనివాడు, భయంకరాకారుడు అగు ఆ విధమైన పురుషాకార ప్రాణిని గాంచి, మహేశ్వరుని ఇట్లు ప్రశ్నించెను (22).

గౌర్యువాచ।

కోఽయం విరూపో భగవన్ హి జాతో నావగ్రతో ఘోర భయంకరశ్చ ।
వదస్వ సత్యం మమ కిం నిమిత్తం సృష్టోఽథ వా కేన చ కస్య పుత్రః ॥

గౌరి ఇట్లు పలికెను –

హే భగవాన్! మన ఇద్దరి కళ్ల యెదుట జన్మించినవాడు, ఘోర భయంకరాకారుడు, వికృత రూపము గలవాడు అగు ఈతడు ఎవడు? నాకు సత్యమును చెప్పుడు. వీనిని ఎవరు ఎందులకు సృష్టించినారు? వీడు ఎవరి పుత్రుడు? (23)

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వా హరస్తద్వచనం ప్రియాయా లీలాకర స్సృష్టి కృతోఽధ రూపామ్ ।
లీలా కరాయాస్త్రి జగజ్జనన్యా విహస్య కించిద్భగవానువాచ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

లీలలను ప్రకటించునది, ముల్లోకములకు తల్లి, తనకు ప్రియురాలు అగు పార్వతియొక్క ఆ మాటలను విని లీలలను చేయు హర భగవానుడు కొద్దిగా నవ్వెను. ఆ గ్రుడ్డివానిని సృష్టించినది ఆమెయే. ఆయన ఇట్లనెను (24).

మహేశ ఉవాచ ।

శృణ్వంబికే హ్యద్భుత వృత్తకారే ఉత్పన్న ఏషోఽద్భుత చండవీర్యః ।
నిమీలితే చక్షుషి మే భవత్యా స స్వేదజో మేఽధకనామధేయః ॥
త్వం చాస్య కర్త్రస్య యథానురూపం త్వయా ససఖ్యా దయయా గణేభ్యః ।
స రక్షితవ్యస్త్వయి తం హి వైకం విచార్య బుద్ధ్యా కరణీయ మార్యే ॥

మహేశ్వరుడిట్లు పలికెను

ఓ అంబికా! వినుము. నీవు అద్భుతమగు చర్యలను చేయుచుందువు. నీవు నా కన్నులను మూసినపుడు స్వేదము నుండి ఈ అద్భుత భయంకర పరాక్రమము గల బాలుడు పుట్టినాడు. వీని పేరు అంధకుడు (25). ఓ పూజ్యురాలా! వీనిని సృష్టించినది నీవే. నీవు, నీ చెలికత్తెలు వీనిని యథా యోగ్యముగా పాలించుడు. వీనిని గణముల బారినుండి రక్షించుచుండుడు. వీడు నీపై ఆధారపడియున్నాడు. నీవు నీ బుద్ధితో ఆలోచించి తగిన విధముగా చేయవలసినది (26).

సనత్కుమార ఉవాచ ।

గౌరీ తతో భర్తృవచో నిశమ్య కారుణ్య భావాత్సహితా సఖీభిః ।
నానా ప్రకారైర్బహుభిర్వ్యుపాయైశ్చకార రక్షాం స్వసుతస్య యద్వత్ ॥
కాలేఽ థ తస్మిన్ శిశిరే ప్రయాతో హిరణ్య నేత్ర స్త్వథ పుత్రకామః ।
స్వజ్యేష్ఠ బంధోస్తనయ ప్రతానం సంవీక్ష్య చానీత్ప్రియయా నియుక్తః ॥
అరణ్య మాశ్రిత్య తపశ్చకా రాసురస్తదా కశ్యపజస్సుతార్థమ్ ।
కాష్ఠోపమోఽ సౌ జితరోషదోషస్సం దర్శనార్థం తు మహేశ్వరస్య ॥
తుష్టః పినాకీ తపసాస్య సమ్యగ్వర ప్రదానాయ యయౌ ద్విజేంద్ర ।
తత్ స్థానమాసాద్య వృషధ్వజోఽ సౌ జగాద దైత్య ప్రవరం మహేశః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అపుడు పార్వతి భర్తయొక్క పలుకులను విని దయతో నిండిన హృదయము గలదై తన సఖురాండ్రతో గూడి అంధకుని తన పుత్రుని వలె అనేకములగు ఉపాయములచే రక్షించెను (27). ఆ కాలములో హిరణ్యాక్షుని ప్రియురాలు ఆతని అన్నగారికి బహుపుత్రులుండుటను గాంచి హిరణ్యాక్షుని తపస్సును చేయుమని నియోగించగా, ఆతడు పుత్రార్థియై తపస్సు కొరకు శిశిర ఋతువులో బయలుదేరెను (28). అపుడు కశ్యపుని కుమారుడగు ఆ హిరణ్యాక్షుడు అడవిలో నుండి పుత్రార్థియై క్రోధాది దోషములను జయించి మహేశ్వరుని దర్శనము కొరకై స్తంభము వలె కదలిక లేకుండగా తపస్సును చేసెను (29). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా ! పినాకధారి, వృషభధ్వజుడు అగు మహేశ్వరుడు ఆతని తపస్సునకు ప్రసన్నుడై చక్కని వరమునీయగోరి ఆ స్థానమునకు వెళ్లి ఆ రాక్షస వీరునితో నిట్లనెను (30).

మహేశ ఉవాచ ।

హే దైత్యనాథ కురు నేంద్రియ సంఘపాతం కిమర్థమేతద్వ్రతమాశ్రితం తే ।
ప్రబ్రూహి కామం వరదో భవోఽహం యదిచ్ఛసి త్వం సకలం దదామి ॥

మహేశ్వరుడిట్లు పలికెను –

ఓ దానవవీరా! ఈ దేహేంద్రియ సంఘాతము కుప్పకూలునంతటి తపస్సును చేయకుము. నీవు౦ ఈ దీక్షను స్వీకరించుటకు కారణమేమి? నీ కోర్కెను వెల్లడించుము. నేను వరములనిచ్చు శివుడను. నీవు కోరిన వరములనన్నిటినీ ఇచ్చెదను (31).

సనత్కుమార ఉవాచ ।

సరస్యమాకర్ణ్య మహేశవాక్యం హృతి ప్రసన్నః కనకాక్షదైత్యః ।
కృతాంజలిర్నమ్రశిరా ఉవాచ స్తుత్వా చ నత్వా వివిధం గిరీశమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

మహేశ్వరుని ప్రీతి పూర్వకమగు ఈ పలుకులను విని హిరణ్యాక్షాసురుడు మిక్కిలి ప్ర౦సన్నుడై చేతులు జోడించి శిరసు వంచి కైలాసవాసుని పరిపరి విధముల స్తుతించి ప్రణమిల్లి ఇట్లు పలికెను (32).

హిరణ్యాక్ష ఉవాచ ।

పుత్రస్తు మే చంద్రలలాట నాస్తి సువీర్యవాన్ దైత్యకులానురూపీ ।
తదర్థమేత ద్వ్రతమాస్థితోఽహం తం దేహి దేవేశ సువీర్యవంతమ్ ॥
యస్మాచ్చ మద్భ్రాతు రనంత వీర్యాః ప్రహ్లాదపూర్వా అపి పంచ పుత్రాః ।
మమేహ నాస్తీతి గతాన్వయోఽహం కో మామకం రాజ్యమిదం బుభూషేత్ ॥
రాజ్యం పరస్య స్వబలేన హృత్వా భుంక్తేఽ థవా స్వం పితురేవ దృష్టమ్ ।
చ ప్రోచ్యతే పుత్ర ఇహాత్యముత్ర పుత్రీ స తేనాపి భవేత్పితాసౌ ॥
ఊర్ధ్వం గతిః పుత్రవతాం నిరుక్తా మనీషిభిర్ధర్మభృతాం వరిష్ఠైః ।
సర్వాణి భూతాని తదర్థమేవమతః ప్రవర్తేత పశూన్ స్వతేజసః ॥
నిరన్వయస్యాథ న సంతి లోకాస్త దర్థమిచ్ఛంతి జనాస్సురేభ్యః ।
సదా సమారాధ్య సురాత్రి పంకజం యాచంత ఇత్థం సుతమేకమేవ ॥

హిరాణ్యక్షుడిట్లు పలికెను –

ఓ చంద్రశేఖరా! నాకు గొప్ప పరాక్రమశాలి, రాక్షస వంశమునకు తగినవాడు అగు కొడుకు లేడు. ఓ దేవదేవా! నేను పుత్రుని గోరి ఈ వ్రతమును చేబట్టితిని. గొప్ప పరాక్రమశాలియగు పుత్రుని ఇమ్ము (33). నా సోదరునకు గొప్ప పరాక్రమము గల అయిదుగురు కొడుకులు గలరు. వారిలో ప్రహ్లాదుడు పెద్దవాడు. నాకు పుత్రులు లేరు. ఈ లోకములో నా వంశము లేకుండా పోవును. నా ఈ

రాజ్యమునకు వారసులెవరు గలరు? (34) తన పరాక్రమముచే శత్రురాజ్యమును ఆక్రమించి అనుభవించినవాడు, లేదా తండ్రి నుండి లభించిన స్వీయ రాజ్యము ననుభవించువాడు పుత్రుడనబడును. అట్టి పుత్రుని వలన మాత్రమే వ్యక్తి తండ్రియను పదమునకు అర్హుడగును. అట్టి తండ్రి ఇహపరములలో సుఖించును (35). పుత్రుడు గలవారు ఊర్ధ్వలోకములను పొందెదరని ధర్మవేత్తలలో శ్రేష్ఠులగు మహర్షులు చెప్పుచున్నారు. సర్వప్రాణులు సంతానము కొరకు ప్రవర్తిల్లు చున్నవి. కావున వ్యక్తి తన తేజస్సును సంతానము రూపములో గాంచవలెను (36). వంశాంకురము లేని వానికి పుణ్యలోకములు లేవు. కావుననే జనులు సర్వదా దేవతల నారాధించి వారినుండి ఒక పుత్రుని కోరుచున్నారు (37).

సనత్కుమార ఉవాచ ।

ఏతద్వచస్తద్వచనం నిశమ్య కృపాకరో దైత్యనృపస్య తుష్టః ।
తమాహ దైత్యాతపనాస్తి పుత్రస్త్వద్వీర్యజః కింతు దదామి పుత్రమ్ ॥
మమాత్మజం త్వంధకనామధేయం త్వత్తుల్య వీర్యం త్వపరాజితం చ ।
వృణీష్వ పుత్రం సకలం విహాయ దుఃఖం ప్రతీచ్ఛస్వ సుతం త్వమేవ ॥
ఇత్యేవ ముక్త్వా ప్రదదౌ స తస్మై హిరణ్య నేత్రాయ సుతం ప్రసన్నః ।
హరస్తు గౌర్యా సహితో మహాత్మా భూతా ధినాథస్త్రి పురారి రుగ్రః ॥
నతో హరా త్ప్రాప్య సుతం స దైత్యః ప్రదక్షిణీ కృత్య యథా క్రమేణ ।
స్తోత్రైరనే కైరభిపూజ్య రుద్రం తుష్టస్స్వరాజ్యం గతవాన్మహాత్మా ॥
తతస్తు పుత్రం గిరిశాదవాప్య రసాతలం చండ పరాక్రమస్తు ।
ఇమాం ధరిత్రీ మనయత్స్వ దేశం దైత్యో విజిత్వా త్రిదశానశేషాన్ ॥
తతస్తు దేవైర్మునిభిశ్చ సిద్ధై స్సర్వాత్మకం యజ్ఞమయం కరాలమ్ ।
వారాహమాశ్రిత్య వపుః ప్రధానమారాధితో విష్ణురనంతవీర్యః ॥
ఘోణా ప్రహారైర్వివిధైర్ధరిత్రీం విదార్య పాతాలతలం ప్రవిశ్య ।
తుండేన దైత్యాన్ శతశో విచూర్ణ్య దంష్ట్రాభిరగ్ర్యాభిరఖండితాభిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

దయానిధియగు శివుడు రాక్షస చక్రవర్తి యొక్క ఆ మాటను విని సంతసించి ఆతని◌ితో నిట్లనెను. ఓ రాక్షస రాజా! నీ వీర్యము వలన పుత్రుడు జన్మించు అవకాశము లేదు. కాని నీకు పుత్రుని ఇచ్చెదను (38). అంధకుడను పేరు గల నా పుత్రుడు నీతో సమమగు పరాక్రమము గలవాడు, పరాజయము నెరుంగని వాడు. దుఃఖము నంతనూ వీడి నీవు వానిని పుత్రునిగా ఎన్నుకొని స్వీకరించుము (39). గౌరీ సమేతుడు, మహాత్ముడు, పశుపతి, త్రిపురాంతకుడు, ఉగ్రుడు, పాపహారి అగు శివుడు ప్రసన్నుడై ఇట్లు పలికి ఆ హిరణ్యాక్షునకు పుత్రుని ఇచ్చెను (40). మహాత్ముడగు ఆ రాక్షసుడు శివుని నుండి పుత్రుని పొంది వరుసగా పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణము చేసి, ఆ రుద్రుని అనేక స్తోత్రములతో చక్కగా

పూజించి ఆనందముతో తన రాజ్యమునకు వెళ్లెను (41). భయంకరమగు పరాక్రమము గల ఆ రాక్షసుడు శివుని నుండి పుత్రుని పొంది, తరువాత దేవతలనందరినీ జయించి ఈ భూమిని తన రసాతల దేశమునకు గొనిపోయెను (42). అపుడు దేవతలు, మునులు, సిద్ధులు ఆరాధించగా అనంత శక్తిమంతుడగు విష్ణువు సర్వయజ్ఞాత్మకము, భయంకరము, శ్రేష్ఠము అగు వరాహ దేహమును దాల్చి (43), తన ముఖముతో భూమిని అనేక పర్యాయములు కొట్టి చీల్చి పాతాళ లోకములో ప్రవేశించి, తన ముఖముతో మరియు భయంకరములగు పదునైన కోరలతో చాలామంది దైత్యులను సంహరించెను (44).

పాద ప్రహారైరగని ప్రకాశైరున్మథ్య సైన్యాని నిశాచరాణామ్ ।
మార్తండకోటి ప్రతిమేన పశ్చాత్సు దర్శనేనాద్భుతతుండ తేజాః ॥
హిరణ్య నేత్రస్య శిరో జ్వలంతం చిచ్ఛేద దైత్యాంశ్చ దదాహ దుష్టాన్ ।
తతః ప్రహృష్టో దితిజేంద్రరాజం స్వమంధకం తత్ర స చాభ్యషించత్ ॥
స్వస్థాన మాగత్య తతో ధరిత్రీం దంష్ట్రాంకురేణోద్ధరతః ప్రహృష్టః ।
భూమిం చ పాతాల తలాన్మహాత్మా పుపోష భాగం త్వథ పూర్వకం తు ॥
దేవైస్సమస్తైర్మునిభిః ప్రహృష్టైరభిష్టుతః పద్మభువా చ తేన ।
యయౌ స్వలోకం హరిరుగకాయో వరాహరూపస్తు సుకార్యకర్తా ॥
హిరణ్యనేత్రే ఽథ హతేఽ సురేశే వరాహరూపేణ సురేణ దేవాః ।
దేవాస్సమస్తా మునయశ్చ సర్వే పరే చ జీవాస్సుఖినో బభూవుః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే హిరణ్యాక్ష వధో నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥

అద్భుతమగు తుండము యొక్క ప్రకాశము గల ఆ వరాహమూర్తి పిడుగుల వంటి పాదముల దెబ్బలతో రాక్షస సైన్యములను నశింపజేసి, తరువాత కోటి సూర్యుల కాంతి కలిగిన సుదర్శన చక్రముతో (45), హిరణ్యాక్షుని ప్రకాశించే తలను నరికి దుష్టులగు రాక్షసులను సంహరించెను. అపుడాయన సంతసించి వాని పుత్రుడగు అంధకుని పాతాళ రాజ్యమునందు రాక్షసచక్రవర్తిగా అభిషేకించెను (46). ఆయన భూమిని పాతాళము నుండి తన దంష్ట్రల అగ్రభాగములతో పైకి లేవనెత్తను. ఆ మహాత్ముడు భూమిని పూర్వస్థానములో ప్రతిష్ఠించి ఆనందముతో స్వస్థానమును చేరుకొనెను (47). విష్ణువు వరాహముయొక్క భయంకరమగు దేహమును దాల్చి గొప్ప కార్యమును పూర్తిచేసెను. సర్వదేవతలు, మునులు ఆనందముతో ఆయనను స్తుతించిరి. బ్రహ్మకూడ స్తుతించుచుండగా ఆయన తన లోకమునకు వెళ్లెను (48). విష్ణువు వరాహరూపముతో రాక్షసేశ్వరుడగు హిరణ్యాక్షుని వధించగా, సర్వదేవతలు, మునులు, ఇతర సకల ప్రాణులు సుఖమును పొందిరి (49).

43 – హిరణ్య కశిపుని నృసింహుడు వధించుట

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ హతే తస్మిన్ సురద్రుహి ।
కిమకార్షీత్తతస్తస్య జ్యేష్ఠ భ్రాతా మహాసురః ॥
కుతూహలమితి శ్రోతుం మమా ఒతీహ మునీశ్వర ।
తచ్ఛ్రావయ కృపాం కృత్వా బ్రహ్మపుత్ర నమో ఒస్తు తే ॥

వ్యాసుడిట్లు పలికెను –

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. సురద్రోహియగు ఆ హిరణ్యాక్షుడు సంహరింపబడిన తరువాత వాని పెద్ద సోదరుడగు మహా రాక్షసుడు ఏమి చేసెను? (1) ఓ మహర్షీ! ఈ విషయమును వినవలెనని నాకు ఇప్పుడు చాల కుతూహలము గలదు. కావున దయచేసి వినిపించుము. ఓ బ్రహ్మపుత్రా! నీకు నమస్కారమగు గాక! (2)

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్య స మునీశ్వరః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఆ వ్యాసుని ఈ మాటలను విని ఆ సనత్కుమార మహర్షి శివుని పాద పద్మములను స్మరించి ఇట్లు పలికెను (3).

సనత్కుమార ఉవాచ ।

భ్రాతర్యేవం వినిహతే హరిణా క్రోడమూర్తినా ।
హిరణ్య కశిపుర్వ్యా స పర్యతప్య ద్రుషా శుచా ॥
తతః ప్రజానాం కదనం విధాతుం కదన ప్రియాన్ ।
నిర్దదేశాసురాన్ వీరాన్ హరివైర ప్రియో హి సః ॥
అథ తే భర్తృ సందేశమాదాయ శిరసాఽ సురాః ।
దేవ ప్రజానాం కదనం విదధుః కదనప్రియాః ॥
తతో విప్రకృతే లోకేఽ సురైస్తైర్దుష్టమానసైః ।
దివం దేవాః పరిత్యజ్య భువి చేరురలక్షితాః ॥
హిరణ్య కశిపుర్భ్రాతు స్సంపరేతస్య దుఃఖితః ।
కృత్వా కరోదకాదీని తత్కల త్ర్యసాంత్వయత్ ॥
తతస్స దైత్య రాజేంద్రో హ్య జేయమజరామరమ్ ।
ఆత్మానమ ప్రతి ద్వంద్వ మేకరాజ్యం వ్యధిత్సత ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! వరాహమూర్తిని దాల్చి విష్ణువు తన సోదరుని ఈ తీరున సంహరించగా, హిరణ్యకశిపుడు కోపముతో దుఃఖముతో పరితపించెను (4): విష్ణువుతో వైరమునందు మక్కువగల ఆతడు అపుడు యుద్ధ ప్రియులు వీరులు అగు అసురులను ప్రజలలో కలహములను సృష్టించమని ఆదేశించెను (5). అపుడు కలహప్రియులగు ఆ రాక్షసులు తమ రాజుయొక్క ఆజ్ఞను శిరసా వహించి దేవతలకు, ప్రజలకు కలహములను సృష్టించిరి (6). దుష్ట బుద్ధులగు ఆ రాక్షసులచే లోకము కల్లోలితము చేయబడగా దేవతలు స్వర్గమును వీడి అదృశ్య రూపముతో భూమిపై తిరుగాడిరి (7). హిరణ్యకశిపుడు సోదరుని మరణమునకు దుఃఖించి వాని భార్యను ఇతరులను ఓదార్చి తర్పణాదులను చేసెను (8). అపుడా రాక్షస చక్రవర్తి తనను జరామరణములు లేని వానినిగను, పరాజయములేని వానినిగను, తన ఏకచ్ఛత్రాధిపత్యమును నిష్కంటకముగను చేసుకొనెను (9).

సతేపే మందర ద్రోణ్యాం తపః పరమదారుణమ్ ।
ఊర్ధ్వ బాహుర్నభోదృష్టిః పాదాంగుష్ఠా శ్రితావనిః ॥
తస్మింస్తపస్తప్యమానే దేవాస్సర్వే బలాన్వితాః ।
దైత్యాన్ సర్వాన్ వినిర్జిత్య స్వాని స్థానాని భేజిరే ॥
తస్య మూర్ధ్న స్సముద్భూత స్సధూమో ఒగ్ని స్తపోమయః ।
తిర్యగూర్ధ్వమధోలో కానతపద్విష్వ గీరితః ॥
తేన తప్తా దివం త్యక్త్వా బ్రహ్మలోకం యయుస్సురాః ।
ధాత్రే విజ్ఞాపయామాసుస్తత్తపో వికృతాననాః ॥
అథ విజ్ఞాపితో దేవైర్వ్యాస తైరాత్మ భూర్విభిః ।
పరీతో భృగు దక్షాద్యైర్యయౌ దైత్యేశ్వరా శ్రమమ్ ॥
ప్రతాప్య లోకానఖిలాంస్తతో ఒసౌ సమాగతం పద్మభువం దదర్శ ।
వరం హి దాతుం తమువాచ ధాతా వరం వృణీష్వేతి పితామహోఽపి ।
నిశమ్య వాచం మధురాం విధాతుర్వచోఽ బ్రవీదేవమమూఢ బుద్ధిః ॥

ఆతడు మందర పర్వతము నందలి కందరములో నేలపై కాలి బొటన వేలిపై నిలబడి ఆకాశము వైపునకు చూస్తూ చేతులను పైకెత్తి మిక్కిలి ఉగ్రమగు తపస్సును చేసెను (10). ఆతడు తపస్సును చేయుచుండగా బలవంతులైన దేవతలందరు రాక్షసుల నందరినీ జయించి తమ తమ స్థానములను కైవసము చేసుకొనిరి (11). వాని శిరస్సునుండి బయలుదేరిన, తపోరూపమైన, పొగతో గూడిన అగ్ని భూతలమునకు సమాంతరముగా క్రిందికి పైకి సర్వత్రా వ్యాపించి ప్రాణులను తపింపజేసెను (12). దానిచే తాపమును పొంది, ఆ తపస్సు యొక్క ప్రభావముచే వికృతములైన ముఖములు గల దేవతలు స్వర్గమును విడిచి బ్రహ్మలోకమునకు వెళ్లి బ్రహ్మకు విన్నవించిరి (13). ఓ వ్యాసా! అపుడు దేవతల విన్నపమును మన్నించి స్వయంభువుడగు బ్రహ్మ భృగుదక్షాదులు వెంట రాగా ఆ

రాక్షస రాజు యొక్క ఆశ్రమమునకు వెళ్లెను (14). ఆతడీ విధముగా ముల్లోకములను తపింపజేయుచూ, తనకు వరము నిచ్చుటకై విచ్చేసిన పద్మ సంభవుడగు బ్రహ్మను గాంచెను. పితామహుడగు బ్రహ్మ ఆతనితో 'వరమును కోరుకొనుము' అని పలుకగా, బ్రహ్మ యొక్క ఆ మధురమగు వాక్యమును విని బుద్ధిమంతుడగు హిరణ్య కశిపుడు ఇట్లు పలికెను (15).

హిరణ్య కశిపురువాచ ।

మృత్యోర్భయం మే భగవన్ ప్రజేశ పితామహా భూన్న కదాపి దేవ ।
శస్త్రాస్త్ర పాశాశని శుష్క వృక్ష గిరీంద్రతో యాగ్ని రిపు ప్రహారైః ॥
దేవైశ్చ దైత్యైర్మునిభిశ్చ సిద్ధైస్త్వత్సృష్టజీ వైర్బహు వాక్యతః కిమ్ ।
స్వర్గే ధరణ్యాం దివసే నిశాయాం నైవోర్ధ్వతో నాప్యధతః ప్రజేశ ॥

హిరణ్య కశిపుడిట్లు పలికెను –

హే భగవన్! ప్రజాపతీ! పితామహా! దేవా! నాకు శత్రువులచే ప్రయోగింపబడే శస్త్రములు, అస్త్రములు, వజ్రము, ఎండు చెట్లు, పర్వతరాజములు, నీరు, నిప్పు ఇత్యాదులచే మరణ భయము లేకుండుగాక! (16) ఇన్ని మాటలేల? ఓ ప్రజాపతీ! నాకు దేవతలు, దైత్యులు, మునులు, సిద్ధులు మరియు నీచే సృష్టింపబడిన జీవుల చేతిలో, స్వర్గమునందు గాని, భూమియందుగాని, పగలు గాని, రాత్రి గాని, పైన గాని, క్రింద గాని మృత్యువు లేకుండు గాక! (17)

సనత్కుమార ఉవాచ ।

తస్యైతదీదృగ్వచనం నిశమ్య దైత్యేంద్ర తుష్టోఽస్మి లభస్వ సర్వమ్ ।
ప్రణమ్య విష్ణుం మనసా తమాహ దయాన్వితోఽ సావతి పద్మయోనిః ॥
అలం తపస్తే పరిపూర్ణ కామస్సమాస్సహస్రాణి చ షణ్ణవత్యా ।
ఉత్తిష్ఠ రాజ్యం కురు దానవానాం శ్రుత్వా గిరం తత్సుముఖో బభూవ ॥
రాజ్యాభిషిక్తః ప్రపితామహేన త్రైలో క్యనాశాయ మతిం చకార ।
ఉత్సాద్య ధర్మాన్ సకలాన్ ప్రమత్తో జిత్వాఽఽహవే సోఽపి సురాన్ సమస్తాన్ ॥
తతో భయాదింద్రముఖాశ్చ దేవాః పితామహాజ్ఞాం సమవాప్య సర్వే ।
ఉపద్రుతా దైత్యవరేణ జాతాః క్షీరోదధిం యత్ర హరిస్తు శేతే ॥
ఆరాధయా మాసురతీవ విష్ణుం స్తుత్వా వచో భిస్సుఖదం హి మత్వా ।
నివేదయామాసురథో ప్రసన్నం దుఃఖం స్వకీయం సకలం హి తేతే ॥
శ్రుత్వా తదీయం సకలం హి దుఃఖం తుష్టో రమేశః ప్రదదౌ వరాంస్తు ।
ఉత్థాయ తస్మాచ్ఛయనాదుపేంద్రో నిజానురూపైర్విబుధైర్వచోభిః ॥
ఆశ్వాస్య దేవానఖిలాన్ మునీన్ వా ఉవాచ వైశ్వానర తుల్య తేజాః ।
దైత్యం హనిష్యే ప్రసభం సురేశాః ప్రయాత ధామాని నిజాని తుష్టాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఆతని ఈ మాటను విని పద్మ సంభవుడగు బ్రహ్మ దయ గలవాడై మనస్సులో విష్ణువునకు ప్రణమిల్లి 'ఓ రాక్షసవీరా! నేను ప్రసన్నుడనైతిని ; నీవు కోరిన సర్వమును పొందుము' అని పలికెను (18). 'నీవు తపస్సును చాలించుము. నీ కోరిక పరిపూర్తిని చెందినది. నీవు తొంభై ఆరువేల సంవత్సరములు తపస్సును చేసితివి. లెమ్ము. దానవ రాజ్యము నేలుము' అను మాటను విని ఆతడు తపస్సు విరమించుటకు సుముఖతను గనబరచెను (19). బ్రహ్మచే రాజ్యమునందు అభిషిక్తుడైన ఆతడు ముల్లోకములను నాశనము చేయ నిశ్చయించుకొని గర్వించిన వాడై, సమస్త ధర్మముల నుల్లంఘించెను. ఆతడు సమస్త దేవతలను యుద్ధములో జయించెను (20). అపుడు ఆ రాక్షస వీరునిచే పీడింపబడిన ఇంద్రాది దేవతలందరు భయభీతులై ప్రజాపతి యొక్క అనుమతిని పొంది విష్ణువు నిద్రిస్తున్న క్షీరసముద్ర ప్రాంతమునకు వెళ్లిరి (21). విష్ణువు తమకు సుఖమును ఈయగలడని భావించిన ఆ దేవతలు ఆయనను మిక్కుటముగా ఆరాధించి వచనములతో స్తుతించిరి. అపుడు ప్రసన్నుడైన విష్ణువునకు వారు తమ దుఃఖము నంతనూ వివరించిరి (22). వారి దుఃఖము నంతనూ విని ఇంద్రుని అనుజుడు, లక్ష్మీపతి యగు విష్ణువు సంతసించి ఆ తల్పముపై నుండి లేచి తన స్థాయికి తగిన వివిధ వచనములను పలికి వారికి వరముల నిచ్చెను (23). వైశ్వానరాగ్నితో సమానమగు తేజస్సు గల విష్ణువు సర్వదేవతలను, మునులను కూడ ఓదార్చి, ఓ దేవ వీరులారా! నేను బలమును ప్రయోగించి ఆ రాక్షసుని సంహరించెదను; మీరు సంతోషముతో మీ ధామములకు వెళ్లుడు' అని పలికెను (24).

శ్రుత్వా రమేశస్య వచస్సురేశాశ్శక్రాదికాస్తే నిఖిలాస్సుతుష్టాః ।
యయుస్స్వధామాని హిరణ్య నేత్రానుజం చ మత్వా నిహతం మునీశ ॥
ఆశ్రిత్య రూపం జటిలం కరాలం దంష్ట్రాయుధం తీక్ష్ణ నఖం సునాసమ్ ।
సైంహం చ నారం సువిదారితాస్యం మార్తండకోటి ప్రతిమం సుఘోరమ్ ॥
యుగాంత కాలాగ్ని సమప్రభావం జగన్మయం కిం బహుభిర్వచోభిః ।
అస్తం రవౌ సోఽపి హి గచ్ఛతీశో గతోఽ సురాణాం నగరీం మహాత్మా ॥
కృత్వా చ యుద్ధం ప్రబలైస్స దైత్యైర్హత్వాథ తాన్ దైత్య గణాన్ గృహీత్వా ।
బభ్రామ తత్రాద్భుత విక్రమశ్చ బభంజ తాంస్తానసురాన్నృసింహః ॥
దృష్టస్స దైత్యైరతుల ప్రభావస్తే రేభిరే తేహి తథైవ సర్వే ।
సింహం చ తం సర్వమయం నిరీక్ష్య ప్రహ్లాదనామా దితిజేంద్రపుత్రః ।
ఉవాచ రాజానమయం మృగేంద్రో జగన్మయః కిం సముపాగతశ్చ ॥

ఓ మహర్షీ! ఆ ఇంద్రాది దేవనాయకులందరు విష్ణువు యొక్క వచనములను విని, హిరణ్యాక్షుని సోదరుడు మరణించినట్లే యని భావించి, చాల సంతోషముతో తమ నెలవులకు వెళ్లిరి (25). జూలుతో ప్రకాశించునది, భయంకరమగు ఆకారము గలది, దంష్ట్రలే ఆయుధములుగా గలది, వాడి గోళ్లు గలది, సుందరమగు ముక్కు గలది, తెరచిన పెద్ద నోరు గలది, కోటి సూర్యుల కాంతి గలది, మిక్కిలి ఘోరమైనది, ప్రళయకాలాగ్నిని బోలిన ప్రభావము గలది, జగత్తును అధికముగా వ్యాపించిన రూపము గలది అగు నృసింహాకారమును విష్ణువు దాల్చెను. ఇన్ని మాటలేల? మహాత్ముడు, ఈశ్వరుడునగు ఆ విష్ణువు సూర్యాస్తమయకాలములో హిరణ్యకశిపుని నగరమునకు వెళ్లెను (26,27). అద్భుతమగు పరాక్రమముగల ఆ నృసింహుడు బలశాలురగు రాక్షసులతో యుద్ధమును చేసి ఆ రాక్షస గణములను ఒడిసి పట్టి సర్వత్రా తిరుగుతూ, ఆ రాక్షసులను మట్టు పెట్టెను (28). సాటిలేని ప్రభావము గల ఆ నృసింహుని రాక్షసులందరు చూచిరి. సర్వమును ఆక్రమించియున్న ఆ సింహమును గాంచి హిరణ్య కశిపుని పుత్రుడగు ప్రహ్లాదుడు రాజుతో నిట్లనెను : జగత్స్వరూపుడగు పరమాత్మ నృసింహరూపములో ఇట్లు వచ్చుటకు కారణమేమి? (29)

ప్రహ్లాద ఉవాచ ।

ఏష ప్రవిష్టో భగవాననంతో నృసింహమాత్రో నగరం త్వదంతః ।
నివృత్య యుద్ధాచ్ఛరణం ప్రయాహి పశ్యామి సింహస్య కరాలమూర్తిమ్ ॥
యస్మాన యోద్ధా భువనత్రయేఽ పి కురుష్వ రాజ్యం వినమన్మృగేంద్రమ్ ।
శ్రుత్వా స్వపుత్రస్య వచో దురాత్మా తమాహ భీతోఽ సి కిమత్ర పుత్ర ॥
ఉక్త్వేతి పుత్రం దితి జాధినాథో దైత్యర్షభాన్ వీరవరాన్ స రాజా ।
గృహ్ణంతు వై సింహమముం భవంతో వీరా విరూప భ్రుకుటీక్షణం తు ॥
తస్యాజ్ఞయా దైత్య వరాస్తతస్తే గ్రహీతుకామా వివిశుర్మృగేంద్రమ్ ।
క్షణేన దగ్ధాశ్శలభా ఇవాగ్నిం రూపాఖిలాషాత్ ప్రవివిక్షవో వై ॥
దైత్యేషు దగ్ధేష్వపి దైత్యరాజశ్చకార యుద్ధం స మృగాధిపేన ।
శస్త్రైస్సమ గ్రైరఖిలైస్త థాస్త్రై శ్శక్త్యర్షి పాశాంకుశపావ కాద్యైః ॥
సంయుధ్య తోరేవ తయోర్జగామ బ్రాహ్మం దినం వ్యాస హి శస్త్రపాణ్యోః ।
ప్రవీరయోర్వీర రవేణ గర్జతోః పరస్పరం క్రోధ సుయుక్తచేతసోః ॥
తతస్స దైత్యస్సహసా బహూంశ్చ కృత్వా భుజాన్ శస్త్ర యుతాన్నిరీక్ష్య ।
నృసింహరూపం ప్రయయౌ మృగేంద్రం సంయుధ్యమానం సహసా సమంతాత్ ॥

ప్రహ్లాదుడిట్లు పలికెను -

ఈ అనంత భగవానుడు నృసింహరూపములో నీ నగరములోపల ప్రవేశించినాడు. కావున నీవు యుద్ధము నుండి విరమించి శరణు పొందుము. నాకు సింహము యొక్క భయంకరాకారము కానవచ్చుచున్నది (30). ఆయనతో పోరాడగల మొనగాడు ముల్లోకములలో లేడు. కావున నీవా నరసింహునకు ప్రణమిల్లి రాజ్యమును కాపాడుకొనుము. తన కొడుకు చెప్పిన ఈ మాటలను విని ఆ దుర్బుద్ధి, 'ఓ పుత్రా! నీవిపుడు భయపడుచున్నావా ఏమి?' అని పలికెను (3 1). పుత్రునితో నిట్లు పలికి ఆ రాక్షస చక్రవర్తి కోపముతో ముడివడిన కనుబొమలు గలవాడై గొప్ప వీరులగు రాక్షస శ్రేష్ఠులను, 'ఈ సింహమును వీరులగు మీరు చెరబట్టుడు' అని ఆదేశించెను (32). ఆతని ఆజ్ఞను పొంది ఆ రాక్షస వీరులు నృసింహుని పట్టుకొనబోయి. అగ్నియొక్క రూప సౌందర్యమును ప్రేమించి దానిలో ప్రవేశించే మిడతల వలె క్షణకాలములో మాడి మసి అయిరి (33). ఆ వీరులు మరణించిననూ రాక్షస చక్రవర్తి నృసింహమూర్తితో యుద్ధమును చేసి, సమస్త- ఆయుధములను, ఆగ్నేయాద్యస్త్రములను, శక్తి, చురిక, పాశము, అంకుశము ఇత్యాది ఆయుధములను ప్రయోగించెను (34). ఓ వ్యాసా! మహావీరులగు వారిద్దరు సింహనాదములను గర్జనలను చేయుచూ పరస్పరము కోపముతో నిండిన హృదయములు గలవారై శస్త్రములను చేతులయందు ధరించి యుద్ధమును చేయుచుండగా బ్రహ్మ యొక్క ఒక పగలు కాలము గడిచి పోయెను (35). అపుడా రాక్షసుడు శస్త్రములను దాల్చిన అనేక భుజములు గలవాడై, యుద్ధము చేయుచున్న ఆ నృసింహుని మీదకు వేగముగా అన్ని వైపుల నుండి దాడిచేసెను (36).

తతస్సు యుద్ధం త్వతిదుస్సహం తు శస్త్రైస్సమస్తైశ్చ తథాఖిలాస్త్రైః ।
కృత్వా మహాదైత్యవరో నృసింహం క్షయం గతైః శ్శూలధరోఽ భ్యుపాయాత్
॥
తతో గృహీతస్స మృగాధిపేన భుజైరనేకైర్గిరిసారవద్భిః ।
నిధాయ జానౌ స భుజాంతరేషు నఖాంకురైర్దానవమర్మభిద్భిః ॥
నఖాస్త్ర హృత్పద్మమసృగ్విమిశ్రముత్పాట్య జీవాద్విగతః క్షణేన ।
త్యక్తస్తదానీం స తు కాష్ఠభూతః పునః పునశ్చూర్ణిత సర్వగాత్రః ॥
తస్మిన్ హతే దేవరిపౌ ప్రసన్నః ప్రహ్లాదమామంత్ర్యా కృత ప్రణామమ్ ।
రాజ్యేఽ భిషిద్యాద్భుతవీర్య విష్ణుస్తతః ప్రయాత్ గతిమ ప్రతర్క్యా మ్ ॥
తతోఽ తిహృష్టాస్సకలాస్సురేశాః ప్రణమ్య విష్ణుం దిశి విప్ర తస్యామ్ ।
యయుస్స్వధామాని పితామహాద్యాః కృతస్వకార్యం భగవంతమీడ్యమ్ ॥

ప్రవర్ణితం త్వంధకజన్మ రుద్రాద్ధిరణ్య నేత్రస్య మృతిర్వరాహాత్ ।
నృసింహతస్తత్సహజస్య నాశః ప్రహ్లాదరాజ్యాప్తిరితి ప్రసంగాత్ ॥
శృణు త్విదానీం ద్విజవర్య మత్తోంధక ప్రభావం భవకృత్య లబ్ధమ్ ।
హరేణ యుద్ధం ఖలు తస్య పశ్చాద్గణాధిపత్యం గిరిశస్య తస్య ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే
హిరణ్యకశిపు వధవర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥

తరువాత ఆ రాక్షస శ్రేష్ఠుడు సమస్త శస్త్రములతో మిక్కిలి దుస్సహమగు యుద్ధమును చేసి అవి అన్నియు క్షీణించిన పిదప శూలమును ధరించి నృసింహుని పైకి ఉరికెను (37). అపుడా నృసింహుడు పర్వతములతో సమానమగు బలము గల అనేక భుజములతో ఆ రాక్షసుని పట్టుకొని మోకాలిపై పెట్టి గోళ్ల కొనలతో మర్మస్థానములను చీల్చివేసెను (38). గోళ్లు అనే ఆయుధములతో రక్తముతో నిండియున్న వాని హృదయ పద్మమును పీకివేయగా ఆతడు క్షణకాలములో ప్రాణములను గోల్పోయెను. పలుమార్లు చూర్ణము చేయబడిన సర్వావయవములు గల ఆ రాక్షసుని దేహము దుంగవలె ప్రాణ విహీనము కాగా, దానిని నృసింహుడు పరిత్యజించెను (39). అద్భుతమగు పరాక్రమముగల విష్ణువు ప్రసన్నుడై ఆ దేవ శత్రువు సంహరింపబడగానే ప్రహ్లాదుని పిలిచి రాజ్యాభిషిక్తుని చేసి ఊహింప శక్యము కాని స్వలోకమునకు వెళ్లెను (40). అపుడు బ్రహ్మ మొదలగు దేవనాయకులందరు మిక్కిలి ఆనందించి తమ కార్యమును నెరవేర్చిన కొనియాడదగిన విష్ణుభగవానుని ఆ దిక్కు వైపునకు నమస్కరించి తమ తమ ధామములకు వెళ్లిరి (41). రుద్రుని నుండి అంధకుడు పుట్టుట, వరాహరూపి యగు విష్ణువు హిరణ్యాక్షుని సంహరించుట, వాని సోదరుని నృసింహుడు సంహరించుట, ప్రహ్లాదుడు రాజ్యమును బడయుట అను వృత్తాంతములు చెప్పబడినవి (42). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! ఇపుడు అంధకుని మహిమ, ఆతడు జన్మించుటతో డనే వరములను పొందియుండుట, శివునితో యుద్ధమును చేసి తరువాత ఆ కైలాసనాథునకు గణాధ్యక్షుడు అగుట అను విషయములను నేను చెప్పెదను. వినుము (43).

శ్రీ శివమహాపురాణములోని రుద్ర సంహితయందు యుద్ధ ఖండలో హిరణ్యకశిపు సంహారమనే నలుబది మూడవ అధ్యాయము ముగిసినది (43).

44 – అంధకుని దూతలతో శివుని సంభాషణము

సనత్కుమార ఉవాచ।

తతో హిరణ్యాక్షసుతః కదాచిత్సంశ్రావితో నర్మయుతైర్మదాంధైః ।
తైర్భ్రాతృభిస్సంప్రయుతో విహారే కిమంధ రాజ్యేన తవాద్య కార్యమ్ ॥
హిరణ్య నేత్రస్తు బభూవ మూఢః కలి ప్రియం నేత్ర విహీనమేవ ।
యో లబ్ధవాంస్త్వాం వికృతం విరూపం ఘోరైస్తపో భిర్గిరిశం ప్రసాద్య ॥
స త్వం న భాగీ ఖలు రాజ్యకస్య కిమన్య జాతోఽపి లభేత రాజ్యమ్ ।
విచార్యతాం తద్భవతైవ నూనం వయం తు తద్భాగిన ఏవ సత్యమ్ ॥
తేషాం తు వాక్యాని నిశమ్య తాని విచార్య బుద్ధ్యా స్వయమేవ దీనః ।
తాన్ శాంతయిత్వా వివిధైర్వచో భిర్గతస్త్వరణ్యం నిశి నిర్జనం తు ॥
వర్షాయుతం తత్ర తపశ్చచార జజాప జాప్యం విధృతైకపాదః ।
ఆహారహీనో నియమోర్ధ్వబాహుః కర్తుం న శక్యం హి సురాసురైర్యత్ ॥
ప్రజ్వాల్య వహ్నిం స్మ జుహోతి గాత్ర మాంసం సరక్తం ఖలు వర్షమాత్రమ్ ।
తీక్ష్ణేన శస్త్రేణ నికృత్య దేహాత్సమంత్రకం ప్రత్యహమేవ హుత్వా ॥
స్నాయ్వస్థి శేషం కుణపం తదాసౌ క్షయం గతం శోణితమేవ సర్వమ్ ।
యదాస్య మాంసాని న సంతి దేహే ప్రక్షేప్తుకామస్తు హుతాశనాయ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఒకప్పుడు హిరణ్యాక్షుని కుమారుడగు అంధకుని గర్వముతో కన్ను గానని ఆతని సోదరులు 'పరిహాసము చేయుచూ విహారవేళయందు ఆతనితో నిట్లనిరి : ఓరీ గ్రుడ్డివాడా! నీకీ రాజ్యముతో పనియేమి? (1) ఘోరమగు తపస్సును చేసి శివుని ప్రసన్నుని చేసుకొని, కలహప్రియుడవు, అంధుడవు, వికృతరూపుడవు అగు నిన్ను పుత్రునిగా బడసిన హిరణ్యాక్షుడు నిశ్చయముగా మూర్ఖుడై నాడు (2). అట్టి నీవు రాజ్యమునకు అర్హుడవు కావు. హిరణ్యాక్షునకు జన్మించినవాడవు నీవు కావు. ఇతరుని సంతానమగు నీకు ఈ రాజ్యము ఎట్లు లభించును? నీవు స్వయముగా ఆలోచించుము. మేము యథార్థముగా నీకు భాగము నిచ్చెదము (3). ఆతడు వారి వచనములను విని తన బుద్ధితో ఆలోచించుకొని దీనుడై వారికి పలు వచనములతో నచ్చజెప్పి రాత్రియందు నిర్జనమగు అడవికి వెళ్లెను (4). ఆతడు అచట ఒంటి కాలిపై నిలబడి ఆహారమును విడనాడి నియమములను పాటిస్తూ చేతులను పైకెత్తి, దేవతలకు గాని రాక్షసులకు గాని చేయ శక్యము కాని తపస్సును పదివేల సంవత్సరములు చేసెను. ఆతడు మంత్రమును జపించెను (5). ఆతడు ఒక సంవత్సర కాలము ప్రతిదినము అగ్నిని ప్రజ్వరిల్ల జేసి పదునైన కత్తితో దేహమునుండి మాంసమును కోసి మంత్రపూర్వకముగా ఆ మాంసమును మరియు రక్తమును హోమము చేసెను (6). ఆతని దేహములోని రక్తమాంసములు పూర్తిగా హరించి పోయినవి. నరములు, ఎముకలు మాత్రమే మిగిలియుండెను. ఆ శవము వంటి శరీరమును ఆతడు అగ్నిలో హోమము చేయగోరెను (7).

తతస్స దృష్ట్వాత్ర దశాలయైర్ఘనైస్సువిస్మితైర్భీతియుతైస్సమస్తైః ।
అథామరైః శీఘ్రతరం ప్రసాదితో బభూవ ధాతా నుతిభిర్నుతో హి ॥
నివారయిత్వాథ పితామహస్తం హ్యువాచ తం చాద్య వరం వృణీష్వ ।
యస్యాస్తి కామస్తవ సర్వలోకే సుదుర్లభం దానవ తం గృహాణ ॥
స పద్మయోనేస్తు వచో నిశమ్య ప్రోవాచ దీనః ప్రణతస్తు దైత్యః ।
యైర్నిష్ఠురైర్మే ప్రహృతం తు రాజ్యం ప్రహ్లాదముఖ్యా మమ సంతు భృత్యాః ॥
అంధస్య దివ్యం హి తథాస్తు చక్షురింద్రాదయో మే కరదా భవంతు ।
మృత్యుస్తు మా భూన్మమ దేవదైత్య గంధర్వయక్షోరగమానుషేభ్యః ॥
నారాయణాద్వా దితిజేంద్ర శత్రోస్సర్వాజ్జనాత్సర్వమయాచ్చ శర్వాత్ ।
శ్రుత్వా వచస్తస్య సుదారుణం తత్సుశంకితః పద్మభవస్తమాహ ॥

అపుడు స్వర్గమునందలి దేవతలందరు ఆశ్చర్యముతో మరియు భయముతో ఆతనిని గాం◌ించి వెంటనే బ్రహ్మ వద్దకు వెళ్లి ఆయనను స్తుతించి ప్రసన్నుని చేసుకొనిరి (8). అపుడా బ్రహ్మ అంధకుని ఆ ప్రయత్నము నాపివేసి ఇట్లు పలికెను: ఓ దానవా! ఈ లోకములన్నింటిలో మిక్కిలి దుర్లభమగు ఏ వస్తువునైననూ నీవు కోరుచుంటివా ? అట్లైనచో వరమును కోరుకొనుము. నీ కోరిక ఈనాడే నీకు సిద్ధించగలదు (9). దీనుడగు ఆ దానవుడు బ్రహ్మ యొక్క మాటను విని ప్రణమిల్లి ఇట్లు పలికెను: పరుష వచనములను పలికి నా రాజ్యము నపహరించిన ప్రహ్లాదుడు మొదలగు నా సోదరులు నాకు సేవకులగుదురు గాక! (10) అంధుడనగు నాకు దివ్యమగు నేత్రము నిమ్ము. ఇంద్రుడు మొదలగువారు నాకు పన్నును కట్టెదరు గాక! నాకు దేవ, దానవ, గంధర్వ, యక్ష, నాగ, మనుష్యుల చేతిలో మృత్యువు కలుగకుండుగాక! (11) రాక్షస శత్రువగు నారాయణుని వలన గాని, సర్వరూపుడగు శివుని వలన గాని, లేక సర్వజనుల వలన గాని నాకు మృత్యువు కలుగకుండు గాక! అంధకుని దారుణమగు ఈ మాటలను విని బ్రహ్మ అధికమగు శంకను పొంది ఆతనితో నిట్లనెను (12).

బ్రహ్మోవాచ ।

దైత్యేంద్ర సర్వం భవితా తదేతద్వినాశహేతుం చ గృహాణ కించిత్ ।
యస్మాన్న జాతో న జనిష్యతే వా యో న ప్రవిష్టో ముఖమంతకస్య ॥
అత్యంత దీర్ఘం ఖలు జీవితం తు భవాదృశా స్సత్పురుషాస్త్యజంతు ।
ఏతద్వచస్సానునయం నిశమ్య పితామహో క్త్వాహ పునస్స దైత్యః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ రాక్షస వీరా! నీవు కోరిన సర్వము అటులనే జరుగగలదు. కాని ఏదో ఒక మరణ కారణమును స్వీకరించుము. ఏలయనగా, మృత్యు ముఖమును చేరని ప్రాణి ఇంతవరకు, పుట్టలేదు; ఈ పైన పుట్టబోదు (13). నీ వంటి సత్పురుషులు

మిక్కిలి దీర్ఘమగు జీవితమును స్వీకరించక పోవుటయే శ్రేష్ఠము గదా! బ్రహ్మగారు అనునయ పూర్వకముగా చెప్పిన ఈ మాటను విని ఆ రాక్షసుడు మరల ఇట్లు పలికెను (14).

అంధక ఉవాచ ।

కాలత్రయే యాశ్చ భవంతి నార్య శ్శ్రేష్ఠాశ్చ మధ్యాశ్చ తథా కనిష్ఠాః ।
తాసాం చ మధ్యే ఖలు రత్నభూతా మమాపి నిత్యం జననీవ కాచిత్ ॥
కాయేన వాచా మనసాప్య గమ్యా నారీ నృలో కస్య చ దుర్లభా యా ।
తాం కామయానస్య మమాస్తు నాశో దైత్యేంద్రభావాద్భగవాన్ స్వయంభూః ॥
వాక్యం తదాకర్ణ్య స పద్మయోనిస్సు విస్మిత శ్శంకరపాద పద్మమ్ ।
సస్మార సంప్రాప్య నిదేశమాశు శంభోస్తు తం ప్రాహ తతోంధకం వై ॥

అంధకుడిట్లు పలికెను -

భూత భవిష్యద్వర్తమాన కాలములలో ఉత్తమ - మధ్యమ- అధమ స్వభావములు గల స్త్రీ లందరిలో సర్వశ్రేష్ఠురాలు, నాకు నిత్యము తల్లివలె పూజించ దగినది అగు ఒకానొక యువతి గలదు (15). ఆ యువతి మానవులకు మనో వాక్కాయములచే పొంద శక్యము గానిది. స్వయంభువుడవగు ఓ బ్రహ్మ భగవానుడా! ఆమెను నేను కామించినచో, రాక్షస చక్రవర్తి పదవినుండి వెంటనే భ్రష్టుడనగుదును గాక! (16) పద్మ సంభవుడగు ఆ బ్రహ్మ ఆ మాటలను విని మిక్కిలి విస్మయమును పొందినవాడై శంకరుని పాదపద్మమును స్మరించి వెంటనే శంభుని ఆదేశమును పొంది, అపుడా అంధకునితో నిట్లనెను (17).

బ్రహ్మోవాచ।

యత్కాంక్షసే దైత్యవరాస్తు తే వై సర్వం భవత్యేవ వచస్సుకామమ్ ।
ఉత్తిష్ఠ దైత్యేంద్ర లభస్వ కామం సదైవ వీరైస్తు కురుష్వ యుద్ధమ్ ॥
శ్రుత్వా తదేతద్వచనం మునీశ విధాతురాశు ప్రణిపత్య భక్త్యా ।
లోకేశ్వరం హాటక నేత్రపుత్ర స్స్నాయ్య స్థిశేషస్తు తమాహ దేవమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ రాక్షసవీరా! నీవు కోరిన కోరిక పూర్తిగా తథ్యము కాగలదు. ఓ రాక్షసరాజా! కోర్కెలు నీకు ఈడేరుగాక! సర్వదా వీరులతో యుద్ధమును చేయుము (18). ఓ మహర్షీ! నరములు, ఎముకలు మాత్రమే మిగిలియున్న ఆ హిరణ్యాక్ష పుత్రుడు లోకేశ్వరుడగు బ్రహ్మ యొక్క ఆ మాటను విని వెంటనే భక్తితో ప్రణమిల్లి ఆ భగవానునితో నిట్లు పలికెను (19).

అంధక ఉవాచ ।

కథం విభో వైరిబలం ప్రవిశ్య హ్యనేన దేహేన కరోమి యుద్ధమ్ ।

స్నాయ్వస్థిశేషం కురు మాంసపుష్టం కరేణ పుణ్యేన చ మాం స్పృశాద్య ॥

అంధకుడిట్లు పలికెను-

ఓ విభూ! నేనీ దేహముతో శత్రు సైన్యమును చొరబడి యుద్ధమును చేయుట ఎట్లు సంభవమగును? నీ పవిత్రమగు చేతితో నా ఈ దేహమునిపుడు స్పృశించుము. ఎముకలు, నరములు మాత్రమే మిగిలియున్న ఈ దేహమును మాంసముతో నిండియుండునట్లు చేయుము (20).

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వా వచస్తస్య స పద్మయోనిః కరేణ సంస్పృశ్య చ తచ్ఛరీరమ్ ।

గతస్సురేంద్రైస్సహితస్స్వధామ సంపూజ్యమానో మునిసిద్ధసంఘైః ॥

సంస్పృష్టమాత్రస్స చ దైత్య రాజస్సంపూర్ణ దేహో బలవాన్ బభూవ ।

సంజాతనేత్ర స్సుభగో బభూవ హ్యాష్టస్స్వ మేవం నగరం వివేశ ॥

ఉత్సృజ్య రాజ్యం సకలం చ తస్మై ప్రహ్లాదముఖ్యాస్త్వథ దానవేంద్రాః ।

తమాగతం లబ్ధవరం చ మత్వా భృత్యా బభూవుర్వశగాస్తు తస్య ॥

తతోంధక స్స్వర్గమగా ద్విజేతుం సేనాభియుక్త స్సహభృత్యవర్గః ।

విజిత్య లేఖాన్ ప్రధనే సమస్తాన్ కరప్రదం వజ్రధరం చకార ॥

నాగాన్ సుపర్ణాన్ వర రాక్షసాంశ్చ గంధర్వయక్షానపి మానుషాంస్తు ।

గిరీంద్ర వృక్షాన్ సమరేషు సర్వాంశ్చతుష్పదస్సింహముఖాన్ విజిగ్యే ॥

త్రైలోక్యమేతద్ధి చరాచరం వై వశం చకారాత్మని సంనియోజ్య ।

తతో ఒను కూలాని సుదర్శనాని నారీసహస్రాణి బహూని గత్వా ॥

రసాతలే చైవ తథా ధరాయాం త్రివిష్టపే యాః ప్రమదాస్సురూపాః ।

తాభిర్యుతో ఒన్యేషు స పర్వతేషు రరామ రమ్యేషు నదీతటేషు ॥

క్రీడాయమానస్స తు మధ్యవర్తీ తాసాం ప్రహర్షాదథ దానవేంద్రః ।

తత్రీత శిష్టాని పిబన్ ప్రవృత్త్యై దివ్యాని పేయాని సుమానుషాణి ॥

సనత్కుమారుడిట్లు పలికెను.

వాని ఈ మాటను విని ఆ పద్మ సంభవుడు వాని శరీరమును చేతితో బాగుగా స్పృశించి, ముని సిద్ధ గణములు పూజించుచుండగా దేవనాయకులతో గూడి తన లోకమును చేరెను (21). బ్రహ్మ స్పృశించిన వెంటనే ఆ రాక్షస రాజు పూర్ణదేహమును పొంది బలము గలవాడై చూపు గల సుందరాకారుడై ఆనందముతో తన నగరమును ప్రవేశించెను (22). ప్రహ్లాదుడు మొదలగు రాక్షస వీరులందరు ఆతడు వరములను పొంది వచ్చి యుండునని తలంచి, రాజ్యమునంతనూ ఆతనికి అప్పజెప్పి సేవకులై ఆతని కనుసన్నలలో

మెలగుచుండిరి (23). అపుడు అంధకుడు సేనలతో, పరిచారక వర్గముతో గూడి స్వర్గముపై విజయయాత్రకు వెడలెను. యుద్ధములో ఆతడు దేవతల నందరినీ జయించి ఇంద్రుడు పన్ను కట్టునట్లు చేసెను (24). ఆతడు నాగులను, గరుడులను, రాక్షసవీరులను, గంధర్వులను, యక్షులను మరియు మానవులను జయించి పర్వతములు, వృక్షములు, సింహము మొదలగు జంతువులతో గూడిన భూమికి ప్రభువు ఆయెను. యుద్ధములలో సర్వులు ఆతనిచే పరాజితులైరి (25). ఆతడు స్థావర జంగమాత్మకమగు ఈ జగత్తును తన వశము గావించుకొని, తరువాత చూడ చక్కని అనుకూలవంతులగు యువతులను వేలాది మందిని పొందెను (26). పాతాళ భూస్వర్గలోకములలో గల మిక్కిలి అందమైన స్త్రీలతో గూడి ఆతడు పర్వతములయందు, సుందరమగు నదీతీరముల యందు, ఇతర ప్రదేశముల యందు విహరించెను (27). వారి మధ్యలో నున్నవాడై ఆ రాక్షసరాజు ఆనందముతో రమిస్తూ మనుష్యలోక సంబంధి మరియు దేవలోక సంబంధి పానీయములను వారు త్రాగగా మిగిలిన వాటిని త్రాగి భోగముల ననుభవించెను (28).

అన్యాని దివ్యాని తు యద్రసాని ఫలాని మూలాని సుగంధివంతి ।
సంప్రాప్య యానాని సువాహనాని మయేన సృష్టాని గృహోత్తమాని ॥
పుష్పార్థ ధూపాన్నవిలేపనైశ్చ సుశోభితాన్యద్భుత దర్శనైశ్చ ।
సంక్రీడ మానస్య గతాని తస్య వర్షాయుతానీహ తథాంధకస్య ॥
జానాతి కించిన్న శుభం పరత్ర యదాత్మన స్సౌఖ్యకరం భవేద్ధి ।
సదాంధకో దైత్యవరస్స మూఢో మదాంధ బుద్ధిః కృత దుష్టసంగః ॥
తతః ప్రమత్తస్తు సుతాన్ ప్రధానాన్ కుతర్క వాదైరభిభూయ సర్వాన్ ।
చచార దైత్యైస్సహితో మహాత్మా వినాశయన్ వైదిక సర్వధర్మాన్ ॥
వేదాన్ ద్విజాన్ విత్త మదాభిభూతో న మన్యతే స్మాప్యమరాన్ గురూంశ్చ
।
రేమే తథా దైవగతో హతాయుస్స్వస్యై రహో భిర్గమయన్ వయశ్చ ॥
తతః కదాచిద్గతవాన్ ససైన్యో బహు ప్రయాతా పృథివీతలేఽస్మిన్ ।
అనేకసంఖ్యా అపి వర్షకోట్యః ప్రహర్షితో మందరపర్వతం తు ॥
స్వర్గోపమాం తత్ర నిరీక్ష్య శోభాంబ భ్రామ సైన్యైస్సహ మానమత్తః ।
క్రీడార్థ మాసాద్య చ తం గిరీంద్రం మతం స వాసాయ చకార మోహాత్ ॥
శుభం దృఢం తత్ర పురం స కృత్వా ముదా స్థితో దైత్యపతిః ప్రభావాత్ ।
నివేశయామాస పునః క్రమేణ అత్యద్భుతం మందరశైలసానౌ ॥

ఇతరములగు దివ్యరసములను త్రాగి, ఫలములను పరిమళ భరితములగు దుంపలను౯ు భక్షించి, మంచి గుర్రములను పూన్చిన రథములపై విహరించి, మయునిచే నిర్మింపబడిన ఉత్తమ భవనములలో నివసిస్తూ (29), ఆ అంధకుడు పుష్పములతో, విలువైన ధూపములతో, ఆహారములతో, విలేపములతో రమిస్తూ అద్భుతములు, మిక్కిలి శోభగలవి అగు భోగముల ననుభవిస్తూ పదివేల సంవత్సరముల కాలమును గడిపెను (30). మూర్ఖుడు, గర్వముతో అంధమైన మనో నేత్రము గలవాడు, సర్వదా దుష్టుల సహవాసము గలవాడు, రాక్షస వీరుడు అగు ఆ అంధకుడు తనకు పరలోకములో సుఖము నిచ్చే శుభకర్మల గురించి లేశమైననూ జ్ఞానము లేక ఉండెను (31). అపుడు మిక్కిలి మదించిన. ఆ మహారాక్షసుడు కుమారులు, మంత్రులు మొదలగు వారినందరినీ చెడు తర్కములతో నిండిన వాదములతో పరాజితులను చేసి, రాక్షసులతో గూడి సకల వైదిక ధర్మములను పాడుచేయుచూ తిరిగెను (32). ధనమదాంధుడు, దుర్దైవప్రేరితుడు, నశించిన ఆయుష్షు గలవాడు అగు ఆతడు వేదములను, బ్రాహ్మణులను, దేవతలను, గురువులను తిరస్కరించి ఆయువును వ్యర్థము చేయుచూ అనేక దినములు ఆ విధముగా రమించెను (33). ఈ భూమండలములో కొన్ని కోట్ల సంవత్సరములు గడిచెను. అపుడాతడు విస్తారముగా తిరుగుతూ ఒకనాడు సైన్యముతో గూడి ఆనందముతో మందర పర్వతమునకు వెళ్లెను (34). అభిమానముతో గర్వించియున్న ఆతడు క్రీడకొరకై ఆ పర్వతరాజము నెక్కి అచటి బంగరు శోభను తిలకించి సైన్యములతో గూడి తిరుగాడి, అజ్ఞానముచే అచట నివసింప నిశ్చయించెను (35), ఆ రాక్షసరాజు అచట సుందరమైన దృఢమగు నగరమును అత్యద్భుతముగా మందర పర్వతము యొక్క చరియయందు తన ప్రభావముచే కాలక్రమములో నిర్మించి ఆనందముతో అచట మకాము చేసెను (36).

దుర్యోధనో వైధస హస్తి సంజ్ఞౌ తన్మంత్రిణౌ దానవసత్త మస్య ।
తే వై కదాచిద్గిరి సుస్థలే హి నారీం సురూపాం దదృశుస్త్ర యోఽపి ॥
తే శీఘ్రగా దైత్యవరాస్తు హర్షా ద్భుతం మహాదైత్యపతిం సమేత్య ।
ఊచుర్యథా దృష్టమతీవ ప్రీత్యా తథాంధకం వీరవరం హి సర్వే ॥

ఆ రాక్షస వీరునకు దుర్యోధన, వైధస, హస్తి అను పేర్లు గల ముగ్గురు మంత్రులు ఉండిరి. వారు ముగ్గురు ఒకనాడు ఆ పర్వత సుందర దేశములో సుందరియగు ఒక స్త్రీని గాంచిరి (37). ఆ ముగ్గురు రాక్షస వీరులు వెంటనే ఆనందముతో రాక్షస చక్రవర్తి, మహావీరుడు అగు అంధకుని వద్దకు వచ్చి తాము చూచిన దృశ్యమును మహా ప్రీతితో వివరించి చెప్పిరి (38).

మంత్రిణ ఊచుః ।

గుహాంతరే ధ్యాననిమీలితాక్షో దైత్యేంద్ర కశ్చిన్మునిరత్ర దృష్టః ।
రూపాన్విత శ్చంద్రకలార్ధచూడః కటీస్థలే బద్ధ గజేంద్రకృత్తిః ॥
నాగేంద్ర భోగావృత సర్వగాత్రః కపాలమాలాభరణో జటాలః ।
స శూలహస్త శ్శరతూణధారీ మహాధనుష్మాన్ వివృతాక్ష సూత్రః ॥
ఖడ్గీ త్రిశూలీ లకుటీ కపర్దీ చతుర్భుజో గౌరతరాకృతిర్హి ।
భస్మానులిప్తో విలసద్ద్యుతీ జాస్తపస్వీ వర్యోఽ ద్భుత సర్వవేశః ॥
తస్యావిదూరే పురుషశ్చ దృష్ట స్స వానరో ఘోరముఖః కరాలః ।
సర్వాయుధో రూక్షకరశ్చ రక్షన్ స్థితో జర ద్గోవృషభశ్చ శుక్లః ॥
తస్యోపవిష్టస్య తపస్వినోఽపి సుచారురూపా తరుణీ మనోజ్ఞా ।
నారీ శుభా పార్శ్వగతా హి తస్య దృష్టా చ కాచిద్భువి రత్నభూతా ॥
ప్రవాల ముక్తామణి హేమరత్న వస్త్రావృతా మాల్యశుభోపగూఢా ।
సా యేన దృష్టా స చ దృష్టిమాన్ స్యాద్దృష్టేన చాన్యేన కిమత్ర కార్యమ్ ॥
మాన్యా మహేశస్య చ వా దివ్యనారీ భార్యా మునేః పుణ్యవతః ప్రియా సా ।
యోగ్యా హి ద్రష్టుం భవతశ్చ సమ్యగానాయ్య దైత్యేంద్ర సురత్నభోక్తః ॥

మంత్రులు ఇట్లు పలికిరి -

ఓ రాక్షసరాజా! కన్నులను మూసి ధ్యానించువాడు, సుందరుడు, చంద్రకళను శిరముపై దాల్చినవాడు, నడుమునకు ఏనుగు చర్మమును కట్టినవాడు, పాము పడగలతో చుట్టుబడియున్న సర్వావయవములు గలవాడు, కపాలముల మాలయే ఆభరణముగా గలవాడు, జటాధారి, చేతిలో త్రిశూలమును దాల్చినవాడు, బాణములతో గూడిన అంబుల పొది గలవాడు, గొప్ప ధనుర్ధారి, స్ఫటికమాలను కనబరచు చున్నవాడు, ఖడ్గమును ధరించినవాడు, దండధారి, నాల్గు బాహువులు గలవాడు, పచ్చని దేహము గలవాడు, భస్మను పూసుకున్నవాడు, గొప్ప తేజస్సుతో ప్రకాశించువాడు, గొప్ప తపశ్శాలి, అద్భుతమగు విన్యాసము వేషము గలవాడు అగు ఒకానొక మునిని ఇచట గాంచితిమి (39, 40, 41). వానికి కొద్ది దూరములో వానరాకారుడు, భయంకరమగు ముఖము గలవాడు, వికృతరూపుడు, సర్వాయుధములను బలమగు చేతులతో దాల్చినవాడు అగు ఒక పురుషుడు రక్షకుడై నిలబడి యుండెను. ఇంతేగాక, తెల్లని ముసలి ఎద్దు ఒకటి గలదు (42). కూర్చుండియున్న ఆ తపశ్శాలికి సమీపమునందు మిక్కిలి అందమగు రూపము గలది, సుందరి, మనోహారిణి, మంగళ స్వరూపురాలు అగు ఒక శ్రేష్ఠయువతి నేలపై గూర్చుండి యున్నది (43). పగడములు, ముత్యములు, మణులు, రత్నములు పొదిగిన ఆభరణములను, శుభకరమగు పూలను, గొప్ప వస్త్రములను దాల్చియున్న ఆమెను కాంచిన కనులు సార్థకమగును. ఆమెను చూడని కనులు వ్యర్థము (44). ఓ రాక్షస రాజా! శ్రేష్ఠవస్తువుల ననుభవించువాడా! గొప్ప సమర్థుడు, పుణ్యాత్ముడు అగు ఆ మునికి ప్రియురాలు, ఆదరణీయురాలు, భార్య, దివ్య స్త్రీ అగు ఆమెను నీవు చూడదగుదువు. మరియు, ఆమెను నీవు ఇచటకు రప్పించుము (45).

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వేతి తేషాం వచనాని తాని కామాతురో ఘూర్ణిత సర్వగాత్రః ।
విసర్జయామాస మునేస్సకాశం దుర్యోధనాదీన్ సహసా స దైత్యః ॥
ఆసాద్య తే తం మునిమ ప్రమేయం బృహద్వ్రతం మంత్రివరా హి తస్య ।
సురాజనీతి ప్రవణా మునీశ ప్రణమ్య తం దైత్యనిదేశమాహుః ॥

సనత్కుమారుడిట్లు పలికెను

వారి ఈ మాటలను విని ఆ రాక్షసుడు కామపీడితుడై, కంపించుచున్న సర్వావయవములు గలవాడై వెంటనే దుర్యోధనుడు మొదలగు ఆ మంత్రులను ముని వద్దకు పంపించెను (46). ఓ మహర్షీ! రాజనీతి చతురులగు ఆతని ఆ మంత్రివర్యులు అంచనావేయ శక్యముగాని మహిమ గలవాడు, మహావ్రత నిష్ఠుడు అగు ఆ మహర్షిని సమీపించి దానవేంద్రుని ఆదేశములను వినిపించిరి (47).

మంత్రిణ ఊచుః ।

హిరణ్య నేత్రస్య సుతో మహాత్మా దైత్యాధిరాజోఽధక నామధేయః ।
త్రైలోక్యనాథో భవకృన్నిదేశా దిహోపవిష్టోఽద్య విహారశాలీ ॥
తన్మంత్రిణో వై వయమంగ వీరాస్తవోపకంఠం చ సమాగతాస్స్మః ।
తత్ప్రేషితాస్త్వాం యదువాచ తద్వై శృణుష్వ సందత్తమనాస్తపస్విన్ ॥
త్వం కస్య పుత్రోఽసి కిమర్థమత్ర సుఖోపవిష్టో మునివర్య ధీమన్ ।
కస్యేయమీదృక్ తరుణీ సురూపా దేయా శుభా దైత్యపతేర్మునీంద్ర ॥
క్వేదం శరీరం తవ భస్మదిగ్ధం కపాలమాలాభరణం విరూపమ్ ।
తూణీరసత్కార్ముక బాణ ఖడ్గ భుశుండి శూలాశనితో మరాణి ॥
క్వ జాహ్నవీ పుణ్యతమా జటాగ్రే క్వాయం శశీ వా కుణపాస్థి ఖండమ్ ।
విషానలో దీర్ఘముఖః క్వ సర్పః క్వ సంగమః పీనపయోధరాయాః ॥
జరద్గవారోహణ మప్రశస్తం క్షమావతస్తస్య న దర్శనం చ ।
సంధ్యా ప్రణామః క్వచిదేష ధర్మః క్వ భోజనం లోక విరుద్ధ మేతత్ ॥
ప్రయచ్ఛ నారీం మమ సాంత్వ పూర్వం స్త్రియా తపః కిం కురుషే విమూఢ ।
అయుక్త మేతత్త్వయి నానురూపం యస్మాదహం రత్నపతిస్త్రి లోకే ॥
విముంచ శస్త్రాణి మయాద్య చోక్తః కురుష్వ పశ్చాత్తప ఏవ శుద్ధమ్ ।
ఉల్లంఘ్య మచ్ఛాసనమ ప్రధృష్యం విమోక్ష్యసే సర్వమిదం శరీరమ్ ॥
మత్వాంధకం దుష్టమతిం ప్రధానో మహేశ్వరో లౌకిక భావశీలః ।
ప్రోవాచ దైత్యం స్మితపూర్వమేవమాకర్ణ్య సర్వం త్వథ దూతవాక్యమ్ ॥

మంత్రులు ఇట్లు పలికిరి -

హిరణ్యాక్షుని కుమారుడు, మహాత్ముడు, అంధకుడను పేరు గలవాడు, ముల్లోకములకు ప్రభువు అగు రాక్షస చక్రవర్తి బ్రహ్మయొక్క ఆదేశముచే విహార ప్రియుడై ఇపుడు ఇచటకు సమీపములో మకాము చేసినాడు (48). ఓ మిత్రమా! ఆయన మంత్రులగు మేము ఆయన పంపగా నీ వద్దకు వచ్చి యుంటిమి. మేము వీరులము. ఓ తపశ్శాలీ! ఆయన చెప్పిన వచనములను మనస్సు లగ్నము చేసి వినుము (49). నీవు ఎవని పుత్రుడవు? ఓ మహర్షీ! బుద్ధిశాలివగు నీవు సుఖముగా ఇచట కూర్చుండుటకు కారణమేమి? ఇట్టి సుందరియగు ఈ యువతి ఎవరికి చెందినది? ఓ మహర్షీ! ఈ శుభస్వరూపురా లిని రాక్షస చక్రవర్తికి సమర్పించుము (50). బూడిద అలమబడినది, పుర్రెల మాలయే ఆభరణముగా గలది, వికృతరూపము గలది అగు నీ ఈ శరీరమెక్కడ? తూణీరము, గొప్ప ధనస్సు, బాణములు, ఖడ్గము, భుశుండి, శూలము, అశని (పిడుగు), తోమరము అను ఆయుధములు ఎక్కడ? (51) జటల అగ్ర భాగమునందు పరమ పుణ్యమగు గంగానది యెక్కడ? ఈ చంద్రుడు ఎక్కడ? శవముల ఎముకల ముక్కలు ఎక్కడ? పొడవైన పడగ కలిగి విషవాయువులను వెదజల్లు సర్పము ఎక్కడ? సుందరియగు ఈమె పొందు యెక్కడ? (52) ముసలి ఎద్దును ఎక్కుట ప్రశస్తమగు పని కాదు. భూమండలము నందెవ్వరైననూ అట్టి దృశ్యమును చూచియుండరు. సంధ్యాకాలములో ఈశ్వరునకు ప్రణమిల్లుట కొన్ని దేశములలో ధర్మమగుచున్నది. లోకమునకు విరుద్ధమగు ఈ భోజనము ఎక్కడిది? (53) నా అనునయ వచనములను విని మంచితనముతో ఈమెను అప్పజెప్పుము. ఓరీ మూర్ఖా! స్త్రీతో గూడి యుండి ఏమి తపస్సును చేసెదెవు? ఇది నీకు యోగ్యమైన పని కాదు. కాని నేను ముల్లోకములలో శ్రేష్ఠవస్తువులకు ప్రభువునై యున్నాను (54). ఈ క్షణములో నా మాటను ఆదరించి ఆయుధములను పారవేసి తరువాత శుద్ధమగు తపస్సును చేసుకొనుము. తిరుగులేని నా ఆజ్ఞను ఉల్లంఘించినచో, నీకు మృత్యువు తప్పదు (55). జగత్ప్రధానుడగు మహేశ్వరుడు దూతవాక్యమునంతయూ విని, అంధకుడు దుష్ట బుద్ధియని తలపోసి, లోకగతిని అనుసరించువాడై, చిరునవ్వుతో ఆ రాక్షసుని ఉద్దేశించి ఇట్లు పలికెను (56).

శివ ఉవాచ ।

యద్యస్మి రుద్రస్తవ కిం మయా స్యాత్ కిమర్థమేవం వదసీతి మిథ్యా ।
శృణు ప్రభావం మమ దైత్యనాథ న్యాయ్యం న వక్తుం వచనం త్వయైవమ్ ॥
నాహం క్వచిత్ స్వం పితరం స్మరామి గుహాంతరే ఘోరమనన్య చీర్ణమ్ ।
ఏతద్వ్రతం పాశుపతం చరామి న మాతరం త్వజ్ఞతమో విరూపః ॥
అమూలమేతన్మయి తు ప్రసిద్ధం సుదుస్త్యజం సర్వమిదం మమాస్తి ।
భార్యా మమేయం తరుణీ సురూపా సర్వం సహా సర్వగతస్య సిద్ధిః ॥
ఏతర్హి యద్యద్రుచితం తవాస్తి గృహాణ తద్వై ఖలు రాక్షస త్వమ్ ।
ఏతావదుక్త్వా విరరామ శంభుస్తపస్వి వేషః పురతస్తు తేషామ్ ॥

శివుడిట్లు పలికెను –

నేను రుద్రుడ నైనచో, నాతో నీకు పనియేమి? నీవు ఇట్లు అనృతవచనముల నేల పలుకుచుంటివి? ఓ రాక్షసరాజా! నా ప్రభావమును గూర్చి వినుము. నీవు ఇట్లు పలుకుట తగదు (57). నేను ఏ కాలమునందైననూ నా తల్లిదండ్రులను స్మరించుట లేదు. అజ్ఞానిని, వికృతరూపుడను అగు నేను గుహ లోపల కూర్చుండి, ఇతరులెవ్వరూ చేయజాలని ఉగ్రమగు ఈ పాశుపత వ్రతమునననుష్ఠించుచున్నాను (58). సర్వకారణుడనగు నాకు కారణము లేదను విషయము లోక ప్రసిద్ధము. నేనీ సర్వమును విడువలేకున్నాను. నా ఈ భార్య యౌవనములో నున్న రూపవతి, సర్వమును సహించునది. మరియు సర్వవ్యాపకుడనగు నా సిద్ధి ఈమెయే (59). ఓ రాక్షసా! ఈ సమయములో నీకు ఏది రుచించునో, దానిని తీసుకొనుము. తపశ్శాలి వేషములో నున్న శంభుడు వారి యెదుట ఇంతమాత్రమే పలికి విరమించెను (60).

సనత్కుమార ఉవాచ ।

గంభీరమేతద్వచనం నిశమ్య తే దానవాసం ప్రణిపత్య మూర్ధ్నా ।
జగ్ముస్తతో దైత్యవరస్య సూనుం త్రైలోక్యనాశాయ కృత ప్రతిజ్ఞమ్ ॥
బభాషిరే దైత్యపతిం ప్రమత్తం ప్రణమ్య రాజానమదీనసత్త్వాః ।
తే తత్ర సర్వే జయ శబ్దపూర్వం రుద్రేణ యత్తత్ స్మితపూర్వముక్తమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఈ గంభీరమగు వచనములను విన్న పిదప ఆ దానవులు ఆయనకు తలవంచి ప్రణమిల్లి, ముల్లోకములను నశింపజేసెదనని ప్రతిజ్ఞను బూనియున్నవాడు, రాక్షసవీరుడగు హిరణ్యాక్షుని పుత్రుడు అగు అంధకుని వద్దకు వెళ్లిరి (61). దైన్యము నెరుంగని అంతఃకరణము గల వారు ముగ్గురు గర్వితుడై యున్న రాక్షస రాజునకు జయశబ్ద పూర్వకముగా ప్రణమిల్లి, రుద్రుడు చిరునవ్వుతో చెప్పిన సందేశమును ఆతని ఎదుట వినిపించిరి (62).

మంత్రిణ ఊచుః ।

నిశాచరశ్చంచల శౌర్యధైర్యః క్వ దానవః కృపణస్సత్త్వహీనః ।
క్రూరః కృతఘ్నశ్చ సదైవ పాపీ క్వ దానవ స్సూర్య సుతాద్బి భేతి ॥
రాజత్వముక్తో౽ ఖిల దైత్యనాథస్తపస్వినా తన్మునినా విహస్య ।
మత్వా స్వ బుద్ధ్యా తృణవత్త్రిలోకం మహౌజసా వీరవరేణ నూనమ్ ॥
క్వాహం చ శస్త్రాణి చ దారుణాని మృత్యోశ్చ సంత్రాసకరం క్వ యుద్ధమ్ ।
క్వ వీరకో వానరవక్త్రతుల్యో నిశాచరో జరసా జర్జరాంగః ॥
క్వాయం స్వరూపః క్వ చ మందభాగ్యః బలం త్వదీయం క్వచ వీరుధోవా ।
శక్తో౽పి చేత్త్వం ప్రయతస్వ యుద్ధం కర్తుం తదా హ్యేహి కురుష్వ కించిత్ ॥
వజ్రాశనేస్తుల్య మిహాస్తి శస్త్రం భవాదృశం నాశకరం చ ఘోరమ్ ।
క్వ తే శరీరం మృదు పద్మతుల్యం విచార్య చైవం కురు రోచతే యత్ ॥
ఇత్యేవమాదీని వచాంసి భద్రం తపస్వినోక్తాని చ దానవేశ ।
యుక్తం న తే తేన సహాత్ర యుద్ధం త్వామాహ రాజన్ స్మయమాన ఏవ ॥
వివస్తు శూన్యైర్బహుభిః ప్రలాపైరస్మాభిరుక్తైర్యది బుధ్యసే త్వమ్ ।
తపోభియుక్తేన తపస్వినా వై స్మరారి పశ్యాన్మని వాక్యమేతత్ ॥

మంత్రులు ఇట్లు పలికిరి –

చంచలమగు శౌర్యధైర్యములు గలవాడు. దనువంశజుడు, దీనుడు, సత్త్వగుణము లేనివాడు అగు రాక్షసుడు ఎక్కడ? క్రూరుడు, కృతఘ్నుడు, సర్వకాలములలో పాపాచారి అగు ఆ దానవుడు యమునకు భయపడుతూ ఎక్కడనున్నాడు? (63) ఓ రాజా! తపశ్శాలి, గొప్ప శక్తి గలవాడు, నిశ్చయముగా వీరులలో శ్రేష్ఠుడునగు ఆ ముని తన బుద్ధిలో ముల్లోకములను తృణప్రాయముగా భావించి చిరునవ్వుతో సమస్త దైత్యులకు అధీశ్వరుడవగు నిన్ను ఉద్దేశించి ఇట్లు పలికినాడు (64). నేను ఎక్కడ? దారుణమగు శస్త్రములెక్కడ? మృత్యువునకైననూ భీతిని గొల్పు యుద్ధము ఎక్కడ? కోతి మోమువాడు, రాత్రులందు తిరుగాడువాడు, వయస్సు పైబడుటచే శిథిలమైన అవయవములు గలవాడునగు వీరకుడెక్కడ? (65) మందభాగ్యుడగు ఈ వీరకుని స్వరూపమెక్కడ? నీ బలమెక్కడ? ఈ కోతి తిరుగాడు చెట్లు ఎక్కడ? నీవు సమర్థుడవైనచో, యుద్ధమును చేయుటకు ప్రయత్నించుము. అట్లైనచో రమ్ము ఏదో ఒకటి చేయుము (66). నీవంటి వారిని నశింపజేయగలది, భయంకరమైనది, వజ్రముతో పిడుగుతో సమమైనది అగు ఆయుధము ఇచట గలదు. మెత్తని పద్మముతో పోల్చదగిన నీ శరీరమెక్కడ? ఈ తీరున ఆలోచించి, నీకు తోచినట్లు చేయుము (67). ఓ దానవేశ్వరా! నీకు మంగళమగు గాక! ఆ తపశ్శాలి ఇటువంటి మాటలను పలికియున్నాడు. ఆతడు పొగరు గలవాడై

45 - దూత సంవాద వర్ణనం

పతివ్రతా శీలగుణోపపన్నా ఏకాకినీ నిత్యమథో విభీతా ।
గుహాంతరే దుఃఖపరా బభూవ సంరక్షితా సా సుతవీరకేణ ॥
తతస్స దైత్యో వరదానమత్త స్సైరో ధముఖ్యై స్సహితో గుహాం తామ్ ।
విభిన్న ధైర్యః పునరాజగామ శిలీముఖైర్మార సముద్భవైశ్చ ॥
అత్యద్భుతం తత్ర చకార యుద్ధం హిత్వా తదా భోజనపాననిద్రాః ।
రాత్రిం దివం పంచశతాని పంచ క్రుద్ధస్ససైన్యైస్సహ వీరకేణ ॥
ఖడ్గైస్సకుంతైస్సహ భిందిపాలైర్గదా భుశుండీభిరథో ప్రకాండైః ।
శిలీ ముఖైరర్ధ శశిభిరుగ్రైర్వితస్తిభిః కూర్మముఖైర్జ్వలద్భిః ॥
నారాచముఖ్యైర్నిశితైశ్చ శూలైః పరశ్వధైస్తోమర ముద్గరైశ్చ ।
ఖడ్గైర్గుడైః పర్వతపాదపైశ్చ దివ్యైరథాస్త్రై రపిదైత్యసంఘైః ॥
న దీధితిర్భిన్నతనుః పపాత ద్వారం గుహాయాః పిహితం సమస్తమ్ ।
తైరాయుధైర్దైత్య భుజ ప్రయుక్తై ర్గుహాముఖే మూర్ఛిత ఏవ పశ్చాత్ ॥

శివుడు వేయి సంవత్సరముల కాలము తపస్సును చేసెను. అట్టి తపస్సును చేయు శక్తి దే◌ోవతలకు గాని, రాక్షసులకు గాని లేదు. ఆ పార్వతి శివుని రాకకై ఎదురుచూస్తూ మందరపర్వతమునందుండెను. (15). పతివ్రత, శీలముతో గుణములతో విరాజిల్లు నది అగు ఆమె గుహ లోపల సర్వదా ఏకాంతములో ఉంటూ భయమును పొంది దుఃఖించెడిది. ఆమెను పుత్రుడగు వీరకుడు రక్షించెను (16), అపుడు కాముని బాణములచే గోల్పోయిన ధైర్యము గలవాడు, వరదానముచే గర్వించిన వాడునగు ఆ రాక్షసుడు శ్రేష్ఠులగు యోధులతో గూడి ఆ గుహవద్దకు మరల వచ్చెను (17). క్రోధముతో గూడియున్న ఆ అంధకుడు నిద్రను, నీటిని, ఆహారమును విడనాడి సైన్యములతో గూడిన వాడై అయిదు వందల అయిదు రాత్రులు, పగళ్లు వీరకునితో అత్యద్భుతమగు యుద్ధమును అచట చేసెను (18). ఖడ్గములు, బల్లెములు, భిందిపాలములు, గదలు, పెద్ద భుశుండులు, వాడి అర్ధచంద్రాకార బాణములు, ఇనుప కొక్కెములు గల బాణములు, మండే కూర్మాకార బాణములు (19), వాడియైన నారాచ బాణములు, శూలములు, గొడ్డళ్లు, తోమరములు, ముద్గరములు, శిలలు, వృక్షములు మరియు దివ్యాస్త్రములు మొదలగు వాటితో రాక్షసవీరులు యుద్ధమును చేసిరి (20). ఆ రాక్షసులు ప్రయోగించిన ఆయుధములచే గుహాద్వారము పూర్తిగా మూసివేయబడి చీకట్లు అలుముకొనెను. ఆయుధములచే గాయపరచబడిన దేహముగల వీరకుడు మూర్ఛిల్లి గుహాద్వారము వద్ద ప్రక్కన పడిపోయెను (21).

ఆచ్ఛాదితం వీరకమస్త్ర జాలైర్దైత్యైశ్చ సర్వైస్తు ముహూర్త మాత్రమ్ ।
అపావృతం కర్తు మశక్యమాసీన్నిరీక్ష్య దేవీ దితిజాన్ సఘోరాన్ ॥
భయేన సస్మార పితామహం తు దేవీ సఖీభి స్సహితా చ విష్ణుమ్ ।
సైన్యం చ మధ్వీరవరస్య సర్వం సస్మారయామాస గుహాంతరస్థా ॥
బ్రహ్మా తయా సంస్మృత మాత్ర ఏవ స్త్రీరూపధారీ భగవాంశ్చ విష్ణుః ।
ఇంద్రశ్చ సర్వైస్సహ సైన్యకైశ్చ స్త్రీ రూపమాస్థాయ సమాగతాస్తే ॥
భూత్వా స్త్రియస్తే వివిశుస్తదానీం మునీంద్ర సంఘాశ్చ మహానుభావాః ।
సిద్ధాశ్చ నాగాస్త్వథ గుహ్యా కాశ్చ గుహాంతరం పర్వతరాజపుత్ర్యాః ॥
యస్మాత్పురాజ్యాసన సంస్థితానామంతః పురే సంగమనం విరుద్ధమ్ ।
తతస్సహస్రాణి నితంబినీనా మనంత సంఖ్యాన్యపి దర్శయంత్యః ॥
రూపాణి దివ్యాని మహాద్భుతాని గౌర్యై గుహాయాం తు సవీరకార్యైః ।
స్త్రియః ప్రహృష్టా గిరిరాజకన్యా గుహాంతరం పర్వతరాజపుత్ర్యాః ॥
స్త్రీ భిస్సహ స్త్రైశ్చ శతైరనే కైర్నేదుశ్చ కల్పాంతరమేఘ ఘోషాః ।
భేర్యశ్చ సంగ్రామ జయ ప్రదాస్తు ధ్మాంతాస్సుశంఖాస్సు నితంబినీభిః ॥

సర్వరాక్షసులు ప్రయోగించిన అస్త్ర సమూహములచే వీరకుడు కప్పివేయబడి యుండెను. మహూర్త కాలము వరకు ఆతనిని రక్షించుట సంభవము కాలేదు. అపుడా ఆ దేవి మిక్కిలి భయంకరులగు రాక్షసులను గాంచి (22) భయముతో బ్రహ్మను స్మరించెను. సఖురాండ్రతో గూడి గుహలోపల నున్న ఆ దేవి వీరులలో శ్రేష్ఠుడగు అంధకుని సైన్యమునంతనూ చూచి విష్ణువును కూడ స్మరించెను (23). ఆమె స్మరించిన వెంటే బ్రహ్మ, విష్ణు భగవానుడు, ఇంద్రుడు స్త్రీరూపములను దాల్చి సర్వసైన్యములతో గూడి అచటకు విచ్చేసిరి (24). మరియు అపుడు మహర్షుల సమూహములు, మహానుభావులగు సిద్ధులు, నాగులు, గుహ్యకులు కూడ స్త్రీ రూపములను దాల్చి పార్వతి ఉన్న గుహ లోపలకి ప్రవేశించిరి (25). చక్రవర్తి పదము నధిష్ఠించియున్న పురుషులు అంతఃపురమును ప్రవేశించుట నియమమునకు విరుద్ధము గాన, వారందరు లెక్కలేనంతమంది సుందర స్త్రీ రూపములను దాల్చి లోపల ప్రవేశించిరి (26). వారు దివ్యములు, మహాద్భుతములు అగు స్త్రీ రూపములను దాల్చి ఆనందముతో వీరకార్యములను ప్రకటిస్తూ పార్వతి ఉన్న గుహలోనికి ప్రవేశించిరి (27). ఈ వేలాది మంది స్త్రీలు కల్పాంతమునందలి మేఘ గర్జనలను బోలిన నాదములను చేయుచుండిరి. ఆ సుందర స్త్రీలు సంగ్రామములో జయమును ఒసంగు భేరీలను మ్రోగించి, గొప్ప శంఖములను ఊదిరి (28).

మూర్ఛాం విహాయాద్భుత చండవీర్యస్స వీరకో వై పురతస్స్థితస్తు ।
ప్రగృహ్య శస్త్రాణి మహారథానాం తైరేవ శస్త్రైర్దితిజం జఘాన ॥
బ్రాహ్మీ తతో దండ కరా విరుద్ధా గౌరీ తదా క్రోధపరీత చేతాః ।
నారాయణీ శంఖగదా సుచక్ర ధనుర్ధరా పూరిత బాహుదండా ॥
వినిర్యయౌ లాంగల దండహస్తా వ్యోమాలకా కాంచనతుల్య వర్ణా ।
ధారా సహస్రాకుల ముగ్రవేగం బైడౌజసీ వజ్రకరా తదానీమ్ ॥
సహస్ర నేత్రా యుధి సుస్థిరా చ సుదుర్జయా దైత్యశతైరధృష్యా ।
వైశ్వానరీ శక్తి రసౌమ్య వస్త్రా యామ్యా చ దండోద్యత పాణిరుగ్రా ॥
సతీక్ష్ణ ఖడ్గో ద్యతపాణిరూపా సమాయయౌ నైర్ఋతి ఘోరచాపా ।
తోయాలికా వారుణ పాశహస్తా వినిర్గతా యుద్ధమభీప్సమానా ॥
ప్రచండవాత ప్రభవా చ దేవీ క్షుధావపుస్స్యంకుశ పాణిరేవ ।
కల్పాంతవహ్ని ప్రతిమాం గదాం చ పాణౌ గృహీత్వా ధనదోద్భవా చ ॥
యాక్షేశ్వరీ తీక్ష్ణముఖా విరూపా నఖాయుధా నాగభయంకరీ చ ।
ఏతాస్తథాన్యాశ్శతశో హి దేవ్యస్సు నిర్గతా స్సంకులయుద్ధ భూమిమ్ ॥
దృష్ట్వా చ తత్సైన్య మనంత పారం వివర్ణ వర్ణాశ్చ సువిస్మితాశ్చ ।
సమాకులాస్సంచకితా భయాద్వై దైత్యా బభూవుర్భృదదీన సత్వాః ॥

అద్భుతము, భయంకరము అగు పరాక్రమము గల వీరకుడు మూర్ఛనుండి తేరుకొని ఎదుట నిలబడి మహారథులు ప్రయోగించిన ఆయుధములను ప్రోగు చేసుకొని వాటితోనే ఆ రాక్షసుని కొట్టెను (29). అపుడు బ్రాహ్మీ (బ్రహ్మశక్తి) చేతిలో దండమును దాల్చి రాక్షస సైన్యమునకు ఎదురుగా నిలబడెను. గౌరీదేవి యొక్క మనస్సు కోపముతో నిండిపోయెను. నారాయణి బాహుదండముల యందు శంఖ చక్రగదా ధనస్సులను ధరించి యుండెను (30). అపుడు బంగారు కాంతి కలిగిన ఇంద్రశక్తి నాగలి దండమును, వజ్రమును చేతులయందు ధరించి ముంగురులు ఆకసమునంటు చుండగా మహావేగముతో ముందుకు నడిచెను. ఆమె దాల్చిన వజ్రమునకు వేయి ధారలు ఉండెను (31). ఆ ఇంద్రశక్తి యుద్ధములో స్థిరముగా నిలబడియుండగా, అనేక దైత్యులైననూ ఆమెను జయించుటకు, కదుపుటకు సమర్థులు కాజాలరైరి. అగ్నిశక్తి భయంకరమగు ముఖమును కలిగి యుండెను. యమశక్తి దండమును చేతిలో ఎత్తి పట్టుకొని భీతిని గొల్పెను (32). నిర్‌ఋతిశక్తి వాడి ఖడ్గమును, ఘోరమగు ధనస్సును చేతులలో సిద్ధముగా పట్టుకొని ముందునకు సాగెను. వరుణ శక్తి జల ప్రవాహశక్తి గల పాశమును చేతబట్టి యుద్ధమును గోరి ముందునకు వచ్చెను (33). ప్రచండ మగు వాయుశక్తి ఆకలియే శరీరముగా గలదై చేతిలో అంకుశమును దాల్చియుండెను. కుబేరశక్తి కల్పాంతమునందలి అగ్నిని పోలియున్న గదను చేతిలో దాల్చియుండెను (34). యక్షశక్తి భయంకర వికృత ముఖము గలదై నఖములే ఆయుధములుగా కలిగియుండెను. నాగశక్తి భయంకరముగా నుండెను. వీరు మాత్రమే గాక ఇంకనూ అనేక దేవీ మూర్తులు కల్లోలితమైయున్న ఆ

★ ఇచ్చట కొన్ని శ్లోకములు మాకు లభించిన మూలాములో లేవు వీటిని ఇతర ములముల యందు పరిశీలించి త్వరలో పొందు పరచెదము ★

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే యుద్ధ ప్రారంభ దూత సంవాద వర్ణనం నామ పంచ చత్వారింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

విఘసుడు ఆ శివుని ఈ వచనములను విని ఆనందముతో బయటకు వచ్చెను. అపుడాతడు గర్జనలను, హుంకారములను చేయుచూ రాక్షసరాజు వద్దకు వెళ్లెను (54).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు యుద్ధ ఖండలో యుద్ధ ప్రారంభ దూతసంవాద వర్ణనమనే నలుబది అయిదవ అధ్యాయము ముగిసినది (45).

46 – అంధకుడు శివునితో యుద్ధమును చేయుట

సనత్కుమార ఉవాచ ।

తస్యేంగితజ్ఞశ్చ స దైత్యరాజో గదాం గృహీత్వా త్వరితస్సు సైన్యః ।
కృత్వాథ సోఽగ్రే గిలనామధేయం సుదారుణం దేవవరైరభేద్యమ్ ॥
గుహాముఖం ప్రాప్య మహేశ్వరస్య బిభేద శస్త్రైరశని ప్రకాశైః ।
అన్యే తతో వీరకమేవ శస్త్రైవాకిరన్ శైల సుతాం తథాన్యే ॥
ద్వారం హి కేచి ద్రుచిరం బభంజుః పుష్పాణి పత్రాణి వినాశయేయుః ।
ఫలాని మూలాని జలం చ హృద్యముద్యాన మార్గానపి ఖండయేయుః ॥
వీలో డయేయుర్ముదితాశ్చ కేచిచ్ఛృంగాణి శైలస్య చ భానుమంతి ।
తతో హరస్సంస్మృతవాన్ స్వసైన్యం సమాహ్వయన్ కుపితశ్శూలపాణిః ॥
భూతాని చాన్యాని సుదారుణాని దేవాన్ ససైన్యాన్ సహ విష్ణుముఖ్యాన్ ।
ఆహూత మాత్రాను గణాస్ససైన్యా రథైర్గజైర్వాజి వృషైశ్చ గోభిః ॥
ఉష్ట్రైః ఖరైః పక్షివరైశ్చ సింహైస్తే సర్వదేవాస్సహ భూతసంఘైః ।
వ్యాఘ్రైర్మృగైస్సూకరసారసైశ్చ సమీనమత్స్యై శ్శిశుమార ముఖ్యైః ॥
అన్యైశ్చ నానావిధ జీవ సంఘైర్వ్యాకీర్ణదంశా స్స్ఫుటితై స్స్మశానైః ।
భుజంగమైః ప్రేతశతైః పిశాచైర్దివ్యైర్విమానైః కమలాకరైశ్చ ॥
నదీనదైః పర్వతవాహనైశ్చ సమాగతాః ప్రాంజలయః ప్రణమ్య ।
కపర్దినం తస్థురదీన సత్త్వాస్సేనాపతిం వీరకమేవ కృత్వా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

శివుని ఇంగితము నెరింగిన ఆ రాక్షసరాజు గదను చేతబట్టి సైన్యముతో గూడి వెంటనే బయలుదేరెను. దేవశ్రేష్ఠులచే కూడ జయింపశక్యము కానివాడు, మిక్కిలి భయంకరుడు అగు గిలుని ఆతడు సైన్యమునకు అగ్ర భాగములో నిలబెట్టెను (1). ఆతడు మహేశ్వరుని గుహ యొక్క ద్వారము వద్దకు చేరి పిడుగు వంటి ప్రకాశముగల అస్త్రములతో దానిని పగులగొట్టెను. అపుడు కొందరు వీరకుని శస్త్రములతో ముంచెత్తగా, మరికొందరు పార్వతిపై దండెత్తిరి (2). కొందరు సుందరమగు ద్వారమును పగులగొట్టగా, మరికొందరు పుష్పములను, పత్రములను ధ్వంసము చేసిరి. కొందరు ఫలములను, మూలములను, సుందరమగు జలాశయమును, ఉద్యానములోని దారులను చెడగొట్టిరి (3). కొందరు ప్రకాశించే పర్వత శిఖరములను ఆనందముతో పెకలించుచుండిరి. అపుడు శివుడు కోపించి శూలమును చేతబట్టి తన సైన్యమును స్మరించి ఆహ్వానించెను (4). భయంకరాకారులగు భూతములు, విష్ణువు మొదలగు

దేవతలు, వారి సైన్యములు, శివుని గణములు పిలువగానే విచ్చేసిరి. వారు రథములను, ఏనుగులను, గుర్రములను, ఎదులను, ఆవులను (5), ఒంటెలను, గాడిదలను, గొప్ప పక్షులను, సింహములను, పెద్ద పులులను, జింకలను, సూకరములను సారస పక్షులను, చేపలను, మొసళ్లను (6), ఇతరములగు నానా విధ ప్రాణులను అధిష్ఠించి విచ్చేసిరి. సర్వదేవతలు భూతగణములతో గూడి వచ్చిరి. దోమలు చెల్లా చెదురుగా నుండెను. స్మశానములలో తిరుగాడు పాములు, వేలాది ప్రేతములు, పిశాచములు వచ్చినవి. దేవతలు దివ్య విమానములలో వచ్చిరి. సరస్సులు (7), నదీనదములు, పర్వతములు (అధిష్ఠాన దేవతలు) ఆయా వాహనములపై వచ్చి జటాజూటధారియగు శివునకు చేతులు జోడించి నమస్కరించి ఉత్సాహముతో నిండిన అంతఃకరణము గలవారై వీరకుని సేనాపతిగా చేసుకొని నిలబడిరి (8).

విసర్జయామాస రణాయ దేవాన్ విశ్రాంత వాహానథ తత్పినాకీ ॥
యుద్ధే స్థిరం లబ్ధజయం ప్రధానం సంప్రేషితాస్తే తు మహేశ్వరేణ ॥
చక్రుర్యుగాంత ప్రతిమం చ యుద్ధం మర్యాదహీనం సగిలేన సర్వే ।
దైత్యేంద్ర సైన్యేన సదైవ ఘోరం క్రోధాన్వి గీర్ణాస్తి దశాస్తు సంఖ్యే ॥
తస్మిన్ క్షణే యుధ్యమానాశ్చ సర్వే బ్రహ్మేంద్ర విష్ణ్వర్క శశాంక ముఖ్యాః ।
ఆసన్ని గీర్ణా విఘసేన తేన సైన్యే నిగీర్ణేఽస్తి తు వీరకో హి ॥
విహాయ సంగ్రామ శిరో గుహాం తాం ప్రవిశ్య శర్వం ప్రణిపత్య మూర్ధ్నా ।
ప్రోవాచ దుఃఖాభిహతస్స్మరారిం సువీరకో వాగ్మివరోఽథ వృత్తమ్ ॥
నిగీర్ణం తే సైన్యం విఘసదితిజేనాద్య భగవన్ నిగీర్ణోఽ సౌ విష్ణుస్త్రి భువన గురుర్దైత్యదలనః ।
నిగీర్ణౌ చంద్రార్కౌ ద్రుహిణమఘవానౌ చ వరదౌ నిగీర్ణాస్తే సర్వే యమవరుణ వాతాశ్చ ధనదః ॥
స్థితోఽ స్మ్యేకః ప్రహ్వః కిమిహ కరణీయం భవతు మే ।
అజేయో దైత్యేంద్రః ప్రముదితమనా దైత్యసహితః ॥
అజేయత్వం ప్రాప్తః ప్రతిభయమనా మారుతగతిః స్వయం విష్ణుర్దేవః కనకకశిపుం కశ్యపసుతమ్ ।
నఖైస్తీక్ష్ణైర్వంక్యా తదపి భగవాన్ శిష్టవశగః ప్రవృత్త స్త్రైలోక్యం విధమతు మలం వ్యాత్త వదనః ॥

దేవతల వాహనములకు తగిన విశ్రాంతిని ఇచ్చిన పిదప పినాకధారి యగు మహేశ్వరుడు యుద్ధమునందు జయమును పొందవలెననే స్థిరమగు నిర్ణయము గలవాడై దేవతలను యుద్ధరంగమునకు పంపెను (9). ఆ దేవతలందరు గిలునితో గూడియున్న రాక్షస రాజుయొక్క సైన్యముతో ఊహకు అందనిది, ప్రళయకాలమును బోలినది అగు ఘోరయుద్ధమును నిరంతరముగా చేసిరి. కాని ఆ యుద్ధములో దేవతలు వారిచే కోపముతో మ్రింగి వేయబడిరి (10).

ఆ సమయములో యుద్ధమును చేయుచున్న బ్రహ్మ-ఇంద్ర- విష్ణు-సూర్య-చంద్రాది ప్రముఖులనందరినీ విఘసుడు మ్రింగివేసెను. ఇట్లు సైన్యము మ్రింగివేయబడగా వీరకుడు మిగిలియుండెను (11). వక్తలలో శ్రేష్ఠుడగు వీరకుడు అపుడు యుద్ధభూమిని విడిచి పెట్టి దుఃఖముచే పీడింపబడినవాడై ఆ గుహలో ప్రవేశించి కామ దహనుడగు శివునకు శిరస్సుతో ప్రణమిల్లి జరిగిన వృత్తాంతము నిట్లు వివరించెను (12). హే భగవాన్! విఘసాసురుడు ఈనాడు నీ సైన్యమును, ముల్లోకములకు ప్రభువు మరియు రాక్షస సంహారకుడు అగు విష్ణువును, సూర్యచంద్రులను, వరముల నొసంగు ఇంద్ర బ్రహ్మలను, యమ వరుణ వాయు కుబేరులను, అందరినీ మ్రింగి వేసెను (13). నేను ఒక్కడినే వినయముతో నిలబడి యున్నాను. నాకు ఇపుడు కర్తవ్యమేమి? రాక్షస సైన్యముతో గూడి మహానందముతో నున్న ఆ రాక్షస చక్రవర్తిని జయించుట అసంభవము (14). జయింప శక్యము కాని స్థితిలో నున్నవాడు, భయంకరమగు మానసిక స్థితిని కలిగియున్నవాడు, వాయువుతో సమానమగు వేగము గలవాడు, ప్రకాశ స్వరూపుడు, సత్పురుషుల అధీనములో నుండువాడు అగు విష్ణు భగవానుడు స్వయముగా కశ్యప పుత్రుడగు హిరణ్యకశిపుని వాడి గోళ్లతో చీల్చి చంపి, ఆ పిదప నోటిని తెరచి ముల్లోకములను ఊదివేయుటకు సంసిద్ధుడాయెను (15).

వసిష్ఠాద్యైశ్శప్తో భువనపతిభిస్సప్త మునిభిస్తథా భూతే ।
భూయస్స్యమితి సుచిరం దైత్య సహితః ॥
తతస్తేనో క్తాస్తే ప్రణయవచనైరాత్మని హితైః కదాస్మాద్వై ఘోరాద్భవతి
మమ మోక్షో మునివరాః ।
యతః క్రుద్ధైరుక్తో విఘసహరణాద్యుద్ధ సమయే తతో ఘోరైర్బాణైర్విదలిత
ముఖే ముష్టిభిరలమ్ ॥
బదర్యాఖ్యారణ్యే నను హరగృహే పుణ్యవసతౌ నిసంస్తభ్యాత్మానం
విగతకలుషో యాస్యసి పరమ్ ।
తతస్తేషాం వాక్యాత్ప్రతిదినమసౌ దైత్యగిలనః క్షుధార్త స్సంగ్రామాద్భ్రమతి
పునరామోదముదితః ॥
తమస్యేదం ఘోరం జగదుదితయో స్సూర్యశశినోః యథా శుక్రస్తుభ్యం
పరమరిపురత్యంత వికరః ।
హతాన్ దేవైర్దైత్యాన్ పునరమృత విద్యాస్తుతి పదైః సువీర్యాన్
సంహృష్టాన్ వ్రణశత వియుక్తాన్ ప్రకురుతే ॥
వరం ప్రాణాస్త్యాజ్యాస్తవ మమ తు సంగ్రామసమయే ।
భవాన్ సాక్షీ భూతః క్షణమపి వృతః కార్యకరణే ॥
ఇతీదం సత్పుత్రాప్తృమథపతి రాకర్ణ్య కుపితః చిరం ధ్యాత్వా చక్రే
త్రిభువనపతిః ప్రాగనుపమమ్ । ప్రగాయత్వామాఖ్యం దినకర కరాకారవపుషా
ప్రహాసాత్తన్నామ్నా తదను నిహితం తేన చ తమః ॥

ప్రకాశోకస్మింల్లోకే పునరపి మహాయుద్ధమకరోత్ రణే దైత్యైస్సార్ధం
వికృతవదనైర్వీరకమునిః ।
శిలా చూర్ణం భుక్త్వా ప్రవరమునినా యస్తు జనితః స కృత్వా సంగ్రామం
పురమపి పురా యశ్చ జితవాన్ ॥

ఆ పరిస్థితిలో, భువనములకు ప్రభువులగు వసిష్ఠాది సప్తర్షులు ఆయనను 'నీవు మరల చిరకాలము రాక్షసులతో గూడి యుండుము' అని శపించిరి (16). అపుడా విష్ణువు తనకు హితకరములగు ప్రియవచనములతో వారిని ఇట్లు ప్రార్థించెను : ఓ మహర్షులారా! ఈ ఘోరశాపమునుండి నాకు విడుదల ఎపుడు లభించును? అపుడు వారు కోపముతో నిట్లనిరి : యుద్ధ సమయమునందు నీవు భయంకరములగు బాణములతో, మరియు ముష్టిఘాతములతో పీడను పొందెదవు. విఘసుడు నోరు తెరిచి నిన్ను మ్రింగివేయును (17). బదరికారణ్యములో పరమపవిత్ర నివాసమగు శివుని గృహములో జితేంద్రియుడవై పూర్ణమగు పాపవిముక్తిని పొందగలవు. తరువాత వారి శాప వచనము వలన ఆతడు ప్రతి దినము ఆకలిచే పీడింపబడినవాడై రాక్షసులను భక్షిస్తూ తిరుగాడెను. ఆతడా తీరున మరల ఆనందమును పొంద జొచ్చెను (18). సూర్య చంద్రులుదయించి ఈ ఘోరమగు చీకటి తొలగునట్లు చేయుము. నీకు ప్రబల శత్రువు, గొప్ప సమర్థుడు అగు శుక్రుడు దేవతలచే సంహరింపబడిన రాక్షసులను సంజీవనీ విద్యకు సంబంధించిన స్తోత్ర పాఠములతో పునరుజ్జీవింప చేయుచున్నాడు. వారి గాయములన్నియూ నివారణ యగుచుండగా, గొప్ప శక్తిని పొంది పరమానందము ననుభవించుచున్నారు (19). నీవు ఈ యుద్ధమును చేయు సమయములో నాకు ప్రాణ త్యాగము శ్రేష్ఠము. సర్వమునకు నీవే సాక్షివి. ఈ కార్యమును నిర్వహించుటలో నీవు నాయకునిగా ఎన్నుకొనబడితివి (20). తన కుమారులలో శ్రేష్ఠుడగు వీరకుని ఈ ప్రసంగమును విని, ప్రమథగణాధ్యక్షుడు, ముల్లోకములకు ప్రభువు అగు శివుడు కోపించి చాలా సేపు ఆలోచించి, సామగానమును చేయుచూ మునుపెన్నడూ ఎరుంగని సాటిలేని అద్భుతమును చేసెను. సూర్యుని వలె కిరణములను వెదజల్లే శరీరమును దాల్చి ఆయన బిగ్గరగా నవ్వెను. వెంటనే చీకటి అంతయూ తొలగిపోయెను (21). ఈ లోకమునందు ప్రకాశము నెలకొనెను. మహర్షియగు వీరకుడు వికృతమగు ముఖములు గల రాక్షసులతో మరల రణభూమిలో గొప్ప యుద్ధమును చేసెను. పూర్వము ఒక గొప్ప మహర్షి రాతి పొడిని భక్షించి ఆతనిని సృష్టించినాడు. పూర్వమాతడు యుద్ధమును చేసి (పురుని) శత్రువుల నగరమును జయించినాడు (22).

మహారుద్రస్సద్యస్స ఖలు దితిజేనాతి గిలితః తతశ్చాసౌ నంది
నిశితశరశూలాసి సహితః ।

ప్రధానో యోధానాం మునివరశతానామపి మహాన్ నివాసో విద్యానాం
శమదమ మహాధైర్యసహితః ॥

నిరీక్ష్యైవం పశ్చాద్వృషభవరమారుహ్య భగవాన్ కపర్దీ యుద్ధార్థీ
విఘసదితిజం సమ్ముఖముఖః ।

జపన్ దివ్యం మంత్రం నిగలన విధానోద్గిలనకం స్థితస్సజ్జం కృత్వా
ధనురశని కల్పానపి శరాన్ ॥

తతో నిష్క్రాంతోఽసౌ విఘస వదనాద్వీరకమునిః గృహీత్వా తత్సర్వం
స్వబల మతులం విష్ణుసహితః । సముద్గీర్ణాస్సర్వే కమలజ బలారీందుదినపాః
ప్రహృష్టం తత్సైన్యం పునరపి మహాయుద్ధమకరోత్ ॥

జితే తస్మిన్ శుక్రస్తదను దితిజాన్ యుద్ధ విహతాన్ యదా
విద్యావీర్యాత్పునరపి స జీవాన్ ప్రకురుతే ।

తదా బద్ధ్వా నీతః పశురివ గణైర్భూతపతయే నిగీర్ణస్తేనాసౌ త్రిపురరిపుణా
దానవగురుః ॥

వినష్టే శుక్రాఖ్యే సురరిపు నివాసస్తదఖిలో జితో ధ్వస్తో భగ్నో భృశమపి
సురైశ్చాపి దలితమ్ ।

ప్రభూతై ర్భూతౌ ఘైర్దితిజ కుణపగ్రాస రసికైః సరుండై ర్నృత్యద్భి
ర్నిశితశర శక్త్యుద్ధృతకరైః ॥

ప్రమత్తైర్వేతా లైస్సు దృఢకరతుండైరపి ఖగైః వృకైర్నానా భేదైశ్శవకుణప
పూర్ణాస్య కబలైః ।

వికీర్ణే సంగ్రామే కనక కశిపోర్వంశజనకః చిరం యుద్ధం కృత్వా హరిహర
మహేంద్రైశ్చ విజితః ॥

ప్రవిష్టే పాతాలే గిరి జలధిరంధ్రాణ్యపి తథా తతస్సైన్యే క్షీణే దితిజ
వృషభశ్చాంధక వరః ।

ప్రకోపే దేవానాం కదనదవరో విశ్వదలనః గదాఘాతైర్ఘోరై
ర్విదలితమదశ్చాపి హరిణా ॥

తరువాత వాడి బాణములను శూలమును కత్తిని ధరించి యున్నవాడు, యోధులలో ప్రముఖుడు, మహర్షులందరిలో గొప్పవాడు, విద్యలకు నిలయము, బాహ్య- అంతరింద్రియ నిగ్రహము ధైర్యము గలవాడు అగు నందిని ఆ రాక్షసుడు మ్రింగివేసెను. ఆ మహారుద్రుడు వెంటనే (23) ఆ దృశ్యమును గాంచెను. జటాజూటధారియగు ఆ భగవానుడు అపుడు వృషభమునధిష్ఠించి యుద్ధమును చేయగోరి విఘసాసురుని సముఖమునకు వెళ్లెను. మ్రింగిన వస్తువులను గ్రక్కునట్లు చేయు దివ్యమంత్రమును జపిస్తూ ఆయన ధనస్సును, పిడుగుల వంటి బాణములను సిద్ధము చేసుకొని నిలబడెను (24). అపుడు విఘసుని నోటినుండి వీరకమహర్షి సాటిలేని తన సర్వసైన్యమును తీసుకొని విష్ణువుతో గూడి బయటకు

వచ్చెను. బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు మరియు అందరు బయట పడిరి. అపుడా సైన్యము మహానందముతో మరల గొప్ప యుద్ధమును చేయ మొదలిడెను (25). ఈ విధముగా విఘసుడు జయింపబడెను. ఇంతలో శుక్రుడు యుద్ధములో మరణించిన రాక్షసులను విద్యా ప్రభావముచే మరల బ్రతికించుచుండగా, గణములు ఆతనిని పశువును వలె బంధించి భూతపతియగు శివుని ముందు నిలబెట్టిరి. త్రిపురాసుర సంహారకుడగు ఆ శివుడు రాక్షస గురువగు ఆ శుక్రుని మ్రింగివేసెను (26). శుక్రుడు అదృశ్యము కాగానే, రాక్షసులందరు జయింపబడిరి. దేవతలు వారి నివాసములను పూర్తిగా ధ్వంసము చేసి, సర్వమును నాశనము చేసిరి. భూత గణములు పెద్ద సంఖ్యలో రాక్షసుల శవములను, తలలు లేని మొండెములను, శక్తులను చేతులలో ఎత్తి పట్టుకొని నాట్యమును చేయుచుండెను (27). మదించియున్న పక్షులు, అనేక జాతుల తోడేళ్లు శవముల నుండి పీకిన మాంసపుముద్దలతో నిండిన నోళ్లు గలవై యుద్ధరంగమును చెల్లాచెదురు చేయుచుండెను. హిరణ్యకశిపుని వంశ పురుషుడగు రాక్షసుడు శివునితో విష్ణువుతో మరియు మహేంద్రునితో చిరకాలము యుద్ధమును చేసి పరాజయమును పొందెను (28). రాక్షసశ్రేష్ఠుడగు అంధకుని సైన్యము క్షీణించెను. వారందరు పాతాళములో, కొండగుహలలో, సముద్రపు లోతులలో ప్రవేశించిరి. తీవ్రమగు కోపముతో ఆతడు దేవతలతో యుద్ధమును చేసి వారికి పీడను కలిగించుటయే గాక బ్రహ్మాండమును పగులగొట్టగల సమర్థుడు. కాని విష్ణువు యొక్క భయంకరమగు గదాఘాతములచే ఆతని గర్వము అణిగెను (29).

న వై యస్వం గ్రామం త్యజతి వరలబ్ధః కిల యతః తదా తాడ్యై ర్ఘోరైస్త్రి
దశపతినా పీడితతమః ।
తతశ్చస్త్రాస్త్రౌ ఘైస్తరు గిరి జలైశ్చాశు విబుధాన్ జిగాయోచ్చైర్గర్జన్
ప్రమథపతి మాహూయ శనకైః ॥
స్థితో యుద్ధం కుర్వన్ రణపతితశస్త్రైర్బహువిధైః పరిక్షీణైస్సర్వైస్తదను
గిరిజా రుద్రమతుదత్ ।
తథా వృక్షైస్సర్పై రశనినివ హైశ్చస్త్ర పటలైః విరూపైర్మాయాభిః
కపటరచనాశంబరశతైః ॥
విజేతుం శైలేశం కుహకమపరం తత్ర కృతవాన్ మహాసత్త్వో వీరస్త్రీ
పురరిపుతుల్యశ్చ మతిమాన్ ।
న వధ్యో దేవానాం వరశత మనోన్మాదవివశః ప్రభూతైశ్చస్త్రాస్త్రైస్సపది
దితిజో జర్జరతనుః ॥
తదీయాద్విష్యందాత్ క్షితితలగతైరంధక గణైః అతివ్యాప్తం ఘోరం
వికృతవదనం స్వాత్మసదృశమ్ ।
దధత్కల్పాంతాగ్ని ప్రతిమవపుషా భూతపతినా
త్రిశూలేనోద్భిన్నస్త్రిపురరిపుణా దారుణతరమ్ ॥

యదా సైన్యాత్సైన్యం పశుపతిహతా దన్యదభవత్ ప్రణాశైరత్యుష్ణైః
పిశితనిస్సృతైర్బిందుభిరలమ్ ।
తదా విష్ణుర్యోగాత్ప్రమథపతి మాహూయ మతిమాన్ చకారోగ్రం రూపం
వికృతవదనం స్త్రైణమజితమ్ ॥
కరాలం సంశుష్కం బహుభుజలతా క్రాంతకుపితో వినిష్క్రాంతః
కర్ణాద్గణశిరసి శంభోశ్చ భగవాన్ ॥
రణస్థా సా దేవీ చరణయుగలాలం కృతమహీ స్తుతా దేవైస్సర్వైస్మదను
భగవాన్ ప్రేరితమతిః ।
క్షుధార్తా తత్సైన్యం దితిజనిస్సృతం తచ్చ రుధిరం పపౌ సాత్యుష్ణం
తద్రణశిరసి స్వక్కర్దమమలమ్ ॥

ఆతడు వరములను పొందినవాడగుటచే యుద్ధమును విడిచి పోలేదు. అపుడు ఇంద్రుడాతని దేహమునకు భయంకరమగు ఆఘాతములతో పీడను కలిగించెను. అపుడాతడు శస్త్రాస్త్ర పరంపరలతో, చెట్లతో, పర్వతములతో మరియు జలములతో వెంటనే దేవతలను జయించి, బిగ్గరగా గర్జిస్తూ ప్రమథగణాధిపతియగు శివుని ఆహ్వానించెను (30). యుద్ధరంగములో పడియున్న అనేక విధముల శస్త్రములతో ఆతడు యుద్ధమును నిలబడి చేయుచున్నవాడై గిరిజాపతియగు రుద్రుని చీకాకుపరిచెను. ఇంతలో ఆ శస్త్రములు క్షయమును చెందగా, అపుడాతడు వృక్షములను, సర్పములను, పిడుగుల సమూహములను, శస్త్ర పరంపరలను ప్రయోగించి యుద్ధమును చేసెను. మరియు ఆతడు వివిధరకముల మాయలను, కపటరచనలను, పలువిధములు శంబరవిద్యలను ప్రయోగించెను (31). గొప్ప బలశాలి, వీరుడు, శివునితో సమమైన వాడు, బుద్ధిశాలి, దేవతలచే వధ్యుడు కానివాడు, వరములను పొంది గర్వముతో మదించి యున్నవాడు అగు ఆ రాక్షసుడు లెక్కలేనన్ని శస్త్రములచే శిథిలమైన దేహముగలవాడై వెంటనే ఆ యుద్ధరంగములో కైలాసపతియగు శివుని జయించుటకై మరియొక కుట్రను పన్నెను (32). ఆతని దేహమునుండి స్రవించిన రక్తము నేలపై బడి ఆతనిని పోలియున్నవారు, వికృతమగు ముఖము గలవారు, భయంకరాకారులు అగు అనేక అంధకులు పుట్టిరి. వారిచే యుద్ధరంగము నిండి యుండెను. ప్రళయకాలాగ్నిని బోలిన దేహము గలవాడు, భూతములకు ప్రభువు, త్రిపురారియగు శివుడు త్రిశూలముతో మరింత దారుణముగా ఆతనిని పొడిచెను (33). పశుపతియగు శివుడు ఆ అంధకసైన్యమును సంహరించెను. కాని వారి దేహములకు కలిగిన గాయములనుండి కారిన వేడి రక్తబిందువులనుండి మరియొక సైన్యము ఉదయించెను. అపుడు విష్ణువు ప్రమథగణాధిపతియగు శివునితో సంప్రదించి తన బుద్ధిశక్తిని ఉపయోగించి యోగప్రభావముచే భయంకరమైనది, వికృతమగు ముఖముగలది, జయింప శక్యము గానిది అగు స్త్రీ రూపమును దాల్చెను (34). ఆ రూపము వికటముగను, మిక్కిలి శుష్కించినదిగను ఉండెను.

లతలవంటి అనేక భుజములు గల ఆ రూపమునందు క్రోధము కానవచ్చెను. శంభుని చెవినుండి విష్ణుభగవానుడు ఈ రూపములో బయల్వెడలి గణముల ముందు నిలబడెను (35). ఆ దేవి యుద్ధరంగ ప్రదేశమునంతనూ తన రెండు పాదములతో ఆక్రమించి యుండెను. ఆమె పాదములు భూమికి అలంకారమాయెను. దేవతలందరు ఆమెను స్తుతించు చుండగా శివభగవానుడు ఆమెకు ఉత్సాహమును కలిగించెను. ఆమె ఆకలిచే పీడింపబడినదై యుద్ధరంగములో ముందు ఉన్న దై రాక్షససైన్యమును సంహరించి వారి శరీరములనుండి స్రవించిన వేడి రక్తమును త్రాగెను. రాక్షసుల దేహమాంసముచే ఆ ప్రదేశమంతయు బురదగా మారెను (36).

తతస్త్వేకో దైత్యస్తదపి యుయుధే శుష్కరుధిరః తలాఘాతైర్ఘోరైరశని
సదృశైర్జాను చరణైః ।
నఖైర్వజ్రాకారైర్ముఖభుజ శిరోభిశ్చ గిరిశం స్మరన్ క్షాత్రం ధర్మం స్వకుల
విహితం శాశ్వతమజమ్ ॥
రణే శాంతః పశ్చాత్ప్రమథపతినా భిన్నహృదయః త్రిశూలేన ప్రోతో నభసి
విధృతస్స్థాణు సదృశః ।
అథః కాయశ్శుష్కస్తపనకిరణైర్జీర్ణ తనుమాన్ జలాసారైర్మేఘైః
పవనసహితైః క్లేదితవపుః ॥
విశీర్ణస్త్వగ్మాంశోస్తుహినశకలాకార శకలః తథాభూతః ప్రాణాంస్తదపి న
జహౌ దైత్యవృషభః ।
తదా తుష్టశ్శంభుః పరమకరుణా వారిధిరసౌ దదౌ తస్మై ప్రీత్యా
గణపతిపదం తేన వినుతః ॥
తతో యుద్ధస్యాంతే భువనపతయస్సార్థ రమణైః స్తవైర్నానా భేదైః
ప్రమథపతిమభ్యర్చ్య విధివత్ ।
హరి బ్రహ్మాద్యాస్తే పరమనుతిభిస్తుష్టువురలం నతస్కంధాః ప్రీతా
జయజయ గిరం ప్రోచ్య సుఖితాః ॥
హరస్తైస్తైస్సార్ధం గిరివరగుహాయాం ప్రముదితో విసృజ్యైకానంశాన్
వివిధబలినా పూజ్యసునగాన్ ।
చకారాజ్ఞాం క్రీడాం గిరివరసుతాం ప్రాప్య ముదితాం తథా పుత్రం
ఘోరాద్విఘసవదనాన్ముక్త మనఘమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
అంధకయుద్ధవర్ణనం నామ షట్ చత్వారింశోఽ ధ్యాయః ॥

అంధకాసురుడు ఒక్కడు మాత్రమే మిగిలియుండెను. ఆతని రక్తమంతయూ స్రవించి దేహము ఎండిపోయెను. అయిననూ ఆతడు స్వకులమునకు విహితమైనది, శాశ్వతము, పుట్టుక లేనిదియగు క్షత్రియ ధర్మమును స్మరించి, భయంకరములు పిడుగు పాటువంటివి అగు దెబ్బలను అరచేతులతో పాదములతో మరియు మోకాళ్లతో కొడుతూ, వజ్రము వలె వాడియైన గోళ్లను ముఖమును భుజమును శిరస్సును ఆయుధముగా చేసుకొని శివునితో పోరాడెను (37). తరువాత ప్రమథపతియగు శివుడు త్రిశూలముతో ఆతనిని గుండెలలో పొడిచి పైకి ఎత్తి ఆకాశములో నిలబెట్టగా, ఆతడు శాంతించి కదలిక లేక యుండెను. అతని శరీరము యొక్క క్రింది భాగము సూర్యకిరణములచే ఎండిపోయెను. శిథిలమైన ఆతని శరీరమును వాయుసహితములగు మేఘములు జలమును వర్షించి తడిపినవి (38). పూర్తిగా శిథిలమైన ఆతని దేహము సూర్యకిరణములు పడి మంచుతునకల వలె ప్రకాశించుచుండెను. అయిననూ ఆ రాక్షసవీరుడు ప్రాణములను విడువలేదు. అపుడు పరమదయాసముద్రుడగు ఆ శంభుడు అపుడాతనిచేస్తుతించబడినవాడై ప్రేమతో ఆతనికి గణాధ్యక్ష పదవి నొసంగెను (39). అపుడు యుద్ధము ముగిసెను. విష్ణువు, బ్రహ్మ మొదలగు ఆ లోకపాలురు ప్రమథపతియగు శివునకు సాష్టాంగ ప్రణామముల నాచరించి గంభీరమగు అర్థము. గలవి, సుందరమైనవి, శ్రేష్ఠమైనవి అగు వివిధ స్తోత్రములను యథావిధిగా పఠించి ఆయనను తృప్తి కలుగునంత వరకు స్తుతించి జయజయధ్వానములను చేసి సుఖమును పొందిరి (40). శివుడు వారందరితో గూడి ఆ సుందరమగు పర్వతగుహలో మహానందముతో నుండెను. ఆయన తన అంశములగు వారినందరినీ పంపించివేసి, పూజింపదగిన పర్వతశ్రేష్ఠులకు ఉపహారములను సమర్పించెను. అపుడాయన ఆనందముతో నిండియున్న పార్వతితో గూడి భయంకరమగు విఘసాసురుని నోటినుండి ప్రాణములతో బయట పడిన పాపరహితుడగు పుత్రుని పొంది ఆనందముతో విహరించెను (41).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధ ఖండలో అంధక యుద్ధవర్ణనమనే నలుబది యారవ అధ్యాయము ముగిసినది (46).

47 - శివుడు శుక్రాచార్యుని

ఖ్రింగివేయుట

వ్యాస ఉవాచ ।

తస్మిన్మహతి సంగ్రామే దారుణే లోమహర్షణే ।
శుక్రో దైత్య పతిర్విద్వాన్ భక్షితస్త్రి పురారిణా ॥
ఇతి శ్రుతం సమాసాన్మే తత్పున ర్బ్రూహి విస్తరాత్ ।
కిం చకార మహాయోగీ జఠరస్థః పినాకినః ॥
న దదాహ కథం శంభోశ్శుక్రం తం జఠరానలః ।
కల్పాంతదహనః కాలో దీప్తతేజాశ్చ భార్గవః ॥
వినిష్క్రాంతః కథం ధీమాన్ శంభోర్జఠర పంజరాత్ ।
కథమారాధయామాస కియత్కాలం స భార్గవః ॥
అథ చ లబ్ధవాన్ విద్యాం తాం మృత్యుశమనీం పరామ్ ।
కా సా విద్యా పరా తాత యథా మృత్యుర్హి వార్యతే ॥
లేభేంఽధకో గాణపత్యం కథం శూలాద్వినిర్గతః ।
దేవదేవస్య వై శంభోర్మునేర్లీలా విహారిణః ॥
ఏతత్సర్వమశేషేణ మహాధీమన్ కృపాం కురు ।
శివలీలామృతం తాత శృణ్వతః కథయస్వ మే ॥

వ్యాసుడిట్లు పలికెను -

భయంకరము, రోమాంచమును కలిగించునది అగు ఆ మహాసంగ్రామములో విద్వాంసుడు, రాక్షసగురువు అగు శుక్రుని త్రిపురారియగు శివుడు ఖ్రింగివేసెను (1). ఈ విషయమును నేను సంగ్రహముగా వినియుంటిని. దానిని మరల విస్తరముగా చెప్పుము. పినాకధారియగు శివుని జఠరములో మహాయోగి యగు శుక్రుడు ఏమిచేసెను? (2) కల్పాంతమునందు సర్వమును సంహరించే అగ్నియే శంభుని జఠరాగ్ని. అది శుక్రుని దహించ వేయకుండుట ఎట్లు సంభవము? గొప్ప తేజశ్శాలి, బుద్ధిశాలి యగు శుక్రుడు శంభుని జఠరమనే కారాగారమునుండి ఎట్లు బయటపడెను? ఆ శుక్రుడు శివుని ఎంతకాలము ఎట్లు ఆరాధించెను? (3,4) మరియు ఆతడు మరణించిన వానిని బ్రతికించే గొప్ప విద్యను పొందియుండెను. తండ్రీ ! మృత్యువును దూరము చేయు ఆ గొప్ప విద్య యొక్క స్వరూప మేమి? (5) దేవదేవుడు, తపశ్శాలి, లీలలను ప్రకటిస్తూ విహరించు వాడు అగు శంభుని శూలమునుండి బయటపడిన అంధకుడు గణాధ్యక్ష పదవిని ఎట్లు పొందెను? (6) తండ్రీ! నీవు మహా బుద్ధి శాలివి. అమృత తుల్యములగు ఈ శివలీలల వివరములనన్నిటినీ నిశ్శేషముగా చెప్పుము. నేను వినుటకు సిద్ధముగా నున్నాను (7).

బ్రహ్మోవాచ ।

ఇతి తస్య వచశ్శ్రుత్వా వ్యాసస్యామితతేజసః ।

సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

సాటిలేని తేజస్సు గల ఆ వ్యాసుని ఈ మాటను విని సనత్కుమారుడు శివుని పాదపద్మములను స్మరించి ఇట్లు పలికెను (8).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాబుద్ధే శివలీలామృతం పరమ్ ।

ధన్యస్త్వం శైవ ముఖ్యోఽసి మమానందకరస్స్మృతః ॥

ప్రవర్తమానే సమరే శంకరాంధకయోస్తయోః ।

అనిర్భేద్య పవివ్యూహ గిరివ్యూహాధినాథయోః ॥

పురా జయో బభూవాపి దైత్యానాం బలశాలినామ్ ।

శివ ప్రభావాదభవత్ప్రమథానాం మునే జయః ॥

తచ్ఛ్రుత్వాసీద్విషణ్ణో హి మహాదైత్యోఽధకాసురః ।

కథం స్యాన్మే జయ ఇతి విచారణ పరోఽభవత్ ॥

అపసృత్య తతో యుద్ధాదంధకః పరబుద్ధిమాన్ ।

ద్రుతమభ్య గమద్వీర ఏకలశ్శుక్ర సన్నిధిమ్ ॥

ప్రణమ్య స్వగురుం కావ్యమవరుహ్య రథాచ్చ సః ।

బభాషేదం విచార్యాథ సాంజలిర్నీతి విత్తమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా ! నీవు మహాబుద్ధిశాలివి. ఉత్కృష్టము, అమృతతుల్యము అగు శివలీలలను వినుము. నీవు ధన్యుడవు; శివభక్తులలో అగ్రేసరుడవు; నాకు సహజముగా ఆనందము కలిగించు వాడవు (9). ఆ శంకర- అంధకు లిద్దరు తమ సైన్యములను భేదింప శక్యముకాని వజ్ర-పర్వతవ్యూహములలో నిలబెట్టి సర్వసేనాధ్యక్షులై యుద్ధమును కొనసాగించుచుండగా (10), ముందుగా బలవంతులగు రాక్షసులకే విజయము లభించెను. ఓ మునీ ! కాని శివుని ప్రభావముచే తరువాత ప్రమథ గణములకు జయము కలిగెను (11). ఆ విషయమును విని మహారాక్షసుడగు అంధకుడు దుఃఖితుడై, 'నాకు జయము కలుగు ఉపాయమేమి?' అని

★ ఇచ్చట కొన్ని శ్లోకములు మాకు లభించిన మూలాములో లేవు వీటిని ఇతర మూలముల యందు పరిశీలించి త్వరలో పొందు పరచెదము ★

తుహుండహుండాదిక కుంభజంభవిపాక పాకాది మహాసురేంద్రాః ।
యమాలయాదద్య పునర్నివృత్తా విద్రావయంతః ప్రమథాంశ్చరంతి ॥
యది హ్యసౌ దైత్యవరాన్ని రస్తాన్ సంజీవయేదత్ర పునః పునస్తాన్ ।
జయః కుతో నో భవితా మహేశ గణేశ్వరాణాం కుత ఏవ శాంతిః ॥
ఇత్యేవముక్తః ప్రమథేశ్వరేణ స నందినా వై ప్రమథేశ్వరేశః ।
ఉవాచ దేవః ప్రహసంస్తదానీం తం నందినం సర్వగణేశరాజమ్ ॥

శ్రేష్ఠులగు ప్రమథులు ఆశ్చర్యకరమగు ఆ యుద్ధమనే యజ్ఞమును ఆ తీరున చేయుచుండగా, శుక్రుడు చేసిన పనిని సహింపజాలని వాడై, శిలాదపుత్రుడగు నంది మహేశ్వరుని వద్దకు వెళ్లెను (40). విజయమునకు కారణభూతుడు, బంగరు రంగు గలవాడు అగు శివుని ఉద్దేశించి నంది 'జయమగు గాక !' అని పలికి ఇట్లు వచించెను. ఇంద్రాది దేవ శ్రేష్ఠులకు కూడ సాధ్యము కాని యుద్ధమును గణాధ్యక్షులు చేయుచున్నారు (41). కాని మరణించిన శత్రువులను పునరుజ్జీవింపచేయు శుక్రుడు మా ఆ యుద్ధపరాక్రమమును వ్యర్థము చేయుచున్నాడు. ఓ ఈశా ! ఒక్కొక్క రాక్షసవీరుని ఉద్దేశించి ఆతడా విద్యను ఆవృత్తి చేసి వారిని అవలీలగా పునరుజ్జీవితులను చేయుచున్నాడు (42). తుహుండ, హుండ, కుంభ, జంభ, విపాక, పాకాది మహారాక్షసవీరులు యమనగరి నుండి మరలి వచ్చి ప్రమథులను తరిమిగొట్టుచూ సంచరించుచున్నారు (43). ఓ మహేశ్వరా! ఈతడు యుద్ధములో సంహరింపబడిన రాక్షసవీరులను మరల మరల బ్రతికించుచున్నచో, గణాధ్యక్షులకు జయము గాని, శాంతి గాని ఎట్లు లభించును? (44) ప్రమథగణాధిపతియగు శివదేవుడు ప్రమథగణాధ్యక్షుడు, సర్వగణాధ్యక్షులలో ప్రముఖుడు అగు నందీశ్వరునిచే ఈ విధముగా విన్నవించబడినవాడై నవ్వుతూ అపుడాతనితో నిట్లు పలికెను (45).

శివ ఉవాచ ।

నందిన్ ప్రయాహి త్వరితోఽతి మాత్రం ద్విజేంద్రవర్యం దితినందనానామ్ ।
మధ్యాత్సముద్ధృత్య తథానయాశు శ్యేనో యథా లావకమండజాతమ్ ॥

శివుడిట్లు పలికెను -

ఓ నందీ! నీవు త్వరత్వరగా వెళ్లి బ్రాహ్మణ శ్రేష్ఠుడగు శుక్రుని రాక్షసుల మధ్యనుండి గ్రద్ద పక్షిపిల్లను వలె లేవదీసుకొని వెంటనే ఇచటకు గొనిరమ్ము (46).

సనత్కుమార ఉవాచ ।

స ఏవముక్తో వృషభధ్వజేన ననాద నందీ వృషసింహనాదః ।
జగామ తూర్ణం చ విగాహ్య సేనాం యత్రా భవద్భార్గవ వంశదీపః ॥
తం రక్ష్యమాణం దితిజైస్సమస్తైః పాశాసివృక్షోపల శైలహస్తైః ।
విక్షోభ్య దైత్యాన్ బలవాన్ జహార కావ్యం స నందీ శరభో యథేభమ్ ॥
స్రస్తాంబరం విచ్యుత భూషణం చ విముక్త కేశం బలినా గృహీతమ్ ।
విమోచయిష్యంత ఇవానుజగ్ము స్సురారయస్సింహరవాంస్త్యజంతః ॥
దంహోలిశూలాసి పరశ్వథానా ముద్దండ చక్రోపలకంపనానామ్ ।
నందీశ్వరస్యపరి దానవేంద్రా వర్షం వవర్షుర్గలదా ఇవో గ్రమ్ ॥
తం భార్గవం ప్రాప్య గణాధిరాజో ముఖాగ్నినా శస్త్ర శతాని దగ్ధ్వా ।
ఆయాత్స్వవృద్ధేఽ సురదేవయుద్ధే భవస్య పార్శ్వే వ్యథితా రిపక్షః ॥
అయం స శుక్రో భగవన్నితీదం నివేదయామాస భవాయ శీఘ్రమ్ ।
జగ్రాహ శుక్రం స చ దేవదేవో యథోపహారం శుచినా ప్రదత్తమ్ ॥
న కించిదుక్త్వా స హి భూత గోప్తా చిక్షేప వక్త్రే ఫలవత్కవీంద్రమ్ ।
హాహారవస్తైసురైస్సమస్తైరుచ్చైర్విముక్తో హహా హేతి భూరి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శుక్ర
నిగీర్ణనవర్ణనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

వృషభధ్వజుడగు శివుడు ఇట్లు పలుకగా నందీశ్వరుడు ఎద్దు యొక్క ధ్వనిని సింహనాదమును చేసి శత్రు సేనల మధ్య గుండా దూసుకొని పోయి, భార్గవ వంశమునకు దీపము వంటి వాడగు శుక్రాచార్యుడు గల స్థానమునకు వెంటనే చేరుకొనెను (47). అనేక రాక్షసులు పాశములను ఖడ్గములను రాళ్లను పర్వతశిఖరములను చేతులలో ధరించి ఆ శుక్రుని రక్షించుచుండిరి. బలవంతుడగు నందీశ్వరుడు వారికి విశేషమగు క్షోభను కలిగించి శరభ మృగము ఏనుగును వలె ఆ శుక్రుని ఎత్తుకు వచ్చెను (48). ఆతని వస్త్రము జారుచుండగా, భూషణములు నేలబడగా, జుట్టు చెల్లాచెదురు కాగా బలశాలియగు నంది మోసుకు వచ్చెను. రాక్షసులు ఆతనిని విడిపించుట కొరకె సింహనాదములను చేస్తూ వెంటబడిరి (49). దానవ వీరులు నందీశ్వరునిపై పిడుగులను, శూలములను, ఖడ్గములను, గండ్రగొడ్డళ్లను, కర్రలను, చక్రములను, రాళ్లను, ఇతర ఆయుధములను మేఘములు ఉగ్రజలధారలను వలె వర్షించిరి (50). ఈ దేవాసురయుద్ధము మరింత పెరుగుచుండెను. అపుడు గణాధ్యక్షుడగు ఆ నంది తన నోటినుండి అగ్నిని సృష్టించి అసంఖ్యాకములగు శస్త్రములను దహించి శత్రుపక్షమునకు పీడను కలిగించి ఆ శుక్రుని ఎత్తుకొని శివుని సన్నిధికి వచ్చి పడెను (5 1). ఓ భగవాన్ ! ఆ శుక్రుడు వీడేనని ఆతడు వెంటనే శివునకు విన్నవంచగా, ఆ దేవదేవుడు ఆ శుక్రుని భక్తుడు సమర్పించిన ఉపహారమును వలె పట్టుకొనెను (52). ఆ భూతాధినాథుడు ఏమియూ పలుకకుండగా శ్రేష్ఠపురుషుడగు ఆ శుక్రుని పండును వలె నోటిలో వేసుకొనెను. అపుడా రాక్షసులందరు పలుమార్లు బిగ్గరగా 'అయ్యో! అయ్యో!' అని పలుకుతూ దుఃఖించిరి (53).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండలో శుక్రుని భక్షించుట అనే నలుబది ఏడవ అధ్యాయము ముగిసినది (47).

48 – శివుడు శుక్రుని ఖ్రింగివేయుట

వ్యాస ఉవాచ ।

శుక్రే నిగీర్ణే రుద్రేణ కిమకార్షుశ్చ దానవాః ।
అంధకేశా మహావీరా వద తత్త్వం మహామునే ॥

వ్యాసుడిట్లు పలికెను –

ఓ మహర్షి! రుద్రుడు శుక్రుని ఖ్రింగివేసిన తరువాత, అంధకుని అనుయాయులు మహావీరులు అగు దానవులు ఏమి చేసిరి? ఆ విషయమును నీవు చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

కావ్యే నిగీర్ణే గిరిజేశ్వరేణ దైత్యా జయాశారహితా బభూవుః ।
హస్తైర్విముక్తా ఇవ వారణేంద్రా శృంగైర్విహీనా ఇవ గోవృషాశ్చ॥
శిరో విహీనా ఇవ దేహసంఘా ద్విజా యథా చాధ్యయనేన హీనాః ।
నిరుద్యమాస్సత్త్వగణా యథా వై యథోద్యమా భాగ్యవివర్జితాశ్చ ॥
పత్యా విహీనాశ్చ యథైవ యోషా యథా విపక్షాః ఖలు మార్గణౌఘాః ।
ఆయూంషి హీనాని యథైవ పుణ్యైర్వ్రతై ర్విహీనాని యథా శ్రుతాని ॥
వినా యథా వైభవశక్తి మేకాం భవంతి హీనాస్సఫలైః క్రియౌఘాః ।
యథా విశూరాః ఖలు క్షత్రియాశ్చ సత్యం వినా ధర్మగణో యథైవ ॥
నందినా చాహృతే శుక్రే గిలితే చ విషాదినా ।
విషాదమగమన్ దైత్యా యతమానరణోత్సవాః ॥
తాన్ వీక్ష్య విగతోత్సాహా నంధకః ప్రత్య భాషత ।
దైత్యాం స్తుహుండహుండాదీన్ మహాధీర పరాక్రమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

పార్వతీపతి శుక్రుని ఖ్రింగివేయగా, రాక్షసులు విజయమునందు గల ఆశను వదులు కొనిరి. తుండములు లేని ఏనుగులు వలె, కొమ్ములు లేని గోసంతతివలె (2) శిరస్సు లేని మొండెములు వలె, వేదాధ్యయనము లేని బ్రాహ్మణులు వలె, ఉత్సాహశక్తి లేని ప్రాణి గణములు వలె, భాగ్యము తోడు గాని యోజనలు వలె (3), భర్తృవిహీనలగు స్త్రీలవలె, పక్షి రెక్కల ఈకలను కట్టిన తోకలు లేని బాణ సమూహములు వలె, వ్రతానుష్ఠానము లేని వేదములు వలె వారు నిర్వీర్యులైరి. ఎన్ని క్రియలను చేసిననూ వాటికి ధనబలము ఒక్కటి తోడుగానిచో ఆ క్రియాఫలములు ఉత్పన్నము గావు. వారి పని అట్లున్నది. వారు శౌర్యము లేని క్షత్రియులు వలె, సత్యము లేని ధర్మకార్యముల వలె నిరుత్సాహముగా నుండిరి (4,5). రాక్షసులు రణము అనే ఉత్సవము కొరకై యత్నించు చుండగా నందిచే

శుక్రుడు అపహరింపబడుటను, ఆ శుక్రుని శివుడు భక్షించుటను గాంచి దుఃఖమును పొందిరి (6). ఉత్సాహము నీరు గారియున్న తుహుండహుండాది ఆ రాక్షసులను గాంచి గొప్ప ధైర్యపరాక్రమములు గల అంధకుడు వారితో నిట్లనెను (7).

అంధక ఉవాచ ।

కవిం విక్రమ్య నయతా నందినా వంచితా వయమ్ ।
తనూర్వినా కృతాః ప్రాణాస్సర్వేషామద్య నో నను ॥
ధైర్యం వీర్యం గతిః కీర్తిస్సత్త్వం తేజః పరాక్రమః ।
యుగపన్నో హృతం సర్వమేకస్మిన్ భార్గవే హృతే ॥
ధిగస్మాన్ కులపూజ్యో యైరేకోఽపి కులసత్తమః ।
గురుస్సర్వసమర్థశ్చ త్రాతా త్రాతో న చాపది ॥
తద్యూయమవిలంబ్యేహ యుధ్యధ్వ మరిభిస్సహ ।
వీరైస్తైః ప్రమథైర్వీరాస్స్మృత్వా గురుపదాంబుజమ్ ॥
గురోః కావ్యస్య సుఖదౌ స్మృత్వా చరణపంకజౌ ।
సూదయిష్యామ్యహం సర్వాన్ ప్రమథాన్ సహ నందినా ॥
అద్యైతాన్ వివశాన్ హత్వా సహ దేవైస్సవాసవైః ।
భార్గవం మోచయిష్యామి జీవం యోగీవ కర్మతః ॥
స చాపి యోగీ యోగేన యది నామ స్వయం ప్రభుః ।
శరీరాత్తస్య నిర్గచ్ఛే దస్మాకం శేషపాలితా ॥

అంధకుడిట్లు పలికెను –

నంది తన పరాక్రమముతో శుక్రుని అపహరించి మనలను మోసగించినాడు. ఈ నాడు మన అందరి దేహములనుండి ప్రాణములు ఎగిరి పోయిన వనుట నిశ్చయము (8). ఒకే ఒక శుక్రుని అపహరించుటచే మన ధైర్య, పరాక్రమ, శక్తి, ఫల, కీర్తి, బల, తేజస్సులను ఒక్క మారుగా అపహరించినట్లైనది (9). కులములో శ్రేష్ఠుడు, కులమునకు పూజనీయుడు, గురువు, సర్వవిధములుగా సమర్థుడు, రక్షకుడు అగు ఒక్క వ్యక్తిని ఆపదలో రక్షించలేకపోయిన మనము నిందార్హులము (10). ఓ వీరులారా! కావున మీరు గురువు యొక్క పాదపద్మములను స్మరించి విలంబము లేకుండగా వీరులు, శత్రువులు అగు ఆ ప్రమథులతో యుద్ధమును చేయుడు (11). శుక్రాచార్యుని సుఖకరములగు పాదపద్మములను స్మరించి నేను నందితో సహా ప్రమథులనందరినీ సంహరించెదను (12). ఈనాడు ఇంద్రాది దేవతలతో కూడి యున్న వీరిని నిర్వీర్యులను చేసి సంహరించి, యోగి జీవుని కర్మ బంధమునుండి తప్పించు విధంబున, శుక్రుని విడిపించెదను (13). యోగి, సమర్థుడు అగు ఆ శుక్రుడు యోగశక్తిచే ఆయన శరీరమునుండి స్వయముగా బయట పడినచో, మిగిలియున్న మనమందరము రక్షింపబడెదము (14).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యంధకవచశ్శ్రుత్వా దానవా మేఘనిస్స్వనాః ।
ప్రమథాన్ నిర్దయాః ప్రాహుర్మర్తవ్యే కృతనిశ్చయాః ॥
సత్యాయుషి న నో జాతు శక్తాస్స్యుః ప్రమథా బలాత్ ।
అసత్యాయుషి కిం గత్వా త్యక్త్వా స్వామిన మాహవే ॥
యే స్వామినం విహాయాతో బహుమానధనా జనాః ।
యాంతి తే యాంతి నియతమంధ తామిస్ర మాలయమ్ ॥
అయశస్తమసా ఖ్యాతిం మలినీకృత్య భూరిశః ।
ఇహాముత్రాపి సుఖినో న స్యుర్భగ్నా రణాజిరే ॥
కిం దానైః కిం తపోభిశ్చ కిం తీర్థపరిమజ్జనైః ।
ధారాతీర్థే యది స్నానం పునర్భ వ మలాపహే ॥
సంప్రధార్యేతి తద్వాక్యం దైత్యాస్తే దనుజాస్తథా ।
మమంథుః ప్రమథానాజౌ రణభేరీం వినాద్య చ ॥
తత్ర బాణాసి వజ్రౌఘైః కఠినైశ్చ శిలామయైః ।
భుశుండి భిందిపాలైశ్చ శక్తి భల్ల పరశ్వధైః ॥
ఖట్వాంగైః పట్టిశై శ్శూలైర్ల కుటైర్ము సలైరలమ్ ।
పరస్పరమభిఘ్నంతః ప్రచక్రుః కదనం మహత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

అంధకుని ఈ మాటలను విని మరణించుటకు నిశ్చయించుకున్న దయావిహీనులగు ఆ రాక్షసులు ప్రమథులనుద్దేశించి మేఘగంభీర ధ్వనితో నిట్లనిరి (15). ఆయుర్దాయమున్నచో మమ్ములను ప్రమథులు ఎన్నటికైననూ బలముతో జయింపజాలరు. ఆయుర్దాయము లేనిచో ప్రభువును యుద్ధరంగములో విడిచి వెళ్లిననూ, ప్రయోజనమేమి గలదు? (16) ఎవరైతే మానమర్యాదలు, ధనము అధికమని తలంచి ప్రభువుని విడిచిపెట్టి యుద్ధరంగమునుండి నిర్గమించెదరో, వారు నిశ్చితముగా అంధతామిస్రమనే నరకలోకమును పొందెదరు (17). అపకీర్తి యను చీకటిచే కీర్తిని అధికముగా మలినము గావించి వారు ఇహపరలోకములలో సుఖమునైననూ పొందజాలరు. రణరంగములో మరణించుటయే మేలు (18). పునర్జన్మ దోషమును పోగొట్టే ఖడ్గధారయను తీర్థములో స్నానమును చేసినవానికి దానములతో గాని, తపస్సులతో గాని, తీర్థస్నానములతో గాని పని యేమున్నది? (19) ఆ దైత్య దానవులు అంధకుని వచనములను మనస్సులో స్థిరముగా నుంచుకొని రణభేరిని మ్రోగించి యుద్ధములో ప్రమథులను దునుమాడ జొచ్చిరి (20). అచట వారు బాణములు, కత్తులు, వజ్రముల సమూహములతో, కఠిన పాషాణములతో, భుశుండి భింది పాలములతో, శక్తి, బల్లెము, గొడ్డలి అను ఆయుధములతో (21),

ఖట్వాంగములతో, పట్టిసములతో, శూలములతో, లకుటములతో, రోకళ్లతో ఒకరినొకరు గట్టిగా కొడుతూ గొప్ప యుద్ధమును చేసిరి (22).

కార్ముకాణాం వికృష్టానాం పతతాం చ పతత్త్రిణామ్ ।
భిందిపాలభుశుండీనాం క్ష్వేడితానాం రవోఽ భవత్ ॥
రణతూర్య నినా దైశ్చ గజానాం బహుబృంహితైః ।
హేషారవైర్హయానాం చ మహాన్ కోలాహలోఽ భవత్ ॥
అస్తి స్వనైరవాపూరి ద్యావా భూమ్యోర్యదంతరమ్ ।
అభీరూణాం చ భీరూణాం మహా రోమోద్గమోఽ భవత్ ॥
గజవాజి మహారావ స్ఫుట శబ్ద గ్రహాణి చ ।
భగ్నధ్వజ పతాకాని క్షీణ ప్రహరణాని చ ॥
రుధిరోద్గారచిత్రాణి వ్యశ్వహస్తిరథాని చ ।
పిపాసితాని సైన్యాని ముమూర్చు రుభయత్ర వై ॥
అథ తే ప్రమథా వీరా నంది ప్రభృతయస్తదా ।
బలేన జఘ్నురసురాన్ సర్వాన్ ప్రాపుర్జయం మునే ॥
దృష్ట్వా సైన్యం చ ప్రమథైర్భజ్యమానమితస్తతః ।
దుద్రావ రథమాస్థాయ స్వయమేవాంధకో గణాన్ ॥
శరావారప్రయుక్తైస్తైర్వ జ్రపాతైర్నగా ఇవ ।
ప్రమథా నే శిరే చాస్త్రైర్నిస్తోయా ఇవ తోయదాః ॥
యాంత మాయాంత మాలోక్య దూరస్థం నికటస్థితమ్ ।
ప్రత్యేకం రోమ సంఖ్యాభిర్వ్యాధేషుభిరంధకః ॥

ధనస్సుల నారిత్రాటిని లాగి ఎక్కు పెట్టుటలో, బాణములు పడుటలో, భిందిపాలభుశుండుల ప్రయోగములలో పుట్టిన శబ్దమునకు సింహనాదముల శబ్దము తోడగుచుండెను (23). యుద్ధవాద్యముల ధ్వనులు, నినాదములు, ఏనుగుల అతిశయించిన ఘీంకారములు, గుర్రముల సకిలింపు ధ్వనులు కలిసి పెద్ద కోలాహలము చెలరేగెను (24). భూమ్యాకాశముల మధ్య భాగము వివిధశబ్దములతో నిండి యుండెను. భీరువులకు మరియు ధైర్యవంతులకు కూడ సమానముగా అధికమగు రోమాంచము కలిగెను (25). ఏనుగులు, గుర్రములు పెద్ద ధ్వనులచే సైనికుల కర్ణభేరులు పగులు చుండెను. ధ్వజములు పతాకములు విరిగి యుండెను. ఆయుధములు క్షీణించెను (26). రెండు పక్షముల సైన్యములలోని సైనికులు, గుర్రములు, ఏనుగులు వివిధ పద్ధతులలో రక్తమును గ్రక్కుచుండిరి. గుర్రములు, ఏనుగులు మరియు రథముల సంఖ్య క్షీణించెను. సైనికులు దాహముతో మూర్ఛిల్లుచుండిరి (27). ఓ మునీ! అపుడు నంది మొదలగు ప్రమథ వీరులు బలముగా రాక్షసులనందరినీ సంహరించి జయమును పొందిరి

(28). తన సైన్యము ప్రమథుల దెబ్బలకు తాళలేక చెల్లాచెదరగుటను గాంచి అంధకుడు స్వయముగా రథమునెక్కి గణములను తరుమ జొచ్చెను (29). వజ్రపు దెబ్బలకు పర్వతములు వలె, అతడు ప్రయోగించిన శస్త్ర పరంపరలకు ప్రమథులు తట్టుకొనజాలక, నీరులేని మేఘములు వలె నిర్వీర్యులైరి (30). అంధకుడు తనకు వ్యతిరేకదిశలో వెళ్లుచున్న వానిని, అభిముఖముగా వచ్చుచున్న వానిని, దూరముగా నున్నవానిని, దగ్గరలో నున్న వానిని గాంచి ప్రతి ఒక్కనిని ఒక్కొక్క రోమమునకు ఒక్కొక్కటి చొప్పున బాణములతో కొట్టెను (31).

దృష్ట్వా సైన్యం భజ్యమాన మంధకేన బలీయసా ।
స్కందో వినాయకో నందీ సోమ నంద్యాదయః పరే ॥
ప్రమథాః ప్రబలా వీరా శ్శంకరస్య గణా నిజాః ।
చక్రుధుస్సమరం చక్రుర్విచిత్రం చ మహాబలాః ॥
వినాయకేన స్కందేన నందినా సోమనందినా ।
వీరేణ నైగమేయేన వైశాఖేన బలీయసా ॥
ఇత్యాద్యైస్తు గణైరుగ్రై రంధకోఽ ప్యంధకీకృతః ।
త్రిశూలశక్తి బాణౌఘధారా సంపాతపాతిభిః ॥
తతః కోలాహలో జాతః ప్రమథాసురసైన్యయోః ।
తేన శబ్దేన మహతా శుక్రశ్శంభూదరే స్థితః ॥
ఛిద్రాన్వేషీ భ్రమన్ సోఽ థ వినికేతో యథానిలః ।
సప్తలోకాన్ సపాతాలాన్ రుద్రదేహే వ్యలోకయత్ ॥
బ్రహ్మనారాయణేంద్రాణాం సాదిత్యాప్సరసాం తథా ।
భువనాని విచిత్రాణి యుద్ధం చ ప్రమథాసురమ్ ॥
స వర్షాణాం శతం కుక్షౌ భవస్య పరితో భ్రమన్ ।
న తస్య దదృశే రంధ్రం శుచే రంధ్రం ఖలో యథా ॥
శాంభవేనాథ యోగేన శుక్రరూపేణ భార్గవః ।
ఇమం మంత్రవరం జప్త్వా శంభోర్జఠర పంజరాత్ ॥
నిష్క్రాంతం లింగమార్గేణ ప్రణనామ తతశ్శివమ్ ।
గౌర్యా గృహీతః పుత్రార్థం తదా విఘ్నేశ్వరీకృతః ॥
అథ కావ్యం వినిష్క్రాంతం శుక్రమార్గేణ భార్గవమ్ ।
దృష్ట్వోవాచ మహేశానో విహస్య కరుణానిధిః ॥

బలవంతుడగు అంధకుడు సైన్యమును వినాశము చేయుచుండుటను గాంచి కుమారస్వామి, వినాయకుడు, నంది, సోమనంది మొదలగు మహాబలశాలురైన వీరులు, శంకరుని స్వీయగణములగు ఇతర ప్రమథులు కోపించి విచిత్రమగు యుద్ధమును చేసిరి (32,33). వినాయకుడు, స్కందుడు, నంది, సోమనంది, వీరుడగు నైగమేయుడు, బలవంతుడగు వైశాఖుడు, మరియు

భయంకరులగు ఇతర గణములు త్రిశూల, శక్తి, బాణసమూహములను ధారాపాతముగా కురిపించి అంధకుని అంధుని చేసిరి (34, 35). అపుడు ప్రమథ, రాక్షస సేనల మధ్య పెద్ద కోలాహలము బయలుదేరెను. ఆ పెద్ద శబ్దమును విని, శంభుని ఉదరమునందున్న శుక్రుడు ఒక స్థిరమగు స్థానము లేని గాలివలె మార్గమును వెదుకుతూ తిరుగాడెను. అపుడాతడు శంభుని ఉదరములో ఏడు ఊర్ధ్వలోకములను, ఏడు అధోలోకములను గాంచెను (36, 37). మరియు బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, ఆదిత్యులు, అప్సరసలు, చిత్రములగు భువనములు మరియు ప్రమథాసుర యుద్ధము ఆతనికి కానవచ్చెను (38). పుణ్యాత్మునిలో దుష్టునకు వెదికిననూ దోషము కానరాదు. అటులనే, ఆతడు శివుని ఉదరములో సర్వత్రా తిరుగుతూ వంద సంవత్సరములు గడిపిననూ, బయట పడే మార్గము కానరాలేదు (39). అపుడా భార్గవుడు శాంభవయోగముచే శుక్రరూపమును పొంది ఈ శ్రేష్ఠమంత్రమును జపిస్తూ శంభుని ఉదరమనే కారాగారమునుండి (40) లింగమార్గము గుండా బయట పడి, తరువాత శివునకు ప్రణమిల్లెను. పార్వతి అపుడాతని తన పుత్రునిగా స్వీకరించి విఘ్నేశ్వరునితో సమమగు గణాధ్యక్షపదవి నొసంగెను (41). అపుడు శుక్రమార్గము గుండా బయటపడిన శుక్రాచార్యుని గాంచి కరుణాసముద్రుడగు మహేశ్వరుడు నవ్వి ఇట్లు పలికెను (42).

మహేశ ఉవాచ ।

శుక్రవన్నిస్సృతో యస్మాల్లింగాన్మే భృగునందన ।
కర్మణా తేన శుక్రస్త్వం మమ పుత్రోఽసి గమ్యతామ్ ॥

మహేశ్వరుడిట్లు పలికెను –

ఓ భృగుపుత్రా! నా లింగమునుండి నీవు శుక్రమువలె నిర్గమించితివి. అందువలన, నీవు శుక్రుడవు. నీవు నా పుత్రుడవు. పొమ్ము (43).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యేవముక్తో దేవేన శుక్రోఽర్క సదృశద్యుతిః ।
ప్రణనామ శివం భూయస్తుష్టా వ విహితాంజలిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

సూర్యునితో సమముగా వెలిగిపోవుచున్న శుక్రుడు శివునిచే ఇట్లు పలుకబడినవాడై, చేతులు జోడించి ఆ దేవునకు పలుమార్లు నమస్కరించి స్తుతించెను (44).

శుక్ర ఉవాచ ।

అనంత పాదస్త్వమనంతమూర్తి రనంత మూర్ధాంతకరశ్శివశ్చ ।
అనంతబాహుః కథమీ దృశం త్వాం స్తోష్యే హ నుత్యం ప్రణిపత్య మూర్ధ్నా ॥
త్వమష్టమూర్తి స్త్వమనంతమూర్తి స్త్వమిష్టదస్సర్వ సురాసురాణామ్ ।
అనిష్టదృష్టశ్చ విమర్దకశ్చ స్తోష్యే హ నుత్యం కథ మీదృశం త్వామ్ ॥

శుక్రుడిట్లు పలికెను -

నీకు అనంత సంఖ్యలో పాదములు, రూపములు, బాహువులు గలవు. నీవు సంహారకారకుడవగు శివుడవు. పొగడ దగిన ఇట్టి నిన్ను నేను ఎట్లు పొగడగలను? శిరసు వంచి నమస్కరించుచున్నాను (45). నీవు ఎనిమిది రూపములలో జగత్తును వ్యాపించి యున్నావు. జగత్తులోని రూపములన్నియూ నీవే. దేవతలకు రాక్షసులకు అందరికీ కోర్కెల నీడేర్చేవాడవు నీవే. ఆపదలయందు కనబడువాడవు; సంహారకుడవు నీవే. ఇట్టి స్తుతింపదగిన నిన్ను నేను ఎట్లు స్తుతించగలను? (46)

సనత్కుమార ఉవాచ ।

ఇతి స్తుత్వా శివం శుక్రః పునర్నత్వా శివాజ్ఞయా ।
వివేశ దానవానీకం మేఘమాలాం యథా శశీ ॥
నిగీర్ణనమితి ప్రోక్తం శంకరేణ కవే రణే ।
శృణు మంత్రం చ తం జప్తో యశ్శంభోః కవినోదరే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే శుక్రనిగీర్ణనం నామ అష్టా చత్వారింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శుక్రుడు ఇట్లు శివుని స్తుతించి మరల నమస్కరించి శివుని యాజ్ఞచే, చంద్రుడు మేఘపంక్తిలోనికి వలె, దానవసైన్యములోనికి ప్రవేశించెను (47). ఈ తీరున యుద్ధము జరిగిన సమయములో శంకరుడు శుక్రుని మ్రింగిన వృత్తాంతము చెప్పబడినది. శుక్రుడు శివుని ఉదరములోనున్న వాడై జపించిన శివమంత్రమును ఇపుడు వినుము (48).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో శివుడు శుక్రుని మ్రింగివేయుట అనే నలుబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (48).

49 – అంధకునకు గణాధ్యక్ష పదవి లభించుట

సనత్కుమార ఉవాచ ।

ఓం నమస్తే దేవేశాయ సురాసురనమస్కృతాయ భూత భవ్యమహా
దేవాయ హరితపింగలలోచనాయ బలాయ బుద్ధిరూపిణే
వైయాఘ్రవసనచ్ఛదాయారణేయాయ త్రైలోక్య ప్రభవే ఈశ్వరాయ హరాయ
హరితనేత్రాయ యుగాంతకరణాయానలాయ గణేశాయ లోకపాలాయ
మహాభుజాయ మహాహస్తాయ శూలినే మహాదంష్ట్రిణే కాలాయ మహేశ్వరాయ
అవ్యయాయ కాలరూపిణే నీలగ్రీవాయ మహోదరాయ గణాధ్యక్షాయ సర్వాత్మనే
సర్వభావనాయ సర్వగాయ మృత్యుహంత్రే పారియాత్ర సువ్రతాయ బ్రహ్మచారిణే
వేదాంతగాయ తపోంతగాయ పశుపతయే వ్యంగాయ శూలపాణయే వృషకేతవే
హరయే జటినే శిఖండినే లకుటినే మహాయశసే భూతేశ్వరాయ గుహావాసినే వీణా
పణవతాలవతే అమరాయ దర్శనీయాయ బాలసూర్యనిభాయ శ్మశానవాసినే
భగవతే ఉమా పతయే అరిందమాయ భగస్యాక్షిపాతినే పూష్ణో దశననాశనాయ
క్రూరకర్తకాయ పాశహస్తాయ ప్రలయకాలాయ ఉల్కాముఖాయాగ్ని కేతవే మునయే
దీప్తాయ విశాంపతయే ఉన్నతయే జనకాయ చతుర్థకాయ లోకసత్తమాయ
వామదేవాయ వాగ్దాక్షిణ్యాయ వామతో భిక్షవే భిక్షురూపిణే జటినే స్వయం
జటిలాయ శక్రహస్త ప్రతిస్తంభకాయ క్రతవే క్రతుకరాయ కాలాయ మేధావినే
మధుకరాయ చలాయ వానస్పత్యాయ వాజసనేతి సమాశ్రమ పూజితాయ జగద్ధాత్రే
జగత్కర్త్రే పురుషాయ శాశ్వతాయ ధ్రువాయ ధర్మాధ్యక్షాయ త్రివర్త్మనే
భూతభావనాయ త్రినేత్రాయ బహురూపాయ సూర్యాయుత సమప్రభాయ దేవాయ
సర్వతూర్యనినాదినే సర్వబాధా విమోచనాయ బంధనాయ సర్వధారిణే
ధర్మోత్తమాయ పుష్పదంతాయావి భాగాయ ముఖ్యాయ సర్వహరాయ హిరణ్య
శ్రవసే ద్వారిణే భీమాయ
భీమపరాక్రమాయ ఓం నమో నమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓం దేవదేవుడు, దేవతలచే రాక్షసులచే నమస్కరింపబడువాడు, భూత భవిష్యత్కాలములలోని ప్రాణులకు గొప్ప దైవము, పచ్చని మరియు తేనె రంగు గల కన్నులు గలవాడు, బలశాలి, బుద్ధిస్వరూపుడు, వ్యాఘ్రచర్మమే ఉత్తరీయముగా గలవాడు, అరణినుండి పుట్టిన యజ్ఞాగ్నియే స్వరూపముగా గలవాడు, ముల్లోకములకు ప్రభువు, ఈశ్వరుడు, పాపహారి, పచ్చని కన్నులు గలవాడు, ప్రళయకాలాగ్ని స్వరూపుడు, గణాధ్యక్షుడు, లోకములను పాలించువాడు, గొప్ప భుజములు చేతులు గలవాడు, శూలధారి, గొప్ప దంష్ట్రలు గలవాడు, మృత్యుస్వరూపుడు, మహేశ్వరుడు, వినాశము లేనివాడు, నల్లని కంఠము గలవాడు, గొప్ప ఉదరము గలవాడు, సర్వస్వరూపుడు, సర్వకారణుడు, సర్వవ్యాపి,

మృత్యుంజయుడు, పారియాత్ర పర్వతముపై గొప్ప తపస్సును చేసినవాడు, బ్రహ్మచారి, వేదాంత ప్రతిపాద్యుడు, తపస్సు యొక్క అవధులను దాటిన వాడు, జీవులకు పాలకుడు, నిరవయవుడు, వృషభము ధ్వజమునందు గలవాడు, జటాధారి, జుట్టుముడి గలవాడు, దండధారి, గొప్ప కీర్తి గలవాడు, భూతపతి, గుహాయందు ఉండువాడు, వీణపై మృదంగముపై తాళములను పలికించువాడు, అవినాశి, సుందరాకారుడు, బాలసూర్యుని వలె ప్రకాశించువాడు, శ్మశానమునందు నివసించు వాడు, భగవాన్ పార్వతీపతి, శత్రుసంహారకుడు, భగుని కన్నులను పూష దంతములను బెరికిన వాడు, దుష్టసంహారకుడు, పాశధారి, ప్రలయకాల మృత్యుస్వరూపుడు, ఉల్క నోటియందు గలవాడు, అగ్నియే ధ్వజముగా గలవాడు, మననశీలి, ప్రకాశస్వరూపుడు, మానవులకు ప్రభువు, ఎత్తైన దేహము గలవాడు, తండ్రి, త్రిమూర్తుల కతీతుడు, భువనములలో సర్వశ్రేష్ఠుడు, వామదేవుడు, వక్తలలో శ్రేష్ఠుడు, భిక్షురూపధారియై వామార్ధమునందున్న అన్నపూర్ణనుండి భిక్షను గోరువాడు, తెలియ శక్యము కాని స్వరూపము గలవాడు, ఇంద్రుని చేతులను స్తంభింప జేసినవాడు, యజ్ఞస్వరూపుడు, యజమానస్వరూపుడు, మృత్యుస్వరూపుడు, జ్ఞాననిధి, బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ ఆశ్రమస్వరూపుడు, సర్వాశ్రమముల వారిచే వాజసన నామముతో పూజింపబడువాడు, జగత్తును సృష్టించి పోషించే శాశ్వత కూటస్థ పరబ్రహ్మ స్వరూపుడు, ధర్మమునకు అధ్యక్షుడు, ఉత్తర-దక్షిణ- అధో మార్గములు గలవాడు, ప్రాణులను సృష్టించువాడు, ముక్కంటి, అనేక రూపుడు, పదివేల సూర్యులతో సమమగు తేజస్సు గలవాడు, ప్రకాశస్వరూపుడు, సర్వవాద్యముల ధ్వనులు గలవాడు, బాధలనన్నింటి నుండియు విముక్తిని కలిగించువాడు, సంసారములో బంధించువాడు, ఉత్తమమగు ధర్మస్వరూపుడు, పుష్పదంతస్వరూపుడు, ద్వైతవర్జితుడు, త్రిమూర్తులలో ముఖ్యుడు, సర్వమును హరించువాడు, బంగరు వర్ణముగల చెవులు గలవాడు, ద్వారదేవతా రూపుడు, భయంకరుడు, భయంకరమగు పరాక్రమము గలవాడు, ఓంకారస్వరూపుడు అగు శివునకు అనేక వందనములు (1).

ఇమం మంత్రవరం జప్త్వా శుక్రో జఠరపంజరాత్ ।
నిష్క్రాంతో లింగమార్గేణ శంభోశ్శు క్రమిపోత్కటమ్ ॥
గౌర్యా గృహీతః పుత్రార్థం విశ్వేశేన తతః కృతః ।
అజరశ్చామరశ్చమాన్ ద్వితీయ ఇవ శంకరః ॥
త్రిభిర్వర్ష సహస్రైస్తు సమతీతైర్మ హీతలే ।
మహేశ్వరాత్పునర్జాత శ్శుక్రోవేదనిధిర్మునిః ॥
దదర్శ శూలే సంశుష్కం ధ్యాయంతం పరమేశ్వరమ్ ।
అంధకం ధైర్యసంయుక్తం దానవేశం తపస్వినమ్ ॥

మహాదేవం విరూపాక్షం చంద్రార్ధ కృతశేఖరమ్ ।
అమృతం శాశ్వతం స్థాణుం నీలకంఠం పినాకినమ్ ॥
వృషభాక్షం మహా జ్ఞేయం పురుషం సర్వకామదమ్ ।
కామారిం కామదహనం కామరూపం కపర్దినమ్ ॥
విరూపం గిరిశం భీమం స్రగ్విణం రక్త వాససమ్ ।
యోగినం కాలదహనం త్రిపురఘ్నం కపాలినమ్ ॥

శుక్రుడు ఈ గొప్ప మంత్రమును జపించి శివుని ఉదరము అనే పంజరమునుండి లిం◌ంగమార్గము గుండా ఉత్కటమగు శుక్రమువలె నిష్క్రమించెను (2). పార్వతి ఆయనను పుత్రునిగా స్వీకరించగా, విశ్వేశ్వరుడు తరువాత ఆయనను రెండవ శంకరుని వలే జరామరణములు లేనివాడై శోభిల్లునట్లు చేసెను (3). భూలోకములో మూడు వేల సంవత్సరముల కాలము గడిచిన తరువాత వేదనిధియగు శుక్రమహర్షి శివునినుండి మరల జన్మించెను (4). శూలముపై ఎండిపోయిననూ ధైర్యముతో తపస్సును చేయుచున్న రాక్షసరాజగు అంధకుని ఆయన గాంచెను. ఆతడు పరమేశ్వరుని ధ్యానించు చుండెను. (5). మహాదేవుడు, బేసి కన్నులవాడు, చంద్రవంకతో ప్రకాశించే శిరస్సు గలవాడు, అమృత స్వరూపుడు, నిత్యుడు, కూటస్థుడు, నల్లని కంఠము గలవాడు, పినాకధారి (6), వృషభముయొక్క కన్నులు వంటి కన్నులు గలవాడు, జ్ఞేయబ్రహ్మ రూపుడు, చేతనుడు, కోర్కెలనన్నిటినీ తీర్చు వాడు, కాముని దహించి సంహరించిన వాడు, యథేచ్ఛారూపము గలవాడు, జటాధారి (7), వికృతరూపుడు, కైలాసవాసి, భయంకరుడు, మాలను ధరించినవాడు, ఎర్రని వస్త్రములు గలవాడు, యోగి, కాలాంతకుడు, త్రిపురారి, కపాల ధారియగు శివుని ఆతడు ధ్యానించెను (8).

గూఢవ్రతం గుప్తమంత్రం గంభీరం భావగోచరమ్ ।
అణిమాదిగుణాధారం త్రిలోక్యైశ్వర్య దాయకమ్ ॥
వీరం వీరహణం ఘోరం విరూపం మాంసలం పటుమ్ ।
మహామాంసాదమున్మత్తం భైరవం వై మహేశ్వరమ్ ॥
త్రైలోక్య ద్రావణం లుబ్ధం లుబ్ధకం యజ్ఞసూదనమ్ ।
కృత్తికానాం సుతైర్యుక్తమున్మత్తం కృత్తివాససమ్ ॥
గజకృత్తి పరీధానం క్షుబ్ధం భుజగ భూషణమ్ ।
దద్యాలంబం చ వేతాలం ఘోరం శాకిని పూజితమ్ ॥
అఘోరం ఘోరదైత్యఘ్నం ఘోరఘోషం వనస్పతిమ్ ।
భస్మాంగం జటిలం శుద్ధం భేరుండశతసేవితమ్ ॥
భూతేశ్వరం భూతనాథం పంచభూతా శ్రితం ఖగమ్ ।
క్రోధితం నిష్ఠురం చండం చండీశం చండికాప్రియమ్ ॥
చండం తుంగం గరుత్మంతం నిత్యమాసవభోజనమ్ ।
లేలిహానం మహారౌద్రం మృత్యుం మృత్యోరగోచరమ్ ॥

మృత్యోర్మృత్యుం మహాసేనం శ్మశానారణ్య వాసినమ్ ।
రాగం విరాగం రాగాంధం వీతరాగశతార్చితమ్ ॥
సత్వం రజస్తమోధర్మమధర్మం వాసవానుజమ్ ।
సత్యం త్వసత్యం సద్రూపమసద్రూప మహేతుకమ్ ॥
అర్ధనారీశ్వరం భానుం భాను కోటీశత ప్రభమ్ ।
యజ్ఞం యజ్ఞ పతిం రుద్రమీశానం వరదం శివమ్ ॥
అష్టోత్తరశతం హ్యేతన్మూర్తీనాం పరమాత్మనః ।
శివస్య దానవో ధ్యాయన్ ముక్తస్తస్మాన్మహా భయాత్ ॥
దివ్యేనామృతవర్షేణ సోఽభిషిక్తః కపర్దినా ।
తుష్టేన మోచితం తస్మా చ్ఛూలాగ్రా దవరోపితః ॥
ఉక్తశ్చాథ మహాదైత్యో మహేశానేన సోఽ ధకః ।
అసురస్సాంత్వపూర్వం యత్ కృతం సర్వం మహాత్మనా ॥

రహస్యమగు వ్రతము మరియు మంత్రము గలవాడు, గంభీరమైన వాడు, మనస్సులో సాక్షాత్కరించువాడు, అణిమ మొదలగు అష్టసిద్ధులకు ఆధారమైన వాడు, ముల్లోకములకు ఐశ్వర్యము నిచ్చువాడు (9), వీరుడు, శత్రు వీరులను సంహరించువాడు, భయంకరాకారుడు, వికృతరూపుడు, బలిసి యున్నవాడు, సమర్థుడు, మాంసభక్షకుడు ఉన్మత్తునివలె నున్నవాడు అగు భైరవుడు, మహేశ్వరుడు (10), ముల్లోకములను సంహరించువాడు, లోభి, కిరాతుడు, యజ్ఞనాశకుడు, కార్తికేయునితో గూడి యున్నవాడు, ఉన్మత్తుడు, చర్మమే వస్త్రముగా గలవాడు (11), గజ చర్మ ఉత్తరీయముగా గలవాడు, క్షోభను పొంది సృష్టిని చేయువాడు, పాములే ఆభరణములుగా గలవాడు, సహకారము నిచ్చువాడు, వేతాళుడు, శాకినిచే పూజింపబడే భయంకరమగు ఆకారము గలవాడు (12), సౌమ్యరూపుడు, భయంకరులగు రాక్షసులను సంహరించువాడు, భయంకరమగు సింహనాదమును చేయువాడు, వృక్షములో నుండువాడు, భస్మను ధరించువాడు, జటాధారి, నిత్యశుద్ధుడు, అనేక భేరుండములచే సేవింపబడు వాడు (13), భూతములకు ప్రభువు, ప్రాణులకు తండ్రి, పంచభూతములకు కారణమైనవాడు, ఆకాశరూపుడు, కోపించి హానిని కలిగించే భయంకరుడు, చండీ దేవికి ప్రియుడగు భర్త (14), ఉన్నతమైన వాడు, గరుత్మంతుని రూపములో నున్నవాడు, నిత్యము అమృతమే భోజనముగా గలవాడు, ముల్లోకములను అవలీలగా సంహరించే మహారుద్రస్వరూపుడు, మృత్యు రూపుడు, మృత్యువునకు అతీతుడు (15), మృత్యువునకు మృత్యువు, మహాసేనానాయకుడు, శ్మశానమునందు అరణ్యమునందు నివసించువాడు, రాగము గలవాడు, విరాగి, రాగముచే వివేకమును గోల్పోయినట్లు కన్పట్టువాడు, అనేకులగు వైరాగ్య సంపన్నులైన జ్ఞానులచే అర్చింపబడువాడు (16), సత్వరజస్తమోగుణములకు

ధర్మాధర్మములకు అధిష్ఠానమైనవాడు, ఇంద్రుని తమ్ముడు (విష్ణువు), సత్య-అసత్యములకు సత్ (కార్య) - అసత్ (కారణ) లకు అధిష్ఠానమైన వాడు, జన్మ లేనివాడు (17), అర్ధనారీశ్వరుడు, సూర్యుడు, కాంతి గలవాడు, యజ్ఞరూపుడు, యజమాన రూపుడు, రుద్రుడు, ఈశానుడు, వరములనిచ్చువాడు, మంగళకరుడు (18) అగు పరమాత్మ యొక్క నూట ఎనిమిది రూపములను ధ్యానించి ఆ రాక్షసుడు ఆ మహాభయమునుండి విముక్తుడయ్యెను (19). అపుడు జటాజూట ధారియగు శివుడు సంతసించి శూలాగ్రమునుండి క్రిందకు దింపి విముక్తుని చేసి దివ్యమగు అమృత వర్షముతో ఆతనిని అభిషేకించెను (20). మహాత్ముడగు అంధకుడు పూర్వములో చేసిన పనులనన్నిటినీ విస్మరించి మహేశ్వరుడు అనునయ పూర్వకముగా ఆ మహారాక్షసునితో నిట్లనెను (21).

ఈశ్వర ఉవాచ ।

భోభో దైత్యేంద్ర తుష్టోఽస్మి దమేన నియమేన చ ।
శౌర్యేణ తవ ధైర్యేణ వరం వరయ సువ్రత ॥
ఆరాధితస్త్వయా నిత్యం సర్వనిర్ధూత కల్మషః ।
వరదోఽహం వరార్హస్త్వం మహాదైత్యేంద్ర సత్తమ ॥
ప్రాణసంధారణా దస్తి యచ్చ పుణ్యఫలం తవ ।
త్రిభిర్వర్ష సహస్రైస్తు తేనాస్తు తవ నిర్వృతిః ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓయీ! రాక్షసరాజా! నీ ఇంద్రియనిగ్రహమునకు, నియమపాలనకు, ధైర్యశౌర్యములకు సంతసించితిని. ఓయీ గొప్ప వ్రతము గలవాడా! వరమును కోరుకొనుము (22). ఓ మహారాక్షసశ్రేష్ఠ! నీ సమస్త దోషములు తొలగిపోయినవి. వరములకు యోగ్యుడవగు నీవు వరదుడనగు నన్ను నిత్యము ఆరాధించితివి (23). నీవు మూడు వేల సంవత్సరములు ప్రాణములను (శూలముపై) ధరించి యుండుటచే ఏ పుణ్యము లభించినదో, దాని వలన నీకు సుఖము కలుగు గాక! (24)

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వాంధకః ప్రాహ వేపమానః కృతాంజలిః ।
భూమౌ జానుద్వయం కృత్వా భగవంతముమాపతిమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఈ మాటను విని అంధకుడు వణికి పోతూ చేతులు జోడించి మోకాళ్ళపై నిలబడి భగవాన్ పార్వతీపతితో నిట్లనెను (25).

అంధక ఉవాచ ।

భగవన్ యన్మయోక్తోఽ సి దీనో దీనః పరాత్పరః ।
హర్షగద్గదయా వాచా మయా పూర్వం రణాజిరే ॥
యద్యత్కృతం విమూఢత్వాత్కర్మ లోకేషు గర్హితమ్ ।
అజానతా త్వాం తత్సర్వం ప్రభో మనసి మా కృథాః ॥
పార్వత్యామపి దుష్టం యత్ కామదోషాత్ కృతం మయా ।
క్షమ్యతాం మే మహాదేవ కృపణా దుఃఖితో భృశమ్ ॥
దుఃఖితస్య దయా కార్యా కృపణస్య విశేషతః ।
దీనస్య భక్తి యుక్తస్య భవతా నిత్యమేవ హి ॥
సోఽహం దీనో భక్తియుక్త ఆగతశ్శరణం తవ ।
రక్షా మయి విధాతవ్యా రచితోఽ యం మయాంజలిః ॥
ఇయం దేవీ జగన్మాతా పరితుష్టా మమోపరి ।
క్రోధం విహాయ సకలం ప్రసన్నా మాం నిరీక్షతామ్ ॥
క్వాస్యాః క్రోధః క్వ కృపణో దైత్యోఽహం చంద్రశేఖర ।
తత్సోఢా నాహ మర్ద్ధేందు చూడ శంభో మహేశ్వర ॥
క్వ భవాన్పరమోదారః క్వ చాహం వివశీకృతః ।
కామక్రోధాదిభిర్ఘోషైర్జరసా మృత్యునా తథా ॥
అయం తే వీరకః పుత్రో యుద్ధశౌండో మహాబలః ।
కృపణం మాం సమాలక్ష్య మా మన్యువశమన్వగాః ॥
తుషార హార శీతాంశు శంఖ కుందేందు వర్ణభాక్ ।
పశ్యేయం పార్వతీం నిత్యం మాతరం గురు గౌరవాత్ ॥
నిత్యం భవద్భ్యాం భక్తస్తు నిర్వైరో దేవతైస్సహ ।
నివసేయం గణైస్సార్ధం శాంతాత్మా యోగచింతకః ॥
మా స్మరేయం పునర్జాతం విరుద్ధం దానవోద్భవమ్ ।
త్వత్కృపాతో మహేశాన దేహ్యేతద్వర ముత్తమమ్ ॥

అంధుకుడిట్లు పలికెను -

హే భగవన్! నేను పూర్వము యుద్ధరంగములో ఆనందాతిరేకముతో గద్గదమైన వచనములతో పరాత్పరుడవగు నిన్ను దీనులలో దీనునిగా భావించి ఏవేవో పలికితిని (26). ఓ ప్రభూ! నీ స్వరూపము నెరుంగక నేను పరమ మూఢుడనై లో కములలో నిందింపబడే ఏయే కర్మలను చేసితినో, ఆ సర్వమును నీవు మనస్సులో పెట్టు కొనవద్దు (27). ఓ మహాదేవా! పార్వతి విషయములో కామమనే దోషమువలన నేను ఏయే తప్పులనాచరించితినో, వాటిని కూడ క్షమించవలెను. నేను దీనుడను, మిక్కిలి దుఃఖించుచున్నాను (28). దుఃఖితుడు, దీనుడు అగు భక్తునియందు నీవు సర్వదా విశేషమగు దయను చూపదగును (29). నేను దీనుడను, భక్తుడను; నిన్ను శరణు వేడుచున్నాను. చేతులు జోడించి నమస్కరించుచున్నాను. నన్ను రక్షించుము (30). జగన్మాతయగు ఈ దేవి నాపై కోపమును విడనాడి సంతోషముతో ప్రసన్న వీక్షణములను నాపై బరపుగాక! (31) ఓ చంద్రశేఖరా! శంభో! మహేశ్వరా! ఆమె క్రోధమెక్కడ? దీనుడను, రాక్షసుడను అగు నేనెక్కడ? నేను ఆమె కోపమును భరించలేను (32). పరమదయామూర్తివగు నీవెక్కడ? కామక్రోధాది దోషములకు, జరామృత్యువులకు పూర్తిగా వశుడనై ఉండే నేనెక్కడ? (33) నీ పుత్రుడగు ఈ వీరకుడు మహాబలశాలి, యుద్ధములో దక్షుడు. దీనుడనగు నన్ను గాంచి ఈతడు క్రోధమును చేయకుండు గాక! (34) మంచు, ముత్యాలహారము, చంద్రుడు, శంఖము, మల్లెపువ్వు వలె స్వచ్ఛమగు వర్ణము గలవాడా! తల్లియగు పార్వతిని నేను సర్వదా మహాగౌరవముతో చూడగలను (35). నేను దేవతలతో వైరమును మాని, శాంతమగు మనస్సుతో యోగమును గురించి ఆలోచిస్తూ, మీ ఇద్దరితో మరియు గణములతో కలిసి భక్తి పూర్వకముగా జీవించెదను (36). ఓ మహేశ్వరా! నీ కృపచే నేను దానవవంశములో పుట్టుట వలన కలిగిన విరుద్ధ స్వభావమును పూర్తిగా మరచిపోయెదను. నాకీ ఉత్తమమగు వరము నిమ్ము (37).

సనత్కుమార ఉవాచ ।

ఏతావదుక్త్వా వచనం దైత్యేంద్రో మౌనమాస్థితః ।
ధ్యాయంస్త్రిలోచనం దేవం పార్వతీం ప్రేక్ష్య మాతరమ్ ॥
తతో దృష్టస్తు రుద్రేణ ప్రసన్నేనైవ చక్షుషా ।
స్మృతవాన్ పూర్వవృత్తాంత మాత్మనో జన్మ చాద్భుతమ్ ॥
తస్మిన్ స్మృతే చ వృత్తాంతే తతః పూర్ణమనో రథః ।
ప్రణమ్య మాతాపితరౌ కృతకృత్యోఽ భవత్తతః ॥
పార్వత్యా మూర్ధ్న్యు పాఘ్రాతశ్శంకరేణ చ ధీమతా ।
తథాభిలషితం లేభే తుష్టాద్బాలేందు శేఖరాత్ ॥
ఏతద్వస్సర్వమాఖ్యాత మంధకస్య పురాతనమ్ ।
గాణపత్యం మహాదేవ ప్రసాదాత్పర సౌఖ్యదమ్ ॥
మృత్యుంజయశ్చ కథితో మంత్రో మృత్యువినాశనః ।
పఠితవ్యః ప్రయత్నేన సర్వకామ ఫలప్రదః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధ ఖండే అంధకగణ జీవిత ప్రాప్తి వర్ణనం నామ ఏకోన పంచాశత్తమోఽధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఆ రాక్షసరాజు ఇంతమాత్రము పలికి తల్లియగు పార్వతిని చూచి ముక్కంటి దేవుని ప్రార్థిస్తూ మిన్నకుండెను (38). అపుడు రుద్రుడు ప్రసన్నమగు చూపులనాతనిపై ప్రసరింప జేయగా, ఆతడు అద్భుతమగు తన పూర్వజన్మ వృత్తాంతమును స్మరించగల్గెను (39). అపుడాతడు ఆ వృత్తాంతము స్మరణకు రాగానే పరిపూర్ణమైన మనో రథము గలవాడై తల్లిదండ్రులకు ప్రణమిల్లి కృతార్థుడాయెను (40). పార్వతి ఆతనిని శిరస్సుపై ముద్దాడెను. చంద్రవంకను శిరమున దాల్చిన ధీశాలియగు శంకరుడు సంతసించి ఆతని కోర్కెను నెరవేర్చెను (41). అంధకుడు మహాదేవుని అనుగ్రహముచే పూర్వము గణాధ్యక్ష స్థానమును పొంది మహాసౌఖ్యముననుభవించిన వృత్తాంతమునంతనూ మీకీ తీరున చెప్పి యుంటిని (42). మృత్యువును దూరము చేసి కోర్కెలనన్నిటినీ ఈడేర్చే మృత్యుంజయ మంత్రమును కూడ చెప్పితిని. దీనిని ప్రయత్న పూర్వకముగా పఠించుడు (43).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో అంధకునకు గణాధ్యక్ష పదవి లభించుట అనే నలుబది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (49).

50 – శుక్రుడు మృతసంజీవనీ విద్యను సంపాదించుట

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస యథా ప్రాప్తా మృత్యు ప్రశమనీ పురా ।
విద్యా కావ్యేన మునినా శివాన్మృత్యుంజయా ద్ధితాత్ ॥
పురాసా భృగుదాయాదో గత్వా వారాణసీం పురీమ్ ।
బహుకాలం తపస్తేపే ధ్యాయన్ విశ్వేశ్వరం ప్రభుమ్ ॥
స్థాపయామాస తత్రైవ లింగం శంభోః పరాత్మనః ।
కూపం చకార సద్రమ్యం వేదవ్యాస తదగ్రతః ॥
పంచామృతైర్ద్రోణమితైర్లక్షకృత్వః ప్రయత్నతః ।
స్నాపయామాస దేవేశం సుగంధస్నపనైర్బహు ॥
సహస్రకృత్వో దేవేశం చందనైర్యక్ష కర్దమైః ।
సమాలిలింప సుప్రీత్యా సుగంధోద్వర్త నాన్యను ॥
రాజ చంపకధత్తూరైః కరవీర కుశేశయైః ।
మాలతీ కర్ణికారైశ్చ కదంబైర్బకులోత్పలైః ॥
మల్లికాశతపత్రీభిస్సింధువారైస్సకింశుకైః ।
బంధూకపుష్పైః పున్నాగైర్నాగకేశరకేశరైః ॥
నవమల్లీ చిబిలికైః కుంధైస్సముచుకుందకైః ।
మందారైర్బిల్వ పత్రైశ్చ ద్రోణైర్మరువకైర్వకైః ॥
గ్రంథిపర్ణైర్దమనకైస్సురమ్యై శ్చూతపల్లవైః ॥
తులసీ దేవగంధారీ బృహత్ప త్రీ కుశాంకురైః ।
నంద్యావర్తై రగస్త్యైశ్చ సశాలైర్దేవ దారుభిః ॥
కాంచనారైః కురవకై ర్దూర్వాంకుర కురుంటకైః ।
ప్రత్యేకమేభిః కుసుమైః పల్లవైరపరైరపి ॥
పత్రైస్సహస్ర పత్రైశ్చ రమ్యైర్నానా విధైశ్శుభైః ।
సావధానేన సుప్రీత్యా స సమానర్చ శంకరమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ వ్యాసా! పూర్వము శుక్రమహర్షి మృత్యుంజయుడను పేరు గల శివుని వద్దనుండి మృతసంజీవనీ విద్యను సంపాదించిన వృత్తాంతమును వినుము (1). భృగువంశజుడగు ఈ శుక్రుడు పూర్వము కాశీనగర మునకు వెళ్లి విశ్వేశ్వరప్రభుని ధ్యానిస్తూ చిరకాలము తపస్సును చేసెను (2). ఓ వేదవ్యాసా! ఆతడచటనే పరమాత్మ యొక్క లింగము నొకదానిని స్థాపించి దానియెదుట ఒక మంచి అందమగు నూతిని నిర్మించెను (3). ఆతడు కుంచము పరిమాణముగా గల పంచామృతములతో శ్రద్ధాపూర్వకముగా ఆ దేవదేవుని లక్షసార్లు అభిషేకించెను.

మరియు పరిమళభరితములగు జలములతో పలుమార్లు అభిషేకించెను (4). ఆ దేవదేవునకు చందనముతో మరియు యక్ష కర్దమము (కర్పూరము, మృగనాభి, గంధపు చెక్క ఇత్యాదులతో చేసిన ముద్ద) తో వేయిసార్లు పరమ ప్రీతితో సుగంధ లేపనములను చేసెను (5). రాజ చంపకములు, ధత్తూరములు, గన్నేరు పువ్వులు, పద్మములు, జాజి, కొండగోగు, కడప పుష్పములు, బకుల పుష్పములు, నల్లకలువలు (6), మల్లెలు, వావిలి పువ్వులు, కింశుకములు, మంకెనలు, సురపొన్నలు, నాగకేసరములు, పొగడలు (7), విరజాజులు, రక్తదళములు, కుందపుష్పములు, ముచుకుందములు, మందారములు, మారేడు పత్రములు, నీలిచెట్టు పుష్పములు, మరువము, ధూపము, మాచిపత్రి, దమనకము, మిక్కిలి అందమైన మామిడి చిగుళ్లు (8), తులసి, దేవగంధారి, వాకుడు వృక్షముల పత్రములు, దర్భచిగుళ్లు, నంద్యావర్తపుష్పములు, అగస్త్య శాలదేవదారు పుష్పములు (9), ములు గోరింటలు, దూర్వలు, చిగుళ్లు, పచ్చ గోరింటలు ఇత్యాది పుష్పములన్నింటితో మరియు ఇతరములగు చిగుళ్లతో (10), పత్రములతో, సహస్రదళ పద్మములతో, నానావిధములైన శుభకరమగు పత్రపుష్పములతో ఆతడు సావధానమనస్కుడై మహాప్రీతితో శంకరుని చక్కగా అర్చించెను (11).

గీతనృత్యోపహారైశ్చ సంస్తుతస్తు తిభిర్బహు ।
నామ్నాం సహస్రైరన్యైశ్చ స్తోత్రైస్తుష్టావ శంకరమ్ ॥
సహస్రం పంచశరదామిత్థం శుక్రో మహేశ్వరమ్ ।
నానా ప్రకార విధినా మహేశం స సమర్చయత్ ॥
యదా దేవం నామలోకే మనాగపి వరోన్ముఖమ్ ।
తదాన్యం నియమం ఘోరం జగ్రాహాతీవ దుస్సహమ్ ॥
ప్రక్షాల్య చేతసోఽత్యంతం చాంచల్యాఖ్యం మహామలమ్ ।
భావనావార్భిరసకృదింద్రియైస్సహితస్య చ ॥
నిర్మలీకృత్య తచ్చేతో రత్నం దత్త్వా పినాకినే ।
ప్రయయౌ కణధూమౌఘం సహస్రం శరదాం కవిః ॥
కావ్యమిత్థం తపో ఘోరం కుర్వంతం దృఢమానసమ్ ।
ప్రససాద స తం వీక్ష్య భార్గవాయ మహేశ్వరః ॥
తస్మాల్లింగా ద్వినిర్గత్య సహస్రార్కాధికద్యుతిః ।
ఉవాచ తం విరూపాక్ష స్సాక్షా దాక్షాయణీపతిః ॥

ఆతడు శంకరునకు నైవేద్యమును సమర్పించి గానమును వినిపించి నృత్యమును ప్రదర్శించి, అనేక స్తోత్రములతో మరియు సహస్రనామములతో చిరకాలము స్తుతించెడివాడు (12). ఆ శుక్రుడు ఈ తీరున పరిపరి విధములలో, ఆ మహేశ్వరుని అయిదు వేల సంవత్సరములు ఆరాధించెను (13). ఆ దేవుడు వరమునిచ్చే సూచన లేశమైననూ కానరాలేదు. అపుడు ఆతడు మిక్కిలి దుస్సహమగు మరియొక భయంకర నియమమును చేపట్టెను (14). ఆతడు

ఇంద్రియములతో గూడి యున్న మనస్సు యొక్క చంచలత అనే మహాదోషమును భక్తి అను జలములతో నిశ్శేషముగా ప్రక్షాళన చేసెను (15). ఆ విధముగా పరిశుద్ధమైన మనస్సు అనే రత్నమును పినాకధారియగు శివునకు సమర్పించి ఆ శుక్రుడు కాలిన ఊకనుండి వచ్చే పొగను పీలుస్తూ వేయి సంవత్సరములు తపస్సును చేసెను (16). ఈ విధముగా దృఢచిత్తముతో భృగువంశజుడగు శుక్రుడు ఘోరమగు తపస్సును చేయుచుండుటను గాంచి మహేశ్వరుడు ప్రసన్నుడాయెను (17). సతీదేవికి పతి, ముక్కంటి అగు ఆ దేవుడు స్వయముగా ఆ లింగమునుండి వేయి సూర్యుల కంటే అధిక కాంతితో ఆవిర్భవించి ఆతనితో నిట్లనెను (18).

మహేశ్వర ఉవాచ ।

తపోనిధే మహాభాగ భృగుపుత్ర మహామునే ।
తపసానేన తే నిత్యం ప్రసన్నోఽహం విశేషతః ॥
మనోఽభిలషితం సర్వం వరం వరయ భార్గవ ।
ప్రీత్యా దాస్యేఽఖిలాన్ కామాన్నాదేయం విద్యతే తవ ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

ఓ తపోనిధీ! మహాత్మా! భార్గవమహర్షీ! నీవు నిత్యము చేయుచున్న ఈ తపస్సుచే నేను చాల ప్రసన్నుడనైతిని (19). ఓ భార్గవా! నీ మనస్సులోని కోర్కెలనన్నిటినీ కోరుకొనుము. నేను నీ కోర్కెలనన్నిటినీ ప్రీతితో నెరవేర్చెదను. నీకు ఈయదగనిది లేదు (20).

సనత్కుమార ఉవాచ ।

నిశమ్యేతి వచశ్శంభోర్మహాసుఖకరం వరమ్ ।
స బభూవ కవిస్తుష్టో నిమగ్నస్సుఖవారిధౌ ॥
ఉద్యదానందసందోహ రోమాంచాంచిత విగ్రహః ।
ప్రణనామ ముదా శంభుమంభోజనయనో ద్విజః ॥
తుష్టావాష్టతనుం తుష్టః ప్రఫుల్ల నయనాంచలః ।
మౌలావంజలిమాధాయ వదన్ జయ జయేతి చ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శంభుని మహానందదాయకమగు ఈ శ్రేష్ఠవచనమును విని ఆ శుక్రుడు ఆనందసముద్రములో ఓలలాడుతూ సంతోషించెను (21). ఉప్పొంగు చున్న ఆనందప్రవాహముచే కలిగిన రోమాంచముతో నిండిన దేహము గలవాడు, పద్మముల వంటి నేత్రములు గలవాడు అగు ఆ బ్రాహ్మణుడు ఆనందముతో శంభుని ప్రణమిల్లెను (22). ఆయన సంతోషముతో వికసించిన కన్నులు గలవాడై శిరస్సుపై చేతులను జోడించి జయ జయ ధ్వానములను చేయుచూ అష్టమూర్తియగు శివుని స్తుతించెను (23).

భార్గవ ఉవాచ ।

త్వం భాభిరాభిరభిభూయ తమస్సమస్తమస్తం నయస్యభి మతాని నిశాచరాణామ్ ।
దేదీప్యసే దివమణే గగనే హితాయ లోకత్రయస్య జగదీశ్వర తన్నమస్తే ॥
లోకేఽతి వేలమతి వేల మహామహోభిర్నిర్భాసి కౌ చ గగనేఽ ఖిలలోక నేత్రః ।
విద్రావితాఖిల తమాస్సుతమో హిమాంశో పీయూషపూర పరిపూరిత తన్నమస్తే ॥
త్వం పావనే పథి సదాగతిరప్యుపాస్యః కస్త్వాం వినా భువనజీవన జీవతీహ ।
స్తబ్ధప్రభంజనవివర్ధిత సర్వజంతోః సంతోషితాహికుల సర్వగ వై నమస్తే ॥
విశ్వైక పావక న తావకపావకైకశక్తేర్ ఋతే మృతవతామృత దివ్య కార్యమ్ ।
ప్రాణిష్యదో జగదహో జగదంతరాత్మంస్త్వం పావకః ప్రతిపదం శమదో నమస్తే ॥
పానీయరూప పరమేశ జగత్పవిత్ర చిత్రం విచిత్ర సు చరిత్ర కరోఽ సి నూనమ్ ॥
విశ్వం పవిత్రమమలం కిల విశ్వనాథ పానీయగాహనత ఏతదతో నతోఽస్మి ॥
ఆకాశరూప బహిరంతరుతావకాశ దానా ద్వికస్వరమిహేశ్వర విశ్వమేతత్ ।
త్వత్తస్సదా సదయ సంశ్వసితి స్వ భావాత్సంకోచమేతి భవతోఽస్మి నతస్తతస్త్వామ్ ॥
విశ్వం భరాత్మక బిభర్షి విభోఽ త్ర విశ్వం కో విశ్వనాథ భవతోఽన్య తమస్తమోఽరిః ।
స త్వం వినాశయ తమో తమ చాహిభూష స్తవ్యాత్పరః పరపరం ప్రణతస్తతస్త్వామ్ ॥
ఆత్మస్వరూప తవ రూపపరం పరాభిరాభిస్తతం హర చరాచర రూపమేతత్ ।
సర్వాంతరాత్మనిలయ ప్రతిరూపరూప నిత్యం నతోఽ స్మి పరమాత్మజనోఽష్టమూర్తే ॥
ఇత్యష్ట మూర్తిభిరిమాభిర బంధుబంధో యుక్తౌ కరోషి ఖలు విశ్వజనీనమూర్తే ।
ఏతత్తతం సువితతం ప్రణత ప్రణీత సర్వార్థ సార్థపరమార్థ తతో నతోఽస్మి ॥

శుక్రాచార్యుడిట్లు పలికెను

నీవు ఈ కాంతులతో చీకట్లనన్నిటినీ పారద్రోలి రాక్షసుల మనోరథములను ధ్వంసమొనర్చుచున్నావు. ఓ జగత్పతీ! సూర్యరూపా! నీవు లోకహితము కొరకై ఆకాశమునందు వెలిగిపోవుచున్నావు. నీకు నమస్కారము (24). ఓ చంద్రా! నీవు జనులకు కన్ను వంటి వాడవు. నిన్ను చూచి భూమిపై గల సముద్రము పెద్ద పెద్ద కెరటములతో ఉప్పొంగి చెలియలి కట్టను దాట గోరుచున్నది. నీవు ఆకాశములో ప్రకాశిస్తూ నీ చల్లని కిరణములతో చీకట్లనన్నిటినీ పారద్రోలి జగత్తును వెన్నెలలనే అమృత ధారలతో ముంచెత్తుచున్నావు. నీకు నమస్కారము (25). ఓ వాయూ! నీవు పవిత్రమగు అంతరిక్షమార్గములో సంచరిస్తూ సర్వమును వ్యాపించుచున్నావు. లోకుల ప్రాణశక్తి స్వరూపుడవగు నీవు లేనిదే ఏ జీవి బ్రతుకగలదు? నీవు ఒకప్పుడు కదలిక లేదా యన్నట్లు ఉండి మరుక్షణములో తుఫాను రూపమును దాల్చెదవు. సర్వప్రాణులను వర్ధిల్లజేయు నీకు నమస్కారము. నీవు సర్ప సముదాయములకు భోజనమై వాటిని సంతోషపెట్టెదవు (26). జగత్తును పవిత్రము చేయు ఏకైక మూర్తివగు ఓ అగ్నీ ! నీ పవిత్రీకరణ శక్తి లేనిచో ఈ లోకము మృతప్రాయమగును. జగత్తునకు అంతరాత్మవగు నీవు అమృతస్వరూపమగు హవిస్సును దేవతల కొసంగి వారికి ఉపకారములను చేయుచున్నావు. నిన్ను మ్రొక్కు ప్రాణులకు నీవు ప్రతి అడుగులో శాంతిని కలిగించెదవు. నీకు నమస్కారము (27). జలరూపములో నుండి సర్వమును శుద్ధి చేయు ఓ పరమేశ్వరా ! నీ గొప్ప చరిత్రలు నిశ్చయముగా అద్భుతములు. ఓ విశ్వనాథా ! ఈ జగత్తులోని సర్వము నీ స్వరూపమగు జలములో మునక వేసి పవిత్రమగుచున్నది. అట్టి ఈ జలరూపుడవగు నీకు నమస్కారము (28). ఆకాశరూపములో నున్న ఓ ఈశ్వరా ! శబ్దము గుణముగా గల నీవు లోపల, బయట అవకాశము నిచ్చుట చేతనే ఈ జగత్తు మనగల్గుచున్నది. ఓ దయామూర్తీ ! నీకు నేను నమస్కరించుచున్నాను (29). స్వస్వరూపమగు విశ్వమును పాలించి పోషించువాడా! సర్వవ్యాపీ! ఈ విశ్వమును నీవే పృథివీ రూపములో ధరించియున్నావు. అజ్ఞానమును పోగొట్ట గల దైవము నీవు తక్క మరియెవరు గలరు? సర్పములు అలంకారముగా గలవాడా! మా ఈ చీకట్లను నీవు పారద్రోలుము. సర్వాతీతుడవగు నీవు స్తోత్రములకు అతీతుడవు. అట్టి నీకు ప్రణమిల్లు చున్నాను (30). ఓయీ ఆత్మ స్వరూపుడవగు హరా ! ఈ చరాచర జగత్తు అంతయు నీ ఈ రూపముల వరుసలచే నిండి యున్నది. ఓయీ అష్టమూర్తీ! సర్వప్రాణుల అంతరాత్మ నీ నివాసస్థానము. పరమాత్మవగు నీకు భక్తుడనగు నేను నిత్యము నమస్కరించుచున్నాను (31); బంధువులు లేని వారికి బంధుడవు నీవే. ఈ జగత్తు సర్వము నీ స్వరూపమై యున్నది. నీవీ ఎనిమిది రూపములతో ఈ జగత్తు నంతనూ వ్యాపించి యున్నావు. నిన్ను నమస్కరించు భక్తుల కోర్కెల నన్నిటినీ నీవు ఈడేర్చెదవు. పరమార్థము నీస్వరూపమే. అట్టి నీకు నమస్కరించు చున్నాను (32).

సనత్కుమార ఉవాచ ।

అష్ట మూర్త్యష్టకేనేత్థం పరిష్టుత్యేతి భార్గవః ।
భర్గం భూమిమిలన్మౌలిః ప్రణనామ పునః పునః ॥
ఇతి స్తుతో మహాదేవో భార్గవేణాతి తేజసా ।
ఉత్థాయ భూమేర్బాహుభ్యాం ధృత్వా తం ప్రణతం ద్విజమ్ ॥
ఉవాచ శ్లక్ష్ణయా వాచా మేఘనాదగభీరయా ।
సుప్రీత్యా దశనజ్యోత్స్నా ప్రద్యోతి తదిగంతరః ॥

సనత్కుమారుడిట్లు పలికెను – .

భార్గవుడు ఈ విధముగా శివుని అష్టమూర్తి – అష్టకముతో చక్కగా స్తుతించి తలను నేలకు తాకించి అన్ని పలుమార్లు ప్రణమిల్లెను (33). గొప్ప తేజశ్శాలి యగు భార్గవునిచే ఈ విధముగా స్తుతించ బడిన మహాదేవుడు సాష్టాంగ పడిన ఆ బ్రాహ్మణుని చేతులతో భూమినుండి పైకి లేవదీసి పట్టుకొని (34), మేఘధ్వని వలె గంభీరమైన మృదు వచనములతో ప్రేమ పూర్వకముగా ఇట్లు పలుకు చుండగా ఆయన దంత కాంతులచే దిక్కులన్నియు వెలిగి పోయెను (35).

మహాదేవ ఉవాచ ।

విప్రవర్య కవే తాత మమ భక్తోఽసి పావనః ।
అనేనాత్యుగ్రతపసా స్వజన్మాచరితేన చ ॥
లింగస్థాపనపుణ్యేన లింగస్యారాధనేన చ ।
దత్త చిత్తోపహారేణ శుచినా నిశ్చలేన చ ॥
అవిముక్త మహాక్షేత్ర పవిత్రాచరణేన చ ।
త్వాం సుతాభ్యాం ప్రపశ్యామి తవాదేయం న కించన ॥
అనేనైవ శరీరేణ మమోదరదరీగతః ।
మద్వరేంద్రియ మార్గేణ పుత్ర జన్మత్వ మేష్యసి ॥
యచ్ఛామ్యహం వరం తేఽద్య దుష్ప్రాప్యం పార్షదైరపి ।
హరేర్హిరణ్య గర్భాచ్చ ప్రాయశోఽహం జుగోప యమ్ ॥
మృతసంజీవనీ నామ విద్యా మమ యా నిర్మలా ।
తపోబలేన మహతా మయైవ పరినిర్మితా ॥
త్వాం తాం తు ప్రాపయామ్యద్య మంత్రరూపాం మహాశుచే ।
యోగ్యతా తేఽస్తి విద్యాయాస్తస్యాశ్శుచితపోనిధే ॥

మహాదేవుడిట్లు పలికెను –

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! వత్సా! శుక్రా! నీవు భక్తుడవు. పవిత్రుడవు. నీ ఈ ఘోరమగు తపస్సు చేత, ఈ తపస్సును ఈ జన్మలో ఆచరించుట చేత (36), లింగమును స్థాపించిన పుణ్యము చేత, లింగము నారాధించుట చేత, పవిత్రము నిశ్చలము అగు మనస్సును నాకు ఉపహారముగా సమర్పించుట చేత (37),

కాశీమహాక్షేత్రములో పవిత్రముగా జీవించుట చేత, నిన్ను నా ఇద్దరు పుత్రులతో సమానముగా చూచుచున్నాను. నీకు ఈయదగని వరము లేదు. (38). నీవు ఇదే శరీరముతో నా ఉదరమనే గుహలో ప్రవేశించి నా ఇంద్రియ మార్గము గుండా పుత్రరూపములో జన్మించగలవు (39). నా కింకరులైననూ పొంద శక్యముకాని వరమును నీకీనాడు ఇచ్చుచున్నాను. నేనీ వరమును విష్ణు బ్రహ్మలకు తెలియకుండగా రహస్యముగా నుంచితిని (40). నేను నా యొక్క తపోబలముచే స్వయముగా నిర్మించిన నిర్మలమైన మృతసంజీవనీ విద్య గలదు (41). మహాపవిత్రుడా! ఈ నాడు ఆ విద్యను నీకు నేర్పెదను. నీవు శుచిత్వమునకు, తపస్సునకు నిధివి. ఆ విద్యను పొందే అర్హత నీకు గలదు (42).

యం యముద్దిశ్య నియతమేతామావర్తయిష్యసి ।
విద్యాం విద్యేశ్వరశ్రేష్ఠం సత్యం ప్రాణిష్యతి ధ్రువమ్ ॥
అత్యర్కమత్యగ్ని చ తేజో వ్యోమ్ని చ తారకమ్ ।
దేదీప్యమానం భవితా గ్రహాణాం ప్రవరో భవ ॥
అపి చ త్వాం కరిష్యంతి యాత్రాం నార్యో నరోఽపివా ।
తేషాం త్వద్దృష్టిపాతేన సర్వం కార్యం ప్రణశ్యతి ॥
తవోదయే భవిష్యంతి వివాహాదీని సువ్రత ।
సర్వాణి ధర్మకార్యాణి ఫలవంతి నృణామిహ ॥
సర్వాశ్చ తిథయో నందాస్తవ సంయోగతశ్శుభాః ।
తవ భక్తా భవిష్యంతి బహుశుక్రా బహు ప్రజాః ॥
త్వయేదం స్థాపితం లింగం శుక్రేశమితి సంజ్ఞితమ్ ।
యేఽర్చయిష్యంతి మనుజాస్తేషాం సిద్ధిర్భవిష్యతి ॥
ఆవర్షం ప్రతిఘస్రాం యే నక్త వ్రత పరాయణాః ।
త్వద్దినే శుక్రకూపే యే కృతసర్వోదక క్రియాః ॥
శుక్రేశమర్చ యిష్యంతి శృణు తేషాం తు యత్ఫలమ్ ।
అవంధ్య శుక్రాస్తే మర్త్యాః పుత్రవంతోఽతిరేతసః ॥
పుంస్త్వ సౌభాగ్య సంపన్నా భవిష్యంతి న సంశయః ।
ఉపేత విద్యాస్తే సర్వే జనాస్స్యుస్సుఖ భాగినః ॥
ఇతి దత్వా వరాన్ దేవస్తత్ర లింగే లయం యయౌ ।
భార్గవోఽపి నిజం ధామ ప్రాప సంతుష్టమానసః ॥
ఇతి తే కథితం వ్యాస యథా ప్రాప్తా తపోబలాత్ ।
మృత్యుంజయాభిధా విద్యా కిమన్య చ్ఛ్రోతుమిచ్ఛసి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే మృత్యు
సంజీవనీ విద్యా ప్రాప్తి వర్ణనం నామ పంచాశత్తమోఽ ధ్యాయః ॥

నీవు ఏ జీవిని ఉద్దేశించి యైననూ శ్రద్ధతో విద్యలలో కెల్లా గొప్పది యగు ఈ విద్యను పఠించినచో, ఆ జీవి నిశ్చయముగా మరల జీవించును. ఇది సత్యము (43). ఆకాశమునందు నీవు గ్రహరూపుడవైసూర్యుని, అగ్నిని అతిశయించిన ప్రకాశము గలవాడవై గొప్ప తేజస్సుచే గ్రహములలో శ్రేష్ఠుడవు కాగలవు (44). మరియు నీకు అభిముఖముగా పురుషులు గాని, స్త్రీలు గాని యాత్రను చేసినచో, నీ దృష్టి పడుటచే వారి కార్యమంతయు నాశము కాగలదు (45). ఓ గొప్ప వ్రతము గలవాడా! భూలోకములో నీవు ఉదయించిన కాలములో మానవులు వివాహాది సమస్త ధర్మకార్యములను చేసినిచో, అవి సఫలము కాగలవు (46). నంద తిథులన్నియు నీ సంయోగముచే శుభకరములగును. నీ భక్తులు అధిక సంతానము గలవారగుదురు (47). నీచే స్థాపించబడిన ఈ లింగమునకు శుక్రేశ్వరుడని పేరు. దీనిని అర్చించు మానవులు సిద్ధిని బడయగలరు (48). ఒక సంవత్సరకాలము ప్రతి దినము రాత్రియందు వ్రతనిష్ఠ గలవారై నీ దినమునాడు శుక్ర కూపములో ఉదకక్రియలనన్నిటినీ చేసి (49), శుక్రేశుని అర్చించువారికి లభించు ఫలమును చెప్పెదను వినుము. పురుషులు బలశాలురై అధిక సంతానమును పొంది, పౌరష సంపన్నులగుదురనుటలో సందేహము లేదు. వారు విద్యావంతులై సుఖములను బడయుదురు (50, 51). ఆ దేవుడు. ఈ విధముగా వరములనిచ్చి అచటనే లింగములో విలీనమాయెను. శుక్రుడు కూడ సంతోషముతో నిండిన మనస్సు గలవాడై తన నివాసమునకు చేరుకొనెను (52). ఓ వ్యాసా! శుక్రుడు తపోబలముచే మృత్యుంజయ విద్యను సంపాదించిన వృత్తాంతమును ఇంతవరకు నీకు చెప్పియుంటిని. ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? (53)

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండలో మృత్యుసంజీవనీ విద్యను శుక్రుడు పొందుటను వర్ణించే ఏబదియవ అధ్యాయము ముగిసినది (50).

51 - ఉష పార్వతీ రూపమును దాల్చుట

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ శ్రావితా సుకథాఽ ద్భుతా ।
భవతానుగ్రహాత్ప్రీత్యా శంభ్వనుగ్రహ నిర్భరా ॥
ఇదానీం శ్రోతుమిచ్ఛామి చరితం శశిమౌలినః ।
గాణపత్యం దదౌ ప్రీత్యా యథా బాణాసురాయ వై ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. నీ అనుగ్రహముచే శంభుని ప్రసాదముతో తొణికిసలాడే అద్భుతమగు మంచి గాథను ప్రీతితో వింటిని (1). చంద్రశేఖరుడు బాణాసురునకు ప్రేమతో గణాధ్యక్ష పదవిని ఇచ్చిన వృత్తాంతమునిపుడు వినగోరుచున్నాను (2).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాసాదరాత్తాం వై కథాం శంభోః పరాత్మనః ।
గాణపత్యం యథా ప్రీత్యా దదౌ బాణాసురాయ హి ॥
అత్రైవ సుచరిత్రం చ శంకరస్య మహాప్రభోః ।
కృష్ణేన సమరోఽప్యత్ర శంభోర్బాణానుగృహ్ణతః ॥
అత్రానురూపం శృణు మే శివలీలాన్వితం పరమ్ ।
ఇతిహాసం మహాపుణ్యం మన శ్రోత్రసుఖావహమ్ ॥
బ్రహ్మపుత్రో మరీచిర్యో మునిరాసీన్మ హామతిః ।
మానసస్సర్వపుత్రేషు జ్యేష్ఠ శ్శ్రేష్ఠః ప్రజాపతిః ॥
తస్య పుత్రో మహాత్మాసీత్కశ్యపో మునిసత్తమః ।
సృష్టి ప్రవర్ధకోఽ త్యంతం పితుర్భక్తో విధేరపి ॥
తస్య త్రయోదశమితా దక్ష కన్యాస్సుశీలకాః ।
కశ్యపస్య మునేర్వ్యాస పత్న్యశ్చాసన్ పతివ్రతాః ॥
తత్ర జ్యేష్ఠా దితిశ్చాసీ ద్దైత్యాస్తత్త నయాస్స్మృతాః ।
అన్యాసాం చ సుతా జాతా దేవా ద్యాస్సచరాచరాః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! శంభు పరమాత్మ ప్రేమతో బాణాసురునకు గణాధ్యక్ష పదవిని ఇచ్చిన ఆ గాథను శ్రద్ధగా వినుము (3). ఈ గాథలో మహా ప్రభుడు, మంగళకరుడు అగు శంభుడు బాణుని యందలి అనుగ్రహముచే కృష్ణునితో యుద్ధమును కూడా చేసిన వైనము గలదు (4). శివుని లీలలతో గూడినది, మహాపుణ్యప్రదము, చెవులకింపైనది, మనస్సునకు సుఖమునిచ్చునది, యోగ్యమైనది అగు ఈ చరిత్రను చెప్పెదను వినుము (5). బ్రహ్మగారికి మహా బుద్ధిశాలి, పుత్రులందరిలో జ్యేష్ఠుడు,

శ్రేష్ఠుడు, ప్రజాపతి అగు మరీచి మహర్షియను మానస పుత్రుడు గలడు (6). ఆయనకు మహాత్ముడు, తండ్రియందు తాతయగు బ్రహ్మయందు భక్తి గలవాడు, సృష్టిని అధికముగా వర్ధిల్ల జేసినవాడు అగు కశ్యపమహర్షి యను పుత్రుడు గలడు (7). ఓ వ్యాసా! ఆ కశ్యపమహర్షికి దక్షుని కుమార్తెలు, మంచి శీలము గలవారు, పతివ్రతలు అగు పదముగ్గురు భార్యలు గలరు (8). వారిలో దితి పెద్ద భార్య. ఆమె పుత్రులకు దైత్యులని పేరు. మిగిలిన భార్యలకు దేవతలు మొదలగు స్థావరజంగమాత్మకమగు సర్వప్రాణులు సంతానముగా కలిగిరి (9).

జ్యేష్ఠాయాః ప్రథమౌ పుత్రౌ దితేశ్చాస్తాం మహాబలౌ ।
హిరణ్య కశి పుర్జ్యేష్ఠో హిరణ్యాక్షోఽ నుజస్తతః ॥
హిరణ్య కశిపోః పుత్రాశ్చత్వారో దైత్యసత్తమాః ।
హ్రాదాను హ్రాద సంహ్రాద ప్రహ్రాదాశ్చేత్యను క్రమాత్ ॥
ప్రహ్రాదస్తత్ర హి మహాన్ విష్ణుభక్తో జితేంద్రియః ।
యం నాశితుం న శక్తాస్తేఽ భవన్ దైత్యాశ్చ కేఽ పి హ ॥
విరోచనస్సుతస్తస్య మహాదాతృవరోఽ భవత్ ।
శక్రాయ స్వశిరో యోఽ దాద్యాచమానాయ విప్రతః ॥
తస్య పుత్రో బలిశ్చాసీన్మహాదానీ శివప్రియః ।
యేన వామనరూపాయ హరయేఽ దాయి మేదినీ ॥
తస్యౌరసస్సుతో బాణశ్శివభక్తో బభూవ హ ।
మాన్యో వదాన్యో ధీమాంశ్చ సత్య సంధస్సహస్రదః ॥
శోణితాఖ్యే పురే స్థిత్వా స రాజ్యమకరోత్పురా ।
త్రైలో క్యం చ బలాజ్జిత్వా తన్నాథానసురేశ్వరః ॥
తస్య బాణాసురస్యైవ శివభక్తస్య చామరాః ।
శంకరస్య ప్రసాదేన కింకరా ఇవ తేఽ భవన్ ॥
తస్య రాజ్యేఽ మరాన్ హిత్వా నా భవన్ దుఃఖితాః ప్రజాః ।
సాపత్న్యా దుఃఖితాస్తే హి పరధర్మ ప్రవర్తినః ॥
సహస్రబాహువాద్యేన స కదాచిన్మహాసురః ।
తాండవేన హి నృత్యేనాతోషయత్తం మహేశ్వరమ్ ॥
తేన నృత్యేన సంతుష్ట స్సు ప్రసన్నో బ భూవ హ ।
దదర్శ కృపయా దృష్ట్యా శంకరో భక్తవత్సలః ॥
భగవాన్ సర్వలోకేశశ్శరణ్యో భక్తకామదః ।
వరేణ చ్ఛందయామాస బాలేయం తం మహాసురమ్ ॥

పెద్ద భార్యయగు దితికి మహాబలశాలురగు ఇద్దరు పుత్రులు మొదటి సంతాన ముగా కలిగిరి. వారిలో హిరణ్యకశిపుడు పెద్దవాడు. హిరణ్యాక్షుడు రెండవవాడు (10). హిరణ్యకశిపునకు నల్గురు రాక్షసవీరులు పుత్రులై జన్మించిరి. హ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, ప్రహ్లాదుడు అనునవి వారి పేర్లు (11). వారిలో

ప్రహ్లాదుడు గొప్ప విష్ణు భక్తుడు, జితేంద్రియుడు. ఆతనిని రాక్షసులలో అనేకులు సంహరించుటకు ప్రయత్నించి విఫలులైరి (12). మహాదాతయగు విరోచనుడు ఆతని పుత్రుడు. బ్రాహ్మణ వేషములో వచ్చి యాచించిన ఇంద్రునకు ఆయన తన శిరస్సును ఇచ్చి వేసెను (13). ఆతని కుమారుడగు బలి మహాదాత, శివునకు ప్రీతిపాత్రుడు. వామన రూపములో వచ్చిన విష్ణువునకు ఆతడు భూమిని ఇచ్చి వేసెను (14). శివభక్తుడు, ఆదరణీయుడు, దాత, బుద్ధిశాలి, సత్య నిష్ఠ గలవాడు, అసంఖ్యాకములగు వస్తువులను దానము చేసినవాడు అగు బాణాసురుడు అతని పుత్రుడు (15). ఆ రాక్షస వీరుడు పూర్వము ముల్లోకముల ప్రభువులను తన శక్తిచే జయించి శోణితనగరమునందుండి రాజ్యము నేలెను (16). శివభక్తుడగు ఆ బాణాసురునకు శంకరుని అనుగ్రహముచే దేవతలు కింకరులవలె ఉండిరి (17). ఆతని ఏలికలో దేవతలు తప్ప ప్రజలు దుఃఖమునెరుంగరు. ఆతని జ్ఞాతులగు దేవతలు దుఃఖితులైరి. వారు ఆతని యందు శత్రుబుద్ధి గలవారై దుఃఖముల పాలైరి (18). ఆ మహారాక్షసుడు ఒకప్పుడు వేయి చేతులతో మృదంగమును వాయించి తాండవ నృత్యమును చేసి మహేశ్వరుని సంతోషపెట్టెను (19). భక్తవత్సలుడగు శంకరుడు ఆ నృత్యమునకు సంతసించి మిక్కిలి ప్రసన్నుడై ఆతనిని దయాదృష్టితో చూచెను (20). సర్వలోక ప్రభువు, శరణు పొంద దగినవాడు, భక్తుల కోర్కెల నీడేర్చువాడు అగు ఆ భగవానుడు బలిపుత్రుడగు ఆ మహారాక్షసుని వరమును కోరుకొనుమనెను (21).

బాలేయస్స మహాదైత్యో బాణో భక్తవరస్సుధీః ।

ప్రణమ్య శంకరం భక్త్యా నునావ పరమేశ్వరమ్ ॥

బలి పుత్రుడు, గొప్ప భక్తుడు, గొప్ప బుద్ధిశాలి, మహారాక్షసుడు నగు ఆ బాణుడు మంగళకరుడగు పరమేశ్వరునకు భక్తితో ప్రణమిల్లి స్తుతించెను (22).

బాణాసుర ఉవాచ ।

దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।

సంతుష్టోఽ సి మహేశాన మమోపరి విభో యది ॥

మద్రక్షకో భవ సదా మదుపస్థః పురాధిపః ।

సర్వథా ప్రీతికృన్మే హి ససుతస్సగణః ప్రభో ॥

బాణాసురుడిట్లు పలికెను

ఓ దేవదేవా! మహాదేవా! శరణు జొచ్చినవారియందు ప్రేమను జూపే ఓ మహేశ్వరా ! విభూ! నా విషయములో నీవు సంతుష్టుడవైనచో (23), సర్వదా నా సమీపమునందుండి ఈ నగరమునకు అధ్యక్షుడవై నన్ను రక్షించుము. ఓ ప్రభూ! నీవు నీ కుమారులతో మరియు గణములతో గూడి అన్ని విధములుగా నాకు ప్రీతిని కలిగించుము (24).

సనత్కుమార ఉవాచ ।

బలిపుత్రస్స వై బాణో మోహితశ్శివ మాయయా ।
ముక్తి ప్రదం మహేశానం దురారాధ్యమపి ధ్రువమ్ ॥
స భక్త వత్సల శ్శంభుర్దత్త్వా తస్మై వరాంశ్చ తాన్ ।
తత్రోవాస తథా ప్రీత్యా సగణస్ససుతః ప్రభుః ॥
స కదాచిద్బాణపురే చక్రే దేవాసురైస్సహ ।
నదీతీరే హరః క్రీడాం రమ్యే శోణితకాహ్వయే ॥
ననృతుర్జహసుశ్చాపి గంధర్వాప్సరసస్తథా ।
జేపుః ప్రణేముర్మునయ ఆనర్చుస్తుష్టువుశ్చ తమ్ ॥
వవల్గుః ప్రమథాస్సర్వే ఋషయో జుహవుస్తథా ।
ఆయయుస్సిద్ధసంఘాశ్చ దదృశుశ్శాంకరీం రతిమ్ ॥
కుతార్కికా వినేశుశ్చ మ్లేచ్ఛాశ్చ పరిపంథినః ।
మాతరోఽభిముఖాస్త స్థుర్వినేశుశ్చ బిభీషికాః ॥
రుద్రసద్భావభక్తానాం భవదోషాశ్చ విస్మృతాః ।
తస్మిన్ దృష్టే ప్రజాస్సర్వాస్సు ప్రీతిం పరమాం యయుః ॥
వవల్గుర్మునయస్సిద్ధాశ్ర్తీ ణాం దృష్ట్వా విచేష్టితమ్ ।
పుపుషుశ్చాపి ఋతవస్స్వప్రభావం తు తత్ర చ ॥
వవుర్వాతాశ్చ మృదవః పుష్పకేసరధూసరాః ।
చుకూజుః పక్షి సంఘాశ్చ శాఖినాం మధులంపటాః ॥
పుష్ప భారావనద్ధానాం రారట్యేరంశ్చ కోకిలాః ।
మధురం కామజననం వనేషూపవనేషు చ ॥
తతః క్రీడావిహారే తు మత్తో బాలేందుశేఖరః ।
అనిర్జితేన కామేన దృష్టః ప్రోవాచ నందినమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

బలిపుత్రుడగు ఆ బాణాసురుడు శివమాయచే మోహితుడై ముక్తిని ఇచ్చువాడు(ు), మిక్కిలి క్లేశముతో ఆరాధించదగినవాడు, శాశ్వతుడు అగు మహేశ్వరుని ఇట్లు కోరెను (25). భక్తవత్సలుడగు ఆ శంభు ప్రభుడు ఆతనికి ఆ వరములనిచ్చి అచట గణములతో మరియు పుత్రులతో గూడి ప్రేమతో నివసించెను (26). ఒకనాడు ఆ శివుడు బాణుని నగరము అగు శోణితపురములో దేవతలతో మరియు రాక్షసులతో గూడి సుందరమగు నదీతీరమునందు విహరించెను (27). అపుడు గంధర్వులు, అప్సరసలు నాట్యమాడుతూ నవ్వుచుండిరి. మునులు జపమును చేయుచూ ఆయనకు నమస్కరించి పూజించి స్తుతించిరి (28). ప్రమథులందరు కేకలు వేయుచుండిరి. ఋషులు హోమములను చేయుచుండిరి. శంకరుని విలాసమును దర్శించుటకు సిద్ధుల గణములు వచ్చిరి (29). దుష్టతార్కికులు, మ్లేచ్ఛులు మరియు శత్రువులు వినాశమును పొందిరి. మాతృదేవతలు అభిముఖముగా నిలబడిరి. భయకారణములు నశించినవి (30).

రుద్రునియందు సద్భావము గల భక్తుల సంసారదోషములు విస్మరించబడినవి. ఆయనను దర్శించి ప్రజలందరు పరమానందమును పొందిరి (31). స్త్రీల చేష్టలను గాంచి మునులు, సిద్ధులు కేకలు వేసిరి. అచట ఋతువులు తమ ప్రభావమును పోషించినవి (32). పుష్పముల పుప్పొడితో నిండియున్న వాయువులు సుఖస్పర్శ కలుగునట్లు వీచినవి. వృక్షములయందలి మధువునందు తృష్ణగల పక్షుల సమూహములు కూసినవి (33). పుష్పముల బరువుతో వంగిన కొమ్మలు గల వృక్షములతో నిండియున్న వనములయందు, ఉద్యానవనములలో కోకిలలు మధురముగా కామోద్దీపనము కలుగునట్లుగా కూసినవి (34). పరాజితుడు గాని మన్మథునిచే చూడబడి విహారోత్సుకుడై యున్న చంద్ర శేఖరుడు అచట క్రీడలు, విహారములు కొనసాగుచుండగా అపుడు నందితో నిట్లనెను (35).

చంద్రశేఖర ఉవాచ।

వామా మానయ గౌరీం త్వం కైలాసాత్కృతమండనామ్ ।

శీఘ్ర మస్మాద్వనాద్గత్వా హ్యుక్త్వా కృష్ణా మిహానయ ॥

చంద్ర శేఖరుడిట్లు పలికెను –

నీవు వెంటనే ఈ వనమునుండి కైలాసమునకు వెళ్లి సుందరి, కృష్ణవర్ణము గలది,ి అలంకరించుకున్నది యగు పార్వతిని ఈ విషయము చెప్పి ఇచటకు తీసుకొని రమ్ము (36).

సనత్కుమార ఉవాచ ।

స తథేతి ప్రతిజ్ఞాయ గత్వా తత్రాహ పార్వతీమ్ ।

సుప్రణమ్య రహో దూతశ్శంకరస్య కృతాంజలిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

శివుని ఆ రహస్య దూత చేతులు జోడించి ప్రణమిల్లి 'ఉత్తము' అని పలికి, అచటకు వెళ్లి పార్వతితో నిట్లు పలికెను (37).

నందీశ్వర ఉవాచ ।

ద్రష్టుమిచ్ఛతి దేవి త్వాం దేవదేవో మహేశ్వరః ।

స్వవల్లభాం రూపకృతాం మయోక్తం తన్ని దేశతః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ దేవీ! దేవ దేవుడగు మహేశ్వరుడు తన ప్రియురాలగు నీవు అలంకరించు కొని యుండగా చూడ గోరుచున్నాడు. ఆయన ఆదేశముచే నేనీ సందేశమును చెప్పుచున్నాను (38).

సనత్కుమార ఉవాచ ।

తతస్తద్వచనాద్గౌరీ మండనం కర్తు మాదరాత్ ।
ఉద్యతా భూన్ముని శ్రేష్ఠ పతివ్రత పరాయణా ॥
ఆగచ్ఛామి ప్రభుం గచ్ఛ వద తం త్వం మమాజ్ఞయా ।
ఆజగామ తతో నందీ రుద్రాసన్నం మనోగతిః ॥
పునరాహ తతో రుద్రో నందినం పరవి భ్రమః ।
పునర్గచ్ఛ తతస్తాత క్షిప్రమానయ పార్వతీమ్ ॥
బాఢముక్త్వా సతాం గత్వా గౌరీమాహ సులోచనామ్ ।
ద్రష్టుమిచ్ఛతి తే భర్తా కృతవేషాం మనోరమామ్ ॥
శంకరో బహుధా దేవి విహర్తుం సంప్రతీక్షతే ।
ఏవం పతౌ సుకామార్తే గమ్యతాం గిరినందిని ॥
అప్సరో భిస్సమగ్రాభిరన్యోన్య మభిమంత్రి తమ్ ।
లబ్ధ భావో యథా సద్యః పార్వత్యా దర్శనోత్సుకః ॥
అయం పినాకీ కామారిః వృణుయాద్యాం నితంబినీమ్ ।
సర్వాసాం దివ్య నారీణాం రాజ్ఞీ భవతి వై ధ్రువమ్ ॥
వీక్షణం గౌరి రూపేణ క్రీడయేన్న న్నభైర్గణైః ।
కామోఽ యం హంతి కామారి మూచురన్యోన్య మాదృతాః ॥
స్ప్రష్టుం శక్నోతి యా కాచిద్భృతే దాక్షాయణీం స్త్రియమ్ ।
సా గచ్ఛేత్తత్ర నిశ్శంకం మోహయే త్పార్వతీ పతిమ్ ॥
కుంభాండ తనయా తత్ర శంకరం స్ప్రష్టుముత్సహే ।
అహం గౌరీ సురూపేణ చిత్రలేఖా వచోఽ బ్రవీత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ మహర్షీ! ఆతని ఆ మాటను విని పాతివ్రత్యనిష్ఠ గల ఆ గౌరి అలంకరించు కొనుటకు ఉద్యుక్తురాలయ్యెను (39). 'నీవు నా ఆజ్ఞచే వెళ్లి ప్రభుని తో నేను వచ్చుచున్నానని చెప్పుము' అని ఆమె పలుకగా నంది అపుడు మనోవేగముతో రుద్రుని సన్నిధికి వచ్చెను (40). అపుడు రుద్రుడు మిక్కిలి కంగారు పడు చున్నవాడై నందితో 'వత్సా! మరల వెళ్లి పార్వతిని వెంటనే దోడ్కొనిరమ్ము' అని మరల ఆదేశించెను (41). ఆతడు సరేనని పలికి సుందరియగు పార్వతి వద్దకు వెళ్లి ఆమెతో నిట్లనెను: అలంకరించుకొని మనోహర ముగానున్న నిన్ను నీ భర్త చూడగోరుచున్నాడు (42). ఓ దేవి ! శంకరుడు పలుభంగుల విహరించుటకై ఎదురు చూచుచున్నాడు. ఓ పార్వతీ! భర్త ఇట్లు మిక్కిలి ఉత్కంఠ గలవాడై యుండ వెడలుట యుక్తము (43). అప్సరసలు అందరు తమలో తాము ఇట్లు చర్చించు కొనిరి : ఈ శివుడు మనస్సులో ఉదయించిన విహారేచ్ఛ గల వాడై వెనువెంటనే పార్వతిని చూడవలననే ఉత్కంఠతో నున్నాడు (44). పినాక ధారి, కామవిజేతయగు

ఈ శివుడు ఏ సుందరిని ఎన్నుకొనునో, ఆమె దేవతా స్త్రీ లందరిలో నిస్సందేహముగా రాణి యగును (45). అట్టి స్త్రీ పార్వతీ రూపములో మన్మథుని గణములతో గూడి ఈయనను దర్శించవచ్చును. అపుడు ఈ మన్మథుడు కామ విజేతయగు శివునిపై విజయమును పొందునని వారు తమలో తాము ఆదరముతో పలుకు చుండిరి (46). పార్వతి తక్క ఇతర స్త్రీలు ఆయనను స్పృశించలేరు. కాని ఎవరైననూ అట్లు చేయగలమనుకున్నచో వారు ఆయన వద్దకు నిశ్శంకగా వెళ్లి పార్వతీ ప్రియుడగు ఆయనను మోహింప జేయవచ్చునని వారు పలికిరి (47). అపుడు కుంభాండుని కుమార్తెయగు చిత్రలేఖ ఇట్లు పలికెను : నేను సుందరియగు పార్వతి రూపమును దాల్చి శంకరుని స్పృశించుటకు ఉత్సాహపడు చున్నాను (48).

యదధాన్మోహినీరూపం కేశవో మోహనేచ్ఛయా ।
పురా త ద్వైష్ణవం యోగమాశ్రిత్య పరమార్థతః ॥
ఉర్వశ్యాశ్చ తతో దృష్ట్వా రూపస్య పరివర్తనమ్ ।
కాలీ రూపం ఘృతాచీ తు విశ్వాచీ చండికం వపుః ॥
సావిత్రీరూపం రంభా చ గాయత్రం మేనకా తథా ।
సహజన్యా జయారూపం వైజయం పుంజికస్థలీ ॥
మాతౄణామప్యనుక్తానామనుక్తా శ్చాప్సరో వరాః ।
యత్నా ద్రూపాణి తాశ్చ క్రు స్వవిద్యాసంయుతా అను ॥
తతస్తాసాం తు రూపాణి దృష్ట్వా కుంభాండ నందినీ ।
వైష్ణవాదాత్మయోగాచ్చ విజాతార్థా వ్యడంబయత్ ॥
ఉషా బాణా సుర సుతా దివ్యయోగ విశారదా ।
చకార రూపం పార్వత్యా దివ్యమత్యద్భుతం శుభమ్ ॥
మహోరత్నాబ్జ సంకాశం చరణం చోత్తమ ప్రభమ్ ।
దివ్య లక్షణసంయుక్తం మనోఽ భీష్టార్థ దాయకమ్ ॥
తస్యా రమణ సంకల్పం విజ్ఞాయ గిరిజా తతః ।
ఉవాచ సర్వవిజ్ఞానా సర్వాంతర్యామినీ శివా ॥

పూర్వము విష్ణువు దానవులను మోహింప జేయ గోరి తన వైష్ణవశక్తిని ఆశ్రయించి యథార్థమగు మోహినీరూపమును దాల్చెను గదా! అని చిత్ర లేఖ పలికెను (49). అపుడు ఊర్వశి యొక్క రూపపరివర్తనమును గాంచి ఘృతాచి కాళీ రూపమును, విశ్వాచి చండికారూపమును దాల్చిరి (50). రంభ సావిత్రీరూపమును, మేనక గాయత్రీరూపమును, సహజన్య జయారూపమును, పుంజికస్థలి విజయారూపమును దాల్చిరి (51). ఇంకనూ ఇతర అప్సరసలు ఇతర మాతృమూర్తుల రూపములను తమ విద్యల ప్రభావముచే ప్రయత్నపూర్వకముగా దాల్చిరి (52). కుంభాండుని కుమార్తె అపుడు వారి రూపములను గాంచి విష్ణువు యొక్క ఆరాధనచే సిద్ధించిన స్వీయ యోగ శక్తిచే వారి యథార్థ స్వరూపములను

తెలుసు కొని, తాను కూడ వారిని అనుకరించెను (53). బాణాసురుని కుమార్తె యగు ఉష దివ్యశక్తులలో సమర్థురాలు. మిక్కిలి అద్భుతమైనది, శుభకరమైనది అగు పార్వతీ దేవి యొక్క రూపమును ఆమె దాల్చెను (54). ఉత్తమమగు కాంతులను వెదజల్లే ఆమె పాదములు పెద్ద ఎర్రని పద్మమును పోలి, దివ్యలక్షణములతో గూడినవై భక్తుల అభీష్టముల నీడేర్చు చుండెను (55). అపుడు విహరించవలెననే ఆమె యొక్క సంకల్పమునెరింగి సర్వజ్ఞురాలు, సర్వాంతర్యామిని, శివుని ప్రియురాలు అగు పార్వతి ఇట్లు పలికెను (56).

గిరిజోవాచ ।

యతో మమ స్వరూపం వై ధృతమూషే సఖి త్వయా ।
సకామత్వేన సమయే సంప్రాప్తే సతి మానిని ॥
అస్మింస్తు కార్తికే మాసి ఋతు ధర్మాస్తు మాధవే ।
ద్వాదశ్యాం శుక్లపక్షే తు యస్తు ఘోరే నిశాగమే ॥
కృతోపవాసాం త్వాం భోక్తా సుప్తా మంతఃపురే నరః ।
స తే భర్తా కృతో దేవైస్తేన సార్ధం రమిష్యసి ॥
ఆ బాల్యాద్విష్ణు భక్తాసి యతోఽ నిశమతంద్రితా ।
ఏవమస్త్వితి సా ప్రాహ మనసా లజ్జితాననా ॥
అథ సా పార్వతీ దేవీ కృతకౌతుక మండనా ।
రుద్రసన్నిధిమాగత్య చిక్రీడే తేన శంభునా ॥
తతో రతాంతే భగవాన్రుద్రశ్చా దర్శనం యయౌ ।
సదారస్స గణశ్చాపి సహితో దైవతైర్మునే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధ ఖండే ఉషాచరిత్ర వర్ణనం నామ ఏకపంచాశత్త మోఽధ్యాయః ॥

పార్వతి ఇట్లు పలికెను –

ఓ ఉషా! సఖీ ! నీవు సరియగు సమయములో కామనతో గూడిన మనస్సు గలదానవైనా రూపమును దాల్చితివి. ఓ అభిమానవతీ ! కావున (57), నీవు ఈ కార్తీక మాసములో ఋతుధర్మమును కలిగియుందువు. వైశాఖ శుక్ల ద్వాదశినాడు భయంకరమగు అర్ధరాత్రియందు (58), ఉపవసించి అంతఃపురములో నివసించియున్న నిన్ను ఒక నరుడు భోగించగలడు. వాడే నీకు భర్తయని దేవతలు నిర్దేశించినారు. నీవు వానితో రమించగలవు (59). నీవు చిన్నదనమునుండియు పొరపాటు లేకుండగా విష్ణువును ఆరాధించియుంటివి. ఈ మాటను విని ఉష సిగ్గుతో నిండిన మోముగలదై మనస్సులో అటులనే యగుగాక ! అనుకొనెను (60). అపుడా పార్వతి చక్కగా అలంకరించుకొని మంగళస్వరూపుడగు రుద్రుని సన్నిధికి వచ్చి ఆయనతో కలిసి విహరించెను (61). ఓ మహర్షీ! ఆ విహారము ముగిసిన తరువాత రుద్రభగవానుడు భార్యతో, గణములతో మరియు దేవతలతో గూడి అంతర్ధానమును చెందెను (62).

52 - ఉషా - అనిరుద్ధుల సమాగమము

సనత్కుమార ఉవాచ।

శృణుష్వాన్యచ్చరిత్రం చ శివస్య పరమాత్మనః ।
భక్తవాత్సల్యసంగర్భి పరమానందదాయకమ్ ॥
పురా బాణాసురో నామ దైవదోషాచ్చ గర్వితః ।
కృత్వా తాండవనృత్యం చ తోషయామాస శంకరమ్ ॥
జ్ఞాత్వా సంతుష్టమనసం పార్వతీవల్లభం శివమ్ ।
ఉవాచ చాసురో బాణో నతస్కంధః కృతాంజలిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

భక్తులయందు భగవానునకు గల వాత్సల్యముతో నిండియున్నదై మహానందమును(?) కలిగించే శివపరమాత్మ యొక్క మరియొక చరిత్రమును కూడ వినుము (1). పూర్వము బాణుడను రాక్షసుడు తాండవనృత్యమును చేసి శంకరుని సంతోషపెట్టెను. కాని ఆతడు దైవము యొక్క దోషముచే గర్వము కలవాడాయెను (2). పార్వతీపతియగు శివుని మనస్సు సంతోషమును పొందియున్నదని గ్రహించి ఆ బాణాసురుడు శిరసును వంచి చేతులను జోడించి ఇట్లు పలికెను (3).

బాణ ఉవాచ ।

దేవదేవ మహాదేవ సర్వదేవ శిరోమణే ।
త్వత్ప్రసాద్బలీ చాహం శృణు మే పరమం వచః ॥
దోస్సహస్రం త్వయా దత్తం వరం భారాయ మేఽ భవత్ ।
త్రిలోక్యాం ప్రతియోద్ధారం న లభే త్వదృతే సమమ్ ॥
హే దేవ కిమనేనాపి సహస్రేణ కరోమ్యహమ్ ।
బాహూనాం గిరితుల్యానాం వినా యుద్ధం వృషధ్వజ ॥
కండూత్యా నిభృతైర్దోర్భిర్యుయుత్సుర్దిగ్గ జానహమ్ ।
పురాణ్యాచూర్ణయన్నద్రీన్ భీతాస్తేఽపి ప్రదు ద్రువుః ॥
మయా యమః కృతో యోద్ధా వహ్నిశ్చ కృతకో మహాన్ ।
వరుణశ్చాపి గోపాలో గవాం పాలయితా తథా ॥
గజాధ్యక్షః కుబేరస్తు సైరంధ్రీ చాపి నిర్ఋతిః ।
జితశ్చాఖండలో లోకే కరదాయీ సదా కృతః ॥
యుద్ధస్యా గమనం బ్రూహియత్రైతే బాహవో మమ ।
శత్రుహస్త ప్రయుక్తైశ్చ శస్త్రాస్త్రైర్జర్జరీకృతాః ॥
పతంతు శత్రుహస్తాద్వా పాతయంతు సహస్రధా ।
ఏతన్మనోరథం మే హి పూర్ణం కురు మహేశ్వర ॥

బాణుడిట్లు పలికెను -

ఓ దేవదేవా ! మహాదేవా! నీవు దేవతలందరిలో తలమానికము వంటివాడవు. నీ అనుగ్రహముచే నేను బలవంతుడనైనాను. నా శ్రేష్ఠమగు ఈ వచనమును వినుము (4). నీవు అనుగ్రహించిన ఈ వేయి చేతులు నాకు బరువు అగుచున్నవి. ముల్లోకములలో నీవు తక్క నాతో సమానమగు ప్రతిద్వంద్విని మరియొకరిని కానరాకున్నాను (5). ఓ దేవా ! వృషభధ్వజా ! యుద్ధము లేనిదే కొండవలె కఠినమైన ఈ వేయి బాహువులతో నేను ఏమి చేయవలెను ? (6) ఈ బాహువులకు తీట పుట్టినప్పుడు నేను నగరములను కొండలను పిండి చేయుచూ, దిగ్గజములతో యుద్ధమును చేయబోగా, అవి భయపడి పారిపోయినవి (7). నేను యమునితో మరియు అగ్నితో యుద్ధమును చేసితిని. వరుణుని నా ఆవులను కాసే గోపాలుని చేసితిని (8). కుబేరుని ఏనుగులపై కాపలాదారునిగను, నిర్‌ఋతిని సంరక్షకునిగా చేసితిని. ఇంద్రుని జయించి స్వర్గలోకములో సర్వదా పన్ను కట్టునట్లు చేసితిని (9). యుద్ధములో నా ఈ బాహువులు శత్రువుల చేతులనుండి ప్రయోగించబడిన శస్త్రములచే శిథిలము కావలెను. అట్టి యుద్ధము యొక్క రాకను గురించి నాకు చెప్పుము (10). ఈ బాహువులు శత్రువుల చేతిలో వేయి ముక్కలు కావలెను. లేదా, శత్రువును పడగొట్టవలెను. ఓ మహేశ్వరా! నా ఈ కోర్కెను తీర్చుము (11).

సనత్కుమార ఉవాచ ।

తచ్ఛ్రుత్వా కుపితో రుద్రస్త్వట్టహాసం మహాద్భుతమ్ ।
కృత్వా బ్రవీన్మహామన్యు ర్భక్తబాధాపహారకః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

భక్తుల బాధలను పోగొట్టే రుద్రుడు ఆ మాటను విని కోపించి మిక్కిలి అద్భుతమగు అట్టహాసమును చేసి గొప్ప కోపము గలవాడై ఇట్లు పలికెను (12).

రుద్ర ఉవాచ ।

ధిక్ ధిక్ త్వాం సర్వతో గర్విన్ సర్వదైత్య కులాధమ ।
బలిపుత్రస్య భక్తస్య నోచితం వచ ఈదృశమ్ ॥
దర్పస్యాస్య ప్రశమనం లప్స్యసే చాశు దారుణమ్ ।
మహాయుద్ధమకస్మాద్వై బలినా మత్సమేన హి ॥
తత్ర తే గిరిసంకాశా బాహవోఽ నలకాష్ఠవత్ ।
ఛిన్నా భూమౌ పతిష్యంతి శస్త్రాస్త్రైః కదలీకృతాః ॥
యదేష మానుషశిరో మయూరసహితో ధ్వజః ।
వర్తతే తవ దుష్టాత్మంస్తస్య స్యాత్పాతనం యదా ॥

స్థాపితస్యాయుధాగారే వినా వాతకృతం భయమ్ ।
తదా యుద్ధం మహాఘోరం సంప్రాప్తమితి చేతసి ॥
నిధాయ ఘోరం సంగ్రామం గచ్ఛే థాస్సర్వసైన్యవాన్ ।
సాంప్రతం గచ్ఛ తద్వేశ్మ యతస్తద్విద్యతే శివః ॥
తథా తాన్ స్వమహోత్పాతాంస్తత్ర ద్రష్టాసి దుర్మతే ।
ఇత్యుక్త్వా విరరామాథ గర్వహృద్భక్తవత్సలః ॥

రుద్రుడిట్లు పలికెను -

ఓ గర్విష్ఠీ ! రాక్షసవంశమునకంతకూ అధముడవగు నీకు అన్ని విధములు ంగా నింద యగుగాక! బలిచక్రవర్తి యొక్క కుమారుడవు మరియు భక్తుడవు అగు నీవు ఇట్టి వచనములను పలుకుట తగదు (13). నీవు ఈ దర్పమునకు తగిన భయంకరమగు ఫలితమును తొందరలోనే పొందగలవు. నీకు హఠాత్తుగా నాతో సముడగు బలశాలితో గొప్ప యుద్ధము సంప్రాప్తము కాగలదు (14). ఆ యుద్ధములో కొండలవంటి నీ బాహువులు శస్త్రముల ప్రభావముచే కాలిన కట్టెలవలె, అరటి బోదెలవలె నేలగూలును (15). ఓరీ దురాత్మా! మనిషి తలతో గూడిన నెమలి చిహ్నముగా గల నీ ఈ ధ్వజము ఆయుధాగారములో భద్రపరుచబడి యుండగా ఏనాడైతే గాలి యొక్క ఉపద్రవము లేకున్ననూ నేలగూలునో, ఆనాడు మిక్కిలి భయంకరమగు యుద్ధము మీద బడినదని మనస్సులో నిశ్చయించుకొని సైన్యములన్నిటినీ వెంటనిడుకొని ఆ భయంకర యుద్ధమునకు వెడలుము. ప్రస్తుతము శివుడు నివసించియున్న నీ నివాసమునకు వెళ్ళుము (16-18). ఓరీ దుర్బుద్ధీ! అపుడు నీవచట నీకు విపత్తును సూచించే దుష్టశకునములను గాంచెదవు. ఇట్లు పలికి భక్తవత్సలుడు, గర్వమును పోగొట్టువాడునగు శివుడు అపుడు మిన్నకుండెను (19).

సనత్కుమార ఉవాచ ।

తచ్ఛ్రుత్వా రుద్రమభ్యర్చ్య దివ్యైరంజలికుడ్మలైః ।
ప్రణమ్య చ మహాదేవం బాణశ్చ స్వగృహం గతః ॥
కుంభాండాయ యథావృత్తం పృష్టః ప్రోవాచ హర్షితః ।
పర్యైక్షిష్టాసురో బాణస్తం యోగం హ్యుత్సుకస్తదా ॥
అథ దైవాత్కదాచిత్స స్వయం భగ్నం ధ్వజం చ తమ్ ।
దృష్ట్వా తత్రాసురో బాణో హృష్టో యుద్ధాయ నిర్యయౌ ॥
సస్వసైన్యం సమాహూయ సంయుక్తస్సాష్టభిర్గణైః ।
ఇష్టిం సాంగ్రామికీం కృత్వా దృష్ట్వా సాంగ్రామికం మధు ॥
కకుభాం మంగలం సర్వం సంప్రేక్ష్య ప్రస్థితోఽభవత్ ।
మహోత్సాహో మహావీరో బలిపుత్రో మహారథః ॥

ఇతి హృత్కమలే కృత్వా కః కస్మాదా గమిష్యతి ।
యోద్ధారణ ప్రియో యస్తు నానాశస్త్రాస్త్ర పారగః ॥
యస్తు బాహుసహస్రం మే ఛినత్త్యనలకాష్ఠవత్ ।
తథా శస్త్రైర్మహాతీక్ష్ణైశ్ఛినద్మి శతశస్త్విహా ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

బాణుడు ఆ మాటను విని దివ్యములగు మొగ్గలవంటి దోసిళ్లను ఒగ్గి మహాదేవుడగు శివుని పూజించి, ప్రణమిల్లి తన గృహమునకు వెళ్లెను (20). బాణాసురుడు జరిగిన వృత్తాంతమును కుంభాండుడు ప్రశ్నించగా వివరించి చెప్పెను. ఆతడు సర్వకాలములయందు ఉత్సాహముతో మరియు ఆనందముతో ఆ యుద్ధమనే యోగము కొరకు ఎదురు చూచుచుండెను (21). అపుడు ఒకనాడు దైవవశముచే అచట ధ్వజము తనంత తానుగా విరిగియుండగా గాంచి ఆ బాణాసురుడు ఆనందముతో యుద్ధమునకు బయలుదేరెను (22). ఆతడు తన సైన్యమును యుద్ధమునకు సిద్ధము చేసెను. ఎనిమిది మంది గణాధ్యక్షులు అతనికి తోడుగా వచ్చిరి. ఆతడు యుద్ధములో విజయము కొరకై ఇష్టిని నిర్వహించి, యుద్ధములో వినియోగించే మధువును స్వయముగా పర్యవేక్షించెను (23). గొప్ప ఉత్సాహము గలవాడు, మహావీరుడు, మహారథుడు అగు ఆ బలి పుత్రుడు దిక్కులలో మంగళచిహ్నములను పరికించి ప్రయాణమాయెను (24). అతడు తన హృదయపద్మములోనిట్లు తలపోసెను: అనేకశస్త్రములలో దిట్ట, రణమునందు ప్రీతిగలవాడు అగు ఏ యుద్ధవీరుడు ఎక్కడనుండి రాగలడు? ఆతడు నా బాహువులను మిక్కిలి వాడియైన తన ఆయుధములతో చొప్పదంటులవలె ఛేదించవలెను. లేదా, నేనాతనిని ఈ యుద్ధరంగములో వంద ముక్కలు చేసెదను (25, 26).

ఏతస్మిన్నంతరే కామస్త్వం ప్రాప్తశ్శంకరేణ హి ।
యత్ర సా బాణదుహితా సుజాతా కృతమంగలా ॥
మాధవం మాధవే మాసి పూజయిత్వా మహానిశి ।
సుప్తా చాంతఃపురే గుప్తే స్త్రీ భావముపలంభితా ॥
గౌర్యా సం ప్రేషితేనాపి వ్యాకృష్టా దివ్యమాయయా ।
కృష్టాత్మజాత్మజేనాథ రుదంతీ సాప్యనాథవత్ ॥
సచాపి తాం బలాద్భుక్త్వా పార్వత్యాస్సఖిభిః పునః ।
నీతస్తు దివ్యయోగేన ద్వారకాం నిమిషాంతరాత్ ॥
మృదితా సా తదోత్థాయ రుదంతీ వివిధా గిరః ।
సఖీభ్యః కథయిత్వా తు దేహత్యాగే కృతక్షణా ॥
సఖ్యా కృతాత్మనో దోషం సా వ్యాస స్మారితా పునః ।
సర్వం తత్పూర్వవృత్తాంతం తతో దృష్ట్వా చ సా భవత్ ॥

అబ్రవీచ్చిత్రలేఖాం చ తతో మధురయా గిరా ।

ఉషా బాణస్య తనయా కుంభాండతనయాం మునే ॥

ఇంతలో బాణుని కుమార్తె మంగళస్నానము నాచరించి చక్కగా అలంకరించుకొనెను. ఆమె వైశాఖమాసములో మాధవుని పూజించి రక్షణ కలిగిన అంతఃపురమునందు రాత్రియందు స్త్రీ ధర్మమును పొంది యున్నదై నిద్రించెను. ఆ సమయములో అచటకు శంకరునితో గూడి కాముడు విచ్చేసెను (27, 28). దివ్యమాయయగు పార్వతిచే పంపబడిన శ్రీకృష్ణుని మనుమడు ఆమెను గట్టిగా లాగెను. ఆమె అనాథవలె రోదించెను (29). ఆతడు ఆమెను బలాత్కారముగా భోగించెను. అపుడు పార్వతియొక్క అనుచరులు ఆతనిని తమ దివ్యశక్తిచే క్షణకాలములో ద్వారకకు చేర్చిరి (30). ఈ విధముగా పీడకు గురిచేయబడిన ఆమె అపుడు నిద్ర లేచి ఏడ్చుచున్నదై సఖురాండ్రతో వివిధములగు మాటలను పలుకుతూ ఆత్మహత్యకు పూనుకొనెను (31). ఓ వ్యాసా! ఆమె పూర్వమునందు ఆచరించిన దోషమును ఆమెకు చెలికత్తె గుర్తుచేయగా, అపుడామె ఆ పూర్వవృత్తాంతమునంతనూ తన మదిలో తెలుసుకొనెను (32). ఓ మునీ! అపుడు బాణుని పుత్రికయగు ఉష కుంభాండుని కుమార్తె యగు చిత్రలేఖతో మధురమగు వచనమును ఇట్లు పలికెను (33).

ఉషోవాచ।

సఖి యద్యేష మే భర్తా పార్వత్యా విహితః పురా ।

కేనోపాయేన తే గుప్తః ప్రాప్యతే విధివన్మయా ॥

కస్మిన్ కులే సవా జాతో మమ యేన హృతం మనః ।

ఇత్యుషావచనం శ్రుత్వా సఖీ ప్రోవాచ తాం తదా ॥

ఉష ఇట్లు పలికెను -

ఓ సఖీ! పూర్వము పార్వతి ఈ రహస్యపురుషుని నాకు భర్తగా విధించియున్నచో, వానిని నేను యథావిధిగా వివాహమాడుటకై నీవు ఏమి ఉపాయమును చేసెదవు ? (34) నా మనస్సును దోచిన ఆ పురుషుడు జన్మించిన వంశము ఏదియో? ఉషయొక్క ఈ మాటను విని ఆ చెలికత్తె అప్పుడు ఆమెతోనిట్లనెను (35).

చిత్రలేఖోవాచ ।

త్వయా స్వప్నే చ యో దృష్టః పురుషో దేవి తం కథమ్ ।

అహం సమానయిష్యామి న విజ్ఞాతస్తు యో మమ ॥

దైత్యకన్యా తదుక్తే తు రాగాంధా మరణోత్సుకా ।

రక్షితా చ తయా సఖ్యా ప్రథమే దివసే తతః ॥

పునః ప్రోవాచ సోషాం వై చిత్రలేఖా మహామతిః ।
కుంభాండస్య సుతా బాణతనయాం మునిసత్తమ ॥

చిత్రలేఖ ఇట్లు పలికెను -

ఓ దేవీ! స్వప్నములో నీవు చూచిన పురుషుడు ఎవరో నాకు తెలియదు. నేను అతనిని ఎట్లు తీసుకొని రాగలను? (36) ఆ మాటను విని ఆ బాణాసురుని పుత్రిక గుడ్డి ప్రేమలో పడి ఆత్మహత్యకు పూనుకొనగా, ఆ చెలికత్తె మొదటి రోజున ఆమెను రక్షించెను (37). కుంభాండుని పుత్రికయగు చిత్రలేఖ గొప్ప బుద్ధిమంతురాలు. ఓ మహర్షీ ! ఆమె బాణుని పుత్రికయగు ఉషతో మరల నిట్లనెను (38).

చిత్రలేఖోవాచ ।

వ్యసనం తేఽపకర్షామి త్రిలోక్యాం యది భావ్యతే ।
సమానే ష్యే నరం యస్తే మనోహర్తా తమాదిశ ॥

చిత్రలేఖ ఇట్లు పలికెను -

నీ మనస్సును దోచిన పురుషుని గురించి నీవు వివరించి చెప్పినచో, ఆతడు ముల్లోకములలో ఎక్కడనున్ననూ తీసుకువచ్చి నీ దుఃఖమును పోగొట్టగలను. కాన వానిని గురించి చెప్పుము (39).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా వస్త్ర పుటకే దేవాన్ దైత్యాంశ్చ దానవాన్ ।
గంధర్వసిద్ధనాగాంశ్చ యక్షాదీంశ్చ తదాలిఖత్ ॥
తథా నరాంస్తేషు వృష్ణీన్ శూరమానకదుందుభిమ్ ।
వ్యలిఖద్రామకృష్ణౌ చ ప్రద్యుమ్నం నరసత్తమమ్ ॥
అనిరుద్ధం విలిఖితం ప్రద్యుమ్నిం వీక్ష్య లజ్జితా ।
ఆసీదవా జ్ముఖీ చోషా హృదయే హర్షపూరితా ॥
ఉషా ప్రోవాచ చోరోఽ సౌ మయా ప్రాప్తస్తు యో నిశి ।
పురుషస్సఖి యేనాశు చేతో రత్నం హృతం మమ ॥
యస్య సంస్పర్శనాదేవ మోహితాహం తథా భవమ్ ।
తమహం జ్ఞాతుమిచ్ఛామి వద సర్వం చ భామిని ॥
కస్యాయమన్వయే జాతో నామ కిం చాస్య విద్యతే ।
ఇత్యుక్తా సాబ్రవీన్నామ యోగినీ తస్య చాన్వయమ్ ॥
సర్వమాకర్ణ్య సా తస్య కులాది మునిసత్తమ ।
ఉత్సుకా బాణతనయా బభాషే సా తు కామినీ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఇట్లు పలికి ఆమె వస్త్ర శకలముపై దేవతలను, దానవులను, దైత్యులను, గంధర్వులను, సిద్ధులను, నాగులను మరియు యక్షులు మొదలగు వారిని చిత్రించెను (40). ఇంతేగాక ఆమె మానవులను, వారిలో వృష్ణి వంశీయులను, శూరుడగు వసుదేవుని, బలరాముని, శ్రీకృష్ణుని, నరోత్తముడగు ప్రద్యుమ్నుని, ఆతని కుమారుడగు అనిరుద్ధుని కూడ చిత్రించెను. ఉష అనిరుద్ధుని గాంచి సిగ్గుతో తల వంచుకొనెను. ఆమె హృదయము ఆనందముతో నిండిపోయెను (41, 42). రాత్రియందు నన్ను పొందిన చోరుడు ఈ పురుషుడే. నా శ్రేష్ఠమగు మనస్సును వెంటనే దొంగిలించిన వాడు వీడే. ఓ సఖీ! (43) వీని స్పర్శ మాత్రముచే నేను మోహమును పొందితిని. ఓ భామినీ! ఆతనిని గురించి సర్వవృత్తాంతమును నేను తెలియగోరుచున్నాను, చెప్పుము అని ఉష పలికెను (44). ఈతడు జన్మించిన వంశము ఏది? వీని పేరు ఏమి? ఉష ఇట్లు ప్రశ్నించగా యోగవిద్యలలో నిష్ణాతురాలగు ఆమె ఆతని వంశమును మరియు పేరును చెప్పెను (45). ఓ మహర్షీ! బాణుని కుమార్తెయగు ఆ ఉష వాని కులము మొదలగు వివరముల నన్నిటినీ విని ప్రేమ, ఉత్సాహము పెల్లుబుకుచుండగా ఇట్లు పలికెను (46).

ఉషోవాచ|

ఉపాయం రచయ ప్రీత్యా తత్ప్రాప్త్యై సఖి తత్క్షణాత్ ।
యేనోపాయేన తం కాంతం లభేయ ప్రాణవల్లభమ్ ॥
యం వినాహం క్షణం నైకం సఖి జీవితుముత్సహే ।
తమానయేహ సద్యత్నాత్సుఖినీం కురు మాం సఖి ॥

ఉష ఇట్లు పలికెను –

ఓ సఖీ! వెంటనే నేను వానిని పొందే ఉపాయమును ప్రేమతో అనుష్ఠించుము. ప్రాణ ప్రియుడగు ఆ సుందరుని నేను పొందే ఉపాయమేమి? (47) ఓ సఖీ! అతడు లేనిదే క్షణమైననూ జీవించుటకు నాకు ఉత్సాహము లేదు. ఓ సఖీ! నీవు మంచి ప్రయత్నమును చేసి వానిని ఇచటకు గొని వచ్చి నాకు సుఖమును కలిగించుము (48).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా సా తథా బాణాత్మజయా మంత్రికన్యకా ।
విస్మితా భూన్మునిశ్రేష్ఠ సువిచారపరాఽ భవత్ ॥
తతస్సఖీం సమాభాష్య చిత్రలేఖా మనోజవా ।
బుద్ధ్వా తం కృష్ణపౌత్రం సా ద్వారకాం గంతుముద్యతా ॥
జ్యేష్ఠకృష్ణచతుర్దశ్యాం తృతీయే తు గతేఽహని ।
ఆ ప్రభాతాన్ముహూర్తే తు సంప్రాప్తా ద్వారకాం పురీమ్ ॥

ఏకేన క్షణమాత్రేణ నభసా దివ్యయోగినీ ।
తతశ్చాంతః పురోద్యానే ప్రాద్యుమ్నిర్దదృశే తయా ॥
క్రీడన్నారీజనై స్సార్ధం ప్రపిబన్ మాధవీ మధు ।
సర్వాంగసుందరశ్శ్యామ స్సుస్మితో నవయౌవనః ॥
తతః ఖట్వాం సమారూఢ మంధకారపటేనసా ।
అచ్ఛాదయిత్వా యోగేన తామసేన చ మాధవమ్ ॥
తతస్సా మూర్ధ్ని తాం ఖట్వాం గృహీత్వా నిమిషాంతరాత్ ।
సంప్రాప్తా శోణితపురం యత్ర సా బాణనందినీ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ ! బాణుని కుమార్తెయగు ఉష ఇట్లు పలుకగా మంత్రిపుత్రికయగు ఆ చిత్రలేఖ ఆశ్చర్యమును పొంది లోతుగా ఆలోచించ మొదలిడెను (49). ఆ యువకుడు శ్రీకృష్ణుని మనుమడు అని తెలిసిన చిత్రలేఖ తన సఖి వద్ద సెలవు తీసుకొని ద్వారకకు వెళ్లుటకు సిద్ధమాయెను (50). ఆమె జ్యేష్ఠ కృష్ణ చతుర్దశి నుండి మూడవనాడు సూర్యోదయమునకు ముందు మంచి ముహూర్తములో ద్వారకకు చేరెను (51). దివ్యములగు యోగశక్తులు గల ఆమె ఒక క్షణకాలములో ఆకాశమార్గముగుండా అచటకు చేరి అచట అంతఃపురోద్యానవనములో అనిరుదుని గాంచెను (52). ఆతడు స్త్రీ జనముతో గూడి విహరించి మధువును సేవించి తరువాత మంచముపై శయనించెను. సర్వావయవసుందరుడు, శ్యామలవర్ణము గలవాడు, చక్కని చిరునవ్వు గలవాడు, నూతన యౌవనములో నున్నవాడు అగు ఆ అనిరుద్ధుని ఆమె తామస యోగ ప్రభావముచే అంధకారముతో కప్పివేసి (53,54), ఆ మంచమును శిరముపై నిడుకొని ఒక నిముషములో శోణితపురమునకు వచ్చెను. అచట బాణుని పుత్రిక వేచి యుండెను (55).

కామార్తా వివిధాన్ భావాన్ చకారోన్మత్త మానసా ।
ఆనీతమథ తం దృష్ట్వా తదా భీతా చ సాభవత్ ॥
అంతః పురే సుగుప్తే చ నవే తస్మిన్ సమాగమే ।
యావత్ క్రీడి తుమారబ్ధం తావత్ జ్ఞాతం చ తత్ క్షణాత్ ॥
అంతః పురద్వారగతై ర్వేత్ర జర్ఝర పాణి భిః ।
ఇంగితై రనుమానైశ్చ కన్యా దౌశ్శీల్యమాచరన్ ॥
స చాపి దృష్టస్తైస్తత్ర నరో దివ్యవపుర్ధరః ।
తరుణో దర్శనీయస్తు సాహసీ సమరప్రియః ॥
తం దృష్ట్వా సర్వమాచఖ్యుర్బాణాయ బలిసూనవే ।
పురుషార్ మహావీరాః కన్యాంతః పురరక్షకాః ॥

కామపీడితురాలైన ఆమె పిచ్చిదానివలె అనేక భావ ప్రకటనలను చేసెను. అచటకు గొనిరాబడిన ఆ అనిరుద్ధుని గాంచి ఆమె అపుడు భయపడెను (56). దృఢమగు రక్షణ కలిగిన ఆ అంతఃపురములో ఆ ప్రేమికులిద్దరు మొదటి సమాగమములో విహరించుట నారంభించగానే ఆ విషయము బయటకు పొక్కెను (57). బెత్తములను ధరించుటచే శిథిలమైన చేతులు గల అంతఃపురద్వారపాలకులు కన్యతో దుర్వ్యవహారమును నడుపుచున్న పురుషుని గురించి ఆయా చిహ్నములను బట్టి ఊహించిరి (58). దివ్యమగు దేహమును ధరించియున్నవాడు, మానవుడు, యువకుడు, సుందరుడు, సాహసి, యుద్ధమునందు ప్రీతిగలవాడు అగు అనిరుద్ధుని వారు అచట కళ్లారా గాంచిరి (59). మహావీరులు, కన్యాంతఃపురమును రక్షించువారు అగు ఆ పురుషులు వానిని చూచి ఆ వృత్తాంతమునంతనూ బలిపుత్రుడగు బాణునకు విన్నవించిరి (60).

ద్వారపాలా ఊచుః ।

దేవ కశ్చిన్న జానీతే గుప్తశ్చాంతఃపురే బలాత్ ।

స కస్తు తవ కన్యాం వై స్వయంగ్రాహోదధర్షయత్ ॥

దానవేంద్ర మహాబాహో పశ్య పశ్యైనమత్ర చ ।

యద్యుక్తం స్యాత్తత్కురుష్వ న దుష్టా వయమిత్యుత ॥

ద్వారపాలకులిట్లు పలికిరి-

ఓ మహారాజా ! ఇది ఎట్లు జరిగినదో ఎవ్వనికీ తెలియదు. ఒకానొక పురుషుడు రహస్యముగా అంతఃపురములో ప్రవేశించి నీ కుమార్తెను బలాత్కారముగా తన వశము చేసుకొనినాడు (61). ఓ రాక్షస రాజా! గొప్ప బాహువులు గలవాడా! వానిని అచట నీవు స్వయముగా చూచి నీకు ఏది యోగ్యమని తోచునో, అట్లు చేయుము. మా దోషమేమియు లేదు (62).

సనత్కుమార ఉవాచ ।

తేషాం తద్వచనం శ్రుత్వా దానవేంద్రో మహాబలః ।

విస్మితోఽ భూ న్మని శ్రేష్ఠ కన్యాయా శ్శ్రుతదూషణః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం యుద్ధఖండే

ఉషాచరిత్రవర్ణనం నామ ద్విపంచాశత్తమోఽ ధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! వారి ఆ మాటలను విని మహాబలశాలియగు ఆ రాక్షసరాజు తన కుమార్తె యొక్క శీలము చెడినందులకు ఆశ్చర్యమును పొందెను (63).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో ఉషాచరిత్రవర్ణనమనే ఏబది రెండవ అధ్యాయము ముగిసినది (52).

53 - ఉషా అనిరుద్ధుల వివాహము

సనత్కుమార ఉవాచ ।

అథ బాణాసురః క్రుద్ధస్తత్ర గత్వా దదర్శ తమ్ ।
దివ్య లీలాత్తవపుషం ప్రథమే వయసి స్థితమ్ ॥
తం దృష్ట్వా విస్మితం వాక్యం కిం కారణమథా బ్రవీత్ ।
బాణః క్రోధపరీతాత్మా యుధి శౌండో హసన్నివ ॥
అహో మనుష్యో రూపాఢ్య స్సాహసీ ధైర్యవానితి ।
కోఽయమాగతకాలశ్చ దుష్టభాగ్యో విమూఢధీః ॥
యేన మే కులచారిత్రం దూషితం దుహితా హితా ।
తం మారయ ధ్వం కుపితాశ్శీఘ్రం శస్త్రైస్సుదారుణైః ॥
దురాచారం చ తం బద్ధ్వా ఘోరే కారాగృహే తతః ।
రక్షధ్వం వికటే వీరా బహుకాలం విశేషతః ॥
న జానే కోఽ యమభయః కో వా ఘోరపరాక్రమః ।
విచార్యేతి మహాబుద్ధి స్సందిగ్ధోఽ భూచ్చరాసురః ॥
తతో దైత్యేన సైన్యం తు దశసాహస్రకం శనైః ।
వధాయ తస్య వీరస్య వ్యాదిష్టం పాపబుద్ధినా ॥
తదాదిష్టాస్తు తే వీరాస్సర్వతోంతః పురం ద్రుతమ్ ।
ఛాదయామాసురత్యు గ్రాశ్ఛింది భింధీతి వాదినః ॥
శత్రుసైన్యం తతో దృష్ట్వా గర్జమానస్స యాదవః ।
అంతఃపురద్వారగతం పరిఘం గృహ్య చాతులమ్ ॥
నిష్క్రాంతో భవనాత్తస్మాద్వజ్రహస్త ఇవాంతకః ।
తేన తాన్ కింకరాన్ హత్వా పునశ్చాంతః పురం యయౌ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

అపుడు బాణాసురుడు మిక్కిలి కోపించి అచటకు వెళ్లి, దివ్య లీలాదేహమును దాల్చి యౌవనములోనున్న అనిరుద్ధుని గాంచెను (1). వానిని చూచి యుద్ధవిశారదుడగు బాణుడు కోపముతో మండిపడే మనస్సు గలవాడై, ఈతడు ఇట్లు చేయుటకు కారణమేమియో అని విస్మయమును పొంది, చిరునవ్వును ప్రదర్శించుచున్నట్లు ఉన్నవాడై ఇట్లు పలికెను (2). ఆశ్చర్యము! రూపవంతుడగు ఈ మానవుడు ధైర్యసాహసములు గలవాడు. దురదృష్టవంతుడు, మోహితమైన బుద్ధిగలవాడు మరియు చావు మూడినవాడు అగు ఈతడు ఎవడై యుండును? (3) నాకు ప్రీతిపాత్రమగు నా కుమార్తెను చెడగొట్టి వంశమర్యాదను పాడు జేసిన వీనిని శీఘ్రముగా మిక్కిలి భయంకరములగు శస్త్రములతో క్రోధపూర్వకముగా కొట్టుడు. (4). ఓ వీరులారా! ఈ దుర్మార్గుని భయంకరమగు కారాగారాములో బంధించి చిరకాలము ప్రత్యేకముగా రక్షించుడు (5).

భయంకరమగు పరాక్రమముగల వీనికి భయము లేకున్నది. వీడెవడో నాకు అర్థమగుట లేదని మహాబుద్ధిశాలియగు ఆ బాణాసురుడు ఆలోచించి ఒక నిర్ణయమునకు రాలేకపోయెను (6). అపుడా పాపాత్ముడగు రాక్షసుడు ఆ వీరుని వధించుటకై క్రమముగా పదివేలమంది సైన్యమును ఆదేశించెను (7). వానిచే ఆదేశించబడిన మిక్కిలి భయంకరులగు ఆ వీరులు నరుకుడు, చంపుడు అని పలుకుతూ అంతఃపురమునంతనూ వెంటనే చుట్టుముట్టిరి (8). యదువంశీయుడగు ఆ అనిరుద్ధుడు అపుడా సైన్యమును గాంచి గర్జిస్తూ అంతఃపురద్వారమువద్ద గల సాటిలేని పరిఘాయుధమును చేతబట్టి (9), వజ్రమును పట్టుకొనియున్న యమునివలె ఆ భవనమునుండి బయటకు వచ్చి దానితో ఆ కింకరులను సంహరించి మరల అంతఃపురములోనికి వెళ్లెను (10).

ఏవం దశసహస్రాణి సైన్యాని మునిసత్తమ ।
జఘాన రోషరక్తాక్షో వర్ధిత శ్శివతేజసా ॥
లక్షే హతేఽథ యోధానాం తతో బాణాసురో రుషా ।
కుంభాండం స గృహీత్వా తు యుద్ధే శౌడం సమాహ్వయత్ ॥
అనిరుద్ధం మహాబుద్ధిం ద్వంద్వయుద్ధే మహాహవే ।
ప్రాద్యుమ్నిం రక్షితం శైవతేజసా ప్రజ్వలత్తనుమ్ ॥
తతో దశసహస్రాణి తురంగాణాం రథోత్తమాన్ ।
యుద్ధ ప్రాప్తేన ఖడ్గేన దైత్యేంద్రస్య జఘాన సః ॥
తద్వధాయ తతశ్శక్తిం కాలవైశ్వానరోపమామ్ ।
అనిరుద్ధో గృహీత్వా తాం తయా తం నిజఘాన హి ॥
రథోపస్థే తతో బాణస్తేన శక్త్యా హతో దృఢమ్ ।
స సాశ్వస్తత్ క్షణం వీరస్తత్రైవాంతరధీయత ॥
తస్మింస్త్వదర్శనం ప్రాప్తే ప్రాద్యుమ్నిరపరాజితః ।
ఆలోక్య కకుభస్సర్వాస్తస్థౌ గిరిరివాచలః ॥
అదృశ్యమానస్తు తదా కూటయోధస్స దానవః ।
నానా శస్త్ర సహస్రైస్తం జఘాన హి పునః పునః ॥
ఛద్మనా నాగపాశైస్తం బబంధ సమహాబలః ।
బలిపుత్రో మహావీర శ్శివభక్తశ్శరాసురః ॥
తం బద్ధ్వా పంజరాంతస్స్థం కృత్వా యుద్ధాదుపారమత్ ।
ఉవాచ బాణస్సంక్రుద్ధ స్సూతపుత్రం మహాబలమ్ ॥

ఓ మహర్షీ ! శివుని అనుగ్రహముచే వర్ధిల్లిన తేజస్సుగల ఆ అనిరుద్ధుడు కోపముతో ఎర్రనైన కన్నులు గలవాడై ఈ విధముగా పదివేల సైన్యమును సంహరించెను (11). లక్ష యోధులు మరణించిన పిదప బాణాసురుడు క్రోధముతో కుంభాండుడు వెంటరాగా, యుద్ధవిశారదుడు, మహాబుద్ధిశాలి, ప్రద్యుమ్నపుత్రుడు,

శివుని తేజస్సుచే రక్షింపబడువాడు, గొప్పగా ప్రకాశించే దేహము కలవాడు అగు అనిరుద్ధుని ఆ మహాసంగ్రామములో ద్వంద్వయుద్ధమునకు ఆహ్వానించెను (12, 13). అపుడాతడు యుద్ధములో లభించిన కత్తితో పదివేల గుర్రములను సంహరించి, బాణాసురుని శ్రేష్ఠమగు రథములను ధ్వంసమొనర్చెను (14). తరువాత అనిరుద్ధుడు ప్రళయకాలాగ్నివంటి శక్తిని చేతబట్టి బాణాసురుని సంహరించగోరి, దానితో వానిని కొట్టెను (15). వీరుడగు బాణుడు రథములో కూర్చునియుండగా ఆ శక్తిచే గట్టిగా కొట్టబడినవాడై గుర్రములతో సహా వెనువెంటనే అంతర్ధానమాయెను (16). పరాజయమునెరుంగని ఆ ప్రద్యుమ్నపుత్రుడు ఆతడు అంతర్ధానము కాగానే పర్వతమువలె కదలకుండా నిలబడి దిక్కులనన్నిటినీ పరికించెను (17). మాయాయుద్ధ విశారదుడగు ఆ రాక్షసుడు కనబడకుండగనే అతనిని వేలాది ఆయుధములతో పలుమార్లు కొట్టెను (18). బలిపుత్రుడు, మహావీరుడు, శివభక్తుడు, మహాబలుడు అగు బాణాసురుడు మాయను ప్రయోగించి ఆతనిని నాగపాశములతో బంధించెను (19). ఆతనిని బంధించి పంజరమునందు ఉంచి, ఆ తరువాత బాణుడు యుద్ధమును విరమించి, మహాకోపముతో గొప్ప బలశాలియగు సూతపుత్రునితో నిట్లనెను (20).

బాణాసుర ఉవాచ ।

సూతపుత్ర శిరశ్ఛింది పురుషస్యాస్య వై లఘు ।
యేన మే దూషితం పూతం బలాద్దుష్టేన సత్కులమ్ ॥
ఛిత్త్వా తు సర్వగాత్రాణి రాక్షసేభ్యః ప్రయచ్ఛ భోః ।
అథాస్య రక్తమాంసాని క్రవ్యాదా అపి భుంజతామ్ ॥
అగాధే తృణసంకీర్ణే కూపే పాతకినం జహి ।
కిం బహూక్త్యా సూతపుత్ర మారణీయో హి సర్వథా ॥

బాణాసురుడిట్లు పలికెను -

ఓయీ! సూతపుత్రా! నాయొక్క పవిత్రమగు వంశమును బలప్రయోగముచే కలుషితము చేసిన ఈ దుష్టపురుషుని శిరస్సును వెంటనే నరికి వేయుము (21) ఓయీ! వీని శరీరమును ముక్కలు ముక్కలుగా నరికి రాక్షసులకు పంచిపెట్టుము. రాక్షసులు వీని రక్త మాంసములను భక్షించెదరు గాక! (22) ఈ పాపాత్ముని పిచ్చిమొక్కలతో నిండియున్న లోతైన నూతిలో పారవేయుము. ఓ సూతపుత్రా! ఇన్ని మాటలేల? వీనిని ఏ విధముగ నైననూ సంహరించుము (23).

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా ధర్మబుద్ధిర్నిశాచరః ।
కుంభాండస్స్వబ్రవీద్వాక్యం బాణం సన్మంత్రిసత్తమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

కాని గొప్ప మంత్రులలో అగ్రేసరుడు, ధర్మబుద్ధి గలవాడు అగు కుంభాండాసురుడు బాణుని ఆ మాటను విని అతనితో నిట్లనెను (24).

కుంభాండ ఉవాచ ।

నైతత్కర్తుం సముచితం కర్మ దేవ విచార్య తామ్ ।
అస్మిన్ హతే హతో హ్యాత్మా భవేదితి మతిర్మమ ॥
అయం తు దృశ్యతే దేవ తుల్యో విష్ణోః పరాక్రమైః ।
వర్ధితశ్చంద్రచూడస్య త్వద్దుష్టస్య సు చేతసా ॥
అథ చంద్రలలాటస్య సాహసేన సమస్త్వయమ్ ।
ఇమామవస్థాం ప్రాప్తోఽపి పౌరుషే సంవ్యవస్థితః ॥
అయం శివ ప్రసాదాద్వై కృష్ణపౌత్రో మహాబలః ।
అస్మాంస్తృణోపమాన్ వేత్తి దష్టోఽపి భుజగైర్బలాత్ ॥

కుంభాండుడు ఇట్లు పలికెను

ఓ దేవా! మీరు ఆలోచించుడు. ఈ పనిని చేయుట తగదు. వీనిని సంహరించుట ఆత్మహత్యతో సమమగునని నా అభిప్రాయము (25). ఓ దేవా! ఈతడు పరాక్రమములో విష్ణువుతో సమమైనవానివలె కన్పట్టుచున్నాడు. నీయందు కినుక పూనిన శివుని అనుగ్రహముచే ఈతడు వర్ధిల్లుచున్నాడు (26). ఈతడు సాహసములో శివునితో సమమైనవాడు. ఈ అవస్థను పొందియు, ఈతడు పౌరుషమును విడనాడకున్నాడు (27). శ్రీ కృష్ణుని మనుమడు, మహాబలశాలి అగునీతడు పాములచే బలముగా కరువబడిననూ, మనలను గడ్డి పోచలతో సమముగా పరిగణించుచున్నాడు (28).

సనత్కుమార ఉవాచ ।

ఏతద్వాక్యం తు బాణాయ కథయిత్వా స దానవః ।
అనిరుద్ధమువాచేదం రాజనీతివిదుత్తమః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

రాజనీతివేత్తలలో శ్రేష్ఠుడగు ఆ రాక్షసుడు బాణునితో నిట్లు పలికి, అనిరుద్ధునితో నిట్లనెను (29).

కుంభాండ ఉవాచ ।

కోఽపి కస్యాసి రే వీర సత్యం వద మమాగ్రతః ।
కేన వా త్వమిహానీతో దురాచార నరాధమ ॥
దైత్యేంద్రం స్తుహి వీరం త్వం నమస్కురు కృతాంజలిః ।
జితోఽస్మీతి వచో దీనం కథయిత్వా పునః పునః ॥
ఏవం కృతే తు మోక్షస్స్యాదన్యథా బంధనాది చ ।
తచ్ఛ్రుత్వా వచనం తస్య ప్రతివాక్యమువాచ సః ॥

కుంభాండుడిట్లు పలికెను

ఓరీ వీరా ! నీవు ఎవరివి? ఎవరి వాడవు? నా యెదుట సత్యమును పలుకుము. ఓరీ మానవాధమా! దుష్టమగు శీలము గలవాడా! నిన్ను ఇచటకు ఎవరు తీసుకువచ్చిరి? (30) నీవు చేతులను జోడించి వీరుడగు ఈ రాక్షసరాజును నమస్కరించి స్తుతించుము. దీనుడవై పలుమార్లు జయింపబడితినని పలుకుము (31). ఇట్లు చేసినచో, నీకు విడుదల లభించును. లేనిచో, నీకు బంధము ఇత్యాదులు తప్పవు. ఆతని ఆ మాటను విని, అనిరుద్ధుడు ఇట్లు బదులు చెప్పెను (32).

అనిరుద్ధ ఉవాచ ।

రేరే దైత్యాఽధమసఖే కరపిండోపజీవక ।
నిశాచర దురాచార శత్రుధర్మం న వేత్సి భోః ॥
దైన్యం పలాయనం చాథ శూరస్య మరణాధికమ్ ।
విరుద్ధం చోపశల్యం చ భవేదితి మతిర్మమ ॥
క్షత్రియస్య రణే శ్రేయో మరణం సన్ముఖే సదా ।
న వీరమానినో భూమౌ దీన స్యేవ కృతాంజలిః ॥

అనిరుద్ధుడిట్లు పలికెను-

. ఓరీ! నీచుడగు దైత్యుని మిత్రుడా! చేతితో విదల్చిన మెతుకులను తిని జీవించువాడా! ఓయీ! దుష్టమగు శీలము గల రాక్షసా! నీవు శత్రువుల ధర్మములను ఎరుంగవు (33). శూరునకు దీనముగా పలుకుట, పారిపోవుట అనునవి మరణముకంటె అధికమగు దుఃఖమును కలిగించును. ఇట్టి విరుద్ధమగు చర్య హృదయములో శల్యము అగునని నా అభిప్రాయము (34). క్షత్రియునకు ఎన్నడైననూ యుద్ధరంగములో శత్రువునకు యెదుట మరణము శ్రేయస్కరము. ఈ లోకములో వీరుడననే అభిమానము గలవాడు దీనునివలె చేతులను జోడించడు (35).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాది వీరవాక్యాని బహూని స జగాద తమ్ ।
తదాకర్ణ్య సబాణోఽసౌ విస్మితోఽభూచ్చుకోప చ ॥
తదోవాచ నభోవాణీ బాణస్యాశ్వాసనాయ హి ।
శృణ్వతాం సర్వవీరాణామనిరుద్ధస్య మంత్రిణః ॥

సనత్కుమారుడిట్లు పలికెను

అనిరుద్ధుడు ఈ విధముగా ఆతనితో వీరవాక్యములను పలికెను. బాణునితో సహా ఆతడు ఆ మాటలను విని విస్మయమును, కోపమును పొందెను (36). అపుడు ఆకాశవాణి బాణుని ఓదార్చుటకొరకై, అనిరుద్ధుడు, మంత్రి మరియు సర్వవీరులు వినుచుండగా ఇట్లు పలికెను (37).

వ్యోమవాణ్యువాచ ।

భో భో బాణ మహావీర న క్రోధం కర్తుమర్హసి ।
బలిపుత్రోఽసి సుమతే శివభక్త విచార్యతామ్ ॥
శివస్సర్వేశ్వరస్సాక్షీ కర్మణాం పరమేశ్వరః ।
తదధీనమిదం సర్వం జగద్వై సచరాచరమ్ ॥
స ఏవ కర్తా భర్తా చ సంహర్తా జగతాం సదా ।
రజస్సత్త్వతమోధారీ విధివిష్ణుహరాత్మకః ॥
సర్వస్యాంతర్గతస్స్వామీ ప్రేరకస్సర్వతః పరః ।
నిర్వికార్యవ్యయో నిత్యో మాయాధీశోఽపి నిర్గుణః ॥
తస్యేచ్ఛయాఽబలో జ్ఞేయో బలీ బలివరాత్మజ ।
ఇతి విజ్ఞాయ మనసి స్వస్థో భవ మహామతే ॥
గర్వాపహారీ భగవాన్నానాలీలా విశారదః ।
నాశయిష్యతి తే గర్వమిదానీం భక్తవత్సలః ॥

ఆకాశవాణి ఇట్లు పలికెను -

ఓయీ బాణా ! మహావీరుడవగు నీవు కోపించుట తగదు. నీవు బలి యొక్క పుత్రుడవు. గొప్ప బుద్ధిమంతుడవు. శివభక్తుడవు. ఆలోచించుము (38). సర్వేశ్వరుడు, పరమేశ్వరుడు అగు శివుడు కర్మసాక్షి. స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తు అంతయు నిశ్చయముగా ఆయన ఆధీనములో నున్నది (39). ఆయనయే సర్వదా రజస్సత్త్వతమోగుణాత్మకుడై బ్రహ్మవిష్ణురుద్రరూపములను దాల్చి ఈ జగత్తులను సృష్టించి, పాలించి పోషించి, ఉపసంహరించుచున్నాడు (40). పరమాత్మ, వికారములు లేనివాడు, వినాశము లేనివాడు, నిత్యుడు, మాయను వశము చేసుకున్నవాడు, నిర్గుణుడు అగు ఆ ప్రభుడు సర్వప్రాణుల హృదయములలోనుండి అన్ని విధములుగా ప్రేరణనిచ్చుచున్నాడు (41). ఓయీ

బలియొక్క శ్రేష్ఠపుత్రుడా ! ఆయన ఇచ్చచే బలహీనుడైననూ బలవంతుడగును. ఓ గొప్ప బుద్ధిగలవాడా ! ఇట్లు మనస్సులో తలపోసి స్వస్థుడవు కమ్ము (42). అనేకలీలలను ప్రకటించుటలో దక్షుడు, భక్తవత్సలుడు, గర్వమును హరించువాడు అగు ఆ భగవానుడు నీ గర్వమును ఇప్పుడు నాశము చేయగలడు (43).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాభాష్య నభవాణీ విరరామ మహామునే ।
బాణాసురస్తద్వచనాదనిరుద్ధం న జఘ్నివాన్ ॥
కిం తు స్వాంతఃపురం గత్వా పపౌ పానమనుత్తమమ్ ।
తద్వాక్యం చ విసస్మార విజహార విరుద్ధధీః ॥
తతోఽనిరుద్ధో బద్ధస్తు నాగభోగైర్విషోల్బణైః ।
ప్రియయాఽతృప్తచేతాస్తు దుర్గాం సస్మార తత్క్షణాత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ మహర్షీ ! ఆకాశవాణి ఇట్లు పలికి విరమించెను. ఆ మాటను విని బాణాసురుడు ం అనిరుద్ధుని సంహరించలేదు (44). కాని దుష్టబుద్ధియగు ఆతడు తన అంతఃపురమునకు వెళ్ళి విలువైన పానీయమును సేవించి ఆ మాటలను విస్మరించి విహరించెను (45). ప్రియురాలియందు ఇంకను తనివి తీరని ఆ అనిరుద్ధుడు భయంకరమగు విషమును గ్రక్కే. పాముల పడగలచే బంధింపబడినవాడై అపుడు వెంటనే దుర్గను స్మరించెను (46).

అనిరుద్ధ ఉవాచ ।

శరణ్యే దేవి బద్ధోఽస్మి దహ్యమానస్తు పన్నగైః ।
ఆగచ్ఛ మే కురు త్రాణం యశోదే చండరోషిణి ॥
శివభక్తే మహాదేవి సృష్టిస్థిత్యంతకారిణి ।
త్వాం వినా రక్షకో నాన్యస్తస్మాద్రక్ష శివే హి మామ్ ॥

అనిరుద్ధుడిట్లు పలికెను -

శరణు పొందినవారియందు సాధువగు ఓ దేవీ! పాములచే బంధింపబడియున్నాను. విషము దహించుచున్నది. కీర్తిని ఇచ్చు ఓ దేవీ! భయంకరమగు కోపము గలదానా ! వచ్చి నన్ను రక్షించుము (47). శివుని భక్తురాలవగు ఓ గొప్ప దేవీ! సృష్టిస్థితి లయములను చేయుదానవు నీవే. నీవు తక్క రక్షించువారు మరియొకరు లేరు. ఓ శివపత్నీ ! కావున నన్ను రక్షించుము (48).

సనత్కుమార ఉవాచ ।

తేనేత్థం తోషితా తత్ర కాలీ ఖిన్నాంజన ప్రభా ।
జ్యేష్ఠ కృష్ణచతుర్దశ్యాం సంప్రాప్తాసీన్మహానిశి ॥
గురుభిర్ముష్టి నిర్ఘాతైర్దారయామాస పంజరమ్ ।
శరాంస్తాన్ భస్మసాత్కృత్వా సర్పరూపాన్ భయానకాన్ ॥
మోచయిత్వానిరుద్ధం తు తతశ్చాంతఃపురం తతః ।
ప్రవేశయిత్వా దుర్గా తు తత్రైవా దర్శనం గతా ॥
ఇత్థం దేవ్యాః ప్రసాదాత్తు శివశక్తేర్మునీశ్వర ।
కృచ్ఛ్రముక్తోఽ నిరుద్ధో భూత్సుఖీ చైవ గతవ్యథః ॥
అథ లబ్ధజయో భూత్వానిరుద్ధశ్శివశక్తితః ।
ప్రాద్యుమ్నిర్బాణతనయాం ప్రియాం ప్రాప్య ముమోద చ ॥
పూర్వవద్విజహారాసౌ తయా స్వప్రియయా సుఖీ ।
పీతపానస్స్ఫురద్రక్తాక్షస్స బాణసుతయా తతః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే అనిరుద్ధోషా
వివాహ వర్ణనం నామ త్రిపంచాశత్తమోఽధ్యాయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

ఆ సమయములో జ్యేష్ఠ కృష్ణచతుర్దశి అర్ధరాత్రమునందు ఈ విధముగా వానిచేత స్తుతించ బడినదై మెత్తని కాటుకవంటి కాంతులు గల కాళి అచటకు విచ్చేసెను (49). ఆమె బలమైన పిడికిలి దెబ్బలతో పంజరమును పగులగొట్టి సర్పరూపములగు ఆ భయంకర బాణములను భస్మము చేసెను (50). అపుడా దుర్గ అనిరుద్ధుని విడిపించి అంతఃపురములో ప్రవేశపెట్టి అచటనే అంతర్ధానమాయెను (51). ఓ మహర్షీ ! ఈ విధముగా దేవీ శివశక్తి యొక్క అనుగ్రహముచే అనిరుద్ధుడు ఆపదనుండి విముక్తుడై భయము తొలగి సుఖమును పొందెను (52). అపుడు ప్రద్యుమ్నపుత్రుడగు అనిరుద్ధుడు శివశక్తివలన విజయమును పొంది ప్రియురాలగు బాణపుత్రికను చేరి ఆనందించేను (53). అపుడాతడు తన ప్రియురాలగు బాణపుత్రికతో గూడి మధుపానముచే ఎర్రని నేత్రములు గలవాడై పూర్వమునందువలెనే సుఖముగా విహరించెను (54).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో అనిరుద్ధోషా వివాహవర్ణనమనే ఏబది మూడవ అధ్యాయము ముగిసినది (53).

54 – శ్రీ కృష్ణ బాణాసురుల యుద్ధము

వ్యాస ఉవాచ ।

అనిరుద్ధే హృతే పౌత్రే కృష్ణస్య మునిసత్తమ ।
కుంభాండసుతయా కృష్ణః కిమకార్షీద్ధి తద్వద ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ మహర్షీ ! కృష్ణుని మనుమడు అగు అనిరుద్ధుని కుంభాండుని కుమార్తె అపహరించుకొని పోగా, శ్రీ కృష్ణుడు ఏమి చేసెనో చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

తతో గతేఽనిరుద్ధేతు తత్ స్త్రీణాం రోదనస్స్వనమ్ ।
శ్రుత్వా చ వ్యథితః కృష్ణో బభూవ మునిసత్తమ ॥
అపశ్యతాం చానిరుద్ధం తద్బంధూనాం హరేస్తథా ।
చత్వారో వార్షికా మాసా వ్యతీయురనుశోచతామ్ ॥
నారదాత్తదుపాకర్ణ్య వార్తాం బద్ధస్య కర్మ చ ।
ఆసన్ సువ్యథితాస్సర్వే వృష్ణయః కృష్ణదేవతాః ॥
కృష్ణస్సద్వృత్తమఖిలం శ్రుత్వా యుద్ధాయ చాదరాత్ ।
జగామ శోణితపురం తార్క్ష్యమాహూయ తత్క్షణాత్ ॥
ప్రద్యుమ్నో యుయుధానశ్చ గతస్సాంబోఽథ సారణః ।
నందోపనందభద్రాద్యా రామకృష్ణా నువర్తినః ॥
అక్షౌహిణీ భిర్ద్వాదశభిస్సమేతాస్సర్వతో దిశమ్ ।
రురుధుర్బాణనగరం సమంతాత్సాత్వతర్షభాః ॥
భజ్యమానపురోద్యాన ప్రాకారాట్టాలగోపురమ్ ।
వీక్ష్యమాణో రుషావిష్టస్తుల్య సైన్యోఽభినిర్యయౌ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఓ మహర్షీ ! అనిరుద్ధుడు అపహరింపబడిన తరువాత వాని స్త్రీల ఏడ్పులను విని శ్రీ కృష్ణుడు మిక్కిలి దుఃఖితుడాయెను (2). అనిరుద్ధుడు అదృశ్యమైన తరువాత ఆతని బంధువులు మరియు శ్రీ కృష్ణుడు దుఃఖించుచుండగా వర్షాకాలము నాలుగు మాసములు గడిచిపోయెను (3). అనిరుద్ధుడు బంధితుడగుట, ఆ తరువాత జరిగిన ఘటనలు ఇత్యాది వృత్తాంతమును నారదుడు చెప్పగా విని శ్రీ కృష్ణుడే దైవముగా గల వృష్ణులు అందరు దుఃఖితులైరి (4). శ్రీ కృష్ణుడు ఆ వృత్తాంతమునంతను విని వెంటనే గరుత్మంతుని పిలిచి యుద్ధమునందు బద్ధాదరుడై శోణితపురమునకు వెళ్లెను (5). బలరామకృష్ణుల అను యాయులగు ప్రద్యుమ్నుడు, యుయుధానుడు, సాంబుడు, సారణుడు, నందుడు, ఉప నందుడు, భద్రుడు మొదలగు వారందరు కూడా వెళ్లిరి

(6). ఆ యదువంశవీరులు పన్నెండు అక్షౌహిణీల సైన్యమును తీసుకొని బాణుని నగరమును అన్ని వైపులనుండి పూర్తిగా ముట్టడించిరి (7). ప్రాకారములు, నగరమునందలి ఉద్యానవనములు, బురుజులు, గోపురములు పగులగొట్టబడుటను గాంచిన బాణుడు క్రోధముతో నిండినవాడై సమానమగు సైన్యము తోడు రాగా వారికి ఎదురు వెళ్లెను (8).

బాణార్థే భగవాన్ రుద్రస్ససుతః ప్రమథైర్వృతః ।
ఆరుహ్య నంది వృషభం యుద్ధం కర్తుం సమాయయౌ ॥
ఆసీత్సుతుములం యుద్ధమద్భుతం లోమహర్షణమ్ ।
కృష్ణాదికానాం తైస్తత్ర రుద్రాద్యైర్బాణరక్షకైః ॥
కృష్ణశంకరయోరాసీత్ప్రద్యుమ్న గుహయోరపి ।
కూష్మాండకూపకర్ణాభ్యాం బలేన సహ సంయుగః ॥
సాంబస్య బాణపుత్రేణ బాణేన సహ సాత్యకేః ।
నందినా గరుడస్యాపి పరేషాం చ పరైరపి ॥
బ్రహ్మాదయస్సురాధీశా మునయస్సిద్ధచారణాః ।
గంధర్వాప్సరసో యానైర్విమానైర్ద్ర ష్టుమాగమన్ ॥
ప్రమథైర్వివిధాకారై రేవత్యంతైస్సుదారుణమ్ ।
యుద్ధం బభూవ విప్రేంద్ర తేషాం చ యదువంశినామ్ ॥
భ్రాత్రా రామేణ సహితః ప్రద్యుమ్నేన చ ధీమతా ।
కృష్ణశ్చకార సమరమతులం ప్రమథైస్సహ ॥

బాణునికొరకై రుద్రభగవానుడు నందియనే వృషభమునధిరోహించి తమ కుమారులతో మరియు ప్రమథగణములతో కూడినవాడై యుద్ధమును చేయుటకు విచ్చేసెను (9). అపుడు కృష్ణుడు మొదలగు వారికి బాణుని రక్షించే రుద్రుడు మొదలగు వారితో రోమాంచమును కలిగించే అద్భుతమగు తుములయుద్ధము జరిగెను (10). కృష్ణునకు శంకరునితో, ప్రద్యుమ్నునకు కుమారస్వామితో, బలరామునకు కూష్మాండకూపకర్ణులతో, సాంబునకు బాణుని పుత్రునితో, సాత్యకికి బాణునితో, గరుడునకు నందితో మరియు ఇతరులకు ఇతరులతో ద్వంద్వయుద్ధము జరిగెను (11, 12). బ్రహ్మ మొదలగు దేవ నాయకులు, మునులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు మరియు అప్సరసలు తమ తమ వాహనములపై మరియు విమానములలో చూచుటకు వచ్చిరి (13). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! ఆ యదువంశీయులకు రేవతీగణము వరకు గల వివిధ ప్రమథ గణములతో దారుణమగు యుద్ధము జరిగెను (14). శ్రీకృష్ణుడు సోదరుడగు బలరామునితో మరియు బుద్ధిశాలియగు ప్రద్యుమ్నునితో గూడి ప్రమథగణములతో సాటిలేని యుద్ధమును చేసెను (15).

తత్రాగ్నినాఽ భవద్యుద్ధం యమేన వరుణేన చ ।
విముఖేన త్రిపాదేన జ్వరేణ చ గుహేన చ ॥
ప్రమథైర్వివిధాకారైస్తేషామత్యంత దారుణమ్ ।
యుద్ధం బభూవ వికటం వృష్ణీనాం రోమహర్షణమ్ ॥
బిభీషికా భిర్బహ్వీభిః కోటరీభిః పదే పదే ।
నిర్లజ్జాభిశ్చ నారీభిః ప్రబలాభిర దూరతః ॥
శంకరానుచరాన్ శౌరిర్భూత ప్రమథగుహ్యకాన్ ।
ద్రావయామాస తీక్ష్ణాగ్రై శ్శరైశ్శార్ఙ్గ నుశ్చ్యుతైః ॥
ఏవం ప్రద్యుమ్న ప్రముఖా వీరా యుద్ధమహోత్సవాః ।
చక్రుర్యుద్ధం మహాఘోరం శత్రుసైన్యం వినాశయన్ ॥
విశీర్యమాణం స్వబలం దృష్ట్వా రుద్రోఽ త్యమర్షణః ।
క్రోధం చకార సుమహన్ననాద చ మహోల్బణమ్ ॥
తచ్ఛ్రుత్వా శంకరగణా వినేదుర్య్యయుధుశ్చ తే ।
మర్దయన్ ప్రతియోద్ధారం వర్ధితాశ్శంభుతేజసా ॥

అప్పుడు అగ్నియమవరుణులకు విముఖ త్రిపాద జ్వర గుహులతో యుద్ధము జరిగెను (16). ఆ యాదవులకు వివిధములగు ఆకారములు గల ప్రమథులతో, భయమును గొల్పు అనేక కోటరీ గణములతో మరియు సిగ్గును విడచిన బలవంతులగు స్త్రీల యొక్క దట్టమగు సైన్యముతో ప్రతి అడుగునందు మిక్కిలి భయంకరము, బీభత్సము అగు యుద్ధము జరిగెను (17, 18). శ్రీకృష్ణుడు శార్ఙ్గధనస్సునుండి ప్రయోగించబడిన వాడియగు బాణములతో శంకరుని అనుచరులగు భూతములను, ప్రమథులను మరియు గుహ్యకులను తరుమజొచ్చెను (19). ఈ విధముగా యుద్ధమును గొప్ప ఉత్సవముగా పరిగణించే ప్రద్యుమ్నాది వీరులు మహాభయంకరమగు యుద్ధములో శత్రుసైన్యమును వినాశమొనర్చిరి (20). చెల్లాచెదరగుచున్న తమ సైన్యమును గాంచిన రుద్రుడు సహనమును గోల్పోయి అతిభయంకరమగు క్రోధమును పొంది పెద్ద సింహనాదమును చేసెను (21). శంభుని తేజస్సుచే వృద్ధిని పొందిన శంకరగణములు దానిని విని తాము కూడ నినదించి శత్రువులను సంహరిస్తూ యుద్ధమును చేసిరి (22).

పృథగ్విధాని చాయుంక్త శార్ఙ్గ స్త్రాణి పినాకినే ।
ప్రత్యస్త్రైశ్శమయామాస శూలపాణిరవిస్మితః ॥
బ్రహ్మాస్త్రస్య చ బ్రహ్మాస్త్రం వాయవ్యస్య చ పార్వతమ్ ।
ఆగ్నేయస్య చ పార్జన్యం నైజం నారాయణస్య చ ॥
కృష్ణసైన్యం విదుద్రావ ప్రతివీరేణ నిర్జితమ్ ।
న తస్థౌ సమరే వ్యాస పూర్ణరుద్రస్య తేజసా ॥

విద్రావితే స్వసైన్యే తు శ్రీ కృష్ణశ్చ పరంతపః ।
స్వం జ్వరం శీతలాఖ్యం హి వ్యసృజద్దారుణం మునే ॥
విద్రావితే కృష్ణ సైన్యే కృష్ణస్య శీతలజ్వరః ।
అభ్యపద్యత తం రుద్రం మునే దశ దిశో దహన్ ॥
మహేశ్వరోఽథ తం దృష్ట్వాఽఽ యాంతం స్వం విసృజన్ జ్వరమ్ ।
మాహేశ్వరో వైష్ణవశ్చ యుయుధాతే జ్వరావుభౌ ॥
వైష్ణవోఽథ సమాక్రందన్మాహేశ్వరబలార్దితః ।
అలబ్ధ్వాఽఽ భయమన్యత్ర తుష్టావ వృషభధ్వజమ్ ॥
అథ ప్రసన్నో భగవాన్ విష్ణు జ్వరనుతో హరః ।
విష్ణుశీతజ్వరం ప్రాహ శరణాగతవత్సలః ॥

శ్రీకృష్ణుడు తన శార్ఙ్గమునుండి వివిధములగు అస్త్రములను శివునిపై ప్ర యోగించెను. కాని శూలమును చేతిలో ధరించియుండే శివుడు విస్మయమును పొందకుండగనే వాటిని ప్రత్యక్షములగు ఆయుధములతో శాంతింపజేసెను (23). ఆయన బ్రహ్మాస్త్రమును బ్రహ్మాస్త్రముతో, వాయవ్యాస్త్రమును పార్వతాస్త్రముతో, ఆగ్నేయమును పర్జన్యాస్త్రముతో మరియు నారాయణాస్త్ర మును పాశుపతాస్త్రముతో, శమింపజేసెను (24). ఓ వ్యాసా! యుద్ధములో రుద్రుని పూర్ణతేజస్సు ముందు నిలబడజాలక శ్రీకృష్ణుని సైన్యము ప్రతిపక్షముచే జయించబడి పారిపోయెను (25). ఓ మునీ! శత్రువులను తపింపజేయు శ్రీకృష్ణుడు తన సైన్యము చెల్లాచెదరు అగుటను గాంచి శీతలము అను పేరు గల తన భయంకరమగు జ్వరమును విడిచిపెట్టెను (26). ఓ మునీ! శ్రీకృష్ణుని సైన్యము పారిపోగా, ఆయన ప్రయోగించిన శీతలజ్వరము పది దిక్కులను దహింపజేయుచు రుద్రుని మీదకు వచ్చెను (27). అపుడు తన మీదకు వచ్చుచున్న ఆ జ్వరమును గాంచి మహేశ్వరుడు తన జ్వరమును విడిచిపెట్టెను. ఆ మాహేశ్వర-వైష్ణవజ్వరములు రెండు యుద్ధమును చేసినవి (28). అపుడు మాహేశ్వరజ్వరము యొక్క బలముచే పీడించబడిన వైష్ణవజ్వరము ఇతరత్రా అభయమును పొందజాలక వృషభధ్వజుని స్తుతించెను (29). అపుడు శరణాగతవత్సలుడగు శివుడు విష్ణుజ్వరము యొక్క స్తోత్రముచే ప్రసన్నుడై ఆ శీతలజ్వరముతో నిట్లనెను (30).

మహేశ్వర ఉవాచ ।

శీతజ్వర ప్రసన్నోఽహం వ్యేతు తే మజ్జ్వరాద్భయమ్ ।
యో నౌ స్మరతి సంవాదం తస్య న స్యాజ్జ్వరాద్భయమ్ ॥

మహేశ్వరుడు ఇట్లు పలికెను -

ఓ శీతజ్వరమా ! నేను నీ విషయములో ప్రసన్నుడనైతిని. నీకు నా జ్వ రము వలని భయము తొలగిపోయినది. మన ఇద్దరి సంభాషణను ఎవడైతే స్మరించునో, వానికి జ్వరభయము ఉండదు (31).

సనత్కుమార ఉవాచ।

ఇత్యుక్తో రుద్రమానమ్య గతో నారాయణజ్వరః ।
తం దృష్ట్వా చరితం కృష్ణో విసిస్మాయ భయాన్వితః ॥
స్కందః ప్రద్యుమ్నబాణౌఘైరర్ద్యమానోఽథ కోపితః ।
జఘాన శక్త్యా ప్రద్యుమ్నం దైత్య సంఘాత్యమర్దనః ॥
స్కందశక్తిహతస్తత్ర ప్రద్యుమ్నః ప్రబలోఽపి హి ।
అసృగ్విముంచన్ గాత్రేభ్యో బలేనాపాక్రమద్రణాత్ ॥
కుంభాండకూపకర్ణాభ్యాం నానాస్త్రైశ్చ సమాహతః ।
దుద్రావ బలభద్రోఽపి న తస్థేఽపి రణే బలీ ॥
కృత్వా సహస్రం కాయానాం పీత్వా తోయం మహార్ణవాత్ ।
గరుడో నాశయత్యర్ణావర్త్తైర్మేఘూర్ణవాంబుభిః ॥
అథ క్రుద్ధో మహేశస్య వాహనో వృషభో బలీ ।
వేగేన మహతారం వై శృంగాభ్యాం నిజఘాన తమ్ ॥
శృంగఘాతవిశీర్ణాంగో గరుడోఽతీవ విస్మితః ।
విదుద్రైవ రణాత్తూర్ణం విహాయ చ జనార్ధనమ్ ॥
ఏవం జాతే చరిత్రం తు భగవాన్ దేవకీసుతః ।
ఉవాచ సారథిం శీఘ్రం రుద్రతేజోతివిస్మితః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

రుద్రుడిట్లు పలుకగా నారాయణజ్వరము ఆయనకు ప్రణమిల్లి నిష్క్రమించెను. ఆ ఘటనను గాంచి శ్రీ కృష్ణుడు చకితుడై భయమును పొందెను (32). అపుడు రాక్షస సంహారకుడగు కుమారస్వామి ప్రద్యుమ్నుని బాణపరంపరలచే పీడింపబడినవాడై దానిని సహించనివాడై కోపించి ప్రద్యుమ్నుని కొట్టెను (33). కుమారస్వామియొక్క శక్తిచే బలముగా కొట్టబడిన ప్రద్యుమ్నుడు గొప్ప బలశాలియే అయిననూ శరీరావయవములనుండి రక్తము స్రవించుచుండగా అపుడు రణరంగమునుండి పారిపోయెను (34). కుంభాండకూపకర్ణులచే వివిధములగు అస్త్రములచే గట్టిగా కొట్టబడిన బలరాముడు బలశాలియే అయినా యుద్ధమునందు నిలబడలేక పారిపోయెను (35). గరుడుడు వేయి దేహములను దాల్చి మహాసముద్రమునుండి నీటిని త్రాగి ప్రళయకాలమేఘముల జలధారలతో శత్రువులను ముంచెత్తి నశింపజేసెను (36). అపుడు బలవంతుడు, మహేశుని వాహనము అగు నంది మహావేగముతో ఆతనిని కొమ్ములతో పొడిచెను (37). కొమ్ముపోట్లచే శిథిలమైన అవయవములు గల గరుడుడు మిక్కిలి ఆశ్చర్యమును పొంది జనార్ధనుని విడిచిపెట్టి రణరంగమునుండి వెంటనే పారిపోయెను (38). దేవకీనందనుడగు శ్రీ కృష్ణ భగవానుడు ఈ ఘటనలను గాంచి రుద్రుని తేజస్సును స్మరించి అత్యాశ్చర్యమును పొందినవాడై వెంటనే సారథితోనిట్లు పలికెను (39).

శ్రీ కృష్ణ ఉవాచ ।

హే సూత శృణు మద్వాక్యం రథం మే వాహయ ద్రుతమ్ ।

మహాదేవసమీపస్థో యథా స్యాం గదితుం వచః ॥

శ్రీ కృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ సూతా! నా మాటను వినుము. నా రథమును వెంటనే మహాదేవుని సమీపమునకు గొనిపొమ్ము. నేను ఆయనతో మాటలాడవలసియున్నది (40).

సనత్కుమార ఉవాచ।

ఇత్యుక్త హరిణా సూతో దారుకస్సుగుణాగ్రణీః ।

ద్రుతం తం వాహయామాస రథం రుద్రసమీపతః ॥

అథ విజ్ఞాపయామాస నతో భూత్వా కృతాంజలిః ।

శ్రీ కృష్ణశ్శంకరం భక్త్యా ప్రపన్నో భక్తవత్సలమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

శ్రీకృష్ణుడు ఇట్లు పలుకగా, రథమును నడుపుటలో అగ్రేసరుడగు దారుకుడు ఆ రథమును వెంటనే రుద్రుని సమీపమునకు తోలుకొని వెళ్లెను (41). అపుడు శ్రీకృష్ణుడు చేతులను జోడించి నమస్కరించి, భక్తవత్సలుడగు శంకరుని శరణు పొంది భక్తితో ఇట్లు విన్నవించు కొనెను (42).

శ్రీ కృష్ణ ఉవాచ ।

దేవ దేవ మహాదేవ శరణాగతవత్సల ।

నమామి త్వాఽ నంతశక్తిం సర్వాత్మానం పరేశ్వరమ్ ॥

విశ్వోత్పత్తి స్థాననాశహేతుం సద్ జ్ఞప్తి మాత్రకమ్ ।

బ్రహ్మలింగం పరం శాంతం కేవలం పరమేశ్వరమ్ ॥

కాలో దైవం కర్మ జీవస్స్వభావో ద్రవ్యమేవ చ ।

క్షేత్రం చ ప్రాణ ఆత్మా చ వికారస్తత్సమూహకః ॥

బీజరోహప్రవాహస్తు త్వన్మాయైషా జగత్ప్రభో ।

తన్ని బంధం ప్రపద్యేహం త్వామహం పరమేశ్వరమ్ ॥

నానా భావైర్లీలయైవ స్వీకృతైర్నిర్జరాదికాన్ ।

నూనం బిభర్షి లోకేశో హంస్యున్మార్గాన్ స్వభావతః ॥

త్వం హి బ్రహ్మ పరం జ్యోతిర్గూఢం బ్రహ్మణి వాఙ్మయే ।

యం పశ్యంత్యమలాత్మానమాకాశమివ కేవలమ్ ॥

త్వమేవ చాద్యః పురుషోఽ ద్వితీయస్తుర్య ఆత్మదృక్ ।

ఈశో హేతురహేతుశ్చ సవికారః ప్రతీయసే ॥

స్వమాయయా సర్వగుణ ప్రసిద్ధ్యై భగవన్ ప్రభో ।

సర్వాన్వితః ప్రభిన్నశ్చ సర్వతస్త్వం మహేశ్వర ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ దేవ దేవా! మహాదేవా! శరణాగతవత్సలుడు, అనంతశక్తి గలవాడు, సర్వమునకు ఆత్మ అయినవాడు, పరమేశ్వరుడు (43), జగత్తు యొక్క ఉత్పత్తి స్థితిలయములకు కారణమైన వాడు, సర్వజ్ఞుడు, కేవలజ్ఞానఘనుడు, లింగరూపములో వెలిసిన పరబ్రహ్మ, నిర్వికారుడు, అద్వయుడు అగు నీకు నమస్కరించుచున్నాను (44). ఓ జగత్ప్రభూ! కాలము, అదృష్టము, కర్మ, జీవుడు, అజ్ఞానము, ద్రవ్యము, పంచభూతాది క్షేత్రము, ప్రాణము, దేహము, ప్రకృతివికారముల సముదాయము, బీజాంకురప్రవాహము అను ఈ సర్వము నీ మాయయే సుమా! పరమేశ్వరుడవగు నీవు ఈ సర్వమునకు కారణమగుచున్నావు. నిన్ను నేను శరణు పొందుచున్నాను (45,46). లోకేశ్వరుడవగు నీవు లీలచే వివిధ రూపములలో ప్రకటమై దేవతలను మొదలగు వారిని నిశ్చయముగా రక్షించి, అజ్ఞానముచే అధర్మమార్గములో ఉన్నవారిని దండించుచున్నావు (47). వేదవాఙ్మయమునందు దాగియున్న పరంబ్రహ్మవు, పరంజ్యోతివి నీవే. ఆకాశమువలె శుద్ధము, అద్వయము, ఆత్మస్వరూపము అగు నిన్ను జ్ఞానులు దర్శించెదరు (48). సృష్ట్యాదియందు ఉన్న అద్వయపురుషుడవు నీవే. జాగ్రత్స్వప్నసుషుప్తులకు అతీతమైన తురీయసాక్షి చైతన్యము నీవే. నిర్గుణుడవగు నీవు మాయాసహితుడవై జగత్కారణమగుచున్నావు; వికారములు లేకున్ననూ, ఉన్నట్లు కన్పట్టుచున్నావు (49). హే భగవన్ ! ప్రభూ ! ప్రకృతిగుణములు జగద్రూపముగా పరిణమించుటకొరకై నీవు నీ మాయతో గూడి జగత్తులోని విభిన్న వస్తువుల రూపములో భాసిస్తూ సర్వమునకు అధిష్ఠానమై సర్వము కలవాడువలె కన్పట్టుచున్నావు (50).

యథైవ సూర్యోఽపిహితశ్ఛాయారూపాణి చ ప్రభో ।
స్వచ్ఛాయయా సంచకాస్తి హ్యయం పరమదృగ్భవాన్ ॥
గుణేనాపిహితోఽపి త్వం గుణేనైవ గుణాన్ విభో ।
స్వప్రదీపశ్చకాస్సి త్వం భూమన్ గిరిశ శంకర ॥
త్వన్మాయామోహితధియః పుత్రదారగృహాదిషు ।
ఉన్మజ్జంతి నిమజ్జంతి ప్రసక్తా వృజినార్ణవే ॥
దైవదత్తమిమం లబ్ధ్వా నృలోకమజితేంద్రియః ।
యో నాద్రియేత త్వత్పాదౌ స శోచ్యో హ్యాత్మవంచకః ॥
త్వదాజ్ఞయాహం భగవన్ బాణదోశ్ఛేత్తుమాగతః ।
త్వయైవ శప్తో బాణోఽయం గర్వితో గర్వహారిణా ॥
నివర్తస్వ రణాద్దేవ త్వచ్ఛాపో న వృథా భవేత్ ।
ఆజ్ఞాం దేహి ప్రభో మే త్వం బాణస్య భుజకృంతనే ॥

సూర్యుడు తన ప్రకాశముచే సర్వవస్తువులను, మరియు సూర్యుని కప్పివే◌ేయు మేఘాదులను కూడ ప్రకాశింపజేయును. అటులనే, పరమాత్మవగు నీవు సాక్షివై సర్వమును ప్రకాశింపజేయుచున్నావు (51). ఓ కైలాసవాసా! శంకరా! నీవు గుణములచే బంధింప బడకపోయిననూ, గుణములచేతనే గుణములను ప్రకాశింప జేయుచున్నావు. స్వయంప్రకాశస్వరూపుడవగు నీవు పరబ్రహ్మావు (52). నీ మాయచే మోహమును పొందిన బుద్ధి గలవారు సంతానము, భార్య, ఇల్లు, మొదలగు వాటియందు ఆసక్తి గలవారై పాపమనే సముద్రమునందు మునుగుతూ, తేలుతూ ఉందురు (53). మానవుడు ఈశ్వరునిచే అనుగ్రహించబడిన ఈ దేహమును పొందియు, ఇంద్రియములను జయించలేక నీ పాద పద్మములయందు ఆదరము లేనివాడై ఆత్మవంచనను చేసుకొని, శోచింప దగినవాడు అగుచున్నాడు (54). హే భగవన్! నీ ఆజ్ఞచే నేను బాణుని చేతులను నరుకుటకు వచ్చియుంటిని. గర్వమును పోగొట్టే నీవు మాత్రమే గర్వితుడైన ఈ బాణుని శపించియున్నావు (55). ఓ దేవా! ఈ యుద్ధమునుండి నీవు తప్పుకొనుము. నీ శాపము వృథా కారాదు. ఓ ప్రభూ! బాణుని భుజములను నరుకుటకు నాకు ఆజ్ఞను ఇమ్ము (56).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచశ్శంభుః శ్రీ కృష్ణస్య మునీశ్వర ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా కృష్ణస్తుత్యా మహేశ్వరః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను...

ఓ మహర్షీ! శ్రీ కృష్ణుని ఈ మాటను విని ఆయన చేసిన స్తుతిచే ప్రసన్నమైన మనస్సుగల మహేశ్వరుడగు శంభుడు ఇట్లు బదులిడెను (57).

మహేశ్వర ఉవాచ ।

సత్యముక్తం త్వయా తాత మయా శప్తో హి దైత్యరాట్ ।
మదాజ్ఞయా భవాన్ ప్రాప్తో బాణదోర్దండకృంతనే ॥
కిం కరోమి రమానాథ భక్తాధీనస్సదా హరే ।
పశ్యతో మే కథం వీర స్యాద్బాణభుజకృంతనమ్ ॥
అతస్త్వం జృంభణాస్త్రేణ మాం జృంభయ మదాజ్ఞయా ।
తతస్త్వం కురు కార్యం స్వం యథేష్టం చ సుఖీ భవ ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

ఓ కుమారా! నీవు సత్యమును పలికితివి. రాక్షసరాజును శపించినది నేనే. నీవు నా ఆజ్ఞ చేతనే బాణుని చేతులను నరుకుటకు వచ్చియుంటివి (58). ఓ లక్ష్మీపతీ! నేను ఏమి చేయగలను ? నేను సర్వదా భక్తులకు అధీనుడనై యుందును. ఓ వీరా! నేను చూచు చుండగా బాణుని చేతులను నరుకుట ఎట్లు సంభవమగును? (59) కావున నీవు నా ఆజ్ఞచే జృంభణాస్త్రమును ప్రయోగించి నేను స్పృహను కోల్పోవునట్లు చేసి, ఆ తరువాత నీ పనిని యథేచ్ఛగా పూర్తి చేసుకొని సుఖమును పొందుము (60).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తశ్శంకరేణాథ శార్ఙ్గపాణిస్సు విస్మితః ।
స్వరణస్థానమాగత్య ముమోద స మునీశ్వర ॥
జృంభణాస్త్రం ముమోచాథ సంధాయ ధనుషి ద్రుతమ్ ।
పినాకపాణయే వ్యాస నానాస్త్ర కుశలో హరిః ॥
మోహయిత్వా తు గిరిశం జృంభణాస్త్రేణ జృంభితమ్ ।
బాణస్య పృతనాం శౌరిర్జఘానాసిగదర్ ష్టిభిః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే బాణాసుర కృష్ణ యుద్ధవర్ణనం నామ చతుఃపంచాశత్తమోఽధ్యాయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! శంకరుడిట్లు పలుకగా శార్ఙ్గధారియగు ఆ విష్ణువు మిక్కిలి విస్మయమును పొంది యుద్ధరంగములో తన స్థానమునకు వచ్చి ఆనందించెను (61). ఓ వ్యాసా! - అప్పుడు వివిధములగు అస్త్రములలో సమర్థుడగు హరి ధనస్సునందు వెంటనే జృంభణాస్త్రమును సంధించి పినాకధారియగు శివునిపైకి వదిలిపెట్టెను (62). జృంభణాస్త్రముచే శివుడు ఆవులిస్తూ మోహితుడగునట్లు చేసి శ్రీకృష్ణుడు బాణుని సైన్యమును కత్తులు, గదలు, శక్తులు అను ఆయుధములతో సంహరించెను (63).

55 - బాణుని గర్వభంగము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ బ్రహ్మపుత్ర నమోస్తు తే ।
అద్భుతేయం కథా తాత శ్రావితా మే త్వయా మునే ॥
జృంభితే జృంభణాస్త్రేణ హరిణా సమరే హరే ।
హతే బాణబలే బాణః కిమకార్షీచ్చ తద్వద ॥

వ్యాసుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! బ్రహ్మపుత్రుడవగు నీవు సర్వజ్ఞుడవు. నీకు నమస్కారమగుగాక! ఓ తండ్రీ! మహర్షీ! నీవు నాకు ఈ అద్భుతమగు గాథను వినిపించితివి (1). యుద్ధములో విష్ణువు ప్రయోగించిన జృంభణాస్త్ర ప్రభావముచే శివుడు ఆవులిస్తూ మోహితుడై యుండగా బాణుని సైన్యము సంహరించబడగా బాణుడు ఏమి చేసెనో చెప్పుము (2).

సూత ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామితతేజసః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా బ్రహ్మపుత్రో మునీశ్వరః ॥

సూతుడిట్లు పలికెను -

సాటిలేని తేజస్సు గల ఆ వ్యాసుని ఈ మాటలను విని బ్రహ్మపుత్రుడగు ఆ మహర్షి ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై ఇట్లు బదులిడెను (3).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాప్రాజ్ఞ కథాం చ పరమాద్భుతామ్ ।
కృష్ణశంకరయోస్తాత లోకలీలానుసారిణోః ॥
శయితే లీలయా రుద్రే సపుత్రే సగణే సతి ।
బాణో వినిర్గతో యుద్ధం కర్తుం కృష్ణేన దైత్యరాట్ ॥
కుంభాండసంగృహీతాశ్వో నానాశస్త్రాస్త్ర ధృక్ తతః ॥
దృష్ట్వా నిజబలం నష్టం స దైత్యేంద్రోఽతిమర్షితః ।
చకార యుద్ధమతులం బలిపుత్రో మహాబలః ॥
శ్రీ కృష్ణోఽపి మహావీరో గిరిశాప్తమహాబలః ।
ఉచ్చైర్జగర్జ తత్రాజౌ బాణం మత్వా తృణోపమమ్ ॥
ధనుష్టంకారయామాస శార్ఙ్గాఖ్యం నిజమద్భుతమ్ ।
త్రాసయన్ బాణసైన్యం తదవశిష్టం మునీశ్వర ॥
తేన నాదేన మహతా ధనుష్టంకారజేన హి ।
ద్యావాభూమ్యో రంతరం వై వ్యాప్తమాసీదనంతరమ్ ॥

చిక్షేప వివిధాన్ బాణాన్ బాణాయ కుపితో హరిః ।
కర్ణాంతం తద్వికృష్యాథ తీక్ష్ణానాశీ విషోపమాన్ ॥
ఆయాతాంస్తాన్నిరీక్ష్యాథ స బాణో బలినందనః ।
అప్రాప్తానేవ చిచ్ఛేద స్వశరైస్స్వధనుశ్చ్యుతైః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా! నీవు గొప్ప బుద్ధిశాలివి. ఓ వత్సా! లోకలీలలను అనుసరించే శ్రీకృష్ణశంకరుల పరమాద్భుతగాథను వినుము (4). రుద్రుడు లీలచే పుత్రులతో మరియు గణములతో గూడి మోహితుడై యుండగా రాక్షసరాజగు బాణుడు శ్రీకృష్ణునితో యుద్ధమును చేయుటకై బయలు దేరెను (5). కుంభాండుడు రథమును తోలుచుండగా, అనేకవిధములగు శస్త్రాస్త్రములను ధరించియున్నవాడు, మహాబలశాలి, బలికుమారుడు అగు ఆ రాక్షసరాజు తన సైన్యము నష్టమగుటను గాంచి మిక్కిలి కోపించినవాడై సాటిలేని యుద్ధమును చేసెను (6,7). మహావీరుడు, శివుని అనుగ్రహముచే పొందబడిన గొప్ప బలము గలవాడు అగు శ్రీకృష్ణుడు కూడ బాణుని తృణప్రాయముగా భావించి అపుడా యుద్ధరంగమునందు బిగ్గరగా గర్జించెను (8). ఓ మహర్షీ! ఆయన అద్భుతమగు తన శార్ఙ్గమనే ధనస్సునుండి నారిత్రాటి ధ్వనిని చేసి మిగిలియున్న ఆ బాణుని సైన్యమునకు భీతిని కలిగించెను (9). ధనుష్టంకారమువలన పుట్టిన ఆ పెద్ద ధ్వనిచే స్వర్గలోకభూలోకములకు మధ్యగల ఆకాశమంతయు నిండెను (10). హరి కోపించి నారిత్రాటిని చెవివరకు లాగి సర్పములవలె భయమును గొల్పు వివిధములగు వాడి బాణములను ప్రయోగించెను (11). బలిపుత్రుడగు బాణుడు ఆ బాణములు దూసుకొని వచ్చుచుండగా చూసి, అవి తనను చేరుటకు ముందే వాటిని తన ధనస్సునుండి ప్రయోగించబడిన బాణములచే ముక్కలుగా చేసెను (12).

పునర్జగర్జ స విభుర్బాణో వైరిగణార్దనః ।
తత్రసుర్వృష్ణయస్సర్వే కృష్ణాత్మానో విచేతసః ॥
స్మృత్వా శివపదాంభోజం చిక్షేప నిజసాయకాన్ ।
స కృష్ణాయాతిశూరాయ మహాగర్వో బలేస్సుతః ॥
కృష్ణోఽపి తానసంప్రాప్తానచ్ఛినత్స్వశరైర్ద్రుతమ్ ।
స్మృత్వా శివపదాంభోజమసురారిర్మహాబలః ॥
రామాదయో వృష్ణయశ్చ స్వం స్వం యోద్ధారమాహవే ।
నిజఘ్నుర్బలినస్సర్వే కృత్వా క్రోధం సమాకులాః ॥
ఇత్థం చిరతరం తత్ర బలినోశ్చ ద్వయోరపి ।
బభూవ తుములం యుద్ధం శృణ్వతాం విస్మయావహమ్ ॥
తస్మిన్నవసరే తత్ర క్రోధం కృత్వాఽతిపక్షిరాట్ ।
బాణాసురబలం సర్వం పక్షాఘాతైరమర్దయత్ ॥

మర్దితం స్వబలం దృష్ట్వా మర్దయంతం చ తం బలీ ।
చుకోపాతి బలేః పుత్రశ్చైవరాడ్ దితిజేశ్వరః ॥
స్మృత్వా శివపదాంభోజం సహస్రభుజవాన్ ద్రుతమ్ ।
మహత్పరాక్రమం చక్రే వైరిణాం దుస్సహం సవై ॥
చిక్షేప యుగపద్బాణానమితాంస్తత్ర వీరహా ।
కృష్ణాదిసర్వయదుషు గరుడే చ పృథక్ పృథక్ ॥

శత్రుసమూహములను పీడించే సమర్థుడగు ఆ బాణుడు మరల గర్జించగా, యాదవులు శ్రీ కృష్ణుని స్మరిస్తూ నిరుత్సాహితులై భయపడిరి (13). బలియొక్క పుత్రుడు, గొప్ప గర్విష్ఠి అగు ఆ బాణుడు శివుని పాదపద్మములను స్మరించి గొప్ప శూరుడగు శ్రీకృష్ణునిపై తన బాణములను ప్రయోగించెను (14). రాక్షసశత్రువు, మహాబలశాలి అగు శ్రీకృష్ణుడు కూడ ఆ బాణములను తన మీదికి రాకుండగనే శీ ఘ్రముగా తన బాణములతో ఛేదించెను (15). బలవంతులగు బలరామాది యాదవులందరు ఆ యుద్ధములో కంగారు పడి కోపమును పొంది తమ తమ ప్రతిద్వంద్వులను కొట్టజొచ్చిరి (16). ఈ విధముగా బలశాలురగు ఆ రెండు సైన్యముల మధ్య వినుటకైననూ ఆశ్చర్యమును గొల్పే సంకుల సమరము చిరకాలము జరిగెను (17). ఆ సమయములో గరుడుడు మిక్కిలి కోపించి తన రెక్కల దెబ్బలతో బాణాసురుని సైన్యమునంతనూ హింసింపజొచ్చెను (18). బలి యొక్క కుమారుడు, శివభక్తులలో శ్రేష్ఠుడు, బలశాలి అగు ఆ రాక్షసరాజు తన సైన్యము సంహరింపబడుటను గాంచి మిక్కిలి కోపించెను (19). వేయి భుజములు గల ఆతడు శివుని పాదపద్మములను స్మరించి శత్రువులకు సహించ శక్యము కాని గొప్ప పరాక్రమమును శీఘ్రముగా ప్రదర్శించెను (20). శత్రువీరులను సంహరించే ఆ బాణుడు ఆ యుద్ధములో శ్రీకృష్ణుడు మొదలగు యాదవులందరిపై మరియు గరుడునిపై వేరు వేరుగా ఒక్కసారిగా బాణములను గుప్పించెను (21).

జఘానైకేన గరుడం కృష్ణమేకేన పత్రిణా ।
బలమేకేన చమునే పరానపి తథా బలీ ॥
తతః కృష్ణో మహావీర్యో విష్ణురూపస్సురారిహా ।
చుకోపాతి రణే తస్మిన్ జగర్జ చ మహేశ్వరః ॥
జఘాన బాణం తరసా శార్ఙ్గనిస్సృతసచ్ఛరైః ।
అతి తద్బలమత్యుగ్రం యుగపత్ స్మృతశంకరః ॥
చిచ్ఛేద తద్ధనుశ్శీఘ్రం ఛత్రాదికమనాకులః ।
హయాంశ్చ పాతయామాస హత్వా తాన్ స్వశరైర్హరిః ॥
బాణోఽపి చమహావీరో జగర్జాతి ప్రకుప్యహా ।
కృష్ణం జఘాన గదయా సోఽపతద్ధరణీతలే ॥

ఉత్థాయారం తతః కృష్ణో యుయుధే తన శత్రుణా ।
శివభక్తేన దేవర్షే లోకలీలానుసారతః ॥
ఏవం ద్వయోశ్చిరం కాలం బభూవ సుమహాన్ రణః ।
శివరూపో హరిః కృష్ణస్స చ శైవోత్తమో బలీ ॥
కృష్ణోఽ థ కృత్వా సమరం చిరం బాణేన వీర్యవాన్ ।
శివాజ్ఞయా ప్రాప్తబలశ్చుకోపాతి మునీశ్వర ॥
తతస్సుదర్శనేనాశు కృష్ణో బాణభుజాన్ బహూన్ ।
చిచ్ఛేద భగవాన్ శంభుశాసనాత్పరవీరహా ॥
అవశిష్టా భుజాస్తస్య చత్వారోఽతీవ సుందరాః ।
గతవ్యథో బభూవాశు శంకరస్య ప్రసాదతః ॥
గతస్మృతిర్యదా బాణశిరశ్ఛేత్తుం సముద్యతః ।
కృష్ణో వీరత్వమాపన్నస్తదా రుద్రస్సముత్థితః ॥

ఓ మునీ! బలవంతుడగు ఆ బాణుడు ఒక బాణముతో గరుడుని, ఒక బాణముతో శ్రీ◌ీకృష్ణుని, మరియొక బాణముతో బలరాముని, అదే విధముగా ఇతరులను కూడ కొట్టెను (22). అపుడు గొప్ప సమర్థుడు, మహాపరాక్రమశాలి, విష్ణువు యొక్క అవతారము మరియు రాక్షససంహర్త అగు శ్రీకృష్ణుడు ఆ యుద్ధములో గొప్ప కోపమును పొంది గర్జించెను (23). ఆయన వెంటనే శంకరుని స్మరించి శార్ఙ్గ ధనస్సునుండి ఒక్కసారిగా ప్రయోగించబడిన గొప్ప బాణములచే బాణుని మరియు వాని సైన్యమును దారుణముగా హింసించెను (24). శ్రీ కృష్ణుడు కంగారు లేనివాడై వాని ధనస్సును విరుగగొట్టి ఛత్రము మొదలగు వాటిని మరియు గుర్రములను తన బాణములతో కొట్టి వాటిని శీఘ్రముగా నేలగూల్చెను (25). మహావీరుడగు బాణుడు కూడా బాగా కోపించి పెద్దగా గర్జించి శ్రీకృష్ణుని గదతో కొట్టగా ఆయన క్రిందపడెను (26). ఓ దేవర్షి ! లోకలీలను అనుసరించే శ్రీకృష్ణుడు తరువాత వెంటనే లేచి, తనకు శత్రువు మరియు శివభక్తుడు అగు బాణునితో యుద్ధమును చేసెను (27). ఈ విధముగా వారిద్దరికి చిరకాలము చాల గొప్ప యుద్ధము జరిగెను. శివస్వరూపుడగు హరియే శ్రీకృష్ణుడు కాగా, బలశాలియగు ఆ బాణుడు శివభక్తులలో ఉత్తముడు (28). ఓ మహర్షీ! అపుడు పరాక్రమవంతుడగు శ్రీకృష్ణుడు చిరకాలము బాణునితో యుద్ధమును చేసి, శివుని ఆజ్ఞచే లభించిన బలము గలవాడై అతిశయించిన కోపమును చేసెను (29). ఆ తరువాత శత్రువీరులను సంహరించే శ్రీ కృష్ణ భగవానుడు శివుని ఆజ్ఞచే వెంటనే సుదర్శనచక్రముతో బాణుని అనేకభుజములను ఛేదించెను (30). అతనికి మిక్కిలి సుందరమైన నాల్గు భుజములు మాత్రమే మిగిలియుండెను. ఆతనికి శివుని అనుగ్రహముచే వెంటనే నొప్పి తగ్గిపోయెను (31). అపుడు శ్రీకృష్ణుడు స్మృతిని గోల్పోయి శౌర్యమును పొందినవాడై బాణుని శిరస్సును నరుకుటకు ఉద్యుక్తుడగుచుండగా రుద్రుడు తెలివిని తెచ్చుకొనెను (32).

రుద్ర ఉవాచ।

భగవన్ దేవకీపుత్ర యదాజ్ఞప్తం మయా పురా ।
తత్కృతం చ త్వయా విప్ర మదాజ్ఞాకారిణా సదా ॥
మా బాణస్య శిరశ్ఛింధి సంహరస్వ సుదర్శనమ్ ।
మదాజ్ఞయా చక్రమిదం స్యాన్మోఘం మజ్జనే సదా ॥
దత్తం మయా పురా తుభ్యమనివార్యం రణే తవ ।
చక్రం జయం చ గోవింద నివర్తస్వ రణాత్తతః ॥
దధీచే రావణే వీరే తారకాదిపురేష్వపి ।
వినా మదాజ్ఞాం లక్ష్మీశ రథాంగం నాముచః పురా ॥
త్వం తు యోగీశ్వరస్సాక్షాత్ పరమాత్మా జనార్ధన ।
విచార్యతాం స్వమనసా సర్వభూతహితే రతః ॥
వరమస్య మయా దత్తం న మృత్యు భయమస్తి వై ।
తన్మే వచస్సదా సత్యం పరితుష్టోఽ స్మ్యహం తవ ॥
పురాయం గర్వితో మత్తో యుద్ధం దేహీతి మేఽ బ్రవీత్ ।
భుజాన్ కండూయమానస్తు విస్మృతాత్మగతిర్హ్వరే ॥
తదాహమశపం తం వై భుజచ్ఛేత్తాఽఽ గమిష్యతి ।
అచిరేణాతికాలేన గతగర్వో భవిష్యసి ॥
మదాజ్ఞయా హరిః ప్రాప్తో భుజచ్ఛేత్తా తవాఽ థ వై ।
నివర్తస్వ రణాద్గచ్ఛ స్వగృహం సవధూవరః ॥
ఇత్యుక్తస్స తయోర్మైత్రీం కారయిత్వా మహేశ్వరః ।
తమనుజ్ఞాప్య సగణస్సపుత్రస్స్వాలయం యయౌ ॥

రుద్రుడిట్లు పలికెను -

ఓ భగవాన్ దేవకీనందనా ! విష్ణో ! నేను పూర్వము ఆజ్ఞాపించిన పనిని సర్వదా నా ఆజ్ఞను పాటించే నీవు పూర్తి చేసితివి (33). నీవు బాణుని శిరస్సును ఛేదించవద్దు. నా ఆజ్ఞచే ఈ చక్రమును ఉపసంహరించుము. ఈ చక్రము సర్వకాలములయందు నా భక్తులయందు మొక్కబోవును (34). ఓ గోవిందా! యుద్ధములో నివారింప శక్యము కాని ఈ చక్రమును మరియు విజయమును నేను పూర్వము నీకు ఇచ్చియుంటిని. కావున, యుద్ధమును విరమించుము (35). ఓ లక్ష్మీపతీ! నా ఆజ్ఞ లేకుండగా పూర్వము ఈ చక్రమును నీవు దధీచునియందు, వీరుడగు రావణునియందు, మరియు తారకుని మొదలగు వారి నగరముల యందు ప్రయోగించియుండలేదు (36). ఓ జనార్దనా ! యోగీశ్వరుడవగు నీవు సాక్షాత్తుగా పరమాత్మవు. సర్వప్రాణుల హితమును గోరే నీవు నీ మనస్సులో ఆలోచించుము (37). నీకు మృత్యుభయము లేదని నేను వీనికి వరమునిచ్చి యుంటిని. ఆ నామాట సర్వదా సత్యమగును. నేను నీ విషయములో సంతసించితిని (38). ఓ హరీ! పూర్వము ఈతడు తన మర్యాదను మరచి భుజముల తీటతో గర్వించినవాడై నాకు యుద్ధమునను గ్రహించుడని నన్ను కోరెను (39). తొందరలోనే నీ భుజములను నరుకువాడు రాగలడు. అపుడు నీ గర్వము తొలగగలదు అని అపుడు నేను వానిని శపించితిని (40). ఓయీ! ఈ హరి నా ఆజ్ఞ చేతనే వచ్చి నీ భుజములను నరికినాడు. నీవు ఈ యుద్ధమును విరమించి, వధూవరులతో గూడి నీ ఇంటికి పొమ్ము (41). ఇట్లు పలికి ఆ మహేశ్వరుడు వారికి స్నేహమును కలిపి బాణునకు నచ్చజెప్పి, తన గణములతో మరియు పుత్రులతో గూడి తన నివాసమునకు వెళ్లెను (42).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచశ్శంభోస్సంహృత్య చ సుదర్శనమ్ ।
అక్షతాంగస్తు విజయీ తత్ కృష్ణోఽతఃపురం యయౌ ॥
అనిరుద్ధం సమాశ్వాస్య సహితం భార్యయా పునః ।
జగ్రాహ రత్నసంఘాతం బాణదత్తమనేకశః ॥
తత్సఖీం చిత్రలేఖాం చ గృహీత్వా వరయోగినీమ్ ।
ప్రసన్నోఽ భూత్తతః కృష్ణః కృతకార్యశ్శివాజ్ఞయా ॥
హృదా ప్రణమ్య గిరిశమామంత్ర్య చ బలేస్సుతమ్ ।
పరివారసమేతస్తు జగామ స్వపురీం హరిః ॥
పథి జిత్వా చ వరుణం విరుద్ధం తమనేకధా ।
ద్వారకాం చ పురీం ప్రాప్తస్సముత్సవ సమన్వితః ॥
విసర్జయిత్వా గరుడం సఖీన్ వీక్ష్యోపహస్య చ ।
ద్వారకాయాం తతో దృష్ట్వా కామచారీ చచార హ ॥
ఇతి శ్రీశివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
బాణభుజకృంతనం నామ పంచపంచాశత్తమోఽ ధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

శ్రీకృష్ణుడు శంభుని ఈ మాటలను విని సుదర్శనమును ఉపసంహరించెను. ఆయన దేహమునకు దెబ్బలు ఏమియు తగులలేదు. ఆయన విజయమును పొంది ఆ అంతఃపురమునకు వెళ్లెను (43). ఆయన భార్యాసమేతుడైయున్న అనిరుద్ధుని ఓదార్చి బాణునిచే ఈయబడిన అనేకములగు శ్రేష్ఠవస్తువులను స్వీకరించెను (44). తరువాత శ్రీకృష్ణుడు కృతార్థుడై శివుని ఆజ్ఞను పొంది ఉషయొక్క చెలికత్తె, గొప్ప యోగిని అగు చిత్రలేఖను దోడ్కొని వెళ్లి ప్రసన్నుడాయెను (45). హరి మనస్సులో కైలాసవాసియగు శివునకు ప్రణమిల్లి బలియొక్క పుత్రుడగు బాణునివద్ద సెలవు తీసుకొని కుటుంబసమేతముగా తన నగరమునకు వెళ్లెను (46). ఆయన తనకు అనేకవిధములుగా విరోధియైన వరుణుని మార్గమధ్యములో జయించి, ద్వారకానగరమును చేరి గొప్ప ఉత్సవమును చేసుకొనెను (47). అపుడాయన గరుడుని పంపించివేసి, ద్వారకానగరములోని మిత్రులను గాంచి ఆనందించి, యథేచ్ఛగా విహరించెను (48).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండలో బాణుని బాహువులను ఖండించుట అనే ఏబది ఐదవ అధ్యాయము ముగిసినది (55).

56 - బాణాసురుడు గణత్వమును పొందుట

నారద ఉవాచ।

కృష్ణే గతే ద్వారకాయామనిరుద్ధేన భార్యయా ।
అకార్షీత్కిం తతో బాణస్తత్త్వం వద మహామునే ॥

నారుదుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! భార్యాసమేతుడగు అనిరుద్ధునితో గూడి శ్రీకృష్ణుడు ద్వారకకు ేరిన తరువాత బాణుడు ఏమి చేసెను? నీవా విషయమును చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ।

కృష్ణే గతే ద్వారకాయామనిరుద్ధేన భార్యయా ।
దుఃఖితోఽ భూత్తతో బాణస్స్వాజ్ఞానం సంస్మరన్ హృదా ॥
తతో నందీ శివగణో బాణం ప్రోవాచ దుఃఖితమ్ ।
దైత్యం శోణితదిగ్ధంగమనుతాపసమన్వితమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను-

భార్యాసమేతుడగు అనిరుద్ధునితో గూడి శ్రీకృష్ణుడు ద్వారకకు చేరెను. అపుడు బాణుడు మనస్సులో తన అజ్ఞానమును స్మరించి దుఃఖితుడాయెను (2). అపుడు శివుని గణాధ్యక్షుడగు నంది రక్తముతో తడిసిన దేహము గలవాడు, పశ్చాత్తాపదుఃఖముతో గూడినవాడు అగు బాణునితో నిట్లనెను (3).

నందీశ్వర ఉవాచ ।

బాణ శంకరసద్భక్త మానుతాపం కురుష్వ భోః ।
భక్తానుకంపీ శంభుర్వై భక్తవత్సలనామధృక్ ॥
తదిచ్ఛయా చ యజ్జాతం తజ్జాతమితి చేతసా ।
మన్యస్వ భక్తశార్దూల శివం స్మర పునః పునః ॥
మన ఆద్యే సమాధాయ కురు నిత్యం మహోత్సవమ్ ।
భక్తానుకంపనస్యాస్య శంకరస్య పునః పునః ॥
నందివాక్యాత్తతో బాణో ద్విషాం శీర్షకమాత్రకః ।
శివస్థానం జగామాశు ధృత్వా ధైర్యం మహామనాః ॥
గత్వా తత్ర ప్రభుం నత్వా రురోదాతీవ విహ్వలః ।
గతగర్వవ్రజో బాణః ప్రేమాకులితమానసః ॥
సంస్తువన్ వివిధైః స్తోత్రైస్సంనమన్నుతిత స్తథా ।
యథోచితం పాతఘాతం కుర్వన్ విక్షేపయన్ కరాన్ ॥

ననర్త తాండవం ముఖ్యం ప్రత్యాలీఢా దిశోభితమ్ ।
స్థానకైర్వివిధాకారైరాలీఢ ప్రముఖైరపి ॥

నందీశ్వరుడిట్లు పలికెను-

ఓ బాణా ! నీవు శంకరుని గొప్ప భక్తుడవు. ఓయీ ! దుఃఖించకుము. భక్తులయందు దయగల శంభునకు భక్తవత్సలుడను పేరు గలదు (4). ఓ భక్తశ్రేష్ఠా ! ఏది జరుగవలెనో, అది ఆయన ఇచ్ఛచేతనే జరిగినదని మనస్సులో నిశ్చయించుకొనుము. శివుని మరల మరల స్మరించుము (5). మనస్సును ఆ ఆదిపురుషునియందు నిలిపి, భక్తానుగ్రాహకుడగు ఆ శంకరుని మహోత్సవమును నిత్యము పలుమార్లు అనుష్ఠించుము (6). అపుడు గొప్ప స్వాభిమానముగల వాడు, శత్రువులకు రాహువువంటివాడు అగు బాణుడు నంది యొక్క సలహాను పాటించి ధైర్యమును దిక్క బట్టుకొని, వెంటనే శివుని స్థానమునకు వెళ్ళెను (7). గర్వము పూర్తిగా తొలిగినవాడు, ప్రేమతో నిండిన హృదయము గలవాడు అగు బాణుడు అచటకు వెళ్లి ప్రభునకు నమస్కరించి దుఃఖమును పట్టజాలక భోరున ఏడ్చెను (8). అతడు వివిధస్తోత్రములతో ఆయనను స్తుతించి ప్రణమిల్లి ఆయనను పూజించెను. మరియు అతడు పాదముల కదలికలను, చేతుల త్రిప్పుటలను యథాశాస్త్రముగా చేయుచూ, ఆలీఢ- ప్రత్యాలీఢ-స్థానకాది ప్రముఖ నాట్య విన్యాసములతో తాండవమును చేసెను (9, 10).

ముఖవాదసహస్రాణి భ్రూక్షేపసహితాన్యపి ।
శిరఃకంప సహస్రాణి ప్రాప్తానీకస్సహస్రశః ॥
వారీశ్చ వివిధాకారా దర్శయిత్వా శనైశ్శనైః ।
తథా శోణితధారాభిస్సించయిత్వా మహీతలమ్ ॥
రుద్రం ప్రసాదయామాస శూలినం చంద్రశేఖరమ్ ।
బాణాసురో మహాభక్తో విస్మృతాత్మగతిర్నతః ॥
తతో నృత్యం మహత్కృత్వా భగవాన్ భక్తవత్సలః ।
ఉవాచ బాణం సంహృష్టో నృత్య గీత ప్రియో హరః ॥

అతడు కనుబొమలను త్రిప్పుతూ నోటినుండి పలురకముల శబ్దములను సృజించి వేయి విధముల తలను ఆడించుచూ వేయిమంది పరిచారకులను సిద్ధముగా నుంచెను (11). ఆతడు వివిధ భంగిమలను మెల్లమెల్లగా ప్రదర్శించుచుండగా రక్తధారలతో నేల తడిసి పోయెను (12). మహాభక్తుడగు బాణాసురుడు తన దేహమును విస్మరించి నమస్కరించి, శూలధారి, చంద్రశేఖరుడు అగు రుద్రుని సంతోషపెట్టెను (13). అపుడు భక్తవత్సలుడు, నృత్యగానములయందు ప్రీతి గలవాడు అగు హరభగవానుడు గొప్ప నృత్యమును చేసి సంతోషముతో బాణునితో నిట్లనెను (14).

రుద్ర ఉవాచ ।

బాణ తాత బలేః పుత్ర సంతుష్టో నర్తనేన తే ।
వరం గృహాణ దైత్యేంద్ర యత్తే మనసి వర్తతే ॥

రుద్రుడిట్లు పలికెను –

ఓ వత్సా ! బాణా! బలికుమారా ! నీ నర్తనమునకు సంతోషించితిని. ఓ రాక్షసరాజా ! నీ మనస్సులో గల కోరికను వరముగా స్వీకరించుము (15).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచశ్శంభోర్దైత్యేంద్రేణ తదా మునే ।
బాణేన సంవృణీతోఽభూద్వరస్తు వ్రణరోపణే ॥
బాహుయుద్ధస్య చోద్ధత్తిర్గాణపత్య మథాక్షయమ్ ।
ఉషాపుత్రస్య రాజ్యం తు తస్మిన్ శోణితకాహ్వయే ॥
నిర్వైరతా చ విబుధైర్విష్ణునా చ విశేషతః ।
న పునర్దైత్యతా దుష్టా రజసా తమసా యుతా ॥
శంభుభక్తిర్విశేషేణ నిర్వికారా సదా మునే ।
శివభక్తేషు చ స్నేహో దయా సర్వేషు జంతుషు ॥
ఇతి కృత్వా వరాన్ శంభోర్బలిపుత్రో మహాసురః ।
ప్రేమ్ణా శ్రునయనో రుద్రం తుష్టావ సుకృతాంజలిః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను--

ఓ మునీ! శంభుని ఈ వచనములను విని అపుడా రాక్షసరాజు ఈ వరములను కోరెను: గాయములు మానుట, బాహుయుద్ధములో ప్రాగల్భ్యము, వినాశములేని గణాధ్యక్ష స్థానము, ఉషయొక్క పుత్రుడు శోణితపురమునకు రాజు అగుట, దేవతలతో మరియు ప్రత్యేకించి విష్ణువుతో వైరము లేకుండుట, రజస్తమోగుణములతో కూడియున్న ఈ రాక్షసజన్మ మరల కలుగకుండుట, సర్వకాలములయందు వికారములు లేని విశేష శివభక్తి, శివభక్తులతో మైత్రి, సర్వప్రాణులయందు దయ (16-19). బలిపుత్రుడగు ఆ మహారాక్షసుడు శంభునినుండి ఈ వరములను కోరి, చక్కగా చేతులను జోడించి, కన్నులనుండి ప్రేమాశ్రువులు జారుచుండగా రుద్రుని స్తుతించెను (20).

బాణ ఉవాచ ।

దేవ దేవ మహాదేవ శరణాగతవత్సల ।
త్వాం నమామి మహేశాన దీనబంధో దయానిధే ॥
కృతా మయి కృపాతీవ కృపాసాగర శంకర ।
గర్వోఽపహారితస్సర్వః ప్రసన్నేన మమ ప్రభో ॥
త్వం బ్రహ్మ పరమాత్మా హి సర్వవ్యాప్య ఖిలేశ్వరః ।
బ్రహ్మాండతనురు గ్రేశో విరాట్ సర్వాన్వితః పరః ॥

నాభిర్నభోఽగ్నిర్వదనమంబు రేతో దిశశ్శ్రుతిః ।
ద్యౌశ్శీర్షమంఘ్రిరుర్వీ తే మనశ్చంద్రస్తవ ప్రభో ॥
దృగర్కో జఠరం వార్ధిర్భుజేంద్రో ధిషణా విధిః ।
ప్రజాపతిర్విసర్గశ్చ ధర్మో హి హృదయం తవ ॥
రోమాణ్యోషధయో నాథ కేశా జలముచస్తవ ।
గుణాస్త్రయస్త్రినేత్రాణి సర్వాత్మా పురుషో భవాన్ ॥
బ్రాహ్మణం తే ముఖం ప్రాహుర్బాహుం క్షత్రియమేవ చ ।
ఊరుజం వైశ్యమాహుస్తే పాదజం శూద్రమేవ చ ॥
త్వమేవ సర్వదోపాస్యస్సర్వైర్జీవైర్మహేశ్వర ।
త్వాం భజన్ పరమాం ముక్తిం లభతే పురుషో ధ్రువమ్ ॥
యస్త్వాం విసృజతే మర్త్య ఆత్మానం ప్రియమీశ్వరమ్ ।
విపర్యయేంద్రియార్థార్థం విషమత్త్యమృతం త్యజన్ ॥
విష్ణుర్బ్రహ్మాథ విబుధా మునయశ్చామలాశయాః ।
సర్వాత్మనా ప్రపన్నాస్త్వాం శంకరం ప్రియమీశ్వరమ్ ॥

బాణుడిట్లు పలికెను -

ఓ దేవదేవా ! మహాదేవా ! శరణాగతవత్సలా ! మహేశ్వరా ! దీనబంధూ ! దయానిధీ ! నీకు నమస్కారము (21). ఓ దయాసముద్రా! శంకరా ! నీవు నాయందు గొప్ప దయను చూపితివి. ఓ ప్రభూ ! నీవు ప్రసన్నుడవై నా గర్వమునంతను అడంచితివి (22). పరమాత్మ, సర్వవ్యాపి, సర్వేశ్వరుడు, బ్రహ్మాండములే దేహముగా గలవాడు, భయంకరుడగు ఈశ్వరుడు, విరాట్ స్వరూపమునందు అనుగతమైన సర్వజగత్తు గలవాడు అగు పరంబ్రహ్మ నీవే (23). ఆకాశము నీ నాభి. అగ్ని నోరు. జలము రేతస్సు. దిక్కులు చెవులు. స్వర్గ లోకము శిరస్సు, భూమి నీ పాదము. ఓ ప్రభూ ! చంద్రుడు నీ మనస్సు (24). సూర్యుడు నీ కన్ను. సముద్రము నీ జఠరము. ఇంద్రుడు నీ భుజము. నీ బుద్ధి బ్రహ్మ. ప్రజాపతి విసర్గము. విసర్గమనగా వివిధరూపములలో నున్న సృష్టి, ధర్మము నీ హృదయము (25). వృక్షలతాదులు నీ రోమములు. ఓ నాథా ! మేఘములు నీ కేశములు. మూడు గుణములు నీకన్నులు. సర్వస్వరూపడవగు పురుషుడవు నీవే (26). బ్రాహ్మణుడు నీ ముఖమనియు, బాహువులు క్షత్రియుడనియు, వైశ్యుడు ఊరువులనియు, శూద్రుడు పాదమనియు చెప్పెదరు (27). ఓ మహేశ్వరా! సర్వజీవులచే సర్వకాలములయందు ఉపాసించదగినవాడవు నీవే. మానవుడు నిన్ను సేవించి నిశ్చయముగా శ్రేష్ఠమగు ముక్తిని పొందును (28). ఆత్మరూపుడు, ప్రియుడు, ఈశ్వరుడు అగు నిన్ను ఏమానవుడైతే విరుద్ధములగు ఇంద్రియభోగములకొరకై విడనాడునో, వాడు అమృతమును పరిత్యజించి విషమును భక్షించుచున్నాడు (29). ప్రియుడు,

ఈశ్వరుడు, శంకరుడు అగు నిన్ను విష్ణువు, బ్రహ్మ, దేవతలు మరియు పరిశుద్ధమగు అంతఃకరణము గల మునులు సర్వ విధములుగా శరణు పొందియున్నారు (30).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా బలిపుత్రస్తు విరరామ శరాసురః ।
ప్రేమ ప్రఫుల్లితాంగశ్చ ప్రణమ్య సమహేశ్వరమ్ ॥
ఇతి శ్రుత్వా స్వభక్తస్య బాణస్య భగవాన్ భవః ।
సర్వం లభిష్య సీత్యుక్త్వా తత్రైవాంతరధీయత ॥
తతశ్శంభోః ప్రసాదేన మహాకాలత్వమాగతః ।
రుద్రస్యానుచరో బాణో మహా ప్రముదితోఽ భవత్ ॥
ఇతి కిల శరనామ్నశ్శంకరస్యాపి వృత్తం సకలగురు జనానాం సద్గురోశ్శూలపాణేః ।
కథితమిహ వరిష్ఠం శ్రోత్రరమ్యైర్వచోభిస్సకలభువనమధ్యే క్రీడమానస్య నిత్యమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
బాణాసురగణత్వ ప్రాప్తి వర్ణనం నామ షట్ పంచాశత్తమోఽ ధ్యాయః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

బలిపుత్రుడగు బాణాసురుడు ఇట్లు పలికి ప్రేమతో పులకరించిన అవయవములు గలవాడై మహేశ్వరునకు ప్రణమిల్లి విరమించెను (31). శివభగవానుడు తన భక్తుని ఈ వచనములను విని నీకు సర్వము లభించగలదని పలికి వెంటనే అంతర్ధానమును చెందెను (32). తరువాత శంభుని అనుగ్రహముచే రుద్రుని అనుచరుడగు బాణుడు మహా కాలపర్యంతము చిరంజీవియై గొప్ప ఆనందమును పొందెను (33). గురుజనులందరికీ సద్గురువు, శూలపాణి, సమస్త బ్రహ్మాండముల మధ్యలో నిత్యము క్రీడించువాడు అగు శంకరుని శ్రేష్ఠమగు గాథ మరియు బాణుని వృత్తాంతము చెవులకు ఇంపైన వచనములలో ఈ విధముగా ఇచట చెప్పబడినది (34).

శ్రీశివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో బాణాసురుడు గణత్వమును పొందుట అనే ఏబది యారవ అధ్యాయము ముగిసినది (56).

57 – గజాసుర సంహారము

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాప్రేమ్ణా చరితం శశిమౌలినః ।
యథాఽవధీత్త్రిశూలేన దానవేంద్రం గజాసురమ్ ॥
దానవే నిహతే దేవ్యా సమరే మహిషాసురే ।
దేవానాం చ హితార్థాయ పురా దేవాస్సుఖం యయుః ॥
తస్య పుత్రో మహావీరో మునీశ్వర గజాసురః ।
పితుర్వధం హి సంస్మృత్య కృతం దేవ్యా సురార్థనాత్ ॥
స తద్వైరమనుస్మృత్య తపోఽర్థం గతవాన్ వనే ।
సముద్దిశ్య విధిం ప్రీత్యా తతాప పరమం తపః ॥
అవధ్యోఽహం భవిష్యామి స్త్రీ పుంసైః కామనిర్జితైః ।
సంవిచార్యేతి మనసాఽభూత్తపోరతమానసః ॥
స తేపే హిమవద్ద్రోణ్యాం తపః పరమదారుణమ్ ।
ఊర్ధ్వబాహుర్నభోదృష్టిః పాదాంగుష్ఠాశ్రితావనిః ॥
జటాభారస్స వై రేజే ప్రలయార్క ఇవాంశుభిః ।
మహిషాసురపుత్రోఽసౌ గజాసుర ఉదారధీః ॥
తస్య మూర్ధ్నస్సముద్భూతస్సధూమోఽగ్నిస్తపోమయః ।
తిర్యగూర్ధ్వమధో లోకాంస్తాపయన్ విష్వగీరితః ॥
చుక్షుభురద్యుదన్వంతశ్చాగ్నేర్మూర్ధ సముద్భవాత్ ।
నిపేతుస్సగ్రహాస్తారా జజ్వలుశ్చ దిశో దశ ॥
తేన తప్తాస్సురాస్సర్వే దివం త్యక్త్వా సవాసవాః ।
బ్రహ్మలోకం యయుర్విజ్ఞాపయామాసుశ్చచాల భూః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

ఓ వ్యాసా! చంద్రశేఖరుని చరితమును మహాప్రేమతో వినుము. ఆయన త్రిశూలముతో గజాసురుని వధించిన వృత్తాంతమును చెప్పెదను (1). పూర్వము దేవతల హితమును గోరి దేవి యుద్ధములో మహిషాసురుని సంహరించగా దేవతలు సుఖమును పొందిరి (2). ఓ మహర్షీ ! వాని పుత్రుడు, మహావీరుడు అగు గజాసురుడు దేవతలు కోరగా దేవి తన తండ్రిని సంహరించిన విషయమును స్మరించి (3), ఆమెపై వైరమును బూని తపస్సును చేయుటకై వనమునకు వెళ్లి, బ్రహ్మను ఉద్దేశించి గొప్ప తపస్సును శ్రద్ధతో చేసెను (4). 'కామమునకు దాసులైన స్త్రీ పురుషులచే నేను వధింపబడరాదు' అని మనస్సులో తలపోసి మనస్సును తపస్సుపై లగ్నము చేసెను (5). అతడు చేతులను పైకెత్తి నేలమీద కాలిబొటన వేలిపై నిలబడి పైకి చూస్తూ హిమవత్పర్వతమునందలి లోయలో మిక్కిలి

దారుణమగు తపస్సును చేసెను (6). మహిషాసురుని పుత్రుడు, విశాలమగు హృదయము గలవాడునగు ఆ గజాసురుడు జటలతో, ప్రలయకాలసూర్యుడు కిరణములతో వలె ప్రకాశించెను (7). వాని శిరస్సునుండి పుట్టిన తపోమయమగు అగ్ని పొగతో గూడి భూమియందు మాత్రమే గాక, ఊర్ధ్వలోకములయందు మరియు అధోలోకములయందు కూడ వ్యాపించెను (8). వాని శిరస్సునుండి పుట్టిన ఆ అగ్నిచే నదులు, సముద్రములు క్షోభను పొందినవి. గ్రహములు, నక్షత్రములు నేల రాలినవి. పది దిక్కులు మండినవి (9). దానిచే పీడించబడిన ఇంద్రాది దేవతలు అందరు స్వర్గమును వీడి బ్రహ్మలోకమునకు వెళ్లి మొర పెట్టుకొనిరి. భూమి కంపించెను (10).

దేవా ఊచుః ।

విధే గజాసురతపస్తప్తా వయమథాకులాః ।
న శక్నుమో దివి స్థాతుమతస్తే శరణం గతాః ॥
విధే హ్యుపశమం తస్య చాన్యాన్ జీవయితుం కృపా ।
లోకా సంక్ష్యత్యన్యథా హి సత్యం సత్యం బ్రువామహే ॥
ఇతి విజ్ఞాపితో దేవైర్వాసవాద్యైస్స ఆత్మభూః ।
భృగుదక్షాదిభిర్బ్రహ్మా యయౌ ధైత్యవరా శ్రమమ్ ॥
తపంతం తపసా లోకాన్యథాఽ భ్రవిహితం దివి ।
విలక్ష్య విస్మితః ప్రాహ విహసన్ సృష్టికారకః ॥

దేవతలు ఇట్లు పలికిరి -

ఓ బ్రహ్మా! గజాసురుని తపస్సుచే తపింపచేయబడుచున్న మేము మిక్కిలి దుఃఃఖమును పొంది యున్నాము. మేము స్వర్గములో నిలబడలేక నిన్ను శరణు జొచ్చినాము (11). ఓ బ్రహ్మా! దయచేసి వాని తపస్సును ఆపించి ఇతరులు జీవించునట్లు చేయుము. లేనిచో, లోకములు నశించుట ముమ్మాటికీ సత్యము (12). ఇంద్రాది దేవతలు, భృగువు, దక్షుడు మొదలగు వారు ఇట్లు విన్నవించగా స్వయంభువుడగు బ్రహ్మ ఆ రాక్షసశ్రేష్ఠుని ఆశ్రమమునకు వెళ్లెను (13). ఆతడు తన తపస్సుచే లోకములను తపింప జేయుచుండెను. ఆకాశము మేఘములచే ఆచ్ఛాదించబడినదా యన్నట్లు ఉండెను. సృష్టికర్త వానిని చూసి విస్మితుడై నవ్వుతూ ఇట్లు పలికెను (14).

బ్రహ్మోవాచ।

ఉత్తిష్ఠోత్తిష్ఠ దైత్యేంద్ర తపస్సిద్ధోఽసి మాహిషే ।

ప్రాప్తోహం వరదస్తాత వరం వృణు యథేప్సితమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ రాక్షసరాజా ! లెమ్ము, లెమ్ము. ఓ మహిషపుత్రా! నీ తపస్సు సిద్ధించినది. ఓ కుమారా! నీకు వరమును ఇచ్చుటకొరకై వచ్చియుంటిని. నీకు నచ్చిన వరమును కోరుకొనుము (15).

సనత్కుమార ఉవాచ ।

ఉత్థాయోత్థాయ దైత్యేంద్ర ఈక్షమాణో దృశా విభుమ్ ।

గిరా గద్గదయా ప్రీతోఽగృణ ద్దేవం స మాహిషిః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

మహిషపుత్రుడగు ఆ రాక్షసవీరుడు మెల్లగా లేచి, కన్నులతో ఆ దేవ ప్రభుని గాంచి సంతోషించి గద్గదమగు వాక్కుతో ఇట్లు స్తుతించెను (16).

గజాసుర ఉవాచ ।

నమస్తే దేవదేవేశ యది దాస్యసి మే వరమ్ ।

అవధ్యోఽహం భవేయం వై స్త్రీ పుంసైః కామనిర్జితైః ॥

మహాబలో మహావీర్యోఽజేయో దేవాదిభిస్సదా ।

సర్వేషాం లోకపాలానాం నిఖిలర్ధసు భుగ్విభో ॥

గజాసురుడిట్లు పలికెను –

ఓ దేవదేవా ! ఈశ్వరా ! నీకు నమస్కారము. నీవు నాకు వరమును ఈయగోరుచున్న, నేను కామనిర్జితులైన స్త్రీ పురుషులచే వధించబడకూడదు (17). ఓ విభూ ! నేను మహాబలవంతుడను, గొప్ప పరాక్రమము గలవాడను, ఏ కాలమునందైననూ దేవాదులచే జయింపశక్యము కానివాడను, లోకపాలకులందరి యొక్క సమస్తసమృద్ధులను అనుభవించు వాడను కావలెను (18).

సనత్కుమార ఉవాచ ।

ఏవం వృతశ్చతద్ధృతర్ధానవేన స తేన వై ।
ప్రాదాత్తత్తపసా ప్రీతో వరం తస్య సుదుర్లభమ్ ॥
ఏవం లబ్ధవరో దైత్యో మాహిషిశ్చ గజాసురః ।
సుప్రసన్నమనాస్సోఽథ స్వధామ ప్రత్యపద్యత ॥
స విజిత్య దిశస్సర్వా లో కాంశ్చ త్రీన్మహాసురః ।
దేవాసురమనుష్యేంద్రాన్ గంధర్వగరుడోరగాన్ ॥
ఇత్యాదీన్నిఖిలాన్ జిత్వా వశమానీయ విశ్వజిత్ ।
జహార లోకపాలానాం స్థానాని సహ తేజసా ॥
దేవోద్యాన శ్రియా జుష్టమధ్యాస్తే స్మ త్రివిష్టపమ్ ।
మహేంద్రభవనం సాక్షాన్నిర్మితం విశ్వకర్మణా ॥
తస్మిన్మహేంద్రస్య గృహే మహాబలో మహామనా నిర్జితలోక ఏకరాట్ ।
రేమేఽభివంద్యాంఘ్రియుగస్సురాదిభిః ప్రతాపితై రూర్జితచండశాసనః ॥
స ఇత్థం నిర్జితకకుబేకరాడ్ విషయాన్ ప్రియాన్ ।
యథోపజోషం భుంజానో నాతృప్యదజితేంద్రియః ॥
ఏవమైశ్వర్యమత్తస్య దృప్తస్యోచ్ఛాస్త్ర వర్తినః ।
కాలే వ్యతీతే మహతి పాపబుద్ధిరభూత్తతః ॥
మహిషాసురపుత్రోఽసౌ సంచిక్లేశ ద్విజాన్ వరాన్ ।
తాపసాన్నితరాం పృథ్వ్యాం దానవస్సురమర్దనః ॥
సురాన్నరాంశ్చ ప్రమథాన్ సర్వాన్ చిక్లేశ దుర్మతిః ।
ధర్మాన్వితాన్విశేషేణ పూర్వవైరమనుస్మరన్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను-

ఆ రాక్షసుడు బ్రహ్మను ఈ విధమైన వరములను కోరగా వాని తపస్సుచే సంతోషించిన బ్రహ్మ మిక్కిలి దుర్లభమగు ఆ వరమును వానికి ఇచ్చెను (19). మహిషాసురపుత్రుడగు ఆ గజాసురుడు ఈ తీరున వరమును పొంది మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై తరువాత తన నివాసమును చేరుకొనెను (20). ఆ మహా రాక్షసుడు సర్వదిక్కులను, మూడు లోకములను, దేవతలను, రాక్షసులను, మనుష్యులను, ఇంద్రుని, గంధర్వులను, గరుడుని, నాగులను, ఇతరులను సర్వులను జయించి తన వశములోనికి తెచ్చుకొనెను. అతడు ఈ విధమున విశ్వమును జయించి లోకపాలకుల స్థానములను వారి తేజస్సులతో సహా అపహరించెను (21, 22). నందనోద్యానశోభతో గూడియున్న స్వర్గములో సాక్షాత్తుగా విశ్వకర్మచే నిర్మించబడిన మహేంద్రభవనములో అతడు నివసించెను (23). మహా బలశాలి, గొప్ప స్వాభిమానము గలవాడు, లోకములను జయించిన ఏకచ్ఛత్రాధిపతి, అతని ప్రతాపమును చవిచూచిన దేవతలు మొదలగు వారిచే

నమస్కరింపబడే పాదములు గలవాడు, చండశాసనుడు అగు ఆ గజాసురుడు ఆ మహేంద్రభవనములో రమించెను (24). ఈ విధమ ఏకచ్ఛత్రాధిపతియగు గజాసురుడు అభీష్టములగు ఇంద్రియసుఖములను హద్దు లేకుండగా అనుభవించియు, ఇంద్రియజయము లేని వాడగుటచే తృప్తిని పొందలేకపోయెను (25). ఈ విధముగా ఐశ్వర్యమదమత్తుడు, శాస్త్రమును ఉల్లంఘించి ప్రవర్తించువాడు అగు ఆ రాక్షసునకు చాల కాలము గడిచిన తరువాత పాపబుద్ధి కలిగెను (26). మహిషాసురపుత్రుడు, దేవపీడకుడు అగు ఆ రాక్షసుడు భూలోకములో బ్రాహ్మణ శ్రేష్ఠులను, ఋషులను అధికమగు కష్టములకు గురిచేసెను (27). ఆ దుర్బుద్ధియగు గజాసురుడు పూర్వమునందలి వైరమును స్మరించి దేవతలను, మానవులను, మరియు సర్వప్రమథులను, విశేషించి ధర్మానుయాయులను ఇడుముల పాలు చేసెను (28).

ఏకస్మిన్ సమయే తాత దానవోఽసౌ మహాబలః ।

ఆగచ్ఛ ద్రాజధానం వై శంకరస్య గజాసురః ॥

సమాగతేఽ సురేంద్రే హి మహాన్ కలకలో మునే ।

తాత త్రాతేతి తత్రాసీదానందవనవాసినామ్ ॥

మహిషాసురపుత్రోఽసౌ యదా పుర్యాం సమాగతః ।

ప్రమథన్ ప్రమథాన్ సర్వాన్నిజవీర్యమదోద్ధతః ॥

తస్మిన్నవసరే దేవాశ్శక్రాద్యాస్తత్పరాజితాః ।

శివస్య శరణం జగ్ముర్నత్వా తుష్టువురాదరాత్ ॥

న్యవేదయన్ దానవస్య తస్య కాశ్యాం సమాగమమ్ ।

క్లేశాధిక్యం తత్రత్యానాం తన్నాథానాం విశేషతః ॥

ఓ కుమారా! ఒకప్పుడు మహాబలశాలియగు ఈ గజాసురుడు శంకరుని రాజధానికి వచ్చెను (29). ఓ మునీ ! ఆ రాక్షసవీరుడు రాగానే అచట ఆనందవనములో నివసించు జనులు రక్షించుడు, రక్షించుడు అని పెద్ద కలకలమును చేసిరి (30). మహిషాసురుని పుత్రుడగు ఈ రాక్షసుడు తనకు గల పరాక్రమముచే మిక్కిలి గర్వించినవాడై ఈ నగరమునకు వచ్చిన సమయంలో ప్రమథులనందరినీ హింసించును (31). అదే సమయములో వానిచే పరాజితులైన ఇంద్రుడు మొదలగు దేవతలు శివుని శరణుపొంది ఆయనకు నమస్కరించి శ్రద్ధతో స్తుతించిరి (32). ఆ రాక్షసుడు కాశీ నగరమునకు వచ్చుట, అచటనున్నవారికి ప్రత్యేకించి శివుని నమ్ముకున్నవారికి అధికమగు క్లేశము కలుగుచుండుట అను విషయమును ఆయనకు విన్నవించిరి (33).

దేవా ఊచుః ।

దేవ దేవ మహాదేవ తవ పుర్యాం గతోఽసురః ।
కష్టం దత్తే త్వజ్జనానాం తం జహి త్వం కృపానిధే ॥
యత్ర యత్ర ధరాయాంచ చరణం ప్రమిణోతి హి ।
అచలాం సచలాం తత్ర కరోతి నిజభారతః ॥
ఊరువేగేన తరవః పతంతి శిఖరైస్సహ ।
యస్య దోర్దండఘాతేన చూర్ణాస్స్యుశ్చ శిలోచ్చయాః ॥
యస్య మౌలిజసంఘర్షాద్ఘనా వ్యోమ త్యజంత్యపి ।
నీలిమానం న చాద్యాపి జహ్యుస్తత్కేశసంగజమ్ ॥
యస్య నిశ్వాససంభారైరుత్తరంగా మహాబ్ధయః ।
సద్యోఽ ప్యమందకల్లోలా భవంతి తిమిభిస్సహ ॥
యోజనానాం సహస్రాణి నవ యస్య సముచ్ఛ్రయః ।
తావానేవ హి విస్తారస్తనోర్మా యావినోఽ స్య హి ॥
యన్నేత్రయోః పింగలిమా తథా తరలిమా పునః ।
విద్యుతః నోప్యతేఽ ద్యాపి సోఽ యం స్మాయాతి సత్వరమ్ ॥
యాం యాం దిశం సమభ్యేతి సోయం దుస్సహ దానవః ।
అవధ్యోఽహం భవామీతి స్త్రీ పుంసైః కామనిర్జితైః ॥
ఇత్యేవం చేష్టితం తస్య దానవస్య నివేదితమ్ ।
రక్షస్వ భక్తాన్ దేవేశ కాశీ రక్షణతత్పర ॥

దేవతలు ఇట్లు పలికిరి-

ఓ దేవదేవా! మహాదేవా! దయానిధీ! నీ నగరమునకు వచ్చి ఈ రాక్షసుడు నీ భక్తులకు కష్టమును కలిగించుచున్నాడు. వీనిని నీవు సంహరించుము (34). మహాభారముగల వీడు భూమిపై ఎక్కడ కాలిడిననూ, అచట భూమి కంపించును (35). వీడి పాదముల వేగమునకు వృక్షములు కొమ్మలతో సహా నేలగూలును. వీడు .తన భుజస్కంధములతో కొట్టి పర్వతములను చూర్ణము చేయును (36). వీని శిరస్సు యొక్క రాపిడికి మేఘములు కూడ ఆకాశమును వీడి పోవుచున్నవి. అవి వీని కేశముల సంగమువలన కలిగిన నీలివర్ణమును ఇంకనూ వీడకున్నవి (37). వీని విశ్వాసవాయువులచే నదులలో మరియు సముద్రములలో పెద్ద తరంగములు లేచి తిమింగలములతో సహా సర్వప్రాణులు గొప్ప కల్లోలమును పొందుచున్నవి (38). ఈ మాయావియొక్క శరీరము తొమ్మిది వేల యోజనముల ఎత్తు, మరియు అంతే నిడివి కలిగియున్నది (39). వీని నేత్రముల పింగలవర్ణము మరియు చంచలత విద్యుత్తునకు ఇంకనూ అబ్బలేదు. అట్టి రాక్షసుడు వేగముగా వచ్చుచున్నాడు (40). నేను కామపరాజితులైన స్త్రీ పురుషులచే వధింపబడననే ధైర్యముగల ఈ దానవుడ ఏయే స్థలములకు వెళ్లిననూ, వీనిని సహించుట

అసంభవము (41). ఆ దానవుని చేష్టలను ఈ తీరున విన్నవించితిమి. ఓ దేవేశా ! కాశీ నగరమును రక్షించుటలో తత్పరుడవగు నీవు భక్తులను రక్షించుము (42).

సనత్కుమార ఉవాచ ।

ఇతి సంప్రార్థితో దేవైర్భక్తరక్షణతత్పరః ।
తత్రాజగామ సోఽరం తద్వధకామనయా హరః ॥
ఆగతం తం సమాలోక్య శంకరం భక్తవత్సలమ్ ।
త్రిశూలహస్తం గర్జంతం జగర్జ స గజాసురః ॥
తతస్తయోర్మహానాసీత్సమరో దారుణోఽద్భుతః ।
నానాస్త్ర శస్త్ర సంపాతైర్వీరారావం ప్రకుర్వతోః ॥
గజాసురోఽతితేజస్వీ మహాబలపరాక్రమః ।
వివ్యాధ గిరిశం బాణైస్తీక్ ష్ణైర్దానవఘాతినమ్ ॥
అథ రుద్రో రౌద్రతనుస్స్వశరైరతిదారుణైః ।
తచ్ఛరాంశ్చిచ్ఛిదే తూర్ణమ ప్రాప్తాంస్తిలశో మునే ॥
తతో గజాసురః క్రుద్ధోఽభ్య ధావత్తం మహేశ్వరమ్ ।
ఖడ్గహస్తః ప్రగర్జ్యోచ్చైర్హతోఽసీత్యద్య వై మయా ॥
తతస్త్రి శూలహేతిస్తమాయాంతం దైత్యపుంగవమ్ ।
విజ్ఞాయావధ్యమన్యేన శూలేనా జఘాన తమ్ ॥
ప్రోతస్తేన త్రిశూలేన స చ దైత్యో గజాసురః ।
ఛత్రీకృతమివాత్మానం మన్యమానో జగౌ హరమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

వారు ఇట్లు విన్నవించగా భక్తులను రక్షించుటలో తత్పరుడైన శివుడు వానిని వధిం◌ిచగోరి వెంటనే అచటకు వచ్చెను (43). భక్తవత్సలుడు, త్రిశూలమును చేతియందు ధరించినవాడు అగు శంకరుడు గర్జిస్తూ అచటకు వచ్చుటను గాంచిన ఆ గజాసురుడు కూడ గర్జించెను. (44). అపుడు వారిద్దరు వీరవచనములను పలుకుతూ అనేకశస్త్రములను ప్రయోగిస్తూ అద్భుతము, భయంకరము అగు యుద్ధమును చేసిరి (45). మహాతేజశ్శాలి, గొప్ప బలపరాక్రమములు గలవాడు అగు గజాసురుడు దానవసంహారకుడు, కైలాసవాసి అగు శివుని వాడి బాణములతో కొట్టెను (46). ఓ మహర్షీ! అపుడు భయంకరాకారుడగు రుద్రుడు మిక్కిలి దారుణమగు తన బాణములతో ఆ బాణములు తనను చేరకమునుపే వాటిని శీఘ్రముగా ముక్కలు ముక్కలుగా ఛేదించెను (47). అపుడు గజాసురుడు కోపించి కత్తిని చేతబట్టి నీవీనాడు నా చేతిలో మరణించితివి అని బిగ్గరగా గర్జిస్తూ ఆ మహేశ్వరుని మీదకు ఉరికెను (48). అపుడు త్రిశూలధారియగు శివుడు తన మీదకు వచ్చుచున్న ఆ రాక్షసవీరుని గాంచి, ఈతడు ఇతరులచే వధింపబడడని

తెలుసుకొని, వానిని శూలముతో పొడిచెను (49). త్రిశూలముచే పొడువబడిన ఆ గజాసురుడు తాను శూలముపై గొడుగు వలెనున్నట్లు భావించి శివుని మహిమను గానము చేసెను (50).

గజాసుర ఉవాచ ।

దేవదేవ మహాదేవ తవ భక్తోఽస్మి సర్వథా ।
జానే త్వాం త్రిదేవేశానం త్రిశూలిన్ స్మరహారిణమ్ ॥
తవ హస్తే మమ వధో మహా శ్రేయస్కరో యతః ।
అంధకారే మహేశాన త్రిపురాంతక సర్వగ ॥
కించిద్విజ్ఞప్తుమిచ్ఛామి తచ్ఛృణుష్వ కృపాకర ।
సత్యం బ్రవీమి నాసత్యం మృత్యుంజయ విచారయ ॥
త్వమేకో జగతాం వంద్యో విశ్వస్యోపరి సంస్థితః ।
కాలేన సర్వైర్మర్తవ్యం శ్రేయ సే మృత్యురీదృశః ॥

గజాసురుడు ఇట్లు పలికెను-

ఓ దేవదేవ ! మహాదేవా! నేను అన్ని విధములుగా నీ భక్తుడను. ఓ త్రిశూలధారీ ! త్రిమూర్తులకు శాసకుడు, మన్మథసంహారి అగు నిన్ను నేను ఎరుంగుదును (51). ఓ అంధకాసురసంహారా ! మహేశ్వరా! త్రిపురనాశకరా! సర్వవ్యాపీ! నీ చేతిలో మృత్యువు గొప్ప శ్రేయస్సును కలిగించును (52). ఓ దయానిధీ ! నేను ఒక చిన్న విన్నపమును చేసెదను. దానిని వినుము. ఓ మృత్యుంజయా ! నేను సత్యమును పలుకుచున్నాను. అసత్యమును పలుకను. నీవే ఆలోచించుము (53). సర్వలోకములకు వందనీయుడవు నీవే. నీవు జగత్తునకు అతీతుడవై ఉన్నావు. ఏదో ఒక సమయములో అందరు మరణించవలసిన వారే. కాని ఇట్టి మృత్యువు మోక్షహేతువు అగును (54).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య శంకరః కరుణానిధిః ।
ప్రహస్య ప్రత్యువాచేశో మాహిషేయం గజాసురమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

కరుణాసముద్రుడు, పాలకుడు అగు శంకరుడు మహిషాసురపుత్రుడగు గజాసురుని ఈ మాటలను విని నవ్వి ఇట్లు బదులిడెను (55).

ఈశ్వర ఉవాచ ।

మహాపరాక్రమనిధే దానవోత్తమ సన్మతే ।
గజాసుర ప్రసన్నోఽస్మి స్వానుకూలం వరం వృణు ॥

ఈశ్వరుడు ఇట్లు పలికెను-

ఓ దానవశ్రేష్ఠా ! నీవు గొప్ప పరాక్రమనిధివి. నీవు సద్బుద్ధి గలవాడవు. ఓ గజాసురా! నేను ప్రసన్నుడనైతిని. నీకు నచ్చిన వరమును కోరుకొనుము (56).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య మహేశస్య వచనం వరదస్య హి ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా దానవేంద్రో గజాసురః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

వరములనిచ్చే మహేశ్వరుని ఈ మాటలను విని దానవశ్రేష్ఠుడగు గజాసురుడు ప్రసన్నమైన మనస్సు గలవాడై ఇట్లు బదులిడెను (57).

గజాసుర ఉవాచ ।

యది ప్రసన్నో దిగ్వాసస్తదా నిత్యం వసాన మే ।
ఇమాం కృత్తిం మహేశాన త్వత్త్రిశూలాగ్నిపావితామ్ ॥
స్వప్రమాణాం సుఖస్పర్శాం రణాంగణపణీకృతామ్ ।
దర్శనీయాం మహాదివ్యాం సర్వదైవ సుఖావహామ్ ॥
ఇష్టగంధిస్సదైవాస్తు సదైవాస్త్వతికోమలా ।
సదైవ నిర్మలా చాస్తు సదైవాస్త్వతిమండనమ్ ॥
మహాతపోనలజ్వాలాం ప్రాప్యాపి సుచిరం విభో ।
న దగ్ధా కృత్తిరేషా మే పుణ్య గంధనిధిస్తతః ॥
యది పుణ్యవతీ నైషా మమ కృత్తిర్దిగంబర ।
తదా త్వదంగసంగోఽస్యాః కథం జాతో రణాంగణే ॥
అన్యం చ మే వరం దేహి యది తుష్టోఽసి శంకర ।
నామాస్తు కృత్తివాసాస్తే ప్రారభ్యాద్యతనం దినమ్ ॥

ఓ దిగంబరా ! మహేశ్వరా ! నీవు ప్రసన్నుడవైనచో, నీ త్రిశూలము యొక్క అగ్నిచే పావనమైన ఈ నా శరీరచర్మమును నిత్యము ధరించుము (58). ఇది నీ శరీరపరిమాణమునకు తగినట్లున్నది. యుద్ధభూమిలో పణముగా పెట్టబడిన ఈ సుందరమగు చర్మము సుఖమగు స్పర్శ గలది. మహాదివ్యమగు ఈ చర్మము సర్వకాలములయందు సుఖమును ఈయగలదు (59). ఇది సర్వదా అభీష్టమగు గంధమును కలిగియుండుగాక! ఇది సర్వదా మిక్కిలి కోమలముగా నుండుగాక! ఇది సర్వదా నిర్మలముగానుండి నీకు సర్వకాలములలో అలంకారమగుగాక ! (60)

ఓ విభూ! ఈ నా చర్మము గొప్ప తపస్సునుండి పుట్టిన అగ్నిజ్వాలలో చిరకాలము ఉండియూ దగ్ధము కాలేదు. కావున ఇది పుణ్య గంధముయొక్క నిధి (61). ఓ దిగంబరా! ఈ నా చర్మము పుణ్యము కలది కానిచో, దీనికి యుద్ధభూమిలో నీ శరీరముతోడి సంపర్కము ఎట్లు కలిగినది ? (62) ఓ శంకరా ! నీవు సంతోషించినచో, నాకు మరియొక వరమునిమ్ము. ఈ నాటినుండియూ నీకు కృత్తివాససుడు అను పేరు కలుగుగాక ! (63)

సనత్కుమార ఉవాచ ।

శ్రుత్వేతి స వచస్తస్య శంకరో భక్తవత్సలః ।
తథేత్యువాచ సుప్రీతో మహిషాసురజం చ తమ్ ॥
పునః ప్రోవాచ ప్రీతాత్మా దానవం తం గజాసురమ్ ।
భక్తప్రియో మహేశానో భక్తి నిర్మలమానసమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

భక్తవత్సలుడగు ఆ శంకరుడు మహిషాసురపుత్రుడగు వాని ఈ మాటలను విని మిక్కిలి సంతోషించి వానితో అటులనే యగుగాక ! అని పలికెను (64). భక్తప్రియుడగు మహేశ్వరుడు సంతసించిన మనస్సు గలవాడై భక్తిచే నిర్మలమైన మనస్సు గల ఆ గజాసురునితో నిట్లనెను (65).

ఈశ్వర ఉవాచ ।

ఇదం పుణ్యం శరీరం తే క్షేత్రేఽస్మిన్ముక్తిసాధనే ।
మమ లింగం భవత్వత్ర సర్వేషాం ముక్తిదాయకమ్ ॥
కృత్తివాసేశ్వరం నామ మహాపాతకనాశనమ్ ।
సర్వేషామేవ లింగానాం శిరోభూతం విముక్తిదమ్ ॥
కథయిత్వేతి దేవేశస్తత్కృతిం పరిగృహ్యా చ ।
గజాసురస్య మహతీం ప్రావృణోద్ధి దిగంబరః ॥
మహామహోత్సవో జాతస్తస్మిన్నహ్ని మునీశ్వర ।
హర్షమాపుర్జనాస్సర్వే కాశిస్థాః ప్రమథాస్తథా ॥
హరిబ్రహ్మాదయో దేవా హర్షనిర్భరమానసాః ।
తుష్టువుస్తం మహేశానం నత్వా సాంజలయస్తతః ॥

హతే తస్మిన్ దానవేశే మాహిషే హి గజాసురే ।
స్వస్థానం భేజిరే దేవా జగత్స్వాస్థ్యమవాప చ ॥
ఇత్యుక్తం చరితం శంభోర్భక్తవాత్సల్యసూచకమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం ధనధాన్య ప్రవర్ధనమ్ ॥
య ఇదం శృణుయాత్ప్రీ త్యా శ్రావయేద్వా శుచివ్రతః ।
స భుక్త్వా చ మహాసౌఖ్యం లభేతాంతే వరం సుఖమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
గజాసురవధో నామ సప్తపంచాశత్తమోఽ ధ్యాయః ॥

ఈశ్వరుడిట్లు పలికెను –

ముక్తి సాధనమగు ఈ క్షేత్రమునందు ఈ నీ పుణ్యశరీరము సర్వులకు ముక్తినిచ్చే నా లింగము అగుగాక! (66) కృత్తివాసేశ్వరుడను పేరు గల ఈ లింగము అన్ని లింగములలో శ్రేష్ఠమైనది కాగలదు. ఇది మహాపాపములను పోగొట్టి మోక్షమునీయ గలదు (67). దిగంబరుడగు ఆ దేవదేవుడు ఇట్లు పలికి ఆ గజాసురుని గొప్ప చర్మమును స్వీకరించి ధరించెను (68). ఓ మహర్షీ ! ఆ నాడు గొప్ప ఉత్సవము జరిగెను. కాశీనగరవాసులు అందరు మరియు ప్రమథులు ఆనందమును పొందిరి (69). అపుడు విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు ఆనందముతో నిండిన మనస్సులు గలవారై చేతులను జోడించి నమస్కరించి ఆ మహేశ్వరుని స్తుతించిరి(70). మహిషాసురపుత్రుడు, రాక్షసశ్రేష్ఠుడునగు ఆ గజాసురుడు సంహరింపబడిన తరువాత దేవతలు తమ స్థానములకు చేరుకొనిరి. జగత్తు స్వస్థతను పొందెను (71). శంభుని భక్తవాత్సల్యమును సూచించునది, స్వర్గమును యశస్సును ఆయుర్దాయమును ఇచ్చునది, ధనధాన్యములను వర్ధిల్లజేయునది అగు ఆ చరితమును చెప్పియుంటిని (72). ఎవడైతే పవిత్రమగు వ్రతనిష్ఠ గలవాడై దీనిని వినునో, లేక వినిపించునో, అట్టి వాడు ఇచట మహాసౌఖ్యమునుభవించి, మరణించిన తరువాత మోక్షమును పొందును (73).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండలో గజాసుర వధ అనే ఏబది ఏడవ అధ్యాయము ముగిసినది (57).

58 - దుందుభి నిర్హ్రాదుని సంహారము

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస ప్రవక్ష్యామి చరితం శశిమౌలినః ।
యథా దుందుభినిర్హ్రా దమవధీద్దితిజం హరః ॥
హిరణ్యాక్షే హతే దైత్యే దితిపుత్రే మహాబలే ।
విష్ణు దేవేన కాలేన పాప దుఃఖం మహద్దితిః ॥
దైత్యో దుందుభినిర్హ్రాదో దుష్టః ప్రహ్లాదమాతులః ।
సాంత్వయామాస తాం వాగ్భిర్దుఃఖితాం దేవదుఃఖదః ॥
అథ దైత్యస్స మాయావీ దితిమాశ్వాస్య దైత్యరాట్ ।
దేవాః కథం సుజేయాస్స్యు రిత్యు పాయమచింతయత్ ॥
దేవైశ్చ ఘాతితో వీరో హిరణ్యాక్షో మహాసురః ।
విష్ణునా చ సహ భ్రాత్రా సచ్ఛలైర్దైత్యవైరిభిః ॥
కింబలాశ్చ కిమాహారా కిమాధారా హి నిర్జరాః ।
మయా కథం ను జేయాస్స్యురిత్యుపాయమ చింతయత్ ॥
విచార్య బహుశో దైత్యస్తత్త్వం విజ్ఞాయ నిశ్చితమ్ ।
అవశ్యమగ్రజన్మానో హేతవోఽ త్ర విచారతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను-

ఓ వ్యాసా! చంద్రశేఖరుడగు హరుడు దుందుభినిర్హ్రాదుడనే రాక్షసుని సంహరించిన వృత్తాంతమును చెప్పెదను, వినుము (1). దితిపుత్రుడు, మహాబలశాలి అగు హిరణ్యాక్షుని విష్ణుదేవుడు సంహరించిన తరువాత దితి చాలకాలమువరకు మహాదుఃఖమును పొంది యుండెను (2). ప్రహ్లాదుని మేనమామ, దుష్టుడు, దేవతలకు దుఃఖమును కలిగించువాడు అగు దుందుభినిర్హ్రాదుడనే రాక్షసుడు ఆమెను మంచిమాటలతో ఓదార్చెను (3). మాయావి యగు ఆ రాక్షసేశ్వరుడు దితిని ఓదార్చిన తరువాత దేవతలను జయించే ఉపాయమును గూర్చి ఆలోచించెను (4). వీరుడు, మహారాక్షసుడు అగు హిరణ్యాక్షుని రాక్షసశత్రువులగు దేవతలు ఇంద్రుని, ఉపేంద్రుని ముందిడుకొని మోసముతో సంహరించిరి (5). దేవతల బలమేది? వారి ఆహారమేది? వారి ఆధారమేది? వారిని నేను తేలికగా జయించు ఉపాయమేది? అని ఆతడు ఆలోచించెను (6). ఆ రాక్షసుడు పరిపరివిధముల ఆలోచించి దీనికి బ్రాహ్మణులు మాత్రమే కారణమని నిశ్చయించెను (7).

బ్రాహ్మణాన్ హంతు మసకృదన్వధావత వై తతః ।
దైత్యో దుందుభినిర్హ్రాదో దేవవైరీ మహాఖలః ॥
యతః క్రతుభుజో దేవాః క్రతవో వేదసంభవాః ।
తే వేదా బ్రాహ్మణాధారాస్తవ దేవబలం ద్విజాః ॥
నిశ్చితం బ్రాహ్మణాధారాస్సర్వే దేవాస్సవాసవాః ।
గీర్వాణా బ్రాహ్మణబలా నాత్ర కార్యా విచారణా ॥
బ్రాహ్మణా యది నష్టాస్స్యుర్వేదా నష్టాస్తతస్స్వయమ్ ।
అతస్తేషు ప్రణష్టేషు వినష్టాస్సతతం సురాః ॥
యజ్ఞేషు నాశం గచ్ఛత్సు హతాహారాస్తతస్సురాః ।
నిర్బలాస్సుఖజయ్యాస్స్యుర్నిర్జితేషు సురేష్వథ ॥
అహమేవ భవిష్యామి మాన్యస్త్రి జగతీపతిః ।
ఆహరిష్యామి దేవానామక్షయాస్సర్వసంపదః ॥
నిర్వేక్ష్యామి సుఖాన్యేవ రాజ్యే నిహతకంటకే ।
ఇతి నిశ్చిత్య దుర్బుద్ధిః పునశ్చింతితవాన్ ఖలః ॥

తరువాత దేవశత్రువు, పరమ దుర్మార్గుడు అగు దుందుభినిర్హ్రాదాసురుడు బ్రాహ్మణులను సంహరించుటకై పలుమార్లు వారి వెనుక పడెను (8). యజ్ఞములలో ఈయబడిన హవిస్సును దేవతలు భుజింతురు. యజ్ఞములకు వేదములు ఆధారము. ఆ వేదములు బ్రాహ్మణులపై ఆధారపడియున్నవి. కావున, దేవతల బలము బ్రాహ్మణాధీనమై యున్నది (9). ఇంద్రాది దేవతలందరు నిశ్చయముగా బ్రాహ్మణులపై మాత్రమే ఆధారపడియున్నారు. వారి బలము బ్రాహ్మణులే. దీనిలో సందేహము లేదు (10). బ్రాహ్మణులు నశించినచో, వేదములు వాటంతట అవి నశించును. ఆ వేదములు నశించినచో, దేవతలు నిశ్చయముగా నశించెదరు (11). యజ్ఞములు నశించినచో, తరువాత దేవతలకు తిండి లేక నిర్బలులగుదురు. అపుడు వారిని తేలికగా జయించవచ్చును. దేవతలను జయించిన తరువాత (12), ముల్లోకములకు నేనే అధిపతినై మన్ననలను పొందగలను. అప్పుడు నేను దేవతల అక్షయసంపదలనన్నిటినీ లాగుకొనేదను (13). అపుడు నిష్కంటకముగా రాజ్యమునేలుతూ దుఃఖసంపర్కము లేని సుఖములను అనుభవించెదను. ఆ దుర్మార్గుడు ఇట్లు నిశ్చయించుకొని, మరల ఇట్లు తలపోసెను (14).

ద్విజాః క్వ సంతి భూయాంసో బ్రహ్మతేజోతిబృంహితాః ।
శ్రుత్యధ్యయనసంపన్నాస్తపో బలసమన్వితాః ॥
భూయసాం బ్రాహ్మణానాం తు స్థానం వారాణసీ ఖలు ।
తామాదావుపసంహృత్య యాయాం తీర్థాంతరం తతః ॥
యత్ర యత్ర హి తీర్థేషు యత్ర యత్రా శ్రమేషు చ ।
సంతి సర్వేఽగ్రజన్మానస్తే మయాద్యాస్సమంతతః ॥
ఇతి దుందుభినిర్హ్రాదో మతిం కృత్వా కులోచితామ్ ।
ప్రాప్యాపి కాశీం దుర్వృత్తో మాయావీ వ్యవధీద్విజాన్ ॥
సమిత్కుశాన్ సమాదాతుం యత్ర యాంతి ద్విజోత్తమాః ।
అరణ్యే తత్ర తాన్ సర్వాన్ స భక్షయతి దుర్మతిః ॥
యథా కో ఽపి న వేత్త్యేవం తథా ఽఽచ్ఛన్నోఽభవత్పునః ।
వనే వనేచరో భూత్వా యాదోరూపో జలాశయే ॥
అదృశ్యరూపీ మాయావీ దేవానామప్య గోచరః ।
దివా ధ్యానపరోఽస్తేన్ము నివన్ముని మధ్యగః ॥
ప్రవేశముటజానాం చ నిర్గమం హి విలోకయన్ ।
యామిన్యాం వ్యాఘ్రరూపేణాభక్షయ ద్బ్రాహ్మణాన్ బహూన్ ॥
నిశ్శంకం భక్షయత్యేవం న త్యజత్యపి కీకశమ్ ।
ఇత్థం నిపాతితాస్తేన విప్రా దుష్టేన భూరిశః ॥

అతిశయించిన బ్రహ్మతేజస్సుతో వర్ధిల్లువారు, వేదాధ్యయనసంపన్నులు, తపోబలముతో గూడిన వారు అగు బ్రాహ్మణులు అధికసంఖ్యలో ఎక్కడ ఉన్నారు? (15) బ్రాహ్మణులు అధిక సంఖ్యలో నివసించు నగరము వారాణసి గదా! దానిని ముందుగా వినాశము చేసి తరువాత మరియొక తీర్థమునకు వెళ్లగలను (16). ఏయే తీర్థములలో, ఏయే ఆశ్రమములలో బ్రాహ్మణులు గలరో వారినందరినీ నేను భక్షించవలెను (17). ఈ విధముగా దుష్టాచారుడు, మాయావి అగు దుందుభినిర్హ్రాదుడు తన వంశమునకు దగిన నిశ్చయమును చేసుకొని, కాశీ నగరమును చేరు కొని, బ్రాహ్మణులను సంహరించెను (18). బ్రాహ్మణులు ఏ కాలములో సమిధలను, దర్భలను తెచ్చుకొనుటకై అరణ్యమునకు వెళ్లెదరో, ఆ సమయములో ఆ దుర్మార్గుడు వారినందరినీ భక్షించెడివాడు (19). తరువాత ఆతడు ఇతరులకు కంటబడకుండగా దాగియుండెడివాడు. అడవిలో వనచరుని రూపములో, మరియు జలములలో జలజంతువు రూపములో నుండెడివాడు (20). ఆమాయావి యొక్క మాయారూపము దేవతలకైననూ గుర్తుపట్ట శక్యము కాదు. ఆతడు పగటి సమయములో మునివేషములో మునుల మధ్యలో ధ్యానమగ్నుడై యుండెడివాడు. (21). బ్రాహ్మణులు కుటీరములలోనికి వచ్చుటను, పోవుటను గమనించి రాత్రియందు ఆతడు పెద్దపులి రూపములో అనేకమంది బ్రాహ్మణులను భక్షించెను (22). ఆతడీ తీరున ఏ విధమైన శంక లేకుండగా ఎముకలను విడువకుండగా భక్షించెడివాడు. ఈ విధముగా ఆ దుష్టుడు పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులను సంహరించెను (23).

ఏకదా శివరాత్రౌ తు భక్తస్త్వేకో నిజోటజే ।
సపర్యాం దేవదేవస్య కృత్వా ధ్యానస్థితోఽభవత్ ॥
స చ దుందుభినిర్హ్రాదో దైత్యేంద్రో బలదర్పితః ।
వ్యాఘ్రరూపం సమాస్థాయ తమాదాతుం మతిం దధే ॥
తం భక్తం ధ్యానమాపన్నం దృఢచిత్తం శివేక్షణే ।
కృతాస్త్ర మంత్రవిన్యాసం తం క్రాంతుమశకన్న సః ॥
అథ సర్వగతశ్శంభుర్ జ్ఞాత్వా తస్యాశయం హరః ।
దైత్యస్య దుష్టరూపస్య వధాయ విదధే ధియమ్ ॥
యావదాదిత్సతి వ్యాఘ్రస్తావదావిరభూద్ధరః ।
జగద్రక్షామణిస్త్ర్యక్షో భక్తరక్షణదక్షధీః ॥
రుద్రమాయాంతమాలోక్య తద్భక్తార్చితలింగతః ।
దైత్యస్తేనైవ రూపేణ వవృధే భూధరోపమః ॥
సావజ్ఞమథ సర్వజ్ఞం యావత్పశ్యతి దానవః ।
తావదాయాతమాదాయ కక్షాయంత్రే న్యపీడయత్ ॥
పంచాస్యస్త్వథ పంచాస్యం ముష్ట్యా మూర్ధన్యతాడయత్ ।
భక్తవత్సలనామాసా వజ్రాదపి కఠోరయా ॥
స తేన ముష్టిఘాతేన కక్షానిష్పేషణేన చ ।
అత్యార్తమారటద్వ్యాఘ్రో రోదసీం పూరయన్మృతః ॥
తేన నాదేన మహతా సంప్రవేపితమానసాః ।
తపోధనాస్సమాజగ్ముర్నిశి శబ్దానుసారతః ॥
అత్రేశ్వరం సమాలోక్య కక్షీకృతమృగేశ్వరమ్ ।
తుష్టువుః ప్రణతాస్సర్వే శర్వం జయజయాక్షరైః ॥

ఒక శివరాత్రినాడు ఒక భక్తుడు తన కుటీరములో దేవదేవుడగు శివుని అర్చించి ధ్యానమునందు మగ్నుడయ్యెను (24). బలముచే గర్వించియున్న దుందుభినిలాదుడనే ఆ రాక్షసవీరుడు వ్యాఘ్రరూపమును దాల్చి వానిని భక్షించుటకు నిశ్చయించుకొనెను (25). అస్త్ర మంత్రమును న్యాసము చేసి ఏకాగ్రచిత్తముతో శివుని ధ్యానించుచున్న ఆ భక్తునిపై దాడి చేయుటకు వానికి సామర్థ్యము లేకపోయెను (26). అపుడు సర్వవ్యాపకుడు, పాపహారియగు శంభుడు వాని అభిప్రాయమునెరింగి క్రూరమృగరూపములోనున్న ఆ రాక్షసుని వధించవలెనని నిర్ణయించెను (27). జగత్తును రక్షించే చింతామణి, ముక్కంటి, భక్తుని రక్షించే సామర్థ్యముతో నిండిన బుద్ధిగలవాడు అగు హరుడు ఆ భక్తుని రాక్షసుడు లాగబోవుచుండగా ప్రత్యక్షమయ్యెను (28). ఆ భక్తుడు అర్చించిన లింగమునుండి రుద్రుడు ఆవిర్భవించుటను గాంచి ఆ రాక్షసుడు అదే రూపములో పర్వతాకారముగా పెరిగెను (29). ఆ రాక్షసుడు సర్వజ్ఞుడగు శివుని తిరస్కా

రదృష్టితో చూచుచుండగనే, వానిని ఆయన పట్టుకొని తన భుజబంధములో నొక్కి పెట్టెను (30). భక్తవత్సలుడని పేరు గాంచిన ఆ అయిదు మోముల దైవము వజ్రముకంటె అధిక ఘోరమగు పిడికిలితో ఆ పులిని తలపై కొట్టెను (31). ఆ విధముగా బాహువుతో నొక్కి పెట్టి పిడికిలితో కొట్టగానే ఆ పెద్దపులి భయంకరమగు ఆర్తనాదముతో దిక్కులను పూరించుచూ మరణించెను (32). ఆ నాదమును విని భయముతో కంపించిన మనస్సులు గల తపశ్శాలురగు ఋషులు ఆ చీకటిలో శబ్దముననుసరించి అచటకు విచ్చేసిరి (33). అచట వారు అందరు తన భుజబంధములో పెద్దపులిని నొక్కి పెట్టియున్న జగత్సంహారకుడగు ఈశ్వరుని గాంచి ప్రణమిల్లి జయజయధ్వానములతో స్తుతించిరి (34).

బ్రాహ్మణా ఊచుః ।

పరిత్రాతాః పరిత్రాతాః ప్రత్యూహోద్దారుణాదితః ।
అనుగ్రహం కురుష్వేశ తిష్ఠాత్రైవ జగద్గురో ॥
అనేనైవ స్వరూపేణ వ్యాఘ్రేశ ఇతి నామతః ।
కురు రక్షాం మహాదేవ క్షేత్రస్థానస్య సర్వదా ॥
అన్యే భ్యో హ్యుపసర్గేభ్యో రక్ష నస్తీర్థవాసినః ।
దుష్టానపాస్య గౌరీశ భక్తే భ్యో దేహి చాభయమ్ ॥

బ్రాహ్మణులిట్లు పలికిరి-

ఈ భయంకరమగు విఘ్నమునుండి మేము రక్షింపబడితిమి. రక్షింపడితిమి. ఓ ఈశా! జగద్గురూ ! నీవు అనుగ్రహము గలవాడవై ఇచటనే నిలచి యుండుము (35). ఓ మహాదేవా ! నీవు ఇదే రూపములో ఇచట వ్యా ఘేశ్వరుడు అను పేర నిత్యము ఉండి ఈ స్థానమును పవిత్రము చేయుము (36). ఓ గౌరీపతీ! నీవు నీ భక్తులకు అభయమునిచ్చి దుష్టులను శిక్షించి పుణ్యక్షేత్రవాసులమగు మమ్ములను ఇతర విఘ్నములనుండి కూడ రక్షించుము (37).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం భక్తానాం చంద్రశేఖరః ।
తథేత్యుక్త్వా పునః ప్రాహ స భక్తాన్ భక్తవత్సలః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

భక్తవత్సలుడగు ఆ చంద్రశేఖరుడు ఆ భక్తుల ఈ మాటలను విని అటులనే యని పలికి వారితో మరల నిట్లనెను (38).

మహేశ్వర ఉవాచ ।

యో మామనేన రూపేణ ద్రక్ష్యతి శ్రద్ధయాత్ర వై ।
తస్యోపసర్గసంధానం పాతయిష్యామ్య సంశయమ్ ॥
మచ్చరిత్రమిదం శ్రుత్వా స్మృత్వా లింగమిదం హృది ।
సంగ్రామే ప్రవిశన్మర్త్యో జయమాప్నోత్య సంశయమ్ ॥
ఏతస్మిన్నంతరే దేవాస్సమాజగ్ము స్సవాసవాః ।
జయేతి శబ్దం కుర్వంతో మహోత్సవపురస్సరమ్ ॥
ప్రణమ్య శంకరం ప్రేమ్ణా సర్వే సాంజలయస్సురాః ।
నతస్కంధాస్సువాగ్భిస్తే తుష్టువుర్భక్త వత్సలమ్ ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

ఎవడైతే నన్ను ఈ రూపములో ఇచట శ్రద్ధతో దర్శించునో, వానికి ఉపద్రవములతో గల సంసర్గమును నేను నిశ్చయముగా తొలగించగలను (39). నా ఈ చరితమును విని ఈ లింగమును హృదయములో స్మరించి యుద్ధములో ప్రవేశించు వ్యక్తి నిస్సంశయముగా విజయమును పొందును (40). ఇంతలో ఇంద్రాది దేవతలు పెద్ద ఉత్సాహముతో జయ శబ్దమును చేయుచూ వచ్చిరి (41). ఆ దేవతలు భక్తవత్సలుడగు శంకరునకు ప్రేమతో చేతులను జోడించి తలలను వంచి నమస్కరించి చక్కని వచనములతో స్తుతించిరి (42).

దేవా ఊచుః ।

జయ శంకర దేవేశ ప్రణతార్తిహర ప్రభో ।
ఏతద్దుందుభినిర్హ్రాదవధాత్త్రాతా వయం సురాః ॥
సదా రక్షా ప్రకర్తవ్యా భక్తానాం భక్తవత్సల ।
వధ్యాః ఖలాశ్చ దేవేశ త్వయా సర్వేశ్వర ప్రభో ॥
ఇత్యాకర్ణ్య వచస్తేషాం సురాణాం పరమేశ్వరః ।
తథేత్యుక్త్వా ప్రసన్నాత్మా తస్మింల్లింగే లయం యయౌ ॥
సవిస్మయాస్తతో దేవాస్స్వం స్వం ధామ యయుర్ముదా ।
తేఽపి విప్రా మహాహర్షాత్పునర్యాతా యథాగతమ్ ॥
ఇదం చరిత్రం పరమం వ్యాఘ్రేశ్వర సముద్భవమ్ ।
శృణుయాచ్ఛ్రావయేద్వాపి పఠేద్వా పాఠయేత్తథా ॥
సర్వాన్ కామానవాప్నోతి నరస్స్వమన సేప్సితాన్ ।
పరత్ర లభతే మోక్షం సర్వదుఃఖ వివర్జితః ॥

ఇదమాఖ్యానమతులం శివలీలామృతాక్షరమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం పుత్రపౌత్ర ప్రవర్ధనమ్ ॥
వరం భక్తి ప్రదం ధన్యం శివ ప్రీతికరం శివమ్ ।
పరమజ్ఞానదం రమ్యం వికారహరణం పరమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే
దుందుభినిర్హ్రాద వధవర్ణనం నామ అష్టపంచాశత్తమోఽధ్యాయః ॥

దేవతలు ఇట్లు పలికిరి -

ఓ శంకరా! దేవదేవా! నమస్కరించిన వారి కష్టములను బాపువాడా! ప్రభూ! నీకు ఁ జయమగుగాక! నీవీ దుందుభినిర్హ్రాదుని సంహరించి దేవతలమగు మమ్ములను రక్షించితివి (43). ఓ భక్తవత్సలా! దేవదేవా! సర్వేశ్వరా ! ప్రభూ! నీవు సర్వదా దుష్టులను వధించి భక్తులను రక్షించదగును (44). పరమేశ్వరుడు ఆ దేవతల ఈ మాటలను విని ప్రసన్నమగు మనస్సు గలవాడై అటులనే యని పలికి ఆ లింగమునందు విలీనమాయెను (45). అపుడు దేవతలు ఆశ్చర్యమును పొంది ఆనందముతో తమ తమ ధామములకు వెళ్లిరి. ఆ బ్రాహ్మణులు కూడ మహానందముతో వచ్చిన దారిని మరలి వెళ్లిరి (46). వ్యాఘ్రేశ్వరుని ఉద్భవమును వర్ణించే ఈ శ్రేష్ఠమగు వృత్తాంతమును ఎవరైతే వినెదరో, వినిపించెదరో, పఠించెదరో, లేదా పఠింపజేయుదురో (47), అట్టివారు మనస్సులో తలచిన కోర్కెలన్నియు ఈడేరుటయే గాక, వారు దేహత్యాగానంతరము సర్వదుఃఖవినిర్ముక్తమైన మోక్షమును పొందెదరు (48). శివలీలను అమృతాక్షరములలో వర్ణించే ఈ సాటి లేని గాథ స్వర్గమును, యశస్సును, ఆయుర్దాయమును ఇచ్చి, పుత్రపౌత్రాభివృద్ధిని కలిగించును (49). ఈ గాథ పరమ భక్తిని ఇచ్చి మంగళములను కలిగించును. ధన్యము, శివునికి ప్రీతిని కలిగించునది, పరమజ్ఞానము నిచ్చునది, సుందరమైనది అగు ఈ శ్రేష్ఠగాథ వికారములను పోగొట్టును (50).

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందు యుద్ధఖండలో దుందుభినిర్హ్రాద వధవర్ణనమనే ఏబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (58).

59 - విదలోత్పలదైత్యవధ

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస సుసంప్రీత్యా చరితం పరమేశితుః ।
యథావధీత్స్వప్రియయా దైత్యముద్దిశ్య సంజ్ఞయా ॥
ఆస్తాం పురా మహాదైత్యౌ విదలోత్పలసంజ్ఞకౌ ।
అపుంవధ్యౌ మహావీరౌ సదృప్తౌ వరతో విధేః ॥
తృణీకృత త్రిజగతీ పురుషాభ్యాం స్వదోర్బలాత్ ।
తాభ్యాం సర్వే సురా బ్రహ్మన్ దైత్యాభ్యాం నిర్జితా రణే ॥
తాభ్యాం పరాజితా దేవా విధేస్తే శరణం గతాః ।
నత్వా తే విధివత్సర్వే కథయామాసురాదరాత్ ॥
ఇతి బ్రహ్మా హ్యవోచత్తాన్ దేవ్యా వధ్యౌ చ తౌ ధ్రువమ్ ।
ధైర్యం కురుత సంస్మృత్య సశివం శివమాదరాత్ ॥
భక్తవత్సలనామాసౌ సశివశ్శంకరశ్శివః ।
శం కరిష్యత్య దీర్ఘేణ కాలేన పరమేశ్వరః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

ఓ వ్యాసా! పరమేశ్వరుడు ఒక రాక్షసుని పేరుతో సూచించి తన ప్రియురాలిచే సంహరింపజేసిన వృత్తాంతమును మిక్కిలి ప్రీతితో వినుము (1). పూర్వము విదలుడు, ఉత్పలుడు అను పేరు గల మహావీరులగు ఇద్దరు గొప్ప రాక్షసులు ఉండెడివారు. వారు బ్రహ్మనుండి పురుషునిచే వధ లేని విధముగా వరమును పొంది మిక్కిలి గర్వించియుండిరి (2). ఓ మహర్షీ ! జగత్తును గడ్డిపోచవలె చూచే ఆ రాక్షసులు ఇద్దరు తమ భుజబలముచే యుద్ధములో దేవతలనందరినీ జయించిరి (3). వారి చేతిలో పరాజయమును పొందిన దేవతలు అందరు బ్రహ్మను శరణు జొచ్చి యథావిధిగా నమస్కరించి శ్రద్ధతో విన్నవించుకొనిరి (4). అపుడు బ్రహ్మ వారితో ఇట్లు చెప్పెను : వారు దేవిచే నిశ్చయముగా సంహరింపబడెదరు. మీరు పార్వతీపరమేశ్వరులను భక్తితో స్మరించి ధైర్యమును అవలంబించుడు (5). భక్తవత్సలుడను పేరు గలవాడు, పార్వతీసమేతుడు, మంగళకరుడు, మంగళ స్వరూపుడు అగు పరమేశ్వరుడు అల్పకాలములోననే శుభమును చేయగలడు (6).

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్త్వా తాంస్తతో బ్రహ్మా తూష్ణీ మాసిచ్ఛివం స్మరన్ ।
తేఽపి దేవా ముదం ప్రాప్య స్వం స్వం ధామ యయుస్తదా ॥
అథ నారదదేవర్షిశ్శివ ప్రేరణయా తదా ।
గత్వా తదీయభవనం శివాసౌందర్యమాజగౌ ॥
శ్రుత్వా తద్వచనం దైత్యావాస్తాం మాయావిమోహితౌ ।
దేవీం పరిజిహీర్షంతౌ విషమేషు ప్రపీడితౌ ॥
విచారయామాసతుస్తౌ కదా కుత్ర శివా చ సా ।
భవిష్యతి విధేః ప్రాప్తోదయాన్నావితి సర్వదా ॥
ఏకస్మిన్ సమయే శంభుర్విజహార సులీలయా ।
కౌతుకేనైవ చిక్రీడే శివా కందుకలీలయా ॥
సఖీభిస్సహ సుప్రీత్యా కౌతుకాచ్ఛివసన్నిధౌ ॥
ఉదంచంత్యంచదంగానాం లాఘవం పరతన్వతీ ।
నిశ్శ్వాసామోదముదిత భ్రమరాకులితేక్షణా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

బ్రహ్మ వారితో నిట్లు పలికి శివుని స్మరించి మిన్నకుండెను. అపుడు ఆ దేవతలు కూడ ఆనందమును పొంది తమ తమ ధామములకు వెళ్లిరి (7). అపుడు దేవర్షియగు నారదుడు శివుని ప్రేరణచే వారి భవనమునకు వెళ్లి పార్వతియొక్క సౌందర్యమును వర్ణించెను (8). ఆయన మాటలను వినిన ఆ రాక్షసులు మాయచే మోహితులై కామబాణములచే పీడితులై ఆ దేవిని అపహరించగోరిరి (9). పార్వతి ఎప్పుడు ఎక్కడ లభించునో ! మన భాగ్యము ఎపుడు ఉదయించునో ! అని వారిద్దరు సర్వదా చింతించుచుండిరి (10). ఒకనాడు శివుడు లీలచే విహరించుచుండెను. పార్వతి ఉత్సాహముతో సఖురాండ్రతో గూడి శివుని సన్నిధిలో బంతి ఆటను లీలగా ఆడుచుండెను. (11, 12). ఆమె పైకి చూచుచూ శరీరావయవములలోని లాఘవమును ప్రదర్శించుచూ, నిశ్శ్వాససుగంధముచే ఆకర్షితములైన భ్రమరములు కన్నులకు ఇబ్బందిని కలిగించుచుండగా క్రీడించెను (13).

భ్రశ్యద్ధమ్మిల్లసన్మాల్యస్వ పురీకృత భూమికా ।
స్విద్యత్కపోలపత్రాలీస్రవదంబుకణోజ్జ్వలా ॥
స్ఫుటచ్చోలాంశుకపథతిర్యదంగ ప్రభావృతా ।
ఉల్లసత్కందుకాస్ఫాలాతిశ్రోణితకరాంబుజా ॥
కందుకానుగసద్దృష్టినర్తిత భ్రూలతాంచలా ।
మృడానీ కిల ఖేలంతీ దదృశే జగదంబికా ॥
అంతరిక్షచరా భ్యాం చ దితిజాభ్యాం కటాక్షితా ।
క్రోడీకృతాభ్యామివ వై సముపస్థితమృత్యునా ॥
దివ ఉత్తేరతుః క్షిప్రం మాయాం స్వీకృత్య శాంబరీమ్ ॥
ధృత్వా పారిషదీం మాయామాయాతావంబి కాంతికమ్ ।
తావత్యంతం సుదుర్వృత్తావతిచంచలమానసౌ ॥
అథ దుష్టనిహంత్రా వై సావజ్ఞేన హరేణ తౌ ।
విజ్ఞాతౌ చ క్షణాదాస్తాం చాంచల్యాల్లో చనోద్భవాత్ ॥

ఆమె కేశములనుండి జారిన పుష్పములు ఆమె యెదుటనే నేలపై బడుచుండెను. చెమట బిందువులు ఆమె చెక్కిళ్ల మీదనున్న అలంకారరేఖలను చెరపివేసి క్రిందకు జారినవి (14). రవికె యొక్క ఆచ్ఛాదన లేని భాగములనుండి ఆమె దేహకాంతులు సర్వత్ర వ్యాపించుచుండెను. బంతిని కొట్టుటలో పద్మమువంటి ఆమె హస్తము మరింత రక్తవర్ణమును పొందెను (15). ఆమె చూపు బంతితో బాటు తిరుగుచుండగా లతలవంటి కనుబొమలు నాట్యమును చేయుచుండెను. ఈ విధముగా క్రీడలోనున్న ఆ జగన్మాతయగు భవానిని (16) అంతరిక్షములో సంచరించుచున్న ఆ రాక్షసులిద్దరు చూచిరి. వారిని దగ్గర పడిన మృత్యువు తన ఒడిలోనికి తీసుకొనుచున్నదా యన్నట్లు ఉండెను (17). వారు శంబరమాయా ప్రభావముచే వెంటనే ఆకాశమునుండి క్రిందకు దిగిరి (18). మిక్కిలి దురాచారులు, అతి చంచలమగు మనస్సు గలవారు అగు ఆ రాక్షసులిద్దరు శివకింకరుల వేషములో పార్వతి సమీపమునకు వచ్చిరి (19). దుష్టశిక్షకుడగు శివుడు వారి కన్నులలోని అతిశయించిన చపలత్వమునుబట్టి వారిని క్షణములో గుర్తు పట్టెను (20).

కటాక్షితాథ దేవేన దుర్గా దుర్గతిఘాతినీ ।
దైత్యావిమావితి గణౌ నేతి సర్వస్వరూపిణా ॥
అథ సా నేత్రసంజ్ఞాం స్వస్వామినస్తాం బుబోధ హ ।
మహా కౌతుకినస్తాత శంకరస్య పరేశితుః ॥
తతో విజ్ఞాయ సంజ్ఞాం తాం సర్వజ్ఞార్ధ శరీరిణీ ।
తేనైవ కందుకేనాథ యుగపన్నిర్ఘఘాన తౌ ॥
మహాబలౌ మహాదేవ్యా కందుకేన సమాహతౌ ।
పరిభ్రమ్య పరిభ్రమ్య తౌ దుష్టౌ వినిపేతతుః ॥
వృంతా దివ ఫలే పక్వే తాలేనానిలలో లితే ।
దంభోలినా పరిహతే శృంగే ఇవ మహాగిరేః ॥
తౌ నిపాత్య మహాదైత్యావ కార్య కరణోద్యతౌ ।
తతః పరిణతిం యాతో లింగరూపేణ కందుకః ॥

అపుడు సర్వస్వరూపుడగు ఆ దేవుడు వీరు రాక్షసులే గాని గణములు కాదని సాభిప్రాయముగ భక్తుల దుర్గతిని పోగొట్టే ఆ దుర్గవైపునకు చూచెను (21). ఓ వత్సా ! అపుడు మహోత్సాహము గలవాడు, పరమేశ్వరుడు, తన భర్త అగు శంకరుని ఆ కన్నుల సంజ్ఞను ఆ దేవి తెలుసుకొనెను (22). తరువాత సర్వజ్ఞురాలు, శివుని అర్ధాంగి అగు ఆ దుర్గ శివుని నేత్రసంజ్ఞను తెలుసుకొని, అదే బంతితో వారినిద్దరినీ ఒకేసారి కొట్టెను (23). మహాబలశాలురగు ఆ దుష్టులిద్దరు మహాదేవిచే బంతిచే కొట్టబడినవారై గిరగిర తిరిగి క్రింద పడిరి (24). గాలికి ఊగిన తాటి చెట్టు యొక్క తొడిమనుండి రాలిన ముగ్గిన పండ్లవలె, వజ్రముచే కొట్టబడిన పెద్ద పర్వతశిఖరములవలె (25), తప్పు పనిని చేయబూనిన ఆ మహాదైత్యులిద్దరు నేలగూల్చబడగా, ఆ బంతి లింగరూపములోనికి మారిపోయెను (26).

కందుకేశ్వరసంజ్ఞం చ తల్లింగమభవత్తదా ।
జ్యేష్ఠేశ్వరసమీపే తు సర్వదుష్టనివారణమ్ ॥
ఏతస్మిన్నేవ సమయే హరిబ్రహ్మాదయస్సురాః ।
శివావిర్భావ మాజ్ఞాయ ఋషయశ్చ సమాయయుః ॥
అథ సర్వే సురాశ్శంభోర్వరాన్ ప్రాప్య తదాజ్ఞయా ।
స్వధామాని యయుః ప్రీతాస్తథా కాశీ నివాసినః ॥
సాంబికం శంకరం దృష్ట్వా కృతాంజలిపుటాశ్చ తే ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా వాగ్భిరిష్టా భిరాదరాత్ ॥
సాంబికోఽ పి శివో వ్యాస క్రీడిత్వా సువిహారవిత్ ।
జగామ స్వాలయం ప్రీతస్సగణో భక్తవత్సలః ॥
కందుకేశ్వరలింగం చ కాశ్యాం దుష్టనిబర్హణమ్ ।
భుక్తిముక్తి ప్రదం సర్వకామదం సర్వదా సతామ్ ॥
ఇదమాఖ్యానమతులం శృణుయాద్యో ముదాన్వితః ।
శ్రావయేద్వా పఠేద్యశ్చ తస్య దుఃఖభయం కుతః ॥
ఇహ సర్వసుఖం భుక్త్వా నానావిధమనుత్తమమ్ ।
పరత్ర లభతే దివ్యాం గతిం వై దేవదుర్లభామ్ ॥

అపుడా లింగము కందుకేశ్వరమను పేరిట ప్రసిద్ధిని గాంచెను. జ్యేష్ఠేశ్వరలింగమునకు సమీపములోనున్న ఈ లింగము దోషములనన్నిటినీ పోగొట్టును (27). ఇదే సమయములో శివుడు ఆవిర్భవించిన వార్త తెలిసి విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు మరియు ఋషులు విచ్చేసిరి (28). తరువాత సర్వదేవతలు మరియు కాశీనివాసులు శంభునినుండి వరములను పొంది సంతసించి ఆయన అ తమ స్థానములకు వెళ్లిరి (29). వారు పార్వతీపరమేశ్వరులను గాంచి చేతులను జోడించి ప్రణమిల్లి శ్రద్ధాభక్తిపూర్వకముగా అభీష్టములగు వచనములతో స్తుతించిరి (30). ఓ వ్యాసా! భక్తవత్సలుడు, లీలావిహారవేత్త అగు శివుడు పార్వతీసమేతుడై విహరించి గణములతో కూడినవాడై తన ధామమునకు వెళ్లెను (31). కాశీలోని కందుకేశ్వరలింగము దుష్టులను నశింపజేసి సత్పురుషులకు సర్వకాలములలో భుక్తిని, ముక్తిని ఇచ్చి కోర్కెలనన్నిటినీ ఈడేర్చును (32). సాటి లేని ఈ ఉపాఖ్యానమును ఎవరైతే ఆనందముతో గూడి వినిపించునో, లేదా పఠించునో, వానికి దుఃఖ భయము ఎక్కడిది? (33) అట్టివాడు ఇహలోకములో నానావిధములైన సర్వోత్కృష్టములగు సకలసుఖములను అనుభవించి పరలోకములో దేవతలకైననూ దుర్లభమైన దివ్యగతిని పొందును (34).

ఇతి తే వర్ణితం తాత చరితం పరమాద్భుతమ్ ।

శివయోర్భక్త వాత్సల్య సూచకం శివదం సతామ్ ॥

ఓ వత్సా ! ఈ విధముగా పార్వతీపరమేశ్వరుల భక్తవాత్సల్యమును సూచించుచునది, సత్పురుషులకు మంగళముల నొసంగునది, పరమాద్భుతమైనది అగు వృత్తాంతమును నీకు వర్ణించి చెప్పితిని (35).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వామంత్ర్య తం వ్యాసం తన్నుతో మద్వరాత్మజః ।

యయౌ విహాయసా కాశీం చరితం శశిమౌలినః ॥

యుద్ధఖండమిదం ప్రోక్తం మయా తే మునిసత్తమ ।

రౌద్రీయ సంహితామధ్యే సర్వకామ ఫలప్రదమ్ ॥

ఇయం హి సంహితా రౌద్రీ సంపూర్ణా వర్ణితా మయా ।

సదాశివ ప్రియతరా భుక్తిముక్తి ఫలప్రదా ॥

ఇమాం యశ్చ పఠేన్నిత్యం శత్రుబాధానివారకమ్ ।

సర్వాన్ కామానవాప్నోతి తతో ముక్తిం లభేత నా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను-

నా పుత్రులలో శ్రేష్ఠుడగు సనత్కుమారుడు ఇట్లు చంద్రశేఖరుని వృత్తాంతమును వర్ణించి వ్యాసునిచే స్తుతింపబడినవాడై ఆయనవద్ద సెలవు తీసుకొని ఆకాశమార్గములో కాశీ నగరమునకు వెళ్లెను (36). ఓ మహర్షీ! రుద్రసంహితలో అంతర్భాగమైన ఈ యుద్ధఖండను నీకు చెప్పి యుంటిని. ఇది సకలకామనలను, ఫలములను ఇచ్చును (37). సదాశివునకు మిక్కిలి ప్రియమైనది, భుక్తి మరియు ముక్తి అను ఫలములను ఇచ్చునది అగు ఈ రుద్రసంహితను నేను పూర్తిగా చెప్పితిని (38). శత్రుబాధను పోగొట్టే దీనిని ఏ మానవుడైతే నిత్యము పఠించునో, వాడు కోర్కెలనన్నిటినీ అనుభవించి, దేహత్యాగానంతరము మోక్షమును పొందును (39).

సూత ఉవాచ ।

ఇతి బ్రహ్మసుతః శ్రుత్వా పిత్రా శివయశః పరమ్ ।

శతనామాపి శంభోశ్చ కృతార్థోఽ భూచ్ఛివానుగః ॥

బ్రహ్మనారదసంవాదస్సంపూర్ణః కథితో మయా ।

శివస్సర్వ ప్రధానో హి కిం భూయోశ్రోతుమిచ్ఛసి ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యుద్ధఖండే

విదలోత్పలదైత్య వధవర్ణనం నామ ఏకోనషష్టితమోఽ ధ్యాయః॥

సూతుడు ఇట్లు పలికెను-

బ్రహ్మపుత్రుడగు నారదుడు ఈ విధముగా తండ్రి చెప్పగా శివుని కీర్తిని మరియు శివుని శతనామములను విని శివభక్తుడై కృతార్థుడాయెను (40). నేను బ్రహ్మనారదసంవాదమునంతనూ చెప్పియుంటిని. శివుడు సర్వులలో ప్రధానుడు. ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? (41)

శ్రీ శివమహాపురాణములోని రుద్రసంహితయందలి యుద్ధఖండలో విదలోత్పలదైత్య వధను వర్ణించే ఏబది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (59).

యుద్ధఖండము ముగిసినది.

రుద్రసంహిత ముగిసినది.

శ్రీకృష్ణార్పణమస్తు

★★★★★